# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

హైదరాబాద్
జూలై 2014
వెల : 50/-

ప్రత్యేక సంచిక




## కొత్త ప్రభుత్వానికి ప్రజా ఎజెండా

# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాస పత్రిక

హైదరాబాద్
జులై 2014
వెల : 50/-

*గౌరవ సంపాదకులు*
**ప్రొ॥అడప సత్యనారాయణ**

*సలహా మండలి*
**అల్లం నారాయణ**
ఎడిటర్-నమస్తే తెలంగాణ
**చిక్కుడు ప్రభాకర్**
అడ్వకేట్-న్యాయ సలహాదారు

*సంపాదకుడు*
**డా॥సి.కాశీం**

సహాయ సంపాదకురాలు
**స్నేహలత ఎం.**

*సంపాదక వర్గం*
**డా॥ ఎ.సిల్మానాయక్**, అసిస్టెంట్ ప్రొఫెసర్
**క్రాంతి**, జర్నలిస్టు

*మేనేజర్*
**ఎం. బాలునాయక్**
ఫోన్ నెం.: 8008918475, 9290745490

*ముఖచిత్రం* : అన్నవరం శ్రీనివాస్

*లే అవుట్ కవర్ డిజైన్* : అంకుష్
నల్లకుంట, హైదరాబాద్. ✆ 9912929078

రచనలు, చందాలు, విరాళాలు పంపవల్సిన చిరునామా
**స్నేహలత ఎం.,**
క్వార్టర్ నెం. R-9, ఉస్మానియా క్వార్టర్స్,
ఉస్మానియా యూనివర్సిటి, హైదరాబాద్-500 007.
ఇ.మెయిల్: nadusthunnatelangana@gmail.com

**నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్: 62254225854**
ఎస్‌బిహెచ్, రాంకోఠిబ్రాంచ్(20350), హైద్రాబాద్

## సంపాదకుడి ఉత్తరం

**నడుస్తున్న తెలంగాణ** పత్రిక నాలుగు సంవత్సరాలుగా మీ అందరికీ పరిచయమే. ఒక స్పష్టమైన సైద్ధాంతిక దృక్పథంతో భావజాల రంగంలో ఈ పత్రిక కృషిచేస్తున్న సంగతి మీకు తెలిసిందే. అనేక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నా తెలంగాణ సమాజంలో రాజకీయ చైతన్యం తీసుకరావటంలో ఈ పత్రిక రాజీపడలేదు. బహుళ తెలంగాణ పేరుతో నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా నడిచిన మాసపత్రిక ఈ ఇరవై ఏళ్లలో లేదంటే అతిశయోక్తి కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా, ప్రజాస్వామిక తెలంగాణను రూపొందించుకునే బాధ్యత తెలంగాణ సమాజంపై ఉంది. కనుక ఆ దృష్టితో కొత్త ప్రభుత్వం ముందు ప్రజా ఎజెండా పెట్టాలని, దీనిని ప్రజలు సాధించుకోవటానికి ఈ వ్యాసాలు ఉపయోగపడుతాయని మా సంపాదకవర్గం భావించి ఈ ప్రత్యేక సంచికను మీ ముందుకు తెస్తున్నాం. తమ సామాజిక బాధ్యతగా అడిగిన వెంటనే వ్యాసాలు రాసిన రచయితలందరికీ కృతజ్ఞతలతో...

తెలంగాణ సమాజం ఈ సంచికను
ఆదరించాలని కోరుతున్నాం.

1.7.2014

నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదక వర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

# తెలంగాణ తొవ్వ


| | | | |
|---|---|---|---|
| ★ | సంపాదకీయం | - కాశీం | 5 |
| ★ | గెస్ట్ ఎడిటోరియల్-1 | - వరవరరావు | 8 |
| ★ | గెస్ట్ ఎడిటోరియల్-2 | - అడప సత్యనారాయణ | 16 |
| | **వ్యవసాయం** | | |
| 1. | తెలంగాణ పునర్నిర్మాణం-వ్యవసాయాభివృద్ధి | - ప్రొ॥కె.ఆర్.చౌదరి | 18 |
| 2. | తెలంగాణలో సాగునీటి రంగ అభివృద్ధి-కొత్త ప్రభుత్వ కర్తవ్యాలు | - శ్రీధర్‌రావు దేశ్‌పాండే | 24 |
| 3. | విద్యుత్ సవాళ్లు-పరిష్కారాలు | - ఎన్.శివాజీ | 37 |
| | **పరిశ్రమలు** | | |
| 4. | తెలంగాణ రాష్ట్రం-పారిశ్రామికీకరణ | - ఎం.రత్నమాల | 39 |
| 5. | తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక విధానం | - చిక్కుడు ప్రభాకర్ | 42 |
| | **విద్య** | | |
| 6. | తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల విద్య | - బి.రామకృష్ణ | 49 |
| 7. | నవజాత తెలంగాణలో అందరికీ విద్య! | - రమేష్ పట్నాయక్ | 53 |
| 8. | తెలంగాణలో ఉన్నత విద్య - పునర్నిర్మాణం | - ఎ.నర్సింహారెడ్డి | 57 |
| 9. | తెలంగాణ రాష్ట్రం : విశ్వవిద్యాలయవిద్య | - ప్రొ॥కనకదుర్గ దంటు | 62 |
| 10. | తెలంగాణ ఉద్యోగాలు-ఉద్యోగులు-ఉద్యమాలు | - దేవిప్రసాద్ | 65 |
| 11. | తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల కల నెరవేరేనా? | - సిలువేరు హరినాథ్ | 74 |
| 12. | ఉద్యోగుల స్థానికతను ఎలా నిర్ధారించాలి? | - వి.జయరాముడు | 78 |
| | **అస్తిత్వాలు** | | |
| 13. | తెలంగాణ పునర్నిర్మాణం-ఆదివాసులు | - మైపతి అరుణ్‌కుమార్ | 80 |
| 14. | తెలంగాణ దళిత్ఎజెండా | - మల్లేపల్లి లక్ష్మయ్య | 86 |
| 15. | జెండర్ సమానత దిశగా నవతెలంగాణ గమనం-ఒక అవగాహన | - ఆచార్య తోటజ్యోతిరాణి | 89 |
| 16. | తెలంగాణ రాష్ట్రంలో ముస్లిం ప్రజల ఆశలు- ఆకాంక్షలు | - లతీఫ్ మహ్మద్‌ఖాన్ | 93 |
| 17. | తెలంగాణ చరిత్ర - సంస్కృతి పునర్నిర్మాణం | - ప్రొ॥ అడపా సత్యనారాయణ | 96 |
| | **సాహిత్యం** | | |
| 18. | తెలంగాణ సాహిత్యకారుల ముందు ఇవాల్టి కర్తవ్యాలు | - ఎన్.వేణుగోపాల్ | 98 |
| 19. | సమగ్ర సాహిత్య చరిత్ర నిర్మాణ సమయం | - ప్రొ॥ఎస్వీ రామారావు | 101 |
| 20. | తెలంగాణ నిర్మాణంలో సాంస్కృతిక విధానం | - డా॥జె.చెన్నయ్య | 103 |
| 21. | తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం కొన్ని ఆలోచనలు | - డా॥సి.కాశీం | 106 |
| | ★ ★ ★ | | |
| 22. | కొత్త తెలంగాణ రాష్ట్రంలో సినీ పరిశ్రమ ఎలా వికసించాలి | - డా॥పగడాల నాగేందర్ | 109 |
| 23. | విలువల పునాదిగా భవిష్యత్ ఉద్యమ నిర్మాణం | - నలమాస కృష్ణ | 112 |
| 24. | తెలంగాణ ప్రభుత్వం హక్కుల పరిరక్షణకు హామీపడాలి | - ప్రొ॥గడ్డం లక్ష్మణ్ | 115 |
| 25. | తెలంగాణలో ఆరోగ్యం-ప్రాథమిక హక్కు | - డా॥రామకృష్ణ | 118 |
| 26. | గొర్లు | - గీతాంజలి | 120 |

సంపాదకీయం

కాశీం

# కొత్త ప్రభుత్వానికి ప్రజా ఎజెండా

*అరవై ఏళ్ల తెలంగాణ ప్రజల కల సాకారమైంది. నెత్తురు చిందించిన పోరాటం ఫలించింది. రణరంగమైన విశ్వ విద్యాలయాలు పురివిప్పి నాట్యమాడుతున్నాయి. నోళ్లు తెరిచిన జైళ్లు కూడా ఆలోచిస్తున్నాయి. కొన్నైన కర్కష లాఠీలు కాలం సాక్షిగా పశ్చాతాపపడుతున్నాయి. చెట్టుకు వేలాడిన, రైలుకు ఎదురేగిన బిడ్డల తల్లుల నొసటి మీద కాస్త చిరునవ్వు పూసింది. ఇట్లా కన్నీళ్లొలికిన కాలం సాక్షిగా, నెత్తురు చిందించిన చరిత్ర సాక్షిగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది.*

1953లో ముల్కీ ఉద్యమం ప్రారంభించి మొదటిసారి తెలంగాణ ఆకాంక్షను విన్పించింది విద్యార్థులు. సిటీ కళాశాలను రణరంగంగా మార్చి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను ఎజెండా మీదికి తెచ్చారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు విద్యార్థులు అశువులు బాసారు. తిరిగి 1969లో గర్జించిన విద్యార్థి యువత వీరోచిత మిలిటెంట్ పోరాటాన్ని తొమ్మిది నెలలు నడిపి, 370 మంది అమరులై తెలంగాణ ఆకాంక్షను ప్రపంచానికి చాటారు. కాని తెలంగాణ పార్లమెంటరీ నాయకత్వం చేసిన ద్రోహానికి ఆనాటి వీరుల త్యాగం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాకుండా, నాయకుల పదవులకు ఉపయోగపడింది. అనేక రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్ష దాదాపు ఇరవై సంవత్సరాలు ఎన్టీ రామారావు మొదలు–చంద్రబాబు నాయుడు వరకు కోస్తాంధ్ర కమ్మ భూస్వాముల ప్రయోజనాల కోసం అణచివేయబడింది. తిరిగి 90వ దశకంలో తెలంగాణ జనసభ, తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్, తెలంగాణ మహాసభ, తెలంగాణ ఐక్యవేదిక లాంటి సంస్థల ఏర్పాటు వలన మళ్లీ ప్రత్యేక తెలంగాణ డిమాండ్ చర్చకు వచ్చింది. నిజానికి ఇది తెలంగాణ పోరాటంలో మలిదశ ఉద్యమానికి నాంది. ఈ కాలంలోనే బెల్లిలలిత, ఐలన్న లాంటి కళాకారులు తమ కంఠాన్ని తెలంగాణ కోసం అర్పించి చంద్రబాబు ప్రభుత్వం చేత చంపబడ్డారు. ఈ చరిత్రనంతా మరుగుపర్చి టిఆర్ఎస్ ఏర్పడిన 2001 నుంచి, జెఎసి ఏర్పడిన 2009 నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైందనే తప్పుడు చరిత్ర నిర్మాణానికి కొందరు ప్రయత్నం చేస్తున్నారు. ఇక 2009లో కెసిఆర్ ఆమరణదీక్ష, విద్యార్థుల మిలిటెంట్ పోరాటం, ప్రజలు రోడ్ల మీదికి రావటం, వెయ్యి మందికిపైగా ఆత్మబలిదానాలు వెరసి ఇవాల్టి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఈ క్రెడిట్ ఏ ఒక్కరికో దక్కటానికి వీలులేదు. ఇది ప్రజలందరి పోరాట విజయం.

సరే, తెలంగాణ రాష్ట్రం వచ్చింది. సంబురాలు జరుపుకుందాం. పాక్షికంగానైనా ఒక రాష్ట్రం ఏర్పడటం వలన కొన్ని ప్రజల ప్రయోజనాలు నెరవేరుతాయి. ఆ మేరకు ఆహ్వానిద్దాం. కాని తెలంగాణ రాష్ట్రం ఆదివాసులను ముంచి వేసే పోలవరం ప్రాజెక్టు మీద రావటమే ఇవాల్టి అతిపెద్ద విషాదం. ఏ నాగరిక సమాజానికైనా వారి మూలాలు ఆదివాసుల దగ్గరే ఉంటాయి. మన జీవితం, మన సంస్కృతి, మన చారిత్రక అవశేషాలు ఆదిమ సమాజం నుంచి వికసించినవే. ఆ సమాజానికి చెందిన అవశేషాలతో వున్న మన పూర్వీకులే ఆదివాసులు. వారిని అభివృద్ధి పేరిట నీటిలో ముంచేసి, నిరాశ్రయులను చేయటమంటే మనల్ని మనం నీటిపాలు చేసుకోవటం. కోస్తాంధ్రలో ఉండే పేద రైతాంగానికి పోలవరం వలన మేలు జరగటం అటుంచితే, అసలు ప్రయోజనం విశాఖలో ఏర్పాటు చేయబోయే పారిశ్రామిక వాడ కోసం(బహుళజాతి

కంపెనీల కోసం), కోస్టల్ కారిడార్ కోసం మంచి నీటిని అందించటానికి పోలవరం నిర్మాణమని నాటి సిఎం రాజశేఖర్‌రెడ్డి చెప్పివున్నారు. చంద్రబాబునాయుడైతే బాహాటంగా చెబుతున్నాడు. కనుక రెండు లక్షల మంది ప్రజలను ముంచి పోలవరం నిర్మాణం చేయటానికి చంద్రబాబునాయుడు, వెంకయ్యనాయుడు కుట్రచేసి, జరిగిందో లేదో తెలియని క్యాబినెట్ సమావేశం ద్వారా ఆర్డినెన్స్ తెచ్చి, ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కలిపారు. ఆదివాసులను ముంచే ద్రోహానికి చంద్రబాబునాయుడు పూనుకున్నాడు. ఈ ప్రాంతాలలోని ఆదివాసులందరు నిరసన ప్రదర్శనలు చేస్తుంటే, తెలంగాణ రాష్ట్రంలో సంబురాలు చేసుకోవటమే చాలా ఇబ్బందికర పరిస్థితి. కనుక ఇక్కడ ఏర్పడిన ప్రభుత్వానికి మొదటి ప్రజాఎజెండా పోలవరం కోసం మునిగిపోతున్న ఆదివాసులను కాపాడటమే ఉండాలి. అంటే దీనర్థం పోలవరం నిర్మాణాన్ని అడ్డుకోవడం.

ఇక రెండో ఎజెండా, తెలంగాణ ప్రాంతంలో కృష్ణా, గోదావరి, తుంగభద్ర లాంటి మూడు జీవనదులు పారుతున్నా, ఇంకెన్ని ఉపనదులున్నా నీళ్లు మాత్రం వ్యవసాయానికి అందటం లేదు. ఫలితంగా పొలాలు పడావుపడ్డాయి. రైతుకూలీలు వలసలు పోతున్నారు. గ్రామాలన్నీ విషాదంగా ఉన్నాయి. ఆకలిచావులు పెరుగుతున్నాయి. పల్లెలలో పని దొరకక పట్టణాలకు వలస రావటం వలనా, పట్టణాలలో తీవ్ర సమస్యలు ఉంటున్నాయి. కనుక కొత్త ప్రభుత్వం నీళ్ల కోసం ప్రజలను నిరాశ్రయులను చేసే పోలవరం లాంటి భారీ ప్రాజెక్టులను నిర్మించటం కాకుండా, చిన్న చిన్న రిజర్వాయర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి. అంతేకాకుండా తెలంగాణలో కాకతీయుల కాలం నుంచే గొలుసుకట్టు చెరువుల వలన లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించారు. అవన్నీ ప్రపంచీకరణ ఫలితంగా, చంద్రబాబు పాలనలో తెగిపోవటమో, పూడిపోవటమో జరిగింది. కనుక కొత్త ప్రభుత్వం వెంటనే వాటిని మరమత్తు చేయించటం వలన పడావు పడిన వ్యవసాయం మళ్లీ పునరుజ్జీవం పొందుతుంది. జూరాల, సాగర్, శ్రీరాంసాగర్ ఎడమ కాల్వలకు మరమత్తులు చేపట్టాలి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలి. తెలంగాణ రాష్ట్రం వస్తే నీళ్లు వస్తాయని, పంటలు పండుతాయని ఉద్యమకాలంలో ప్రజలకు ఆశలు కల్పించాం. ఆ ఆశలను తీర్చవలసిన బాధ్యత పాలకుల మీద ఉంది. వ్యవసాయంలో వాణిజ్య పంటలకు బదులు తిండి గింజలను పండించేటట్లు రైతులను ప్రోత్సహించాలి.

మూడో ఎజెండా, వ్యవసాయానికి అనుబంధంగా ఉండే పారిశ్రామిక రంగాన్ని, చేతివృత్తులను కాపాడాలి. చంద్రబాబునాయుడి తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క తెలంగాణ ప్రాంతంలోనే వేలాది పరిశ్రమలు మూతపడ్డాయి. హైదరాబాద్‌లోనే ఆల్విన్, హెచ్‌ఎంటి, బిడిఎల్, డిబిఆర్, రిపబ్లికన్ ఫోర్జ్ మొదలైన, వరంగల్లులో అజాంజాహి మిల్లు నిజామాబాద్‌లో బోధన్ షుగర్ ఫ్యాక్టరీ లాంటివి మచ్చుకు కొన్ని. ప్రపంచ వాణిజ్య సంస్థతో చేసుకున్న ఒప్పందాల వలన అంతర్జాతీయ ఖ్యాతిని పొందిన పరిశ్రమలను మూసి ఉద్యోగులను రోడ్డుపాలు చేసారు. మూతపడిన ఈ పరిశ్రమలన్నింటిని పునరుద్ధరించటం వలన హైదరాబాద్ ఖ్యాతి మరొక్కసారి ప్రపంచంలో వెలుగుతుంది. అంతేకాకుండా తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులకు చాలా ఆశలు కల్పించాం. ఈ పరిశ్రమలు తెరిస్తే వేలాది ఉద్యోగాలు వస్తాయి. వ్యవసాయానికి అతి సన్నిహితంగా ఉండే చేతివృత్తులు ధ్వంసమై వాటి మీద ఆధారపడిన ఉత్పత్తి కులాలు పట్టణాలలో బిచ్చగాళ్లుగా, సెక్యూరిటీగార్డులుగా మారి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. కనుక మాదిగ, కుమ్మరి, కమ్మరి, చేనేత మొదలైన వృత్తులకు మరింత నైపుణ్యాన్ని జోడించి కాపాడవల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉంది. ఒక రకంగా స్వయం సమృద్ధ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను రూపొందించాలి.

నాలుగో ఎజెండా తెలంగాణలో పతనమైన విద్యావ్యవస్థను పునర్నిర్మాణం చేయటం. రెండు వందల సంవత్సరాల నైజాం పాలనలో తెలుగు భాషకు ప్రాధాన్యం లేక నాలుగు శాతం మాత్రమే అక్షరాస్యత ఉండేది. బహుశ ఇంత స్వల్పంగా అక్షరాస్యత ఆనాటి భారతదేశంలో ఏ ప్రాంతంలో లేకపోవచ్చు. అయినా ప్రజలు సాయుధ పోరాటం చేసి నైజాం నుంచి విముక్తి పొందారు. కాని కొన్నాళ్లకే పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టు కోస్తా కమ్మ దొరల, పెట్టుబడిదారుల పాలనలోకి పోయిన తెలంగాణలో విద్యారంగం చాలా వివక్షకు గురైంది. తెలంగాణ భాషా, సాహిత్యం నిరాదరణకు గురైంది. పాఠ్య ప్రణాళికలలో ఇక్కడి చరిత్రకు చోటులేకుండా పోయింది. పైగా విజన్ 2020 పాలకులు ఆర్ట్స్ కోర్సులకు ప్రాధాన్యం లేకుండా చేసారు. ఫలితంగా ఈ దేశానికి పనికిరాని విదేశీ చదువులవైపు విద్యార్థులు ప్రయాణించారు. విద్యారంగం 70 శాతంకు పైగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోయింది. ప్రైవేటు విశ్వవిద్యాలయాలు కూడా ప్రవేశించాయి. విద్య మార్కెట్‌లో సరుకుగా మారింది. డబ్బు పెట్టి కొనగల్గిన వాడికే దొరుకుతుంది. డబ్బు లేని పేదలు విద్యకు దూరమవుతున్నారు. దళితులు 10%, బిసిలు 12%, ముస్లింలు 8% మాత్రమే ఉన్నత విద్యను అందుకో గలుగుతున్నారు. మిగతా 90 శాతం ఉన్నత విద్యకు దూరంగా ఉన్నారు. కార్పొరేట్ విద్య స్వైరవిహారం చేస్తున్నది. రేపు తెలంగాణ ప్రాంతంలోని కార్పొరేట్ శక్తులు కోస్తా కార్పొరేట్ శక్తులతో కలిసి విద్యను సామాన్యుడికి అందని పండుగా మార్చే ప్రమాదం ఉంది. కనుక పిజి-కెజి ఉచితం అనే హామీ నిజమైన అర్థంలో నెరవేరితేనే కుంటుపడిన విద్యావ్యవస్థ

నూతనోత్తేజాన్ని పొందుతుంది. కార్పొరేట్ శక్తులకు కళ్లెం వేసి పతనావస్థలో ఉన్న ప్రభుత్వ విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 30% నిధులు కేటాయించాలి. క్వాలిటీ లేని విద్య ప్రభుత్వ విద్యాసంస్థలలో(పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు) పేద విద్యార్థులకు అందుతుంది. దీనిలో ఉపాధ్యాయులు–అధ్యాపకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. దీనిని సవరించకుండా తెలంగాణలో 'నాలెడ్జి సొసైటి'ని నిర్మాణం చేయటం అసాధ్యం. మరీ ముఖ్యంగా తెలంగాణ ఉద్యమం జరిగిన ఈ ఐదేండ్లలో విద్యారంగంలో విలువల రాహిత్యం పెరిగింది. దీనిని మార్చవల్సిన బాధ్యత మొదలు ప్రభుత్వానిది–తర్వాత పౌరసమాజానిది.

ఐదో ఎజెండా ఉపాధి కల్పన. తెలంగాణ ఉద్యమంలో ఎక్కువగా పాల్గొని, జైళ్ల పాలై నష్టపోయింది విద్యార్థి యువత. తెలంగాణ వస్తే లక్షలాది ఉద్యోగాలు వస్తాయని వీళ్లకు ఆశపెట్టాం. కనుకనే వాళ్లు త్యాగానికి సిద్ధపడ్డారు. ఇప్పటికే తెలంగాణలో గుర్తించిన ఖాళీలు లక్షపైననే ఉన్నాయి. కనుక వాటికి రెగ్యులర్ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలి. తక్కువ జీతంతో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామనే హామీ నీటి మీది రాతగా మారకుండా ఉండాలి. ప్రపంచబ్యాంకు విధానాలకు స్వస్తి చెప్పినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులతో పని నడిపిస్తున్నారు. దీనిని వెంటనే రద్దుచేసి పర్మినెంట్ ప్రాతిపదికగా భర్తీచేయాలి. గ్రామాలలో ఎంతోమంది నిరుద్యోగ యువత ఉంది. స్థానిక వనరులను ఉపయోగించి చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా గ్రామీణ నిరుద్యోగాన్ని పారద్రోలవచ్చు.

ఆరో ఎజెండా తెలంగాణ ఆకాంక్షను సజీవంగా నిలబెట్టిన కవులు–కళాకారులు–అమరుల కుటుంబాలను ఆదుకోవటం. బహుశ ప్రపంచంలో ఏ పోరాటంలో వికసించనంతగా సాహిత్యం తెలంగాణ ఉద్యమంలో పుష్పించింది. ఉత్పత్తి కులాల నుంచి కొత్తకలాలు–గళాలు వచ్చాయి. నిజానికి ఉద్యమ క్రెడిట్ వీళ్లకు దక్కాలి. కాని వీళ్లకు సంబంధించి ఎవరూ మాట్లాడటం లేదు. ఉద్యమం ఆగిపోతున్నప్పుడల్లా ఆత్మబలిదానాలు చేసుకొని నిప్పును రాజేసిన అమరుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం–ఐదెకరాల భూమి ఇవ్వాలి. ప్రజా కళల కోసం ఒక విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పి కళాకారులకు ఉపాధి కల్పించాలి. అణచివేయబడిన పౌర, ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరించే చర్యలు కొత్త ప్రభుత్వం చేపట్టాలి. భూమి లేని దళితులు, బీసీలు, ముస్లింలకు 5 ఎకరాల చొప్పున ఇవ్వాలి. సాగునీటి వసతిని కల్పించాలి. తెలంగాణలో 70 లక్షలకు పైగా మిగులు భూమి ఉంది. ఇది ప్రజలకే చెందాలి. అంతిమంగా ప్రజాస్వామిక విలువలు పరిఢవిల్లే తెలంగాణను రూపొందించుకోవాలి. ❖



**1969 ఉద్యమంలో అసువులు బాసిన తొలి అమరవీరుల స్థూపం (సికిందరాబాద్, క్లాక్‌టవర్)**

# విప్లవోద్యమ అవగాహనలో ప్రజాస్వామిక తెలంగాణ కర్తవ్యాలు

వరవరరావు

***తెలంగాణ రాష్ట్రం ఏర్పడి అప్పుడే ఇరవై రోజులు గడిచిపోయినవి. ఇది ప్రజల అరవై ఏళ్ల ఆకాంక్షల, పోరాటాల, బలిదానాల, త్యాగాల ఫలం. కాని దేశంలో మరొక రాష్ట్రంగా కాకుండా 28 తర్వాత 29వదిగా కాకుండా ఇది పొరుగున ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దళారీ సంపన్నవర్గాల కనుసన్నలలో కేంద్రం రచించిన ఒక సమస్యాత్మక రాష్ట్రంగా ఏర్పడింది.***

ఇది నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి గల సర్వాధికారాలను హరిస్తున్నది. పదేళ్ల కోసం హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా, 'గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్'(జిహెచ్ఎంసి) పరిధిగా ప్రకటించింది. ఈ ఉమ్మడి రాజధానిపై గవర్నర్‌కు అధికారాన్ని కట్టబెట్టింది. దేశంలో గాని, రాజ్యాంగంలో గాని, ఉమ్మడి రాజధాని అనే అంశం లేదు. ఏదైనా రాష్ట్రాన్ని విభజించినప్పుడు కొత్త రాజధానిని నిర్మించాల్సిన అవసరం ఏర్పడినప్పుడు అప్పటికే గల రాజధానిని తాత్కాలికంగా కొద్దికాలం కోసం రాజధాని లేని రాష్ట్రం వినియోగించుకోవచ్చు. లేదా రాజధాని లేని రాష్ట్రం తాత్కాలికంగా తమ రాష్ట్రంలోనే ఏ ఇతర వసతుల్లోనో వాడుకోవచ్చు. మద్రాసు నుంచి విడివడిననాడు ఆంధ్ర రాష్ట్రంలో కర్నూల్‌లో గుడారాల్లో నుంచి ప్రభుత్వాన్ని నడిపిన చరిత్ర ఉంది. కాకపోతే ఈ రోజు రాష్ట్రంలో ఎక్కడైనా పెద్ద పెద్ద భవంతులతో అనేక నిర్మాణాలు ఉన్నప్పుడు గుడారాల్లో ఆఫీసులను నడపాల్సిన అవసరమే రాదు. హైదరాబాద్ అభివృద్ధికి తామే కృషిచేశామని, హైదరాబాద్‌ను విడిచి వెళ్లేది లేదని, రాష్ట్రం విడిపోవాల్సి వస్తే హైదరాబాద్‌ను యూటీ చేయాల్సిందేనని పట్టుబట్టిన కోస్తాంధ్ర, రాయలసీమ పెట్టుబడి దారులను సంతృప్తి పరచడానికి హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ప్రభుత్వం ప్రకటించింది. గత 6 దశాబ్దాల్లో కోస్తాంధ్ర, రాయలసీమ సంపన్నులు హైదరాబాద్ చుట్టు ప్రక్కల గల ప్రభుత్వ (సర్ఫే ఖాస్) భూములు, రైతాంగ భూములను యిబ్బడి ముబ్బడిగా లక్షలాది ఎకరాలు అక్రమంగా ఆక్రమించు కున్నారు. రాజకీయ నాయకులు, వ్యాపారులు, సినీ రంగ నిర్మాతలు, పారిశ్రామికాధిపతులు, విదేశీ కంపెనీలు, ఐటి రంగంలోని దేశ, విదేశీ పెట్టుబడిదారులు, యజమానులు, విలాస భవన నిర్మాణాల కాంట్రాక్టర్లు, రాయలసీమ ఫ్రాక్షన్ భూస్వామ్య ముఠాలు యిలా రాష్ట్రంలోని భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గాలతో పాటు, విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులు ఈ భూములను ఆక్రమించారు. కేంద్ర ప్రభుత్వం అనేక కంపెనీలను ఇక్కడే నిర్మించింది. వీటన్నింటితో 50 సంవత్సరాల క్రితం హైదరాబాద్‌తో పోలిస్తే నేడు హైదరాబాద్ నగరమే ఒక వలస ప్రాంతంగా మారిపోయింది. బ్రిటీష్‌వాళ్లు, యూరోపియన్లు 15వ శతాబ్దంలో అమెరికాను ఆక్రమించి ఎక్కడికక్కడ వలస ప్రాంతాలను సృష్టించిన రీతిలో నేటి హైదరాబాద్ స్థితి మారింది. ఈ పాలక వర్గాలు కుమ్మక్కై ఒక పద్ధతి ప్రకారం ఈ 6 దశాబ్దాలుగా దోపిడీ, ఆధిపత్యం కొనసాగించారు. ఈ దోపిడీ, ఆధిపత్యాన్ని కొనసాగించడానికే ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను ప్రకటించడమే గాక, హైదరాబాద్‌పై గవర్నర్‌కు తిరుగులేని అధికారాలను కల్పిస్తున్నది. నేడు ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ పరిపాలన ఎంత నిరంకుశంగా పోలీసు పాలన కొనసాగుతుందో ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత స్పష్టంగా దేశ ప్రజలందరికీ అర్థమయ్యే ఉంటుంది.

హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వ పరిపాలనను గవర్నర్ ముసుగులో కోస్తాంధ్ర, రాయలసీమ పాలకవర్గాలు, కేంద్ర ప్రభుత్వం అధికారాలను చెలాయించే క్రమంలో తెలంగాణ ప్రజలు హైదరాబాద్‌లో పరాయివారు కావడమే గాక ఎన్నో బాధలకు గురి కావాల్సి వస్తుంది.

ఇది ఎక్కువగా ఊహించుకోవడం కాదనడానికి నిన్నటికి నిన్న సచివాలయం ముందు రెండు రాష్ట్రాల ప్రవేశ ద్వారాల మధ్యన సరిహద్దు భద్రతాదళాల బ్యారికేడ్ల నిర్మాణం ఉదాహరణ చాలు. సచివాలయాన్ని రెండు ప్రభుత్వాలకు ఒకే చోట ఏర్పాటుచేసి రోజూ మొహం మొహం చూసుకుంటూ ఉంటే పెరిగే వైమనస్యాలు చాలవన్నట్లు స్వపరిపాలన వలన అన్నదమ్ముల వలె కలిసుంటారేమో అని భయంతో సరిహద్దు రేఖలు గీసినట్లుగా అర్ధసైనిక బలగాలను మోహరించారు. ఇరువైపులా ఉద్యోగులు మేం మా ప్రవేశాల దారిలో పూల కుండీల విభజన కూడా అక్కర్లేదన్నాం. మేం అడిగింది కాదు ఇది అని అంటున్నారు. విభజించి పాలించు అనే బ్రాహ్మణీయ భూస్వామ్య, కుంఫిణీ వలస పాలన నీతి ఇది.

### ఇక రెండవది నదీజలాల పంపిణీ

కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ కోసం ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్‌తో పాటు గోదావరి, కృష్ణా నది నిర్వహణ మండలిని ఏర్పాటుచేసింది. అంతకన్నా తీవ్ర అభ్యంతరకరమైన అంశం పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వమే నిర్మించాల్సిన ప్రాజెక్టుగా గుర్తించడమే కాకుండా ఖర్చంతా భరిస్తుంది.


'కృష్ణా, గోదావరి నదీ జలాలను యిప్పటికే కోస్తా వాళ్లు వారి వాటాకు మించి ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వంలో గల అధికారాన్ని ఉపయోగించుకొని తమ ప్రాంతాలకు మూడు

పంటలకు సరిపడే నీరు అందేలా ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు దానికి తగిన యంత్రాంగాన్ని ఏర్పరుచుకున్నారు. నీటి పంపకంలో తెలంగాణకు, రాయలసీమకు అన్యాయం చేసారు. ప్రస్తుతం గోదావరి పైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా కోస్తాంధ్ర పాలకులు అనేక ప్రయోజనాలు పొందగోరుతున్నారు. కోస్తా వ్యవసాయ స్థిరీకరణకు, కోస్తా పారిశ్రామిక కారిడార్‌కు నీరు యివ్వడం కోసం ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. దీని వల్ల తెలంగాణ గోదావరి నది జలాలను కోల్పోవడమే గాకుండా నిర్వాసిత, పర్యావరణ సంబంధ సమస్యలు తలెత్తుతాయి. ఖమ్మం జిల్లాలో 276 గ్రామాలు నీటిలో మునిగి పోయి మూడు లక్షల మంది ప్రజలు నిర్వాసితులుగా మారుతున్నారు. అతి పురాతన సంప్రదాయ కోయ జాతి ప్రజలు తమ వారసత్వ సంపదలన్నింటినీ కోల్పోతారు'. విలువైన ఔషధాలు, వనసంపద కోల్పోతారు. శబరీనది అదృశ్యమవుతుంది. ఇది ఇట్లా ఉంటే భద్రాచలం డివిజన్‌లోని ముంపు ప్రాంతాలు ఉండే ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో చేర్చారు. అంటే మనం చిరకాలంగా కోరుకున్న ప్రజాస్వామికంగా తెలంగాణ భౌగోళిక తెలంగాణ రూపంలో కూడా సిద్ధించలేదు. జలవివాదానికి తోడు రెండు రాష్ట్రాల మధ్య పరిపాలనా భూభాగ వివాదాన్ని కూడా రాజేశారు. దానితో ముంపు ప్రాంతాలు తెలంగాణలోనే ఉండాలనే డిమాండు ముందుకు వచ్చింది. ఆదివాసీ ప్రాంతాలు ముంపునకు ఎందుకు గురికావాలి అని కాకుండా ముంపు ప్రాంతాలు ఎవరికి చెందాలనేది సమస్యగా పాలకవర్గాలు సృష్టించాయి. తెలంగాణ ఏర్పడక ముందే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మే 30న తెరాస బంద్ పిలుపు ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడగానే తొలి శాసనసభ భద్రాచలం డివిజన్‌లో ఏడు మండలాలు తెలంగాణకే చెందాలని, పోలవరం ప్రాజెక్టు డిజైన్ మార్చాలని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించింది.

గతంలో డిజైన్ మార్పు, ఎత్తు తగ్గించడం, కేవలం ఆంధ్ర ప్రాంత వ్యవసాయ ప్రయోజనాలకే ప్రాజెక్టు నిర్మాణం అనేవి సిపిఐ, సిపిఎం డిమాండులు. ఆదివాసులు, పర్యావరణవాదులు, ప్రజాస్వామిక శక్తులు, విప్లవోద్యమం పోలవరం ప్రాజెక్టు నిర్మాణమే చేపట్టవద్దంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే దాకా తెరాస డిమాండు కూడా అదే. 'పోలవరం ప్రాజెక్టు నిర్మాణమయితే నీళ్లు కాదు, రక్తం పారుతుంది' అని 2006లో భద్రాచలంలో ప్రకటించాడు తెరాస అధ్యక్షుడు కె.సి.ఆర్.

ఇపుడు తెలంగాణలో పాలకవర్గాల అందరి నోట డిజైన్ మార్పు, ఎత్తు తగ్గించడం అనే పాటనే వస్తున్నది. అంతకన్నా పెద్ద గొంతుతో ముంపు ప్రాంతాలు, ఏడు మండలాలు తెలంగాణలో ఉంటే చాలునన్న ఆత్మసంతృప్తి కనిపిస్తున్నది. ఇది ఆదివాసులకు ఏ విధంగానూ మేలు చేసేది కాదు.

మన శాసనసభ తీర్మానం అయిన తర్వాత జరిగిన గుజరాత్ శాసనసభ నర్మదాడ్యాం ఎత్తు పెంచుతూ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. దశాబ్దాలుగా జలసమాధికి కూడా గురవుతూ అక్కడ ఆదివాసులు చేస్తున్న పోరాటాలపై కొత్త ప్రభుత్వాలు ప్రకటించిన క్రూర వైఖరి ఇది. కనుక ఎక్కడా భారీ ప్రాజెక్టులకు డిజైన్లు మారవు. ఎత్తు తగ్గదు. ముంపు ప్రాంతాలలో ఆదివాసులు మునిగిపోవడమో, నిర్వాసితులు కావడమో తప్పదు. ఇవి ప్రపంచ బ్యాంకు ఆదేశాలు. బహుళజాతి కంపెనీల స్వార్థ ప్రయోజనం కోసం బడా కంపెనీల స్వార్థ ప్రయోజనాల కోసం తీసుకుంటున్న నిర్ణయాలు. కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు తెలంగాణ శాసనసభ తీర్మానం ఏకగ్రీవమైనా సరే, దళారీ కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్స్ ముందు చెల్లదని తెగేసి అందుకే చెప్పగలిగాడు. ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో చేరి ప్రాజెక్టు నిర్మాణమైతే భూమి పట్టాలు ఉన్న వారికే నష్టపరిహారంగా భూమి ఇస్తే ముంపునకు గురయ్యేవారికి గోదావరి జిల్లాలో సెంటు భూమి కూడా దొరకదని అక్కడ ఆదివాసులు భయపడుతున్నారు. ఇప్పటికే కొండరెడ్ల జాతి అంతరించి పోతున్నది. అక్కడ కోయ, కొండరెడ్ల జాతులకు తెలంగాణలో ఉండడం సెంటిమెంటు కాదు. తమ జీవితాన్ని, ఉనికిని, సంస్కృతిని, స్వీయగౌరవాన్ని స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవడం అది వాళ్ల రాజకీయార్థిక, సాంస్కృతిక సామాజిక సమస్య.



పులి మీద పుట్ర వలె ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా

మద్రాసు ప్రావినెన్స్ నుంచి విడిపోయిన, ఆంధ్రప్రదేశ్ ఏర్పడడానికి ముందున్న ఆంధ్ర రాష్ట్రమే ఆంధ్రప్రదేశ్‌గా రూపొందాలని తీర్మానించింది.

ఎడ్డెం అంటే తెడ్డెం అన్నట్లు, నువు అవునన్నది నేను కాదంటానన్నట్లు పరిపాలనా భవనాలు, ఉద్యోగాలు, విధులు మొదలు విద్యుత్ పంపిణీ వరకు రోజూ వివాదాలు చూస్తూనే ఉన్నాం. రాష్ట్ర విభజన వివాదాల పరిష్కారం కోసం కాకుండా రెండు రాష్ట్రాలలో తెలుగు ప్రజలు తమ తమ స్వపరిపాలనలతో కలిసి మెలిసి ఉండడంగా పరస్పర ఆదాన, ప్రదానాలతో కొనసాగడంగా కాకుండా పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా ఇరుగింటి, పొరుగింటి గోడ పంచాయితీగా మార్చేసారు.

'ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రధానంగా నీళ్లు, నిధులు, ఉద్యోగాలు అనే అంశాలపైన సాగింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లులో ఈ మూడు అంశాల్లో తెలంగాణ ప్రజలకు ఈ బిల్లు నష్టం చేకూర్చుతున్నది. ఆస్తులు-అప్పుల పంపకంలో జనాభా ప్రాతిపదికపైన పంపకాలు జరగాలని బిల్లు చెబుతున్నది. ఉద్యోగ విరమణ చేసిన వారికి పించన్లు జనాభా ప్రాతిపదిక మీద చేయాలని చెబుతున్నది. గతంలో అక్రమంగా తెలంగాణలో ఉద్యోగాలు సంపాదించి ఉద్యోగ విరమణ పొందిన వారికి తెలంగాణ ప్రభుత్వం పించన్లు చెల్లించాల్సి రావడమే గాక, ఇప్పటివరకు వివిధ రకాల ఉద్యోగాల్లో 80% ఉన్న కోస్తాంధ్ర ప్రాంతం వారికి తెలంగాణ ప్రభుత్వం జనాభా దామాషా ప్రకారం జీత భత్యాలతో పాటు పించన్లు కూడ చెల్లించాల్సి ఉంటుంది. యిది చాల అక్రమమైన నిర్ణయమని చెప్పవచ్చు. అలాగే ఆస్తులు-అప్పుల పంపకం కూడా జనాభా ప్రాతిపదికపైన కాకుండా అప్పులు ఎక్కడ ఖర్చు పెట్టారో ఆ ప్రాంతం వారే భరించాలనే పద్ధతిని పాటించాలి. అలాగే ఉన్నత విద్యలో యధాతథం విధానాలను అమలు చేయడమంటే ఇప్పటికే టీచింగ్ రంగంలో అనేక ఉద్యోగాలు, పదవులు పొందిన కోస్తాంధ్ర వాళ్లు ఆయా స్థానాల్లో కొనసాగితే తెలంగాణ విద్యార్థులకు కొత్తగా దొరికే ఉద్యోగాలు ఎలా సృష్టించబడతాయి. అలాగే కోస్తాంధ్రతో పోటీ పడి పబ్లిక్ పరీక్షల్లో పాసై అడ్మిషన్లు పొందడంలో తెలంగాణ విద్యార్థులకు యిబ్బందులు తలత్తుతాయి.

'ఇప్పటి హైదరాబాద్ హైకోర్టును ఉమ్మడి కోర్టుగా కొనసాగించడంతో, కోస్తాంధ్ర వాళ్ల ఆధిపత్యమే అందులో కొనసాగి తెలంగాణ ప్రజలు ఎంతో నష్టపోతారు. తెలంగాణలో లాయర్లకు అవకాశాలు లభించక ఎక్కడ వేసిన గొంగడి అక్కడి లాగే వుంటే లాయర్లు ఎంతో గట్టిగా నిలబడి ప్రత్యేక తెలంగాణ పోరాటంలో పాల్గొని వారు సాధించినదేముంటుంది. ఇలాంటి వన్నీ తెలంగాణ ప్రజలకు ఎంతో తీవ్ర అడ్డంకులుగా ముందుకు వస్తే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఏమి లాభం వుంటుంది. అందుకు తెలంగాణ ముసాయిదా బిల్లులోని ఈ అంశాలన్నింటినీ వ్యతిరేకిస్తూ ఆందోళనలు కొనసాగించాలి. తెలంగాణ పాలక వర్గాలు ఈ బిల్లులోని తెలంగాణ వ్యతిరేక అంశాలను సీరియస్‌గా వ్యతిరేకించడం లేదు.

'తెలంగాణ రాష్ట్రం అవతరించనున్న సందర్భంగా నూతన రాష్ట్రంలో పునర్నిర్మాణం ఎలా ఉండాలి? అనే విషయంపై చర్చ కేంద్రీకృతమైంది. ఈ చర్చలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు ప్రధానంగా పాల్గొంటున్నారు. యిందులో రాజకీయ పార్టీలు తప్ప, తక్కిన వారంతా తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామిక కర్తవ్యాలు పరిపూర్తి చేయాలని కోరుకుంటున్నారు. ఈ రెండవ రకం వారిలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ముందుకొచ్చిన నీళ్లు, నిధులు, ఉద్యోగాలు లాంటి సమస్యలు పరిష్కరింపబడితే చాలునసే వారి నుండి ఇంకొంత ముందుకెళ్లి బడా భూస్వామ్య -బడా బూర్జువా - సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యక్రమంలో కొంత భాగం చేపట్టాలని భావిస్తున్న వారు వున్నారు. ముఖ్యంగా ఇలాంటి వాళ్లు తెలంగాణలో మళ్లీ భూస్వామ్య పరిపాలన రాకూడదనీ, ప్రపంచబ్యాంకు పెత్తనం పోవాలనీ, భూసంస్కరణలు అమలు జరగాలని కోరుకుంటున్నారు. అయితే యిలా కోరుకునే సెక్షన్ చాల చిన్నదిగా వుంది. విప్లవోద్యమం నూతనంగా ఏర్పడే తెలంగాణ రాష్ట్రంలో పునర్నిర్మాణం ఎలా ఉండాలో చాల వివరంగా మొదటి నుండి ముఖ్యంగా వరంగల్ డిక్లరేషన్ ప్రకటించిన నుండి ప్రచారం చేస్తూనే వుంది. అందుకే విప్లవోద్యమం ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ అని ప్రజల ముందు చాల స్పష్టమైన కార్యక్రమాన్ని ఉంచింది. విప్లవోద్యమం మొదటి నుండి ప్రచారం చేపట్టడం ద్వారానే తెలంగాణలో అనేక మంది మనం చేపట్టిన కార్యక్రమం వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ రోజు తెలంగాణ పునర్నిర్మాణం ప్రజాస్వామిక లక్ష్యాల ప్రతిపాదికపై ఉండాలనే చర్చ కేంద్రీకృతమవడం అంటే దీన్ని విప్లవోద్యమం సాధించిన రాజకీయ విజయంగానే భావించాలి.

"పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతూ ఉన్న పరిస్థితిలో జాతుల సమస్యపై జరిగే పోరాటం బూర్జువా వర్గాల మధ్య జరిగే పోరాటమే. కొన్ని సందర్భాల్లో జాతుల ఉద్యమంలోకి కార్మిక వర్గాన్ని కూడ బూర్జువా వర్గం ఆకర్షింపగలుగుతుంది. కాని వాస్తవానికి అది బయటికి కనిపించే లక్షణం మాత్రమే. సారాంశంలో అది ఎప్పుడూ బూర్జువా పోరాటమే. ప్రధానంగా బూర్జువాజీ ప్రయోజనాల కొరకు జరిగే పోరాటమే".

"అయితే కొన్ని జాతులు అణగదొక్కబడడానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఏ విధంగానూ పోరాడదని దీని అర్థం కాదు".

'ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలకు చెందిన ప్రజలంతా ఇంకా సమగ్రమైన అభివృద్ధి పొందని ఒకే జాతిగా

చెప్పవచ్చు. వారంతా ఒకే భాష మాట్లాడుతారు. ఒకే భూభాగంలో నివసిస్తారు. ఒకే విధమైన ఆర్థిక విధానం ఉంది. అయితే శతాబ్దాలుగా ఈ ప్రాంతాలు వేర్వేరు ప్రభుత్వాల కింద జీవించడానికి అలవాటు పడిన కారణం చేత మూడు ప్రాంతాల ప్రజలలోనూ తాము వేర్వేరు అనే మనస్తత్వం జీర్ణించుకొని వుంది. అలాగే ఆర్థిక, సామాజిక, భాషా–యాసా సాంస్కృతిక రంగాల్లో కొట్టొచ్చినట్లుగా కనబడే తేడాలున్నాయి. ఆంధ్ర ప్రాంతం వికాసంలో తెలంగాణ కంటే వంద సంవత్సరాలు ముందుంది. నైజాం పాలనలో తెలంగాణ చాల వెనకబడి ఉంది. రాయలసీమ ముఠా కక్షలతో నలిగిపోయింది. ఈ మూడు ప్రాంతాలను కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పరచినప్పటికీ ఈ తేడాలు తొలగిపోక పోగా కోస్తాంధ్ర, రాయలసీమ పాలకవర్గాలు తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలపై కొనసాగించిన దోపిడీ, వివక్షలతో మరింతగా పెరిగాయి. దాని ఫలితమే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముందుకు రావడం జరిగింది. రాయలసీమ ప్రజలల్లో ఆంధ్ర, రాయలసీమ పాలకుల పట్ల అసంతృప్తి రగులుతున్నది.

'పెట్టుబడిదారీ విధానం అంటేనే అభివృద్ధిలో అసమానత్వం. ఈ అసమానత్వానికి కూడ ఒక తీరు వుంది. భారతదేశం లాంటి వెనుకబడిన దేశాల్లో ఈ అసమానత్వం జాతుల అభివృద్ధిని కూడ దెబ్బతీస్తున్నది. అందువల్లనే ప్రత్యేక తెలంగాణతో పాటు మరి కొన్ని రాష్ట్ర డిమాండ్స్ ముందుకొచ్చాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సమయంలో ఆయా ప్రాంతాలు తమ అసమ్మతిని తెలియజేశాయి. కాని విశాల రాష్ట్రాలు ఏర్పడినప్పుడు ఈ అసమ్మతి వాటిలో ఒదిగి పోయింది. కాల క్రమంలో ఈ అసమ్మతే ఉద్యమాల రూపంలో పెల్లుబికి తమ ప్రాంతాలకు స్వంత రాష్ట్రాలు కావాలని డిమాండ్లు ముందుకొచ్చినాయి.

'కాబట్టి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని అర్థం చేసుకొన్నప్పుడు సారాంశంలో యిది తెలంగాణలో ప్రధానంగా బూర్జువా వర్గపు డిమాండేనని, వారు అధికారానికి వచ్చిన తర్వాత బడా భూస్వామ్య – దళారీ నిరంకుశ బడా బూర్జువా –సామ్రాజ్యవాద అనుకూల పరిపాలన నెలకొల్పుతారని సులువుగా అర్థం చేసుకోవచ్చు. నూతనంగా అధికారానికి వచ్చే ఈ బూర్జువా వర్గం మరింత క్రూరంగా ప్రజలపై నిర్బంధకాండ కొనసాగించగలదని కూడ చెప్పవచ్చు. అందుకే నూతనంగా ఏర్పడే తెలంగాణ రాష్ట్రంలో పునర్నిర్మాణం అనేదే జరిగితే, అది తెలంగాణ రాష్ట్రంలో బూర్జువా వర్గం సంఘటితపడి బలపడడానికి ఉద్దేశించినదవుతుంది తప్ప, అది ప్రజలకు ఎలాంటి ఉపయోగకరమైంది కాదు. ప్రజలకు ఉపయోగపడే పునర్నిర్మాణం చేయాలంటే నూతనంగా ఏర్పడే ప్రభుత్వానికి, పాలక వర్గాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిందే తప్ప మరో మార్గం లేదు. ఇపుడు అధికారంలోకి వచ్చిన బూర్జువా వర్గం తమకు అనుకూలమైన ఆర్థిక, రాజకీయ రంగాల్లో కొన్ని మార్పులు చేసి, ఇవన్ని ప్రజల అభివృద్ధి కోసమేనని నమ్మించడానికి ప్రయత్నాలు చేస్తారు. కాని ప్రజలు అప్రమత్తంగా ఉండి, పునర్నిర్మాణం విషయంలో స్వంత కార్యక్రమాన్ని ముందుకు తీసుకొని రావాలి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తీవ్రమైన పోరాటాలకు సిద్ధం కావాలి.

'విప్లవోద్యమం తెలంగాణ పునర్నిర్మాణం విషయంలో స్పష్టమైన అవగాహన కల్గి వుంది. 1996 నుండి విప్లవోద్యమం ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌ను ప్రజల మందుంచింది. నూతనంగా ఏర్పడే రాష్ట్రం భౌగోళిక పరమైనదే కాక అది ప్రజాస్వామికీకరింప బడాలనీ మనం ప్రచారం చేస్తూ వచ్చాం. అందుకు మనం ప్రజల ముందు కనీస కార్యక్రమాన్ని వుంచాము. అట్లాగే తెలంగాణ రాష్ట్రం పోరాటం ద్వారానే సాధించుకోగలమని స్పష్టంగా చెప్పాము. పార్లమెంటులో బిల్లు పెట్టాలని, తెలంగాణ వనరులను కాపాడుకోవాలని ముఖ్యమైన పిలుపులనిచ్చాము. ఈ కాలమంతటా విప్లవోద్యమం చూపించిన రాజకీయ దార్శానికత నిజమని రుజువయింది. కాబట్టి తెలంగాణ సమాజం ఈ రోజు తెలంగాణ పునర్నిర్మాణం ప్రజాస్వామికంగా వుండాలని నినదిస్తున్నది.

'తెలంగాణ ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమయ్యేది కార్మిక వర్గం నాయకత్వంలో విప్లవకర వర్గాలైన రైతాంగం, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలు ఐక్యమై నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాయుధంగా విజయవంతం చేసుకోవడం ద్వారానే' బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల దోపిడీ పాలనను కూలదోయడం ద్వారానే' వారి చేతుల్లో వున్న కోట్లాది రూపాయల ప్రజల సంపద, భూమి, ఫ్యాక్టరీలు, సహజ వనరులు, పెట్టుబడిని స్వాధీనం చేసుకోవడం ద్వారానే' వేల కోట్ల రూపాయల అప్పుల్ని రద్దు చేయడం ద్వారానే తెలంగాణ ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయి. సామ్రాజ్యవాదులపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము స్వతంత్రంగా నిలబడి దున్నేవారికే భూమి ప్రాతిపదికపై వ్యవసాయ విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారానే, వ్యవసాయంపై ఆధారపడి పారిశ్రామిక అభివృద్ధిని కొనసాగించడం ద్వారానే, ప్రజల జీవన పరిస్థితుల్ని క్రమంగా మెరుగు పర్చడం ద్వారానే తెలంగాణ ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల ప్రజల, మొత్తం దేశ ప్రజల మౌలిక సమస్యలు కూడ ఈ విధంగానే పరిష్కారమవుతాయని విప్లవోద్యమ కార్యక్రమం చెబుతున్నది.

అయితే విప్లవోద్యమం దీర్ఘకాలంగా ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం, ఉద్యమానికి నాయకత్వం వహించడం, మరో వైపు 1940 నుండి తెలంగాణలో మౌలిక మార్పులకై సాయుధ పోరాటం కొనసాగడంతో విప్లవోద్యమానికి, బడా భూస్వామ్య – దళారీ నిరంకుశ బడా బూర్జువాలు, సామ్రాజ్యవాదులతో తీవ్రమైన వైరుధ్యం కొనసాగుతున్నది. తెలంగాణ ప్రజల్లో పోరాట వారసత్వం,

భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను నడిపిన అనుభవం వుంది. కాబట్టి తెలంగాణలో ప్రజానుకూలమైన పునర్నిర్మాణం కోసం మనం గట్టిగా పోరాడవలసి వుంటుంది. తెలంగాణలో నూతనంగా అధికారానికి వచ్చే బడా భూస్వామ్య – దళారీ నిరంకుశ బూర్జువాలకు వ్యతిరేకంగా పోరాడుతూ తెలంగాణ పునర్నిర్మాణంలో క్రియాశీలకమైన పాత్ర పోషించాలి. ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ కార్యక్రమంలో భాగంగా విప్లవోద్యమం ప్రకటించిన కనీస కార్యక్రమాన్ని అమలు చేయించడానికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను క్రియాశీలకంగా కదిలించాలి.

'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ డిమాండ్ బూర్జువా వర్గందే అయినప్పటికీ ఈ ఉద్యమంలో విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగస్థులు, పెటీ బూర్జువాలు, వివిధ సెక్షన్ల ప్రజలు, రైతాంగం పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమకు ప్రయోజనాలు కలుగుతాయనే వీరంతా ఉద్యమంలో పాల్గొన్నారు. ఉద్యమం తారా స్థాయికి చేరిన్నాడు తెలంగాణ సమాజం అంతా ఒక్కటై పోరాడింది. ఈ పోరాటంలో తెలంగాణ సమాజం గొప్ప ఐక్యతను కనపరిచింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పరచిన తర్వాత వెంటనే భూస్వామ్య – బూర్జువా వర్గం అధికారాన్ని చేపట్టి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అణగదొక్కుతారు. తాత్కాలికంగా ఉద్యోగ, పెటీ బూర్జువా వర్గంలో కొద్ది మంది ఈ పాలక వర్గాలను అనుసరించి పాలక వర్గాల్లో కో ఆప్ట్ అవుతారు. ప్రధానంగా వీరు వివిధ దశల్లో ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వారై వుంటారు. పాలక వర్గాలు తెలంగాణ ఉద్యమంలో ముందుకొచ్చిన నీళ్లు, నిధులు, ఉద్యోగాల విషయంలో ఏవో కొన్ని కంటి తుడుపు చర్యలను చేపట్టి ప్రజలను మభ్య పెట్టడానికి ప్రయత్నిస్తాయి. కానీ ఈ ఉద్యమంలో పాల్గొన్న విస్తృత ప్రజానీకం ఈ ప్రభుత్వంపై భ్రమలు వీడి అనతి కాలంలోనే పోరాటాల్లోకి ముందుకు రావడం తప్పక జరిగి తీరుతుంది.

'కాబట్టి విప్లవోద్యమం తెలంగాణ పునర్నిర్మాణం – ప్రజాస్వామిక కర్తవ్యాలపై కలిసి వచ్చే ప్రజాస్వామిక శక్తులను కూడగట్టి పోరాటాలకు సిద్ధం కావాలి. ప్రజాస్వామిక, ప్రగతిశీల, పీడిత వర్గాలు, సెక్షన్లు, వ్యక్తులు, సంస్థలతో కూడి వున్న విశాల ఐక్య సంఘటనను బలోపేతం చేయాలి. నిర్వాసిత, అసంఘటిత, నిరుద్యోగుల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్రీకరించి పని చేయాలి. రైతాంగ సమస్యలపై పోరాడాలి. భూ సంస్కరణలు అమలు చేయాలని పోరాడాలి.

ఆదివాసులు, దళితులు, మైనారిటీల హక్కుల కోసం ఉద్యమించాలి.'

## ప్రజాస్వామిక హక్కులు

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన దగ్గర్నించీ, ముఖ్యంగా శ్రీకాకుళ, గోదావరి లోయ రైతాంగ పోరాటాలు ప్రారంభమైన కాలం నుంచి కొద్ది వ్యవధి మినహాయింపులతో ఆంధ్రప్రదేశ్‌లో ఫాసిస్టు పాలనే కొనసాగింది. 69 నుంచే ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో 'కల్లోలిత ప్రాంతాల' ప్రకటన, పోలీసు క్యాంపులు, ఎన్‌కౌంటర్లు, 1972లో విప్లవోద్యమం సెట్‌బ్యాక్ తర్వాత 'ఎమర్జెన్సీ' హరించిన ప్రాథమిక హక్కులు, ఎన్‌కౌంటర్ హత్యలు, జగిత్యాల జైత్రయాత్ర, ఇంద్రవెల్లి పోరాట కాలం నుంచి రాజ్యహింస, ముఖ్యంగా ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్‌ల పాలనలో ప్రైవేటీకరణకనుగుణంగా రాజ్యహింస మనం చవిచూసాం. 1969 మొదలు 2014 జూన్ 1 వరకు కూడా ప్రత్యేక తెలంగాణ ప్రజాస్వామిక ఆకాంక్షలపై అవి తల ఎత్తినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుగానీ, రాష్ట్రపతి పాలనగానీ అమలుచేసిన రాజ్యహింస తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరచిపోరు. కనుక సహజంగానే ప్రజల బలమైన ఆకాంక్షలకు అనుగుణంగానే స్వపరిపాలన, స్వావలంబన, స్వాభిమానంతో పాటు తెలంగాణలో ప్రజాస్వామిక, పౌరహక్కుల డిమాండు కూడా బలంగా ముందుకు వచ్చింది.

రాష్ట్రపతి పాలన కాలంలో తెలంగాణ న్యాయమూర్తి ఇచ్చిన చుండూరు తీర్పుగానీ, ఇఫ్లూలో ఆదివాసీ, బడుగు వర్గాల ముగ్గురు విద్యార్థులను తెలంగాణ మహిళా వైస్ ఛాన్సలర్ రస్టికేట్ చేసిన తీరుగానీ, కిషన్‌బాగ్‌లో ముగ్గురు ముస్లిం యువకులను కాల్చివేసిన బిఎస్ఎఫ్ దాష్టీకంగానీ, జూన్ 2న ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం ముందు ప్రజాస్వామిక సవాళ్లను తీవ్రంగా నిలుపుతున్నాయి.

మావోయిస్టు ఎజెండాయే తన ఎజెండాగా ఉంటుందని 2004, 2009 ఎన్నికలలో మాత్రమే కాకుండా 2014 ఎన్నికల్లో చెప్పి అధికారానికి రాగలిగినంత మెజారిటీని సాధించుకున్న కెసిఆర్ ప్రభుత్వం ఈ సవాల్‌ను స్వీకరించవలసి ఉన్నది.

1992లో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ప్రభుత్వం, 95లో చంద్రబాబునాయుడు ప్రభుత్వం తిరిగి 2005 ఆగస్టు 17న వైఎస్ఆర్ ప్రభుత్వం మావోయిస్టు పార్టీ(2004 సెప్టెంబర్ 21కి ముందు పీపుల్స్‌వార్)పై ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్టు కింద పెట్టిన నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలి. పార్టీతో పాటు, రాడికల్ విద్యార్థి, యువజన సంఘాలు, సింగరేణి కార్మిక సమాఖ్య, రైతుకూలీ సంఘం మొదలైన ప్రజాసంఘాలపై పెట్టిన నిషేధాలను కూడా ఎత్తివేయాలి.

2010 జులై 9న రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్‌పై ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్టు కింద పెట్టిన నిషేధాన్ని ఎత్తివేయాలి. గంటి ప్రసాదం హత్యపై న్యాయవిచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలి. 1997 వరంగల్ ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ సదస్సు నిర్వహించిన నాటి నుంచి నేటి వరకు ఢిల్లీలోనూ, దేశ విదేశాల్లోనూ ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ కోసం మాట్లాడిన, పోరాడిన జిఎన్‌సాయిబాబాను వెంటనే

విడుదల చేయించడానికి తెలంగాణ ప్రభుత్వం పూనుకోవాలి.

బెల్లిలలిత నుంచి, ఐలన్న, నల్లావసంత్, సుదర్శన్, రవీందర్‌రెడ్డి, కనకాచారి, మునెప్పల వరకు రాజ్యహింసకు బలైన ప్రజాస్వామిక తెలంగాణ అమరుల హత్యలపై న్యాయవిచారణ జరిపి బాధ్యులను శిక్షించాలి. యాకూబ్‌రెడ్డిపై పోలీసుల చిత్రహింసలపై, 'సాగరహారం'లో పోలీసుల బాష్పవాయువు ఊపిరితిత్తులలోకి వెళ్లి అమరుడైన రాజిరెడ్డి హత్యపై న్యాయవిచారణ జరిపి బాధ్యులను శిక్షించాలి.

తెలంగాణ జనసభ కాలం నుంచి తెలంగాణ ప్రజాఫ్రంట్ కాలం దాకా 1969 విద్యార్థి దశ నుంచి 2013 డిసెంబర్ 24 వరకు ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ కోసం 45 సంవత్సరాలు పోరాడిన ఆకుల భూమయ్య అసహజ మరణంపై న్యాయవిచారణ జరిపి బాధ్యులను శిక్షించాలి.

మొదట విప్లవోద్యమంలో ఉండి లొంగిపోయి తెరాసలో చేరి నాయకత్వ స్థాయికి ఎదిగిన కోనపురి ఐలయ్య, రాములు హత్యలపై న్యాయవిచారణ జరిపి బాధ్యులను శిక్షించాలి. రాజ్యహింస ప్రేరేపిత మాఫియా హంతకులు లేని తెలంగాణకు హామీపడాలి.

తెలంగాణ ఉద్యమకాలంలో విద్యార్థులపైననే కాకుండా, ప్రజాసంఘాల కార్యకర్తలపై పెట్టిన కేసులు, యుఎపిఎ కింద పెట్టిన కేసులతో సహా ఉపసంహరించుకోవాలి. అప్రజాస్వామిక మైన యుఎపిఎను రద్దుచేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

ఆంక్షలు, నిషేధాలు, నిర్బంధాలు లేని తెలంగాణ అంటే లాకప్ మరణాలు, మిస్సింగు కేసులు, ఎన్‌కౌంటర్లు, అక్రమ అరెస్టులు, చిత్రహింసలు, రాజ్య ప్రేరేపిత మాఫియా దాడులు, హత్యలు, రాజ్యహింసలేని తెలంగాణ. ప్రజాస్వామిక తెలంగాణ అంటే అదే.



మరి జూన్ 14న ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశం హైదరాబాదు జూబ్లీహాల్‌లో జరుగుతుండగానే ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణం జరిగే ప్రాంతంలో ప్రకాశం-గుంటూరు జిల్లా సరిహద్దుల్లో, పారుట్లలో జరిగిన 'ఎన్‌కౌంటర్' ద్వారా చంద్రబాబు తెలంగాణకు ఏ సంకేతాలు ఇవ్వదలుచు కున్నాడు 'అలిపిరి దాడి'కి ప్రతీకారమా? అమరులైన ముగ్గురు ఆదివాసులు, దళితులు. వారిలో మహిళలిద్దరూ తెలంగాణ ప్రాంతం వాళ్లు. ముఖ్యమంత్రి కెసిఆర్ 2009లో ఎన్నికైన మహబూబ్‌నగర్ జిల్లా, ఇప్పుడు ఎన్నికైన మెదక్ జిల్లాకు చెందినవాళ్లు. మహబూబ్‌నగర్ అమ్రాబాద్‌కు చెందిన నాగమణి చెంచు మహిళ. మెదక్ జిల్లా దుబ్బాకకు చెందిన కవిత దళిత మహిళ.

తెలంగాణ ఉద్యోగులపై ఆంధ్ర ప్రాంతంలో వివక్ష, దాడి జరిగితే సహించలేకపోయిన మనం, బియాస్ నదిలో తెలంగాణ విద్యార్థుల దుర్మరణానికి తల్లడిల్లిన మనం, అసోంలో కిడ్నాప్ అయిన ఉద్యోగి క్షేమం కోసం నిరీక్షించిన మనం, ఇరాక్‌లో యుద్ధంలో చిక్కుకున్న తెలంగాణ ప్రజల యోగక్షేమాలు, ఏ హానీ లేకుండా తెలంగాణకు తిరిగి రప్పించుకోవాలని ఆకాంక్షిస్తున్న మనం, మరి పొరుగు రాష్ట్రంలో తెలంగాణ దళిత, ఆదివాసీ మహిళల 'ఎన్‌కౌంటర్' హత్యలపై స్పందించకపోతే ఎంత అమానవీయమవుతుంది. కనుక తెలంగాణ పునర్నిర్మాణంలో అసహజ మరణాలు ఏ రూపంలోనూ లేకపోవడమనేది ఒక ప్రజాస్వామిక విలువగా మనం పోరాడి సాధించుకోవాలి.

'తెలంగాణ పునర్నిర్మాణంపైన మనం శ్రద్ధ పెడుతూనే కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రజల మధ్య ఐక్యతకు కృషి చేయాలి. ఈ రాష్ట్రాల మధ్య వచ్చే ఏ విభేదాల్లనైనా ప్రజాస్వామిక పద్ధతులతో పరిష్కరించాలి. మనం ఈ విషయంలో వర్గ - ప్రజా అనుకూల నిర్ణయాలతో, ప్రజలను కూడగట్టాలి. మూడు ప్రాంతాల ప్రజలకు బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ బడా బూర్జువా, సామ్రాజ్య వాదులే ప్రధాన శత్రువులనీ, వీరికి వ్యతిరేకంగా ప్రజలంతా కలిసి ఉమ్మడిగా పోరాడాలని పిలుపునివ్వాలి. ఎక్కడైనా అభివృద్ధి అంటే అది అక్కడి మెజారిటీ శ్రమ జీవుల అభివృద్ధి, వారి జీవన పరిస్థితుల మెరుగుదల గాను, ప్రకృతి సహజ వనరులపై వారికి వాస్తవమైన హక్కులు కల్గి వుండడమనే విషయాలే వాస్తవమని, మెజారిటీ శ్రమ జీవులను కొల్లగొట్టి, ఆ ప్రాంతం వారికి

న్యాయంగా చెందాల్సిన సహజ వనరులను చేజిక్కించుకొని కోట్లకు పడగలెత్తే కొంత మంది అభివృద్ధి మాత్రమే కానీ, అందరి అభివృద్ధి కాదని మనం గట్టిగా చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రధానంగా హైదరాబాద్, విశాఖపట్నం లాంటి పట్టణాలను అభివృద్ధి చేస్తూ, ఇదే రాష్ట్ర అభివృద్ధిగా చూపించిన గత పాలకుల పాలసీలను వ్యతిరేకిస్తూ, ఈ రెండు రాష్ట్రాల్లో సర్వ సమగ్రమైన అభివృద్ధి కోసం మనం పోరాడాలి. అందుకు అన్ని ప్రాంతాల ప్రజలను కూడ గట్టాలి. అందుకు మనం గొప్ప రాజకీయ ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం వుంది. ఆ రకంగా మనం ప్రజలందరినీ ఐక్యం చేసి ఫాసిస్టు దోపిడీ పాలక వర్గాలను, వారి పార్టీలను, ప్రభుత్వాలను ఒంటరి చేసి రాబోయే కాలంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం కోసం ప్రజలందరినీ సమైక్యం చేయాలి. ఆ క్రమంలోనే ఒకే జాతికి చెందిన తెలుగు ప్రజలంతా నిజమైన ఐక్యతతో బలమైన పరస్పర విశ్వాసంతో ఒక్కటి కాగలుగుతారు.

' కోస్తాంధ్ర , రాయలసీమ పాలక వర్గాల దోపిడీకి, వివక్షకు వ్యతిరేకంగా గొప్ప ఆందోళనను చేపట్టి తెలంగాణ ప్రజలు సంపాదించుకున్న చైతన్యం, అనుభవం, ఐక్యత పునాదిపై ఆధారపడి తాము పునర్నిర్మాణం కోసం కృషి చేస్తూ, తెలంగాణ రాష్ట్రంలో దున్నేవారికే భూమి ప్రాతిపదికపై వ్యవసాయ విప్లవాన్ని పూర్తి చేసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయగలరనే విశ్వాసంతో ముందుకు సాగుదాం.

'నూతన తెలంగాణ రాష్ట్రంలో పునర్నిర్మాణంలో భాగంగా ఈ కనీస కార్యక్రమం అమలు చేయాలని పోరాడాలి.

1. హైదరాబాద్ ను ఉమ్మడి రాజధాని నుండి తొలగించాలి. తెలంగాణకు మాత్రమే రాజధానిగా ప్రకటించాలి. వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధానిని నిర్మించి యివ్వాలి. హైదరాబాద్ పై గవర్నర్ పరిపాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలి.
2. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలి. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడాన్ని వ్యతిరేకించాలి.
3. ప్రస్తుత హైకోర్టును ఉమ్మడి నుండి తొలగించి తెలంగాణ రాష్ట్రానికి యివ్వాలి. ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే నూతన హైకోర్టును మంజూరు చేయాలి.
4. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు విడి విడిగా పబ్లిక్ సర్వీసు కమీషన్లు ఏర్పాటు చేయాలి.
5. హైదరాబాద్‌తో సహా చుట్టు పక్కల కోస్తాంధ్ర, రాయలసీమ బడా పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు, రాజకీయ నాయకులు, పెద్ద కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు దురాక్రమించిన ప్రభుత్వ భూములను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంపిణి చేయాలి.
6. కృష్ణా, గోదావరి నదులపై జల నిర్వహణ మండళ్లను రద్దు చేయాలి. జల న్యాయ సూత్రాలను అమలు చేస్తూ నీటి పంపిణిలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత నివ్వాలి. చిన్న నీటి పారుదల వ్యవస్థను పటిష్టం చేయాలి. తాగు, సాగు నీటికి ప్రాధాన్యతను యివ్వాలి.
7. భూ సంస్కరణల చట్టాల్ని హేతుబద్ధంగా సవరించి సమగ్ర భూ సంస్కరణల విధానాన్ని రూపొందించి అమలు చేయాలి. కౌల్దారీ చట్టాన్ని అమలు చేయాలి. ప్రభుత్వ బంజరు భూములను, దేవదాయ, యినాం, తదితర భూములను భూమి లేని పేద రైతాంగానికి పంచాలి. ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామంటున్న ప్రతి దళిత కుటుంబానికే మూడు ఎకరాల భూమి , ఆ ఇంటి మహిళ పేరు మీద రిజిష్టర్ చేసినపుడు వనర్లు-అంటే నీళ్లు, విద్యుత్తు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాల కొరకు మాత్రమే ఎస్సీ నిధుల నుంచి డబ్బు ఇవ్వాలి గానీ భూమి కొనడానికి ఆ నిధులు ఖర్చుపెట్టకూడదా. ప్రభుత్వ లేదా దురాక్రమం జరిగిన భూములే తీసుకొని పంచాలి.
8. ప్రజలను నిర్వాసితులను చేస్తున్న పోలవరం, పులిచింతల, ఓపెన్‌కాస్ట్ గనులు, బయ్యారం గనులు, కవ్వాల్ టైగర్ ప్రాజెక్టు, ప్రత్యేక ఆర్థిక మండలాలను రద్దు చేయాలి. వీటికి సంబంధించి దళారీ నిరంకుశ బూర్జువాజీతో, బహుళజాతి సంస్థలతో చేసుకున్న ఎంఓయులన్నీ రద్దు చేయాలి. తెరాస ప్రభుత్వం టాటా కంపెనీ విమాన తయారీ పరిశ్రమ కోసం ఐదు వేల ఎకరాల భూమి కేటాయించడాన్ని వ్యతిరేకించాలి.
9. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెంచాలి. రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణి చేయాలి. గిట్టుబాటు ధరలు కల్పించాలి. విద్యుత్తు కోతలు ఎత్తివేయాలి. రుణాలు మాఫీ చేయాలి. వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. ఇందులో ఏ షరతులూ, మినహాయింపులూ వద్దా.
10. ప్రపంచబ్యాంకు నుండి ఇతర అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నుండి అప్పులు తెచ్చి చేసే అభివృద్ధి విధానాన్ని విడనాడాలి. ప్రత్యామ్నాయంగా తక్కువ పెట్టుబడులతో ఎక్కువ ఉపాధి అవకాశాలతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను స్థాపించాలి. రాష్ట్రంలో మూతపడిన సర్‌సిల్క్, ఆల్విన్ ఆటో యూనిట్, రిపబ్లిక్ ఫోర్జ్, ఆజాంజాహి మిల్లు, స్పిన్నింగ్ మిల్లుల వంటి అన్ని పరిశ్రమలను పునరుద్ధరించాలి. నిజాం చక్కర మిల్లును ప్రభుత్వ రంగంలో నడిపించాలి.
11. బాగా వెనకబడిన ప్రాంతాలకు, బాగా వెనుకబడిన ప్రజలకు మౌలిక అవసరాలు తీర్చే విధంగా అభివృద్ధి ప్రాధాన్యతలు వుండాలి.

12. తెలంగాణ ప్రాంతంలోని అన్ని వనరులను అన్ని జిల్లాలకు హేతుబద్ధంగా పంపిణి చేయాలి.

13. విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించాలి. విద్యారంగంలో ప్రైవేటీకరణను నిర్మూలించి, ప్రభుత్వ రంగంలోనే విద్య అందరికీ అందుబాటులోకి వచ్చేలా చూడాలి. కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలి. విద్యా యాజమాన్యాన్ని ఒకే గొడుగు కిందకు తేవాలి. నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించాలి. వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమలకు దోహదపడే విద్యను, శాస్త్రీయ విద్యను అందించాలి. విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి.

14. ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి.

15. తాత్కాలిక, తక్షణ ఉపాధి అవకాశాలకై ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి.

16. జనాభా ప్రాతిపదిక మీద అన్ని ప్రజా సముదాయాలకు విద్యా ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ల పునఃపంపిణి జరగాలి. తెలంగాణ ప్రాంతంలో విద్య, ఉద్యోగ అవకాశాలు స్థానికులకే దక్కాలి. ఎస్‌సి, ఎస్‌టి. లకు ఇచ్చే రిజర్వేషన్లను వివిధ కులాల, తెగల జనాభా ప్రాతిపదికన పునర్ వర్గీకరించాలి. మైనారిటీలకు రిజర్వేషన్లు, ప్రభుత్వ భూములు ఇవ్వాలి. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, కళలను ప్రోత్సహించాలి. ముస్లింలకు జనాభా ప్రాతిపదికపై కనీసం 12% రిజర్వేషన్లు అమలు చేయాలి. రాజేంద్రసచార్ కమీషన్ నివేదికను అమలు చేయాలి. జైళ్లలో ఐఎస్ఐ బ్యాకులను రద్దుచేయాలి.

17. అగ్రవర్ణ హిందూ బ్రాహ్మణీయ భావజాలాన్ని నిర్మూలించాలి. కుల వివక్షను, అంటరాని తనాన్ని రూపుమాపాలి. సాంఘిక అసమానతలను తొలగించాలి. దళితులపై అగ్రవర్ణాల దాడులను నిలువరించాలి.

18. దళితులకు మిగులు భూమి పంపిణి, రిజర్వేషన్స్‌లో ఎబిసిడి వర్గీకరణను అమలు చేసి వారి ఆత్మ గౌరవ పోరాటాలకు మద్దత్తు నివ్వాలి.

19. తెలంగాణలో తెలుగుతో పాటు ఉర్దూ భాషకు సమాన ప్రతిపత్తి కల్పించాలి. భాషా సాహిత్యాలకు తగిన గౌరవ ప్రతిపత్తిని కల్పించాలి. ఆదివాసీ తెగల్లోనూ జనాభా ప్రాతిపదికపై విద్యా, ఉద్యోగాల్లో వర్గీకరణ అమలుచేయాలి.

20. ఆదివాసులకు 6వ షెడ్యూల్ ప్రకారం అటానామి యిచ్చి జల్–జంగల్–జమీన్ పై అధికారాన్ని యివ్వాలి. 1/70, పెసా చట్టాలను అమలు చేయాలి.

21. సామ్రాజ్యవాద విష సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలి. మార్కెట్ సంస్కృతిని, వస్తు వినిమయ సంస్కృతిని, స్త్రీని సరుకుగా చూసే సంస్కృతిని రూపుమాపాలి.

22. మహిళలకు చట్ట సభల్లో, విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. మహిళలపై అత్యాచారాలు, దాడులు చేసిన వారిపై కఠిన శిక్షలు అమలు చేయాలి.

23. తెలంగాణ అమరుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలి.

24. రాష్ట్రంలో పౌర, ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరించాలి. బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపివేయాలి.

25. గ్రేహౌండ్స్ బలగాలను రద్దు చేయాలి.

26. సిపిఐ (మావోయిస్టు) పై నిషేధాన్ని ఎత్తివేయాలి. సిపిఐ (మావోయిస్టు)తో పాటు నిషేధించిన ఆరు ప్రజాసంఘాలపై నిషేధాన్ని ఎత్తివేయాలి. రెవల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్‌పై నిషేధాన్ని ఎత్తివేయాలి.

27. రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి. అమరులు శాకమూరి అప్పారావు, పటేల్ సుధాకర్‌రెడ్డి మొదలైన వారి నాయకత్వంలో జరిగిన చరిత్రాత్మక జైలు పోరాట ఒప్పందాల వెలుగలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జైళ్లలో సంస్కరణలు చేపట్టాలి. జీవిత ఖైదీలను అందుకనుగుణంగా విడుదల చేయాలి.

28. తెలంగాణ రాష్ట్రంలో చెరువుల మరమ్మతును చేపట్టాలి.

29. మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి. ఒక సబ్జెక్టుగా ఇంగ్లీషను తప్పనిసరి నేర్పించాలి.

30. కాంట్రాక్టు, పార్ట్‌టైం, టైంస్కేల్ ఉద్యోగులందరిని రిజర్వేషన్, రోస్టర్ పద్ధతి పాటిస్తూ పర్మినెంట్ చేయాలి.

31. ప్రజలు పోరాట ద్వారా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలి ఇవ్వాలి.

32. మద్యపానాన్ని నిషేదించాలి.

33. తెలంగాణ ప్రాంతంలో ప్రైవేట్ రాజ్యప్రేరిత హంతకముఠాల ఏర్పాటుకు కారణమైన అధికారులను, మంత్రులను శిక్షించాలి.

34. ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణ ఎబిసిడిలుగా జరగాలి.

35. బూటకపు ఎన్‌కౌంటర్‌లకు బాధ్యులైన పోలీసు అధికారులను శిక్షించాలి.

36. విద్యా రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30% నిధులు కేటాయించాలి.

37. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రజలపై, విద్యార్థులపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలి.

**23.6.2014** ❖

ప్రొ॥ అడప సత్యనారాయణ

# తెలంగాణ పునర్నిర్మాణం - చారిత్రక దృక్పథం

*తెలంగాణ రాష్ట్రసమితి ఆధ్వర్యంలో నూతన తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి పునర్నిర్మాణం గురించి పలు వ్యాఖ్యానాలు, ఎజెండాలు ముందుకొస్తున్నాయి. అగ్రకుల రాజ్యాధికార చట్రంలో పాలకులు తెలంగాణ పునర్నిర్మాణం కొరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ ఆశయాలను, ఆ ఉద్యమాలలో పాల్గొన్న అశేష ప్రజానీకం, ముఖ్యంగా దళిత, బహుజన వర్గాల కోరికలు, ఆకాంక్షలు నెరవేర్చవల్సిన నైతిక బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పునర్నిర్మాణ ఎజెండా ఎవరి ప్రయోజనాలను ప్రతిబింబిస్తుంది, కాపాడుతుంది అనేది ముఖ్యమైన అంశం. ఎందుకంటే సమకాలీన చరిత్రను పరిశీలించినట్లయితే తెలంగాణలో చెలరేగిన పలు ఉద్యమాలు తరచుగా అగ్రకుల వంచనకు, మోసాలకు గురైనాయి. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు జరిగిన పరిణామాల్ని పరిశీలించినట్లయితే రెండు పరస్పర విరుద్ధ ధోరణులు కన్పిస్తాయి. దళిత బహుజనుల త్యాగాలు, అగ్రకులాల విద్రోహం. తెరాస నాయకత్వంలో నిర్వహించబడిన ఉద్యమం, దాని ఆశయ సాధన, ఏర్పడిన ప్రభుత్వం అందుకు భిన్నంగా ఉంటుందో లేదో వేచి చూడాలి. తెరాస ప్రభుత్వ స్వరూప స్వభావాలు, తీరుతెన్నుల్ని అర్థం చేసుకోడానికి చారిత్రక విశ్లేషణ అవసరం.*

1946-51 సంవత్సరాల మధ్య సాగిన తెలంగాణ సాయుధ పోరాటం భారతదేశంలోని ప్రజా ఉద్యమాల కంటే విలక్షణమైంది. అదొక వినూత్నమైన ప్రజా ఉద్యమం, దాని ప్రత్యేకత ఏమంటే ఉద్యమాకారులు దుర్మార్గమైన నిజాం నిరంకుశత్వాన్ని, దొరల పెత్తందారీ వ్యవస్థను సమూలంగా పెకిలించివేశారు. ఆ ఉద్యమం ఆధిపత్యానికి, దుర్నీతికి, అన్యాయానికి వ్యతిరేకంగా జరిగింది. సాయుధ పోరాటం ఫ్యూడల్ దోపిడినీతికి వ్యతిరేకంగా, దొరల అన్యాయ పాలనకు, అధికారానికి వ్యతిరేకంగా, వారి సంస్కృతికి, సామాజిక, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా సాగింది. దొరల రాజ్యం స్థానంలో ప్రజారాజ్యాన్ని స్థాపించాలనే ఆకాంక్ష సాయుధ పోరాటాన్ని ప్రేరేపించింది. అయితే చివరి దశలో పోరాట కాలంలో ఏర్పడిన ప్రజా ఐక్యత, సంఘీభావం బలహీనపడినాయి. తత్ఫలితంగా అగ్రకుల సంపన్న రైతాంగ వర్గాలు గ్రామ కమిటీలపై పెత్తనం సాగించాయి. పోరాటాన్ని కొందరు తమకు అనుకూలంగా, తమ ప్రయోజనాలనే కాపాడే విధంగా మల్చుకున్నారు. ఉత్పత్తి కులాలకు, బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడే విధంగా భూపంపిణీ కార్యక్రమాన్ని హైజాక్ చేసి, పార్టీ నాయకత్వ స్థానాల్ని ఆక్రమించుకొని ఉద్యమ లక్ష్యాలను వమ్ముచేశారు. ఆ తర్వాత నెహ్రూ ప్రభుత్వ దమనకాండ ఫలితంగా ఫ్యూడల్ భూస్వామ్య వర్గాలు రోమిటోపిని వదిలివేసి, గాంధిటోపి పెట్టుకొని, కాంగ్రెస్ జెండా పట్టుకొని, అధికారాన్ని హస్తగతం చేసుకున్నాయి. సాయుధ పోరాటంలో వేలాది మంది త్యాగాల ఫలితం వారికి దక్కలేదు. ప్రజారాజ్య స్థాపన జరగలేదు. విద్రోహశక్తులు ఆధిపత్యాన్ని సంపాదించి, పాలకవర్గంగా రూపాంతరం చెందాయి.

సాయుధ పోరాట కాలం నాటి అగ్రకుల విద్రోహ చరిత్ర 1969 జై తెలంగాణ ఉద్యమంలోనూ పునరావృతమైంది. 1950 దశకంలో హైద్రాబాద్ రాష్ట్రం ఏర్పడి స్వంత అస్తిత్వాన్ని సంతరించుకొని, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల్ని పొందింది. అయితే అది ఎక్కువకాలం నిలువలేదు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ఫలితంగా 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ మోసగించబడి, రాజకీయ కుట్రలకు, కుతంత్రాలకు, సీమాంధ్ర పెట్టుబడిదార్ల దోపిడికి గురైంది. విద్య, ఉద్యోగం, ఉపాధి అనుకున్న స్థాయిలో తెలంగాణ ప్రజలకు దక్కలేదు. నీళ్లు, నిధులు, వనరులు మళ్లించబడ్డాయి. తెలంగాణ సంస్కృతి, భాష, యాస, ఆచార సంప్రదాయాలు అవహేళనకు, అవమానానికి గురైనాయి. తెలంగాణ ప్రజలు సీమాంధ్ర పెత్తందారీ పాలకవర్గాల అణచివేతకు, వివక్షకు, నిర్బంధానికి గురైనారు. తత్ఫలితంగా 1969లో జై తెలంగాణ ఉద్యమం వచ్చింది. దాంట్లో విద్యార్థులు, యువతీ యువకులు, ఉద్యోగస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. పోలీసు, పారామిలటరీ బలగాలు లాఠీలతో, తూటాలతో ఉద్యమం అత్యంత దారుణంగా అణచివేయబడ్డది. దానిలో దాదాపు 400 మంది విద్యార్థులు, యువజనులు బలయ్యారు. మరొక పక్క విద్యార్థుల బలిదానాలతో అగ్రకుల స్వార్థ రాజకీయ నాయకత్వం ఎన్నికలు, ఓట్లు, సీట్లతో తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంది. అగ్రకుల విద్రోహ శక్తులు ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను బొంద పెట్టినారు. మరొక్కసారి రాజకీయ నాయకుల, పార్టీల, చెన్నారెడ్డి లాంటి వ్యక్తుల ద్రోహంతో ప్రజా ఉద్యమం నీరుగారి పోయింది.

జై తెలంగాణ ఉద్యమం అణచివేయబడిన రెండు దశాబ్దాల తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రచారం చేయడంలో రాడికల్ ప్రజా సంఘాలు, విప్లవ పార్టీలు చొరవచూపినాయి. 1990 దశకంలో తెలంగాణ జనసభ, తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్, తెలంగాణ మహాసభ,

వరంగల్ డిక్లరేషన్‌లు తెలంగాణ ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించినాయి. ఈ సంఘాలు దళిత బహుజన రాజ్యస్థాపన, స్వాలంబన ఆర్థిక విధానాలు, పౌరహక్కుల సాధన, ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ నిర్మాణం లక్ష్యంగా ఉద్యమాల్ని నిర్మించాయి. అదే విధంగా తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటి, తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్, తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్‌లు సంఘటిత ప్రజా ఉద్యమాల ఆవశ్యకతను ముందుకు తెచ్చినాయి. మారోజు వీరన్న, బెల్లిలలిత, గద్దర్, ఆకుల భూమయ్యలు ఓట్లు, సీట్లకు ప్రత్యామ్నాయంగా బలమైన ప్రజా ఉద్యమాల నిర్మాణాన్ని చేపట్టినారు. సాంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా తెలంగాణ చర్చను ముందుకు తెచ్చి ప్రజాస్వామిక తెలంగాణ ఎజెండాను ప్రచారం చేసినారు. ఈ క్రమంలోనే లలిత, ఐలయ్య లాంటి కళాకారులు రవీందర్‌రెడ్డి, సుదర్శన్ లాంటి ఉద్యమకారులు రాజ్యహింసకు బలైనారు. తెలంగాణ ప్రాంతంలో సీమాంధ్ర పాలకులపై ఉధృతమౌతున్న వ్యతిరేకత, ప్రత్యేక రాష్ట్ర సాధన ఆకాంక్షను నిర్దిష్ట తాత్వికత, సిద్ధాంత, భావజాల ప్రాతిపదికపై ప్రచారం చేసి, కార్మిక, విద్యార్థి, ఉద్యోగ సంఘాలన్నీ ఏర్పాటుచేసిన ఘనత రాడికల్ పార్టీలదే అనడంలో సందేహం లేదు. 1990 దశకంలో విప్లవ పార్టీలు, రాడికల్ ప్రజాసంఘాలు నిర్మించిన ఉద్యమం, ఆ తర్వాత 2001లో కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితికి మంచి అవకాశాన్ని ఇచ్చింది. బూర్జువా రాజకీయ పార్టీలలోని అంతర్గత విభేదాలు వ్యక్తిగత ప్రయోజనాలు ఫలితంగా కేసిఆర్ రాజకీయ నిరాశ్రయుడైనాడు. 1990 దశకంలో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో పేద సమాజ సంఘాలు, గ్రూపులు, సమూహాలు ప్రత్యేక తెలంగాణ భావనను, సెంటిమెంట్‌ను ప్రచారం చేశాయి. దీన్ని అదనుగా తీసుకొని కెసిఆర్ ప్రత్యేక రాజకీయ పార్టీని ఏర్పరచి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించాడు. తెలంగాణ ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి సీమాంధ్ర నాయకత్వంపై వ్యతిరేకతను తనకు అనుకూలంగా మార్చుకొని తెరాస ఆధ్వరంలో ఉద్యమాన్ని వ్యాప్తిచేశాడు. ఎన్నికల్లో పాల్గొని అధికారాన్ని పంచుకున్నాడు. కెసిఆర్ చేపట్టిన ఆమరణ దీక్షతో ఉద్యమం మరింత ఉధృతమైంది. దాంట్లో ముఖ్యంగా ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటి విద్యార్థులు చురుకైన పాత్ర నిర్వహించారు. వాస్తవానికి ఉస్మానియా విద్యార్థుల మిలిటెంట్ పోరాటం తెలంగాణ ఉద్యమంలోనూ తన ఒరవడిని సృష్టించింది. విశ్వవిద్యాలయాలతో పాటు అనేక విద్యాసంస్థల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బంద్‌లు, ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించి ఉద్యమాన్ని సజీవంగా ఉంచినారు. ఆ తర్వాత వివిధ కులసంఘాలు, ప్రజాసంఘాల ఐక్యవేదికలు తెలంగాణ ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకొని పోయినాయి. అందువల్లనే మలిదశ తెలంగాణ ఉద్యమం బలోపేతమైంది. ఉద్యోగుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగరహారం ఉద్యమ పరిధిని విస్తృతం చేశాయి. విస్తృతస్థాయిలో చెలరేగిన తెలంగాణ ఉద్యమం కాంగ్రెస్ నాయకత్వాన్ని ప్రభావితం చేసి తెలంగాణ రాష్ట్ర అనుకూల నిర్ణయం తీసుకునేటట్లు చేసింది. ఈ క్రమంలో కెసిఆర్ సంప్రదింపులు, చర్చల ద్వారా రాష్ట్ర సాధనకు కృషిచేసినాడు. కాంగ్రెస్ పార్టీ, భారతీయ జనతాపార్టీల ఒప్పందం మేరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది.

చంద్రశేఖర్‌రావు స్థాపించిన రాజకీయ పార్టీకి, దాని ఆధ్వర్యంలో నిర్వహించబడిన తెలంగాణ ఉద్యమానికిగాని తాత్వికత, భావజాల, సిద్ధాంత ప్రాతిపదికలు లేవు. సిద్ధాంత రాద్ధాంతాలు లేని భౌగోళిక తెలంగాణా లక్ష్యం అని కేసిఆర్ పేర్కొన్నాడు. అంతేకాకుండా రక్తం బొట్టు చిందించకుండా శాంతియుత తెలంగాణ సాధిస్తానని ప్రకటించాడు. ఎన్నికలు, ఓట్లు, సీట్లు ఆధారంగా తెలంగాణ సాధిస్తానని కూడా చెప్పాడు. వాస్తవానికి భౌగోళిక తెలంగాణ అనే ముసుగులో అగ్రకుల ఆధిపత్యం కొనసాగించబడుతుంది. ఒకటిన్నర కులాల ఆధిపత్యంలో ఏర్పడిన భౌగోళిక తెలంగాణ రాష్ట్రం, తెరాస ప్రభుత్వ అగ్రకుల సామాజిక నేపథ్యం ఈ అంశాన్ని స్పష్టం చేస్తున్నాయి. అంతే కాకుండా ప్రస్తుతం తెలంగాణలో ఒక నూతన సామాజిక ప్రక్రియ మొదలైంది. అదేమంటే నక్సలైట్ ఉద్యమ భూస్వామ్య బాధితులకు తెరాస ఆశ్రయం కల్పించి వారి ప్రయోజనాల్ని కాపాడుతుంది. తెలంగాణ భూస్వాముల నడ్డి విరగ్గొట్టిన నక్సలైట్ ఉద్యమ ఫలితాల్ని అణగారిన కులాలు, వర్గాలు అనుభవించాయి. ఆ ఉద్యమ స్ఫూర్తితో 1980, 90 దశకాల్లో దళిత బహుజనవర్గాలు అస్తిత్వ, ఆత్మగౌరవ పోరాటాల్ని నిర్మించుకొని భూస్వామ్య పీడన నుంచి స్వేచ్ఛను పొందాయి. అధికారానికి దూరంగా నెట్టబడిన దళితులు, వెనుకబడిన కులాలు రాజకీయ, ఆర్థిక సాధికారతను సాధించి, ఆత్మగౌరవాన్ని పెంపొందించుకున్నారు. కెసిఆర్ నాయకత్వంలోని రాజకీయ పార్టీ తెలంగాణ అగ్రకుల నయా భూస్వామ్య వర్గాలకు, పెట్టుబడిదార్లకు కొమ్ముకాస్తుంది. తెరాస రాజకీయాల ఫలితంగా ప్రస్తుతం అగ్రకులాలు ఓట్లు, సీట్లు పొంది ఆధిపత్యాన్ని ఏర్పరచుకున్నాయి. 1950వ దశకంలో కాంగ్రెస్ జెండా పట్టుకొని భూస్వామ్య వర్గాలు గ్రామాలకు తరలిపోయి తమ ఆస్తుల్ని కాపాడుకున్నట్లు, నేడు గులాబీ కండువా కప్పుకొని ఆధిపత్య కులాల రాజకీయ నాయకులు అధికారాన్ని సాగిస్తున్నారు.

పైన పేర్కొన్న చారిత్రక, సామాజిక నేపథ్యంలో తెరాస ప్రభుత్వం చేపడుతున్న పునర్నిర్మాణం ఏ వర్గాల ఆశయాల్ని, ఆకాంక్షల్ని నెరవేరుస్తుంది? తెలంగాణ ఉద్యమంలో దళిత బహుజన వర్గాలు ఆశించిన స్వాలంబన, సాధికారతలను తెరాస ప్రభుత్వం నెరవేరుస్తుందా? అణగారినవర్గాలు ఆశించిన ప్రజాస్వామ్య తెలంగాణను తెరాస ప్రభుత్వం నిర్మిస్తుందా? సీమాంధ్ర పాలకుల పాలనా, ఆర్థిక విధానాల కంటే తెరాస ప్రభుత్వ విధానాలు భిన్నంగా ఉంటాయా? తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక విధానాలు ప్రపంచీకరణ విధానలకంటే భిన్నంగా ఉంటాయా? తెలంగాణ ఉద్యమంలో ప్రాథమికంగా బూర్జువా మధ్య తరగతి నాయకత్వంలో నిర్వహించబడింది. ఆ ఉద్యమ ఫలితంగా ఏర్పడిన ప్రభుత్వం వారి వర్గ ప్రయోజనాల్ని కాపాడుతుందనేది చారిత్రక వాస్తవం. ❖

# తెలంగాణ పునర్నిర్మాణంలో వ్యవసాయాభివృద్ధి

ప్రొ॥ కె.ఆర్.చౌదరి
వ్యవసాయ శాస్త్రవేత్త

*మెజారిటీ తెలంగాణ ప్రజల జీవితాలు వ్యవసాయ రంగంతో ముడిపడి వున్నాయి. వ్యవసాయం అభివృద్ధి అయితేనే తెలంగాణ ప్రజలు అభివృద్ధి అవుతారు. రాష్ట్రం కూడా ఆర్థికంగా నిలదొక్కు కుంటుంది. సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. అయితే తెలంగాణలో వ్యవసాయం తీవ్ర సంకట పరిస్థితిలో పడి పోయింది. రైతాంగం పంటలు సరిగా పండక, పండినా గిట్టుబాటు ధరలు రాక, ఆదాయాలు తగ్గి, వ్యవసాయ ఖర్చులు, ఇంటి ఖర్చులు పెరిగి, అప్పుల పాలై దిక్కుతోచక విలవిలలాడు తున్నారు. రుణ భారంతో కుంగిపోతున్నారు. పెట్టుబడులు పెట్టలేక వ్యవసాయాన్ని కొనసాగించడం దుర్భరమవుతోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు అవుతున్నప్పటికీ, రైతులు, ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతులు, వ్యవసాయకూలీలు, గ్రామీణ వృత్తికారులు, తదితర పేదవర్గాల ప్రజలు వలసలు పోతున్నారు. రైతాంగం జీవన పరిస్థితులు అధ్వాన్నంగా మారిపోయాయి. పంట నష్టం జరిగి, అప్పులు వడ్డీలు తడిసి మోపెడై, చేసిన అప్పులు తీర్చలేక రైతులు బలవన్మరణాల పాలయ్యారు. రైతుల ఆత్మహత్యల పరంపర నేటికీ కొనసాగుతూనే ఉంది. దేశంలోనే ఆత్మహత్యలు చేసుకునే రైతుల సంఖ్య తెలంగాణలోనే అధికంగా వుంది. రైతుల ఆత్మహత్యలు లేకుండా చేస్తామని చెప్పిన ప్రభుత్వాధినేతల మాటలు నీటి మూటలయ్యాయి.*

ఈ నేపథ్యంలో తెలంగాణలో వ్యవసాయాభివృద్ధికి అవరోధాలు, ఆటంకాలు, సవాళ్లు, సమస్యల్ని గురించి, వ్యవసాయాభివృద్ధికి గల అవకాశాలు, అనుకూల అంశాలను గురించీ, వ్యవసాయాభివృద్ధికి రూపొందించాల్సిన విధి విధానాలు, కార్యక్రమాలను గురించీ విశ్లేషించుకోవడం అవసరం.

**1.వ్యవసాయాభివృద్ధికి అవరోధాలు:**

**ఎ. భూమికి సంబంధించిన అంశం**

ఉత్పత్తి సాధనాల్లో భూమి ప్రధానమైనది. భూమిలేనిదే వ్యవసాయమే లేదు. భూమిపై ఆధారపడిన రైతుకు ఆహారంతో పాటు ఆదాయం కూడా భూమి ఇస్తోంది. జీవనోపాధి, జీవన భద్రత కల్పిస్తోంది. పేదరికం తొలగాలంటే భూమి పేదలకు దక్కాలి. భూమి వారికి రక్షణ కవచంగా ఉంటుంది. అభయమిస్తోంది. సమాజంలో ఒక గౌరవ ప్రదమైన స్థాయిని, స్థానాన్ని కల్పిస్తోంది. ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెరుగుతుంది. ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధి కూడా భూమిపై ఆధారపడి ఉంటుంది. పేద ప్రజల అభివృద్ధి జరగాలంటే వారికి సామాజిక న్యాయం అందుబాటులోకి రావాలంటే, వారికి భూమిపై హక్కు ఉండాలి. యాజమాన్యం ఉండాలి. అధికారం ఉండాలి.

అయితే తెలంగాణలో భూమిపైన పెత్తనం ఎవరిది? ఎవరి అధీనంలో భూమి ఉంది? ఎన్ని భూసంస్కరణలు చేసినామని బుకాయించినా ఎన్ని ఉద్యమాలు చేసినా, ఇప్పటికీ అత్యధిక భాగం వ్యవసాయ భూమి భూస్వాములు, ధనిక రైతాంగం చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. భూవసతి గల గ్రామీణ కుటుంబాల్లో 10 శాతం కుటుంబాలకు 60% భూమి, మిగతా 90 శాతం కుటుంబాలకు 40 శాతం భూమి ఉన్నది. భూమిపై గల హక్కులో అసమానత్వాన్ని ఈ వివరాలు తేటతెల్లం చేస్తున్నాయి. మొత్తం గ్రామీణ కుటుంబాల్లో 42 శాతం కుటుంబాల వారికి వ్యవసాయ భూమి లేదు. సాధారణంగా భూస్వాములు, ధనిక రైతులు, దొరలు, పటేళ్ల కులాలకు చెందినవారే. మధ్యతరగతి రైతుల్లో మాత్రమే వెనుకబడిన కులాలవారున్నారు. ఇటీవలి కాలంలో వీరు భూములు కొనుక్కున్నారు. ధనిక రైతులు కొంతమంది భూములు అమ్ముకొని వ్యాపారాల్లోకి వెళ్లారు. అయితే చాలామంది ధనిక రైతులు భూమిని అట్టిపెట్టుకొని వ్యవసాయం చేస్తూ, వ్యాపారాలు కూడా చేసుకొంటున్నారు. వ్యవసాయ ఉత్పాదకాల వ్యాపారం, రియల్ ఎస్టేట్, హోటళ్లు మొదలైన వ్యాపారాలు చేసుకొంటున్నారు. భూమి లేని నిరుపేద రైతులు, తదితర ప్రజలు దళిత, ఆదివాసీ, మైనార్టీ వర్గాలకు చెందినవారు. వీరి చేతిలో భూమి నామమాత్రంగా ఉంది. అగ్రకుల వర్గాల వారు భూమిపై గుత్తాధిపత్యం కలిగి ఉండి, పేద ప్రజలపై పెత్తనం చలాయిస్తున్నారు. అణచివేతలకు, శ్రమ, తదితర రకాల దోపిడీకి గురిచేస్తున్నారు. పేద ప్రజలపైన దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ తెలంగాణ పల్లెల్లో ఫ్యూడల్ (భూస్వామ్య) సెమీ-ఫ్యూడల్(అర్ధభూస్వామ్య) వ్యవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. ఫ్యూడల్ భావజాలం, సంస్కృతి పల్లెల్లో రాజ్యమేలుతున్నాయి. అయితే 'నీ బాంచను దొరా, నీ కాల్మొక్తా దొరా' అనే బానిసత్వం నుంచి తెలంగాణ ప్రజలు బయటపడ్డట్లు కనిపిస్తోంది. ఈ మార్పుకు సమరశీల ఉద్యమాలు ఎంతగానో తోడ్పడినాయి. అయితే, ఈ ఉద్యమాలు, పోరాటాలు భూసంస్కరణల్ని అమలు చేయించలేకపోయాయి. 1940 దశకంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, తర్వాత కాలంలో వచ్చిన జగిత్యాల రైతాంగ పోరాటాలు, సిరిసిల్లా రైతాంగ పోరాటాలు, గోదావరి లోయ

ప్రజాప్రతిఘటన పోరాటాలు, నక్సల్‌బరీ విప్లవ పార్టీల పోరాటాలు పాక్షిక విజయాల్నే సాధించాయి. ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు వచ్చిన మాట వాస్తవం.

ఏది ఏమైనప్పటికీ, భూ సమస్య చాలా కీలకంగా, ప్రధానంగా తెలంగాణలో కొనసాగుతోంది. భూమి లేని నిరుపేద రైతులు అత్యధిక సంఖ్యలో వున్నారు. ఇదే వ్యవసాయాభివృద్ధికి గొప్ప అవరోధం. దున్నేవానికి భూమి ఇవ్వడం తెలంగాణలో వ్యవసాయాభివృద్ధికి అత్యవసరం. అర్ధ భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించి, రైతాంగ వ్యవసాయాన్ని రక్షించినప్పుడే తెలంగాణలో వ్యవసాయాభివృద్ధి సాధ్యపడుతుంది.



## బి. ప్రోత్సాహం లేని మెట్ట, సన్న, చిన్నకారుల, కౌలు రైతుల వ్యవసాయం:

### 1) మెట్ట వ్యవసాయం

తెలంగాణ వ్యవసాయంలో నాలుగింట మూడొంతులు మెట్ట వ్యవసాయమే లేదా వర్షాధార వ్యవసాయమే. అనావృష్టి, అకాల వర్షాలు పంటలను దెబ్బతీస్తాయి. వరుస కరువులు సర్వసాధారణం. నేలల్లో భూసారం తగ్గిపోయింది. తేమను నిలుపుకునే సామర్థ్యం తక్కువగా ఉంది. మెట్ట సేద్యానికి వనరుల కొరత అధికంగా ఉంది. పైగా, ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టవచ్చినట్లు ఉంది. మెట్ట రైతులు పేదవారు. సాగునీటి వసతిగల రైతులు ధనికరైతులు, మధ్యతరగతి రైతుల పట్ల ప్రభుత్వం వర్గ వివక్షత చూపుతోందని మెట్ట రైతులు వాపోతున్నారు. వారికి నమ్మకమైన సాంకేతిక విజ్ఞానం రూపొందించలేదు. మెట్టను తట్టుకునే పైర్ల రకాల్ని రోగాలు, పురుగుల్ని తట్టుకునే రకాల్ని కూడా రూపొందించలేదు. మెట్ట సేద్యంలో దిగుబడులు అత్యల్పంగా ఉన్నాయి. అనిశ్చితంగా ఉన్నాయి. అస్థిరంగా ఉన్నాయి. పెట్టుబడుల కొరకు వడ్డీ వ్యాపారులు ఇచ్చే అప్పులపైన ఆధారపడుతున్నారు. ఈ సమస్యలన్నీ మెట్ట వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్నాయి. మెట్ట రైతులు నష్టపోతున్నారు. మెట్ట వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు తీరితేనే, తెలంగాణలో వ్యవసాయాభివృద్ధి జరుగుతుంది.

### 2) సన్న, చిన్నకారు రైతుల సేద్యం

తెలంగాణలో 87 శాతం రైతులు సన్న, చిన్నకారు రైతులే. వీరి వ్యవసాయం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. వీరి కమతాల పరిమాణం చాలా చిన్నది. చాలా మట్టుకు నీటి వసతి లేని వర్షాధార సేద్యమే. వనరుల కొరత ఎక్కువగా ఉంది. వీరికి సాగునీరే కాదు, వ్యవసాయ పనిముట్లు, సేద్యానికి అవసరమైన పశువులు మొదలైనవి కూడా తక్కువ స్థాయిలో ఉన్నాయి. వీరికి ఆర్థిక స్థోమత లేదు. అందువల్ల పెట్టుబడులు పెట్టలేదు. వీరికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందడం లేదు. మౌలిక సదుపాయాలు లేవు. మార్కెటింగ్ సమస్యలతో బాధ పడుతున్నారు. వీరికి అవసరమైన ఉత్పాదకాలు అందటం లేదు. సంస్థాగత రుణాలు అతికొద్ది మందికే అందుతున్నాయి. 65 శాతం రుణాలు సన్న, చిన్నకారు రైతులకు ఇవ్వాలనే నిబంధనకు బ్యాంకులు, సహకార సంఘాలు తిలోదకాలు ఇచ్చాయి. ధనిక రైతులే ఈ రుణాల్ని పొందగలుగుతున్నారు. సన్న, చిన్నకారు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందడం లేదు. వీరి వ్యవసాయం నష్టాలతో నడుస్తోంది. వీరు ఎదుర్కొంటున్న సమస్యలే తెలంగాణలో వ్యవసాయాభివృద్ధికి తీవ్ర అవరోధంగా ఉన్నాయి.

### 3) కౌలు వ్యవసాయం

తెలంగాణ ప్రాంతానికి సంబంధించి 1950లో ప్రభుత్వం ఒక చట్టం చేసింది. ఈ చట్టంలో కౌలుదారుని భూమి నుండి తొలగించడానికి వీల్లేకుండా ఆంక్షలున్నాయి. రక్షిత కౌలుదారునికే భూమిని కొనే హక్కును కల్పించారు. సెక్షన్ 38 'ఇ' ప్రకారం ఆరేళ్లకు పైగా కౌలుదారుడుగా ఉన్న రక్షిత కౌలుదారుని, ఆ భూమికి యజమానిగా ప్రభుత్వం ప్రకటించవచ్చు. భూమి శిస్తుకు 3 లేదా 5 రెట్లుగా కౌలురేట్లను ప్రభుత్వం నిర్ణయించింది. ఇవేవీ ఆచరణలో లేవు. కౌలుదారుడు దోపిడీకి గురవుతున్నాడు.

కౌలు రైతుకు సంస్థాగత రుణాలు అందటం లేదు. తెలంగాణలో ఒక్క శాతం కౌలురైతులు కూడా సంస్థాగత రుణాలు పొందలేక, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుంచి రుణాలు తీసుకొని, వారి దోపిడీకి గురవుతున్నారు. ఇతర రైతుల మాదిరిగా ఏ సబ్సిడీలు వీరు పొందడం లేదు. వీరికి పంటల బీమాలేదు. వ్యవసాయపు ఖర్చులు పెరిగి పోయాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఖర్చులు కూడా పంటల దిగుబడుల ద్వారా రావటంలేదు. ఉత్పత్తి ఖర్చులకు అదనంగా కౌలు రైతులు ఎకరాకు 10 వేల నుంచి 15 వేల వరకు కౌలును భూ కామందుకు చెల్లించాలి. కౌలు సేద్యానికి సంబంధించిన సమస్యలు వ్యవసాయాభివృద్ధికి పెద్ద సవాళ్లుగా మారాయి.

### 4. సాగునీరు

తెలంగాణ వ్యవసాయాభివృద్ధిని తీవ్రంగా దెబ్బతీసే సమస్య సాగునీటికి సంబంధించినది. తెలంగాణ వ్యవసాయం భారీ స్థాయిలో

బోరుబావుల మీద ఆధారపడి ఉంది. 1956–57లో 40 శాతంగా ఉన్న బోరుబావుల కింది సాగునీరు 2007–08లో 57 శాతానికి పెరిగింది. బోరుబావుల కింది సేద్యం ఒక విషాదం. బావుల్లో నీళ్లుండవు. భూగర్భ జలాలు అడుగంటాయి. సాగునీటి కొరత వల్ల పంటలు ఎండిపోవటం సర్వసాధారణం. పైగా కరెంట్ కటకటలు. ఎంతో ఖర్చుపెట్టి పంటలు సాగుచేస్తే బోరుబావుల నీరు చాలక, కరెంట్ సరఫరాలో ఇబ్బందుల వల్ల, పంటనష్టం వచ్చింది. వ్యవసాయోత్పత్తి పడిపోతోంది. తెలంగాణలో బోర్ల కింద చేసే వ్యవసాయం రైతాంగానికి ఉరితాడుగా మారింది. పైగా బోరుబావుల్ని తవ్వడానికి ఒక్కో దానికి 35 వేల నుంచి 90 వేల దాకా ఖర్చు అవుతుంది. అదనంగా పంపుసెట్‌కు మరో 20 వేలు ఖర్చవుతుంది. అప్పుల ద్వారా రైతు ఈ మొత్తాన్ని సమకూర్చు కుంటున్నారు. తెలంగాణలో సగటున 59 శాతం బోర్లు విఫల మవుతున్నాయి. బోర్ల తవ్వకం కోసం, వాటిని మరింత లోతు చేయటం కోసం చేసిన అప్పుల్ని తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

తెలంగాణ వ్యవసాయానికి ఆయువుపట్టు చెరువులు. వేలాదిగా వున్న గొలుసు చెరువులు అధ్వాన్న పరిస్థితిలో ఉన్నాయి. చెరువులు పూడిపోయాయి. తెగిపోయాయి. చెరువుల్లో నీటిని నిల్వచేసుకునే సామర్థ్యం తగ్గిపోయింది. ఫీడర్ ఛానల్స్ నామరూపాల్లేకుండా పోయాయి. చెరువులు నిండడమే గగనమౌతోంది. చెరవు నిండకపోయినా, వర్షాల ద్వారా చెరువులు నిండవచ్చనే ఆశతో పంట పెట్టిన రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. 1956–57లో 45 శాతంగా ఉన్న చెరువు నీటి సాగు 2007–08 నాటికి 28 శాతానికి పడిపోయింది. తెలంగాణలో వ్యవసాయాభివృద్ధి చెరువులతో ముడిపడి ఉంది.

తెలంగాణలో సాగునీటి విషయంలో గత ప్రభుత్వాలు ఉదాసీనంగా, నిర్లక్ష్యంగా, తీవ్ర వివక్షతతో వ్యవహరించాయి. తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులు కొన్నే. ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తిచేయలేదు. ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. అరకొరగా నిధులు విడుదల చేశారు. జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చింది గత ప్రభుత్వం. గత నలభై ఏళ్లలో తెలంగాణలో కాలువల ద్వారా పొందే సాగునీరు 9 శాతం నుండి కేవలం 14 శాతానికి పెరిగింది.

తెలంగాణ ప్రాజెక్టులకు నికర జలాలు దక్కుతాయనే నమ్మకం లేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు ఎనలేని నష్టాల్ని చేకూర్చుతుంది. ఈ తీర్పును మార్పించాల్సిన అవసరం ఉంది. కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయకపోతే, తెలంగాణ వ్యవసాయాన్ని ఇది తీవ్రంగా దెబ్బతీస్తుంది.

**5. పంటనష్టాలు:**

తెలంగాణలో పంటల నష్టాలు 60 నుంచి 100 శాతం వరకు ఉన్నట్లు అనేక నివేదికలు తెలుపుతున్నాయి. రైతాంగాన్ని ఇది ఆర్థికంగా దివాళా తీయిస్తోంది. అప్పులపాలు చేస్తోంది. ఆత్మహత్యలకు ఊతమిస్తోంది. కరువులు, సాగునీరు లేకపోవటం, రోగాలు, పురుగుల దాడి, నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, అతివృష్టి, అకాల వర్షాలు, అనావృష్టి మొదలైన కారణాలు పంటలను నష్టపరుస్తున్నాయి.

**6.రైతాంగ రుణభారం:**

తెలంగాణలో అప్పులు లేని రైతులు అరుదు. 80 శాతం వరకు అప్పుల ఊబిలో కూరుకొని పోయారని నివేదికలు తెలుపుతున్నాయి. ఈ ఊబిలో నుంచి రైతులు బయట పడలేకపోతున్నారు. అన్నిరకాల పంటలు పండించే రైతులు రుణభారంతో కుంగిపోతున్నారు. కానీ, ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ స్థాయిలో ఉంటూ, 'రిస్క్' కూడా అధికంగా ఉండే వాణిజ్య పంటలు(ముఖ్యంగా పత్తి లాంటివి) పండించే రైతులే అధికంగా రుణ బాధితులుగా ఉన్నారు. అన్ని వర్గాల రైతులు, ముఖ్యంగా సన్న, చిన్నకారు, కౌలు రైతులే అప్పుల బారిన పడివున్నారు. వెనుకబడిన, దళితులు, ఆదివాసీల వర్గాలకు చెందిన రైతులకే రుణాలు ఎక్కువగా ఉన్నాయి. వీరికి వనరులు, ఆర్థిక స్థోమత లేకపోవటం ప్రధానంగా కనబడుతోంది. వీరు అత్యధికంగా ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల మీదే ఆధారపడుతున్నారు. వడ్డీ 24 నుంచి 48 శాతం వరకు ఉంది. వడ్డీ వ్యాపారుల దోపిడీకి గురవుతున్నారు. వీరు పండించిన పంటల ధరలు ఏ మాత్రం న్యాయంగా ఉండడం లేదు. ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. కల్తీ, నకిలీ విత్తనాలు, పురుగు మందులు పంట దిగుబడులను తగ్గిస్తున్నాయి. పంట నష్టం అనివార్యంగా ఉంది.



ఉత్పాదకత తక్కువ స్థాయిలో ఉంది. సాగునీరు లేక, కరెంట్ సరిగా రాక పంటలు ఎండిపోతున్నాయి. వ్యవసాయ మార్కెటింగ్ మొత్తం ప్రైవేట్ రంగంలో ఉంది. దళారులు యధేచ్ఛగా, నిరాటంకంగా రైతుల్ని దోపిడీ చేస్తున్నారు. మార్కెట్ కమిటీలు ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయి. అధికారులు, దళారులతో వ్యాపారస్థులతో కుమ్మక్కై రైతుల్ని మోసం, దగా, దోపిడీలకు గురిచేస్తున్నారు. ఈ కారణాల చేత రైతుల రుణాలు పేరుకొని పోతున్నాయి. రుణభారం చేత రైతులు పెట్టుబడి పెట్టి వ్యవసాయం కొనసాగించలేరు.

తెలంగాణలో వ్యవసాయానికి సంస్థాగత రుణాల్ని గురించి విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో ప్రాథమిక సహకార పరపతి సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు పనిచేయడం దాదాపు మృగ్యం. ఈ సంస్థల్ని రాజకీయ నాయకులు, గ్రామ పెత్తందారులు, ప్రభుత్వం భ్రష్టు పట్టించాయి. గ్రామస్థాయిలో సహకార సంఘాలు రుణ సౌకర్యం కల్పించకపోవడం వల్ల వ్యవసాయాభివృద్ధి కుంటుపడుతుంది. ముఖ్యంగా, పేద రైతాంగం దెబ్బతింటుంది.

బ్యాంకులు వ్యవసాయం పేరిట వ్యవసాయ వాణిజ్యానికి, వ్యవసాయ పరిశ్రమలకు, హైటెక్ వ్యవసాయానికి అప్పు లిస్తున్నాయి. రైతులకు మొండిచేయి చూపిస్తున్నాయి. 65 శాతం రుణాలు సన్న, చిన్నకారు రైతులకు ఇవ్వాలనే నిబంధనను బ్యాంకులు తుంగలో తొక్కాయి. 15 శాతం దళితులకు, 6 శాతం ఆదివాసీ రైతులకు రుణాలివ్వాలనే నిబంధనకు కూడా తిలోదకాలు ఇచ్చాయి. ఒక లక్ష రూపాయల వరకు ఏ గ్యారెంటీ, సెక్యూరిటీ లేకుండా రైతులకు, కౌలు రైతులకు సహ రైతులకు అప్పులివ్వాలనే నియమాన్ని రిజర్వు బ్యాంకులు ఖాతరు చేయడం లేదు. అందువల్ల, రైతులు వడ్డీ వ్యాపారులు, డీలర్లు మొదలైన వారి నుంచి భారీ వడ్డీ రేట్లతో అప్పు తీసుకొంటున్నారు. అప్పు పుట్టకపోతే వ్యవసాయాన్ని రైతులు కొనసాగించలేరు. వ్యవసాయానికి రుణాలందకపోతే అదే పెద్ద సమస్య అవుతుంది.

**7. ఉత్పాదకాల సరఫరా:**

హరిత విప్లవానికి పూర్వం రైతులు తమ విత్తనాలను తామే తయారు చేసుకునేవారు. సేంద్రియ ఎరువుల్ని, పురుగు మందుల్ని వాడేవారు. ఉత్పాదకాల కోసం మార్కెట్‌పై ఆధారపడేవారు కాదు. ఉత్పత్తి ఖర్చులు తక్కువగా ఉండేవి. మేలైన ఈ సంప్రదాయ పద్ధతులు మారిపోయాయి. రైతులు ఉత్పాదకాల కోసం మార్కెట్‌పై ఆధారపడాల్సి వచ్చింది. ఉత్పాదకాల ధరలన్నీ పెరిగిపోయాయి. ప్రైవేట్ వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై రైతులు ఆధారపడుతున్నారు. పైగా వీరు సరఫరా చేసే ఉత్పాదకాలు నాణ్యమైనవి కానందువల్ల రైతు నష్టపోతున్నాడు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికిస్తున్న సబ్సిడీలు అత్యంత దిగువస్థాయిలో ఉన్నాయి. పెరిగిన ధరలు, కల్తీ, నకిలీ ఉత్పాదకాలు రైతుల్ని కలవరపరుస్తున్నాయి. ఇదే ఒక పెద్ద సమస్యగా పరిణమించింది.

**8. మార్కెటింగ్ సమస్యలు:**

తెలంగాణలో మార్కెట్ యార్డులకు రైతులు తమ ఉత్పత్తుల్ని తెస్తున్నారు. మార్కెట్ యార్డుల్లో సౌకర్యాలు అధ్వాన్నంగా ఉన్నాయి. నిల్వ చేసుకోడానికి వసతి లేదు. వర్షాలు వస్తే ఉత్పత్తులు తడిసి ముద్దయి పోతున్నాయి. రంగుమారి పోతున్నాయి. గింజలకు మొలకలు వస్తున్నాయి. కనీసం ఉత్పత్తులను వర్షం నుంచి కాపాడ్డానికి కప్పడాలు లేవు. వర్షపు నీటిలో ఉత్పత్తులు కొట్టుకొని పోతున్నాయి. రైతులు గుండెలు బాదుకుంటున్నారు. వాటిని కొనే నాథుడే లేడు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటోంది. మార్కెట్ యార్డుల్లో నిబంధనల్ని పాటించడం లేదు. అక్రమ పద్ధతులు కొనసాగుతున్నాయి. దళారులు మార్కెట్ యార్డుల్లో రాజ్యమేలుతున్నారు. వారి దోపిడీకి అంతమేలేదు. దోపిడీ మార్కెటింగ్ వ్యవస్థలో వ్యాపారస్థులు సిండికేట్‌గా ఏర్పడి ధరల్ని శాసిస్తున్నారు. కనీస మద్దతు ధర కూడా రైతుకు దొరకడం లేదు. ఇక, ఏ విధంగా రైతు బాగుపడుతాడు? వ్యవసాయం ఎలా అభివృద్ధి అవుతుంది?

**9. లాభసాటి కాని ధరలు:**

వ్యవసాయాభివృద్ధికి లాభసాటి ధరలు అత్యంత అవసరం. ఎన్నో కష్ట, నష్టాలకోర్చి, పెట్టుబడులు పెట్టి, పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోతే, రైతుల బాధ వర్ణనాతీతం. నష్టాలతో కూడుకొన్న వ్యవసాయాన్ని రైతులు కొనసాగించలేరు.

ధరల విషయంలో ప్రభుత్వం రైతాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. మిల్లర్లు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్థుల కొమ్ముకాస్తూ, ప్రభుత్వం రైతాంగానికి అన్యాయం చేస్తోంది. కనీస మద్దతు ధర నిర్ణయించడంలో రైతాంగ ప్రయోజనాల్ని కాలరాస్తోంది. ఆ నిర్ణయించిన కనీస మద్దతు ధరలు కూడా రైతాంగానికి అందడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలయిన భారత ఆహార సంస్థ, కాటన్ కార్పొరేషన్(మొదలైనవి) రైతుల ఉత్పత్తులను అతి తక్కువ మోతాదులో కొంటున్నందువల్ల, రైతులకు మద్దతు ధర కూడా దొరకడం లేదు. వ్యవసాయ ధరలు లాభసాటిగా లేకపోతే, వ్యవసాయాభివృద్ధి జరగదు.

**10. రైతాంగ సంక్షేమం:**

విద్యా, వైద్య సౌకర్యాలను ప్రభుత్వంలోనే కల్పించాలి. నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలి. ప్రైవేటు విద్య, వైద్య సౌకర్యాలు పేద రైతులు పొందడం కష్టం. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వీటిని కోల్పోతున్నారు.

## సి. తెలంగాణలో వ్యవసాయాభివృద్ధికి అనుకూల అంశాలు

**1. సాగుకు భూమి లభ్యత:**

తెలంగాణలో సాగుకు పనికొచ్చే రకరకాలుగా విభజించిన భూమి, ముఖ్యంగా పడావుగా భూమి సుమారు 60-70 లక్షల ఎకరాలుంటుందని అంచనా. భూ సంస్కరణల్ని సమర్థవంతంగా అమలుచేస్తే, అదనంగా సాగు భూమి లభ్యమవుతుంది.

అన్యాక్రాంతమైన భూముల్ని తిరిగి తీసుకొని, పేద రైతాంగానికి పంచితే మరింతగా కలిసి వస్తుంది. 15-20 లక్షల నిరుపేద భూమి లేని కుటుంబాలకు భూమిని అందించే అవకాశం ఉంది.

**2. నేలలు:**

వ్యవసాయానికి బాగా పనికివచ్చే రకరకాల నేలలున్నాయి. అనేక రకాల పంటలు పండించడానికి ఈ భూములు అనువుగా ఉంటాయి.

**3. వాతావరణ పరిస్థితులు:**

తెలంగాణలో వర్షపాతం దాదాపు 1000మి.మీ. ఉంది. ఉష్ణోగ్రతలు అనుకూలంగా ఉన్నాయి. సంవత్సరం పొడవునా సూర్యరశ్మి ఉంటోంది. రాష్ట్రంలో ఏ పంటలయినా పెట్టుకోవచ్చు.

**4. మిశ్రమసేద్యం:**

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను కూడా అభివృద్ధి చేసుకోవడానికి అనుకూల పరిస్థితులున్నాయి. రైతులు పాల ఉత్పత్తిని, కోళ్లు, గొర్రెలు, మేకలు మొదలైన వాటి ఉత్పత్తిని లాభసాటిగా చేపట్టవచ్చు.

**5. విత్తన సరఫరా:**

తెలంగాణ భారత దేశానికి విత్తన రాజధానిగా చెప్పుకోవచ్చు. విత్తనోత్పత్తికి తెలంగాణలో ప్రత్యేక అనుకూలతలు ఉన్నాయి. వ్యవసాయాభివృద్ధిలో విత్తనోత్పత్తికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

**6. మార్కెటింగ్ వ్యవస్థ:**

మార్కెట్ యార్డులను అభివృద్ధి చేస్తే వ్యవసాయాభివృద్ధి తప్పక జరుగుతుంది.

**7. వ్యవసాయ పరిశోధన:**

తెలంగాణలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల్లో రూపొందించిన నూతన సాంకేతిక విజ్ఞానం రైతాంగానికి ఉపయోగపడి, వ్యవసాయా భివృద్ధికి దోహదపడుతుంది.

**డి. వ్యవసాయాభివృద్ధికి అవసరమైన విధివిధానాలు:**

సుస్థిరత, స్వావలంబన, ఆహార భద్రత, జీవన భద్రత లక్ష్యాలుగా, ప్రజాస్వామ్యం, సమానత్వం పునాదిగా వ్యవసాయ విధానం రూపొందాలి. వ్యవసాయాభివృద్ధిని అధిక ఉత్పాదకత, ఉత్పత్తుల ద్వారా సాధిస్తూ, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. ప్రతి రైతు కుటుంబానికి కనీస ఆదాయాన్ని పొందేటట్లుగా ఏర్పాటు చేసి, గౌరవమైన జీవనం గడపడానికి అవకాశం కల్పించాలి. కొన్ని విధానాలు, సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**1. భూ సంబంధాలు:**

అర్ధభూస్వామ్య వ్యవస్థను అంతమొందించాలి. ప్రభుత్వ భూములు, పడావుగా పడి ఉన్న భూముల్ని నిరుపేద ప్రజలకు పంపిణీ చేయడానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి. అన్యా క్రాంతమైన భూముల్ని వశపరుచుకొని తక్షణమే పంచాలి.



హైదరాబాద్ నగరం చుట్టూ(రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో) కబ్జాలకు గురైన భూముల్ని గుర్తించి వశపరుచుకోవాలి. పేద ప్రజలకు అనుకూలమైన భూసంస్కరణ చట్టాల్ని చేయాలి. ఉన్న చట్టాల్ని కచ్చితంగా అమలుచేయాలి. భూమిలేని ప్రతి కుటుంబానికి కనీసం రెండున్నర ఎకరాల భూమి దక్కేట్లు చూడాలి. వ్యవసాయ భూముల నుంచి రైతులను బేదఖలు చేసే దుర్మార్గాన్ని విడనాడాలి. ప్రజల్ని నిర్వాసితుల్ని చేసే కార్యక్రమాలకు స్వస్తి చెప్పాలి. ఆదివాసీల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి. 1/70 చట్టాన్ని కచ్చితంగా అమలుచేయాలి. వ్యవసాయాభివృద్ధి భూమి కేంద్రంగా జరగాలి. 'భూమి కమీషన్'ను ఏర్పాటు చేయాలి.

**2. మెట్ట, సన్న, చిన్నకారు, కౌలు వ్యవసాయం:**

మెట్ట వ్యవసాయానికి అవసరమైన భూసార సంరక్షణ, తేమను నిలుపుకునే కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వాలి. వాటర్‌షెడ్ పథకాలను అమలుచేయాలి. మెట్ట వ్యవసాయానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతాంగానికి అందించాలి. తెలంగాణ సంప్రదాయ పంటల్ని కాపాడుకోవాలి. ముతక, తృణ ధాన్యాలకు గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రజాపంపిణీ వ్యవస్థతో ఈ ధాన్యాలకు అనుసంధానం కల్పించాలి. మెట్ట వ్యవసాయా భివృద్ధికి ప్రత్యేక సహకారం అందించాలి.

సన్న, చిన్నకారు రైతుల అభివృద్ధికి సమగ్రమైన అభివృద్ధి ప్యాకేజీని రూపొందించి అమలుచేయాలి.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి, రెవెన్యూ రికార్డుల్లోకి వారి పేర్లను ఎక్కించి, వారికి రక్షణ కల్పించి, వారికి రుణాలు, బీమా మొదలైన వాటిని అందించినప్పుడే వ్యవసాయాభివృద్ధి జరుగుతుంది.

**3. సాగునీరు:**

తెలంగాణలో ప్రభుత్వం సాగునీటికి అత్యంత ప్రాధాన్యత నివ్వాలి. చెరువుల పునరుద్ధరణకు, చిన్న నీటి వనరుల సంరక్షణకు, అభివృద్ధికి, వినియోగానికి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడానికి, గోదావరి జలాల వినియోగానికి, కృష్ణా జలాల పునఃపంపిణీకి, సాగునీటి యాజమాన్యానికీ అవసరమైన కార్యక్రమాలను తక్షణమే చేపట్టాలి. తగిన నిధులు కేటాయించాలి. ధనయజ్ఞంగా మారకుండా చూడాలి.

**4. పంటనష్టాలు:**

పంట నష్టాలు జరుగకుండా, రిస్క్ అంశాల్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. భూమి, సాగునీటి అభివృద్ధి దీనికి దోహద పడుతుంది. పంటల బీమా శాశ్వత పరిష్కారం కాదు.

**5. రుణభారం:**

ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు వాగ్దానం చేసిన విధంగా ఒక లక్ష రూపాయల వరకు రైతుకు రుణమాఫీ చేయాలి.

రిజర్వుబ్యాంకు నిబంధనలను అనుసరించి వ్యవసాయానికి 18 శాతం రుణాలివ్వాలి. క్రమంగా సంస్థాగత రుణాలు 25 శాతానికి పెంచాలి. కౌలు రైతులతో సహా రైతులందరికీ అవసరమైన రుణాలు సకాలంలో అందించాలి. అవసరమైన ఆర్థిక సహకారంతో సహా అందిస్తూ సహకార పరపతి సంఘాలను పునరుద్ధరించాలి.

**6. ఉత్పాదకాల సరఫరా:**

ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కనీసం 50 శాతం ఉత్పాదకాలను 50 శాతం సబ్సిడీలతో రైతులకు అందించాలి. నాణ్యతా ప్రమాణాలను పాటింపచేయడానికి నియంత్రణా యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి.

**7. మార్కెటింగ్ సమస్యలు:**

ప్రభుత్వం మార్కెట్ యార్డులను అభివృద్ధి చేయాలి. మార్కెట్ కమిటీలను బలోపేతం చేయాలి. దళారుల పాత్రను తగ్గించాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. వ్యవసాయ ప్రాసెసింగ్ ద్వారా వ్యవసాయోత్పత్తులకు అదనపు విలువ కల్పించాలి.

**8. ధరలు:**

డా॥స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం కనీస మద్దతు నిర్ణయించి అమలుచేయాలి. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కనీసం 50 శాతం వ్యవసాయోత్పత్తుల్ని రైతుల ద్వారా నేరుగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనే ఏర్పాట్లు చేయాలి.

**9. రైతు సంక్షేమం:**

దీనికోసం రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలి. రైతులకు సామాజిక భద్రత కల్పించాలి.

పైన విశదీకరించిన విధానాలు, కార్యక్రమాలు అమలు కావాలంటే, వ్యవసాయ అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలి. వ్యవసాయ ధరల స్థిరీకరణ నిధిని 2 వేల కోట్లతో ఏర్పాటు చేయాలి. గత రెండు దశాబ్దాలుగా నయా ఉదారవాద విధానాలు దేశంలో అమలవుతున్న కారణంగా మన వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకొనిపోయింది. రైతాంగం దివాళా తీసి దీనంగా బతుకులు వెళ్లదీస్తుంది. ప్రపంచబ్యాంక్, ప్రపంచ వాణిజ్య సంస్థల నిర్దేశిత సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మన వ్యవసాయ రంగంపైన తీవ్రమైన దుష్ప్రభావం కలిగిస్తోంది. అర్ధభూస్వామ్య, సామ్రాజ్యవాద అనుకూల అభివృద్ధి నమూనాను వ్యతిరేకించాలి. ప్రజానుకూలమైన అభివృద్ధి నమూనాను ఆచరణలో పెట్టాలి. అప్పుడే ప్రజాస్వామ్య తెలంగాణను నిర్మించుకోగలం. సామాజిక తెలంగాణను ఆవిష్కరించుకుందాం. నూతన వ్యవసాయ విప్లవం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవం దిశలో అడుగులు వేద్దాం. ❖

# తెలంగాణలో సాగునీటి రంగ అభివృద్ధి
## కొత్త ప్రభుత్వ కర్తవ్యాలు

శ్రీధర్‌రావు దేశ్‌పాండే
కో ఛైర్మన్,
తెలంగాణ ఇంజనీర్స్ జెఏసి

*వర్తమాన తెలంగాణ ఉద్యమానికి ట్యాగ్ లైన్ 'నీళ్లు, నిధులు, నియామకాలు'. 1969 ఉద్యమంలో ఉద్యోగాల దోపిడి, నిధుల దోపిడి ప్రధాన అంశాలుగా ఉన్నాయి. అందుకే ఉద్యమంలో ఉద్యోగులు ప్రధాన పాత్ర పోషించినారు. వారికి తోడుగా తెలంగాణ బుద్ధిజీవులు ఉద్యమంలో పాల్గొన్నారు. ఆనాటికి నీరు ఒక అంశంగా ముందుకు రాలేదు. గ్రామాల్లో చెరువులు ఇంకా కళకళలాడుతూ ఉన్నాయి. వ్యవసాయ విధ్వంసం అంతగా లేదు. వ్యవసాయ సంస్కృతిలో బతుకుతున్న సబ్బండ వర్గాలు ఇంకా సంక్షోభానికి గురికాలేదు. తెలంగాణలో అనాదిగా కొనసాగుతున్న స్వయంపోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అప్పటికింకా బతికే ఉన్నది. వృత్తి కులాలకు, వ్యవసాయ కూలీలకు బతుకు తెరువు గ్రామాల్లో దొరికే పరిస్థితి ఉన్నది. అందుకే గ్రామాల్లో ఉన్న విశాల ప్రజానీకానికి ఉద్యమ చైతన్యం చేరలేదు. ఒక అగ్ని పర్వతంలా ఎగిసిన ఉద్యమం 9 నెలలు తెలంగాణను స్తంభింపజేసింది. అయితే రాజకీయ నాయకత్వపు విద్రోహానికి ఉద్యమం కుప్పకూలిపోయింది. అది మళ్ళీ పునర్జీవనం పొందడానికి 25 ఏండ్లు పట్టింది. ఈ 25 ఏండ్లలో తెలంగాణలో గుణాత్మకమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి.*

తెలంగాణ ఆర్థిక , సాంస్కృతిక జీవనానికి అనాది ఆధారాలుగా ఉన్న గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ విధ్వంసం అయ్యింది. చెరువులు, మోటబావులు ఎండిపోయినాయి. వాటి నిర్వహణను సీమాంధ్ర వలస ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసినాయి. పూడికలతో నిండిపోయి కబ్జాలకు గురి అయినాయి. తెగిపోయిన మట్టికట్టలను పునరుద్ధరించలేదు. కూలిపోయిన తూములకు మరమ్మతులు చేయలేదు. చెరువులకు నీటిని తీసుకువచ్చే కాలువలు, వాగులు ఆక్రమణలకు గురి అయితే పట్టించు కోలేదు. సీమాంధ్ర ప్రభుత్వాల సాగునీటి పాలసీ అంతా కూడా ఆంధ్ర ప్రాంత ప్రయోజనాలను నెరవేర్చేందుకే ఉద్దేశించబడింది. భారీ మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణానికే పెద్ద పీట వేసి తెలంగాణ భౌగోళిక పరిస్థితులకు అనుగుణమైన మైనర్ ఇరిగేషన్‌ని నిర్లక్ష్యం చేసినారు. నిజానికి మైనర్ ఇరిగేషనే తెలంగాణకు మేజర్ ఇరిగేషన్ అన్న స్పృహ సీమాంధ్ర పాలకులకు లేనేలేదు. 1996 లో వర్తమాన తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకునే సమయానికి తెలంగాణ గ్రామాలు వల్లకాడుల్లాగా మారిపోయినాయి. రైతుల ఆత్మహత్యలకు నిలయాలైనాయి. వేల సంఖ్యలో గ్రామీణ ప్రజలు బతుకు తెరువు వెతుక్కుంటూ పట్నాలకు, దూరప్రాంతాలకు కూలీలుగా వలసబోయినారు. భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీలు, వృత్తి కులాలవారు ఈ వలస ప్రజల్లో ఉన్నారు. సాగునీటి సదుపాయం లేదు. ప్రభుత్వ పరపతి లేదు. అదే సమయంలో ప్రపంచీకరణలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆర్థిక విధానాలు తెలంగాణను చితక్కొట్టినాయి. తెలంగాణ ఉద్యమ చైతన్యంలో నీటి దోపిడి అనివార్యంగా ప్రధాన అంశంగా ముందుకు వచ్చింది. తలాపున గోదావరి, కృష్ణా నదులు పారుతున్నా తెలంగాణకు ఈ నీటి గోస ఎందుకు అన్న ప్రశ్న గ్రామీణ ప్రజలను తట్టి లేపింది. నీటి దోపిడి అంశం ఉద్యమానికి విశాల ప్రజానీకం మద్దతు కూడగట్టింది. ఈ ప్రజా పునాది కారణంగానే ఉద్యమం సుదీర్ఘ కాలం మనగలిగింది. రాజకీయ నాయకత్వాన్ని మెడలు వంచి తన వైపు నిలబెట్టుకోగలిగింది. అంతిమంగా విజయాన్ని అందుకోగలిగింది.

జూన్ 2 తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణకు కేసిఆర్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వం కూడా ఏర్పాటయింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు తెలంగాణ రాష్ట్రం ఏ మేరకు తీర్చగలుగుతుంది అన్నది ఇప్పుడు అందరి మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న. తెలంగాణ ప్రజా సంఘాలు, బుద్ధిజీవులు ఇప్పటికే ప్రజల మ్యానిఫెస్టోలు తయారుచేసి పాలకుల ముందు పెట్టినాయి. తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి రంగం ఎట్లా ఉండాలో తెలియజేసే స్థూలమైన పత్రం ఈ వ్యాసం.

ఈ సందర్భంగా సమైక్య రాష్ట్రంలో సాగునీటి రంగంలో తెలంగాణకు ఎదురైన వివక్షను స్థూలంగా సమీక్షించుకుందాం.

- 1956 కు పూర్వం నిజాం ప్రభుత్వం , హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో అనేక భారీ, మధ్యతరహా, చిన్న నీటి ప్రాజెక్టులను నిర్మించింది.
- మనకు అందుబాటులో ఉన్న సమాచారం మేరకు 20వ శతాబ్దం ఆరంభం నాటికి తెలంగాణలో 21000 చెరువులు, వాటి కింద 8 లక్షల ఎకరాలు సాగులో ఉండేవి. 1956లో విలీనం నాటికి అవి 33000లకు పెరిగి వాటి కింద 12 లక్షల ఎకరాలు సాగులో ఉండేవని తెలుస్తున్నది.
- 1930నాటికే నిజాం ప్రభుత్వం అనేక మేజర్, మీడియం ప్రాజెక్టులను నిర్మించింది.



- ఘన్ పూర్ ఆనకట్ట (మెదక్), డిండి ప్రాజెక్టు, పెండ్లిపాకల (నల్గొండ), వైరా, పాలేరు ప్రాజెక్టులు (ఖమ్మం), శనిగరం,అప్పర్ మానేరు (కరీంనగర్), రాయని పల్లి, సింగభూపాలం, కోయిలసాగర్, సరళాసాగర్ (మహబూబ్ నగర్), సదర్మాట్, స్వర్ణ, కడెం (ఆదిలాబాద్), నిజాంసాగర్ ప్రాజెక్టు, పోచారం ప్రాజెక్టు (నిజామాబాద్), ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, మీరాలం చెరువు (హైదరాబాద్)
- ఇవికాక నిజాం ప్రభుత్వం గోదావరి పై 400 టీఎంసీల పోచంపాడు(కుష్టాపురమ్) ప్రాజెక్టును, 350 టీఎంసీల ఇచ్ఛంపల్లి ప్రాజెక్టును, మంజీరానదిపై 38 టీఎంసీల దేవనూరు ప్రాజెక్టును, కృష్ణా నదిపై 132 టీఎంసీల నందికొండ ప్రాజెక్టును, 54.4 టీఎంసీల అప్పర్ కృష్ణా ప్రాజెక్టును, తుంగభద్ర నదిపై 65టీఎంసీల తుంగభద్ర ఎడమ కాలువ, రాజోలి బండ మళ్ళింపు కాలువ ప్రాజెక్టులను, భీమా నదిపై 100 టీఎంసీల భీమా ప్రాజెక్టును ప్రతిపాదించింది.
- మొత్తంగా 1365టీఎంసీల కృష్ణా గోదావరి జలాలను వినియోగించుకొనేందుకు ప్రతిపాదనలు ఉన్నవి.
- రాష్టాల పునర్వ్యవస్థీకరణ జరిగి 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడంతో కొన్ని ప్రాజెక్టులను లిస్టు లోంచి తొలగించారు. కొన్నింటి సామర్థ్యాన్ని కుదించారు. మరి కొన్నింటిని సుప్తావస్థలో ఉంచారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు తరువాత సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ తీవ్ర వివక్షకు లోనైంది. ఆ వివరాలు కింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

| కృష్ణా నది | సీమాంధ్ర | తెలంగాణ |
|---|---|---|
| 1. పరీవాహక ప్రాంతం | 13.1% | 68.5% |
| 2. బచావత్ ట్రిబ్యూనల్ అవార్డ్ ప్రకారం నీటి కేటాయింపులు | 48.6% | 34.7% |
| 3. వాస్తవ కేటాయింపులు | 84.6% | 15.4% |
| **గోదావరి నది** | **ఆంధ్ర** | **తెలంగాణ** |
| 1. పరీవాహక ప్రాంతం | 21% | 79% |
| 2. గోదావరి ట్రిబ్యూనల్ అవార్డ్ ప్రకారం నీటి కేటాయింపులు | 39% | 61% |
| 3. వాస్తవ కేటాయింపులు | 57.1% | 15.7% |

- తెలంగాణలో ప్రాజెక్టులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పరిస్థితి కనబడుతున్నది.

## పోచంపాడు (శ్రీరాం సాగర్ ప్రాజెక్టు)

- 400 టీఎంసీల నిలువ సామర్థ్యంతో, తెలంగాణలోని ఏడు జిల్లాలలో 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించ వలసిన ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తరువాత 112 టీఎంసీలకు కుదించబడింది. 9 లక్షల ఎకరాలకు నిర్మాణం జరిగింది.
- కాలక్రమేణా నిలువ సామర్థ్యం 86 టీఎంసీలకు పడిపోయింది.
- 9700 క్యూసెక్కుల ప్రవాహాన్ని మోసుకుపోవలసిన కాకతీయ కాలువ అతి కష్టం మీద 6000 క్యూసెక్కులు తీసుకువెళుతున్నది.
- మొదటి దశ ఆయకట్టుకే నీరు సరిపోవడం లేదు.రెండో దశ కాలువలు తవ్వి పెట్టినా నీళ్లు రాని పరిస్థితి.

- 1964లో ప్రారంభమయిన ప్రాజెక్టు రెండవ దశ నిర్మాణం ఇంకా దేకుతూనే ఉన్నది.
- 1990లో ప్రారంభమైన శ్రీరాంసాగర్ కాలువ పూర్తి అయినా, మిడ్ మానేరు లాంటి బ్యాలెన్సింగ్ జలాశయాలు పూర్తికాకపోవడంతో వరద కాలువ ఆశించిన ప్రయోజనాలు నెరవేరడం లేదు.
- ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల సుప్రీంకోర్టులో వాదనా వైఫల్యాల వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలాశయంలోనే ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా, అంతర్రాష్ట్ర ఒప్పందాలకు విరుద్ధంగా మహారాష్ట్ర బాబ్లీ బ్యారేజీని నిర్మించింది.

## నందికొండ ప్రాజెక్టు (నాగార్జునసాగర్ ప్రాజెక్టు)

- హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా నదిపై నందికొండ వద్ద, 132 టీఎంసీల నిలువ సామర్థ్యంతో, నల్గొండ, ఖమ్మం జిల్లాలలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టును ప్రతిపాదించింది.
- 1954లో ఆంధ్ర రాష్ట్రంతో కుదిరిన ఒప్పందం ప్రకారం 2 రాష్ట్రాలు చెరి 132 టీఎంసీలు వినియోగించుకోవడానికి నాగార్జునసాగర్ ప్రాజెక్టును ప్రతిపాదించినారు. కుడి కాలువ ద్వారా 132 టీఎంసీలు ఆంధ్ర రాష్ట్రానికి, 132 టీఎంసీలు ఎడమ కాలువ ద్వారా నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు నీరు అందించాలి.
- ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తరువాత ఎడమ కాలువకు 106.2 టీఎంసీలు మాత్రమే కేటాయించబడింది. ఈ కేటాయింపులు కూడా తరువాతి కాలంలో కాలువ అలైన్ మెంట్ మార్చడం ద్వారా, డిజైన్‌లను మార్చడం ద్వారా 86 టీఎంసీలకు తగ్గించారు.
- ఒప్పందం ప్రకారం రెండు కాలువలు చెరి 132టీఎంసీలు మోసుకుపోవలసి ఉండగా డిజైన్లలో వివక్ష కారణంగా అది సాధ్యం కాలేదు. కుడి కాలువ వెడల్పు 241 అడుగులు ఉండగా ఎడమ కాలువ వెడల్పు 95 అడుగులే పెట్టడం వివక్షకు తార్కాణం.
- ప్రతిపాదనల ప్రకారం ఎడమ కాలువ నల్లగొండ, ఖమ్మం జిల్లాలలోని ఆయకట్టుకు మాత్రమే నీరు అందించాలి. అయితే కాలువ నిర్మాణం జరిగే సమయంలో కుట్రపూరితంగా కృష్ణా జిల్లాకు పొడిగించినారు. దీనివల్ల తెలంగాణ 43 టీఎంసీల కృష్ణా నది జలాలను తెలంగాణ కోల్పోవలసి వచ్చింది.

## రాజోలిబండ మళ్లింపు పథకం

- 1944 ఒప్పందం ప్రకారం కేసి కెనాల్‌కు రాజోలి బండ కాలువకు తుంగభద్ర నీటిలో సమాన వాటా రావాలి. అయితే బచావత్ ట్రిబ్యునల్ ఎదుట ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వివక్షా పూరితంగా పెట్టిన డిమాండ్ల కారణంగా కేసి కెనాల్ కు 39.9 టీఎంసీలు దక్కగా, రాజోలిబండకు 17.10 టీఎంసీలు (15.9టీఎంసీలు మహబూబ్‌నగర్‌కు) మాత్రమే దక్కాయి. కేసి కెనాల్ ఆయకట్టును 2.78లక్షల ఎకరాలుగా నిర్ధారించగా రాజోలిబండ ఆయకట్టును 92,900 ఎకరాలుగా (87,000 ఎకరాలు మహబూబ్‌నగర్‌కు) నిర్ధారించారు. ఇది రాజోలిబండకు ఎదురైన మొదటి అన్యాయం.
- రాజోలిబండ నిర్మాణం జరిపేటప్పుడు ఏర్పాటు చేసిన పది తూముల్లో ఏడింటిని మూసివేసి మూడింటిని అట్లాగే తెరిచి ఉంచడం వల్ల రాజోలిబండకు న్యాయంగా దక్కవలసిన వాటా ఎప్పుడు దక్కలేదు.
- 15.9 టీఎంసీల తుంగభద్ర జలాలను మహబూబ్ నగర్ జిల్లాలోని గద్వాల, ఆలంపూర్ తాలుకాలలో 87,000 ఎకరాలకు సాగునీరు అందించాల్సిన రాజోలిబండ కాలువ గత 15 సంవత్సరాల్లో సగటున 6.8 టీఎంసీలకు మించి దక్కలేదని రికార్డులు చెపుతున్నాయి.
- అదేసమయంలో 39.9 టీఎంసీలు వాడుకోవాలసిన కేసి కెనాల్ సగటున 55 టీఎంసీలు ఉపయోగించుకున్నట్లుగా రికార్డులు చెబుతున్నాయి.
- సుంకేశుల అనకట్టను కేసి కెనాల్ ను ఆధునీకరించిన ప్రభుత్వం తెలంగాణలో కరువు ప్రాంతంగా మారిన మహబూబ్ నగర్ జిల్లాలోని పాత కాలువ రాజోలిబండను నిర్లక్ష్యం చేసింది.
- ఈ నిర్లక్ష్య వైఖరి , పక్షపాత వైఖరి కారణంగా మొన్నటికి మొన్న బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అసలు జాడ పతా లేని రాజోలిబండ కుడికాలువకు 4 టీఎంసీలను కేటాయించడం జరిగింది. రాజోలిబండకు ఎడమ వైపున మహబూబ్ నగర్ జిల్లా , కుడి వైపున కర్నూల్ జిల్లా.
- రాజోలిబండ కుడికాలువ కోసం పట్టు బట్టి 4 టీఎంసీలు సాధించుకున్న ప్రభుత్వం సుంకేశుల బ్యారేజి నుంచి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రయోజనం కల్పించే ఎడమకాలువను ఎందుకు డిమాండు చేయలేదు. ఇది వివక్ష కాదా?

## జూరాల ప్రాజెక్టు

- బచావత్ ట్రిబ్యూనల్ సానుభూతితో 17.84టీఎంసీలను కృష్ణా నదిపై జూరాల ప్రాజెక్టుకు కేటాయింపులు జరిపింది. అయితే ఎఫ్ఆర్ఎల్ దాకా భూసేకరణ జరపక పోవడం చేత జూరాలలో 11.6 టీఎంసీలకు మించి వాడుకోవడం సాధ్య పడడం లేదు.
- 2009 వరకు ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రంలోని భూములకు నష్ట పరిహారం చెల్లించకపోవడం చేత జూరాల ప్రాజెక్టు ఈ నష్టాన్ని భరించవలసి వచ్చింది. తెలంగాణ ఉద్యమం కారణంగా

నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే ఎఫ్ ఆర్ ఎల్ వరకు జలాశయాన్ని నింపుతున్నారు.

- ❖ 1956 కు ముందు మహబూబ్ నగర్ జిల్లాకు కృష్ణా జలాల్లో కేటాయింపులు 175 టీఎంసీలు.(భీమా-100, అప్పర్ కృష్ణా 56, తుంగభద్ర ఎడమ కాలువ పొడగింపు 19 టీఎంసీలు).
- ❖ విలీనం అనంతరం మహబూబ్ నగర్ జిల్లా పొందిన కేటాయింపులు 53.74 టీఎంసీలు మాత్రమే.(రాజోలిబండ 15.9, జూరాల 17.84, భీమా ఎత్తిపోతల పథకం 20 టీఎంసీలు)
- ❖ కృష్ణా, తుంగభద్ర, భీమా, డిండి లాంటి పెద్ద నదులు ప్రవహిస్తున్నా ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు మహబూబ్ నగర్ జిల్లాకు శాపంగా మారి దేశంలోనే అత్యధిక కరువు పీడిత 10 జిల్లాలలో ఒకటిగా మిగిలింది.

తెలంగాణ ఒక రాష్ట్రంగా కొనసాగి ఉండి ఉంటే మహబూబ్ నగర్ జిల్లాకు ఈ దుర్గతి పట్టి ఉండేది కాదు.

## ఇచ్ఛంపల్లి - పోలవరం ప్రాజెక్టులు

- ❖ ఇచ్ఛంపల్లి ప్రాజెక్టును దశాబ్దాలుగా అంతర రాష్ట్ర సమస్యలను చూపెట్టి కోల్డ్ స్టోరేజీలో పెట్టినారు.
- ❖ ఇచ్ఛంపల్లి సమకాలీనమైన పోలవరం ప్రాజెక్టును మాత్రం అంతర రాష్ట్ర సమస్యలు , ముంపు సమస్యలు , పర్యావరణ సమస్యలు, కోర్టు కేసులు ఎన్ని ఉన్నా మొండిగా ప్రభుత్వం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించింది.
- ❖ ఇచ్ఛంపల్లి తెలంగాణ ప్రాజెక్టు కాబట్టి వివక్ష . పోలవరం ఆంధ్ర ప్రాజెక్టు కాబట్టి వల్లమాలిన ప్రేమ.
- ❖ పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటింపజేసుకున్న ప్రభుత్వం తెలంగాణకు ఒక్క జాతీయ ప్రాజెక్టును సాధించలేకపోయింది.
- ❖ 2004లో చంద్రబాబు ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఆలస్యమవుతున్న కారణంగా తాటిపూడి , పుష్కర, చాగల్ నాడు, వెంకటాపురం ఎత్తిపోతల పథకాలను ప్రతిపాదించింది. ఇచ్ఛంపల్లికి బదులుగా దేవాదులను తెలంగాణలో ప్రారంభించింది. దేవాదుల ఇంకా దేకుతూనే ఉన్నది. తాటిపూడి , పుష్కర, ఛాగల్ నాడు, వెంకటనగరం ఎత్తిపోతల పథకాలు పూర్తి అయి నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నాయి.
- ❖ రాజశేఖర రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి, పోలవరంకు ప్రత్యామ్నాయంగా చేపట్టిన తాటిపూడి పుష్కర తదితర ఎత్తిపోతల పథకాలు పూర్తి అయి నిర్దేశిత ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్నా, ఎన్ని అడ్డంకులు ఎన్ని వ్యతిరేకతలు ఉన్నా పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభించినాడు. మరి తెలంగాణ ప్రజల చిరకాల డిమాండ్ అయిన ఇచ్ఛంపల్లి ఎందుకు ప్రారంభించలేదు? ఇది వివక్ష కాదా?

## నిజాంసాగర్ - సింగూర్ ప్రాజెక్టులు

- ❖ నిజాంసాగర్ ప్రాజెక్టు మంజీరా నదిపై నిజాం ప్రభుత్వం తెలంగాణలో నిర్మించిన భారీ ఆనకట్ట.
- ❖ 2.75 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవలసిన ప్రాజెక్టు పూడిక వల్ల నిల్వ సామర్థ్యం తగ్గిపోయి 1.50 లక్షల ఎకరాలకు కూడా నీరివ్వలేకపోతున్నది.
- ❖ నిజాంసాగర్‌కు సింగూర్ ప్రాజెక్టు నుంచి రావలసిన 8 టిఎంసిలు సక్రమంగా రాకపోవడంచేత నిజాం సాగర్ ఆయకట్టు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. తమ స్వంత ఖర్చుతో భూగర్భ జలాలను తోడుకుంటూ వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు.
- ❖ సింగూర్ నుంచి హైదరాబాద్ నగరానికి ఉన్న కేటా యింపులు 4 టీఎంసీలు మాత్రమే. కానీ హైదరాబాద్ నగరంలో ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయిన వలస కాలనీలకు తాగునీరు అందించడానికి సింగూర్ నీటిని మొత్తంగా హైదరాబాద్ తాగునీటి అవసరాలకే ప్రభుత్వం కేటాయించింది.
- ❖ అలీసాగర్, గుత్పా ఎత్తిపోతల పథకాలను నిర్మించి 5 టీఎంసీల గోదావరి నీటిని శ్రీరామ్ సాగర్ జలాశయం నుంచి తరలించి కొంత న్యాయం చేసినప్పటికీ ఆ మేరకు కాకతీయ కాలువకు గండి పడింది.
- ❖ అట్లనే సింగూర్ నుంచి ఘన్‌పూర్ ఆనకట్టకు కూడా సక్రమంగా నీరు అందకపోవడం చేత మెదక్ జిల్లాకు కూడా అన్యాయం జరుగుతున్నది.

సింగూర్ ప్రాజెక్టును హైదరాబాద్ తాగునీటి కోసమే అంకితం చేయడంవల్ల మెదక్, నిజామాబాద్ జిల్లాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

## చిన్న చెరువుల వ్యవస్థ విధ్వంసం

- ❖ తెలంగాణలో చెరువుల నిర్మాణం శాతవాహనుల కాలం నుంచి అనాదిగా సాగుతున్నది. చెరువుల కింద వ్యవసాయమే తెలంగాణలో జీవనాధారంగా ఉన్నది.
- ❖ కాకతీయులు నిర్మించిన రామప్ప, పాకాల, లఖ్నవరం, ఘణపురం, బయ్యారం వంటి సముద్రాలను తలపించే చెరువులు ఇప్పటికీ సేవలందిస్తున్నాయి.
- ❖ కాకతీయుల తర్వాత తెలంగాణను పాలించిన కుతుబ్ షాహీలు, అసఫ్ జాహీలు కూడా తెలంగాణలో చెరువుల నిర్మాణాన్ని కొనసాగించి వ్యవసాయ విస్తరణకు తోడ్పాటు నందించారు. పటంచెరువు, హుసేన్ సాగర్, ఇబ్రహీంపట్నం, ఉదయ సముద్రం, పానగల్లు, ధర్మసాగరం చెరువుల్లాంటివి తెలంగాణలో

ఎన్నో. ప్రతి ఊరికి కనీసం ఒక్క చెరువన్నా ఉండేది. ఒకటి కన్న ఎక్కువ చెరువులు ఉన్న ఊర్లు కూడా తెలంగాణలో అనేకం ఉన్నాయి.

❖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణలో అనాదిగా ఉన్న ఈ గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను నిర్లక్ష్యం చేసి విధ్వంసానికి గురిచేసింది.

❖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగునీటి పాలసీ సీమాంధ్ర ప్రయోజనాలు నెరవేర్చే విధంగానే తయారయ్యింది.

భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణం మీదనే దృష్టి కేంద్రీకరించడం వల్ల తెలంగాణలోని చెరువుల వ్యవస్థ నిర్వహణ పట్ల, వాటి అభివృద్ధిపట్ల వివక్ష చూపడంవల్ల పూడికలతో నిండిపోయి, గండ్లు పడిపోయి, కబ్జాలకు గురయి వేలాది చెరువులు కనుమరుగయ్యాయి. ఇప్పటికీ అనేక చెరువులు కనుమరుగయ్యే దశకు చేరుకున్నాయి.

చెరువుల వ్యవస్థ విధ్వంసం వలన స్వయంపోషక గ్రామాలుగా పరిఢవిల్లిన తెలంగాణ గ్రామాలు కరువు పీడిత గ్రామాలుగా మారినాయి. వలసలకు, ఆత్మహత్యలకు నిలయ మైనాయి. వేలాదిమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినారు. తెలంగాణ గ్రామాలనుంచి లక్షలాదిమంది ప్రజలు, పొట్ట చేత పట్టుకుని, ముంబాయి, బివండి, అహ్మదాబాద్, సూరత్, గల్ఫ్ దేశాలకు వలస పోయినారు.

తెలంగాణకు న్యాయంగా దక్కవలసిన కృష్ణా గోదావరి జలాలు దక్కి ఉంటే, చిన్న నీటి వనరుల నిర్వహణ, అభివృద్ధి సక్రమంగా జరిగి ఉంటే తెలంగాణలో బతుకు చిత్రం భిన్నంగా ఉండేది. ఫజల్ అలీ కమీషన్ సిఫారసుల మేరకు తెలంగాణ ఒక రాష్ట్రంగా కొనసాగి ఉంటే నదీ జలాల్లో తన వాటాను తను వినియోగించుకొని ఉండేది. అనాది ఆధారాలైన గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను సక్రమంగా నిర్వహించుకుని ఉండేది. చిన్న చెరువులను మరింత అభివృద్ధి పరుచుకుని ఉండేది. ఫజల్ అలీ వ్యక్తం చేసిన అభిప్రాయం ఈ విధంగా ఉంది.

" When plans for future development are taken into account, Telangana fears that the claims of this area may not receive adequate consideration in Vishalandhra. The Nandikonda and Kushtapuram(Godavari) projects are, for example, among the most important which Telangana or the country as a whole has undertaken. Irrigation in the coastal deltas of these two great rivers however, also being planned. Telangana, therefore, does not wish to lose its present independent rights in relation to the utilization of the waters of the Krishna and Godavari." (Para 377 of SRC Report, 1955). విలీనం వలన తెలంగాణ ఆ అవకాశాన్ని కోల్పోయింది. వనరుల వినియోగంపై హక్కును కోల్పోయింది. అందుకే తెలంగాణ స్వయంపాలన కోరుకున్నది.

## తెలంగాణలో సాగునీటి రంగ అభివృద్ధి - తెలంగాణ ప్రభుత్వ కర్తవ్యాలు:

పైన చెప్పుకున్నట్టు జూన్ 2న కేసిఆర్ నాయకత్వంలో తొలి తెలంగాణ ప్రభుత్వం ఏర్పడుతున్నది. 60 ఏండ్ల సమైక్య రాష్ట్రంలో సాగునీటిరంగంలో తెలంగాణ అనుభవించిన వివక్షను, ఆ వివక్ష కారణంగా జరిగిన నష్టాన్ని పూరించవలసిన అవసరం ఉన్నది. సాగునీటి రంగం అభివృద్ధి మీదనే తెలంగాణ పునర్నిర్మాణం ఆధారపడి ఉంది. తెలంగాణలో వ్యవసాయాభి వృద్ధి జరిగితే తెలంగాణలో ప్రజల వలసలు ఆగిపోతాయి. రైతుల ఆత్మహత్యలు ఆగుతాయి. వ్యవసాయం పుంజుకుంటే గ్రామంలో అనేక వృత్తి కులాలు బతుకుతాయి. అయితే వ్యవసాయాభివృద్ధికి సాగునీటి సరఫరాతో పాటు అనేక అంశాలు దోహదం చేస్తాయి. ముఖ్యంగా ప్రభుత్వ పరపతి సహాయం పెరగాలి. రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధరలు లభించాలి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా దొరకాలి. పంటలకు నిలువ, మార్కెట్ సౌకర్యం ఉండాలి. ఇవ్వన్ని ఈ వ్యాస పరిధిలోని అంశాలు కావు. అన్నింటికన్న అత్యంత ముఖ్యమైనది నీటి సరఫరా. తెలంగాణ ప్రభుత్వంపై ప్రజలకు గంపెడు ఆశలు ఉన్నాయి.

ప్రజలకు ఏమి కావాలి? ప్రతి ఊరికి కనీసం ఒక సాగునీటి వనరు, ఒక తాగునీటి వనరు కావాలి. అది ఎట్లా సాధ్యమో ప్రభుత్వం, ప్రభుత్వంలో పనిచేస్తున్న ఇంజనీర్లు ఆలోచించవలసిన విషయం. తెలంగాణ ఉద్యమంలో అత్యంత క్రియాశీలంగా పనిచేసిన బుద్ధిజీవుల్లో రిటైర్డ్ ఇంజనీర్ల పాత్ర, సర్వీసులో ఉన్న ఇంజనీర్ల పాత్ర విస్మరించజాలనిది. తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం, తెలంగాణ ఇంజనీర్ల జెఏసిలు తెలంగాణకు సాగునీటి రంగంలో ఎదురైన అన్యాయాలను గణాంకాలతో ప్రజలకు వివరించి నీటి దోపిడిని, అందులోను రాజకీయాలను విస్తృతంగా ప్రచారం చేసినారు. అంతే కాదు తెలంగాణకు ఏమి కావాలో ఆలోచించి సాగునీటి రంగ అభివృద్ధి ప్రణాళికలు రచించడం మొదలుపెట్టినారు. సీమాంధ్ర ప్రభుత్వంతో పోరాడి అనేక ప్రాజెక్టులను సాధించినారు. ప్రాణహిత–చేవెళ్ళ ఎత్తిపోతల పథకం, కాంతానపల్లి ఎత్తిపోతల పథకం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం , డిండి ఎత్తిపోతల పథకం, జూరాల–పాకాల వరద కాలువ పథకం, కడెం నదిపై కుప్టి జల విద్యుత్ పథకం, సదర్ మాట్ బ్యారేజి పథకం, ..ఇట్లా మరేన్నో సాగునీటి పథకాలను ప్రతిపాదించడం జరిగింది. వాటి కోసం సీమాంధ్ర ప్రభుత్వంతో పోరాడి సాధించికున్నవి ... ప్రాణహిత – చేవెళ్ళ , కాంతాన పల్లి ఎత్తిపోతల పథకాలు. పాలమూరు ఎత్తిపోతల

పథకం కోసం, డిండి ఎత్తిపోతల పథకం కోసం పోరాటం గత రెండు సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ముందు సాగునీటిరంగ అభివృద్ధి ప్రణాళికను పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నవి. అట్టి ప్రణాళికను స్థూలంగా ఈ వ్యాసంలో చర్చించే ప్రయత్నం చేస్తాను.

## మైనర్ ఇరిగేషన్ :

ఇంతకుముందు చెప్పుకున్నట్టు తెలంగాణకు చిన్న నీటి వనరుల కల్పన ఒక ప్రధానమైన ఎజెండా. తెలంగాణ ప్రభుత్వం మొదట చేయవలసింది చిన్ననీటి వనరుల సెన్సెస్. రెవెన్యూ రికార్డుల ఆధారంగా తెలంగాణలో ప్రతి జిల్లాలో ఎన్ని చెరువులు, కుంటలు రికార్డుల్లో ఉన్నవో లెక్కించాలి. రెవెన్యూ రికార్డుల ప్రకారం 1956 నాటికి తెలంగాణలో 33000 చెరువులు, కుంటలు ఉన్నట్టు తెలుస్తున్నది. అందులో ఎన్ని కనుమరుగై పోయినాయి , ఎన్ని పునరుద్ధరణకు అనుకూలంగా ఉన్నాయి, వాటి ప్రస్తుత స్థితిగతులను అంచనా వేయాలి. నివేదికలు (Memoirs) తయారు చెయ్యాలి. వాటి పునరుద్ధరణకు ఏమి చేయగలం ?

- ❖ పూడికలు తీసి చెరువుల, కుంటల నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచాలి.
- ❖ తెగిపోయిన మట్టికట్టలను పటిష్ఠం చేసి, కూలి పోయిన తూములను నిర్మించి, చెరువులకు నీటిని మోసుక వచ్చే కాలువలను, వాగులను పునరుద్ధరించి చెరువులో నీరు నిలువ ఉండేలాగ చేయాలి.
- ❖ చెరువుల పూర్తి స్థాయి నీటి మట్టాన్ని (FTL) నిర్ధారించే సర్వేలు చేయించి ఆ మట్టం లోపల ఉన్న నిర్మాణాలను తొలగించాలి. చెరువుల్లో, కుంటల్లో కబ్జాలని నిర్ధాక్షిణ్యంగా ఖాళీ చేయించాలి.
- ❖ ఎఫ్‌టిఎల్ కాంటూరులో కంచెలు వేయించి చెరువుల, కుంటల శిఖం భూములను కబ్జాల నుంచి పరిరక్షించాలి.
- ❖ ఎద్ద చెరువులకు నీటిని మోసుకొచ్చే వాగుల పరీవాహక ప్రాంతాలను కూడా కబ్జాల బారిన పడకుండా చూడాలి. ఈ సమస్య వలన ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో ఉన్న చెరువులకు నీరు రాక నిరుపయోగంగా మారుతున్నాయి. రంగారెడ్డి జిల్లాలో కుతుబ్షాహీల కాలంలో నిర్మించిన ఇబ్రహీంపట్నం చెరువు ఈ కారణంగానే ఎండిపోయింది. హైదారాబాద్ నగరానికి తాగునీటి కోసం, మూసీనది వరద నియంత్రణ కోసం నిర్మించిన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ చెరువుల పరీవాహక ప్రాంతంలో అనేక అక్రమ రిసార్ట్స్, ఇతర కమర్షియల్ నిర్మాణాలను అనుమతించడం వలన నీటి ప్రవాహం తగ్గిపోడమే కాదు కలుషిత నీరు చెరువుల్లోకి వస్తున్నది. ఈ చెరువుల కింద అన్ని రకాల మానవ కార్యకలాపాలను (Human Activities) జి ఓ111 ద్వారా ప్రభుత్వం నిషేధించినా పాలకుల అండతో అక్రమ నిర్మాణాలు యధేచ్ఛగా కొనసాగినాయి. అట్లనే చెరువుల్లోకి పారిశ్రామిక వ్యర్థాలను, రసాయనిక వ్యర్థాలను శుద్ధి చేసి మాత్రమే వదిలే విధంగా చర్యలు తీసుకోవాలి. శుద్ధి చేయకుండా వ్యర్థాలను వదిలే పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ చట్టాలను ప్రయోగించి చర్యలు తీసుకోవాలి. తెలంగాణ రాష్ట్రంలో నీటి వనరుల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
- ❖ చెరువుల పునరుద్ధరణ జరిగితే తాగునీటి సమస్య చాలావరకు తీరిపోతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. చెరువుకింద వ్యవసాయంతోపాటు బోర్లకింద కూడా వ్యవసాయం పుంజుకుంటది. ఇతరత్రా గ్రామానికి చెరువు ఇచ్చే ప్రయోజనాలు ఎన్నో. వాటిని ఇక్కడ పేర్కొనడం సాధ్యం కాదు. స్థూలంగా చెప్పాలంటే గ్రామాల ఆర్థిక, సాంస్కృతికవికాసం సాధ్యపడుతది.

## భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులు

విలీనానికి పూర్వమే తెలంగాణలో భారీ మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిజాం ప్రభుత్వం ప్రారంభించింది. విలీనం అనంతరం కూడా తెలంగాణలో మరికొన్ని భారీ మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది. జలయజ్ఞంలో కూడా భారీ, మధ్యతరహా ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రారంభించింది. నిర్మాణం కొనసాగుతున్న భారీ, మధ్యతరహా ప్రాజెక్టులను సాధ్యమైనంత త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉన్నది. గత ప్రభుత్వాలు పూర్తి అయిన ప్రాజెక్టుల నిర్వహణ కోసం అరకొర నిధులనే కేటాయించింది. నిర్వహణలోపం వలన ప్రాజెక్టులు అనతి కాలంలోనే పాడుపడి చేతికొచ్చేవి. అందువలన పూర్తి అయిన ప్రాజెక్టుల



నిర్వహణకు ప్రతి ఏడు నిధులు మంజూరు చెయ్యాలి. ఇప్పుడు నిర్మాణంలో ఉన్న భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు ఏమిటో నదీ బేసిన్ వారీగా చూద్దాం.

**(1) కృష్ణా బేసిన్**

కృష్ణా బెసిన్లో గత ప్రభుత్వాలు తెలంగాణలో అనేక ప్రాజెక్టులను చేపట్టినప్పటికి అవన్నీ నత్తనడకతో కొనసాగు తున్నాయి. అదే సమయంలో రాయలసీమలో , సీమాంధ్రలో చేపట్టిన ప్రాజెక్టులు మాత్రం శరవేగంతో ముందుకు సాగినాయి.

### ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకం (SLBC)

నల్లగొండలో చేపట్టిన ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకం (SLBC) పూర్తి అయి జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు, వందలాది గ్రామాలకు తాగునీరు అందిస్తున్నది. నాగార్జునసాగర్ జలాశయం నుండి నీటిని ఎత్తి అక్కంపల్లి జలాశయంలో నింపుతారు. అక్కడినుంచి కాలువల ద్వారా పంటలకు నీటి సరఫరా చేస్తారు. ఈ ఎత్తిపోతల ద్వారానే హైదరాబాద్ నగరానికి కూడా నీటి సరఫరా జరుగుతున్నది. అయితే ఈ పథకంలో టన్నల్ నిర్మాణం గనుక పూర్తి అయితే వాలు కాలువల ద్వారానే శ్రీశైలం జలాశయం నుంచి మొత్తం 3 లక్షల 70 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నది. ప్రభుత్వం జలయజ్ఞంలో టన్నల్ తవ్వకం ప్రారంభించినా అనేక అవాంతరాల కారణంగా టన్నల్ నిర్మాణం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకం (SLBC) లోని టన్నల్ నిర్మాణాన్ని పూర్తి చేసి చవకైన, వాలు కాలువల ద్వారా సాగునీటిని, తాగునీటిని అందించడానికి కృషి చెయ్యాలి.

### కల్వకుర్తి ఎత్తిపోతల పథకం :

ఇది వరద జలాలపై ఆధారపడి ప్రతిపాదించిన ప్రాజెక్టు. మహబూబ్ నగర్ జిల్లాలో 3 లక్షల 40 వేల ఎకరాలకు సాగు నీరు అందించే ఈ పథకాన్ని జలయజ్ఞంలో ప్రారంభించినారు. పంపింగ్ స్టేషన్ల నిర్మాణం పూర్తి అయ్యింది. నీటిని నిల్వ చేసే జలాశయాల నిర్మాణం పూర్తి కావలసి ఉన్నది. ఇప్పటికైతే పంపింగ్ ద్వారా చెరువులను నింపుతున్నారు. ఈ పథకంలో ఇంకా అనేక సాంకేతికపరమైన సమస్యలు, భూ సేకరణ సమస్యలను పరిష్కరించి పనులను వేగవంతం చేయవలసి ఉన్నది. ఈ సమస్యలను పరిష్కరించి, నిధులు సమకూర్చగలిగితే రెండు సంవత్సరాలలో పథకం పూర్తి అయి నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు, తొవ్వలోని గ్రామాలకు తాగునీరు అందించవచ్చునని ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. దీనితోపాటు ప్రాజెక్టుకు కృష్ణానది నికర జలాల కేటాయింపునకు కూడా ప్రయత్నించాలి.

### నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం

ఇది కూడా వరద జలాలపై ఆధారపడి ప్రతిపాదించిన ప్రాజెక్టే. మహబూబ్ నగర్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు, తొవ్వలోని గ్రామాలకు తాగునీరు అందించే ఈ పథకాన్ని జలయజ్ఞంలో ప్రారంభించినారు. పంపింగ్ స్టేషన్ల నిర్మాణం పూర్తి కావస్తున్నది. కల్వకుర్తిలో ఉన్న సాంకేతిక సమస్యలు, భూ సేకరణ సమస్యలు ఈ పథకంలోను ఉన్నాయి. వాటిని పరిష్కరించగలిగితే 2 సంవత్సరాలలో పథకం పూర్తి అయి నిర్దేశిత లక్ష్యాలను నెరవేర్చగలుగుతుంది. ఈ పథకానికి కూడా కృష్ణా నది నికర జలాలను కేటాయింపజేసుకోవడం అవసరం. ప్రభుత్వం ఈ పథకం 2 ఏండ్లలో పూర్తి కావడానికి చర్యలు తీసుకోవాలి.

### భీమా ఎత్తిపోతల పథకం

కృష్ణా డెల్టా ఆధునికీకరణ జరిపితే అదనంగా లభ్యమయ్యే 20 టిఎంసిల కృష్ణా నికరజలాలను ఈ ప్రాజెక్టుకు కేటాయించడం జరిగింది. మహబూబ్ నగర్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకాన్ని కూడా రాబోయే 2 ఏండ్లలో పూర్తి చెయ్యవచ్చునని ఇంజనీర్లు చెబుతున్నారు. ప్రభుత్వం దృష్టి పెట్టి, అన్ని రకాల సమస్యలను పరిష్కరించి 2 ఏండ్లలో పూర్తి చేయించాల్సి ఉన్నది.

### కోయిల్ సాగర్ ఎత్తిపోతల పథకం

కోయిల్ సాగర్ ఇంతకు పూర్వమే నిర్మించబడిన మధ్య తరహా ప్రాజెక్టు. మహబూబ్‌నగర్ జిల్లాలో 12000 ల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టును నిర్మించినారు. అయితే నిర్వహణ లోపంవల్ల ప్రాజెక్టు నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు అందించలేకపోతున్నది. జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టు నిర్దేశిత ఆయకట్టు 12000 ఎకరాలను స్థిరీకరించడం, ఎత్తిపోతల ద్వారా 38250 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఈ పథకాన్ని ప్రారంభించినారు. ప్రాజెక్టులో ఇమిడి ఉన్న సాంకేతిక, ఇతరత్రా సమస్యలను పరిష్కరించి, తగినన్ని నిధులు సమకూర్చగలిగితే 2 ఏండ్లలో ప్రాజెక్టు పనులు పూర్తి చెయ్యవచ్చునని ఇంజనీర్లు భరోసా ఇస్తున్నారు.

పైన వివరించిన ప్రాజెక్టులను 2 ఏండ్లలో పూర్తి చేయగలిగితే నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ భూతాన్ని అంతం చేయవచ్చు. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రజల వలసలను ఆపవచ్చు. వలసబోయి అరిగోస పడుతున్న వలస కూలీలు తమ ఊళ్ళకు తిరిగి రావడానికి అవకాశాలను మెరుగుపరచవచ్చు.

## కృష్ణా బెసిన్లో చేపట్టవలసిన ప్రాజెక్టులు

### పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం

నిర్మాణం కొనసాగుతున్న ప్రాజెక్టులకు అదనంగా మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టులను సీమాంధ్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అందులో ఎన్నో రోజుల నుండి ప్రజల్లో నానుతున్న ప్రాజెక్టు పాలమూరు –

రంగారెడ్డి ఎత్తిపోతల పథకం. మహబూబ్‌నగర్ , రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో 10 లక్ష ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించే ఈ బృహత్తర పథకాన్ని తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్లు ప్రభుత్వంతో పోరాడి సర్వే చేయించి డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేయించేందుకు జీవో జారీ చేయించగలిగినారు కానీ టెండర్లు పిలిచి కూడా అనేక అడ్డంకులను కలిగించి టెండర్లు ఖరారు కాకుండా కుట్ర చేసినారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందే టెండర్ల ఖరారు పూర్తి అయితే సీమాంధ్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం ఉండేది కాదు. అయితే విషాదం ఏమిటంటే సాగునీటి శాఖలో ఉన్న ఇద్దరు ఈఎన్‌సిలు, ప్రాజెక్టు సీఈగా తెలంగాణవారే ఉన్నప్పటికీ ఈ పథకం టెండర్లు ఖరారు కాలేకపోవడం. ఇప్పుడు ఈ పథకం విభజన చట్టం ప్రకారం మొదట కృష్ణా బోర్డు ఆమోదం పొందాలి. ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందాలి. ఈ అపెక్స్ కౌన్సిల్ లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉంటారు. కేంద్ర జలవనరుల మంత్రి ఛైర్మన్‌గా ఉంటారు. అంటే పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భవిష్యత్తు చంద్రబాబు చేతుల్లో ఉందన్న మాట. ఆయన ఒప్పుకుంటేనే ఈ ప్రాజెక్టు సాధ్యపడుతుంది. మన ఇద్దరు ఈఎన్‌సిల నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టుకు ఈ కష్టాలు వచ్చిపడ్డాయి అని నీటిపారుదల శాఖలో ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. అయినాసరే తెలంగాణ ప్రభుత్వం ఈ పథకం డిపిఆర్ తయారీకి వెంటనే టెండర్లు ఖరారు చెయ్యాలి. లేదా సమర్థుడైన కన్సల్టెంటింగ్ సంస్థ ద్వారా డిపిఆర్ తయారీకి ఆదేశాలు జారీ చెయ్యాలి. ఇది మూడు జిల్లాలకు, ముఖ్యంగా మహబూబ్ నగర్ జిల్లాకు వరప్రదాయని. సమైక్య రాష్ట్రంలో అత్యధికంగా నష్టపోయిన జిల్లాకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా ప్రభుత్వం పరిగణించాలి. కేంద్ర ప్రభుత్వం ద్వారా దీన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటింపచేయడానికి తీవ్రంగా కృషి చెయ్యాలి.

### డిండి ఎత్తిపోతల పథకం

నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు సాగునీరు, తాగునీరు కల్పించేందుకు తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్లు ఈ పథకాన్ని రూపొందించినారు. ఫ్లోరైడ్ భూతాన్ని సంపూర్ణంగా తరిమివెయ్యాలంటే ఉపరితల నీటి సరఫరా ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని ఫ్లోరైడ్ మీద విస్తృత పరిశోధనలు చేసిన డా. డి.రాజారెడ్డి గారు తెలియజేసినారు. తాగునీటి ద్వారా మనిషి శరీరంలోనికి వెళ్ళే ఫ్లోరైడ్ 10% మాత్రమేనని, ఫ్లోరైడ్ నీటితో సాగుచేసి ఉత్పత్తి చేసిన ధాన్యాలు, కూరగాయలు, పాలు తదితర ఆహారఉత్పత్తుల ద్వారానే శరీరంలోనికి 90% ఫ్లోరైడ్ వెళుతుందని ఆయన వెల్లడించారు. ఆఖరికి ఈ ఆహార ఉత్పత్తులను తీసుకున్న తల్లి పాలల్లో కూడా ఫ్లోరైడ్ చేరి చంటి పిల్లల్లోకి వెళుతుందని ఆయన పరిశోధనలు వెల్లడించినాయి. అందువల్ల ఫ్లోరైడ్ మహమ్మారి ప్రభావంలో ఉన్న నల్లగొండ జిల్లాలోని 14 మండలాలను ఫ్లోరైడ్ విముక్త ప్రాంతంగా మార్చాలంటే ఉపరితల నీటిపారుదల వ్యవస్థ కల్పించడం ఒక్కటే మార్గం. ఇప్పటికే ఈ ప్రాజెక్టు డిపిఆర్ తయారయ్యింది. టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టించడమే తరువాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును సమీక్షించి, సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించి వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

### జూరాల - పాకాల వరద కాలువ పథకం

జూరాల ప్రాజెక్టు వద్దకు వచ్చే కృష్ణా వరద జలాలను వాలు కాలువ ద్వారా వరంగల్ జిల్లా పాకాల దాకా తరలించేందుకు ఉద్దేశించిన పథకం ఇది. సుమారు 400 కి.మీటర్ల పొడవుండే ఈ కాలువ దారిలో అనేక బ్యాలన్సింగ్ రిజర్వాయర్లను, చెరువులను నింపుతూ సాగుతుంది. దీని వలన మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో 4 లక్షల ఎకరాల భూమి ప్రత్యక్షంగా సాగులోనికి వస్తుంది. వందలాది చెరువులని నింపినందువలన లభించే అదనపు ప్రయోజనాలు ఎన్నో. తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఈ పథకానికి డిపిఆర్ తయారు చేయించడానికి ఆదేశాలు జారీ చెయ్యాలి.

### (2) గోదావరి బేసిన్

గోదావరి బెసిన్లో సమైక్య ప్రభుత్వం అనేక భారీ, మధ్యతరహా, ఎత్తిపోతల పథకాలని జలయజ్ఞంకు ముందు, జలయజ్ఞంలోను చేపట్టినారు. అవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. జలయజ్ఞంలో పూర్తి అయినట్లు ప్రభుత్వం ప్రకటించిన ప్రాజెక్టులు మూడు. అవి నిజామాబాద్ జిల్లాలో అలిసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలు, ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న సుద్దవాగు మధ్యతరహా ప్రాజెక్టు. అలిసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలు నిజాంసాగర్ ఆయకట్టు స్థిరీకరణకు ఉద్దేశించినవి. వీటి ద్వారా ఒక్క ఎకరం కొత్తగా సాగులోకి రాలేదు. ఇక సుద్దవాగు ప్రాజెక్టు కింద నిర్దేశిత ఆయకట్టు 14000 ఎకరాలు. డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం పూర్తి కాకపోవడం వలన ఇప్పటిదాకా 5000 ఎకరాలకు మించి నీరు ఇచ్చిన దాఖలాలు లేవు. జలయజ్ఞంలో అనేక ప్యాకేజీల్లో ప్రాజెక్టుల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్నింటిలో హెడ్ వర్క్స్ అంటే డ్యామ్, స్పిల్వే గేట్లు తదితర పనులు పూర్తి అయితే కాలువలు పూర్తి కాలేదు. అట్లనే కాలువలు పూర్తి అయితే డ్యామ్ పనులు పూర్తి కాలేదు. కొన్ని ప్రాజెక్టుల్లో పనులు పూర్తి అయిన కాడికి పాక్షిక ప్రయోజనాలు ఇస్తున్న పరిస్థితి కూడా ఉన్నది. సారాంశంలో చెప్పాలంటే 2004లో ప్రారంభమయిన జలయజ్ఞం ప్రాజెక్టులు 10 ఏండ్ల తర్వాత చూస్తే నిర్దేశిత లక్ష్యాలకు ఆమడ దూరంలో ఉన్నాయి. కారణాలు ఏవైనా వాస్తవం ఇదే. తెలంగాణ ప్రభుత్వం గోదావరి బేసిన్లో కొనసాగుతున్న ప్రాజెక్టుల పనులను కూలంకషంగా సమీక్షించి 2 సంవత్సరాల్లో పూర్తి అయ్యే ప్రాజెక్టులను గుర్తించి వాటిని పూర్తి చెయ్యాలి. అట్లే 5 ఏండ్లలో మిగిలిన ప్రాజెక్టులను పూర్తి చెయ్యడానికి ప్రణాళికను రచించుకోవాలి.

**1. భారీ ఎత్తిపోతల పథకాలు**

| క్ర.సం. | ప్రాజెక్టు | ప్రయోజనం పొందే జిల్లా | ఆయకట్టు(ఎకరాల్లో) |
|---|---|---|---|
| 1. | ఎస్ఆర్ఎస్పి వరద కాలువ | కరీంనగర్, వరంగల్, నల్లగొండ | 220000 |
| 2. | దేవాదుల ఎత్తిపోతల పథకం | వరంగల్,నల్లగొండ, కరీంనగర్, | 620600 |
| 3. | ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం | కరీంనగర్ | 220000 |
| 4. | సింగూరు కాలువ | మెదక్ | 40000 |
| 5. | ఎస్ఆర్ఎస్పి రెండో దశ | వరంగల్, ఖమ్మం, నల్లగొండ | 440000 |
| 6. | దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకం | ఖమ్మం | 200000 |
| 7. | కాళేశ్వరం ఎత్తిపోతల | కరీంనగర్ | 45000 |
| 8. | ప్రాణహిత – చేవెళ్ళ ఎత్తిపోతల పథకం | ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, వరంగల్ | 1640000 |
| 9. | కాంతానపల్లి ఎత్తిపోతల పథకం నగరానికి నీటి సరఫరా | వరంగల్, హైదరాబాద్ | 424000 |

**2. మధ్యతరహా ప్రాజెక్టులు**

| క్ర.సం. | ప్రాజెక్టు | ప్రయోజనం పొందే జిల్లా | ఆయకట్టు(ఎకరాల్లో) |
|---|---|---|---|
| 1. | కొమురంభీమ్ ప్రాజెక్ట్ | ఆదిలాబాద్ తూర్పు | 45500 |
| 2. | మత్తడివాగు ప్రాజెక్ట్ | ఆదిలాబాద్ పశ్చిమ | 8500 |
| 3. | నీల్వాయి ప్రాజెక్ట్ | ఆదిలాబాద్ తూర్పు | 13000 |
| 4. | రాలివాగు ప్రాజెక్ట్ | ఆదిలాబాద్ తూర్పు | 6000 |
| 5. | గొల్లవాగు ప్రాజెక్ట్ | ఆదిలాబాద్ తూర్పు | 9500 |
| 6. | పెద్దవాగు ప్రాజెక్ట్(జగన్నాద్ పూర్) | ఆదిలాబాద్ తూర్పు | 15000 |
| 7. | సుద్దవాగు ప్రాజెక్ట్ | ఆదిలాబాద్ పశ్చిమ | 14000 |
| 8. | కిన్నెరసాని కాలువ | ఖమ్మం | 10000 |
| 9. | పాలెం వాగు ప్రాజెక్ట్ | ఖమ్మం | 10132 |
| 10. | మోడికుంటవాగు | ఖమ్మం | 13591 |
| 11. | లెండి ప్రాజెక్ట్ | నిజామాబాద్ | 22000 |
| 12. | చౌటుపల్లి హనుమంత్‌రెడ్డి ఎత్తిపోతల | నిజామాబాద్ | 7500 |

## గోదావరి బెసిన్లో కొనసాగుతున్న ప్రాజెక్టులు

పైన పేర్కొన్న పథకాలను పూర్తి చేయడానికి పెద్దగా కష్ట పడవలసిన అవసరం ఏమీలేదు. వీటిలో అనేకం వివిధ దశల్లో ఉన్నాయి. 2 ఏండ్లలో పూర్తి అయ్యే ప్రాజెక్టులు ఏవి, 5 ఏండ్లలో పూర్తి అయ్యేవి ఏవి అనే వర్గీకరణ చేసుకొని ఆ మేరకు నిధుల కేటాయింపులు చేసుకొని పనులను పూర్తి చేసుకోగలిగితే ఈ ప్రాజెక్టుల నిర్దేశిత లక్ష్యం తప్పక నెరవేరుతుంది.

## కాంతానపల్లి ఎత్తిపోతల పథకం


కాంతానపల్లి ఎత్తిపోతల పథకానికి సీమాంధ్ర ప్రభుత్వం 10000 కోట్ల పాలనా అనుమతి ఇచ్చి కూడా కేవలం 1800 కోట్లతో బ్యారేజి నిర్మాణానికి మాత్రమే టెండర్లు పిలవడానికి అనుమతినిచ్చింది. తెలంగాణ ప్రభుత్వం మొత్తం పథకానికి పనులు మొదలు పెట్టించాలి. ఇది దేవాదులకు జలాశయాన్నిచ్చి ప్రాణం పోస్తుంది. అట్లే శ్రీరామసాగర్ రెండో దశ ఆయకట్టుకు సాగునీరు అందజేస్తుంది. హైదరాబాద్ నగరానికి తాగునీటిని సరఫరా చేస్తుంది. ఈ పథకం ద్వారా నగరానికి తాగునీటిని గనుక సరఫరా చేయగలిగితే సింగూరును హైదరాబాద్ డీలింక్ చేసి ఆ నీటిని మెదక్ జిల్లాలోని సింగూరు కాలువ ఆయకట్టుకు, ఘన్‌పూర్ ఆనకట్ట ఆయకట్టుకు, నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్ ఆయకట్టుకు సమృద్ధిగా నీటిని అందించవచ్చు. ఈ రెండు జిల్లాలకు మంజీరా తప్ప మరో నీటి వనరు లేదు. ఆ నీటిని మొత్తం నగరమే తాగేస్తున్నది. కాబట్టి సింగూరును హైదరాబాద్ నుంచి విముక్తం చేసే ప్రతిపాదనని కూడా తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా పరిశీలించవలసిన అవసరం ఉన్నది.

## ప్రాణహిత - చేవెళ్ళ ఎత్తిపోతల పథకం

ఈ పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని తెలంగాణ ప్రజల డిమాండ్. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లులో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించగానే 7 తెలంగాణ జిల్లాల్లో 16 లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ బృహత్తర ఎత్తిపోతల పథకాన్ని కూడా జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలన్న డిమాండ్ ఊపందుకున్నది. జలయజ్ఞంలో భాగంగా ఈ పథకాన్ని మొదటి నుంచి చివరి దాకా పనులను 20 పైగా ప్యాకేజీలుగా విడగొట్టి పనులను ప్రారంభించింది. ఆదిలాబాద్ జిల్లాలో తుమ్మిడిహట్టి గ్రామం వద్ద నిర్మించ తలపెట్టిన బ్యారేజి పనులు మాత్రం ప్రారంభం కాలేదు. మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేనిదే బ్యారేజి నిర్మాణం మొదలు కావడం సాధ్యం కాదు. ప్రాజెక్టు పనులని ప్రారంభించిన తీరుపై ప్రజల నుంచి, ఇంజనీర్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవుతున్నది. ఏ సాగునీటి ప్రాజెక్టు అయినా తల నుంచి మొదలై తోక దాకా పోవాలి. ఎందుకంటే పాక్షికంగా సాగునీరు అందించే అవకాశం ఉంటుంది. ఇక్కడ తల దగ్గర పనులు లేవు కానీ తోక భాగమైన రంగారెడ్డి జిల్లాలో ప్యాకేజీ పనులు కొనసాగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులని సమీక్షించి తల నుండి పనులను పూర్తి చేసుకుంటూ తోక దాకా వచ్చేటట్టు ప్రణాళిక తయారు చేసుకోవాలి. బ్యారేజి నిర్మాణం, ఎల్లంపల్లి జలాశయం వరకు ఎత్తిపోతల పనులు, ఆ తర్వాత మిడ్ మానేరు జలాశయం దాకా పనులు, ఆ తర్వాత మరింత తోక భాగం వైపుకు వచ్చినప్పుడు ప్రాజెక్టు నుంచి పాక్షిక ప్రయోజనాలను పొందవచ్చు. శ్రీరామ సాగర్ సిస్టమ్ లోనికి ప్రాణహిత నీటిని చేర్చగల్గితే శ్రీరామ సాగర్ జలాశయం నుంచి అటు ఆదిలాబాద్ ప్యాకేజీ పనులను, ఇటు నిజామాబాద్ ప్యాకేజీ పనులను పూర్తి చేసి సాగునీరు అందివ్వొచ్చు. అట్లే మిడ్ మానేరు నుంచి అప్పర్ మానేరుకు ఎత్తిపోతల పనులు పూర్తి చేసి అప్పర్ మానేరు ప్రాజెక్టును నింపవచ్చు. శ్రీరామ సాగర్ సిస్టమ్ లోనికి ప్రాణహిత నీటిని తరలించకుండా గోదావరి నీటిని ఈ పథకం ద్వారా వినియోగించడం అంటే శ్రీరామ సాగర్ ఆయకట్టుకు అన్యాయం చెయ్యడమే అవుతుంది. అందుకని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు పెడుతున్నప్పుడు ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయించడం అవసరం. ప్రాణహిత – చేవెళ్ళ ఎత్తిపోతల పథకానికి అటువంటి సమగ్ర ప్రణాళిక అవసరమని ఇంజనీర్లు భావిస్తున్నారు.

## ఇచ్ఛంపల్లి ప్రాజెక్టు

పైన చెప్పుకున్నట్లు ఇచ్ఛంపల్లి ప్రాజెక్టు పోలవరం సమకాలీన ప్రాజెక్టు. పోలవరంకు ఎటువంటి ముంపు, పునరావాస సమస్యలు, పర్యావరణ సమస్యలు, అంతర్రాష్ట్ర వివాదాలు ఉన్నాయో అటువంటివే ఇచ్ఛంపల్లి ప్రాజెక్టుకు కూడా ఉన్నాయి. అయితే వడ్డించేవాడు మనవాడైతే పంక్తిలో ఎక్కడ కూర్చున్నా పర్వాలేదన్నట్లు పోలవరం ఆంధ్రా ప్రాజెక్టు కాబట్టి ఎన్ని వివాదాలు ఉన్నా, ఎన్ని కోర్టు కేసులు ఉన్నా ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. అది జాతీయ ప్రాజెక్టుగా కూడా ప్రకటించబడింది. ఇచ్ఛంపల్లి తెలంగాణ ప్రాజెక్టు కనుక అటకెక్కి ఏండ్లకేండ్లు దుమ్ము కొట్టుకపోతుంటది.



ఇచ్ఛంపల్లి ప్రాజెక్టును ప్రతిపాదించింది నిజాం ప్రభుత్వం. నిజాం పోయిండు. 60 ఏండ్ల వలస గ్రహణం కూడా తొలగి పోతున్నది. తెలంగాణ ప్రభుత్వం ఇచ్ఛంపల్లి ఫైలు దుమ్ము దులిపి పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్‌లతో చర్చలను పున: ప్రారంభించి అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించుకొని ప్రాజెక్టు సాకారం చేసుకోవాలి. ప్రాజెక్టు ఎంత ఎత్తుకు కట్టాలి అనేదే ఇక్కడ ప్రధానమైన సమస్య. తొలి ప్రతిపాదన ప్రకారం ప్రాజెక్టును 112.77 మీటర్ల ఎత్తుకు కట్టాలి. ఆ మట్టం వద్ద మహారాష్ట్రలో, ఛత్తీస్‌గడ్‌లో ముంపు చాలా ఎక్కువగా ఉండడంతో ఆ రాష్ట్రాలు ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పుకోలేదు. సీమాంధ్ర ప్రభుత్వం కూడా వారిని ఒప్పించేందుకు చర్యలు తీసుకోలేదు. చివరకు కేంద్ర జలసంఘమే ఎత్తును 95 మీ తగ్గించుకోమని సలహా ఇచ్చింది. 95 మీటర్ల ఎత్తు వద్ద ముంపు గణనీయంగా తగ్గిపోతుంది. 400 టిఎంసిల నిల్వ సామర్థ్యం 30 టిఎంసిలకు పడిపోతుంది. వాలు మార్గం ద్వారా నీటి సరఫరా జరుగదు. ఎత్తిపోతల పథకంగా మారుతుంది. విద్యుత్ ఉత్పత్తి 975 మెగావాట్ల నుండి 100 మె.వా.లకు తగ్గిపోతుంది. సాంకేతికంగా చూసినప్పుడు ఇచ్ఛంపల్లి స్థలం డ్యాం నిర్మాణానికి అనుకూలమైనది. మొదట కేంద్ర జల సంఘం సూచన మేరకు 95 మీ. ఎత్తు వద్దనే 122.77 మీల ఎత్తుకు సరిపోయే పునాదులమీద చిన్న డ్యామునైనా నిర్మించాలని తెలంగాణ ఇంజనీర్లు గతంలోనే సూచించినారు. ఆ తర్వాత పరిస్థితులు అనుకూలించి 112.77 మీ.ల ఎత్తుకు పెంచుకోవచ్చునని వారు సూచించినారు. ఈ చిన్న డ్యాము ద్వారా దేవాదులకు కావలసినప్పుడు నీటిని విడుదల చేయవచ్చు. 100 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి చేయవచ్చు. తెలంగాణ ప్రభుత్వం ఇరుగు పొరుగు రాష్ట్రాలతో చర్చలు ప్రారంభించి ఇచ్ఛంపల్లి నిర్మాణానికి తొవ్వ సరి చేసుకోవాలి. ఇచ్ఛంపల్లిపై ఒక కొత్త ఒప్పందం చేసుకోవాలి. పాత ఒప్పందంపై సంతకాలు చేసిన రెండు రాష్ట్రాలు (మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్) ఇప్పుడు ఉనికిలో లేవు. కనుక ఇచ్ఛంపల్లిపై కొత్త ఒప్పందానికి ప్రయత్నించాలి. పాత ఒప్పందంలోని లోపాలని సవరించుకోవాలి. ఏది ఏమైనా తెలంగాణ ప్రభుత్వం ఇచ్ఛంపల్లి ప్రాజెక్టును ఎజెండా మీదకు తీసుకురావాలి.

### దుమ్ముగూడెం - నాగార్జునసాగర్ టేల్‌పాండ్ ప్రాజెక్టు

ఇది తెలంగాణ పేరు మీద నిర్మాణం అవుతున్న సీమాంధ్ర ప్రాజెక్టు. 165 టిఎంసిల గోదావరి నీటిని దుమ్ముగూడెం వద్ద నుంచి 8 స్టేజీల్లో ఎత్తిపోసి నాగార్జున సాగర్ కింద నిర్మిస్తున్న టేల్‌పాండ్ డ్యాంలో నింపుతారు. సాగర్ డ్యాంలో ఉన్న రివర్సిబుల్ టర్బైన్‌ల ద్వారా పంపింగ్ చేసి సాగర్ డ్యాంలోకి ఎత్తిపోస్తారు. అక్కడి నుండి కుడి కాలువ ద్వారా సాగర్ ఆయకట్టుకు సరఫరా చేస్తారు. టేల్ పాండ్‌కు వచ్చే దారిలో ఎడమ కాలువకు చెందిన 21 వ డిస్ట్రిబ్యూటరీలో కొంత నీటిని పోస్తారట. 19500 కోట్ల ప్రజా ధనాన్ని ఖర్చు పెట్టి నిర్మిస్తున్న ప్రాజెక్టు వలన ఒక్క ఎకరం భూమి కొత్తగా సాగులోకి రాదు. సాగర్ ఆయకట్టు స్థిరీకరణ మాత్రమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. సాగర్ ఆయకట్టు స్థిరీకరణ ఎందుకు అవసరమైంది? ఎందుకంటే... శ్రీశైలం జలాశయం నుంచి 250 టిఎంసిల నీటిని రాయలసీమకు అక్రమంగా తరలించుకుపోయినందు వల్ల నాగార్జున సాగర్ ఆయకట్టుకు, కృష్ణా డెల్టా ఆయకట్టుకు ఏర్పడబోయే నీటి కొరతను తీర్చడానికి రాజశేఖర రెడ్డి ప్రతిపాదించిన ప్రాజెక్టులు రెండు. ఒకటి పోలవరం ప్రాజెక్టు. రెండోది దుమ్ముగూడెం – నాగార్జున సాగర్ టేల్ పాండ్ ప్రాజెక్టు. 1975 లో జారీ అయిన Godavari Water dispute tribunal Awardలో 80 టిఎంసిల నీటిని పోలవరం ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా కృష్ణా బ్యారేజికి తరలించడానికి ఉన్న అవకాశాన్ని ఆయన వినియోగించు కోదలచినాడు. దుమ్ముగూడెం – నాగార్జున సాగర్ టేల్ పాండ్ ప్రాజెక్టు ద్వారా 165 టిఎంసిల గోదావరి నీటిని నాగార్జునసాగర్ ఆయకట్టుకు తరలించడానికి ఎత్తుగడ వేసినాడు. అంటే మొత్తం 245 టిఎంసిల గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు తరలించడానికి ఆయన



| ఎ. తెలంగాణలో పంపింగ్ స్టేషన్లు | | | | |
|---|---|---|---|---|
| క్రసం | ఎత్తిపోతల పథకం | ప్రస్తుత వినియోగం (మెగావాట్లలో) | నిర్మాణంలో ఉన్న పథకాలు(మెవా) | |
| | | | 2014 చివరి నాటికి ఎత్తిపోతల పథకాలు | 2015 చివరినాటికి పూర్తయ్యే పథకాలు (మెగావాట్లలో) |
| ఎ. | **కృష్ణా బేసిన్ లో పథకాలు** | | | |
| 1. | కల్వకుర్తి స్టేజ్ – 1 | 30 | 120 | – |
| 2 | కల్వకుర్తి స్టేజ్ – 2 | – | 150 | – |
| 3 | కల్వకుర్తి స్టేజ్ – 3 | – | 150 | – |
| 4 | నెట్టంపాడు స్టేజ్ – 1 | 68 | – | – |
| 5 | నెట్టంపాడు స్టేజ్ – 2 | 51 | – | – |
| 6 | బీమా లిఫ్ట్ –1 | 48 | – | – |
| 7 | బీమా లిఫ్ట్ –2 | 48 | – | – |
| 8 | కోయిల్ సాగర్ | 30 | – | – |
| 9 | ఏఎంఆర్‌పి | 72 | – | – |
| 10 | ఏఎంఆర్‌పి ఎల్ఎల్‌సి | – | 12 | – |
| 11 | ఉదయసముద్రం | – | 32 | – |
| | **మొత్తం** | 347 | 464 | – |
| **బి. గోదావరి బేసిన్‌లో పథకాలు** | | | | |
| 1. | గుత్పా | 16 | – | – |
| 2. | అలీసాగర్ | 25 | – | – |
| 3. | చౌటుపల్లి హనుమంత్‌రెడ్డిఎత్తిపోతలు | 5.24 | – | – |
| 4. | దేవాదుల ఫేజ్–1 | 50 | – | – |
| 5. | దేవాదుల ఫేజ్–2 | 84 | – | – |
| 6. | ఎల్లంపల్లి – ఎన్‌టిపిసి | 10 | 110 | – |
| 7. | కాళేశ్వరం ఎత్తిపోతల పథకం | – | 12 | – |
| 8. | దుమ్ముగూడెం రాజీవ్ సాగర్ | – | 120 | – |
| 9. | ప్రాణహిత – చేవెళ్ళ | – | | 80 |
| | మొత్తం | 190.24 | 242 | 80 |
| **ABSTRACT:** | | | | |
| కృష్ణ బేసిన్ లో పథకాలు | | 347 | 464 | – |
| గోదావరి బేసిన్ లో పథకాలు | | 190 | 242 | 80 |
| **మొత్తం** | | 537 | 706 | 80 |

**సారాంశం**

| | | |
|---|---|---|
| 1. | ప్రస్తుతం వినియోగంలో ఉన్నవిద్యుత్తు (మెగావాట్లలో) | 537 |
| 2. | 2014 చివరినాటికి పూర్తి అయ్యే పథకాలకు అవసమయ్యే విద్యుత్తు (మెగావాట్లలో) | 706 |
| 3. | 2015 చివరినాటికి పూర్తి అయ్యే పథకాలకు అవసరమయ్యే విద్యుత్తు (మెగావాట్లలో) | 80 |
| | **మొత్తం** | **1323** |

పథకం వేసినాడు. పోలవరంపై అప్పటికే అంతర్రాష్ట్ర వివాదాలు, ముంపు, పునరావాస సమస్యలు ముప్పిరిగొని ఉన్నాయి. ఆ సమస్యల కారణంగానే చంద్రబాబు ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయంగా రెండు ఎత్తిపోతల పథకాలను ప్రతిపాదించి అమలు చేసినాడు. అవే గోదావరికి కుడి వైపున తాడిపూడి ఎత్తిపోతల పథకం , ఎడమవైపున పుష్కర ఎత్తిపోతల పథకం. ఈ రెండు ఎత్తిపోతల పథకాల వలన



పోలవరం ఆయకట్టులో చాలావరకు సాగులోకి వచ్చినాయి. 2004 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు బదులు దేవాదుల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసిన సంగతి మనందరికెరుకే. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించుకోకుండానే, కేంద్ర జల సంఘం, పర్యావరణ, అటవీ అనుమతులు లేకుండానే రాజశేఖర రెడ్డి మొండిగా పోలవరం కాలువల తవ్వకానికి అనుమతులు మంజూరు చేసినాడు. ఇపిసి పద్ధతిలో టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభింపచేసినాడు. అయితే పొరుగు రాష్ట్రాలు, తెలంగాణ ఉద్యమకారులు సుప్రీం కోర్టులో కేసులు వేసినందున డ్యామ్ నిర్మాణం మాత్రం సాధ్యం కాలేదు. ఇక రెండో పథకమైన దుమ్ముగూడెం–నాగార్జున సాగర్ టేల్ పాండ్ ప్రాజెక్టును కూడా ఎటువంటి అధ్యయనాలు లేకుండానే, సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండానే, ఎప్పటిలాగానే ఎటువంటి అనుమతులు లేకుండానే కాకి లెక్కలు వేసి అంచనాలు తయారుచేసి ఇపిసి పద్ధతిలో టెండర్లు ఖరారు చేసి పనులు మొదలు పెట్టించినాడు. కాంట్రాక్టర్లకు అడ్వాన్సులు చెల్లించినారు. ఈ ప్రాజెక్టు పనులు నిధుల కొరత వలన రెండు సంవత్సరాలుగా ఆగిపోయినాయి. రాష్ట్ర విభజన ఖరారు కాగానే ఈ ప్రాజెక్టు పనులు తిరిగి ప్రారంభమైనాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను వెంటనే నిలిపివేసి కూలంకషంగా సమీక్షించి టెండర్లను రద్దు చెయ్యాలి. టిఆర్ఎస్ తన మానిఫెస్టోలో కూడా ఈ ప్రాజెక్టును నిలిపివేస్తామని పేర్కొన్నది. ఇప్పుడు టిఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడింది గనుక తెలంగాణ పేరు మీద నిర్మాణం అవుతున్న ఈ దొంగ ప్రాజెక్టును వెంటనే నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలి.

## పాత సాగునీటి వ్యవస్థల ఆధునికీకరణ

సీమాంధ్రలో ఉన్న అన్ని పురాతన సాగునీటి వ్యవస్థలని సీమాంధ్ర ప్రభుత్వం ఆధునికీకరించింది. కృష్ణా డెల్టా , గోదావరి డెల్టా, పెన్నా డెల్టా, కేసి కెనాల్ ఆధునికీకరణ ఎప్పుడో జరిగి పోయింది. కృష్ణా ఆనకట్ట, గోదావరి ఆనకట్ట, సుంకేసుల ఆనకట్ట, సోమశిల ఆనకట్ట ఇవన్నీ బ్యారేజీలుగా మారినాయి. నిజాం ప్రభుత్వం నిర్మించిన రాజోలిబండ(మహబూబ్ నగర్ జిల్లా), ఘన్‌పూర్ (మెదక్ జిల్లా), సదర్ మాట్ (ఆదిలాబాద్ జిల్లా) ఆనకట్టలు మాత్రం బ్యారేజీలుగా మారలేదు. తెలంగాణ ప్రభుత్వం పురాతన సాగునీటి వ్యవస్థలని ఆధునికీకరించి ఆనకట్టలను బ్యారేజీలుగా మార్చి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి వాటి కింద ఉన్న ఆయకట్టును స్థిరీకరించాలి.

## ఎత్తిపోతల పథకాలకు అనుబంధ విద్యుత్ ప్లాంట్లు

తెలంగాణలో గోదావరి, కృష్ణా బేసిన్లలో నిర్మాణం అవుతున్న భారీ ఎత్తిపోతల పథకాలకు డిసెంబర్ 2015 నాటికి సుమారు 1324 మెగావాట్ల కరెంటు అవసరమవుతుంది. వాటి వివరాలు ఈ పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

పై ప్రాజెక్టులు పూర్తయ్యే నాటికి విద్యుత్ ఉత్పత్తి కూడా పెరగక పోతే అవి ప్రజలకు, ప్రభుత్వానికి తెల్ల ఏనుగు వలె భారంగా మారుతాయి. అందుకని మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాల ఎత్తిపోతల పథకాలకు ఒక dedicated విద్యుత్ ప్లాంట్, వరంగల్, ఖమ్మం జిల్లాల ఎత్తిపోతల పథకాలకు ఒక విద్యుత్ ప్లాంట్, నిజామాబాద్, ఆదిలాబాద్, ప్రాణహిత–చేవెళ్ళ ఎత్తిపోతల పథకానికి ఒక విద్యుత్ ప్లాంట్ నిర్మించగలిగితే నీటిని ఎత్తి పోసేటప్పుడు కరెంటును వాడుకొని, మిగతా సమయాల్లో గ్రిడ్‌కు కలిపితే ప్రాజెక్టులకు ఉపయోగం, రాష్ట్రానికి ఉపయోగం అని కరెంటు ఇంజనీర్లు చెబుతున్నారు. అది సాంకేతికంగా, ఆర్థికంగా కూడా సాధ్యమేనని వారు లెక్కలు వేసి చెబుతున్నారు. కృష్ణా, గోదావరి జలాలను వినియోగించు కోవాలంటే తెలంగాణకు ఎత్తిపోతల పథకాలే శరణ్యం కనుక ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం ఆలోచించక తప్పదు.

***(ఈ వ్యాసం రాయడానికి ఆర్. విద్యాసాగరరావు, డా.డి.రాజారెడ్డి, ఎం.శ్యామ్ ప్రసాద్ రెడ్డి, పెంటారెడ్డి, సల్లా విజయ్ కుమార్ గార్లు రాసిన పుస్తకాలను, వ్యాసాలను సంప్రదించాను. వారికి కృతజ్ఞతలు)***

❖

# తెలంగాణలో
# విద్యుత్ సవాళ్లు-పరిష్కారాలు

ఎస్.శివాజీ
అధ్యక్షులు
ఎలక్ట్రిసిటి ఇంజనీర్స్ అసోసియేషన్

***తెలంగాణ ప్రజల 60 ఏండ్ల ఆకాంక్ష, నాలుగున్నర కోట్ల ప్రజల పోరాట ఫలితంగా, అమరుల త్యాగం వలన, జూన్ 2న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ప్రజలు ప్రాణాలు అర్పించి తెచ్చుకున్న తెలంగాణాను తమ ఆకాంక్షలకు ప్రతిరూపంగా, బంగారు తెలంగాణ నిర్మించుకునే ప్రయత్నంలో ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులు ఈ బాధ్యతలను స్వీకరించాలి.***

ఇక్కడి నిరుద్యోగ యువతి, యువకులను ఉపాధి అవకాశాలు కల్పించటంతో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి విద్యుత్ రంగానికి పెద్ద పీట వేయవలసిన ఆవశ్యకత ఉన్నది.

1990లో జరిగిన లిబరలైజేషన్, గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్ లో భాగంగా విద్యుత్ సెక్టార్‌లో కూడా ప్రైవేట్ పవర్ ప్లాంట్‌లు రావటంతో ఈ సెక్టార్‌లోనూ తమ లాభాలను రాజకీయ నాయకులు వాడుకోవటం మొదలయింది. అందు వలన కరెంట్ ఛార్జీలు పెరిగి సామాన్యుడికి భారంగా మారింది. పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పిడిఎ)ల పేరుతో చాలా అవకతవకలు జరిగినాయన్నది బహిరంగసత్యం.

భౌగోళికంగా తెలంగాణ పొడినేలలు కల్గియున్నది. ఈ తెలంగాణ గుండా దక్షిణ భారతదేశంలోనే రెండు అతిపెద్ద నదులయిన కృష్ణా, గోదావరి ప్రవహిస్తున్నప్పటికి ఇక్కడి రైతులు ఇంకా బోరుబావులు, ఓపెన్ బావుల(చెరువులు) పైనే ఆధారపడి వ్యవసాయాన్ని కొనసాగించటం బాధాకరమైన విషయం.

తెలంగాణలో అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 19 లక్షలకుపైగా వ్యవసాయ కనెక్షన్లు, అనధికారికంగా సుమారు 10 నుంచి 20శాతం పంపుసెట్లు విద్యుత్ వినియోగించు కొంటున్నవి. తెలంగాణ రైతాంగానికి కావల్సిన నీరు అందించటం కోసం ప్రభుత్వం ప్రతిపాదించిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములకు దాదాపు 5000 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. తెలంగాణ రోజువారి వినియోగం సీజన్‌లో 170 మిలియన్ యూనిట్లకు చేరింది. ఇతర సమయాలలో రోజుకు సగటున విద్యుత్ వినియోగం 130 మిలియన్ యూనిట్లుగా ఉంది.

పొడవైన జాతీయ రహదారులు కల్గి ఉండటం వలన పరిశ్రమల స్థాపనకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా సౌర ప్లాంటు నిర్మాణానికి ఈ ప్రాంతం అనుకూలంగా ఉంది. ఎన్నో హెచ్‌టి పరిశ్రమలు, చిన్న తరహా పరిశ్రమల్ని కల్గిఉన్నది.

**తెలంగాణ సమాజం విద్యుత్ రంగం నుంచి ఈ కింది వాటిని ఆశిస్తున్నది.**

1. నాణ్యమైన, స్థిరమైన త్రీ ఫేజ్ కరెంట్ 24 గంటలు ప్రతి గ్రామానికి అందించవల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.
2. కరెంట్ ఛార్జీలు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భావిస్తున్నారు.
3. ఫ్యూయల్ సర్‌చార్జ్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్ఎస్ఎ) రూపాన పెంచుతున్న కరెంట్ ఛార్జీలు అరికట్టాలి.
4. వ్యవసాయానికి పగటి సమయంలో కనీసం 9 గంటలు విద్యుత్‌ను ఇవ్వాలి.
5. కొత్తగా అప్లై చేసుకొన్న వారికి సర్వీస్ కనెక్షన్లు ఇచ్చే ఏర్పాటు చేయాలి.
6. కరెంట్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్‌ను వెంటనే యుద్ధ ప్రాతిపదికగా మరమత్తు చేయాలి.
7. కరెంట్ చౌర్యం అరికట్టటానికి కావల్సిన జాగ్రత్తలు పాటించాలి
8. కస్టమర్ సర్వీస్‌ను పెంచాలని, కంప్లయింట్‌లను తగిన సమయంలో పరిష్కరించాలని కోరుతున్నారు.
9. జవాబుదారితనాన్ని పెంచాలి.
10. రాత్రివేళలో విద్యుత్ సరఫరా వల్ల రైతులు ఆకస్మికంగా విద్యుత్ ప్రమాదాలు జరగటం వల్ల విద్యుత్ అంతరాయాలు, అప్రకటిత అంతరాయాల వల్ల మిగతా రైతులు నష్టపోతున్నారు.
11. రూరల్ ఎలక్ట్రిఫికేషన్(గ్రామీణ విద్యుత్) చేయాలని ప్రతి గ్రామానికి విద్యుత్ అందించాలని కోరుతున్నారు.

## ప్రస్తుతమున్న విద్యుత్ పరిస్థితి

తెలంగాణలో హైడల్(జల విద్యుత్) ప్లాంట్ల ద్వారా 2542.80 మెగావాట్లు, థర్మల్ విద్యుత్ ద్వారా 2283 మెగావాట్లు సెంట్రల్ ప్రాజెక్ట్స్(తెలంగాణ) 850.33 మెగావాట్లు, సోలార్ ద్వారా 1 ఎండబ్ల్యు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అంటే మొత్తం 5677.13 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

జలవిద్యుత్ ప్లాంట్లు వర్షాల మీద ఆధారపడటంతో సంవత్సరానికి మొత్తంగా 2 నుంచి 3 నెలలలో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది.

ఈ క్రింది పట్టికలో వచ్చే 5 సంవత్సరాలలో విద్యుత్ అవసరాలు ఎలా ఉంటాయో తెలుపుతుంది.

| సంవత్సరం | అవసరమైన విద్యుత్(ఎండబ్ల్యులో) |
|---|---|
| 2014-15 | 11614 |
| 2015-16 | 12922 |
| 2016-17 | 13720 |
| 2017-18 | 14358 |
| 2018-19 | 15004 |

పై పట్టికను గమనించినట్లయితే రానున్న 5 సంవత్సరాలలో దాదాపు 15000 మె.వా. విద్యుత్ అవసరం ఉంది. కాబట్టి నూతన ప్రభుత్వాలు ముఖ్యంగా విద్యుత్ పవర్ ప్లాంట్ల మీద ప్రత్యేకమైన శ్రద్ధను చూపి కనీసం 15000 మె.వా. విద్యుత్‌ను యుద్ధ ప్రాతిపదిక మీద పవర్ ప్లాంట్‌లను నిర్మించాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ ఆక్ట్ 2014లో పిపిఎలో కొనసాగించటం కొంత ఊరటనిస్తుంది.

భారతదేశం సగటు విద్యుత్ వినియోగం 1060 యూనిట్లు ఉంది. కాని హర్యానా, గుజరాత్, ఢిల్లీ, ఉత్తర భారతంలో 1400 యూనిట్లకు పైగా వాడకం ఉంది. కాని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 6వ స్థానంలో ఉంది. ఏదైనా రాష్ట్రంగాని, దేశంగాని అభివృద్ధి చెందాలంటే, జిడిపి 10% ఉండాలని విద్యుత్ రంగాన్ని 20% పెంచాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉంది.

సీమాంధ్ర పరిపాలకుల ఆధిపత్యంలో తెలంగాణ విద్యుత్ రంగం చాలా వివక్షకు గురైంది. ఇక్కడ కట్టవల్సిన విద్యుత్ ప్లాంట్‌లు సీమాంధ్ర ప్రాంతంలోకి తరలించటం జరిగింది. దాని వల్ల 15 వేల ఉద్యోగాలు, 2 వేల మెగావాట్ల విద్యుత్‌ను తెలంగాణ కోల్పోయింది.

## సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం

తెలంగాణ ప్రజల కరెంట్ అవసరాలకు ప్రస్తుతమున్న కరెంట్ ఉత్పత్తికి వ్యత్యాసం ఎక్కువగా ఉంది. దీనికై తెలంగాణలో పవర్ జనరేషన్ ప్లాంట్లను పెంచుకోవాల్సిన అవసరం వుంది. ప్రతి(ఒక్కొక్కటి)జిల్లాకు 2×800 ఎండబ్ల్యు నిర్మించటానికి ప్రణాళికలను యుద్ధప్రాతిపదిక మీద చేసుకోవాల్సిన అవసరం ఉంది. దీని ద్వారా దాదాపు నిరుద్యోగ, యువతీయువకులకు 4 వేల మందికి ఉపాధి దొరుకుతుంది.

సెంట్రల్ హెడ్‌ను వెంటనే పెంచుకోవాల్సిన అవసరం ఉంది. దానికి అనుగుణంగా సెంట్రల్ ఎలక్ట్రిసిటి అథారిటీని ఒప్పించాల్సిన అవసరం ప్రభుత్వం పై ఉంది.

పారదర్శకంగా ఓపెన్ బిడ్డింగ్ ద్వారా ఓపెన్ యాక్సెస్‌లో అవసరాలకు అనుగుణంగా కరెంట్ కొనుక్కోవాలి.

ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాల్ని తగ్గించుకోవాలి. దానికి రియాక్టర్స్, కెపాసిటర్ బ్యాంక్, జెనరేషన్ ప్లాంట్‌కు లోకల్ సెంటర్‌కు దగ్గరగా నిర్మించాలి. అవసరాలకు కావాల్సినంతగా ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థల్ని పటిష్ఠపర్చుకోవాలి. దానికై 400 కె.వి., 220కెవి., 132 కెవి, 33 కెవి సబ్ స్టేషన్స్‌ను, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుకోవాలి.

ప్రస్తుతమున్న ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్‌ల నెట్ వర్క్‌లను లేటెస్ట్ టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకోవాలి(కండక్టర్, రిప్లేస్‌మెంట్స్, ట్రాన్స్‌ఫార్మర్, టవర్స్‌లను కాలానికి అనుగుణంగా పనిచేసేందుకు తయారు చేసుకోవాలి. కస్టమర్ కేర్ సెంటర్‌లను పెంచి దానికి తగినంత స్టాఫ్‌ను ప్రొవైడ్ చేయాలి.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా, విద్యుత్ నాణ్యత పెంచుకొనుటకు, వోల్టేజ్‌లో హెచ్చుతగ్గులను నివారించుటకు హై ఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ పనులు నిర్వహించాలి.

ప్రతి 3 లేదా 4 వ్యవసాయ కనెక్షన్లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ నెలకొల్పటం, అంతరాయం లేని విద్యుత్‌ని సరఫరా చేయటం ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా విద్యుత్ అంతరాయాలను చాలా వరకు నివారించవచ్చు. అంతేకాకుండా రైతులు కూడా ట్రాన్స్‌ఫార్మర్‌ని తన స్వంతమనే భావనలో ఉండటం జరుగుతుంది.

వ్యవసాయ కనెక్షన్లకు ప్రత్యేక లైన్లు వేయటం ద్వారా గ్రామానికి 24 గంటల అంతరాయం లేని, నాణ్యమైన విద్యుత్ అందించవచ్చు. గ్రామీణ అవసరాలకు 24 గంటలు విద్యుత్ నిరంతరంగా అందించటం వల్ల వలసలు తగ్గి విద్య, ఉపాధి అవకాశాలు, కులవృత్తులు, పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు అభివృద్ధి చెంది, సంపూర్ణ గ్రామ వికాసానికి తోడ్పడుతుంది.

జెన్‌కో ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్‌లు నిర్మాణం చేయటం వల్ల వ్యవసాయానికి పగటి పూట నిరంతర విద్యుత్‌ని అందించగలం. దీనికై ప్రత్యేక రాయితీలు సౌరప్లాంట్‌ల నిర్మాణానికి ప్రకటించాల్సి ఉంది.

సౌర విద్యుత్ అమర్చుకొని ఉత్పత్తి చేయు విద్యుత్‌లో మనం వినియోగించే విద్యుత్ పోగా మిగిలిన విద్యుత్‌ని నెట్ మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు సరఫరా చేసే విద్యుత్ రికార్డు చేసి వ్యవస్థకు అమ్మవచ్చు. ఇది మన ఇంట్లోనే ఒక పవర్ ప్లాంటు లాగా పనిచేస్తుంది. పరిశ్రమలు విద్యుత్ వినియోగదారులకు ప్రత్యేక అవకాశాలని కల్పించి, ప్రోత్సహించాలి.

పై అన్ని పనులు చేయటానికి ప్రభుత్వం ఎలక్ట్రిసిటి స్పెక్ట్రమ్ టాప్ మేనేజ్‌మెంట్ ఎప్పటికప్పుడు ప్లానింగ్, ప్రణాళికలను, కోఆర్డినేషన్, మేనేజింగ్, ఫిన్‌స్కిల్ ఆర్గనైజింగ్, రీప్లానింగ్ చేసుకొని యుద్ధప్రాతిపదికగా ప్రతి జిల్లాని ఒక యూనిట్‌గా తీసుకొని జనరేషన్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్‌లకు తగినంత బడ్జెట్‌ను కేటాయించాలి.

ప్రతి జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకోవాలి. అందువల్ల అందరికి నాణ్యమైన విద్యుత్‌ని ఇవ్వటమే కాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలతో పాటు సమతుల్యమైన అభివృద్ధి జరగుతుంది. దీనికి స్థానిక ప్రజల సహాయ-సహకారాలు అవసరం. ఎవరైతే భూమిని కోల్పోయినారో వారికి ఉద్యోగాలతో పాటు వారికి రావల్సిన నష్టపరిహారాలు ప్రభుత్వం త్వరితగతిన ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఎం.రత్నమాల
విరసం సభ్యురాలు

# తెలంగాణ రాష్ట్రం-పారిశ్రామికీకరణ

*ఆంధ్రప్రదేశ్ అవతరణకి పూర్వం తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగం కావడానికి ముందు తెలంగాణ రాష్ట్రం పారిశ్రామికంగా ఎంతో పురోభివృద్ధి చెంది దేశంలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రాల్లో (ముఖ్యంగా హైదరాబాద్ నగరం) ఒకటిగా ఉంది. నాటి హైదరాబాద్ రాష్ట్రం పారిశ్రామికంగా ఎంతో ప్రగతిని సాధించింది. (పర్యాటక రంగాన్ని కూడా పరిశ్రమ అంటున్నారు. ఈ వ్యాసంలో పారిశ్రామిక రంగం అంటే ఉత్పాదక పరిశ్రమలు మాత్రమే.) వ్యవసాయ రంగ ఉత్పత్తులు, భూగర్భ ఖనిజ సంపద, జలవనరులు అటవీ సంపద పారిశ్రామికాభివృద్ధికి ప్రాథమిక అవసరాలు, మౌలిక వనరులు. ఇవి తెలంగాణ ప్రాంతంలో సమృద్ధిగా ఉన్నాయి. ఇందువల్ల పందొమ్మిదో శతాబ్ది ప్రథమార్థం నుంచి(క్రీ.శ. 1840) నుంచి) హైదరాబాద్ రాష్ట్రంలో పరిశ్రమలు ప్రారంభమై తెలంగాణలో పారిశ్రామిక రంగం పురోగామి దిశగా ఎదిగింది. ప్రాంతీయ పురోభివృద్ధికి ఆర్థిక స్వావలంబనకు స్వయం సమృద్ధికి వ్యవసాయ రంగం పారిశ్రామిక రంగం రెండూ బండికి రెండు చక్రాల వంటివి. ఈ రెండింటి మధ్య ఉన్న సమన్వయం అనుసంధానం చక్రాలను కలిపి ఉంచే ఇరుసు.*

తెలంగాణ భూగర్భంలో సమృద్ధిగా ఉన్న ఇనుము, తదితర ఖనిజ నిక్షేపాలు, కృష్ణా, గోదావరి జలాలు, నీటి పరివాహక ప్రాంతం పొడుగునా ఇరువైపులా విస్తరించి ఉన్న అపారమైన అటవీ సంపద, బొగ్గు నిల్వలు, జలవనరులపై ఆధారపడిన విద్యుత్తు ఇవన్నీ తెలంగాణ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధికి దోహదపడిన ప్రాథమిక, మౌలిక వనరులు. ఈ వనరులు, వసతులు వినియోగించి తెలంగాణ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి పట్ల నాటి హైదరాబాద్ రాష్ట్రాన్ని పరిపాలించిన నైజాం ప్రభుత్వం శ్రద్ధ పెట్టింది. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం వంటి ఉత్పాదక రంగాలైన విద్య, వైద్యం మొదలైన సేవా రంగాలైనా వాటి పురోగమన, తిరోగమనాలు స్థానికంగా లభించే వనరులతో పాటూ ముఖ్యంగా ప్రభుత్వ విధానాలు, కల్పించే వసతుల ప్రభావం ప్రధానంగా ఉంటుంది.

తెలంగాణలో వ్యవసాయ రంగం 1930లో కరువు నాటికి(1930ల డిప్రిషన్) సుసంపన్నంగా లాభసాటిగానే ఉండింది. అయితే వ్యవసాయరంగం నించి వచ్చిన మిగులును భూమి, బంగారం మొదలైన స్థిరచరాస్తులు కొనుగోలుకు వినియోగించడమే కానీ పారిశ్రామిక పెట్టుబడి వైపుగా దృష్టి సారించే స్వభావం భూస్వామ్య సమాజానికి ఉండదు. కనుక వ్యవసాయం ద్వారా వచ్చిన మిగులు పారిశ్రామిక పెట్టుబడిగా పరిణతి చెందలేదు. అందువల్ల తెలంగాణలో ప్రైవేటు పరిశ్రమలకి ఆస్కారం లేకపోయింది. కాని హైదరాబాద్ రాష్ట్రాన్ని పాలిస్తున్న నైజాం ప్రభుత్వం పెట్టిన పరిశ్రమల పట్ల శ్రద్ధ వల్ల తెలంగాణ ప్రాంత పారిశ్రామికీకరణ ఎంతో పురోగతి సాధించి దేశంలో ప్రధాన పారిశ్రామిక కేంద్రాల్లో ఒకటిగా అభివృద్ధి చెందగలిగింది.

**In Hyderabad,** The agrarian surplus generated by a feudal social structure did not get mobilised for industrial it developnent dispite state intervention. As in any feudal social order wealth invariably centered around land. The ownership of land also conferred social prominence unfettered power over vast masses of people. In such a context, who could have assumed the leadership of a dynanmic industry? Not the subordinate brokers and bankers of colonial trade who would find keeping idle cash more probitable than any investments nor the land lords or money lenders who, because of colonial trade would find land and agrarian trade more profitable than industral investments. Thus it was the state through a combination of civil servants and jagirdars that assumed the leading role in industral development"(From the Book 'Hyderabad industrilisation 1875-1948 C.V.Subbarao-page-188)

"The Agrarian economy of Hyderabad was marked by strong feudal relations The commar cialisation of agriculture especially in cotton and oil seeds did not radically alter precapitalist social organisation of the state. But commercial cropes, among other things became the basis for colonial trade. The devolopment of industry. Rich in mineral resources as a part of Daccan plate 04 as rich in forest resourses as a part of larger crondiviana and possessing extensive Block cotton soil, the state was also diverse industrial Raw materials(పై పుస్తకం పేజీ XVI)

బ్రిటన్ లాంక్‌షైర్ నగరంలో ఆవిరి యంత్రం, మరమగ్గం కనుగొనటం వల్ల మొదలైనవి 18వ శతాబ్ది ప్రథమార్థం (1720)లోనే కనుగొన్నందువల్ల ప్రపంచంలో పారిశ్రామిక విప్లవానికి దారితీసింది. ఈ క్రమం బ్రిటన్‌లో జౌళి పరిశ్రమాభివృద్ధి దీనికి అవసరమైన ముడిపత్తిని భారతదేశం నుంచి తరలించుకొని పోవడానికి రైలు లైన్లు, రోడ్ల నిర్మాణం, ఓడరేవుల నిర్మాణం, బోట్ల పరిశ్రమ, వాగన్ల

పరిశ్రమలు ఆవిర్భావానికి దారితీసింది. బొంబాయి నించి ఆగ్రా వరకు 1840లో ప్రారంభించిన రోడ్డు నిర్మాణం ఢిల్లీ దాకా పొడిగించి 1953 సంవత్సరానికి పూర్తిచేశారు. (భారత పారిశ్రామిక పరిణామం 1860–1939 డి.ఆర్.గాడ్గిల్) ఇక రైలు మార్గాల నిర్మాణం 1849 నుంచి 1869 వరకు శరవేగంగా విస్తరించి 5015 మైళ్ల రైలు లైన్ల నిర్మాణం జరిగింది. (పై పుస్తకం పేజీ 19) భారతదేశంలో రైల్వే లైన్లు, రోడ్లను బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించగా, హైదరాబాద్ రాష్ట్రంలో నైజాం ప్రభుత్వం ఇందుకు పూనుకుంది. నేషనల్ ప్రొవిన్షియల్ బ్యాంకు ఆర్థిక సహాయం (అప్పు)తో నైజాం ప్రభుత్వం స్వయంగా 'స్టేట్ రైల్వే కంపెనీ లిమిటెడ్'ను ప్రారంభించి బొగ్గు గనుల ప్రాంతాలకు, పత్తి అధికంగా పండుతున్న జిల్లాలకు రైలు మార్గాన్ని నిర్మించింది. వ్యవసాయ అభివృద్ధి నీటిపారుదల సౌకర్యాల నిర్వహణ, మరమ్మతుల కోసం రోడ్లు, భవనాల నిర్మాణానికి నైజాం ప్రభుత్వం స్వయంగా 'సివిల్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్ (పరిశ్రమ)ను నెలకొల్పింది. 19వ శతాబ్ది ప్రథమార్థం (1848)లోనే నిజాం ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామికీకరణకు పునాది వేసింది.

వ్యవసాయమైనా, పారిశ్రామికీకరణ అయినా స్థానిక మార్కెట్ అవసరాలను తీర్చేదిగా ఉన్నప్పుడు అది అభివృద్ధి కరమైన పారిశ్రామికీకరణగా ఉంటుంది. ప్రాంతీయ, స్థానిక మార్కెట్ అవసరాల తర్వాతనే ఎగుమతులు కానీ ఆనాడు భారతదేశాన్ని పరిపాలిస్తున్న వలసవాద బ్రిటన్ పారిశ్రామి కాభివృద్ధికి ముడి సరుకులు తరలించుకపోవడం కోసం జరిగిన భారత పారిశ్రామికీకరణ భారతదేశంలో పెట్టుబడిదారీ విధానం ఏర్పడే క్రమానికి అడ్డంకి అయింది. బ్రిటన్‌లోని జౌళి మిల్లుల కోసం ముడిపత్తి ఎగుమతి, బ్రిటన్‌లోని జౌళి మిల్లుల్లో తయారైన వస్త్రాల దిగుమతి స్థానిక చేనేత పరిశ్రమను ఘోరంగా విధ్వంసం చేసింది. ఈ ఎగుమతి దిగుమతుల కోసం రైలులైన్లు రోడ్ల నిర్మాణం ఓడరేవులు, మరబోట్లు, వ్యాగన్ల పరిశ్రమల నిర్మాణం చేసిన భారత పారిశ్రామికీకరణ పరిణామక్రమం, ఈ దేశం పెట్టుబడిదారీ విధానం పరిణామం చెందే క్రమానికి అవరోధంగా పరిణమించి దేశంలో అర్ధభూస్వామ్య వ్యవస్థ కొనసాగింపునకు దోహదం చేసింది.

ఉత్తర తెలంగాణ జిల్లాలు ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్ లలో, ఇనుము ఉక్కు పరిశ్రమలు, బొగ్గుగనులు, కాగితం పరిశ్రమ, చేనేత పరిశ్రమ(అగ్గిపెట్టెలో ఇమిడే ఆరుగజాల చీర నేసిన నైపుణ్యం దేశ విదేశాలను ఆకర్షించింది)ఆనాడు నల్లగొండ జిల్లాలో భాగమైన జనగాం తాలూకు పెంబర్తి గ్రామంలోని ఇత్తడి పరిశ్రమ మొదలైన ఎన్నో దేశీయ పరిశ్రమలు, ముఖ్యంగా తెలంగాణ పరిశ్రమల విధ్వంసానికి కారణమైనప్పటికి ఆధునిక పరిశ్రమలకి ఆరంభం కూడా ఈ కాలంలోనే జరిగింది. తెలంగాణ జిల్లాలో గోల్కొండ సిగరెట్ కంపెనీ(1941) హైదరాబాదు, ఆజంజాహి మిల్లు(వరంగల్లు 1939) ఆల్విన్(1942)హైదరాబాద్, హైదరాబాద్ ఆజ్‌బెస్టాస్ సిమెంట్స్(1946) దక్కన్ గ్లాస్ ఫ్యాక్టరీ(1927) డిబిఆర్ మిల్స్ హైదరాబాద్, నిజాం షుగర్ ఫ్యాక్టరీ(బోధన్ నిజామాబాద్) మొదలైన పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలనలో ఖాయిలాపడి మూతపడ్డాయి. నీటిని అమ్ముకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకంగా మంత్రిత్వ శాఖనే ఏర్పాటుచేసి ఆ శాఖకు ఒక మంత్రిని కూడా కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ అవతరణకు(1956) పూర్వం హైదరాబాద్ రాష్ట్రంలో పరిశ్రమలు వ్యవసాయం పరస్పర అభివృద్ధి కారకాలుగా తెలంగాణ పారిశ్రామిక రంగం పురోగమించింది. నిజమైన పారిశ్రామి కాభివృద్ధి వ్యవసాయంతో అనుసంధానంగా సాగినప్పుడే



పరస్పర పురోభివృద్ధి కారకంగా ఉంటూంది. ఉదాహరణకి చెరుకు పండే నిజామాబాద్ జిల్లాలో చక్కెర పరిశ్రమ నూనెగింజలు, వరిపండే నల్లగొండ జిల్లాలో నూనె మిల్లులు, పత్తి పుష్కలంగా పండే నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో నేత పరిశ్రమ ఇనుము, ఖనిజం సమృద్ధిగా ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్‌లో 17వ శతాబ్ధిలో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఇనుము మొదలైన లోహాలలో ఆయుధాల తయారీ కార్ఖానా ప్రపంచంలో ప్రశస్తి పొందిన పెంబర్తి(అప్పుడు నల్లగొండ జిల్లాలోనిది) ఇత్తడి పరిశ్రమ ఇవన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఖాయిలాపడడంతో ఈ రంగాల కార్మికులు ఆత్మహత్య దుర్మరణాలలో రైతుల తర్వాతి స్థానం చేనేత కార్మికులదే.

ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర అధికారం చేపట్టిన తెలంగాణ రాష్ట్రసమితి తన ఎన్నికల ప్రణాళికలో పరిశ్రమాభివృద్ధికి పాటుపడ్తానని చెప్పింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఏలుబడిలో మూతబడ్డ అజంజాహి మిల్లు, ప్రాగాటూల్స్, హెచ్‌ఎంటి, ఆల్విన్, ఐడిపిఎల్, హెచ్‌సిఎల్, ఎఫ్‌సిఐ(రామగుండం), నిజాం షుగర్ బోదన్ మొదలైన పరిశ్రమలు పునరుద్ధరిస్తామని, ఒకవేళ పునరుద్ధరణ సాధ్యం కాని చోట ప్రత్యామ్నాయ పరిశ్రమలు నెలకొల్పుతామని తెరాస ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. హైదరాబాద్ నుంచి వరంగల్ వరకు పారిశ్రామిక కారిడార్ నెలకొల్పుతామని కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి రైల్వే శాఖపై ఒత్తిడి చేస్తుందని, చిన్న తరహా పరిశ్రమలకు అనుమతిని సులభం చేస్తుందని, సింగిల్ విండో పద్ధతిన అనుమతులు మంజూరు చేస్తుందని మొదలైన హామీలెన్నో చేసింది. అది అధికారం చేపట్టాక మాత్రం ఐటి పరిశ్రమ (ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ) ఫార్మా పరిశ్రమ, హైదరాబాద్ నుంచి వరంగల్ కోస్టల్ కారిడార్ గురించి ఎక్కువగా మాట్లాడుతున్నది. మిగతా విషయాల ప్రస్థావన ఉండడం లేదు. రైతు ఆత్మహత్యలు తర్వాత అధిక ఆత్మహత్యలు నేత కార్మికులవి. గీత పరిశ్రమ ప్రస్తావన కూడా ఎన్నికల ప్రణాళికలో కూడా లేదు.

ఎన్నికల ప్రణాళిక ఎలా ఉన్నా తెలంగాణ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాలో లభించే ముడి వనరులను రాష్ట్ర మార్కెట్ అవసరాలను, ఆ తర్వాత దేశ విదేశీ ఎగుమతి అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమగ్ర సర్వతోముఖ పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన నిర్దిష్ట ప్రణాళికను రూపొందించవలసి ఉంది. ఇందుకోసం ఆయా ప్రాంతాల ప్రజలు, ఆయా ప్రాంత పరిస్థితులను, పారిశ్రామిక అవసరాలను ప్రభుత్వ దృష్టికి తేవడానికి ఆయా ప్రాంత జెఏసిలు(తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలంలో ఏర్పడిన జిల్లా, మండల, గ్రామ జెఏసిలు) ఉద్యమించాల్సిన అవసరం ఉంది. ఉద్యమ కాలంలో ఆయా ప్రాంతాల ప్రజలకు ముఖ్యంగా జెఏసిలకు అవసరాలకు తమ ప్రాంత వనరులు, అవసరాలు, అవకాశాలపై పరిపూర్ణమైన అవగాహన ఏర్పడింది. కనుక ప్రభుత్వం ఆయా ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధి ఆయా ప్రాంతాల జెఏసిల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. తెలంగాణ ప్రజాఫ్రంటు సంస్థల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి. వివిధరంగాల్లో పారిశ్రామిక రంగానికి సంబంధించి తెలంగాణ ప్రజాఫ్రంట్ సూచనలు ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలను సూచిస్తూ చేసిన, ప్రతిపాదనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది.

చివరగా ప్రాంతీయ అభివృద్ధి ప్రజోపకరమైన పారిశ్రామికాభివృద్ధి అంటే ఏమిటో మహబూబ్‌నగర్ పోలేపల్లి సెజ్‌లో భూమి కోల్పోయిన బాధితురాలు చుక్కమ్మ మాటల్లో చెప్పాల్సిందే. సెజ్ బాధితులతో మాట్లాడ్డానికి ఎవరొచ్చినా అధికారులైనా, నాయకులైనా, ప్రచార సాధానాల వారైనా ఉద్యమకారులైనా ఎవరితో మాట్లాడినా చుక్కమ్మ ఎప్పుడూ ఒకే మాటలు ఆవేదనతో, ఆర్ద్రతతో ఆగ్రహంతో ఒకటే అడిగేది. “మా కొద్దిపాటి భూమిలో మేం రాగులు పండించేది. పెసలు, కందులు పండించేది. మక్కలు(మక్కజొన్న) జొన్నలు అన్నీ పండించే కూరగాయలు పండించుకునేది. మేం తిని పదిమంది కూలీనాలీని పనిచ్చేది. అసుంటి మా భూముల్ని గుంజుకుని పెట్టిన కంపెనీలో ఈల్లేం పండిస్తరొమీకెరికేనా? విషం పండిస్తరట. విషం బయటికి పంపి పచ్చటి మా భూముని సత్తెనాశనం చేసే వాళ్లకు ప్రాణం పోయినా మా భూములు ఇవ్వం. ముందుగా వాళ్లు మాతో చెప్పిందేంది ఇప్పుడు చేస్తున్నదేంది. తోటలు పెంచుతం భూములియ్యండ్రి? తోటల్లో పనిస్తం అన్నరు. ఆ తర్వాత మందుల(ఫార్మా) కంపెనీలు పెట్టి ఉద్యోగాలిస్తమన్నరు. ఉద్యోగాల్లేవు, తోటల్లో పనిలేదు. పైగా విషం(ఫార్మా కంపెనీల కాలుష్యం) పండిస్తరట.ససేమిరా మా భూములు ఇయ్యం. పోనీ కంపెనోళ్లు బిస్కట్లు తయారు చేస్తం అంటే సరే మా భూములిస్తం” అంటూ గుక్క తిప్పుకోకుండా ఆగ్రహంతో అవేశంగా దాదాపు అరిచినంత పనిచేసి ఆ తర్వాత ఘొల్లున ఏడుస్తూ బాధపడేది.

వ్యవసాయ రంగమైనా, పారిశ్రామిక రంగమైనా ప్రజలు ఆశించే అభివృద్ధి ప్రజల మౌలిక దైనందిన జీవనావసరాలు తీర్చగలిగిన ఉత్పత్తి విధానం అని చుక్కమ్మ ఎంత బాగా చెప్పింది. నిత్య జీవితావసరాలైన కూడు, గుడ్డ, గూడు వంటి ప్రాథమిక అవసరాలు తీర్చేదిగా పారిశ్రామిక ఉత్పత్తి విధానాన్ని ప్రభుత్వాలు అనుసరించాలని చుక్కమ్మ వంటి బాధితుల అభిప్రాయాన్ని అందుకు అవసరమైన పారిశ్రామిక విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలుచేయాలి. ఇందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో శ్రమించి ప్రజానుకూల, శాస్త్రీయ దృక్పథం కలిగిన వ్యవసాయ పారిశ్రామిక రంగ నిపుణులతో, శాస్త్రవేత్తలు, పర్యావరణ ఉద్యమకారులతో చర్చించి సంప్రదించి నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించవలసి ఉంటుంది. ఇందుకు ప్రజల పట్ల ఎంతో చిత్తశుద్ధి, బాధ్యతతో పాటు, గెలిచినంత మాత్రాన అధికారంలో ఉన్నందున పాలకులు తామే సర్వజ్ఞులం అనే అహాన్ని వదులుకున్నప్పుడే సరైన సమగ్రమైన ప్రజానుకూల, పర్యావరణ అనుకూల(ఎకోఫ్రెండ్లీ) పారిశ్రామిక విధానాన్ని రూపొందించి అమలుచేసి, సరైన పారిశ్రామికాభివృద్ధిని సాధించ గలుగుతుంది. ❖

# తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పారిశ్రామిక విధానం ఉండాలి

చిక్కుడు ప్రభాకర్
హైకోర్టు న్యాయవాది

***గత నాలుగు దశబ్దాల తెలంగాణ రాష్ట్ర కోసం జరిగిన పోరాటం దేశం మొత్తానికి దిక్సూచిగా మారి తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా, దేశంలోని 28 రాష్ట్రాలకువున్న స్థితి తెలంగాణ రాష్ట్రానికి లేదు. ఉమ్మడి రాజ ధాని, తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఆదివాసులు నివసించే ఏడు అధికారికంగా, అనధికారికంగా ఇంకా రెండు, మొత్తం తొమ్మిది మండలాల ప్రజలను ముంచి, ఆంధ్రప్రదేశ్ బహుళజాతి సంస్థల పరిశ్రమలకు, దేశీయ గుత్తపెట్టుబడిదారుల పరిశ్రమలకు, దాదాపు 23.40లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 7.02 లక్షల ఎకరాల నూతన ఆయకట్టు కొరకు నిర్మిస్తున్న పోలవరం (ఇందిరాసాగర్) ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌కు బహుమతిగా ఇచ్చి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును చేసిన కేంద్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కేంద్రంలోనూ, ఇరు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ మళ్ళీ అధికారం సంపాదించలేక పోయింది.***

తెలంగాణ ప్రాంతంలో పరిశ్రమలకు అత్యవసరమైన అపారమైన ముడిసరుకు, భూమి, నీరు, మానవ శ్రమ ఉన్నా ఏ ఒక్క పరిశ్రమను స్థాపించలేని సీమాంధ్ర భూస్వామ్య, పెట్టుబడిదారుల ఆధిపత్యంలోని ప్రభుత్వాలు, ఈ ప్రాంతంలోని పరిశ్రమలన్ని మూసివేశాయి. ప్రైవేటీకరణ వైపు నడిపించాయి. ఫలితంగా తెలంగాణ ప్రాంతం ఎంతో పారిశ్రామికంగా ఎదగాల్సిన సమయంలో ఎదగకుండా పోయింది. అపారమైన భూమి, గలగల పారే జీవనదులు, ఖనిజసంపద అత్యంత విలువైన ముడిసరుకు వివిధ పరిశ్రమలకు వందల సంవత్సరాలకు సరిపడేంతగా లభించేందుకు అవకాశమున్నా, పరిశ్రమలను స్థాపించలేదు. ఉన్న పరిశ్రమలను మూసివేసి,వాటి స్థానంలో బహుళ అంతస్థులుగా భవన నిర్మాణాలు చేపట్టినాయి. తెలంగాణలో అంతంతమాత్రంగా ఉన్న పారిశ్రామిక వ్యవస్థ సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడిదారుల, ప్రపంచీకరణల వలన కుదేలయికుప్పకూలి పోయింది.

ఉత్తర తెలంగాణ ప్రాంతంలో నాడు ఆజంజాహిమిల్లు, సర్‌సిల్క్, అంతర్‌గాం, నిజాంషుగర్స్, సింగరేణి కంపెనీ, రామ గుండం ఎరువుల కంపెనీ(ఎఫ్.సి.ఐ) లాంటి కంపెనీలు ప్రభుత్వ రంగంలో ఉండగా, వీటిలో సింగరేణి, నిజాంషుగర్స్ తప్ప మిగతావి మూసివేశారు. నవభారత్‌స్పాంజ్ ఐరన్ కంపెనీ, భద్రాచలం పేపర్ బోర్డు లిమిటెడ్, ఎపిరేయాన్స్, సిర్పూర్ కాగజ్ నగర్ పేపర్ మిల్లులు ప్రైవేటు రంగంలోఉన్నాయి. ఇక ప్రైవేటు రంగంలోనే చిన్న, చిట్టి పరిశ్రమలుగా ఉన్న సిరిసిల్ల,



పోచంపల్లి, గద్వాలకు చెందిన నేతపరిశ్రమలు, నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్, వరంగల్ లాంటి జిల్లాల్లో బీడీల కంపెనీలు, అగ్గిపెట్టెల కంపెనీలు కూడా కుటీర పరిశ్రమలుగా ఉన్నాయి. ఇక దక్షిణ తెలంగాణలోని నల్లగొండ,మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని పారిశ్రామిక అభివృద్ధి పూర్తిగా ప్రైవేటుపెట్టుబడిదారుల చేతిలో ఉండగా, ఈ ప్రైవేటు రంగ అధిపతులందరూ 90 శాతం సీమాంధ్రకు చెందిన వారే. దీనికి కారణం సీమాంధ్ర ప్రభుత్వాలు కేవలం సీమాంధ్రకు చెందిన చిన్న, పెద్ద పెట్టుబడిదారులకు అన్ని రాయితీలు ఇవ్వడమే.

ఇక హైదరాబాద్ నగరంలో సుదీర్ఘ కాలంగా వెలుగొందిన ఆల్విన్, ప్రాగాటూల్స్, హెచ్.ఎం.టి, ఇ.సి.ఐఎల్., ఐ.డి.పి.ఎల్, బి.డి.యల్, ఐ.డి.ఎల్, బెక్కలైట్‌హెలం, రిపబ్లికన్ ఫోర్జ్, డిఆర్‌డిఎల్, బిహెచ్ఇఎల్, విఎస్‌టి, డిబిఆర్ మిల్స్ ప్రభుత్వ రంగంలో ఉండగా, చిన్న చిన్న పారిశ్రామిక వాడలైన అశోక్ లేలాండ్, ఆంగ్రోగ్లూకోజ్ బిస్కెట్స్, కాటేదాన్, బాలానగర్, జీడిమెట్ల, నాచారం, ఉప్పల్, పటన్‌చెరువు పారిశ్రామిక వాడలు ప్రైవేటు రంగంలో ఉండేవి. సీమాంధ్ర పెట్టుబడిదారుల నాయకత్వంలో వచ్చిన సమైక్యాంధ్ర ప్రభుత్వాలు మొదట తెలంగాణలో, హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ పరిశ్రమలన్ని 1980 నాటికే దివాల తీసేవిధంగా విధానాలు రూపొం దించి అమలుచేశాయి. కొన్ని దివాల తీయకున్నా, వాటిని తమ స్వార్థ ప్రయోజనాల కొరకు మూసివేసాయి. ప్రైవేటీకరణ వైపు దారులు వేయించేశాయి. నేడు ప్రభుత్వరంగంలో కేవలం బిహెచ్ఇయల్, ఇ.సి.ఐ.యల్. పాక్షికంగా మిగిలినాయి.

ఇందులో ప్రధానంగా వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్న ఆజాంజాహి మిల్లు, సర్‌సిల్క్, అంతర్‌గాం మిల్లు, హైదరాబాద్ నగరంలో ఉన్న డిబిఆర్ మిల్లులు, నిజామాబాద్ జిల్లాలోని బోధన్, కరీంనగర్ జిల్లాలోని మెట్‌పల్లి, మెదక్ జిల్లాలోని మొంభోజుపల్లిలోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలుగా ఉన్నాయి. ఈ పరిశ్రమలకు ప్రధాన ముడిసరుకైన పత్తి కోట్లాది బేళ్ళనునాటి నిజాం ప్రభుత్వం ఉత్తర భారతదేశం నుండి దిగుమతి చేసుకుని ప్రత్యక్షంగా, లక్షలాది ప్రజలకు పరోక్షంగా ఉపాధి కల్పించింది. వరంగల్ జిల్లాలోని ఆజంజాహిమిల్లు, హైదరాబాద్ నగరంలోని డిబిఆర్ మిల్లులు పత్తి, జిన్నింగ్, నూలు తయారి, రంగునూలు తయారి, బట్ట తయారి, విద్యుత్ ఉత్పత్తిని కూడ కొనసాగించాయి. ఈ బట్టల ఉత్పత్తులన్నింటిని దేశీయ వాడకం మరియు లండన్‌కు కూడా ఎగుమతి కూడా చేసేవారు. ఇక వరంగల్ నగరంలో, హైదరాబాద్ నగరంలోని ప్రజలకు, చిన్న, చిన్న వ్యాపారసంస్థలకు, పరిశ్రమలకు విద్యుత్‌ను కూడ అందించేవి. ఈ బహుళ ప్రయోజనాలు ఉన్న పరిశ్రమలను నడిపించాల్సిన ప్రభుత్వాలు నడిపించకుండా వాటికి సంబంధించిన వందలాది కోట్ల సంపదమీద కన్నువేసి 2002 సంవత్సరం వచ్చే వరకు కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు పూర్తిగా వాటిని మూసివేసి వాటి సంపదను దక్కించుకుని, ఆఖరికి వాటి స్థలాలను కూడా సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడిదారులకు దారాదత్తం చేశాయి. ఇందులో భాగంగానే నేడు తెలంగాణ ప్రాంతం మొత్తం ఉత్పత్తి రంగానికి సంబంధించిన ఏ ఒక్క భారీపరిశ్రమ కూడా లేకుండా చేశాయి. లక్షలాది మంది కార్మికులు తెలంగాణ వ్యాప్తంగా ఈ ప్రభుత్వాలు చేసిన దుర్మార్గాలకు రోడ్డున పడ్డారు. ఉత్పత్తి పూర్తిగా క్షీణించింది. నేడు ప్రభుత్వ రంగంలో భారీ, మధ్యతరగతి, చిన్న పరిశ్రమలు అయిదు రకాలుగా పునరుద్ధరించేందుకు అవకాశాలు తెలంగాణ వ్యాప్తంగా ఉన్నాయి. ఇందులో 1) వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, 2) గనుల ఆధారిత పరిశ్రమలు, 3) పారిశ్రామిక ఉప ఉత్పత్తుల పరిశ్రమలు, 4) ఆటో మొబైల్–గృహోపకరణ ఉత్పత్తుల పరిశ్రమలు, 5) సేవారంగం–కంప్యూటర్ పరిశ్రమలు. ఇవి స్థాపిస్తే రాబోయే రెండు దశాబ్దాలలో తెలంగాణ ప్రాంతం అపారమైన పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది. ఈ పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు సకల వనరులు తెలంగాణ ప్రాంతంలో ఉన్నాయి. విద్యుత్ ఉత్పాదనకు ఉపయోగపడే ముడిసరుకులైన రెండు జీవ నదులు, బొగ్గు, నాఫ్తాలు ఉన్నాయి. జలవిద్యుత్‌కు ఉపయోగపడే జీవనదులు కృష్ణా, గోదావరి వాటి ఉపనదులు తెలంగాణ ప్రాంతంలో సుదూర ప్రాంతాలలో పారుతున్నాయి. దేశంలో కోల్ ఇండియా తర్వాత అతి పెద్ద బొగ్గు ఉత్పత్తి చేసే ప్రభుత్వ రంగ పరిశ్రమ అయిన సింగరేణికంపెనీ సంవత్సరానికి 53 నుండి 55 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తీయగల సామర్థ్యం ఉన్న ఈ పరిశ్రమ థర్మల్ విద్యుత్‌కు ఎంతో ఇతోధికంగా ఉపయోగ పడుతుంది. ఇక నాఫ్తా విషయానికి వస్తే అత్యంత నాఫ్తా తెలంగాణ ప్రాంతంలో దొరుకుతుంది. రేపు మనం ఉత్పత్తి చేయబోయే విద్యుత్తు ఇటు రైతాంగానికి, గృహవినియోగానికి, పారిశ్రామిక వినియోగానికి ఎంతో అవసరం పడుతుంది. ఇన్ని రోజులు సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడిదారుల నాయ కత్వంలోని సమైక్యాంధ్ర ప్రభుత్వాలు తెలంగాణ లోని పై మూడు రంగాలకు విద్యుత్తు విషయంలో కూడా తీరని అన్యాయం చేశాయి. ఇందులో భాగంగానే రామగుండం లోని ఎపి జన్‌కో కు బొగ్గు కేటాయించక దానిని మూసివేయించాయి. ఇక మణుగూరులో 3,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని విజయవాడకు తరలించి విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ పేరుతో ఇక్కడి బొగ్గునంతా ఆ కేంద్రానికి కేటాయించుకొని ఉత్పత్తిని పెంచుకున్నాయి. ఎంతోకాలం తెలంగాణ ప్రజలు పోరాడడం వలన 10సం?ల క్రితం భూపాలపల్లిలో స్థాపించిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రం కేవలం 900 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే చేస్తున్నది. మరో 3,000 వేల మెగావాట్ల ప్రతిపాదనకు సంబంధించిన రెండవ, మూడవ దశలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే లాగానే ఉన్నాయి. రాబోయే రోజులలో విద్యుత్ ఉత్పత్తిని ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధిచేస్తే పై మూడు రంగాలకు అద్భుతంగా ఈ విద్యుత్ ఉత్పత్తి అవసరం తీరుస్తుంది.

## 1) వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు

ఇక వ్యవసాయ ఆధారిత పరిశ్రమల విషయానికి వస్తే గతంలో పత్తి పంట ఎకరం కూడా ఈ ప్రాంతంలో పండని సమయంలో వేలాది కార్మికులు ప్రత్యక్షంగా, లక్షలాది ప్రజలు పరోక్షంగా బతికిస్తూ వైభవంగా వెలుగొందిన పరిశ్రమలైన అజంజాహి మిల్లు, సర్‌సిల్క్ మిల్లు, అంతార్‌గాం మిల్లు, డిబిఆర్ మిల్లులు మళ్ళీ నేడు స్థాపించవచ్చు. వీటికి సంబంధించిన ప్రధాన ముడిసరుకైన పత్తి నేడు తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాలలో పండుతున్న మొత్తం పంటలో పత్తి పంట 60 శాతంగా ఉన్నది. కనుక ఈ పరిశ్రమలకు కావల్సిన ముడిసరుకు సంవత్సరం పొడుగునా ఎటువంటి ఆటంకం లేకుండా, దిగుమతి అవసరం లేకుండా కారు చౌకగా అందించవచ్చు. అప్పుడు నడిచిన పరిశ్రమలతో పోలిస్తే నాలుగురెట్లు ఉత్పత్తిని పెంచే పరిశ్రమలను స్థాపించవచ్చు. ఇందుకు కావల్సిన ముడిసరుకుతో పాటు అపారమైన నీటిసంపద, భూమి, విద్యుత్తు, నూతన సాంకేతిక నైపుణ్యం, మానవ శ్రమలు పుష్కలంగా తెలంగాణ ప్రాంతంలో ఉన్నాయి. ఆ పరిశ్రమల భూములు సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడిదారుల కబంధ హస్తాలలో చిక్కుకొని రియల్ ఎస్టేట్, బహుళ అంతస్తుల భవనాలతో నిండుకొని ఉన్నా, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఈ పరిశ్రమలకు అవసరమైన ప్రభుత్వ భూమి ఉన్నది. ఆ భూమిని ఈ భారీ పరిశ్రమలకు కేటాయించి ఇక్కడ లభ్యమవుతున్న అన్ని రకాల ముడిసరుకులు ఉపయోగించుకోనేందుకు ఈ బట్టల మిల్లులను స్థాపిస్తే, సూరత్,

బీమండి, ముంబాయిలతో సమానంగా ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. ఇక మూడు జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, మెదక్‌జిల్లాలకు ఎంతో తీపికరమైన నిజాం షుగర్ ఫ్యాక్టరీ 1934 సంవత్సరంలో నిజాంప్రభుత్వం స్థాపించగా, సీమాంధ్ర ప్రభుత్వ నాయకత్వంలో వేలాది కోట్ల రూపాయల విలువైన బోధన్, మెట్‌పల్లి, మెదక్ యూనిట్ల 51% పెట్టుబడిని ప్రైవేటు రంగానికి చంద్రబాబు ప్రభుత్వం 2002 సం?లో సీమాంధ్ర పెట్టుబడిదారుడైన గోకరాజు గంగరాజుకు అమ్మివేసింది. కేవలం ఆరు కోట్ల రూపాయలు చెల్లించి వందలకోట్ల రూపాయల ఆస్తిని చేజిక్కించుకున్న గోకరాజు గంగారాజు ఒప్పందంలోని అన్ని రకాల నిబంధనలు ఉల్లంఘించడం వలన అతని షేర్లు కేవలం 31 శాతానికి పడిపోయాయి. దాదాపు 12 సీజన్లు నడుపుకుని అత్యంత కుబేరునిగా మారిన గోకరాజు గంగారాజు చెరుకు రైతాంగాన్ని, కార్మికులను విపరీతమైన బాధలకు గురిచేశారు. గతంలో ప్రతి సంవత్సరం మూడు యూనిట్లలో దాదాపు 10 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ చేయగా, నేడు అది 3 లక్షల మెట్రిక్ టన్నులకు కుదించాడు. దాదాపు 7 వేల కార్మికులు నాడు పని చేయగా, నేడు కేవలం 1200 కార్మికులకు కుదించాడు. ఇన్ని తప్పులు చేసి అటు రైతాంగాన్ని, ఇటు కార్మికులను ప్రభుత్వాన్ని మోసం చేసిన గోకరాజు గంగరాజుకే ఈ ఫ్యాక్టరీని కట్టబెట్టాలనే ఆలోచనతో నాటి రాజశేఖర్‌రెడ్డి, రోశయ్యల ప్రభుత్వం ప్రయత్నించగా 2007 సంవత్సరం నుండి తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటి, జెఎసిల సమన్వయ ఫ్రంట్, తెలంగాణ ప్రజాఫ్రంట్‌ల నాయకత్వంలో ఈ పరిశ్రమను ప్రభుత్వరంగంలో నడుపాలని, ఒకవైపు ప్రజాపోరాటం, మరోవైపు న్యాయపోరాటం చేయడంవలన ఆ ప్రభుత్వాలు ఈ ఫ్యాక్టరీని అన్ని పరిశ్రమల్లాగే అమ్మేందుకు వెనుకంజ వేశాయి. తెలంగాణకు ఏ వనరు దక్కవద్దని మూర్ఖంగా ఆలోచించిన కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం మిగతా 49% కూడా ప్రైవేటు రంగానికి అమ్మివేసే ప్రయత్నం చేయగా, దానిని న్యాయపోరాటం ద్వారా తెలంగాణ ప్రజాఫ్రంట్ జనవరి 9న, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ద్వారా ప్రైవేటీకరణ చేయకుండా ఉత్తర్వులను సాధించింది. ఈ ఉత్తర్వులను అమలు చేస్తూ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి తన చివరి పదవికాలంలో సంతకాలు చేయగా, సీమాంధ్రకు చెందిన అధికారులు ప్రైవేటు యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ అధికారిక ఉత్తర్వులు విడుదల కాకుండా కాలయాపన చేస్తున్నారు. ఈ పరిశ్రమను ప్రభుత్వ రంగానికి పూర్తిగా తీసుక వచ్చి, గతంలో లాగా మూడు జిల్లాలలో 20లక్షల మంది చెరుకును రైతులు చెరుకు పండించే విధంగా అభివృద్ధిచేసి ఇటు రైతాంగాన్ని అటు వేలాది మంది కార్మికులను ప్రత్యక్షంగా, లక్షలాది ప్రజలను పరోక్షంగా బతుకుతెరువు కల్పించేందుకు భవిష్యత్ తెలంగాణలో అవకాశం ఉంది. కేవలం వెయ్యి నుండి పదిహేనువందల కోట్ల రూపాయలు ఈ పరిశ్రమకు కేటాయిస్తే ఈ మూడుజిల్లాలోని రైతాంగం నిజాంసాగర్, శ్రీరాంసాగర్, మంజీర ప్రాజెక్టు ద్వారా అందుతున్న నీరును ఉపయోగించుకోని లక్షలాది టన్నుల చెరుకును ఉత్పత్తి చేయవచ్చును. ఈ చెరుకు ఉత్పత్తి ద్వారా ఈ మూడుజిల్లాలోని నిజాం షుగర్ యూనిట్లు చక్కెర, మొలాసిస్, బయోత్పత్తులు, బెల్లం, విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేయవచ్చు. ఈ యూనిట్లలలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఆయా పట్టణాలకు కూడా సరఫరా చేయవచ్చు. గతంలో ఏ విధంగానైతే "ఏసియా ఫ్రైడ్" గా వెలుగొందిందో రాబోయే భవిష్యత్ తెలంగాణలో కూడా ఒక అద్భుతమైన వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా నిజాంషుగర్ ఫ్యాక్టరీని భవిష్యత్ తరానికి బంగారు బాటలు వేసేందుకు తీర్చిదిద్దే అవకాశం ఉన్నది.

## 2) గనుల ఆధారిత పరిశ్రమలు

ఇక రెండవ రకం పరిశ్రమైన గనుల ఆధారిత ముడి సరుకు పరిశ్రమలను విస్తృతంగా స్థాపించవలసిన ఆవశ్యకత, అవకాశం కూడా తెలంగాణ ప్రాంతంలో ఉంది. ముఖ్యంగా ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో లభ్యమౌతున్న బొగ్గు, డొలమైట్, మాగ్నేటైట్, హెమటైట్, మ్యాంగనీస్, లాటరైట్, సున్నపు రాయి, గ్రానైట్, క్వార్ట్జ్ మరియు కాపర్ లాంటి అత్యంత విలువ కలిగిన అపారమైన ఖనిజ సంపద తెలంగాణ ప్రాంతంలో విస్తృతంగా లభ్యమౌతున్నది. ఈ ఖనిజ సంపద అంతా కూడా గత ఐదు దశాబ్దాలుగా సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడిదారుల కబంధహస్తాల్లోకి వెళ్లింది. ఒక దశలో అణు ఉత్పత్తులకు సంబంధించిన అత్యంత "నాణ్యమైన ఐరన్‌ఓర్" ఖమ్మం జిల్లాలో కుక్కునూరు, కూనవరం, వేలేరుపాడు ప్రాంతాల్లో విస్తృతంగా లభ్యమౌతున్న విషయం దేశ సాంకేతిక నిపుణులకే ఆశ్చర్యం కలిగిస్తున్నది. అయినా, తెలంగాణ ప్రాంతంలో వాటి ముడిసరుకు ఆధారిత ఒక్క పరిశ్రమైనా లేకపోవడం దేశ, రాష్ట్ర పాలకుల యొక్క దుర్మార్గమైన వివక్షకు ప్రతీకగా భావించవలసిన అవసరం ఉన్నది. విశాఖపట్నంలో వెలిసిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అక్కడ ఎటువంటి ముడిసరుకు లభించకున్నా, స్థాపించారు.



విశాఖ స్టీల్‌ప్లాంట్ నేటికి ఐరన్ ఓర్ ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సాల నుండి బొగ్గు, డోలమైట్ తెలంగాణ నుండి దిగుమతి చేసుకుంటున్నది. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు పేరుతో అక్కడి రాజకీయ నాయకత్వం, ప్రజలు ఉద్యమించడం ఫలితంగా ఏప్రిల్ 17, 1970 సంవత్సరంలో నాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ పార్లమెంటులో స్టీల్ ఆథారిటి ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సంవత్సరానికి అయిదు లక్షల సామర్థ్యం కలిగిన స్టీల్ ప్లాంట్‌ను స్థాపిస్తున్నామని ప్రకటించింది. 1970 నుండి 1977 సంవత్సరం వరకు నిర్మాణం పూర్తి చేసుకుని 2,500 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఉత్పత్తి మొదలయి నేడు అది 5,00,000 మెట్రిక్ టన్నుల ఇనుమును ఉత్పత్తి చేసే సామర్థ్యానికి చేరుకున్నది. రాబోయే తెలంగాణలో వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, జిల్లాల్లో ఒక్కొక్క జిల్లాకు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ఇనుము వార్షిక ఉత్పత్తి సాధించగలిగిన స్టీల్ ప్లాంట్‌లను నిర్మించడం అవసరం. ఈ పరిశ్రమలు ఒక్కొక్క జిల్లా పరిశ్రమ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌తో సమానంగా ఉంటుంది. ఈ పరిశ్రమలకు కావలసిన హెమటైట్, మ్యాగ్నేటైట్, డొలమైట్, మ్యాంగనీస్, బొగ్గు తదితర ముడిసరుకులు రాబోయే 500 సంవత్సరాలకు సరిపడే అపారమైన ఖనిజ సంపద ఈ జిల్లాల్లో ఉన్న విషయం "జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా" సమైక్యాంధ్ర రాష్ట్రం ఏర్పడ్డ మరుసటి సంవత్సరమే అంటే 1957 సంవత్సరంలోనే చాలా స్పష్టంగా తెలిపింది.

అయినా గడిచిన ఐదున్నర దశాబ్దాలుగా ఏ ఒక్క పరిశ్రమను కూడా అభివృద్ధి చేయక పోవడం కోస్తా పాలకుల వివక్షకు అద్దం పడుతుంది. ఇప్పుడైనా ఈ గనుల ఆధారిత పరిశ్రమను ప్రభుత్వరంగంలో స్థాపించవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉన్నది. ఈ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా దాదాపు నాలుగు లక్షల మంది తెలంగాణ యువతకు, దాదాపు 50,000 మంది విద్యావంతులకు ఉపాధి దొరుకుతుంది. అదే విధంగా పరోక్షంగా ఈ నాలుగు జిల్లాలు లక్షలాది ప్రజలకు ఉపాధి లభిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ నాలుగు జిల్లాలు ఒక్కొక్క జిల్లా ఒక్కో భిలాయ్, భోఖారో, జంషడ్‌పూర్ (టాటానగర్)లుగా వెలుగొందేందుకు అద్భుతమైన అవకాశం ఉంది. ఈ పరిశ్రమల స్థాపనకు అపారమైన భూమి, నీరు, విద్యుత్ పైన చెప్పిన విధంగా లభించేందుకు జీవ నదులు తెలంగాణ వ్యాప్తంగా ఉన్నాయి. తెలంగాణలో ఎటువంటి బహుళార్థ సాధక ప్రాజెక్టు కట్టక పోవడంవల్ల రెండు జీవ నదులు, వాటి ఉప నదుల నీరు ప్రతీ సంవత్సరం వేలాది టీ.ఎం.సి.లు బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. కనుక ఈ పరిశ్రమలకు అన్ని రకాల సౌకర్యాలు అనువైన ప్రాంతాలుగా ఈ జిల్లాలు ఉన్నాయి. బ్లాక్ గ్రానైట్, రెడ్ గ్రానైట్, వైట్ గ్రానైట్, మల్టీకలర్ గ్రానైట్‌లకు, ప్రపంచంలోనే అత్యంత విలువయిన, నాణ్యమయిన గ్రానైట్ ఉత్తర తెలంగాణకు ప్రసిద్ధి చెందింది. కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలో లభించే ఈ గ్రానైట్ వలన ఖమ్మంలో కొన్ని పరిశ్రమలు వెలిసినా, ఈ సంపదంతా సీమాంధ్రకు చెందిన బడా, మధ్య తరగతి పెట్టుబడిదారుల చేతికి వెళ్ళింది. లక్షలాది కోట్ల విలువయిన ఈ గ్రానైట్ లీజులను దక్కించుకున్న ఈ పెట్టుబడిదారులు ఈ మూడు జిల్లాలను వల్లకాడుగా మార్చారు. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే దాదాపు 300 గుట్టలు తవ్వడంతో జిల్లాలోని గ్రామాలు సర్వనాశనం అయ్యాయి.

ఇక నల్లగొండ, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో అపారంగా ఉన్న సున్నపు రాయి ఖనిజం, గ్రాఫైట్‌లు, సిమెంట్ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు మంచి అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడిదారుల నాయకత్వంలో నల్లగొండ జిల్లాల్లోని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో గల కోదాడ, హుజూర్‌నగర్, దేవరకొండ, మిర్యాలగూడ లాంటి తదితర ప్రాంతాల్లో నిక్షిప్తమై ఉన్న సున్నపు రాయిని చేజిక్కించుకుని వేలాది కోట్ల రూపాయల ఆస్తులకు పడగలెత్తారు. ఇప్పటికైనా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని అపారమైన ఖనిజ సంపదను అక్రమంగా సంపాదించుకున్న సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడిదారుల "లీజు"లను రద్దుచేసి, తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన చిన్న పెట్టుబడిదారులకు, మధ్యతరగతి పెట్టుబడిదారుల, ప్రభుత్వరంగంలో ఈ ఖనిజ సంపదను వెలికి తీయాల్సిన అవసరం ఉంది. ఈ వెలికితీసిన ఖనిజ సంపదను ప్రభుత్వ రంగంలోనే, ప్రైవేట్ రంగానికి ధీటుగా నల్లగొండ, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతిపెద్ద సిమెంట్ పరిశ్రమలను స్థాపించవలసిన అవసరం ఉన్నది. దేశంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాలుగా పేరుగాంచిన మహబూబ్‌నగర్, నల్లగొండ లాంటి జిల్లాలలో ఈ పరిశ్రమలు స్థాపించడం వల్ల లక్షలాది కార్మికులకు ప్రత్యక్షంగా, ఈ మూడు జిల్లాల ప్రజలకు పరోక్షంగా ఉపాధి దొరికే అవకాశం ఉంది. ప్రపంచ వ్యాప్తంగానే పాలమూరు జిల్లాల నుండి వెళ్లిన కార్మికులు తమ శ్రమను చెమట చుక్కలుగా, రక్తపు చుక్కలుగా మార్చడం వలన ఎన్నో వేలాది పరిశ్రమలు, ప్రాజెక్టులు కోట్లాదిమంది ప్రజలకు సుఖ జీవనాన్ని ఇస్తున్నారు. కాని ఈ వలస కార్మికులకు తినేందుకు తిండి ఒక్కపూట కూడా దొరకడం లేదంటే ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు. వారి దుస్థితి ఈ విధంగా ఉంది. ఈ పరిశ్రమలు స్థాపించడం వలన వలస పోతున్న కార్మిక రంగాన్ని స్థానికంగానే ఈ పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించి ఆదుకోవలసిన అవసరం ఉంది. వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ఈ పరిశ్రమలలో కుటుంబాలకు, కుటుంబాలనే పనిచేయించాల్సిన అవసరం ఉన్నది.

### 3) పారిశ్రామిక ఉత్పత్తుల పరిశ్రమలు

ఇక మూడవ రకమైన పరిశ్రమలు హైదరాబాద్, రంగారెడ్డి కేంద్రంగా స్థాపించవలసిన అవసరం ఉంది. ఇవన్నీ గతంలో సమైక్యాంధ్ర రాష్ట్ర ఏర్పాటుకంటే ముందే అపారమైన ఉత్పత్తులను ఉత్పత్తి చేసిన పరిశ్రమలు ఐ.డి.పి.ఎల్., ఇ.సి.ఐ.ఎల్., ఐ.డి.ఎల్.,

బి.డి.ఎల్., రిపబ్లికన్ ఫోర్జ్, బెక్రైట్ హెలమ్, అల్విన్, ఫ్రాగా టూల్స్, హెచ్.ఎం.టి., వి.ఎస్.టి., డి.బి.ఆర్. మిల్స్ లాంటి పరిశ్రమలు హైదరాబాద్ నగరం నడిబొడ్డున లక్షలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా తెలంగాణ మొత్తం ప్రజలకు పరోక్షంగా ఉపాధి కలిగిస్తూ దేశానికే పేరు తెచ్చిన సంస్థలుగా రూపుదిద్దుకున్నాయి. కాని 1960 సంవత్సరం తరువాత అంచెలంచెలుగా ఈ పరిశ్రమలు మూసి వేయించి ఆ స్థలాలను తమ సొంత ప్రయోజనాలకు వాడుకున్న విషయం జగద్విదితమే. రాబోయే ప్రజాస్వామిక తెలంగాణలో లేదా పాలక పార్టీలు చెప్పుతున్నట్టుగా తెలంగాణ పునర్నిర్మాణంలో ఈ పరిశ్రమలన్నీ మళ్ళీ స్థాపించవలసిన అవసరం ఉంది. ఈ పరిశ్రమలన్నీ కూడా ఉత్పత్తి పరిశ్రమలే. ఈ ఉత్పత్తులు దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా కూడా ఎగుమతి చేసేందుకు అవకాశం ఉన్న ఉత్పత్తులే. నాడే ఈ ఉత్పత్తులను ఈ పరిశ్రమలు ఎగుమతి చేశాయి. నాటి పాత సాంకేతిక నైపుణాన్ని వదిలి నేడు ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న అత్యంత కొత్త సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించుకొని ఈ పరిశ్రమలను స్థాపించవలసిన అవసరం ఉంది. ఈ పరిశ్రమల్లో ఒక నూతన చట్టం ద్వారా హైదరాబాద్ నగరంలోని ముస్లిం మైనారిటీ యువతకు ప్రత్యేక ఉద్యోగ కల్పన కల్పించవలసిన అవసరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపైన, కేంద్ర ప్రభుత్వం పైన ఉన్నది. ఈ పరిశ్రమలు లేకపోవడం వలన, కొత్త పరిశ్రమలు స్థాపించబడక పోవడం వలన, ఉద్యోగాలు లేక ముస్లిం మైనారిటీ, దళిత, వెనుకబడిన యువత హైదరాబాద్ నగరంలో తమ కుటుంబాలను కటిక దారిద్ర్యంలో వదిలేసి బొంబాయి, దుబాయి, సౌది అరేబియా లాంటి గల్ఫ్ దేశాలకు వలస పోయి అత్యంత తక్కువ జీతాలతో బానిస బతుకులు బతుకుతున్నారు. ఈ పరిశ్రమలు ప్రభుత్వరంగంలో పునరుద్ధరించడం వలన హైదరాబాద్ వ్యాప్తంగా విస్తరించుకున్న పై లక్షలాది యువతకు ఉద్యోగ కల్పన కలుగుతుంది. అటువైపు రాబోయే ప్రభుత్వం తక్షణం ఆలోచించి నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉంది. ఈ పరిశ్రమలకు అవసరమైన అపారమైన భూమి హైదరాబాద్ నగర చుట్టుపక్కల ప్రాంతాలైన రంగారెడ్డి, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొంత ప్రాంతాన్ని ఈ పరిశ్రమలకు కేటాయించి కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఈ పరిశ్రమలను స్థాపించవలసిన అవసరం ఉంది.

### 4) ఆటో మొబైల్, గృహోపకరణ, ఫార్మా రంగ ఉత్పత్తులను ఉత్పత్తిచేసే పరిశ్రమలు

ఇక నాలుగవ రకం పరిశ్రమలైన ఆటో మొబైల్, గృహో పకరణ ఉపయోగ వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తికి దోహదపడే వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలు ఇంకా మానవ జీవితంలో ఇతర వికాసాలకు సంబంధించి ఉపయోగపడే వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలను కూడా ప్రభుత్వరంగంలోనే స్థాపించవలసిన అవసరం ఉంది. ఈ పరిశ్రమలకు స్థానిక చిన్న పెట్టుబడిదారుల, జాతీయ పెట్టుబడిదారుల పెట్టుబడిని, వారి సాంకేతిక నైపుణ్యాన్ని ఈ పరిశ్రమల స్థాపనలో అపారంగా వినియోగించు కునేందుకు అవకాశం ఉన్నది. ఈ పరిశ్రమల్లో పురుషులతో పాటు స్త్రీలకు కూడా అపారమైన ఉద్యోగ కల్పన అవకాశం ఉన్నది. హైదరాబాద్ నగరంలో ఇప్పటికే నాచారం, ఉప్పల్, కాటేదాన్, బాలానగర్, జీడిమెట్ల, పటాన్‌చెరు, రామచంద్రాపురం పారిశ్రామిక వాడల్లో స్త్రీ కార్మికులు అత్యంత దుర్భర జీవితం గడుపుతూ తమ అద్భుతమైన శ్రమను అత్యంత కారుచౌకగా సీమాంధ్ర పెట్టుబడిదారులకు గత ఐదు దశాబ్దాలుగా ధారపోస్తున్నారు. వీరి చెమట, రక్తపు చుక్కల వలన వేలాది కోట్ల రూపాయలకు ఆస్తి పరులైన ఈ పెట్టుబడిదారులు ఈ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. వీరిని రాత్రనకా, పగలనకా అన్ని షిఫ్ట్‌లలో కూడా డ్యూటీలు వేస్తూ వారి ప్రాథమిక హక్కులు, చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తూ వారిపైన భౌతికదాడులు, లైంగికదాడులతో పాటు అమానవీయమైన అత్యాచార, హత్యలు కొనసాగుతున్నాయి. దేశంలోని అత్యాచారాల హత్యల విషయంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. అందులో హైదరాబాద్ నగరమే ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుంటుంది. ఇది ఈ సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడిదారులు తెలంగాణ ప్రాంతానికి దానికి కేంద్రంగా ఉన్న హైదరాబాద్ నగరానికి ఇచ్చిన ప్రత్యేక కానుకగా అభివర్ణించవలసిన దౌర్భాగ్య పరిస్థితికి నెట్టబడ్డాం.

### 5) సేవారంగం-కంప్యూటర్ పరిశ్రమలు

ఈ అయిదవ రకమైన పరిశ్రమను ఇప్పటికే హైద్రాబాద్‌లో స్థాపించారు. ఇది మొత్తం ప్రైవేటురంగానికే పరిమితమయింది. స్పెషల్ ఎకనామిక్ జోన్‌ల పేరుతో లక్షలాది ఎకరాల భూములు ఈ బడా, మధ్య తరగతి పెట్టుబడిదారులకు కేటాయించిన చంద్రబాబు,



డా.వై.యస్.రాజశేఖర్‌రెడ్డిలు ఆ సంస్థలలో వాటాలు కూడా పొందారు. వాటాలు వీలులేని పరిస్థితిలో బినామీలను, అపారమైన ధనాన్ని బహుమతులుగా పొందారు. ఈ చట్టం రాక ముందు ఏర్పరచిన పరిశ్రమలన్ని ఈ చట్టం వచ్చిన తర్వాత దాని పరిధిలోకి తీసుకువచ్చి లక్షలాది కోట్ల రూపాయల రాయితీలు ప్రభుత్వాల నుండి పొందిన ఇన్ఫోసిస్, విప్రో, మైక్రోసాఫ్ట్, సత్యం కంప్యూటర్స్, గ్లోబల్ కంప్యూటర్స్, ఇంకా వేలాది పరిశ్రమల అధిపతులు మరియు సినిమా రంగానికి చెందిన రామోజీ, రామానాయుడు, రామారావు, నాగేశ్వరరావు, యల్.వి.ప్రసాద్, కృష్ణ, మురళీమోహన్ లాంటి సీమాంధ్రకు చెందిన నటులు, సాంకేతిక నిపుణులు తమ స్టూడియోలను, సినిమా ల్యాబ్స్‌ను కూడా ఈ చట్ట పరిధిలోకి తెచ్చి తెలంగాణ ప్రజలకు చెందిన అన్ని రకాల సంపదను కొల్లగొట్టారు.

ఈ పరిశ్రమలన్ని తను అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు, తన డొల్ల తనాన్ని బయట పెట్టుకోవడం లేదు. ఈ పరిశ్రమలు ప్రపంచ వ్యాప్తంగానే 1995 సం? నుండి అభివృద్ధి చెందాయి. ప్రపంచీకరణ, సేవారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన సామ్రాజ్యవాద శక్తులు ప్రపంచం మొత్తం ఒక కుగ్రామంగా మార్చాలని చేసిన ప్రయత్నాల వలన "గ్లోబల్ విలేజి" పేరుతో అత్యాధునిక సాంకేతికనైపుణ్యాన్ని మెరుగుపరచి కంప్యూటర్ పరిశ్రమను అభివృద్ధి చేశారు. ఈ కంప్యూటర్ పరిశ్రమ ద్వారా లక్షలాది కార్మికులు రోడ్డునపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటురంగంలో కంప్యూటరీకరణ అభివృద్ధి చెందడం ద్వారా సర్వం కంప్యూటర్ మయం అయింది. ఆ పది సంవత్సరాలు తెలుగుదేశం ప్రభుత్వం వుండడం వలన అనివార్యంగా కంప్యూటర్ రంగం అభివృద్ధి చెందగా, దానికి ప్రజల సంపదను సర్వం ధారపోసిన చంద్రబాబు ఈ కంప్యూటర్ అధిపతులు లక్షల కోట్లకు పడగెలెత్తేందుకు కారణమయి తన వాటా తాను పొందారు. ప్రజలు, కార్మికులు, రైతులు ముఖ్యంగా బాధితులయ్యారు. ఇప్పుడు దీనిని ప్రత్యేకంగా అభివృద్ధి చేయవలసిన అవసరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికీ, కేంద్ర ప్రభుత్వానికీ లేదు.

## పరిశ్రమలు-ప్రజాస్వామిక దృక్పథం

పరిశ్రమలు నూతన తెలంగాణలో ప్రజాస్వామిక దృక్పథంతో స్థాపించకపోయినా, స్థాపించిన పరిశ్రమలలో ప్రజాస్వామిక దృక్పథం లోపించినా, జరిగేది అరాచక, వికృత అభివృద్ధే తప్ప, ప్రజా అభివృద్ధి కాదనే విషయం రాబోయే పాలకులు గ్రహించాలి.

తెలంగాణకు సముద్ర తీరం లేదు కాబట్టి సముద్ర తీర ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించే అవకాశం లేదు. మైదాన ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించేటప్పుడు ఆదివాసీ ప్రజలకు, మైదాన ప్రాంత ప్రజలకు వైరుధ్యం ఏర్పడకుండా చూడవలసిన అవసరం వున్నది. ఆదివాసీ ప్రాంతాలలో అస్తిత్వంలో ఉన్న ఏ ఒక్క చట్టం ఇప్పటి వరకు అమలు కాలేదు. తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసుల చట్టాలన్ని సక్రమంగా అమలు చేయాలి. ఆదివాసీ ప్రాంతాలలోవున్న ఎంతటి విలువైన సంపదైనా చట్టాలకు లోబడి వారికే దక్కే విధంగా నిర్దిష్ట విధానాలుండాలి. ఆయా ప్రాంతాలలో లభించే ముడిసరుకు వారి ద్వారానే అక్కడ నిర్మిస్తున్న పరిశ్రమలకు అందేటట్లు చేయాలి. అదే విధంగా ఆయా పరిశ్రమలలో అన్ని రకాల ఉద్యోగాలకు 90 శాతం ప్రాముఖ్యత ఆదివాసులకు, గిరిజనులకు ఇవ్వాలి. ఆ ప్రాంతాలలోని



బంజార గిరిజనులు తమకన్న బిడ్డలను అమ్ముకున్న చరిత్ర, ఆదివాసి బిడ్డలు విషపు గడ్డలు తిని బతికిన చరిత్ర గడచిన అయిదున్నర దశాబ్దాలుగా వున్నది. దీనిని నిర్మూలించేందుకు అడవి మీద హక్కు ఆదివాసులకే దక్కుతూ, అడవి సంపద మీద హక్కు ఆదివాసులకు, ఆయా స్థానిక ప్రాంతాలను బట్టి బంజారా గిరిజనులకే దక్కే విధంగా పారిశ్రామిక విధానాలుండాలి.

ఈ పరిశ్రమల స్థాపనలో భారీ నిర్వాసిత ప్రాంతం మైదాన ప్రాంతాలలో కాని, అటవీ ప్రాంతాలలోని వుండకూడదు. తెలంగాణ జిల్లాల్లో మరియు హైద్రాబాద్, రంగారెడ్డి ప్రాంతాల్లో లక్షలాది ఎకరాల భూమిని సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడిదారులు ఆక్రమించుకున్నా, ఇంకా అపారమైన ప్రభుత్వం భూమి వున్నది. ఆ భూములను గుర్తించి ఆయా భూముల ఆయా వసతులను బట్టి ఆయా పరిశ్రమలను స్థాపించాలి. హైద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నెలకొని ఉన్న సేవారంగానికి సంబంధించిన కంప్యూటర్ పరిశ్రమలకు, ఉత్పత్తికి సంబంధించి ఇప్పటికే నెలకొని ఉన్న, స్థాపించబోయే పరిశ్రమలకు మధ్య ఎటువంటి వైరుధ్యం లేకుండా తెలంగాణ ప్రభుత్వ విధానాలుండాలి. సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడి దారులకు ఇచ్చిన రాయితీల లాగానే స్థానిక చిన్న, మధ్య తరగతి, జాతీయ పెట్టుబడిదారులకు కూడా భారీ రాయితీలు కల్పించాలి. సీమాంధ్ర పరిశ్రమలకు కేటాయించిన అత్యధిక భూములను స్వాధీన పరుచుకొని తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోకి తెచ్చుకోవాలి. సీమాంధ్ర పరిశ్రమలకు, తెలంగాణ పరిశ్రమలకు వైరుధ్యం లేకుండా ప్రభుత్వ విధానం ఉండాలి. ప్రభుత్వరంగంలో వెలువడే పరిశ్రమలు పూర్తిగా ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమలు కనుక చాలా పరిశ్రమల నుండి వచ్చే వ్యర్థ పదార్థాల వలన గాలీ, నీరు కలుషితమై వాతావరణంలో, నీటిలో సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉన్నది. దీనివలన వాతావరణం పూర్తిగా దెబ్బతిని పర్యావరణానికి పెద్ద ప్రమాదం ఏర్పడే ప్రమాదం ఉన్నది. కనుక, పర్యావరణ చట్టాలను తూ.చ. తప్పకుండా అమలు చేయాలి.

ఈ పరిశ్రమలకు అవసరమైన నీరు, విద్యుచ్ఛక్తిని అందించే సమయంలో వ్యవసాయ రంగానికి, గృహోపకరణానికి, ఆదివాసి, దళిత, గిరిజన, మైదాన ప్రాంతాలకు అందించటంతో పాటు ఈ పరిశ్రమలకు కూడా అందించాలి. పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వ్యవసాయ, గృహ అవసరాల నిమిత్తం తక్కువ ప్రాధాన్యత ఇస్తే రైతాంగానికి సంబంధించిన వ్యవసాయరంగానికి, చిన్న, మధ్య తరగతి, జాతీయ పెట్టుబడిదారులకు సంబంధించిన పరిశ్రమలకు, ప్రభుత్వ పరిశ్రమల మధ్య వైరుధ్యం ఏర్పడే అవకాశం వున్నది. కనుక ప్రాధాన్యతలను శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించి అటువైపు పారిశ్రామిక అభివృద్ధి జరగాలి.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు, ఇతర పరిశ్రమలకు మధ్య వైరుధ్యం ఏ సందర్భంలోనైనా లేకుండా వుండాలి. పత్తి, చెరుకు కొనుగోలు విషయంలో కాని, ఇంకా ఇతర పప్పు దినుసులు, వరి, జొన్న, గోధుమ లాంటి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నప్పుడు రైతాంగానికి, పారిశ్రామిక యాజమాన్యం (ప్రభుత్వ-చిన్న-మధ్య తరగతి-జాతీయ పెట్టుబడిదారులకు), మధ్య ఎటువంటి వైరుధ్యం ఏర్పడకుండా పాలకులు తమ విధానాలు రూపొందించాలి. ఈ రకంగా పారిశ్రామిక విధానం అమలు చేయాలంటే అవసరమున్న విద్యుత్‌ను ఇనుమును ఉత్పత్తి చేయాలనే నెపంతో సింగరేణిలో "ఓపెన్‌కాస్ట్ గనులను" అనుమతించరాదు. ఇప్పటికే మెజారిటీగా ఓపెన్‌కాస్టు గనులు తవ్వడం వలన ఉత్తర తెలంగాణ "బొందలగడ్డ"గా మారింది. అండర్ గ్రౌండ్ గనులను మాత్రమే తవ్వుతూ, మిషనరీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వకుండా, మానవ శ్రమకే విలువనిస్తూ గోదావరి తీర ప్రాంతంలోవున్న బొగ్గు నిక్షేపాలను వెలికితీసి విద్యుత్, ఇనుము, సిమెంట్ పరిశ్రమలకు అందించాలి. ఈ చిన్న పరిశ్రమలు అభివృద్ధి, నూలు, బట్ట తయారీకి సంబంధించిన సిరిసిల్ల, పోచంపల్లి, వరంగల్, గద్వాల పరిశ్రమలకు 90 శాతం సబ్సిడితో వారి పరిశ్రమలను అభివృద్ధి చేయుటకు, పెట్టుబడి, ముడిసరుకును అందించడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. ఇదే సమయంలో వారి అజంజాహిమిల్లు, అంతర్‌గాం, సర్‌సిల్క్, డిబిఆర్ మిల్లులు ఉత్పత్తులకు, పై పరిశ్రమల ఉత్పత్తులకు వైరుధ్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ఉత్పత్తులకు, "కండసారి బెల్లం" తయారీ యూనిట్ల ఉత్పత్తులకు మధ్య వైరుధ్యం లేకుండా చూడాలి. తెలంగాణ ప్రాంత వనరులను సమగ్రంగా ఉపయోగించుకుని ప్రజాస్వామిక దృక్పథం కలిగిన పారిశ్రామిక అభివృద్ధి కొరకే లక్షల కోట్ల రూపాలయల విలువల కలిగిన బయ్యారం, గార్ల, గూడూరు, బీందేవరపల్లిలో వున్న అపారమైన ఖనిజసంపదను మరియు నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని సీమాంధ్ర భూస్వామ్య పెట్టుబడిదారులకు దక్కకుండా అన్ని రకాల పోరాటాలు చేసి ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, బెదిరింపులకు బెదరకుండా కాపాడగలిగాం, నూతన తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు మాత్రమే కాపాడగలిగాం. నూతన తెలంగాణలో ప్రజాస్వామిక దృక్పథం కలిగిన పరిశ్రమలతో విలసిల్లుతూ తెలంగాణ ప్రజలందరు సమగ్ర వికాసంతో బతుకాలనే ప్రజాస్వామిక అకాంక్షను అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వాలపై విస్తృతమైన, బలమైన ప్రజా ఉద్యమం నిర్మించాల్సిన బాధ్యతా ప్రజాతంత్ర ఉద్యమాలపై వున్నది. ఈ ప్రజా ఉద్యమాలకు చిన్నపాటి సహకారం అందించకలిగే వాళ్ళను కూడా ఈ ఉద్యమాల్లో కలుపుకుని స్థానిక ప్రభుత్వంపై, దాని పెద్దన్న అయిన కేంద్ర ప్రభుత్వంపై పోరాడినప్పుడు మాత్రమే నూతన తెలంగాణలో "ప్రజాస్వామిక దృక్పథం కలిగిన పారిశ్రామిక విధానం" అమలు అవుతుంది. అమరుల కలలకు సాకారం లభిస్తుంది. అటువైపు ప్రజాఉద్యమం నిర్మించేందుకు మరొకసారి అమరుల సాక్షిగా ప్రమాణం చేస్తూ ముందుకు కదిలి తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ సంస్కృతిని కొనసాగిద్దాం. ❖

**బి. రామకృష్ణ**

అధ్యాపకుడు

# తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల విద్య

***జూన్ 2 నుంచి అధికారికంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నో ఆంక్షలతో, పరిమితులతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవిస్తున్నది. తెలంగాణ ఉద్యమం ఎన్నో ఆశలతో, ఆకాంక్షలతో నడిచింది. ఆత్మగౌరవం కోసం తండ్లాడింది. ఆత్మగౌరవం నిండుగా విలసిల్లాలంటే ప్రధానంగా అందవల్సింది విద్య, ఉపాధి. సమాజ అభివృద్ధి సూచికల్లో మౌలికమైనది విద్య. అట్టడుగు ప్రజానీకం తలెత్తుకుని నిలబడడానికి కావల్సిన వాటిల్లో ముఖ్యమైనది విద్య. మూర్తిమత్వం రూపుదిద్దుకుంటున్న (ఫార్మేటివ్ ఏజ్) వయస్సులో అందించే విద్య స్వభావం, గుణాత్మకత ఎంతో విలువైనవి. ప్రజాస్వామిక, లౌకిక, సామ్యవాద, సహోదరత్వ, సమానత్వ విలువలను పెంపొందించి మనిషిని ఉన్నత మానవుడిగా తీర్చిదిద్దడానికి విద్య ఒక శక్తివంతమైన సాధనంగా ఉపకరిస్తుంది. అంతటి ప్రాముఖ్యత ఉన్న విద్య తెలంగాణలో రూపుదిద్దుకోవడానికి విధానపర నిర్ణయాలు-వాటి అమలుకు తీసుకోవల్సిన చర్యలు ఎంతో కచ్చితంగా, భవిష్యత్ దర్శనంతో కూడుకొని ఆచరణాత్మకంగా ఉండాలి.***

మౌలికంగానే విద్య అనేది సమాజపరం కావాలి. సార్వత్రికం కావాలి. విద్య ప్రాముఖ్యతను గుర్తించే, అంబేద్కర్ రాజ్యాంగంలో దాని గురించి ప్రస్తావించాడు. నిర్బంధ, ఉచిత, సార్వత్రిక విద్య ఉండాలని కోరుకున్నాడు. అతని కంటే ముందే పూలే హంటర్ కమీషన్‌కు చేసిన ప్రాతినిధ్యంలో దీని గురించి చెప్పి ఉన్నాడు. సమాజం తన ఉన్నతి కోసం, తనలోని వారికి తానుగా, తనను నడిపించే శక్తిని తయారు చేసుకోవడంలో అతి ముఖ్యమైన పాత్రను విద్య పోషిస్తుంది. అటువంటి విద్యను ప్రభుత్వమే అందించాలి. అయితే స్వాతంత్ర్యానంతరం మూడు దశాబ్దాలుగా పబ్లిక్ రంగంలో ఉన్న విద్య రాను రాను ప్రైవేటు చేతుల్లోకి పోతున్నది. 1980వ దశకం నుంచి వేగంగా అడుగులేస్తూ 1990ల నుంచి విద్యా ప్రైవేటైజేషన్ వేగవంతమై స్థిరీకృతం అవుతున్నది. నేడు దూకుడుగా తప్పనిసరైన ఇక మార్చడానికి వీలుకాదని అనుకునేటంతగా విద్యా ప్రైవేటీకరణ జరిగి పోయింది. గాట్ ఒప్పందంలో భాగంగా విద్య వ్యాపార సరుకైంది. పెట్టుబడిదారీ శక్తులు విద్యను వ్యాపారం చేసేసారు. అదొక డబ్బు సంపాదించే యంత్రం అయ్యింది. పాఠశాల చదువులకు తరగతి, తరగతికి వేలకొద్ది రూపాయల నుంచి లక్షల్లో వసూలు చేసుకునే దిశలో పరిణామం చెందుతూ వస్తున్నది. విద్య వ్యాపారమయం కావడం అంటేనే అది సమాజ పతనానికి సూచిక అనే విషయం మరిచిపోవద్దు.

రేపు తెలంగాణలో విద్యా ప్రైవేటీకరణ జరగకుండా తగు చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. ఇకముందు ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇవ్వద్దు. ప్రస్తుతం నడుస్తున్న వాటిలో నిర్ద్వందంగా ఫీజులను నియంత్రించాలి. ఫీజులను నియంత్రించే అధికారం ప్రభుత్వం చేతుల్లో ఉండాలి. ప్రతి ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వం ప్రచురించిన పాఠ్యపుస్తకాలనే వాడాలి. ఇష్టారాజ్యంగా వాడుతున్న ప్రైవేట్ పబ్లిషర్స్ ప్రచురణలను నిరాకరించాలి. వాటిని విప రీతమైన ధరలకు అమ్మడాన్ని అరికట్టి ప్రజల జేబులు చిల్లులు పడకుండా చూడొచ్చు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు హేతుబద్ధమైన పరిహారాన్ని ఇస్తూ వాటిని క్రమేపి టేక్‌ఓవర్ చేసుకోవాలి. వాటిని సమాజపరం చేయాలి. విద్య అనేది ఎన్నటికీ వ్యాపారాత్మక వస్తువు కాదని అది సమాజ బాధ్యత అని స్పష్టమైన సంకేతాలివ్వాలి. క్రమేపి మతపరమైన విద్యాసంస్థలను తగ్గిస్తూ పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లోకి వచ్చేలా చేయాలి. రకరకాల మేనేజ్‌మెంట్ల కింద ఉన్న పాఠశాలలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలకు అనుబంధంగా ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ ఎడ్యుకేషన్(ఇసిసిఇ) కేంద్రాలను ప్రారంభించాలి. వాటిని మొక్కుబడిగా కాకుండా గుణాత్మకంగా నడపాలి.

పాఠశాల ఆవరణ సువిశాలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా తరగతి గదులు, విశాలమైన ఆటస్థలం, లైబ్రరీ, లాబొరేటరీ, కంప్యూటర్ గదులు, చక్కని టాయిలెట్‌లు, మంచినీటి వసతి మొదలైన అన్ని సౌకర్యాలతో శాస్త్రీయమైన పద్ధతుల్లో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న కేంద్రీయ విద్యాలయాల స్థాయికి తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను ఎదిగించాలి. కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశం కోసం తపించే తల్లిదండ్రులెందరో ఉన్నారు. అడ్మిషన్లు దొరకక నిరాశపడుతున్నవారు ఎందరో ఉన్నారు. ప్రభుత్వ (కేంద్ర) ఆధీనంలో నడుస్తున్నవే. ప్రతిపాఠశాలలో పిల్లలందరికి ఉదయం సాయంత్రం అల్పాహారం మధ్యాహ్నం భోజనం అందించాలి. అది రుచికరంగా, పౌష్టికంగా ఉండేలా చూడాలి. ప్రస్తుతం ప్రతిపిల్లవానిపై రోజుకు మధ్యాహ్న భోజనానికి ఖర్చుపెడుతున్న ప్రాథమిక స్థాయి విద్యార్థికి 4.35,

ఉన్నత పాఠశాల విద్యార్థికి 6.00రూ.లు ఏ మాత్రం సరిపోవు. నాసిరకమైన ఆహారాన్ని ఇస్తున్నారు. ఫలితంగా చాలామంది పిల్లలు దీనికి దూరంగా ఉంటున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక మైన వ్యవస్థను ఏర్పాటు చేసి వీటి నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటుగా నోట్‌బుక్‌లు, బ్యాగ్‌లు, యూనిఫారాలు, అవసరమున్న చోట సైకిళ్లు, రవాణా సౌకర్యం ఉచితంగా కల్పించాలి. ప్రైవేటు పాఠశాల వ్యవస్థను నిరోధించి, ప్రభుత్వ పాఠశాలలో సరిపోను వసతులు ఏర్పరచడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో నమోదు పెంచుకోవచ్చు. విద్యార్థుల సంఖ్య తగువిధంగా లేదని వాటిని మూసేసే పరిస్థితి రాకుండా పోతుంది. ప్రతి మండలానికి ఒక రెసిడెన్షియల్ పాఠశాలను నెలకొల్పి, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల ఆధారంగా దాంట్లో ప్రవేశాలు కల్పించాలి. దీని గురించి కెసిఆర్ వాగ్దానం కూడా చేసి ఉన్నాడు. టిఆర్‌ఎస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్యను వాగ్దానం చేసింది. ఉచిత విద్య అంటే ప్రైవేటు పాఠశాలలను అలాగే కొనసాగనిచ్చి, మరిన్నింటికి అనుమతులిచ్చి వ్యత్యాసాలతో కూడిన విద్యనివ్వడం కాదు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి వసతులను కల్పించకుండా ఉచిత విద్యనిస్తామని అంటే దగాకోరుతనం అవుతుంది.

ప్రతి పాఠశాలలో సబ్జెక్టు టీచర్స్, పిఇటిలతో పాటుగా లైబ్రేరియన్, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులను మంజూరుచేసి తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20గా ఉండేలా క్రమేపి చర్యలు తీసుకోవాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికో టీచర్, తరగతికో గది ఒక హెడ్‌మాస్టర్, ఆరోగ్య వ్యాయామ టీచర్, క్రాఫ్ట్, డ్రాయింగ్ లేదా కళలు, సాంస్కృతిక అంశాలకు సంబంధించి టీచర్‌లను నియమించాలి. 1 నుంచి 5 తరగతుల వరకు 1. తెలుగు/ఉర్దు, 2. ఇంగ్లీష్, 3. గణితం, 4. పరిసరాల విజ్ఞానం, 6–10 తరగతుల వారికి 1. తెలుగు/ఉర్దు, 2. ఇంగ్లీష్, 3. హింది, 4. గణితం, 5. భౌతిక శాస్త్రం, 6. జీవశాస్త్రం, 7. సాంఘిక శాస్త్రం అనే సబ్జెక్టులతో పాటుగా 1 నుంచి 10 తరగతుల వారందరికీ 1. ఆరోగ్య, వ్యాయామ విద్య, 2. సాంస్కృతిక విద్య కళలు, 3. పని, కంప్యూటర్ విద్య, 4. విలువల విద్య, జీవననైపుణ్యాలు అనేవి బోధనాభ్యాసన ప్రక్రియలో ఉన్నాయి. ఒకటి నుంచి ఐదు తరగతుల వారికి ఎనిమిది విషయాల్లో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు పదకొండు విషయాల్లో బోధనాభ్యాసనం జరగాలి. అలాగే వాటన్నింటిపై మూల్యాంకనం జరగాలి. పేరుకు ఇన్ని చెప్పబడుతున్నప్పటికి ప్రాథమిక స్థాయిలో 4 సబ్జెక్టులు ఉన్నత స్థాయిలో 11 సబ్జెక్టులపైనే దృష్టంతా ఉంటుంది తప్పిస్తే మిగతా పైన పేర్కొన్న నాలుగు నామమాత్రమే. వాటికి సంబంధించిన టీచరు,(హైస్కూల్‌లో ఆరోగ్య వ్యాయామ టీచర్, పిఇటి తప్పిస్తే) పోస్టులే లేవు ఇక టీచర్లు ఎక్కడి నుంచి వస్తారు. ఈ నాలుగు విషయాలకు పాఠశాల విద్యా వ్యాసాంగంలో ఎంతో ప్రాధాన్యత ఉన్నది. అవి చాలా అవసరమైనవి కూడా. అనేక ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరి కంటే ఎక్కువ టీచర్లు లేని పరిస్థితుల్లో ఐదు తరగతుల పిల్లలకు ఇవన్నీ బోధించడం వాటిని మూల్యాంకనం చేయడం ఏకోశానా సాధ్యం కాదు. ఇవి సాధ్యం కావాలంటే ఇంతకు ముందే చెప్పుకున్నట్లు ప్రతి తరగతిలో ఉపాధ్యాయ విద్యార్థినిష్పత్తి 1:20 తరగతికో టీచర్, తదితరాలు కల్పించాలి. ఇవేవి చేయకుండానే నిరంతర సమగ్ర మూల్యాంకనం(సిసిఇ)ను ప్రవేశపెట్టారు. క్షేత్రస్థాయిలో దీనిపై సాధ్యాసాధ్యాలను సరి చేసుకోకుండానే సిసిఇను మొదలుపెట్టారు. అవి ఎంత సదుద్దేశ్యంతో కూడుకొని ఉన్నప్పటికీ కూడా ప్రత్యక్ష క్షేత్రంలో ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోకుండా, వాటిని పరిష్కరించకుండా ప్రవేశపెడితే వ్యతిరేకతను కొని తెచ్చుకోవడంతో పాటుగా వైఫల్యం చెందడం ఖాయం. వైఫల్యం చెందినా సరే కొనసాగిస్తారని గతేడాది అనుభవం చెబుతున్నది. దీన్ని తెలంగాణ రాష్ట్రంలో పరిష్కరించవలసి ఉన్నది.


తరగతి గదుల్లో/పాఠశాలల్లో బోధనతో పాటుగా తప్పనిసరిగా ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయులతో కలిసి సంవత్సరంలో కనీసం మూడు నాలుగు సార్లయినా దైనందిన కార్యక్రమంలో తప్పనిసరి భాగం చేయాలి. వ్యవసాయపు పనులు, చేతివృత్తులు, ఇతర వృత్తిపనులు, పరిశ్రమలు, చెరువులు, కాలువలు, నదులు మొదలైన ఎక్కడికక్కడి భౌగోళిక, సాంస్కృతిక వారసత్వ శ్రమైక జీవనాల సందర్శకాలు విద్యా వ్యాసంగంలో తప్పనిసరి అంశంగా ఉండాలి. సమాజంలోని వివిధ వృత్తులవారు, కళాకారులు, లాయర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, వ్యవసాయదారులు, తదితర అనేక రంగాల్లో ఉన్నవారిని లభ్యతను అనుసరించి వారి చేత తరచుగా 'ఇంటరాక్టివ్ సెషన్స్'ను ఏర్పాటుచేయాలి. అలా పాఠశాలను సమాజంలోకి, సమాజాన్ని పాఠశాలలోకి తేవాలి. వీటిని మూల్యాంకనంలో భాగం చేయాలి. దీని కోసం అవసరమైతే పాఠశాల పనిదినాలను పెంచుకోవాలి.

ప్రతిరోజు ప్రతిపిల్లవాడు తప్పనిసరిగా ఒక పిరియడ్ ఆటలు ఆడుకునేలా, డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్, డాన్స్ మొదలగు సాంస్కృతిక అంశాలలో ఏదో ఒకటి ప్రతిరోజు నిర్వహించేలా చూడాలి. ప్రతి పాఠశాలలో లైబ్రరీలను పటిష్టం చేయాలి. ఇవి పిల్లలకే కాకుండా ఉపాధ్యాయులకు సహాయకారులుగా ఉండాలి. పిల్లలకు, ఉపాధ్యాయులకు అవసరమయ్యే విస్తృతమైన సాహిత్యం అందుబాటులో ఉండాలి. ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యామ్నాయ విద్యావిధానాలపై జరిగిన, జరుగుతున్న ఆచరించబడుతున్న అనేక విషయాల గురించి వివరించే గ్రంథాలు ఉండాలి. రెఫరెన్స్ పుస్తకాలు, పిల్లల పాఠ్యాంశాలకు ఎక్స్‌టెన్షన్‌గా ఉపయోగపడేవి, విస్తృతంగా అందుబాటులో ఉంచాలి.

ఉపాధ్యాయ శిక్షణా సంస్థల్లో ఉపయోగపడే పుస్తకాలు లైబ్రరీలో ఉండాలి. ఉపాధ్యాయులు నిరంతర అధ్యయనం చేసేలా సహకరించాలి. పాఠ్యేతర పుస్తకాలను చదవడాన్ని విద్యార్థుల్లో పెంపొందించేలా లైబ్రరీలు ఉపయోగపడాలి.

సర్వశిక్ష అభియాన్(ఎస్ఎస్ఎ) కింద విడుదలవుతున్న నిధులను ఖర్చుచేయడం కొరకు ఏర్పాటైన రాజీవ్ విద్యామిషన్ (ఆర్‌విఎం), రాజీవ్ మాధ్యమిక శిక్ష అభియాన్(ఆర్ఎంఎస్ఎ) పనిచేస్తున్నాయి. ఆర్‌విఎం, ఆర్ఎంఎస్ఎ నుంచి అకడమిక్ విషయాలన్నింటిని ఎస్‌సిఇఆర్‌టికు బదిలీ చేయాలి. వాటిని పాఠశాలల్లో భౌతిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు పరిమితం చేయాలి. భవన నిర్మాణాల్లో, పుస్తకాల ప్రింటింగ్‌లో జరిగే అవకతవకలను ఆర్థిక అక్రమాలు జరుగకుండా తగుచర్యలు తీసుకోవాలి. డిఎడ్, బిఎడ్ కళాశాలల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేదు. చాలా ఏళ్ల నుంచి వాటిలో నియామకాలే చేపట్టలేదు. వెంటనే ఆ పని చేయాల్సివుంది. ఈ సంస్థలకు ఎస్‌సిఇఆర్‌టి మధ్య సమన్వయం లోపించింది. అలాగే ఎస్‌సిఇఆర్‌టి, ఆర్‌విఎం/ఆర్ఎంఎస్ఎల మధ్య సమన్వయం లేదు. ఎస్‌సి ఇఆర్‌టి తయారుచేస్తున్న, ప్రవేశపెడుతున్న పాఠ్యప్రణాళిక, పాఠ్య పుస్తకాలు, బోధనా పద్ధతులను ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు అవగాహన చేసుకోలేకపోవడం వలన పాత పద్ధతుల్లోనే టీచర్ ట్రైనీలకు బోధిస్తున్నారు. బిఎడ్,డిఎడ్ అలాగే యూనివర్సిటీల్లోని ఉపాధ్యాయ శిక్షణా విభాగాల మధ్య సమన్వయం సాధించాలి. ఇవన్నీ కూడా కలిసి కట్టుగా బోధనాభ్యాసన ప్రక్రియ, సిలబస్,బోధనా పద్ధతులు తదితర పాఠశాల సంబంధిత అన్ని అంశాలపై నిరంతర పరిశోధనలు, ఆచరణాత్మక ప్రణాళికలు చేయాలి. ఈ పనిలో విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ వర్గాన్ని కలుపుకుపోవాలి. వారి సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బోధనాభ్యాసన ప్రక్రియలో ఎదుర్కొంటున్న సవాళ్లపై పరిశీలనలు, పరిశోధనలు చేసి పరిష్కారాలను కనుగొనాలి. ప్రతి ఉపాధ్యాయ శిక్షణా సంస్థకు కనీసం ఒక పాఠశాలను అనుబంధం చేయాలి. ఎస్‌సిఇఆర్‌టి, ఉపాధ్యాయ శిక్షణా సంస్థల్లో పనిచేస్తున్న లెక్చరర్లు, ప్రొఫెసర్లు సంవత్సరంలో కనీసం 10–20 రోజులు ఏదేని పాఠశాలలో బోధించేలా చేస్తే క్షేత్రస్థాయిలో వస్తున్న సమస్యలను ప్రత్యక్షంగా చూసినవారవుతారు. అనుభవించిన వారవుతారు. వాటిననుసరించి పరిష్కారమార్గాలు పరిశోధనలు చేసే పురోగమనం సాధ్యపడుతుంది.

మండల విద్యాశాఖాధికారి(ఎంఈవో), జిల్లా ఉప విద్యా శాఖాధికారి(డివైఈవో), జిల్లా విద్యాశాఖాధికారి(డిఇవో)లు కేవలం పరిపాలనా సంబంధిత పనులు మాత్రమే చేస్తున్నారు. వీరికి సమాంతరంగా అకడమిక్ విషయాలను, వాటి గుణాత్మ కతను పెంచేందుకు తగు యంత్రాంగాన్ని రూపొందించాలి. క్రమేపి ప్రైవేటు పాఠశాలలను కనుమరుదు చేయడం వలన ప్రలోభాలకు లొంగి అవినీతికి పాల్పడే ఆస్కార ముండదు. ఇక వారి శక్తి సామర్థ్యాలన్నీ



కూడా ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకతను సాధించే దిశలో వినియోగించే అవకాశ మేర్పడుతుంది. వీరికి కూడా పాఠ్యగ్రంథాలపై, బోధనా పద్ధతులపై, ప్రత్యామ్నాయ విద్యా విధానలపై మొత్తంగా పాఠశాల విద్యా వ్యాసంగంపై నిరంతర అవగాహన కొరకు రిఫ్రెషర్ కోర్సులు లేదా శిక్షణలు ఇప్పించాలి. వీరు సంవత్సరంలో కనీసం 30 రోజులు బోధించేలా తగు చర్యలు తీసుకోవాలి. ఫలితంగా బోధనాభ్యాసన ప్రక్రియలో కలిగే కష్టనష్టాలు తెలిసివస్తాయి. విద్యారంగంలో వస్తున్న, రావల్సిన మార్పులపై అవగాహన ఏర్పడుతుంది.

ఉపాధ్యాయులకు ఇచ్చే వృత్యంతర శిక్షణలు, శిక్షలుగా మారకుండా చూడాలి. గుణాత్మకంగా, ఆచరణాత్మకంగా, అనుసరణీయంగా ఉండేలా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయులకు రిఫ్రెషర్ కోర్సులు పెట్టి వారి జ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకొనేలా సహకరించాలి. ఉపాధ్యాయుడు తాను బోధించిన విద్యార్థులలో గుణాత్మక మార్పుకు దారితీసేలా తన సంసిద్ధతను, బోధనను తీర్చిదిద్దుకోవడం ప్రధానమైనది. తరగతి గది బోధనభ్యాసన ప్రక్రియ ప్రభావవంతంగా, ప్రయోజనకరంగా చేసుకోవడానికి అడ్డంకిగా తయారవుతున్న అన్నిరకాల పేపర్ వర్క్‌ను తొలగించాలి. తప్పనిసరైతే గనుక కనీస స్థాయికి తగ్గించాలి. ఈ మధ్యకాలంలో అనేకరకాల రిపోర్టులను పై అధికారులు అడుగుతున్నారు. వాటి కోసం ఎక్కువ సమయం కేటాయించే పరిస్థితి ఉన్నది.

ఉపాధ్యాయ సెలక్షన్‌లో టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్(టెట్)ను ఎత్తివేయాలి. ఎలాగూ డిఎస్సీ పరీక్ష ఉంటుంది కాబట్టి టెట్ అనవసరం. ఉపాధ్యాయ అభ్యర్థులకు డిఎస్సీ పరీక్షలు ప్రతి సంవత్సరం నిర్వహించి క్వాలిఫైడ్ అభ్యర్థుల లిస్టును సిద్ధం చేసుకొని పెట్టుకోవాలి. వీరిని నియమించడానికి ఒక కటాఫ్ డేట్‌ను ఆ సంవత్సరానికి నిర్ణయించి ఆ సంవత్సరంలో ఖాళీలు వెంట వెంటనే భర్తీచేస్తూ పోవాలి. అలా ఖాళీ ఏర్పడిన మరుసటి రోజే ఆ ఖాళీల్లో ఉపాధ్యాయులు నియమించబడతారు. విద్యా వాలంటీర్ల వ్యవస్థ లేదా ఆ పదమే వినిపించకూడదు. సీనియారిటీ లిస్టులను అడ్వాన్సుగానే సిద్ధం చేసుకొని ఖాళీ ఏర్పడిన మరుసటి రోజే ప్రమోషన్‌ల మీద నియమించే విధానం చేపట్టాలి. మండలానికి ఒకరిద్దరు సైకలాజికల్ గైడెను, కెరీర్ కౌన్సిలర్లను నియమించాలి. తద్వారా పిల్లల్లో ఉండే అభ్యాస లోపాలను సరిదిద్దవచ్చు. కౌమార దశలో వచ్చే ఒడిదుడుకులను ఎదుర్కోవడంలో వీరు సహాయపడతారు. అలాగే పై చదువులకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని అందించడంలో సహకరిస్తారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో సిలబస్‌లో తెలంగాణ చరిత్ర, భాష, సంస్కృతులు ప్రతిబింబించాలి. తెలంగాణ త్యాగాల, ఉద్యమాల చరిత్రలు పుస్తకాల్లోకి రావాలి. మతతత్వ భావనలను నిరాకరిస్తూ, రాజ్యాంగంలో పేర్కొన్న ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సామ్యవాదం అనే విలువల ఆధారంగా పాఠ్య ప్రణాళిక రూపుదిద్దుకోవాలి. ప్రస్తుత పాఠ్యపుస్తకాల్లో హిందూ మతానికి చెందిన చిహ్నాలు, ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీన్ని నిరోధించాలి. 10వ తరగతిలో తెలుగు ఉపవాచకంగా మహాభారతాన్ని పెట్టారు. దాన్ని తొలగించి కొమురం భీం జీవిత చరిత్రను ప్రవేశపెట్టవచ్చు. విద్యార్థుల్లో ప్రశ్నించే, శోధించి తెలుసుకునే విధంగా హేతుబద్ధ ఆలోచనలు, శాస్త్రీయ వైఖరులు అలవడేలా, శ్రమను గౌరవించేలా ఉండే పాఠ్యప్రణాళిక రూపుదిద్దుకోవాలి. విలువలు, నీతి అనగానే అవేవో ధర్మ శాస్త్రాల్లోనో, మత గ్రంథాల్లోనో, మతాలలోనో ఉంటాయనే వైఖరిని విడనాడి రాజ్యాంగంలో పొందు పరచబడిన విలువలను పరిగణలోకి తీసుకోవాలి. ఇంగ్లీష్ వ్యామోహాన్ని తొలగించుకొని మాతృభాషలోనే విద్యాబోధన చేయాలి. ఇంగ్లీషును భాషగా నేర్చుకోవడం వేరు బోధనా మాధ్యమంగా నేర్చుకోవడం వేరు. బోధనా మాధ్యమం తప్పనిసరిగా మాతృభాషలోనే ఉండాలి. ఇంగ్లీషును ఒక భాషగా నేర్చుకోవచ్చు గానీ బోధనా మాధ్యమంగా చేయడం సరైంది కాదు. ఈ దిశగా సమాజాన్ని చైతన్యపరచాలి. ప్రజలను కన్విన్స్ చేయాలి. ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు ముప్పు ఉండదని భరోసా ఇస్తూ, ఆచరణలో సాధించేలా చూడాలి. అన్నిరకాల పాఠశాలల్లో, ప్రైవేటు వాటితో సహా ఈ విధానాన్ని అమలుచేయాలి. ❖



డి.రమేష్ పట్నాయక్

# నవజాత తెలంగాణలో అందరికీ విద్య!

***అరవై ఏళ్ళ తెలంగాణ ప్రజల కల సాకారమైంది. భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. ఈ తొలిసంధ్య వేళలో తెలంగాణ సమగ్ర అభివృద్ధి ప్రధాన ఎజెండాగా ఉండడం సహజం, అత్యంత అవసరం కూడా. ఆధునిక సమాజంలో అభివృద్ధిలో విద్య కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఈ విషయంలో ఎవరికీ వివాదం లేదు. అందరికీ విద్య, అందరికీ ప్రమాణాలు గల విద్య, అందరికీ సమాన విద్య, బ్రతుకు తెరువును కల్పించే విద్య, బ్రతుకు విలువలను నేర్పే విద్య, బతుకును పునర్నిర్మించే విద్య, వైవిధ్యాలను గౌరవించే విద్య, వైషమ్యాలను పరిష్కరించే విద్య కావాలి అనే తెలంగాణ ప్రజల ఆకాంక్షకు గట్టి పునాదులు వేయవలసిన కాలమిది.***

## కార్పొరేట్ అభివృద్ధి - ప్రజల ఆకాంక్షలు:

అభివృద్ధిలో విద్య కీలకమైనపాత్ర పోషిస్తుందని భావిస్తున్నాం. అయితే అభివృద్ధి అన్న మాటకు అర్థం అందరికీ ఒకేలా స్ఫురించడం లేదు. పాలకవర్గాలకు, వారి మాయలో పడిన మధ్యతరగతి వర్గానికి అభివృద్ధి అంటే విదేశీ పెట్టుబడులు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, ఫ్లైఓవర్లు, హైటెక్ సిటీలు, స్టార్ హోటళ్లు, క్లబ్‌లు, పబ్‌లుగా తోస్తుంది. కాగా, జన సామాన్యానికి అభివృద్ధి అంటే పొలానికి నీరు, గొంతుకునీరు, పిల్లలకు విద్య, పెద్దలకు వైద్యం, యువతకు ఉద్యోగం, రైతులకు గిట్టుబాటు ధర, కూలీలకు ట్రేడ్ యూనియన్ హక్కులు, కనీస వేతనాలలో అభివృద్ధి అభివృద్ధిగా కనిపిస్తుంది. విస్థాపనలు రద్దై అడవిపై హక్కులు దఖలుపడితే అడవిబిడ్డలకు అభివృద్ధి కనిపిస్తుంది. స్త్రీలు, దళితులు, మైనారిటీలు వారి, వారి సమానత్వపు హక్కు సూచీలను బట్టి అభివృద్ధిని గ్రహిస్తారు. రాజ్యహింస, ప్రకృతి విధ్వంసం, పౌర సమాజంలో ప్రజాస్వామిక లౌకిక విలువలు వంటి అంశాలపై అభివృద్ధిని అంచనా వేయడం మేధావి వర్గానికి మాత్రమే పరిమితమై ఉంది. ఈ అంశాల ప్రాధాన్యత శ్రామిక వర్గాలలో ఇంకా సార్వత్రిక గుర్తింపును పొందలేదు. అందుకే, ప్రజలకు కొన్ని తాయిలాలు ఇచ్చి, మధ్యతరగతిని మార్కెట్ మత్తులో ముంచి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలు చేసే విశృంఖలమైన దోపిడీకి పథకాలు రచించడం, అమలుచేయడం మాత్రమే ప్రభుత్వాల పనిగా మారిపోయింది. ఈ అభివృద్ధి నమూనాను ప్రశ్నించిన వారిని ఎదిరించిన వారిని అభివృద్ధి వ్యతిరేకులని, కాలం చెల్లిన కమ్యూనిస్టు సిద్ధాంతాలను పట్టుకొని వేళ్లాడేవాళ్లని నక్సలైట్లని ముద్ర వేస్తున్నారు. జైళ్లలో పెడుతున్నారు. విస్థాపనకు వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల



పోరాటాల వేపు నిలబడిన ప్రొ॥సాయిబాబా(ఢిల్లీ విశ్వవిద్యాలయం) అరెస్టు, సస్పెన్షన్ తాజా ఉదాహరణ. గుజరాత్‌లో కార్పొరేట్ అభివృద్ధి నమూనాను అమలుచేసిన నరహంతకుడు దేశ ప్రధానిగా పదోన్నతి పొందితే కార్పొరేటు అభివృద్ధి నమూనాను ప్రశ్నించిన ప్రజాస్వామిక వాది ప్రొ॥సాయిబాబా పదవీచ్యుతు డయ్యాడు. మోడి నార్త్ బ్లాక్‌కు వెళితే, సాయిబాబా జైలుకు వెళ్లాడు. అటు 60 ఏళ్లు పోరాడిన ప్రజల ఆకాంక్షలు, ఇటు స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థల అత్యాశలు ఎదురు బొదురుగా నిలబడ్డాయి. తెలంగాణలో ఏర్పడిన తెరాస ప్రభుత్వం ఎటువైపు మొగ్గుతూంది. అన్నదానిపైనే ఇక్కడ అనుసరించే అభివృద్ధినమూనా. విద్యా విస్తరణ, సమానత్వం, విద్యా లక్ష్యం, సారం ఆధారపడి ఉంటాయన్నది తెలిసిందే.

## ప్రతి జిల్లాలో విజ్ఞాన కేంద్రంగా ఒక విశ్వవిద్యాలయం:

విభజన పూర్వాంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటి ప్రతి జిల్లాలో ఒక విశ్వవిద్యాలయం పెట్టాలని గత పది సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూ వస్తోంది. ఈ డిమాండ్ మేము లేవనెత్తిన తరువాత అనేక జిల్లాలలో పిజి సెంటర్‌లకు విశ్వవిద్యాలయాలని పేరు పెట్టారు. పూర్తిగా కొత్తగా పెట్టిన సందర్భంలో అవి చిన్న జూనియర్ కళాశాలలను పోలి ఉన్నాయి. ఈ విశ్వవిద్యాలయాలకు అవసరమైన వనరులు కల్పించబడలేదు. అనేక విశ్వవిద్యాలయాలు రెండు, మూడు డిపార్ట్‌మెంట్లతోనే నడుస్తున్నాయి. వాటిలో కూడా రెగ్యులర్ అధ్యాపకుల నియామకం జరగలేదు. అయితే, నవజాత తెలంగాణలో ప్రతి జిల్లాలో ఒక సర్వ సమగ్రమైన విశ్వవిద్యాలయం అనే కల అసాధ్యం కాకపోవచ్చు. జిల్లాలో ఒక విశ్వవిద్యాలయం ఉండడం కాదు, అది జిల్లా విశ్వవిద్యాలయంగా ఉండడం ఇక్కడ ప్రతిపాదిత విషయం. జిల్లా విశ్వవిద్యాలయంలో 80 శాతం సీట్లు ఆ జిల్లా విద్యార్థులకే సామాజిక న్యాయం, మెరిట్‌పై ఆధారపడి కేటాయించబడాలి. అంతకంటే ముఖ్యంగా ఆ విశ్వవిద్యాలయం జిల్లా మేధో కేంద్రంగా అభివృద్ధి చేయబడాలి. ఈ విశ్వవిద్యాలయం పాఠాలు బోధించి, యోగ్యతా పత్రాలు జారీ చేసేదిగా కాక, ఆ జిల్లాలో దళితుల హక్కులు, స్త్రీల హక్కులు, మైనారిటీల హక్కుల స్థాయిని అధ్యయనం చేసేదిగా, గిరిజనుల, రైతుల, కార్మికుల సమస్యలను అధ్యయనం చేసేదిగా, అటవీ ఉత్పత్తులను వ్యవసాయాన్ని, పరిశ్రమలను అధ్యయనం చేసేదిగా ఆ జిల్లా చరిత్రను, భాషా సంస్కృతుల వైవిధ్యాన్ని అధ్యయనం చేసేదిగా, అభివృద్ధి అవసరాలను గుర్తించేదిగా; బాల కార్మికత, యువత నిరుద్యోగిత వంటి సమస్యలను, పర్యావరణం, జీవావరణం, భౌగోళిక ప్రత్యేకతలు అధ్యయనం చేసేదిగా ఒక్క మాటలో చెప్పాలంటే ఆ జిల్లా సాంస్కృతిక రంగాలన్నింటిని అధ్యయనం చేసేదిగా, ఆ జిల్లాకు సంబంధించి సమగ్రమైన విజ్ఞానాన్ని ఉత్పత్తి చేసే కేంద్రంగా జిల్లా విశ్వవిద్యాలయం ఉండాలి. విద్యా పరిరక్షణ కమిటి ప్రతిపాదించిన ఇటువంటి విశ్వవిద్యాలయం అఖిల భారత విద్యాహక్కు కమిటి ప్రచారం చేస్తున్న ఇటువంటి విశ్వవిద్యాలయం, జిల్లా విజ్ఞాన కేంద్రంగా ఉండే ఇటువంటి విశ్వవిద్యాలయం దేశంలో ఎక్కడైనా సాధ్యం అంటే అది నవజాత తెలంగాణలోనే సాధ్యం. అంతేకాదు, తమ ప్రాంతానికి ఒక ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న ప్రజలు ప్రతి జిల్లా అభివృద్ధిని కాంక్షించే తరుణంలో, అటువంటి అభివృద్ధి ఏదో ఒక రాజకీయ పార్టీ వివేచనపై ఆధారపడి కాకుండా, ప్రజల తక్షణ అవసరాలు, సమాజ దీర్ఘకాల ప్రయోజనాల మధ్య సమతుల్యాన్ని అధ్యయనం చేసే చర్యపై ఆధారపడాలంటే, ప్రతి జిల్లాలో సర్వ సమగ్రమైన విశ్వవిద్యాలయం ఎంతైనా అవసరం.

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుగారు, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తాము అధికారంలోనికి వస్తే కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అందిస్తామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసారు. ఈ ప్రకటన ఒక ఆశను ఒక ఆందోళనను కలిగిస్తున్నది. వాగ్దానాన్ని స్థూలంగా చూసినప్పుడు ఆశ కలుగుతోంది. ప్రపంచ బ్యాంకు మార్గదర్శకత్వాల నేపథ్యంలో రాజశేఖర్‌రెడ్డి అనుసరించిన విధానాల నేపథ్యంలో పరిశీలించినప్పుడు, ఈ హామీ ఆందోళన కలిగిస్తోంది. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం సాధారణ విద్య మాత్రమే కాదు, వృత్తి విద్యను కూడా ఉచితంగా అందించింది. ఇంజనీరింగ్, మెడిసిన్,ఎంబిఎ, ఎజి.బిఎస్సీ, బిడిఎస్, ఫార్మసి వంటి అనేక కోర్సులకు ఫీజుల రీఎంబర్స్‌మెంట్ ఇచ్చింది. లక్షలాది మంది విద్యార్థులు వృత్తివిద్యలను పూర్తిచేసారు. లేదా చేయబోతున్నారు. విభజన పూర్వ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం కనీసం 4,500 కోట్ల రూపాయలు ప్రైవేటు యాజమాన్యాలకు, విద్యార్థుల ఫీజుల నిమిత్తం నేరుగా చెల్లించింది. ప్రభుత్వం విద్యార్థులందించిన స్కాలర్‌షిప్‌లు, స్టైఫండ్‌లు కూడా ఈ యాజమాన్యాలకే చేరాయి. ఇవి కాక తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై పెద్ద ఎత్తున ఖర్చుచేస్తున్నారు. వేలకోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం కార్పొరేట్లకు చేరుతున్నాయి. ఫలితమేమిటి? బడుగు బలహీన వర్గాల వారికి ఉచితంగా వృత్తి విద్య అందించామని ప్రభుత్వం చెప్పుకుంది. యాజమాన్యాలకు వేల కోట్ల రూపాయలు క్రమం తప్పకుండా అందాయి(క్యాప్టివ్ మార్కెట్) కాగా, గత పది సంవత్సరాల కాలంలో లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్‌ను నిర్దేశించే నాలుగు సంవత్సరాల కాలాన్ని(17 నుంచి 21 సంవత్సరాల వయస్సు) వెచ్చించారు. అయితే, ఫలితం చాలా ఆందోళన కరమైంది. ఈ వృత్తివిద్యలు చేసిన వారిలో 20 శాతం మంది మాత్రమే ఉద్యోగార్హులని ఇన్ఫోసిస్ సర్వేచేసి మరీ ప్రకటించింది. ప్రజాధనం ఖర్చయింది. యాజమాన్యాలకు లాభాలు వచ్చాయి, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ అంధకార మయింది. మరి తెలంగాణలో తెరాస ప్రభుత్వం కెజి నుంచి పిజి వరకు ఇటువంటి ఉచిత విద్యనే అందిస్తుందా అనే ఆందోళన కలగడం సహజమే కదా? వైఎస్ఆర్ విధానాలను కెసిఆర్ అవలంభించకపోవచ్చు. కానీ, ఇవి రాజశేఖరరెడ్డి విధానాలు కావు. ఇవి ప్రపంచ బ్యాంకు అనుసరిస్తున్న ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య విధానాలు. ప్రపంచ బ్యాంకు విధానాలను కాదని ముందుకెళ్లే అవకాశం లేదని కాదు, అటువంటి విధాన నిర్ణయాన్ని తెరాస తీసుకుంటుందా అనేదే మనముందున్న సమస్య.

ఇప్పుడు ప్రపంచబ్యాంకు విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, ప్రజారోగ్యం, ప్రజా పంపిణీ వ్యవస్థ, మునిసిపల్ సేవలు వంటి బాధ్యతల నుంచి ప్రభుత్వాలు తప్పుకోవాలనే విధానాలు అవలంభించింది. ఈ విధానాలపై ప్రపంచ వ్యాపితంగా వ్యతిరేకత పెల్లుబికింది. అనేక దేశాల ప్రభుత్వాలు పడిపోయాయి. ఈ విధానాలను నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అవలంబించిన చంద్రబాబు ప్రభుత్వం మట్టికరిచింది. కాన్‌కున్(2003)లో జరిగిన డబ్ల్యుటిఓ సమావేశం సందర్భంగా ఈ వ్యతిరేకత ప్రపంచ వేదికపై కళ్లకు కట్టింది. ఈ విషయాన్ని గమనించిన ప్రపంచబ్యాంకు సారాంశంలో తన విధానాలను కొనసాగిస్తూనే ప్రజా వ్యతిరేకతను బలహీన పరచడానికి ఒక మోసకారి

విధానాన్ని రూపొందించింది. ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలపై ఖర్చుచేయవచ్చు, కాని ప్రభుత్వ సంస్థల ద్వారా కాక, ప్రైవేటు సంస్థల ద్వారా మాత్రమే ఖర్చుచేయాలి. అనే విధానాన్ని రూపొందించింది. ఈ విధానమే ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంగా ప్రపంచ వ్యాపితంగా నేడు అమలు జరుగుతుంది. అందుకే రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పబ్లిక్ రంగ వైద్య, విద్య రంగాలను నిర్వీర్యపరచి ఆరోగ్యశ్రీ, విద్యాశ్రీ (ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకం) విధానాల నవలంభించింది. అందుకే నూతన తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడనున్న తెరాస ప్రభుత్వం తాను ప్రకటించిన 'కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య' విధానాన్ని ప్రైవేటు విద్యా సంస్థలకు రీఎంబర్స్‌మెంట్ ఇవ్వడం ద్వారా, అంటే వేల కోట్ల రూపాయలు ధారాదత్తం చేయడం ద్వారా అమలు చేస్తుందేమోనన్న ఆందోళన కలగడం సహజం. ప్రపంచబ్యాంకు విధానాలను తప్పనిసరిగా అమలు చేయాలనే నిబంధన ఎంత మాత్రమూ లేదు. అనేక దేశాల ప్రభుత్వాలు స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాయి. మనదేశంలో కూడా గత కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్పొరేట్ అనుకూల బిల్లులను పార్లమెంట్‌లో పాస్ చేయలేకపోయింది. ప్రజా ఉద్యమాలు కాంగ్రెస్‌పై, కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వంపైన కలిగించిన ఒత్తిడి వలన కార్పోరేటు అనుకూల బిల్లులు ఆగిపోయాయి. అందుకే కార్పోరేటు శక్తులు మన్మోహన్‌ను చేవలేని ప్రధానమంత్రి అన్నాయి. దేశ చరిత్రలో కనీవినని స్థాయిలో కార్పొరేటు శక్తులు, మీడియా మోడికి విస్తృత ప్రచారం కల్పించి అధికారంలోనికి తీసుకువచ్చాయి. ఈయన 'బలమైన ప్రధాని'. బిజెపికి పూర్తి మెజారిటి రావడంతో ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలకు నోరుండదు. నరేంద్ర మోడి పేరునే బిజెపి గెలిచింది కాబట్టి పార్టీలో ఇతర నాయకులకు నోరుండదు. ఫలితంగా మోడీ ఎటువంటి ఆటంకాలు లేకుండా కార్పోరేటు అవసరాలు నెరవేర్చగలుగుతాడు.

అయితే తెలంగాణలో తెరాస గెలుపు కార్పోరేటు ప్రచారం వలన జరిగింది కాదు. ప్రజలలో ఉన్న సెంటిమెంట్ వలన తెరాస గెలిచింది. మన ప్రాంతంలో ఉన్న, మన ప్రాంతానికి మాత్రమే పరిమితమైన, ప్రత్యేక తెలంగాణ కొరకు పుట్టి పనిచేసిన పార్టీని గెలిపించుకుంటే ఆ పార్టీ తమ ప్రాంతం కొరకు నిలబడి పనిచేస్తుందని ప్రజలు భావించినట్లున్నారు. తెరాసకు స్పష్టమైన ఆధిక్యత ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుకూలంగా పరిపాలించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి భారత రాజ్యాంగం పూర్తి అధికారాలనిస్తూంది. రాబోయే ఐదు సంవత్సరాలు తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు భారత రాజ్యాంగం ఆధారంగా తెరాస ప్రభుత్వం పనిచేయవచ్చు. విద్యా వ్యాపారాన్ని నిషేధించి కెజి నుంచి పిజి వరకు ప్రభుత్వ విద్యా సంస్థల ద్వారా కామన్, ఉచిత విద్యా విధానాన్ని అమలు చేయవచ్చు. విద్యా వ్యాపారాన్ని రద్దు చేయడానికి, ప్రైవేటు విద్యా సంస్థలను స్వాధీనం చేసుకోవడానికి భారత రాజ్యాంగం పూర్తి మద్దతునిస్తూంది. 1973లో ఇందిరాగాంధీ చేసినట్లు భారత రాజ్యాంగంలో అధికరణం19(6)ను ఉపయోగించి చైతన్య, నారాయణలతో సహా, తెలంగాణలోనున్న అన్ని నాన్-మైనారిటీ విద్యాసంస్థలను కెజి నుంచి పిజి వరకు అన్ని విద్యాసంస్థలను, వృత్తి విద్యాసంస్థలను-స్వాధీనం చేసుకొని ప్రభుత్వమే నడిపించవచ్చు. డబ్బు ప్రసక్తి లేకుండా సామాజిక న్యాయం, మెరిట్‌పై ఆధారపడి ప్రవేశాలు కల్పించవచ్చు. ఇందుకు ప్రభుత్వానికి రాజకీయంగా దృఢసంకల్పం మాత్రమే అవసరం.

ఇందులో కొత్తగా చెప్పవలసింది చాలా తక్కువ. విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటి ప్రభుత్వ విద్యారంగ సమస్యల అభివృద్ధి కొరకు అనేక సూచనలు ఇస్తూనే వచ్చాయి. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం వరకు అన్ని విద్యాసంస్థలకు భౌతిక వనరులు కల్పించడం, బోధన బోధనేతర ఖాళీలను రెగ్యులర్ ప్రాతిపదికన నింపడం నిబద్ధత కలిగిన ఒక ప్రభుత్వం చేయవలసిన కనీస కర్తవ్యాలు. స్థూలంగా కొన్ని

**తెలంగాణలో 2009-10లో ఒకటో తరగతిలో చేరినవారు. 2013-14లో ఐదో తరగతికి వచ్చినవారు**

| జిల్లా | స్కూల్లో చేరింది | 5వ తరగతికి వచ్చింది | మొత్తం డ్రాపవుట్స్ (%) | ఎస్సీల్లో (%) | ఎస్టీల్లో (%) |
|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 68,673 | 51,351 | 25.22 | 17.20 | 40.97 |
| నిజామాబాద్ | 54,744 | 43,726 | 15.50 | 14.08 | 28.05 |
| కరీనంగర్ | 65,863 | 53,824 | 18.28 | 17.89 | 33.85 |
| మెదక్ | 76,054 | 53,555 | 29.58 | 27.47 | 48.83 |
| హైదరాబాద్ | 84,376 | 76,506 | 9.33 | 11.36 | 10.72 |
| రంగారెడ్డి | 1,26,555 | 1,06,781 | 15.62 | 15.64 | 19.87 |
| మహబూబ్‌నగర్ | 1,07,954 | 70,534 | 34.66 | 33.41 | 53.93 |
| నల్గొండ | 76,759 | 54,780 | 28.63 | 25.58 | 79.09 |
| వరంగల్ | 77,920 | 54,922 | 29.51 | 25.67 | 48.11 |
| ఖమ్మం | 52,423 | 46,375 | 11.54 | 9.47 | 19.44 |

ప్రధాన సమస్యలను పేర్కొనాలంటే 1. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రమాణాలు గల విద్యా సాధనకు ప్రతి తరగతికి ఒక గదిని నిర్మించడం, ఒక ఉపాధ్యాయుడిని నియమించడం, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టాఫ్ ప్యాటర్న్‌ను అమలుచేయడం, 3. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం పూట పౌష్టికాహారం, ఉదయం ఫలాహారం, సాయంత్రం ఉపాహారం అందించడం, 4. ఉపాధ్యాయులకు బడి బయట పనులు అప్పుచెప్పకపోవడం, 5. ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్‌లు, ఐటిఐలు, ఒకేషనల్ కేంద్రాలు స్థాపించి మంచి ప్రమాణాలతో నిర్వహించడం, 6. బాల కార్మికతను నిషేధించి బాలబాలికలు 18వ ఏట వరకు బడిమానివేయకుండా చూడడం, 7. డిగ్రీ స్థాయిలో వృత్తివిద్యలు, సాధారణ విద్యల మధ్య సమతౌల్యత పాటించడం, 8. మౌలిక సామాజిక, ప్రకృతి శాస్త్రాలకు రానున్న ఐదు సంవత్సరాలలో ఉన్నత విద్యలో సంబంధిత వయో పరిమిలో (17-23 ఏళ్ల వయసు వారిలో) సరాసరి 30 శాతం నమోదు సాధించడం, 9. ప్రభుత్వ కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ కోర్సులన్నింటికి ఎయిడ్ మంజూరు చేయడం, అవసరమైన విద్యార్థులందరికీ ఉచిత హాస్టల్ వసతి కల్పించడం, 10. ప్రతి జిల్లాలో ఒక సర్వసమగ్రమైన విశ్వవిద్యాలయాన్ని స్థాపించి జిల్లాలో ఉన్న ఉన్నత విద్యాసంస్థలనన్నింటిని దాని కిందకు తీసుకురావడం, విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం నుంచి పూర్తి స్వయం ప్రతిపత్తినివ్వడం,

**2012-13 డైస్ గణాంకాలు:**
**డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రచురణ:**

| క్ర. సం. | జిల్లా పేరు | నమోదుశాతం | | |
|---|---|---|---|---|
| | | బాలురు | బాలికలు | మొత్తం |
| 1. | మహబూబ్‌నగర్ | 72.09 | 69.25 | 70.10 |
| 2. | రంగారెడ్డి | 113.55 | 112.76 | 113.18 |
| 3. | హైదరాబాద్ | 71.99 | 85.10 | 78.29 |
| 4. | మెదక్ | 81.39 | 82.67 | 82.02 |
| 5. | నిజామాబాద్ | 83.42 | 81.09 | 82.24 |
| 6. | ఆదిలాబాద్ | 77.13 | 79.86 | 78.48 |
| 7. | కరీంనగర్ | 85.14 | 87.61 | 86.36 |
| 8. | వరంగల్ | 85.51 | 86.29 | 85.90 |
| 9. | ఖమ్మం | 71.78 | 75.67 | 73.69 |
| 10. | నల్గొండ | 78.54 | 78.87 | 78.70 |

విశ్వవిద్యాలయాన్ని జిల్లా ప్రజలకు బాధ్యత వహించేటట్లు చేయడం, 11. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు పాఠ్యప్రణాళికలు, పాఠ్యాంశాలు, బోధనా పరీక్షా పద్ధతులు, విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించేవిగా, సామాజిక స్పృహను కల్పించేవిగా; ప్రజాస్వామిక, లౌకిక విలువలను పెంపొందించేవిగా, వైవిధ్యాలను గౌరవించే, వైషమ్యాలను బహిష్కరించే, వ్యత్యాసాలను పరిష్కరించే విద్యావిధానాన్ని ఏర్పాటు చేయడం అత్యున్నత స్థాయి వరకు మాతృభాషనే బోధనా బాషగా అమలుచేయడం తెలంగాణలో విద్యారంగ పునరుజ్జీవనానికి చాలా అవసరం. ఒక్క మాటలో చెప్పాలంటే విద్యావిధానాన్ని మార్కెట్‌కు బానిసను చేయకుండా, సమాజానికి అవసరమైన మేధావులను, వృత్తి నిపుణులను ఉత్పత్తి చేసేదిగా ఉండాలి.

విద్యారంగానికి పాఠశాల విద్య పునాది అన్న విషయం వేరుగా పేర్కొనవలసిన అవసరం లేదు. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది పిల్లలు పదవ తరగతి కూడా పూర్తిచేయని పరిస్థితి ఉంది. 2011 జనాభా లెక్కలను, 2012-13 డైస్ గణాంకాలను ఆధారంగా గణిస్తే చదువులేని లేదా చదువు మానివేసిన బాలబాలికలు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలుస్తోంది.

ఆయా జిల్లాలో 13-15 వయో పరిమితిలో ఉన్న బాలబాలికలలో ఎంతెంత శాతం బాలబాలికలు పాఠశాలలో 8-10 తరగతులలో చదువుతున్నారో పై గణాంకాలు తెలియ జేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా సంఖ్యలు నమ్మశక్యంగా లేవు. ఆ జిల్లాలో జనాభా గణనలు లెక్కింపబడిన వారికంటే పాఠశాలలో ఎక్కువగా ఉన్నారు. ఆ విషయాన్ని పక్కనపెడితే కరీంనగర్‌లో 16 శాతం మందినుంచి మహబూబ్‌నగర్‌లో 30 శాతం వరకు 8-10 తరగతులలో ఉండవలసిన పిల్లలు బడి బయట ఉన్నారు. దీనర్థం 7వ తరగతి వరకు 100 శాతం నమోదు ఉందని కాదు. 7వ తరగతి వరకు గణాంకాలు మరింత గందరగోళంగా ఉన్నందున 8-10 తరగతుల బాలబాలికలను ఇక్కడ పరిశీలిస్తున్నాము. ఈ గణాంకాలను బట్టి గందరగోళంగా ఉన్న రంగారెడ్డి జిల్లాను విడిచిపెడితే మిగిలిన జిల్లాలలో మహబూబ్‌నగర్ జిల్లా తప్ప అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువ శాతంలో నమోదై ఉన్నారు. ఏదేమైనా వివిధ జిల్లాలలో 16 శాతం నుంచి 30 శాతం వరకు సంబంధిత వయో పరిమితిలో బాలబాలికలు ఉన్నత పాఠశాలల బయట ఉండడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. ప్రాథమిక స్థాయి నుంచి ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠపరచడం, ఆయా బాలబాలికల అవసరాన్ని బట్టి ఉచితంగా ఆహారం, వస్త్రాలు, వసతి, ఆరోగ్య సేవలు అందించడం ద్వారా మధ్యలో బడి మానివేసే సమస్యను చాలా వరకు పరిష్కరించవచ్చు. అమ్మాయిలు, ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికల విషయంలో శ్రద్ధ తీసుకుంటే, అలాగే బోధనా వస్తువు, పద్ధతులలో మార్పు తీసుకువస్తే 100 శాతం మంది బాలబాలికలు కూడా 10వ తరగతి పూర్తి చేయగలుగుతారు. అనంతరం ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, ఒకేషనల్ కోర్సులను 18వ ఏట వరకు పూర్తి చేసి ఉన్నత విద్యలకు గాని, పని ప్రపంచంలోకి గాని అడుగు పెడుతారు. బాల కార్మికత వలన చదువు మానివేయడం, చదువు మానివేయడం వలన బాలకార్మికత రెండింటి వలన కుటుంబాలు పైకి రాలేకపోవడం జరుగుతుంది. నవజాత రాష్ట్రం ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించవలసి ఉంది. ❖

# తెలంగాణలో ఉన్నత విద్య - పునర్నిర్మాణం

ఎ.నర్సింహారెడ్డి
విశ్రాంత అధ్యాపకుడు

*భారతీయ విద్యారంగంలో అయోమయం రాజ్యమేలుతోంది. దేశం ఒకవైపు ఆర్థికాభివృద్ధితో ముందుకు పోతుందని సంబరపడిపోతోన్న పాలకులకు ఉన్నత విద్య, నిరక్షరాస్యత అసలైన సవాళ్ళుగా మారి వెక్కిరిస్తున్నాయి. ఒక దేశపు సామాజిక – ఆర్థిక అభివృద్ధికి విద్య ప్రాథమికమైన వనరుగా సామాజిక శాస్త్రవేత్తలు చాలా కాలం క్రితమే గుర్తించారు. సాంఘికాభివృద్ధిని విశ్లేషించిన మేధావులంతా అభివృద్ధి, సమానత్వ మూలాలు చదువులోనే వుంటాయని స్పష్టంగా విడమరిచారు. అభివృద్ధి ఫలాలు సార్వజనీనంగా, సమానంగా పంపిణీ అవ్వాలంటే ముందుగా విద్యాభివృద్ధి సమగ్రంగా జరగాలని విలియంపెట్టి 18వ శతాబ్దంలోనే ప్రతిపాదించాడు. ఆ తర్వాత ఆర్థికాభివృద్ధిని మానవీయ కోణంలో విశ్లేషించిన ఆడంస్మిత్, ఆల్ఫ్రెడ్ మార్షల్, థియోడర్ షూల్ట్స్ వంటి ఉదార ఆర్థిక వేత్తలు మనుషుల్ని ఒక పెట్టుబడిగా, వనరుగా 'హ్యూమన్ కాపిటల్'గా మార్చడానికి విద్య మాత్రమే దోహదపడుతుందని విశ్వసించారు. సమాజంలో వ్యక్తులు ఆ సమాజానికి, దేశ సంపదకే కాకుండా వ్యక్తిగతంగా ఉత్పాదక శక్తులుగా మారడానికి విద్య అవసరమని, విద్య ద్వారా వ్యక్తిలోని నైపుణ్యత, అంతర్లీనంగా ఉండే పరిజ్ఞానం మెరుగుపడి, ఉత్పత్తికి, ఆర్థిక అభివృద్ధికి పనికి వచ్చే శక్తిగా ఎదుగుతుంది, తద్వారా వ్యక్తిగతమైన అభివృద్ధి, సంపాదన కూడా పెరుగుతుంది. దీనివల్ల పేదరికం అంతరిస్తుందని విశ్లేషించారు. డాక్టర్ అంబేద్కర్ "మనం నాగరికత సమకూర్చిన సమస్త వస్తు సంపదనైనా వదులుకోవచ్చు గానీ, సర్వోత్కృష్ఠమైన విద్య అందించే ఫలాలను సంపూర్ణంగా అనుభవించే అవకాశాలను హక్కులను మాత్రం కోల్పోకూడదు" అంటాడు.*

ఈ నేపథ్యంలో భారతదేశ విద్యావిధాన చరిత్రను పరిశీలిస్తే, స్వాతంత్రోద్యమ కాలంలో, 1947 తదుపరి మనల పాలిస్తున్న పాలకులు దేశంలో అందరికి విద్య అందిస్తామని దశాబ్దాలుగా చెబుతూనే ఉన్నారు. అయినా అత్యధిక నిరక్ష్యరాస్యులు మన దేశంలోనే ఉన్నారు. ఉన్నత విద్య అభ్యసించేవారు 12 శాతం దాటలేదు. విద్య సామాజిక పరివర్తనకు ఒక సాధనమని, అందరికి విద్యతో దేశభవిష్యత్తు, దేశప్రగతి, వ్యక్తి వికాసం చెందుతాయని అందరు అంగీకరిస్తారు. వర్గ – కుల సమాజంలో అంతరాల నివారణకు కూడ విద్య తోడ్పడుతుంది.జ్యోతీ బా ఫూలె 1882లో హంటర్ కమీషన్‌కు ఇచ్చిన రిపోర్ట్‌లో అట్టడుగు దళిత వర్గాలకు, మహిళలకు విద్య అందడం లేదన్న నాటి నుండి ఎందరో సమాజహితులు (గోఖలే, అంబేద్కర్, గాంధీ, తిలక్) విద్య అవశ్యకతను పాలకులకు గుర్తుచేస్తూనే ఉన్నారు. 1948లో ఉన్నత విద్యకు సంబంధించి రాధాక్రిష్ణన్ కమీషన్ తన రిపోర్టులో విశ్వవిద్యాలయాలు స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేయాలని, సమాజ సమస్యల పరిష్కారానికి సంబంధించిన పరిశోధనలు జరగాలని, నూతన జ్ఞాన ఆవిష్కరణ కేంద్రాలుగా అవి పని చేయాలని, అందుకు సరిపడు నిధులను ప్రభుత్వాలు అందించాలని సూచించాడు. అందరు విద్య పొందడం ఒక ప్రజాస్వామిక హక్కు అని పేర్కొనడం గమనార్హం. అయితే సమాజంలో పాలక వర్గాల ప్రయోజనాలను పరిరక్షించడానికే రాజ్యం ఎప్పుడూ ప్రయత్నిస్తుంది. విద్యారంగ సామాజిక బోధన లక్ష్యాలను రాజ్యం నియంత్రిస్తుంది తప్ప విద్య రాజ్యాన్ని నియంత్రించదు. అదే సమయంలో విద్యాపరమైన పరివర్తనే సామాజిక మార్పుకు దారితీస్తుందని విశ్వసించడం సమాజంలో ప్రాబల్యవర్గాల ఆధిపత్యాన్ని విస్మరించడమే అవుతుంది.

విద్య మనోవికాసానికి, జ్ఞానానికి సంబంధించిన అంశం. విద్యవల్ల సాధికారత సాధ్యమవుతోంది. విద్య జ్ఞానంతోపాటు, వివేచన, విచక్షణను కూడా పెంచుతుంది. విద్య వల్ల అభివృద్ధి ఆకాంక్ష వ్యక్తం అవుతుంది. తద్వారా ప్రజలు తమకు కావలసిన అభివృద్ధిని సాధించడానికి, ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేయడానికి ముందుకు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్న ఐరాస విద్యను ఒక 'మానవ హక్కుగా' పేర్కొంది. అంతేకాకుండా 1948 విశ్వ మానవ హక్కుల ప్రకటన కూడా విద్యకున్న ప్రాధాన్యతను, అవసరాన్ని నొక్కి చెప్పింది. చదువుకునే హక్కు ప్రతి ఒక్కరికీ వుంది. కనీసం పాఠశాల స్థాయివరకైనా విద్య ఉచితంగా అందరికీ అందాలి అని పేర్కొన్న ఈ ప్రకటన మనుషుల మూర్తిమత్వ వికాసానికి దోహదపడాలని, మానవ హక్కుల పట్ల, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల గౌరవాన్ని పెంచేదిగా పేర్కొంది. ఇదే స్ఫూర్తిని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ ఒప్పందం ప్రతిఫలించింది. పౌరుల విద్యకు ఆయా దేశాలే బాధ్యత తీసుకోవాలని ఈ ఒప్పందం పేర్కొంది. విద్యవల్ల సమానత్వం, వివక్ష లేని సౌభ్రాతృత్వం సాధ్యమని పేర్కొంది. విద్య కేవలం వ్యక్తులను ఉద్ధరించే సాధనంగానే కాక సమాజాలను, దేశాలను, యావత్ ప్రపంచాన్నీ అభివృద్ధి దిశలో నడిపే ఇంధనంగా గుర్తించింది.

విద్య జ్ఞానానికి ఒక నిధిగాను, ఒక వాహకంగాను ఉంటుంది. ప్రకృతి శక్తులను, పరిసరాలను అర్థం చేసుకొని అదుపులో పెట్టుకొని ఆర్థికాభివృద్ధిని సాధించి సమాజాన్ని పురోగమన దిశలో నడిపించడానికి సహాయ పడుతుంది. విద్య మానవ ప్రవర్తనను రూపొందించి నియంత్రిస్తుంది. వైయుక్తిక ప్రయోజనం, దోపిడీ పీడనలు కొనసాగుతున్న నేటి సామాజిక, ఆర్థిక అంతరాలు ఉన్న సమాజంలో అమానవీయ శక్తుల ప్రయోజనానికి, ఒత్తిడికి నిరంతరం గురవుతున్న వ్యక్తిలో మానవీయతను నిలపడానికి విద్య సహకరిస్తుంది. విద్య మానవ జీవితాన్ని పరిపూర్ణం చేసే ఒక ప్రక్రియ. విద్యకు భూతకాలంలో మూలాలు ఉంటాయి, వర్తమానంలో ఉనికి ఉంటుంది. భవి ష్యత్తుకు ఒక కర్తవ్యం ఉంటుంది. విద్య మౌలికంగా మెదడుతో, మానవ చైతన్యంతో సంబంధమున్న ఒక భావాత్మక కార్య కలాపం. సామాజిక లక్ష్యాలను సాధించడానికి రూపొందించు కోవల్సిన ఒక చైతన్యపూర్వకమైన సాంఘిక చర్య. అందువల్లనే "శిశువు భౌతిక, సాంస్కృతిక క్షేత్రంలో నిజమైన విద్య సృష్టించబడుతుందంటాడు" యశ్‌పాల్.

వలసపాలనానంతరం 1947 తర్వాత మొదటి పంచవర్ష ప్రణాళిక నుండి 7వ పంచవర్ష ప్రణాళిక వరకు ఉన్నత విద్యకు ప్రాధాన్యత ఇచ్చి ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేశారు. ఉన్నత విద్యలో అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఒకేరకంగా అభివృద్ధి చెందలేదు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలు గౌరవాధిక్యత గల సంస్థలుగా, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాలు ద్వితీయ శ్రేణిగా నిధుల కొరతతో కునారిల్లాయి. ఈ విధంగా ఉన్నత విద్యా వకాశాలలో అంతరాలను ప్రభుత్వాలే సృష్టించాయి. అంటే యూనివర్సిటీ విద్యలో ప్రభుత్వాలు ద్వంద్వ విధానాన్ని అవలంభిస్తున్నాయి. కొన్నింటికి అన్ని వసతులు కల్పించి, మరి కొన్నింటికి కంటితుడుపుగా వసతులు సమకూర్చుతున్నాయి. కొన్ని కాలేజీల్లో చదివితే ఉద్యోగం పిల్లవానిదగ్గరికి వస్తుంది. మరి కొన్ని కాలేజీల్లో చదివిన వారికి సంవత్సరాలు గడచినా ఉద్యోగం రాదు. ఒకే డిగ్రీ పుచ్చుకున్న కొందరికి ఉద్యోగం వచ్చే చదువేమిటి, కొందరికి ఉద్యోగం రాని చదువేమిటి అన్న మీమాంస విద్యార్థులను వేధిస్తుంది. నిజానికి సామాజికార్థిక సమస్యలను పరిష్కరించవల్సిన విద్య నేడు అదే ఒక సమస్యగా పరిణామం చెందడం నేటి విషాదం.

ప్రజాస్వామ్య సోషలిజం పేరుతో మిశ్రమ ఆర్థిక వ్యవస్థ పరిశ్రమల క్షేత్రంలో అమలు పరిచినప్పటికీ, విద్యావ్యవస్థ ప్రధానంగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉంది. సంప్రదాయ, ధార్మిక సంస్థలు ఏర్పరచిన 'ప్రైవేట్' విద్యా సంస్థలు దీనికి మిన హాయింపు. వలస పాలన అనంతరం మూడు దశాబ్దాల వరకు విద్యావ్యవస్థ – పాఠశాల స్థాయి నుంచి, విశ్వవిద్యాలయాల స్థాయి వరకు – ప్రభుత్వ ఆధీనంలో ఉండి, రాజ్యాంగ ఆదర్శాల అమలు ప్రయత్నాలను విద్యాలయాలు పరిమిత స్థాయిలో ఐనప్పటికీ, నిజాయితీగానే కృషి చేశాయి. ఈ కృషి ఫలితంగానే, పాఠశాల విద్య కొంతమేర 'సమదృష్టి'తో అందుబాటులోకి వచ్చింది. ఉన్నత విద్య నిర్మాణానికి పునాదులు పడ్డాయి. ఈ మూడు దశాబ్దాలలో విద్యా వ్యాప్తి నిదానంగా ఉన్నప్పటికీ, విద్య మొత్తంగా ప్రభుత్వ ఆధీనంలో ఉండి, అందుబాటులోకి వచ్చి అందరికి ఉచితంగా సమంగా అందింది. పరిమితంగానయినా అందుబాటులోకి వచ్చిన విద్య వసతుల వలన, రాజ్యపు అనుకూల వివక్షతా విధానాల వలన, సామాజిక ఉద్యమాల వలన కల్గిన చైతన్యం వలన చారిత్రక విద్యా బహిష్కృతులు పాఠశాల విద్యను పూర్తి చేసి ఉన్నత విద్యలోకి రావడం మొదలయింది. ఈ మూడు దశాబ్దాలలో విద్య సమానత్వాన్ని సాధించకపోయినా అసమానత్వాన్ని సూత్రరీత్యా వ్యతి రేకించింది. సమానత్వ భావనా వాతావరణాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేసింది. 80వ దశకం వరకు విద్యలో, విద్య ద్వారా వచ్చిన మార్పులకు తాత్త్విక భూమికగా పనిచేసింది ప్రధానంగా ఉదారవాదమే. అయితే, ఈ పరిస్థితి 80వ దశకం మధ్య నుండి నూతన విద్యా విధానం పేరుతో మారడం ప్రారంభమైంది.

1991 నుండి మన దేశంలో అమలవుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల వలన, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ ఆదేశాల మేరకు వ్యవస్థాగత సర్దుబాటు వలన సామాజిక రంగాల బడ్జెటింగ్, ప్రణాళికా రంగంలో సామాజిక రక్షణ యంత్రాంగం ఏర్పాటు అనే రెండు సిద్ధాంతాల్ని కార్పొరేట్ మార్కెట్ శక్తుల ఆధిపత్యానికి అనుగుణంగా మలచడానికి అవసరమైన రాజకీయార్థిక చక్రం ఉనికి వెలుగులోకి వచ్చింది. సామాజిక సంక్షేమం, విద్యా, ఉపాధి రంగాలకు నిధులు కేటాయించటంలో భారీగా కోతలు విధించడమే వ్యవస్థాగత సర్దుబాటు విధానం. ఈ విధమైన భారీ తగ్గింపులవలన సామాజిక, రాజకీయ రంగాలలో తీవ్రమైన సంక్షోభాలు వస్తాయనే భయంతోనే ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ కొన్ని షరతులపై సామాజిక రంగాలకి రుణాలు మంజూరు చేసి, సామాజిక రక్షణ యంత్రాంగాన్ని ఏర్పరిచాయి. ప్రధానంగా విద్యావ్యవస్థ నిర్వహణలో రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతల నుండి తప్పుకొని ఉన్నత సాంకేతిక విద్యలో మార్కెట్ శక్తుల స్వేచ్ఛా విహారానికి ప్రభుత్వాలు పచ్చజెండా ఊపడమే తమ విధానాలుగా ఎంచుకున్నాయి. ఫలితంగా ఇవ్వాళ ఉన్నత విద్య 60–70 శాతం ప్రైవేట్ రంగంలో లాభసాటి వ్యాపారంగా కొనసాగుతున్నది. 1990 నుండి నేటి వరకు నియమించిన ఉన్నత విద్యాకమిటీలు డా. పున్నయ్య కమిటీ (1992), బిర్లా – అంబానీ కమిటీ (2000), శ్యాం పిత్రోడ (2006), యశ్‌పాల్ కమిటీ (2009), నారాయణ మూర్తి కమిటీ (2013) వంటివి ప్రైవేటీకరణ అనివార్యమని సిఫారసుచేయడం దురదృష్టకరం. ఫలితంగా సామాజిక నిర్మాణాల్లోనూ, విద్య, ఆరోగ్య రంగాల్లోను సామాజిక ప్రయోజనాలకు విరుద్ధమైన విధానాలను రూపొందించి అమలు చేస్తున్నారు.

విద్యా సముపార్జనలో ప్రధానంగా మూడు అంశాలుంటాయి. ఒకటి సంజ్ఞానం (వస్తువులను, విషయాలను గుర్తించడం), రెండు, ఔద్వేగం (మానసిక ఉద్వేగాలు, విలువలకు సంబంధించిన పరిపక్వత),

మూడు, మనోదైహిక నైపుణ్యాలు (శిక్షణ పొందడం ద్వారా అవయవాలను ప్రయోగించి పనులు చేయడం). ప్రస్తుత బోధనలో వీటి మధ్య సమగ్రత, సమతుల్యత లోపించింది. కేవలం సంజ్ఞానానికే ప్రాధాన్యతనిస్తూ మిగత రెండు అంశాలను విస్మరించడం జరుగుతుంది. ఫలితంగా విమర్శనాత్మక ఆలోచన, తార్కిక విశ్లేషణ, నిశిత పరిశీలన, పరికల్పన, సృజనాత్మకత, సైద్ధాంతిక అవగాహన వంటివి విద్యావంతునిలో లోపిస్తున్నాయి. ప్రస్తుత విద్యా వ్యవస్థ గమనం, దిశ, నిర్మాణం, ప్రమాణాలు కార్పోరేట్ శక్తులు, మార్కెట్ వ్యవస్థ నిర్ణయిస్తున్నాయి. ఫలితంగా సమాజ వికాసానికి, జాతి పురోగమనానికి అత్యంతావశ్యకమైన విద్యా సముపార్జనకు మార్గనిర్దేశం చేసే విద్యా విధాన రూపకల్పనలోగాని, లక్ష్యాన్ని నిర్దేశించడంలోగాని, విద్యావేత్తలకు, ఎన్నికైన ప్రభుత్వాలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, సామాజిక కార్యకర్తలకు అభ్యుదయకర పాత్ర నిర్వహించే అవకాశం లేకుండా పోయింది. భారతీయ సమాజంలోని వైవిధ్యం, సాంస్కృతిక భిన్నత్వాలకు బోధనాభ్యసన విధానాలలోనూ, పద్ధతులలోనూ స్థానం లేకుండా పోతుంది. ఏ సాంస్కృతిక వాతావరణంలో విద్యార్థి నివసిస్తున్నాడనేది గుర్తించడంలేదు. ప్రపంచీకరణ ప్రభావంతో అవి గాలికి కొట్టుకుపోయాయి. మానవ నాగరికతా ప్రస్థాన చోదక శక్తి అయిన విద్యను ప్రైవేట్ శక్తులు, కార్పొరేట్ శక్తులు తమ స్వార్థ ప్రయోజనాలకే ఉపయోగించుకోవడం ద్వారా విద్యా తాత్విక మూలాల్ని, లక్ష్యాలనే సవాలు చేస్తున్నాయి. విద్యా వ్యవస్థలో ప్రైవేటీకరణ, వ్యాపారీకరణలను ప్రోత్సహిస్తున్న ప్రస్తుత విధానాలు, దేశంలోని మెజారిటీ ప్రజానీకం అనుభవిస్తున్న అధికార రాహిత్యం, అసంతృప్తి, అసమానత్వాన్ని యధాతథంగా న్యాయబద్ధం చేయడానికి సాధికారత సమకూర్చుతున్నాయి. పర్యవసానంగా ఆరు దశాబ్దాల తర్వాత కూడ విద్యలో అసమానతలు కొనసాగుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల అమలు క్రమంలో మన దేశంలాంటి సంక్లిష్ట, బహుళత్వ సమాజంలో హిందూ మతోన్మాదం అభివృద్ధి చెందుతుంది. మతతత్వానికి విరుద్ధమైన మూలాలు, స్వరూపాలు పెట్టుబడికి ఉన్నప్పటికీ వాటి మధ్య అప్రకటిత అనుబంధం కొనసాగుతుంది. మతతత్వం కాలం చెల్లిన, ఫ్యూడల్, శాస్త్రవిరుద్ధ భావాల నుంచి ఆవిర్భవించింది. ప్రపంచీకరణ ఉదారవాద భావాల నుండి ఆవిర్భవించినట్లు చెప్పుకుంటుంది. కాని ఈ రెండు సిద్ధాంతాలు మార్కెట్‌ను పటిష్ఠపరిచి, విస్తృతం చేయడంలో పరస్పరం సహకరించుకుంటున్నాయి. మతోన్మాదం తన దుష్ట స్వరూపాన్ని బయటపెట్టుకున్నప్పటికీ, అది మార్కెట్‌ను పటిష్ఠపరిచి, విస్తృతం చెయ్యడానికి ఉపయోగపడినంత వరకు మార్కెట్ శక్తులు దాన్ని గమనించనట్లు వ్యవహరిస్తాయి. ప్రపంచీకరణ అభివృద్ధి నమూన ఉపాధి రహితము కావడం మూలాన సామాజిక-ఆర్థిక ఉద్రిక్తతలు వేగంగా తలెత్తుతున్నాయి. రాజకీయ అల్లర్లకు కూడా దారితీస్తున్నాయి. మతోన్మాదం ప్రజల దృష్టిని సామాజిక ఆర్థిక సమస్యల వైపు కాకుండా మతపరమైన అంశాల వైపుకు మళ్ళించి పైన పేర్కొన్న పరిస్థితి ఏర్పడకుండా ప్రయత్నిస్తుంది. అందువలన విద్యా ప్రవేటీకరణ, విద్యలో మతవాదాన్ని నివారించే విధంగా విద్యా ప్రణాళికను, పాఠ్య ప్రణాళికను, పాఠ్య పుస్తకాల పునః రచనను తెలంగాణలో తక్షణం చేపట్టాలి. తదనుగుణంగా బోధనాభ్యసన విధానాలను అలాగే మూల్యాంకన పద్ధతులను పునః నిర్మించుకోవాలి.

కేంద్ర-రాష్ట్ర పాలక వ్యవస్థ జ్ఞానసమాజాన్ని నిర్మిస్తానంటూనే నిరక్షర జన సమూహాలను పెంచుతున్నది. అందరికీ విద్య లక్ష్యంగా ప్రకటిస్తూనే, ఎందరినో బడిలో నిలుపలేక పోతున్నది. పనికి విద్య అంటూనే పని లేకుండా ఎందరినో తయారు చేస్తున్నది. వ్యక్తిత్వ వికాసానికి విద్య అంటూనే వ్యక్తిత్వం లేకుండా చేస్తున్నది. విద్య అంటే చారిత్రకంగా ఒక సామాజిక సాంస్కృతిక ప్రక్రియ. సమాజం విశాలమైన ఉమ్మడి ప్రయోజనం కొరకు, బాలబాలికల్లోనూ, యువతీయువకుల్లోనూ, సృజనాత్మకమైన, మానవీయమైన శక్తులను విద్య మేల్కొల్పాలి. సమాజాన్ని యధాతథస్థితిలో ఉంచడం కొరకు కాకుండా, విద్య సమాజాన్ని పునర్నిర్మించే పాత్రనూ, సమాజాన్ని పరివర్తన చెందించే పాత్రనూ నిర్వహించాలి. ప్రజలకు మేలు చేసే స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, మానవ ఔదాత్యం, బహుళత్వం, సాంఘిక సామరస్యం, సార్వజనీనమైన శాంతి కొరకు ప్రజల్లో ఉన్న ఆకాంక్షలను నెరవేర్చడానికి విద్య నిర్వహించే పాత్ర ఉపయోగపడాలి. ఆ దిశలో తెలంగాణలో విశ్వవిద్యాలయాలను పునఃనిర్మించాలి.

భారత రాజ్యాంగ పీఠిక స్ఫూర్తి ప్రకారం అసమానతను, సామాజికార్థిక అంతర్యాన్ని, పితృస్వామ్యాన్ని, మత సాంస్కృతిక ఆధిపత్యాన్ని, భాషాధిపత్యాన్ని, సామాజిక సంబంధ విషయాల్లో వివక్షను, పరాయికరణను నిరోధించే విద్యావిధానాన్ని పేదలందరికి అందించాల్సి ఉంది. అందుకు గాను ప్రజాను కూలమైన విద్యా విధానాన్ని అమలు పరచాలి. అదే సమయంలో మార్కెట్ నిర్దేశిత, కార్పోరేట్ అనుకూల అభివృద్ధికి ప్రతిఘటనను నిర్మించాలి. భౌతిక వనరుల న్యాయమైన పంపిణీ కొరకు, సంపద, ఉత్పత్తి సాధనాలు ఒకేచోట కేంద్రీకృతం గాకుండా చూడాలి. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే, ప్రతిఘటించే చైతన్యాన్ని బాలబాలికల్లో కల్పించే విధంగా మన విద్యా ప్రణాళిక, పాఠ్య ప్రణాళికను రూపొందించి అమలు చేయాలి. చారిత్రకంగా ఏర్పడిన సామాజిక సాంస్కృతిక వైవిధ్యాల పట్ల సానుకూల దృష్టిని పెంపొందించాలి. రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలు విద్యార్థులు గుర్తించి ఆచరించే విధంగా మన విద్యా విధానం ఉండాలి. అలాగే పేదలు, బడుగు బలహీనులు ప్రజాస్వామ్య హక్కులను పొందడానికి విద్యా విధానం దోహదపడాలి.

నాగరిక సమాజానికి విద్య ప్రాణప్రదమైంది. అలాంటిది నేడు మన దేశంలో, రాష్ట్రంలో రెండు రకాల విద్యావిధానాలు కొనసాగుతున్నాయి. ఒకటి సంపన్నులకు సంబంధించినది కాగా మరొకటి పేదలకు సంబంధించినది. గ్రామాల్లో తక్కువ ఆదాయం ఉన్న విద్యార్థులకు, పట్టణాల్లోని మురికి వాడల్లో ఉన్న పిల్లలకు బాధ్యత రహితంగా, నైపుణ్యం లేని విద్యను అందిస్తున్నారు. అదే

ధనవంతుల పిల్లలు అన్ని హంగులున్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజులు చెల్లించి నాణ్యమైన విద్యను పొందుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పరిస్థితి మొత్తంగా మారాలి. అంటే విద్యను ప్రైవేటు రంగం నుంచి తప్పించాలి. ప్రభుత్వ పాఠశాలలను కేంద్రీయ పాఠశాలల స్థాయికి, రాష్ట్ర విశ్వ విద్యాలయాలను కేంద్ర విశ్వ విద్యాలయాల స్థాయికి పెంచాలి. అందుకు సరిపోను నిధులు కేటాయించాలి. సంపన్నులకు ఒక విద్య, పేదలకు మరో విద్య ఉన్నంత కాలం పేదలకు నాణ్యమైన విద్య అందదు. విద్యావకాశాల్లో అసమానత్వం ఆర్థిక సామాజిక రంగాలలో అసమానత్వాలను పెంచుతుంది. అసమానతలు తీవ్రంగా ఉన్న ఆర్థిక వ్యవస్థలో కనీసం నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలి.

సీమాంధ్రలో తెలంగాణ విలీనమయ్యే సందర్భంలో ఇరు ప్రాంతాల నాయకుల మధ్య కుదిరిన పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం తెలంగాణలో విద్యావకాశాలు మెరుగుపర్చాలి. తెలంగాణలోని విద్యా సంస్థల్లో తెలంగాణ విద్యార్థులకే ప్రవేశం ఉండాలి. వాస్తవంలో ఇందుకు భిన్నంగా విద్యలో వెనుకబడి ఉన్న తెలంగాణలో కొత్త కాలేజీలు ఏర్పాటు చేయకపోగా ఉన్న కొద్ది కాలేజిల్లో కూడా వలస వచ్చిన సీమాంధ్రులు ప్రవేశించారు. హైద్రాబాద్‌లో ఉన్న కాలేజిల్లో 15 శాతం నాన్‌లోకల్ కోటా క్రింద సీమాంధ్రులు చేరారు. సీమాంధ్ర కాలేజీల్లో మాత్రం తెలంగాణ వారు చేరటం లేదు. 6 సూత్రాల పథకం వల్ల ముల్కీ రూల్స్ రద్దయినాయి. పాఠశాల విద్య చదివే కాలంలో నాలుగు సంవత్సరాలు తెలంగాణలో చదివి స్థానిక కోటా క్రింద తెలంగాణ కాలేజిల్లో ప్రవేశం, తెలంగాణ ప్రాంతంలో ఉపాధి పొందారు. గడిచిన ఐదున్నర దశాబ్దాల కాలంలో ఉద్యోగ రీత్యా, వ్యాపార రీత్యా సీమాంధ్రులు హైద్రాబాద్‌లో నివాసముండి తమ పిల్లలను హైద్రాబాద్‌లో చదివించడం వలన వీళ్లంతా తెలంగాణ వాళ్లుగా హైద్రాబాద్‌లో ఉన్న కాలేజిల్లో సీట్లు సంపాదించారు. ఆ తర్వాత తెలంగాణలోనే ఉపాధి పొందారు. అసలైన తెలంగాణ వాళ్ళకు సీట్లు దొరకలేదు. ఉపాధి దొరకలేదు. హైద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నెలకొల్పిన ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, వృత్తి కళాశాలలు, అత్యధికం సీమాంధ్రులవే. రకరకాల ఆశలు చూపి తెలంగాణ ప్రజల నుండి వేలాది కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం ఫీజుల రూపేణా గుంజుతూ కోట్లకు పడగలెత్తారు. కాలేజీల్లో వసతులు కల్పించక నాసిరకం విద్యనందిస్తూ తెలంగాణ విద్యార్థులను మోసం చేసారు. అందు వలన సీమాంధ్రుల కార్పొరేట్ కళాశాలను నియంత్రించాలి.

ఇక మెడికల్ కాలేజీలు ఏర్పాటులో సమతుల్యత లేదు. రాయసీమలో 4 మెడికల్ కాలేజీలుండగా, కోస్తాంధ్రలో 6 మెడికల్ కాలేజీలు, తెలంగాణలో 5 మెడికల్ కాలేజీలు, అందులో 2 కాలేజీలు హైద్రాబాద్‌లోనే వున్నాయి. ఫలితంగా తెలంగాణ వారికి మెడికల్ సీట్లు కేటాయింపులో ఘోరమైన అన్యాయం జరిగింది, జరుగుతున్నది. ఇక ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు తొమ్మిది జిల్లాలున్న కోస్తాంధ్రలో 5, నాలుగు జిల్లాలున్న రాయలసీమలో 6, పది జిల్లాలున్న తెలంగాణలో 8, అందులో 6 కళాశాలలు హైద్రాబాద్‌లోనే వున్నాయి. హైద్రాబాద్ కళాశాలల్లో అన్ని ప్రాంతాలవారు అడ్మిషన్లు పొందడం వలన తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరిగింది. మరోవైపు నిధుల కేటాయింపుల్లో వివక్ష కొనసాగింది. ఆంధ్ర యూనివర్శిటీకి తలసరి కేటాయింపు రూపాయలు 35,500, నాగార్జున యూనివర్శిటీ తలసరి కేటాయింపు రూ. 22,700, శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ తలసరి కేటాయింపు రూ. 37,500 శ్రీ కృష్ణదేవరాయ యూనివర్శిటీ తలసరి కేటాయింపు రూ. 25,000 కాకతీయ యూనివర్శిటీ తలసరి కేటాయింపు రూ. 14,000, ఉస్మానియా యూనివర్శిటీకి తలసరి కేటాయింపు రూ. 17,400 రూపాయలు ఉంది. ఇటీవల స్థాపించిన పాలమూర్, గాంధీ, శాతవాహన, తెలంగాణ విశ్వ విద్యాలయాలకు కేటాయిస్తున్న నిధులు నామమాత్రమే. భవనాలు లేవు, అధ్యాపకులు

| సంప్రదాయ విశ్వవిద్యాలయం | ప్రారంభించిన సంవత్సరం | నిధుల కేటాయింపులు (రూ.కోట్లలో) | | | | | | | | ఉండాల్సిన బోధనా సిబ్బంది | పని చేస్తున్న వారు | ఖాళీలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | 2006-07 | 07-08 | 08-09 | 09-10 | 10-11 | 11-12 | 12-13 | 13-14 | | | |
| ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ-రాజమండ్రి | 2006 | 3 | 12 | 12 | 10 | 7.88 | 10.50 | 10.20 | 9.48 | 48 | 26 | 22 |
| తెలంగాణ యూనివర్సిటీ- నిజామాబాద్ | 2006 | 3 | 12 | 12 | 6 | 7.99 | 10.50 | 10.54 | 20 | 144 | 42 | 102 |
| యోగి వేమన యూనివర్సిటీ - కడప | 2006 | 1 | 17 | 42 | 23 | 13.30 | 10.50 | 15.14 | 12.74 | 185 | 118 | 67 |
| మహాత్మాగాంధీ యూనవర్సిటీ -నల్గొండ | 2007 | - | 10 | 10 | 5 | 17.49 | 10.50 | 8.15 | 15 | 70 | 44 | 26 |
| శాతవాహన యూనివర్సిటీ - కరీంనగర్ | 2008 | - | - | 2.50 | 1.63 | 14.88 | 7.75 | 6.30 | 4.79 | 46 | 15 | 31 |
| డా.బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ - శ్రీకాకుళం | 2008 | - | - | 2.50 | 1.63 | 5.70 | 7.75 | 5.37 | 5.26 | 46 | 12 | 34 |
| కృష్ణా యూనివర్సిటీ - మచిలీపట్నం | 2008 | - | - | 2.50 | 1.63 | 5.46 | 7.75 | 5.26 | 4.16 | 42 | 20 | 22 |
| విక్రమ సింహపురి యూనివర్సిటీ - నెల్లూరు | 2008 | - | - | 2.50 | 1.63 | 5.46 | 7.75 | 5.26 | 7.79 | 58 | 33 | 25 |
| రాయలసీమ యూనివర్సిటీ - కర్నూలు | 2008 | - | - | 2.50 | 1.63 | 5.41 | 7.75 | 5.21 | 4.79 | 73 | 13 | 60 |
| పాలమూరు యూనివర్సిటీ - మహబూబ్‌నగర్ | 2008 | - | - | 2.50 | 1.63 | 14.75 | 7.75 | 4.93 | 4.79 | 45 | 10 | 35 |

లేరు, వసతులు లేవు, నామ మాత్రంగానే అవి పని చేస్తున్నాయి. ఈ విశ్వ విద్యాలయాలకు తగిన నిధులు సమకూర్చి భవన నిర్మాణాలు, అధ్యాపక నియామకాలు చేపట్టాలి. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో తెలంగాణలో తలసరి ఖర్చు తక్కువగా ఉంది. ఈ ఖర్చు అనంతపురంలో అత్యధికం, మహబూబ్‌నగర్ జిల్లాలో అతి తక్కువగా ఉంది. పాలిటెక్నిక్ విద్యార్థిపై తలసరి కేటాయింపు తెలంగాణలో రూ. 42,820, కోస్తాంధ్రలో రూ. 70,040, రాయలసీమలో రూ. 76,170 ఉంది. ఇక డిగ్రీ కళాశాలల విద్యార్థిపై తలసరి కేటాయింపు తెలంగాణలో రూ. 7,604, రాయలసీమలో రూ. 9,182, కోస్తాంధ్రలో రూ. 11,558లుగా ఉంది. ఈ వివక్షను తక్షణం నివారించాలి.

ఈ పూర్వరంగంలో తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యా రంగాన్ని పునర్నిర్మించుకోవాల్సి ఉంది. విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యతగా, విద్యను పొందడం వ్యక్తి హక్కుగా తెలంగాణ విద్యావిధానాన్ని రూపొందించి అమలు చేయాలి. పాఠశాల విద్యను, ఉన్నత విద్యకు మధ్యనున్న ఆంగిక సంబంధాన్ని దృష్టిలో పెట్టుకుని, ఒక నిర్దిష్ట కాల వ్యవధిలో, పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే నిర్వహింపబడే విద్యా విధానానికి రూపకల్పన చేయాలి. కనీసం పాఠశాల స్థాయి విద్య వరకు ప్రభుత్వరంగంలో పాఠశాలలు అందరికి అన్ని హంగులతో అందుబాటులో ఉంచాలి. 3-5 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలబాలికలందరికి పూర్వ ప్రాథమిక విద్యను ప్రభుత్వమే అందించాలి. కనీసం పాఠశాల విద్య వరకు మాతృభాషలో విద్యను బోధించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి. క్రీడలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పించాలి. పోషక పదార్థాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలి. అన్ని స్థాయిల వరకు ఉచితంగా విద్యను అందించాలి. ఉన్నత విద్య ప్రైవేటీకరణను నియంత్రించాలి. జిల్లా కొక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ రంగంలో ప్రతిడివిజన్‌కొక డిగ్రీ కళాశాల, మండలానికొక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి. మహిళలకు ప్రత్యేకంగా కళాశాలలు ఏర్పాటు చేయాలి. ఆదిలాబాద్, భద్రాచలంలో ఆదివాసీలకు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాలను స్థాపించాలి.

ఉన్న స్థితి నుండి ఉండవలసిన స్థితికి విద్యారంగాన్ని తీసుక రావడానికి ఉపయుక్తమైన ప్రణాళిక రూపొందించి అమలు చేయాలి. మన రాష్ట్రంలో విద్యాస్థితి స్త్రీ పురుషుల మధ్య, పేద ధనికుల మధ్య, పల్లే పట్టణాల మధ్య, నిమ్నకులాల ఉన్నత కులాల మధ్య వ్యత్యాసాలు అధికంగా ఉన్నాయి. ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళలు విద్యలో వెనుకబడి ఉన్నారు. ఇటీవల కాలంలో యునెస్కో నివేదికల్లో వెలుగు చూసిన విషయాలు, నేషనల్ శాంపుల్ సర్వే (ఎన్ఎస్ఎస్), జాతీయ కుటుంబ సంక్షేమ శాఖ సర్వేలు భారతదేశంలో నిరక్షరాస్యులు ప్రధానంగా దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన కులాలు, మహిళలు, ముస్లింలు మాత్రమేనని తేల్చి చెప్పాయి. అందువలన విద్యారంగానికి ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 30 శాతం తగ్గకుండా నిధులు కేటాయించాలి. తెలంగాణ చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా పాఠ్యపుస్తకాలను పునఃరచన చేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్స్‌ను సరైన వసతులతో నిర్వహించాలి. తెలంగాణ రాష్ట్రంలో కేజీ నుంచి పిజీ వరకు అందరికి ఉచితంగా నాణ్యమైన విద్యనందించాలి. మనదైన భాష, చరిత్ర, సాంస్కృతిక నైతికవిలువలతో కూడిన ప్రజో పయోగ విద్యకోసం కృషి చేయాల్సిన బాధ్యత పాలకులు, విద్యావేత్తలు, మేధావులపైన ఉన్నది.

విజ్ఞానం అంటే మనకు ఎలాంటి భావన ఉన్నదనే అంశమే విద్య సామాజిక, నిర్మాణ, బోధనాంశాల స్వభావాన్ని, సమాజంతో విద్యకున్న సంబంధాన్ని నిర్ణయిస్తుంది. విద్యార్థికి, ఉపాధ్యాయునికి మధ్య మార్కెట్ సంబంధం ఉన్న నేటి ప్రపంచీకరించబడిన విద్యావ్యవస్థలో విముక్తికి దోహదపడే కనీసం ఉదారవాదంతో కూడిన విద్యాబోధనకు కూడా చోటనేదే లేదు. విముక్తి విద్యా భావన సామాజిక పరివర్తనకు కీలకమైనది. విజ్ఞానాన్ని పునర్నిర్మించడంలో అది విద్యార్థులను చురుకైన భాగస్వాములుగా చేస్తుంది. తమ చుట్టూవున్న ప్రపంచం గురించి ప్రశ్నించేలా చేస్తుంది" అంటారు పాలో ఫ్రీయరీ. చివరిగా ఆ సమాజ పరివర్తన ప్రయత్నంలో భాగస్వాములుగా మారేందుకు దోహదం చేస్తుంది. వికాసవంతమైన, మానవతా పూరితమైన సమాజ సృష్టికి అంకితమైన సమగ్ర విద్యా అవగాహనను విచ్ఛిన్నం చేయకుండా ఈ విముక్తి విద్యా నమూనా అడ్డుకుంటుంది. ఈ రకమైన ప్రతిఘటన విద్యావ్యవస్థను, దాని స్వరూపంలోను, అవగాహనా పద్ధతుల్లో, బోధనా పద్ధతుల్లో వ్యక్తమవుతుంది. దీనికోసం విద్యా పరివర్తనకు, సామాజిక మార్పుకు మధ్య ఉన్న గతి తార్కిక సంబంధం పరిధిలో ప్రధానాంశాలను ఇప్పుడు తెలంగాణలో ఉన్నత విద్య పునర్నిర్మాణ సందర్భంలో మళ్ళీ రూపొందించుకోవాల్సి ఉంది.

ప్రజాస్వామిక వాదులు, ప్రజాతంత్ర వ్యవస్థను కాంక్షించే వారు విద్యను సామాజిక పరివర్తన సాధించే కీలకమైన అంశంగా గుర్తించడంతో పాటుగా, వ్యూహాల్ని రూపొందించు కోవాల్సి ఉంటుంది. ఆచార్య రామ్మూర్తి కమిటి నివేదిక 1990లో పేర్కొనట్లు "మానవత విలువలు కలిగిన జ్ఞాన సమాజ నిర్మాణమే విద్య ప్రాథమిక కర్తవ్యంగా" మనం నొక్కి చెప్పవల్సి ఉంటుంది. అలాగే డా॥ కొఠారీ 1966 సూచించినట్లు "అందరికి విద్య, నాణ్యమైన విద్య, ఒకే రకమైన విద్యను ప్రసాదించే ఉమ్మడి పాఠశాల వ్యవస్థ" కొరకు ఉద్యమించవల్సి ఉంది. ఈ లక్ష్యాన్ని సుసాధ్యం చేయడం కొరకు సమాజంలో మార్పు తెచ్చే ప్రయత్నంలో భాగంగా మొత్తం విద్యా ప్రణాళికని, పాఠ్య ప్రణాళికల్ని, బోధన విధానాన్ని, పరీక్ష విధానాన్ని సమూలంగా మార్చడం వలన విద్యార్థుల్లో అన్వేషణ, పరిశోధన, ప్రశ్నించడం, చర్చించడం, అనువర్తించడం, సృజించడం లాంటి గుణాలు పెరిగి నిత్య జీవితంలో తాము ఎదుర్కొనే సవాళ్ళను ఎదుర్కొనే సామర్థ్యంతో పాటు, దోపిడీ పీడనల నుండి విముక్తి పొందే చైతన్యాన్ని పొందుతారు. అంతేగాకుండా భూస్వామ్య, పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ శక్తుల ఆధిపత్యాన్ని తేలిగ్గా సవాలు చేసి ప్రతిఘటించ గలుగుతారు. అందువలన తెలంగాణ అభివృద్ధి చెందాలంటే విద్యలో వివక్షను నివారించాలి. ❖

# తెలంగాణ రాష్ట్రం : విశ్వవిద్యాలయ విద్య

ప్రొ॥ కనకదుర్గ దంటు
ఉస్మానియా విశ్వవిద్యాలయంలో
రిటైర్డ్ ప్రొఫెసర్

*ప్రజాస్వామ్యంలో ప్రగతికి బాటలువేసేది విద్యారంగం మాత్రమే. నీటిపారుదల, వ్యవసాయం, వివిధ వృత్తులు, వైద్యం వంటి రంగాలు పెంపొందించేవి ఆదాయం, సౌఖ్యం, మనశ్శాంతి ఒక సుఖమైన జీవనశైలి. కానీ విద్య అనేది ప్రతి మనిషిని మార్చగలిగేది. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికున్న ఒకే ఒక సాధనం. అంతేకాకుండా ఒక దేశానికి, ఒక ప్రాంతానికి చాలా ముఖ్యమైన మానవ వనరులని ఏర్పరిచేది చదువు మాత్రమే. విజ్ఞానాన్ని అనుసరించి సాగే ఈ శతాబ్దపు సంఘానికి విద్య అనేది ప్రగతి సాధించటానికి అతి ముఖ్యమైన సాధనం.*

ఇప్పుడే పురుడుపోసుకున్న తెలంగాణ రాష్ట్రంలో విద్య గురించి చెప్పాలంటే అన్ని రంగాలలాగే ఈ ప్రాంతంలోని విద్యారంగం కూడా వలస పాలనలో విధ్వంసమైంది. నిజాం కాలంలో ఉర్దూ మీడియంలో చదివిన వైద్యులు, సాంకేతిక నిపుణులు ప్రపంచ ఖ్యాతి చెందారు. కానీ సోదరులమని చెప్పుకొని విలీనమైన ఆంధ్రుల ఆధిపత్య ధోరణి, ప్రాంతీయ వివక్ష వలన తెలంగాణ ప్రాంతం విద్యారంగంలో చాలా వెనకబడింది. ఉదాహరణకి జెఎన్‌టియూ స్థాపించినపుడు ఆంధ్రలోని కాకినాడలో, రాయలసీమలోని అనంతపూర్‌లో ఆ విశ్వవిద్యాలయ ప్రాంగణాలు స్థాపించి, తెలంగాణ నిర్లక్ష్యానికి గురిచేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాట ఇచ్చినట్లు తెలంగాణ జిల్లాల్లో ప్రాంగణం ఏర్పాటు చేయలేదు సరికదా, హైదరాబాదులోని విశ్వవిద్యాలయంలో ఎనభై శాతంపైన సీమాంధ్ర ఉద్యోగులని, విద్యార్థులని నింపారు. రాష్ట్రం ఏర్పడిన ఈ తరుణంలో జెఎన్‌టియుహెచ్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ సంబురాలు జరపలేదంటే అక్కడ ఎవరున్నారో అర్థం చేసుకోవచ్చు.

ఇక కొత్తగా ఏర్పడిన విశ్వవిద్యాలయాల తీరుని, రాష్ట్ర ప్రభుత్వ వివక్షని గమనిస్తే అన్ని వనరులున్నా తెలంగాణ ఎందుకు వెనకబడిందో అర్థమవుతుంది. రాజశేఖరరెడ్డి ఒకేసారి ఏర్పాటు చేసిన మూడు యూనివర్సిటీలకి పేర్లు పెట్టడం దగ్గర్నించీ వివక్ష చూపించాడు. కడపలోని యూనివర్శిటీ వేమన పేరు మీద, రాజమండ్రిలో నన్నయ పేరు మీద ఆదరించి, నల్గొండలోని యూనివర్శిటీకి మాత్రం మహాత్మగాంధీ పేరు పెట్టడం ఏం ఔచిత్యం? అసలు మహాత్మగాంధీకి తెలంగాణ ప్రాంతానికి ఏం సంబంధం లేదు. తెలంగాణ ప్రాంతానికి,



భారతదేశ స్వాతంత్ర్య సమరానికి ఏమీ సంబంధం లేదు. 30 జనవరి 1948న గాంధీ మరణిస్తే 17 సెప్టెంబర్ 1948న హైదరాబాదు దేశం భారతదేశంలో విలీనమైంది. నల్గొండ యూనివర్శిటీకి పోతన పేరుగానీ, పాల్కురికి సోమన పేరుగానీ పెట్టి ఉండాల్సింది. కానీ తెలంగాణ సంస్కృతి, చరిత్ర విధ్వంసం చేసే ప్రక్రియలో భాగంగా ఈ ప్రాంతానికి చెందిన గొప్ప వ్యక్తుల పేర్లు మరుగునపడేశారు సీమాంధ్ర పాలకులు. అంతేకాదు! వేమన విశ్వవిద్యాలయానికి 300 కోట్లు నన్నయ విశ్వ విద్యాలయానికి 39 కోట్లు ఇచ్చి నల్గొండ యూనివర్శిటీకి మొండి చేయిచూపడం ఒక్క రాజశేఖర్‌రెడ్డి లాంటి వాడికే సాధ్యమవుతుంది.

ఇక ఇప్పుడు మన రాష్ట్రంలో మన పాలన ఏర్పడింది కాబట్టి ఈ ప్రాంత విశ్వవిద్యాలయ విద్య కొత్త పుంతలు తొక్కుతుందనే ఆశ కలుగుతోంది. విశ్వవిద్యాలయానికి యూజిసి ఎంత నిబంధనలు విధించినా, ఈ విద్యాలయాల రోజువారీ పాలన, ప్రగతి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల మీదే ఆధారపడి ఉంటుంది. ఈ మార్పు పై నుంచి కిందకు రావాలి. కింది నుంచి పైకి కాదు. అది ఈ విధంగా కనపడుతుంది.

విశ్వవిద్యాలయానికి విద్యా విషయాలకి ముఖ్యుడైన ఉపకులపతి తన రంగంలో నిపుణుడే కాక, విద్యా విషయాలలో అవగాహన కలిగిన వాడై ఉండాలి. పాలనా రంగంలో కూడా అనుభవం ఉండాలి. ఇక పాలనాధికారి అయిన రిజిస్ట్రారు కూడా మంచి అనుభవజ్ఞుడై ఉండాలి. వీరిద్దరూ నిష్పక్షపాతంగా అవినీతిరహితంగా పాలన చేయాలి. ఇలా జరగాలంటే వారిని నియమించే రాష్ట్ర ప్రభుత్వం నిపుణుడైన విద్యావేత్తలని, పాలనానుభవం ఉండి విశ్వవిద్యాలయాలు ఎలా నడపాలనే విచక్షణ ఉన్నవారిని ఏరుకోవాలి. ఇది కులాలకి, మతాలకి, ఇతర ఆకర్షణలకి అతీతంగా ఉండాలి. అలా ఉండాలంటే ప్రభుత్వం నియమించే సర్చ్ కమిటీలు సరిగ్గా ఉండాలి. వారి ఎంపిక నిష్పక్షపాతంగా ఉండాలి. విశ్వవిద్యాలయంలో ఇంకొక ముఖ్యమైన విభాగం పాలనా సంఘం(ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) ఇందులోని సభ్యులు కూడా విద్యారంగంలో నిపుణులై ఉండాలి. వీరి ఎన్నిక కూడా నిష్పక్షపాతంగా జరగాలి.

విశ్వవిద్యాలయం అనేది సంఘాన్ని నడపగలిగిన నిపుణులని తయారుచేసే దేవాలయం. అంటే అర్థం సంఘానికి, మారుతున్న కాలానికి తగినట్టుగా ఉండాలి ఈ కోర్సులు. అందుకే ఉన్న కోర్సులని ప్రతి మూడు, నాలుగు సంవత్సరాలకి ఒకసారి సవరించడమే కాక, కొత్త కోర్సులని ప్రవేశపెట్టడంలో విశ్వవిద్యాలయాలు ప్రముఖ పాత్ర వహించాలి. ఒక ఉదాహరణ పరిశీలిద్దాం. ఇంటర్నెట్, కంప్యూటర్ టెక్నాలజీలు ప్రపంచాన్నంతా ఒక చిన్న పల్లెటూరి(గ్లోబల్ విలేజ్)లా తయారుచేశాయి. ఈ మార్పు వలన ప్రపంచానికంతా ఒకే భాష ఉపయుక్తమయి, అంతర్జాతీయ భాషగా గుర్తింపు పొందిన ఇంగ్లీషుని అన్ని దేశాలు అంగీకరించాయి. ఇంగ్లీషుని వారి వారి దేశాలలో విద్యావిధానంలో ప్రవేశపెట్టాయి. అయితే ఇంగ్లీషు నేర్చుకోవడంలో ఎంతో చరిత్ర ఉండి ముందు ఉండవలసిన మన దేశం ఈ మార్పుని



గుర్తించలేదు. భారతదేశంలో అన్ని విశ్వవిద్యాలయాల్లో ఎంఎ ఇంగ్లీషు ఉంది. అయితే ఇది ఇంగ్లీషు సాహిత్యాన్ని మాత్రమే బోధిస్తుంది. ఇంగ్లీషు భాషని బోధించేటట్లు ఎంఎ(ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్) యుజిసీ అంగీకరించినా మన దేశంలో యూనివర్శిటీలు ఎక్కడా ఈ కోర్సుని గుర్తించలేదు. ప్రవేశపెట్టలేదు. మన రాష్ట్రంలో ఒక్క తెలుగు యూనివర్శిటి ఈ కోర్సుని దూరవిద్యావిధానంలో ప్రవేశపెట్టింది. ఇది కూడా సిలబస్ విషయంలో సమగ్రంగా లేదు. ఇప్పుడు తెలంగాణలో ఉన్న యూనివర్సిటీలల్లో ఇంగ్లీషుని భాషగా బోధించేటట్టు ఎంఎ(ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్)ని ప్రవేశపెట్టాలి. నిజానికి ఇంగ్లీషు సాహిత్యం చదవవలసిన అవసరం ఇప్పుడు ఎవరికీ లేదు. ఇంగ్లీషుని భాషగా బోధించగల్గిన ఉపాధ్యాయులే అవసరం. దానికి డిగ్రీలోనూ పిజిలోనూ ఇంగ్లీషు భాషా బోధన ప్రవేశపెట్టాలి. అంతేకాకుండా రీసర్చ్ స్థాయిలో కూడా ఎంఫిల్, పిహెచ్‌డీలను భాషా బోధన చేసేటట్టు మలచాలి. మన దేశానికి కావలసినట్లు ఇంగ్లీషుని బోధించే మార్గాలు కనుగొని ప్రపంచభాషలో మన విద్యార్థులు నిపుణత సాధించేటట్లు కృషిచేయాలి. విజ్ఞానానికి సంబంధించిన కోర్సులే కాక, ఇప్పుడు విస్తరించిన వినోదానికి సంబంధించిన కోర్సులు కూడా ప్రతి విశ్వవిద్యాలయం నిర్వహించాలి. ఉదాహరణకి క్లాసికల్, ఫోక్, లైట్ మ్యూజిక్, క్లాసికల్ డాన్స్, నటన, యానిమేషన్ వంటివి ఇప్పుడు యువత కాంక్షించే రంగాలు. ప్రతి విశ్వవిద్యాలయంలో వీటికి సంబంధించిన కోర్సులు డిగ్రీ లెవల్, పీజి లెవల్లో ఉండాలి.

పైన చెప్పింది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే, అలాగే ప్రతి డిపార్ట్‌మెంటులో, కాలేజీలో కావలసిన మార్పులు తెలంగాణ విశ్వవిద్యాలయాలు చేపట్టాలి. ముఖ్యంగా అవి విశ్వవిద్యాలయాలు ముఖ్యమైన రంగాల్లో పార్ట్‌టైమ్ పిహెచ్‌డికి వెసులుబాటు కల్పించాలి.

ఉపాధ్యాయుల ఎన్నికలో తెలంగాణ యూనివర్శిటీలు పారదర్శకంగా ఉండాలి. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ని ఎందుకు ఇంటర్వ్యూలో సెలక్ట్ చేశారో రికార్డు చేయాలి. అలాగే ఎన్నిక కాని వారికి వారి బలహీనతలేమిటో, ఎందుకు ఇంటర్వ్యూలో సెలెక్ట్‌కాలేదో తెలియపరచాలి. దీనికి వివిధ అంశాలకు మార్కులెయ్యడమే కాకుండా ఆ మార్కుల జాబితా అభ్యర్థులకు పంపాలి. మొత్తం ఇంటర్వ్యూలు వీడియో రికార్డింగ్ చేయాలి. అన్నిటికంటే ముఖ్యం ప్రాంతీయ యూనివర్శిటీలల్లో ఇప్పటిదాకా తెలంగాణ వారికి జరిగిన అన్యాయాల్ని సరిదిద్దాలి. ప్రాంతీయేతరులని వారి వారి ప్రాంతాలలో విశ్వవిద్యాలయాలకి వెళ్లేటట్లు చర్యలు తీసుకోవాలి. ఇక ముందు జరిగే ఇంటర్వ్యూలలో తెలంగాణ యూనివర్శిటీల్లో తెలంగాణ వారినే టీచరుగా ఎంపిక చేయాలి. ముఖ్యంగా విశ్వవిద్యాలయాలలో అధికారిక పోస్టుల్లో తెలంగాణ వారే ఉండాలి.

విశ్వవిద్యాలయాలలో ముఖ్యంగా ఉండవలసినవి మూడు నాలుగు సెంటర్లు. ఒకటి ఒక పెద్ద లైబ్రరీ. అందులో పుస్తకాలే కాకుండా ఇంటర్నెట్ సౌకర్యంతో డిజిటల్ లైబ్రరీ కూడా అందుబాటులో ఉండాలి. చదువుతో పాటు ఆటలకి, అన్ని గేమ్స్, స్పోర్ట్స్‌కి సౌకర్యాలు ఉండాలి. మంచి కోచ్‌లను నియమించాలి. అంతరాష్ట్రీయ, అంతర్జాతీయ క్రీడలకి విద్యార్థులని తయారుచేయాలి.

ఇక ఇంటికి దూరంగా విశ్వవిద్యాలయానికి ఉండే విద్యార్థులకి హాస్టల్ సౌకర్యం ఉండాలి. ఇందులో కుల, మత వివక్షలుండకూడదు. ఈ సెంటర్లన్నింటిలో ముఖ్యమైనది బలహీనవర్గాలకి ఉద్దేశించేటట్టు ఒక ఎకడమిక్ సెంటర్ ఉండాలి. వారి సబ్జెక్టులలో కానీ, ఇంగ్లీషు భాషలో కానీ, సాఫ్ట్ స్కిల్స్‌లో కానీ ట్రైనింగ్ ఇచ్చే రిసోర్స్ పర్సన్స్‌ని నియమించాలి. ముఖ్యంగా రీసర్చ్ స్కాలర్స్‌కి ఎకడమిక్ రైటింగ్‌లో శిక్షణ ఇచ్చేటట్టు ఆంగ్ల భాషా బోధనకి సెంటర్ ఉండాలి. రిజర్వేషన్ ప్రకారం సీట్లివ్వడంలో విశ్వవిద్యాలయం బాధ్యత తీరదు. ఆయా విద్యార్థులకి అన్ని రకాలుగా ముఖ్యంగా చదువులో సహాయపడాలి. వారిని మిగతా వారితో పోటీపడేటట్లు ఆ సమయాలలోనే తీర్చిదిద్దితేనే విశ్వవిద్యాలయం వారికి కల్పించిన రిజర్వేషన్ సౌకర్యాలకి న్యాయం చేకూరుతుంది. తెలంగాణలో ఉన్న ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు లాంగ్వేజీ ట్రైనింగ్ సెంటరు ఉండాలి. విద్యార్థులకి, ముఖ్యంగా బలహీన వర్గాలకి చెందిన వారికి, వారి ఊర్లలో ఇంగ్లీషేతర మీడియంలో చదివినవారికి ఈ సెంటర్లు ఉపయోగపడాలి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల పట్ల చాలా శ్రద్ధ వహించాలి. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో ఈ విశ్వవిద్యాలయాలు సంబంధించిన నిర్ణయాలు తీసు కోవటానికి ఒక ప్రత్యేక కమిటీని వేసి ప్రతి విశ్వవిద్యాలయాన్ని పర్యవేక్షించేటట్టు సదుపాయం కలిగించాలి. విశ్వవిద్యాలయాకి, బయటి రంగాలకి సంబంధం ఉండేటట్లు రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలి. వివిధ రంగాలలో అవసరమైన నిలని ఈ విశ్వవిద్యాలయాలు తయారుచేసేటట్లు వాటిని మలచాలి. అందుకు కావలసిన విధానపరమైన నిర్ణయాలు తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు బయటి రంగాలు, పరిశ్రమలతో కలిసి భవిష్యత్తు తరాలకి మంచి పునాదులు వేయాలి.

❖

**దేవిప్రసాద్**
టీఎన్జీవో అధ్యక్షులు

# తెలంగాణ ఉద్యోగుల ఉద్యమాలు- భవిష్యత్ తెలంగాణ

***ఆంధ్రప్రదేశ్ అవతరించిన నాటి నుండి నేటివరకు 60 సంవత్సరాలుగా తెలంగాణ ప్రజలు ఎన్ని ఉద్యోగాలు కోల్పోయి ఎంత నష్టపోయింండ్రో లెక్క తేల్చటం సాధ్యంకాని పరిస్థితి ఏర్పడింది. మూడు కమిషన్లు నివేదికలు సమర్పించి, రెండు సర్కార్లు రెండు జీవోలు విడుదలచేసి, సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు సాధించి, రాజ్యాంగ సవరణ రాష్ట్రపతి ఉత్తర్వులు పొంది, ప్రధాని పంచ, అష్ట సూత్ర పథకాలు నిర్దేశించినా తెలంగాణ ప్రజల ఉద్యోగ హక్కులు కాపాడుకోలేక పోయింండ్రు! వీటన్నిటి సాక్షిగా స్థానికులు కోల్పోయిన ఉద్యోగాల సంఖ్య తేలటం లేదు. ఈ సంఖ్య 1.50 లక్షల దాకా ఉండి ఉంటుందని ఇక్కడి నిరుద్యోగులు, విద్యావంతులు అంచనా కడుతున్నారు. ఉద్యోగ రంగంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని అన్ని ప్రభుత్వాలు, అన్ని రాజకీయ పార్టీలు, అన్ని సంఘాలు, అన్ని వర్గాలు అంగీకరిస్తున్నప్పటికీ తప్పిదాలు సరిచేయబడలేదు. వెనుకబాటు ప్రాంత ప్రయోజనాల పట్ల మరొక అభివృద్ధి చెందిన ప్రాంతం ఎట్లా ఆధిపత్యం చెలాయిస్తుందో ఎంత తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తుందో అర్థం చేసుకోవటానికి 'తెలంగాణ' సజీవ ఉదాహరణ.***

ఉద్యోగ క్షేత్రంలో తెలంగాణ ఎదుర్కొంటున్న వివక్షను, అక్రమాలను ఎప్పటికప్పుడు గుర్తించి స్థానిక ప్రజలు గణనీయమైన ఉద్యమాలు నిర్వహించిండ్రు. బహుశ ప్రపంచ చరిత్రలోనే రాజకీయ లక్ష్యంతో తెలంగాణ ఉద్యోగులు జరిపిన సుదీర్ఘ సమ్మె పోరాటం ప్రత్యేకమైన అధ్యాయంగా పేర్కొనవచ్చు. ఇక్కడి ఉద్యోగులకు ఉద్యోగ విధులు నిర్వర్తించటంతోపాటు సహప్రాంతీయుల ఆధిపత్య – వివక్షలను ఎదిరించటం కూడా విధుల్లో భాగమైంది. అంతేకాక స్థానిక సామాజిక ఉద్యమాలలో భాగస్వామ్యం వహించటం కూడా లక్షణంగా మారింది.

ఐదవ నిజాం కాలంలో ప్రధాని సాలార్‌జంగ్ హైదరాబాద్ సివిల్ సర్వీసెస్ స్థాపించి ఉత్తరాది నుండి విద్యావంతులను రప్పించి ఉద్యోగాల్లో చేర్చుకోవటంతో ముల్కీ (స్థానికత) సమస్య బలంగా తలెత్తింది. ఉన్న ఉద్యోగాలతోపాటు రాబోయే ఉద్యోగాల్లో కూడా తమవారినే నియమించుకోవటం వల్ల స్థానికులకు అన్యాయం జరిగింది. ఉత్తరప్రదేశ్, బెంగాల్, తమిళ ప్రాంతాల నుండి ఇంగ్లీషు బాగా వచ్చిన వారు హైదరాబాద్ రాష్ట్రానికి వలసవచ్చి ఉద్యోగాలు దక్కించుకోవటం వల్ల స్థానికులు, ఉద్యోగులు ఆందోళనలు లేవనెత్తవలసి వచ్చింది. 1883లో ఆరవ నిజాం మహబూబ్ అలీ ప్రభుత్వం ప్రత్యేక హైదరాబాద్ సివిల్ సర్వీస్ ఏర్పర్చి ఉద్యోగాలన్ని అర్హతల ప్రకారం స్థానికులకే ఇవ్వాలని నిర్ణయించింది.

1901 కాసన్‌వాకర్ నిజాం ఫైనాన్స్ సెక్రటరీగా నియమించబడ్డ తర్వాత 1910 వరకు ముల్కీ నియమాన్ని ఉల్లంఘించి స్థానికేతరులను ఇష్టారీతిగ ఉద్యోగాలలో నియమించుకున్నారు. ఉద్యోగుల్లో పదోన్నతి సమస్య నిరుద్యోగులలో ఉద్యోగాలే రావన్న భయం తీవ్రమై కలిసికట్టుగా పోరాటాలు నిర్వహించిండ్రు. 1919 ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ స్థానిక నివాస నిబంధనలను (ముల్కీ రూల్స్) క్రమబద్ధం చేసిండ్రు.

హైదరాబాద్ రాష్ట్రంలో జన్మించిన వారు మాత్రమే ముల్కీలు అంటే స్థానికులు. వీరితోపాటు 15 సంవత్సరాలు స్థానిక నివాసమున్నవారు తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లనివారిని కూడా ముల్కీలుగా పరిగణించవచ్చు. స్థానిక ఉద్యోగాలలో ఈ నిర్వచనం కిందకు వచ్చే స్థానికులనే నియమించాలని హుకుం (జీ.వో.) జారీ చేసిండ్రు. 'హైదరాబాద్ హిత్ రక్షణ సమితి' వారు ఈ నిబంధనల అమలు కోసం తరుచుగా ఆందోళనలు జరుపుతూ వచ్చిండ్రు.

1945లో స్థానిక ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యోగులందరు కలిసి "హైదరాబాద్ సర్కారీ ములాజీమ్ యూనియన్" ఏర్పాటు చేసుకున్నారు. అయితే 1948 తర్వాత వెల్లోడి ప్రభుత్వంలో స్థానికేతరుల అక్రమ నియామకాలు విపరీతమయినాయి. ఆంధ్ర, తమిళ ప్రాంతాల నుంచి విరివిగ వచ్చి స్థానికుల ఉద్యోగాల్ని చేజిక్కించుకొన్నారు. దీన్ని 'మిడతల దండు' దాడిగా భావించారు. 1952 నాటికి దాదాపు 5,000 మంది స్థానికేతరులు చేరటం వల్ల మరోసారి 'స్థానికత' సమస్య పెల్లుబికింది. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం వలసను ప్రోత్సహించనప్పటికీ సమస్యను పరిష్కరించలేకపోయింది. కమీషన్ ముందు తెలంగాణ ఉద్యోగులు, మేధావులు విలీనాన్ని వ్యతిరేకించవలసి వచ్చింది. తెలివిగల కోస్తాంధ్రుల చేతిలో తెలంగాణ వలస ప్రాంతంగా మారి ఉద్యోగాలు, వనరులు దోపిడీ చేయబడతాయని స్థానికులు భయపడుతున్నట్లు (ఎస్ఆర్సి–

378)ఫజల్ అలీ కమిషన్ పేర్కొన్నది.

ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావ సందర్భంలో అదే విషయాన్ని ప్రస్తావిస్తూ "పెద్దమనుషుల ఒప్పందం"లోని 7వ అంశం రాసుకోవటం జరిగింది.

"తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాలు నిర్ణీత నిష్పత్తి ప్రకారం పొందడానికి నివాస నిబంధన ఉండాలి. 12 సంవత్సరాల స్థానిక నివాసం ఉండాలి" ఇరు ప్రాంతాలు జనాభా ప్రాతిపదికన గానీ 3:2 దామాషా పద్ధతిన గానీ ఉద్యోగాల నియామకం జరుపుకోవచ్చునని ఒప్పందం చేసుకున్నారు.

అనేక పోరాటాల ద్వారా తెలంగాణ వారు సాధించుకున్న భద్రతలను, హక్కులను ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రావారు నీరుగారుస్తూ వచ్చినారు. రోజురోజుకు తెలంగాణ ఉద్యోగుల తిప్పలు పెరుగుతూ వచ్చినాయి.

హైదరాబాద్ రాష్ట్ర క్యాడర్ కంటే ఆంధ్ర రాష్ట్ర క్యాడర్‌కు జీతాలు 30% తక్కువ ఉండేవి. వాటిని పెంచి సమానం చేయవలసి ఉండగా స్థానిక ఉద్యోగుల జీతాలు తగ్గించిండ్రు. అప్పటికే వీరోచితమైన పోరాటాలు చేసి జీతాలు పెంచుకున్న హైదరాబాద్ రాష్ట్ర ఉద్యోగుల వేతనాలు, తక్కువగా ఉన్న ఆంధ్రా ప్రాంత ఉద్యోగుల వేతనాలతో సమానం చేయడంతో ప్రారంభమైన విద్రోహం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. 1956లో హైదరాబాద్ రాష్ట్రంలో సీనియర్ అసిస్టెంట్ వేతనం 135-200 ఉండగా, ఆంధ్రా ఉద్యోగుల వేతనం 100-200తో సమానం చేశారు. అన్ని క్యాడర్‌లలో వేతనాలను గణనీయంగా తగ్గించి ఆధిపత్యపు ఆనవాళ్లను నాటారు. స్థానికులు ఉర్దూమీడియం చదివినవారు. ఆందువల్ల ఇంగ్లీషు, తెలుగు భాష పరీక్షల పేరుతో తెలంగాణ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వకుండా ఆపేశిండ్రు. తాత్కాలిక ఉద్యోగాల్లోని స్థానికుల్ని తొలగించిండ్రు. ఆ ఉద్యోగాల్లో స్థానికేతరుల్ని నియమించిండ్రు. సీనియారిటీ జాబితా ప్రకటించకుండా తోచిన విధంగా ప్రాంత పక్షపాతంతో ప్రమోషన్లిచ్చిండ్రు హోదా, స్కేలు, విధులు, అర్హతలు, అనుభవం మొదలైనవి పరిగణలోకి తీసుకొని ప్రమోషన్లు ఇవ్వాలని ఉండగా తమ వారికి అనుకూలంగా ఉండే అంశాలనే అన్వయించి ప్రమోషన్లిచ్చిండ్రు.

హైదరాబాద్ సర్కారీ ములాజీమ్ యూనియన్ మరియు స్టేట్ టీచర్స్ యూనియన్ ఎప్పటికప్పుడు వీటిని ఖండిస్తూ వచ్చిండ్రు. స్థానిక యం.పి. రాజబహదూర్ గౌడ్ అప్పటి దేశీయ వ్యవహారాల మంత్రి గోవిందవల్లభ్ పంత్ దృష్టికి తెస్తే రెండు ప్రాంతాల ప్రభుత్వోద్యోగుల సీనియారిటీ జాబితా వెంటనే రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం 1957 మార్చి 27న ఆదేశించింది. తర్వాత దాన్ని కూడా కాలరాసిండ్రు. పైగా తెలంగాణ ఉద్యోగులకు ఏమీ చేతకాదని, ఏమీ రాదని అవహేళన చేస్తూ హింసించిండ్రు. తెలంగాణ వారు గౌరవం కోసం తరచుగా కొట్లాడవలసి వచ్చింది. న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించేవారు. ఆరుగురు తెలంగాణ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు హైకోర్టు, సుప్రీంకోర్టుల నాశ్రయించేదాకా న్యాయం దొరకలేదంటే పరిస్థితి ఎంత క్రూరంగా ఉండిందో అర్థం చేసుకోవచ్చు.

1964లో ఆంధ్ర ఉద్యోగులు వినియోగదారుల సంఘం, సూపర్ బజార్ నిర్వహించేవారు. తెలంగాణ వారిని చేరనివ్వలేదు. సర్కారు హౌజింగ్ బోర్డు కాలనీ నిర్మించి ఆంధ్రులకు ప్రవేశం కల్పించింది. కానీ తెలంగాణ ఉద్యోగులకు ప్రవేశమివ్వలేదు.

పెరిగిపోయిన ఆంధ్ర, ఉద్యోగుల వివక్షలను అక్రమాలను నిరసిస్తూ అవకతవకల్ని సవరించాలని 1966లో తెలంగాణ ఉద్యోగులు, టీచర్ల ట్రేడ్ యూనియన్లు సంయుక్తంగా నోటీస్ ఇచ్చిండ్రు. ప్రథమంగా నిరాహారదీక్ష చేపట్టిండ్రు. మూడు రోజులకు దీక్ష ముగిసింది. ఆంధ్ర ఎన్జీవో సంఘానికి, హైదరాబాద్ సర్కారీ ములాజీం యూనియన్‌కు గొడవలు పెరిగి పోయినాయి. తెలంగాణ ఉద్యోగుల్ని చీల్చేతందుకు డిపార్టు మెంటు వారీ యూనియన్‌లు ప్రారంభించిండ్రు ఆంధ్రా వలస వాదులు. అవి ఇప్పటికీ ఏ.పి. పేరు మీద కొనసాగుతూ, తెలంగాణ హక్కులను కాలరాయడంలో ప్రముఖపాత్ర పోషించాయి.

11,000 మంది ఉర్దూ చదివిన ఉద్యోగుల్ని తొలగించ టానికి అధికారులు నోటీస్ ఇచ్చిండ్రు. పరిస్థితిని గమనించి తెలంగాణ ప్రాంత ఎన్జీవోలు జిల్లాలన్నీ తిరిగి 1967 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో జిల్లా శాఖలు తెరిచిండ్రు. జిల్లాల్లో అక్రమంగా నియమించబడ్డ ఆంధ్రా ఉద్యోగుల, టీచర్ల, ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సమాచారం సేకరించిండ్రు. ఆంధ్రా ఉద్యోగుల్ని తమ ప్రాంతం నుంచి వెళ్లగొట్టాలన్న నిర్ధారణకు వొచ్చిండ్రు.

1967 మేలో "హైదరాబాద్ సర్కారీ ములాజిం యూనియన్ "తెలంగాణ ఎన్జీవో సంఘం"గా పేరు మార్చుకొని విస్తరించింది. చాలామంది టిఎన్జీవో సంఘంలో చేరి ఉద్యమించసాగిండ్రు. ఉద్యమరూపకల్పన చేసిండ్రు. తమ ప్రాంత ఉద్యోగాల్లో నియమించబడ్డ స్థానికేతురుల్ని వారి ప్రాంతాలకు తిప్పి పంపాలనే ఆలోచన తెలంగాణ వాళ్లలో బలోపేతమైంది. ఉన్నతా ధికారులు, రాజకీయ నాయకులు తోడ్పాటునందించిండ్రు. 1969 జనవరిలో విద్యార్థుల ప్రత్యేక తెలంగాణ ఆందోళన మొదలైంది. ఉద్యమం తీవ్రతరం అయ్యింది. జనవరి 19, 1969 రోజున ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం జరిపి ఒప్పందం కుదిర్చింది. ఖమ్మం జిల్లా పాల్వంచలో స్థానికంగా ఉన్న థర్మల్ పవర్ స్టేషన్‌లో స్థానికులకు ఉద్యోగాలు దక్కలేదని టిఎన్జీవో నాయకత్వంలో ఆందోళన మొదలై ప్రత్యేక తెలంగాణ ఉద్యమంగా మారింది.

నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణలో ఉద్యోగులుగా నియమించబడిన 22,000 మంది స్థానికేతరులను తమ ప్రాంతాల్లో

అదనపు ఉద్యోగాలను కల్పించి పంపించివేయాలని ఆ ఖాళీల్లో తెలంగాణ వారిని నియమించాలని ఒప్పందం సారాంశం. ఆ మేరకు ప్రభుత్వం జనవరి 21, 1969 తేదీన 36 నెం. జీవో విడుదల చేసింది. జీవో ప్రకారం స్థానికేతరులైన ఉద్యోగులు 22,000 మంది తమ తమ జిల్లాలకు వెళ్లాల్సి ఉంది, కాని రెండు నెలల్లోనే కోర్టు పేరుతో అమలు జరుపకుండ బుట్టదాఖలు చేసిండ్రు. పరిస్థితిని సమీక్షించి టీఎన్జీవో యూనియన్, ఉపాధ్యాయ సంఘాలను వదలిపెట్టి 1969 మార్చి 30న ప్రత్యేక తెలంగాణ తీర్మానం చేసిండ్రు. తీర్మానం చేసిన రోజే టీఎన్జీవో నాయకుడు కె.ఆర్.ఆమోస్‌ను పి.డి. యాక్టు కింద అరెస్ట్ చేసింది ప్రభుత్వం. ఉద్యోగులు చందాలు వేసుకొని ప్లెడ్జ్ అనే పత్రిక తీసుకొచ్చిండ్రు. ధైర్యంగా ఉద్యమ దిశగా నడిచిండ్రు.




ఏప్రిల్ 11, 1969న, ప్రధాని ఇందిరాగాంధీ ఎనిమిది సూత్రాల పథకం ప్రకటించి ఓదార్పు చూపింది. అందులో 6వ మరియు 7వ సూత్రాలు ఉద్యోగ సమస్య పరిష్కారాలే. "తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వడానికి రాజ్యాంగ పరమైన కట్టుదిట్టం చేయాలి". తెలంగాణ ఉద్యోగుల సర్వీసు సమస్యలు పరిశీలించి పరిష్కారాలు సూచించేటందుకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయాలి.

ఇవేవీ అమలులోకి రాక ఉదాసీనత ప్రదర్శించటం వల్ల 'తెలంగాణ ఎన్జీవో సంఘం' తీవ్ర ఆగ్రహంతో నిరవధిక సమ్మె నోటీస్ ఇచ్చింది. జూన్ 7న ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా ఎలక్ట్రిసిటీ బోర్డు ఉద్యోగులు తదితర కార్మికులు సమ్మెకు దిగిండ్రు. టీఎన్జీవోలు జూన్ 10 నుండి నిరవధిక సమ్మె ప్రారంభించిండ్రు. జూలై 16 వరకు 36 రోజులపాటు చారిత్రాత్మక సమ్మె కొనసాగింది. వరంగల్ సెంట్రల్ జైల్లో 1000 మంది ఉద్యోగులను నిర్బంధించారు. తెలంగాణ ఎన్జీవో సంఘం గుర్తింపును ప్రభుత్వం జీవో నెం. 350 తేది 21.8.1969న రద్దు చేసి, ఉద్యోగులను ఉద్యమంలో పాల్గొనకుండా కుట్రలు పన్నింది. అయినా ఉద్యోగులు ఉద్యమబాట పట్టడం వివక్ష ఎంత కొనసాగుతుందో తెలియచేసింది. టీఎన్జీవోస్ నేత అమోస్‌ను ఉద్యోగం నుంచి తొలగించిండ్రు. 18 మంది ఉద్యోగులు సస్పెండయిండ్రు ముల్కీ నిబంధనలను సవాలు చేస్తూ ఆంధ్ర ఉద్యోగులు హైకోర్టుకు వెళ్లి అనుకూల తీర్పు పొందగా తెలంగాణ ఉద్యోగులు 3 అక్టోబర్ 1972న ముల్కీ నిబంధనలు చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు తీర్పు పొందిండ్రు. తదనంతరం ఉద్యోగాల సమస్య జై ఆంధ్ర ఉద్యమం, రాజ్యాంగ సవరణ, రాష్ట్రపతి ఉత్తర్వుల దాకా వెళ్ళింది. ఆంధ్రా ప్రాంత ప్రజాప్రతినిధులందరూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ముల్కీరూల్స్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాజ్యాంగ సవరణ ద్వారా రద్దు చేయించారు. కాని ఇటీవల హైదరాబాద్ నగరాన్ని ఫ్రీజోన్‌గా అక్టోబర్ 11, 2009న సుప్రీంకోర్టు తీర్పు రావడంతో ప్రభుత్వంపై తెలంగాణ ప్రజా ప్రతినిధులు తీవ్రమైన ఒత్తిడి తీసుకు రాకపోవడం వలన రాజ్యాంగ సవరణను చేయించు కోలేకపోయిండ్రు. మన ప్రజాప్రతినిధులే మనపక్షం వహించక పోవడం చరిత్రలో నిలిచిపోయింది. చివరకు ప్రజా ఉద్యమానికి తలొగ్గి అసెంబ్లీలో తూతూమంత్రంగా తీర్మానం చేసిండ్రు.

ఆ తరువాత ప్రభుత్వం విద్యార్థుల, ఉద్యోగుల ఒత్తిడి వలన హైదరాబాద్‌ను ఫ్రీజోన్ అనే పదం తొలగించింది, మొత్తం తెలంగాణ ఉద్యమానికి ఒక చారిత్రక మలుపు ఫ్రీజోన్ ఉద్యమం.

రాష్ట్రాన్ని 6 జోన్లుగా విభజించి జోన్ వారీగా ఉద్యోగాలు రిజర్వ్ చేయబడ్డాయి. జిల్లా స్థాయి క్యాడర్‌లో 80% జోన్ స్థాయి క్యాడర్‌లో 70%, గెజిటెడ్ క్యాడర్‌లో 60% ఉద్యోగాలు స్థానికులకు కేటాయించటం జరిగింది అయినప్పటికీ ఆ నిబంధనలలోను అక్రమాలు జరిపి, వక్రీకరణలు చేసి, భాష్యాలు మార్చి స్థానికేతరుల నియామకాలు యధేచ్ఛగా కొనసాగిస్తూ వచ్చిండ్రు, రాష్ట్రపతి ఉత్తర్వులు వచ్చేనాటికి 54 హెచ్‌డిఓలు ఉండగా, నేటికి 204 హెచ్‌డిఓలుగా మార్చి, స్థానికతను పాతరవేసారు.

1985లో తిరిగి టీఎన్జీవో సంఘం ఇతర ఉద్యోగులు మరోసారి ఆందోళన చేసింద్రు. తెలంగాణ అంతటా ఇతర రాజకీయ ఆందోళనలు జరిగినాయి. వాటి ఫలితంగా త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా నాటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు 1985 డిసెంబర్ 30న 610 జీవోను జారీ చేసింద్రు. దీని ప్రకారం 58,926 మంది స్థానికేతరులు 5,6 జోన్ల స్థానిక ఉద్యోగాల్లో ఉన్నారు. వారందరినీ 1986 మార్చి 31 లోగా తమ తమ జోన్లనకు పంపించి వేయాలని జీవో సారాంశం. అదీ ముప్పది సంవత్సరాలుగా అమలుకాలేదు. తెలంగాణ ఉద్యమకారుల ఒత్తిళ్లకు తలొగ్గి తిరిగి చంద్రబాబు ప్రభుత్వం 26-6-2001 పునస్సమీక్ష జరపమని ఏకసభ్య గిర్గ్లానీ కమీషన్ వేసింది. అది 2004 సెప్టెంబర్లో పరిమిత సమాచారంతో నివేదిక సమర్పించింది. గిర్గ్లానీ కమీషన్ నివేదిక బయటపెట్టాలని "తెలంగాణ ఎన్జీవో సంఘం" ఆందోళన చేసింది. గిర్గ్లానీ ఉద్యోగ సంఘాలతో అన్న మాటలు ఒక్కసారి పరిశీలిస్తే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరి స్పష్టమైనది. "తెలంగాణ ఉద్యోగులకు, ప్రజలకు జరిగిన అన్యాయాన్ని నేను నివేదికలో బయటపెడితే, నేను బ్రతుకుతాననే నమ్మకం లేదు" అని గిర్గ్లానీ అనడం తెలంగాణ ప్రాంతానికి జరిగిన నిజమైన వివక్షలు కూడా అనేకం నివేదికలో చోటు చేసుకోలేక పోయాయని తెలుస్తున్నది. అయినా అనేక విషయాలు నిర్భయంగా చెప్పిన గిర్గ్లానీ సాహసం మరువలేనిది.

స్థానిక ఉద్యోగ నియామకాల్లో జరిగిన అనేక అక్రమాల్ని, రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘనలను ఈ నివేదిక స్పష్టంగా ఎత్తిచూపింది. మొత్తం 18 రకాల ఉల్లంఘనలు జరిగినాయని నిర్ధారించింది. స్థానికులనిష్పత్తిని తగ్గించడం, జోన్ నిబంధనలను పాటించకపోవటం, ఓపెన్ కేటగిరి ఉద్యోగాలన్ని స్థానికేతరుల కోటాగా వక్రీకరించటం, జిల్లా, జోన్ క్యాడర్లు మార్చటం, శాఖాధిపతి కార్యాలయాలు పెంచటం, బోగస్ స్థానిక సర్టిఫికెట్లు, స్థానికుల బ్యాక్లాగ్ పోస్టుల్లో స్థానికేతరులను నియమించటం, ఫ్రీజోన్ పేరుతో 7వ జోన్ కల్పించడం వగైరా ఎన్నో వక్రీకరణలతో స్థానికేతరులు స్థానిక ఉద్యోగాల్లో చేరినట్లు నిర్ధారించి వాటిని ప్రభుత్వం సవరించాలని గిర్గ్లానీ కమీషన్ సూచించింది.

గిర్గ్లానీ కమీషన్ చేసిన సూచనలు కూడా అక్రమంగా తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగం చేస్తున్న తెలంగాణేతరులకు వరంగా మారాయి. గిర్గ్లానీ చేసిన సూచనలో ఒకటైన ఉద్యోగి స్థానికుడుగా నిర్ధారణ చేయడానికి, ఉద్యోగంలో చేరేనాటికి ఏ నివాస ప్రాంతానికి చెందినవాడో సర్వీస్ బుక్లో నమోదు చేయాలనే సూచనకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి ఆదేశాలు జారీచేసింది. దీనితో స్థానికేతరులందరూ హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాలలో చదువుతున్నట్లు దొంగ సర్టిఫికెట్లు సృష్టించి, స్థానికులుగా సర్వీస్ బుక్లో నమోదు చేసుకొని స్థానిక పోస్టులలో రెగ్యులరైజ్ అయింద్రు. ఈ తతంగంపై ఎన్ని ఫిర్యాదులు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక టీఎన్జీవో స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో 610 జీవో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ముఖ్యమంత్రి వైయస్ఆర్ ప్రకటించారు. ఉత్తమ్కుమార్ రెడ్డి నాయకత్వంలో శాసనసభ కమిటీ ఏర్పడింది. ఎన్నో సమావేశాలు జరిగాయి. అన్ని సమావేశాలలో 610, రాష్ట్రపతి ఉత్తర్వులు యథేచ్ఛగా ఉల్లంఘనలు జరిగాయని తేలింది. కాని ఎలాంటి న్యాయం జరుగలేదు. 2005లో ప్రభుత్వం 1975 నుండి 2005 వరకు జరిగిన రిక్రూట్మెంట్లను పరిశీలించాలని నిర్ణయించింది, కానీ దాదాపు 60,000 మంది ఉద్యోగులకు సంబంధించిన వివరాలు మా వద్ద లేవని, వాటికి సంబంధించిన రికార్డులు లేవని ప్రభుత్వం ప్రకటించింది. పైగా 610 జీవో ప్రకారం స్థానికేతరులు కేవలం 18000 మంది మాత్రమే నని అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించారు. 610 జీవో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం 610 జీవో ఉల్లంఘనలు రెగ్యులరైజ్ చేయడం ఉద్యోగులకు ఆగ్రహాన్ని తెప్పించింది. నవంబర్ 28, 2008న అసెంబ్లీ ప్రకటన తర్వాత ప్రభుత్వం తేల్చిన లెక్కలలో మోసాన్ని గ్రహించి తెలంగాణ జిల్లాల్లో టీఎన్జీవో నాయకులు స్వామిగౌడ్, దేవిప్రసాద్ నాయకత్వంలో ఉద్యమ చైతన్యయాత్ర నిర్వహించి, లక్షలాది మంది ఉద్యోగులకు ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షను వివరించింది. 12న హైదరాబాద్లో భారీ బహిరంగసభ జరిపి ప్రభుత్వాన్ని తిరిగి విచారణ జరిపి అసలు లెక్కలు తేల్చాలని డిమాండ్ చేసింది. తిరిగి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి శ్రద్ధ కనబరచలేదు.

ఇంతలో అక్టోబర్ 11న హైదరాబాద్ ఫ్రీ జోన్గా మారుస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో, ఉద్యోగులలో ఆందోళన తీవ్రతరంమైంది. అక్టోబర్ 12న నగరంలో, 13న జిల్లాల్లో ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఫ్రీజోన్ తీర్పు వలన తలెత్తిన పరిస్థితులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రికి వివరించి, ప్రభుత్వం వెంటనే రాష్ట్రపతి ఉత్తర్వులలోని పేరా 14(ఎఫ్)ను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. కాని ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనితో సిద్దిపేటలో ఉద్యోగులు లక్షలాదిగా కదలి 21న బహిరంగసభ జరిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న కె. చంద్రశేఖర్రావు (టిఆర్ఎస్) స్వామి అగ్నివేష్ తెలంగాణ ఉద్యోగుల జెఏసి, చైర్మన్ కె. స్వామిగౌడ్, దేవిప్రసాద్, శ్రీనివాస్గౌడ్, విఠల్, రేచల్ ఇతర ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని ప్రభుత్వానికి వెంటనే రాజ్యాంగ సవరణకు శాసనసభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 'పెన్ డౌన్' చేస్తామని ప్రకటించారు. నవంబర్ 4న అన్ని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్టేబుల్ సమావేశం నిర్వహించి, ఉద్యోగులను ఉద్యమానికి సమాయత్తం

చేయడానికి నవంబర్ 16 నుండి 21 వరకు జిల్లాలో సమావేశాలు నిర్వహించారు. 28న కె.సి.ఆర్. అమరణ నిరాహారదీక్షకు దిగడంతో ఉద్యమం ఉధృతం అయ్యింది. కె.సి.ఆర్. నిరహారదీక్షకు మద్ధతుగా 29, 30 తేదీలలో ఉద్యోగులు ప్రదర్శనలు నిర్వహించి డిసెంబర్ 1 నుండి 8 వరకు 'పెన్ డౌన్' చారిత్రత్మాక సమ్మె జరిగింది. లక్షలాది ఉద్యోగులు పెన్‌డౌన్‌లో పాల్గొనడంతో పరిపాలన స్తంభించిపోయింది. మరోవైపు ప్రజలంతా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కావాలని పెద్దఎత్తున కదలడం ప్రారంభమైంది. డిసెంబర్ 8న ముఖ్యమంత్రి టీఎన్జీవో నేతలను చర్చలకు పిలిచి శాసనసభలో తీర్మానం పెడతామని ప్రకటించారు. కాని ఉద్యోగులంతా కేసిఆర్ గారి ఆరోగ్యం ఆందోళనకరంగా మారడంతో పెన్‌డౌన్ సమ్మెకు ముగింపు పలకడం సరికాదని, తెలంగాణ ప్రజా ఉద్యమంలో ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని కొనసాగించారు. డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రకటించడం పెన్‌డౌన్ సమ్మె విరమించాం. డిసెంబర్ 23న తెలంగాణ ప్రజల ఆకాంక్షను పాతరేసే విధంగా ఇచ్చిన కేంద్ర ప్రకటనను నిరసిస్తూ ఉద్యమం ఉధృతమైంది. 24న బంద్‌తో ప్రారంభమై కొనసాగింది. వరంగల్‌లో డిసెంబర్ 30న ఉద్యోగులు నిర్వహించిన సభకు లక్షలాది మంది ప్రజలు హాజరు కావడం ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కేంద్ర ప్రభుత్వం రాజకీయ పార్టీలను శాంతి చర్చలకు ఢిల్లీకి పిలిచిన నేపథ్యంలో ఉద్యోగులంతా జనవరి 4,5 తేదీలలో మళ్లీ సమ్మె చేయడం ఉద్యోగులలో బలమైన ఉద్యమ నిబద్ధత తెలియచేసింది. తిరిగి తెలంగాణ ప్రజల ఆకాంక్షపై నీళ్ళు చల్లడానికి శ్రీకృష్ణ కమిటి వేసింది.

ప్రజలంతా జెఏసిలుగా ఏర్పడి ఉద్యమాన్ని కొనసాగించారు. శ్రీ కృష్ణ కమిటి ముందు అన్ని సంఘాలు, తమ వద్ద ఉన్న సమాచారాన్ని అందించాయి. కాని కమిటీల పట్ల తెలంగాణ ప్రజలకున్న అనుమానాల వలన శ్రీకృష్ణ కమిటిపై నమ్మకం లేకుండా పోయింది.

1956 నుండి ఇప్పటి వరకు తెలంగాణ ఉద్యోగులకు జరిగింది అన్యాయమే. లక్షలాది పోస్టులు దక్కకుండా పోయాయి. రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న 13 లక్షల పోస్టులలో మన వాటా 5.20 లక్షలు కాని ప్రస్తుతం మన ఉద్యోగులు 1.50 వెయిలే, దాదాపు 3.70 లక్షల ఉద్యోగాలు కోల్పోయాం. రిటైరైన 1.50 వేల ఉద్యోగులను భర్తీ చేయకపోవడం వలన ఈ సంఖ్య మరింత రెట్టింపు అయ్యింది. 610 జీవో రాష్ట్రపతి ఉత్తర్వులు, శాసనసభ కమిటీలు, ఎన్ని వచ్చిన తెలంగాణ ఉద్యోగులకు జరిగింది ఏమీ లేదు. అందుకే ఉద్యోగులంతా తెలంగాణ రాష్ట్రం వస్తే తప్ప ఉల్లంఘనలు సరిచేయలేమనే నమ్మకంతో ఉద్యమంలో భాగమైనారు.

సంవత్సర కాలం గడిచినా సమస్యకు పరిష్కారం లభించని నేపథ్యంలో తెలంగాణ ప్రాంత ప్రజలు, సమైక్యాంధ్ర ప్రభుత్వానికి సహాయనిరాకరణ జరపాలని తెలంగాణ జేఏసి నిర్ణయించింది. ఫిబ్రవరి 17,2011 నుంచి మార్చి 4, 2011 వరకు 17 రోజుల పాటు ఉద్యోగులందరూ సహాయ నిరాకరణ చేశారు. దాదాపు 10 వేల కోట్ల రూపాయలు పన్ను రూపేణా వచ్చే నిధులు ఆగిపోయాయి. పే అండ్ అకౌంట్స్, ట్రెజరీ సిబ్బంది చేసిన సహాయ నిరాకరణతో మన ముఖ్యమంత్రి జీతం కూడా ఆగిపోయింది. సహాయ నిరాకరణ ఉద్యమం రూపం ప్రభుత్వానికి మొదటిది కావడంతో ఈ కాలంలో ఉద్యోగులపై ప్రభుత్వం నిర్బంధం తీవ్రంగా పెంచలేకపోయింది. అన్ని కార్యాలయాలు ఉద్యమ వేదికలుగా మారాయి. కాని సహాయ నిరాకరణ ఉద్యమంలో మిగతా వర్గాలను భాగస్వామ్యం చేయడంలో జేఏసి విఫలమైంది. దాన్ని రాజకీయ పక్షాలు కూడా సమన్వయంతో ఉద్యమాన్ని సరైన మార్గంలో గైడ్ చేయడంలోనూ విఫలమైనాయి. దీనితో ఉద్యోగులలో ఒంటరి వాళ్లమైపోయామనే భావన బలపడింది. మరోవైపు ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షలు రావడం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో సహాయ నిరాకరణ వాయిదా వేయాలనే డిమాండ్ అనేక వర్గాల నుండి మొదలైంది. మరోవైపు రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న తీరు కూడా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి తోడ్పడని నేపథ్యంలో వాయిదా వేయాలనే ఆలోచన మొదలైంది. అయితే ఉద్యోగులలో కొనసాగించాలని ఆకాంక్ష ఉన్నప్పటికీ, వాయిదా అనివార్య మైంది. వాయిదా నిర్ణయానికి అక్కడక్కడా నిరసనలు చెప్పడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రభుత్వంతో ఒప్పందాల మేరకు ఉద్యోగులకు ఎలాంటి నష్టం లేకుండా సమ్మె విజయవంతం అయ్యింది. సహాయనిరాకరణ ఉద్యమంలో ఉద్యోగులను నిలబెట్టింది విద్యార్థులే. ఛలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించడం ఉద్యోగులలో విశ్వాసాన్ని పెంచి సహాయ నిరాకరణలో వచ్చిన అనేక గుణపాఠాలను, అనుభవాలను సమీక్షించుకుని భవిష్యత్‌లో జరిగే ఉద్యమంలో అందరిని భాగస్వామ్యం చేయాలనే ప్రయత్నం ఏప్రిల్ నుండి మొదలైంది. ఆర్.టి.సి. సింగరేణి, ఉపాధ్యాయ సంఘాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, కులసంఘాలు, ప్రజా సంఘాలతో చర్చలు మొదలైనవి. ఆగస్టు నాటికి సకల జనుల సమ్మె రూపంలో ఉద్యమించాలని నిర్ణయం జరిగింది. సమ్మె విజయవంతం కోసం అన్ని జిల్లాలలో ఉద్యోగుల సదస్సులు పెద్ద ఎత్తున జరిగాయి. ఉద్యోగులలో మళ్లీ కదలికలు తీవ్రం అయ్యాయి. దీనితో ప్రభుత్వం కూడా వేగంగా కదలడం ప్రారంభించింది. ఉద్యమాన్ని అణచడానికి జీవో 177 విడుదల చేసింది. సమ్మెలో పాల్గొంటే నోవర్క్ నోపే విధానం అమలు చేస్తామని హెచ్చరించింది. దీనితో ఉద్యోగులు 177 రద్దుకోసం పెద్దఎత్తున ఉద్యమించడంతో తాత్కాలికంగా రద్దు చేసుకున్నారు. కాని తర్వాత కోర్టులో పిల్ వేసి రద్దు జీవోని తాత్కాలికంగా నిలుపుదల చేసింది. సెప్టెంబర్ మొదటివారం నుండి హైదరాబాద్ నగరంలో ఉన్న అన్ని శాఖాధిపతుల కార్యాలయాల్లో

పారా మిలటరీ బలగాలను దించింది, ఉద్యోగుల గుర్తింపు కార్డులు చూపితేనే కార్యాలయాల్లోకి అనుమతి ఇవ్వాలని నిర్ణయించి, కార్యాలయ ప్రాంగణాల్లో ఎలాంటి సమావేశాలు పెట్టరాదని నిర్ణయించింది. తెలంగాణ ఎన్జీవో అధికారుల వ్యక్తిగత వివరాలు సేకరించడంతో ఉద్యోగులను, నాయకులను భయభ్రాంతులు చేసే కార్యక్రమం ప్రారంభమైంది. సహాయ నిరాకరణ సందర్భముగా ముఖ్యమంత్రికి జీతం రాలేదని పార్లమెంట్‌లో బీజేపి నాయకురాలు సుష్మాస్వరాజ్ ప్రపంచానికి తెలియజేయడంతో, అలాంటి స్థితి సకల జనుల సమ్మెలో రావద్దని ప్రభుత్వం ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ శాఖలను ఇఎస్ఎంఎ పరిధిలోకి తెస్తూ ఆ శాఖలలో సమ్మెను నిషేధించింది. ఉద్యోగులపై 'ఎస్మా' ప్రవేశ పెట్టినా, అరెస్టులు చేసినా సమ్మె చేసి తీరుతాం అని ప్రకటించి ట్రెజరీ కార్యాలయం వద్ద జీవోను తగులబెట్టడంతో ప్రభుత్వం ఏమి చేయాలనే ఆలోచనలో పడింది. సెప్టెంబర్ 13న సమ్మె ప్రారంభం కావాలని జేఏసి పిలుపు ఇవ్వడంతో, సెప్టెంబర్ 12న కరీంనగర్‌లో టీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగసభ ఉద్యోగులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. 13న ఉదయం సింగరేణి కార్మికులు ప్రారంభించిన సమ్మె తెలంగాణ ఉద్యోగులలో స్ఫూర్తి నింపింది. సమ్మె 13న విజయవంతంగా ప్రారంభమైంది. అటెండర్ నుండి అధికారుల వరకు తెలంగాణ ఉద్యోగుల ఐక్యత మరోసారి ప్రపంచానికి చాటింది. 3 రోజుల తర్వాత ఉపాధ్యాయులు, ఆర్‌టిసి కార్మికులు సమ్మెలో చేరడంతో సమ్మె ఉధృతరూపం దాల్చింది. ఆర్‌టిసి డిపోల వద్ద వందలాది పోలీసులను దింపి కార్మికులను భయభ్రాంతులు చేసింది. అరెస్టుల పర్వం కొనసాగింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పెద్ద ఎత్తున పోలీసులు దిగడంతో ఉద్యోగులు పోలీసులను ఉపసంహరించాలని 14, 15న ర్యాలీలు, ధర్నాలు చేశారు. అన్ని జిల్లాలలో ఉద్యోగులను అరెస్టు చేసి కేసులు పెట్టి వదిలివేశారు. గాంధీ మెడికల్ కాలేజీ వద్ద ఉద్యోగులనుద్దేశించి ప్రసంగించిన కె. స్వామిగౌడ్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో ఉద్యోగులలో ఆగ్రహం పెల్లుబికింది. చిలకలగూడ పోలీస్ స్టేషన్‌ను ఉద్యోగులు దిగ్బంధించి ధర్నా చేయడంతో, తెలంగాణ వ్యాప్తంగా జేఏసి ప్రజా సంఘాలు, రాస్తారోకో చేయడంతో ప్రభుత్వం కుట్రను భగ్నంచేసి ఉద్యమ నాయకులను విడిపించుకోగలిగారు.

సమ్మెలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొనడంతో, ప్రభుత్వం తీవ్రంగా స్పందించి, ఐకెపి, ఆర్.వి.ఎమ్., ఎన్ఆర్ఇజిఎస్, ఆర్ అండ్ డి శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగిస్తామని నోటీస్‌లు జారీ చేయడంతో 25న ఆర్‌టిఏ కార్యాలయాన్ని 5 వేల మంది ఉద్యోగులు ముట్టడించారు. కాంగ్రెస్ ఎంపీల, శాసనసభ్యులతో పాటు టీఆర్ఎస్ శాసనసభ్యులు కూడా ధర్నాలో పాల్గొనడంతో ఉద్రిక్తత నెలకొంది. ఉత్తర్వులు రద్దు అయ్యే వరకు ధర్నా విరమించేది లేదని ఉద్యోగ జేఏసి నాయకులు బైఠాయించడంతో ప్రభుత్వం నోటీస్‌లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించక తప్పలేదు. తెలంగాణ ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న అధికారుల వైఖరిని నిరసిస్తూ ఉద్యోగులు ఆందోళన చేసారు. తెలంగాణ ఉద్యోగుల పోరాటాన్ని హింసాయుతంగా మార్చాలనే కుట్రలో భాగంగా 26న లగడపాటి రాజగోపాల్ ఆర్‌టిఏ కార్యాలయానికి రావడంతో ఉద్యోగులు 26న తిరిగి కార్యాలయాన్ని దిగ్బంధించారు. లగడపాటికి రెడ్‌కార్పెట్ వేసిన పోలీసులు తెలంగాణ ప్రజా ప్రతినిధులు, ఉద్యోగ ఐకాస నేతలను రానివ్వకుండా నిర్బంధించి, లాఠీచార్జ్ చేశారు. ఎమ్మెల్యే విష్ణు, హరీష్‌రావు, ఎంపీ వివేక్‌లతో పాటు అనేక మందికి గాయాలు అయ్యాయి. గాయపడ్డ ఉద్యోగులు కమీషనర్‌ను ఉద్రిక్తతలకు దారితీసే సీమాంధ్ర నాయకులను కార్యాలయంలోకి ఎందుకు అనుమతించినారని నిలదీశారు. ఉద్యోగులు వేలాది మంది లగడపాటిని నిలదీస్తారనే అనుమానంతో పోలీసులు ప్రజా ప్రతినిధులను, ఉద్యోగ సంఘ నాయకులను అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తే ఉద్యోగులు తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ సందర్భంగా పోలీసులు కుట్రప్రకారం ఒక్కొక్కరిని విడదీసి టాస్క్‌ఫోర్స్ పద్ధతిలో హింసించారు. స్వామిగౌడ్‌పై దాదాపు హత్యాయత్నం చేశారు. గతంలో ఉస్మానియా విద్యార్థులను తీవ్రంగా హింసించిన ఓ పోలీసు అధికారి ఈ నాటకానికి సూత్రధారిగా మారాడు. ఉద్యోగులు స్వామిగౌడ్‌ను రక్షించుకొని పోలీసు స్టేషన్‌కు ఊరేగింపుగా వెళ్లారు. ఆయన కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ ఘటనను మానవ హక్కుల కమీషన్, జాతీయ మానవ హక్కుల సంఘానికి నివేదించిన ఫలితం శూన్యం.

సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 2 వరకు జేఏసి నేతృత్వంలో ఢిల్లీలో ప్రధానమంత్రి, ఇతర అఖిలపక్ష నేతలను కలిసి సకల జనుల సమ్మెపై నిర్బంధం వివరించాం. ఢిల్లీకి జేఏసి నాయకత్వం రావడం రకరకాల ప్రచారాలకు దారితీసింది. ప్రచారానికి ధీటుగా సమ్మె ఉధృతం చేయాలని 'మహాధర్నా' నిర్వహించడంతో లక్షలాది ఉద్యోగులు హైదరాబాద్‌కు తరలి రావడంతో 46 పోలీస్ స్టేషన్‌లో 43 వేలమంది ఉద్యోగులను అరెస్టు చేసి ధర్నా అయిన తరువాత కేసులు పెట్టి విడుదల చేశారు. సకల జనుల సమ్మెకు మద్దతుగా జేఏసి ఇచ్చిన పిలుపు 'రైల్‌రోకో'లో జనాన్ని సమీకరించారని అనేకమంది ఉద్యోగ సంఘాల నేతలను అరెస్టు చేసి జైళ్ళకు పంపారు. రంగారెడ్డి జిల్లా వికారాబాద్, తాండూర్ ప్రాంతాల్లో జనాన్ని సమీకరించారనే నెపంతో ఉద్యోగుల ఐకాస నేత సమ్మక్కతో పాటు 17 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. సమ్మక్కపేరు పెట్టుకుని సమ్మక్క వారసత్వాన్ని కొనసాగిస్తారా అని ఆగ్రహంతో పోలీస్ అధికారులు వీరంగం చేశారు. మెదక్‌లో ఎమ్మార్వో కార్యాలయంపై దాడి చేసారని 13 మంది ఉద్యోగులపై కేసులు నమోదుచేశారు. నిజామాబాద్‌లో ప్రభుత్వ జీపును ఆందోళనకారులు తగులబెడితే నాల్గవ తరగతి ఉద్యోగ సంఘాల నేత శంకర్‌పై కేసు నమోదు

చేసి జైళ్ళకు పంపారు. ఆర్‌టిఏ కార్యాలయంపై దాడి జరిగిందని టాస్క్‌ఫోర్స్ కేసు నమోదు చేసి టీఎన్జీవో నేత రవీందర్ ఇంటిపై దాడి చేసి కుటుంబ సభ్యులను బెదిరించి ఇద్దరు కార్మికులను అరెస్ట్ చేశారు. అన్ని పట్టణాలలో ఉద్యోగుల మీద కేసులు సహజ ప్రక్రియగా మారింది. ఆర్‌టిసి ఉద్యోగులు సమ్మె చేస్తుంటే బస్సులు బలవంతంగా నడపాలని చేస్తున్న ప్రయత్నానికి నిరసనగా మహబూబ్‌నగర్ ఉద్యోగ జేఏసి నిర్వహించిన ప్రదర్శనను అడ్డుకొని పోలీసులు 18 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులను అరెస్ట్ చేశారు. జేఏసి చైర్మన్ రాజేందర్ రెడ్డి, రామకృష్ణారావు, రాఘవాచారిలకు ఆంధ్ర మెజిస్ట్రేట్ బెయిల్ ఇవ్వకుండా రెండు రోజులు మహబూబ్‌నగర్ జైల్లో నిర్బంధించారు. ఖమ్మం జిల్లా టిఎన్జీవోనేత రంగరాజు ఇంటిపై దాడి చేసారు. అనేక సార్లు ఉద్యోగ నేతలను అరెస్టు చేశారు. దీనికి నిరసనగా ప్రజలు జిల్లా బంద్ నిర్వహించి తమ నిరసనను తెలిపారు. 87 పోలీస్‌స్టేషన్లలో 4892 మంది ఉద్యోగులపై కేసులు నమోదు చేసారు. ఇందులో మహిళా ఉద్యోగులు 216 మంది ఉండడం ఉద్యమంలో వారి భాగస్వామ్యాన్ని సూచిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ పోలీస్ సంఘం, తెలంగాణ పోలీస్ సమస్యలు పట్టించుకోవడం లేదని భావించి సంఘం పెట్టుకుంటామని టీఎన్జీవో భవన్‌కు వచ్చిన సందర్భంలో అన్ని శాఖలలోని తెలంగాణ పేరు మీద సంఘాలు ఉన్నాయి. మీరు కూడా పెట్టుకోవచ్చు అని సూచన చేసినందుకు ఉద్యోగుల ఐకాస నేతలపై బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో రాజద్రోహ నేరం చేసినట్లు కేసులు నమోదు చేశారు. రైల్‌రోకోలో పాల్గొనాలని ప్రజలను రెచ్చగొట్టారన్న ఆరోపణతో ఉద్యోగ సంఘాల నేతలందరిపై 38 పోలీస్ స్టేషన్లలో రైల్వే కేసులు నమోదు చేసారు. నల్లగొండ జాతీయ రహదారిపై బస్సులను నిలిపివేసారని వందలాది ఉద్యోగులను అరెస్ట్ చేసి కొందరిపై నాన్ బెయిల్‌బుల్ కేసులు పెట్టి 30 రోజులు జైల్లలో నిర్బంధించారు. సమ్మె తీవ్రమవుతున్న సందర్భంలో నిర్బంధం ద్వారా ఉద్యమాన్ని నడిపించడం సాధ్యం కాదని, ఉద్యోగులను చీల్చాలనే ప్రయత్నం ప్రారంభించింది. సింగరేణిలో ఉన్న ట్రేడ్ యూనియన్లలో ఒత్తిడి తెచ్చి సమ్మె విరమణకు అనివార్య పరిస్థితి కల్పించింది. ఉపాధ్యాయుల సమ్మెకు నాయకత్వం వహిస్తున్న సంఘ నేతలతో కాకుండా ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ప్రమేయంతో ఒప్పందం చేసుకొని విరమించింది. ఉపాధ్యాయులు వ్యతిరేకించినా నాయకత్వం వెనక్కి తగ్గకుండా ప్రభుత్వ ఒప్పందంపై సంతకాలు చేసింది.

ఆర్‌టిసిలో సమ్మెకు నోటీస్ ఇచ్చిన టీఎన్ఎంయు నేతలతో ఒప్పందం చేసుకొని కార్మికులను చీల్చే ప్రయత్నం చేస్తే కార్మికులు తీవ్రంగా ప్రతిఘటించి సమ్మెను కొన్ని రోజులు కొనసాగించినా నిలబడలేకపోయింది. సమ్మె విరమించాలని అనేక డిపార్టుమెంట్ల నాయకత్వాలను పిలిచి సమ్మె మానాలని ఒత్తిడి తెచ్చిన ఉద్యోగులు సమ్మె కొనసాగింపుకై నిర్ణయించారు. మరోవైపు టీచర్లు, సింగరేణి, ఆర్‌టిసి ఉద్యోగులు సమ్మె విరమించడంతో ఉద్యోగులపై ఒత్తిడి పెరిగింది. 42 రోజుల తర్వాత అనివార్య పరిస్థితిలో సమ్మెను వాయిదా వేయడానికి జెఏసి నిర్ణయించింది. ఉద్యోగుల మధ్య ఐక్యతను దెబ్బ తీయడానికి సమ్మెలో పాల్గొన్న శక్తులను రెండుగా విభజించి లెక్చరర్స్, ఉపాధ్యాయులకు సమ్మె కాలాన్ని వేతనంగా ప్రకటిస్తూ ఉత్తర్వులిచ్చి, ఉద్యోగులకు మాత్రం జీవో 177 ప్రకారం నో వర్క్, నో పే అని ప్రకటించింది. దీనితో ఉద్యోగులు, తెలంగాణ ప్రజల కోసం చేసిన సమ్మె కాలానికి హాఫ్ పే లీవ్/ఎర్న్‌డ్ లీవ్ మంజూరు చేయాలని ప్రతిపాదించింది. 4 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఉద్యోగులను వేధించింది. మార్చ్ 2న, అక్టోబర్ 24న కుదిరిన ఒప్పందాల లోని అంశాలను అమలుచేయాలని, అక్రమ కేసులను ఎత్తివేయాలని, సమ్మె కాలాన్ని రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో మళ్ళీ ఉద్యమ కార్యాచరణ ప్రకటించాల్సి వచ్చింది.

సహాయ నిరాకరణలో పూర్తిగా ప్రేక్షక పాత్ర పోషించిన రాజకీయ వ్యవస్థ, సకల జనుల సమ్మె కాలంలో జేఏసీ భాగస్వామ్యం పార్టీలను ప్రజలను కదిలించడంలో కొంత మేరకు విజయం సాధించగలిగాయి. సకల జనుల సమ్మె ప్రజలలో అనేక కొత్త ఉద్యమ ఆలోచనలకు తెరలేపింది. సమ్మె తెలంగాణ ద్రోహులెవరో, మిత్రులెవరో తేల్చేసింది. 42 రోజులు రాజ్యాంగ బద్ధంగా, శాంతియుతంగా సమ్మె చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కదలకపోవడం ప్రజల్లో మరింత కసిని పెంచింది. అలాగే రాజకీయ ప్రజాప్రతినిధులపై, ఆక్రోశం పెరిగింది. భవిష్యత్ తెలంగాణ ఐక్యతతో నిర్వహిస్తూనే, కలిసివచ్చే రాజకీయ శక్తులతో రాజకీయ ప్రజాప్రతినిధుల మీద ఒత్తిడి తెచ్చే కార్యక్రమం కొనసాగింది.

ఆ తరువాత తెలంగాణ జెఏసి నాయకత్వంలో నిరంతరంగా అనేక పోరాటాలకు రూపకల్పన చేసింది. సాగరహారం, ఛలో అసెంబ్లీ, సంసద్ యాత్ర, సకల జనభేరి లాంటి అనేక ఉద్యమాలలో ఉద్యోగులు భాగస్వామ్యమయ్యారు. ఉద్యోగులు చేస్తున్న పోరాటాల పట్ల ప్రజలలో పెల్లుబికిన ఆదరణ గతంలో ఉద్యోగులు ప్రజలమధ్య ఉండే గీతను చెరిపివేసింది. నిరంతర ఉద్యమాలు ఒత్తిడితో, వేలాది మంది అమరుల త్యాగాల ఫలితంగా జూలై 30న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించి ఫిబ్రవరి 18, 19 తేదీలలో పార్లమెంట్, అసెంబ్లీలో బిల్లు, మార్చ్ 2న రాష్ట్రపతి ఆమోదం పొందింది. జూన్2, తెలంగాణ రాష్ట్రం భారతావనిలో 29వ రాష్ట్రముగా ఆవిర్భవించింది.

కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన విభజన బిల్లులో అనేక విషయాలు తెలంగాణ ప్రజల మనోభావాలకు తెలంగాణ పురోగాభివృద్ధికి అడ్డంగా ఉన్నాయి. ముఖ్యంగా ఉద్యోగుల, పెన్షనర్ల

విభజనలో జిల్లా, జోనల్, మల్టీజోనల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎక్కడి వారు అక్కడే ఉంటారనే ప్రతిపాదన అన్యాయమైంది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జిల్లాస్థాయిలో 20 శాతం జోనల్ స్థాయిలో 30 శాతంగా ఉన్న ఓపెన్ కోటాను నాన్ లోకల్ కోటాగా మార్చి 70000 ఉద్యోగాలు, తెలంగాణ ప్రాంతానికి దక్కకుండా పోయాయని తెలంగాణ ఉద్యోగ సంఘాలు ఎన్నో ఏళ్లుగా ఉద్యమిస్తూనే ఉన్నాయి. వీటి పై వేసిన కమిటీలు ఉద్యోగులు చేసిన అరోపణలు నిజమైనవేనని గిర్‌గ్లాని కమీషన్ నిర్ధయించింది.

అందువలన ఉద్యోగుల విభజనలో గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలు, జీవో 36, జోవో 610 గిర్‌గ్లానీ కమీషన్, ఏక సభ్య కమిటి ఇచ్చిన నివేదికల ఆధారంగా విభజన జరగాలి, వీటిని స్థానికత ఆధారంగా జరపాలి.

సచివాలయం, హెచ్‌ఓడిలో విభజన జనాభా నిష్పత్తి ప్రకారం జరుపుతమనడం అమానుషం. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు-2014 77వ అధికరణ ఉద్యోగుల విభజనకు సంబంధించి పలు సూచనలు చేసింది. సుమారు 13 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్న అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు విభజన జరుగుతున్నది కేవలం 76 వేల మందినే అది కూడా సచివాలయ హెచ్‌ఓడీలలో మాత్రమే జరుగుతున్నవి. సమస్య కేవలం ఇక్కడే లేదు. జిల్లాల్లో పనిచేస్తున్న స్థానికేతరులను పంపించకుండా కేవలం రాష్ట్రస్థాయిలో విభజనను చేపట్టడం వలన అనేక ఉల్లంఘనలతో తెలంగాణలో తిష్టవేసిన స్థానికేతరులు స్థానికులుగా చెలామణి అయ్యే పరిస్థితి చట్టబద్ధంగానే జరుగుతున్నది. పోలీసుశాఖ, విద్యాశాఖ, వైద్య శాఖ, రెవెన్యూ, పంచాయితీరాజ్ ఒక్కటేమిటి అన్ని శాఖల్లో అన్ని జిల్లాల్లో పనిచేసే వారిని కూడా స్థానికత ఆధారంగా పంపించాల్సి ఉండే. కానీ ఇప్పుడు జరుగుతున్నది కేవలం సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు కాబట్టి వాటికి సంబంధించిన అశాస్త్రీయ ధోరణులను ప్రశ్నించాల్సి ఉంది. సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగిని రాష్ట్రస్థాయిగా గుర్తించి జనాభా దామాషాలో 58.32% సీమాంధ్రకు, 41.68% తెలంగాణకు మొదట ఖాళీలను, తదుపరి వ్యక్తులను పంచుతున్నారు. అసలు (క్యాడర్ స్ట్రెంత్) మంజూరు అయిన పోస్టులను పక్కనపెట్టి కేవలం పనిచేస్తున్న (వర్కింగ్ స్ట్రెంత్)వారిని విభజించడం వలన అనేకమంది సీమాంధ్ర ఉద్యోగులు తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసినవారు, సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్నవారు తెలంగాణ సచివాలయంలో, శాఖాధిపతుల కార్యాలయాల్లో పనిచేసే పరిస్థితి వస్తున్నది. అలాగే తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగులు, జీపు డ్రైవర్లు, లిఫ్ట్ ఆపరేటర్‌లు, స్వీపర్‌లు, ఎన్జీవోలు-సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్ తదితరులు హెచ్‌ఓడీలలో అట్లాగే కొంత మిగులుగా ఉన్న ఎన్జీవోలు సచివాలయంలో సీమాంధ్రకు వెళ్లాల్సి వస్తున్నది. తెలంగాణలో ఖాళీలున్నప్పటికీ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారు తమ అభీష్టానికి భిన్నంగా సీమాంధ్రలో పనిచేయాల్సిన దుస్థితి వచ్చింది. దీనికి ప్రధాన కారణం సీమాంధ్ర ఉద్యోగుల పిల్లలు ఇక్కడే చదివి ఇక్కడ స్థానికతలో ఉద్యోగాలు పొందడం, కర్ణాటక, గుజరాతీయుల, మహా రాష్ట్రీయులు తదితర ప్రాంతాల వాళ్లు రాష్ట్రస్థాయి కార్యాలయాల్లో నియమించబడిన వారిని తెలంగాణకు కేటాయించడం తదితర అనేక కారణాలతో తెలంగాణ బిడ్డలు సీమాంధ్రకు, సీమాంధ్ర బిడ్డలు తెలంగాణలో పనిచేయాల్సి రావడం జరుగుతున్నది. ఈ మొత్తం చర్యల్లో స్థానికతకు పాతరేయడం జరుగుతున్నది. అలాగే జిల్లాల్లో పనిచేస్తున్న రాష్ట్రస్థాయి అధికారులను, జిల్లా, జోనల్ స్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులను ఎక్కడ వారిని అక్కడే ఉంచడం వల్ల కూడా సీమాంధ్రలో కొద్దిమంది తెలంగాణలో బిడ్డలు పనిచేయాల్సి వస్తున్నది. దరిమిలా తెలంగాణలో వేలాదిగా సీమాంధ్ర ఉద్యోగులు చట్టబద్ధంగా ఉండిపోయే పరిస్థితి వస్తున్నది.

ఇక శాఖాధిపతుల కార్యాలయాల్లో విభజన తీరుతెన్నులు చూస్తే పిఎఓ శాఖలో జనాభా ప్రాతిపదికన కాకుండా పనిభారం(వర్క్‌లోడ్) ఆధారంగా ఉద్యోగుల విభజన చేస్తామనడం, అలాగే ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ విభాగంలో కార్మికుల ప్రీమియం ఆధారంగా చేయకుండా జనాభా ప్రాతిపదికన చేయడం వల్ల తెలంగాణలో సీమాంధ్ర ఉద్యోగులు అధికంగా ఉండడానికి దారులు చూపుతున్నారు. కొన్ని శాఖల్లో జోనల్, మల్టీజోనల్ పోస్టులు(హెచ్‌ఓడిలలో ఉండే వాటిని) విభజిస్తూ మరికొన్ని శాఖల్లో ముట్టుకోకపోవడం సింగిల్ క్యాడర్ పోస్టులన్నింటిని ఆంధ్రకు కేటాయించడం, హెచ్‌ఓడిలను కూడా కేవలం సీమాంధ్రకే కేటాయించడం తదితర అనేక అంశాల్లో ఉద్యోగుల జెఎసి చేసిన సూచన స్థానికత ఆధారంగా వారిని తమ ప్రాంతాలకు పంపాలనే డిమాండ్‌ను కనీసం పరిశీలించకుండా ఆర్థికశాఖ, సాధారణ పరిపాలన శాఖ సిజిజి(సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) కాస్తా బ్యాడ్ గవర్నెన్స్‌గా పనిచేస్తున్న తీరు చాలా దురదృష్టకరం. ఇదేకాకుండా మొదట అనాలోచితంగా 10వ షెడ్యూల్‌లో చేర్చిన శాఖలను ఇప్పుడు విభజనకు అనుమతిస్తూ దాదాపుగా 38 శాఖలను అదనంగా 10వ షెడ్యూల్‌లో చేర్చడం వంటి తదితర అనేక ఉల్లంఘనలు కళ్లకు కనిపించకుండా చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖలో లెక్కకు మించి హెచ్‌ఓడిలను చూపించిన వారు ఇప్పుడు మాత్రం కొన్నింటినే హెచ్‌ఓడిలుగా చూపి ఆంధ్ర వాళ్లు ఎక్కువగా పనిచేస్తున్న కార్యాలయాలను లోకల్ క్యాడర్ పోస్ట్స్/ కార్యాలయాలుగా చూపుతున్నారు. అలాగే పోలీసు శాఖలో సిటీ సైబరాబాద్ కమీషనరేట్‌లను మొదట హెచ్‌ఓడిలుగా చూసి ఇప్పుడు విభజన నుంచి మినహాయింపు ఇచ్చి ఇక్కడ పనిచేస్తున్న అన్ని

స్థాయి స్థానికేతర ఉద్యోగులను తెలంగాణలో కొనసాగించే కుట్ర చేస్తున్నారు. దీనికి నిలువెత్తు సాక్ష్యం తేది12.5.2014న జారీచేసిన జీవో 100, ఇందులో కేవలం(139) శాఖలనే హెచ్ఓడిలుగా చూపారు. మరి గతంలో(204) హెచ్ఓడిలు ఏమైనట్లు? కుట్రకాదా?

విభజన జరుగుతున్న సమయంలో సచివాలయంలో సుమారు 4500 మంది పనిచేస్తుంటే కేవలం 1857 మంది స్థానికత వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచడం వలన తెలంగాణ వాళ్ల అభ్యంతరాలకు అవకాశమిచ్చారు. అదే పద్ధతిలో ప్రతి హెచ్ఓడి కార్యాలయంలో ప్రతి ఉద్యోగి స్థానికతను బహిర్గతం చేస్తే అభ్యంతరాలను స్వీకరించిన తరువాతనే తాత్కాలిక జాబితాను సిద్ధం చేయాల్సి ఉండగా మొత్తం విభజన అనేది అత్యంత గోప్యంగా ఉంచడం అంటేనే కుట్రలు అర్థమౌతున్నాయి. అసలు విభజనకు సంబంధించి మార్గదర్శకాలే తెలంగాణ ఉద్యోగులకు సమ్మతంగా లేనపుడు తాత్కాలిక కేటాయింపులు జరుపడం అప్రజాస్వామికం. ఈ ధోరణులను ప్రశ్నిస్తూ ఉద్యోగులు కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితికి తెచ్చి మొత్తం విభజన ప్రక్రియను గందరగోళంలోకి నెట్టేయడానికి సీమాంధ్ర అధికారులు కుట్రలు పన్నుతున్నారు.

ప్రభుత్వం వేసిన 21 కమిటీలు ఉద్యోగుల విభజన, ఇతర అంశాలపై సరైన పద్ధతిలో సూచనలు చేయకుండా, కమిటీలలో ఉన్న ఆంధ్రా అధికారుల ఆలోచననే మార్గదర్శకాలుగా వెలువడ్డాయి. మార్చ్ 1న అపాయింటెడ్ డేట్ వచ్చినప్పటికి ప్రభుత్వం సరైన కార్యాచరణ లేకపోవడం వలన జూన్ 2వ తేదీ వరకు తాత్కాలిక జాబితా ఇవ్వాలనే తొందరలో అనేక తప్పుల తడకలతో జాబితా విడుదలయ్యింది. ఇందులో అనేక లోపాలు ఉన్న విషయాన్ని మే 29న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉద్యోగసంఘాల తీవ్ర అభ్యంతరం తెలియజేశాయి. స్థానికత ఆధారంగా ఉద్యోగుల విభజన జరగాలని అన్ని సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. తెలంగాణ ఉద్యమంలో నాయకత్వం వహించిన అనేకమంది టిఎన్జీవో, నాల్గవ తరగతి ఉద్యోగులను ఆంధ్రాకు, సమైక్యాంధ్ర ఉద్యమంలో నాయకత్వం వహించిన అనేకమంది ఉద్యోగులను తెలంగాణకు కేటాయింపు జరిగింది. ఈ విషయాన్ని నూతన ముఖ్యమంత్రి దృష్టికి తీసకొచ్చిన తర్వాత ప్రభుత్వం ఒక కమిటీని వేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి, తెలంగాణ ఉద్యోగులు, తెలంగాణలోనే పనిచేసే విధంగా ప్రయత్నిస్తారని హామీ ఇవ్వడం ఉద్యోగులలో కొంత ఆందోళన దూరమైంది.

జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో(క్షేత్రస్థాయి)లో పనిచేస్తున్న ఆంధ్రా ఉద్యోగుల విషయంలో, ఆంధ్రలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగుల సమస్య పరిష్కారం కావలసి ఉంది. ఓపెన్ కోటాను నాన్‌లోకల్ కోటాగా మార్చి తెలంగాణ ప్రాంతంలో ఉన్న 45000 ఆంధ్రా ఉద్యోగులను వారి ప్రాంతాలకు పంపించాలి. ఇందులో 80% ఉద్యోగులు స్వచ్ఛందంగా పోవడానికి సిద్ధంగా ఉన్నా, ప్రస్తుతం ఉన్న నిబంధనలు అనుమతించడం లేదు. రెండు ప్రాంతాల ఉద్యోగులు తమ ప్రాంతాలలో జరిగిన ఉద్యమాలలో కీలక భూమిక పోషించడం వలన ఇతర సమస్యల కంటే ఉద్యోగుల సమస్య ప్రధాన కేంద్రంగా మారింది. తెలంగాణ ఉద్యోగులు తమ ఉద్యోగాల కోసం 1956 నుంచి నిరంతరంగా పోరాడుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఆకాంక్షలను గమనంలోకి తీసుకొని ఉద్యోగుల విభజన సులభతరం చేసి రెండు ప్రాంతాల ఉద్యోగుల మధ్య ఘర్షణ వాతావరణం లేకుండా చూడాల్సిన బాధ్యత ఉంది.

గత ఆరు దశాబ్దాలుగా అనేక వివక్షలకు, అసమానతలకు, అన్యాయాలకు, వ్యతిరేకంగా పోరాడిన ప్రజల ఆకాంక్షలు నెరవేరే విధంగా తెలంగాణ పునర్నిర్మాణం జరగాలి. గత మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ సర్వీస్‌లలో నియామకాలు జరగకుండా సరళీకృత ఆర్థిక విధానాలు ప్రపంచ బ్యాంక్ విధానాలు, ప్రభుత్వాల మీద పెత్తనం చేస్తున్న కార్పోరేట్ సంస్కృతిని ఎదిరించే విధంగా రాబోయే తెలంగాణ ప్రభుత్వం ఉద్యమించాల్సిన స్థితి ఉంది.

తెలంగాణ పల్లెల్లో వేలాది మంది అనేక ఉద్యమాలలో వివిధ పద్ధతులలో తమ ప్రాణాలను అర్పించారు. ప్రతి పల్లె దు:ఖ పూరితమైన క్షోభ అనుభవిస్తున్నది. తల్లిదండ్రులు తమ పిల్లల మరణంతో వచ్చిన తెలంగాణ తమ పిల్లల ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలని కోరుకోవడంలో న్యాయం ఉంది. తెలంగాణ రాష్ట్ర విభజన కేవలం కొందరిని ముఖ్యమంత్రిగా, మంత్రులుగా, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా చేయడానికి కాదని నిరూపించాలి. ఇంతకాలం అనేక అవకాశాలకు దూరంగా ఉన్న అన్ని వర్గాలకు న్యాయం జరగాలి. స్వేచ్ఛ, సమానత్వం, మానవ హక్కుల కోసం జీవించే హక్కులాంటి ముఖ్యమైన అంశాలు రక్షించే విధంగా పరిపాలన కొనసాగాలి.

కేవలం పదవులు విభజనకు పరిమితమై, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా పరిపాలన కొనసాగిస్తే మరో ప్రజా ఉద్యమం తప్పదు. ఇప్పటికే తెలంగాణ ప్రజా ఉద్యమంతోపాటు ఆరు దశాబ్దాలుగా తెలంగాణ నేలమీద జరిగిన అనేక సామాజిక ఉద్యమాల వెలుగులో ఏర్పడిన ఉద్యమం అన్ని వర్గాలను చైతన్యం చేసింది. వేలాది జేఏసిలు, ప్రజాసంఘాలు, ఏర్పడ్డాయి. అన్యాయాలను, అక్రమాలను మౌనంగా చూస్తూ ఊరుకోరనే ఆత్మవిశ్వాసం కలుగుతున్న సందర్భంలో తెలంగాణను ఆదర్శరాష్ట్రంగా తీర్చి దిద్దడానికి అందరం శ్రమిద్దాం. పని గంటలతో సంబంధం లేకుండా 29వ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో పనిచేసి ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రతినబూనుదాం. ❖

# తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల కల నెరవేరేనా!

సిలువేరు హరినాథ్
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధకుడు)

***తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం యావత్ తెలంగాణ ప్రజలు చేసిన ప్రజా పోరాటం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం తలొగ్గక తప్పలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇవ్వక తప్పలేదు. పది జిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్రం 1,14,840 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో 3.519 కోట్ల మంది జనాభాతో ఏర్పడటం చారిత్రక ఘట్టం. అరవై సంవత్సరాల కల నెరవేరిన వేళ లక్షలాది మంది నిరుద్యోగులు తమకు మంచి భవిష్యత్తు, విద్యా ఉపాధి అవకాశాలు అందుతాయనే భావనలో ఉన్నారు. ఇప్పటికే లక్షలాది మంది వేలకు వేలు వెచ్చించి వివిధ రకాల ఉద్యోగ పరీక్షలకు సంబంధించి కోచింగ్ తీసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచిచూస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న విద్యా, ఉపాధి వివరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.***

తెలంగాణ మొత్తం జనాభాలో 1.77 కోట్లు(50.30%) పురుషులు ఉండగా, 1.74 కోట్లు (49.70%) మంది మహిళలు ఉన్నారు. రాష్ట్ర అక్షరాస్యత 66.46 శాతం ఉండగా అందులో 56.53% శాతం పురుషులు, 43.47 శాతం మహిళల అక్షరాస్యత ఉంది. రాష్ట్ర జనాభాలో ఎస్సీలు 15.43 శాతం ఉండగా అందులో పురుషులు 49.79 శాతం ఉంటే మహిళల శాతం 50.21 ఉంది. అదే విధంగా ఎస్టీ జనాభా 9.33 శాతం ఉండగా అందులో పురుషులు 50.50 శాతం ఉండగా మహిళలు 49.50 శాతం ఉన్నారు.

రాష్ట్రంలో విద్యా సంస్థల వివరాలు చూసినట్లయితే ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలలు 29,861 ఉండగా ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలు 12,924 ఉన్నాయి. అదే విధంగా ఇంజనీరింగ్ కళాశాలలు 17 ప్రభుత్వ ఆధీనంలో ఉండగా 336 ప్రైవేటు ఆధీనంలో ఉన్నాయి. వైద్య కళాశాలల్లో మొత్తం 21 ఉండగా అందులో 4 ప్రభుత్వ 17 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఎం.సి.ఏ కళాశాలలు మొత్తం 197 ఉండగా అందులో 180 ప్రైవేటు కళాశాలలు, 17 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. అదే విధంగా ఎం.బి.ఏ. కళాశాలలు మొత్తం 496 ఉండగా అందులో 478 ప్రైవేటు, 18 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. అదే విధంగా టీచర్ ట్రైనింగ్ కళాశాలలు మొత్తం 255 ఉన్నాయి. అందులో 253 ప్రైవేటు, రెండు ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. అదే విధంగా పాలిటెక్నిక్ కళాశాలలు మొత్తం 186 ఉండగా అందులో



131 ప్రైవేటు, 55 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. అదే విధంగా ఫార్మసీ కళాశాలలు మొత్తం 168 ఉండగా 164 ప్రైవేటు, 4 ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. అదే విధంగా 18 లా కళాశాలల్లో 14 ప్రైవేటు 4 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. డిగ్రీ కళాశాలలు మొత్తం 1063 ఉండగా అందులో 944 ప్రైవేటు కళాశాలలు ఉండగా 119 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. అదే విధంగా 404 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. భారి, మధ్య, చిన్న తరగతి పరిశ్రమలు మొత్తం 1,03,571 ఉండగా అందులో మొత్తం 17,43,782 మందికి పరిశ్రమల ద్వారా ఉపాధి దొరికింది.

మొత్తం 72 ప్రకటిత ఆర్థిక మండల్లలో 40 మండల్లు హైదరాబాద్ చుట్టు ప్రక్కలే ఉన్నాయి. వీటిలో 35 రంగారెడ్డి జిల్లాలోనే ఉన్నాయి. రక్షణ జాతీయ భద్రతకు సంబంధించి వ్యూహాత్మకంగా ఎంతో ప్రధాన్యం గల 28 సంస్థలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. జాతీయ పరిశోధన అభివృద్ధి, విద్యా అంశాలకు చెందిన కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇక్కడే ఉన్నాయి. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మద్దతుతో నడుస్తున్న తొమ్మిది విద్యా సంస్థలు ఇక్కడే ఉన్నాయి.

అదే విధంగా విశ్వ విద్యాలయాల విషయానికొస్తే ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, మహాత్మగాంధీ, పాలమూరు, జె.ఎన్.టి.యు. హైద్రాబాద్, పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జె.ఎన్.టి.యు. సైన్స్ & ఆర్ట్స్ లాంటి విద్యాలయాలు ఉన్నాయి. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడిచే హైదరాబాద్ విశ్వ విద్యాలయాలు, ఇంగ్లీష్ అండ్ ఫారెన్ ల్యాంగ్వేజెస్, ఐ.ఐ.ఐ.టి. లాంటి విద్యాలయాలు ఉన్నాయి.

రాష్ట్రంలో సుమారుగా 53.45 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఇందులో 22,20,578 మంది రాజీవ్ యువ కిరణం పేరున ఉపాధి దొరుకుతుందని తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ విధంగా పేర్లు నమోదు చేసుకున్న వారిలో పదవ తరగతి నుండి బి.ఇడి., బి.టెక్, చదువులు పూర్తి చేసిన నిరుద్యోగులు ఉండడం విశేషం. అయితే వీరిలో 2,78,818 మందికే ఉపాధి చూపించినట్లు ప్రభుత్వ లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఉపాధి చూపించిన వారిలో ప్లేస్‌మెంట్ సరిగ్గా లేక దాదాపు 70 వేల మంది వెనక్కు తిరిగి వచ్చారు. మరికొన్ని సంస్థలు ఉపాధి అవకాశాలు చూపించినట్లు రికార్డుల్లో లెక్కలు రాసి, మోసం చేయడంతో వారందరూ నిరుద్యోగులుగానే మిగిలిపోయారు. ఈ విధంగా రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది నిరుద్యోగులుగానే మిగిలిపోయారు. వీరిలో 21 శాతం మందికి ఉద్యోగాల వయోపరిమితి దాటిపోవటంతో పెద్దపెద్ద చదువులు చదివి కూలినాలి చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయనే ఆశతో లక్షలాది నిరుద్యోగులు ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో కొందరికి ప్రైవేటు ఉద్యోగాలు లభించినా వాటి సమాచారం సంబంధిత ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ అధికార్లకు తెలపకపోవడంతో అటువంటి వారు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాకపోవడంతో ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లో నమోదు చేసుకోవడం వృధా అనుకొని

**రాజీవ్ యువ కిరణాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు**

**ఉపాధి కల్పించిన వారి వివరాలు 2013 మార్చి నాటికి**

| అర్హత | నమోదు చేసుకున్న నిరుద్యోగుల సంఖ్య | ప్లేస్‌మెంట్ కల్పించిన సంఖ్య | శాతం |
|---|---|---|---|
| SSC Pass | 6,76,324 | 1,01,408 | 15 |
| Inter Pass | 4,19,220 | 55,732 | 13 |
| SSC Fail | 4,12,845 | 33,519 | 08 |
| Degree Pass | 2,92,226 | 3,44,767 | 15 |
| BEA, PG, B. Pharmacy | 1,19,372 | 3,542 | 03 |
| IIT | 88,208 | 10,166 | 12 |
| B. Tech Pass | 73,784 | 6,998 | 09 |
| Inter Fail | 59,047 | 7,863 | 13 |
| Degree Fail | 47,181 | 5,565 | 12 |
| Polytechinc | 38,295 | 5,214 | 14 |
| B. Tech Fail | 2,076 | 54 | 03 |
| **Total** | **22,28,578** | **2,74,818** | |

### జిల్లాల వారిగా ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు

| జిల్లా | రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంఖ్య | సెంట్రల్ క్యాజీ గవర్నమెంట్ ఉద్యోగుల సంఖ్య | స్టేట్ క్యాజీ గవర్నమెంట్ ఉద్యోగుల సంఖ్య | లోకల్ బాడీ...... పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య | మొత్తం |
|---|---|---|---|---|---|
| మహబూబ్ నగర్ | 17,443 | 963 | 7,998 | 14,634 | 41,038 |
| రంగారెడ్డి | 5,380 | 15,960 | 12,016 | 4,138 | 37,494 |
| మెదక్ | 22,295 | 8,250 | 6,067 | 3,912 | 40,474 |
| నిజామాబాద్ | 9,377 | 862 | 16,053 | 880 | 27,272 |
| కరీంనగర్ | 24,055 | 4,755 | 31,228 | 2,153 | 62,191 |
| వరంగల్ | 11,107 | 3,351 | 14,440 | 4,392 | 33,290 |
| ఖమ్మం | 9,206 | 2,881 | 20,955 | 2,981 | 36,023 |
| నల్గొండ | 2,050 | 974 | 2,499 | 521 | 6,044 |
| హైద్రాబాద్ | 48,192 | 32,006 | 41,196 | 8,280 | 1,29,674 |
| **తెలంగాణ మొత్తం** | 1,59,649 | 71,057 | 1,55,559 | 50,332 | 4,36,597 |

పలువురు విద్యార్థులు వాటి వైపే కన్నెత్తి చూడడం లేదు. దీంతో ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లో నమోదు చేసుకున్న వారికంటే నమోదు చేసుకోనివారే లక్షలాది మంది ఉన్నట్లు ప్రభుత్వ అధికారులే అంగీకరిస్తున్నారు. రాష్ట్రంలో గత పదేళ్ళుగా ప్రభుత్వ ఉద్యోగాలు పూర్తి స్థాయిలో ప్రభుత్వాలు చేపట్టలేదు. అయితే తమకు అవసరమున్న చిన్న చిన్న పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన ఏజెన్సీల ద్వారా నియామకాలు చేసుకుంది. అవి కూడా ఏజెన్సీ వారు వారికి తెలిసిన వాళ్ళనే నియమించుకున్నారు.

అలాగే కేవలం అత్యవసరమైన ఉపాధ్యాయ తదితర పోస్టుల భర్తీ మాత్రం ప్రభుత్వాలు చేపట్టాయి. గత ఏడాది వి.ఆర్.ఏ., వి.ఆర్.ఓ. పంచాయతీ కార్యదర్శుల పోస్టులతో పాటు సర్వీస్ కమీషన్ ద్వారా మరికొన్ని పోస్టులు అంతంత మాత్రమే గత ప్రభుత్వం భర్తీ చేసింది. అంతే తప్ప రాష్ట్రంలో ఉన్న పోస్టులను ఏళ్ళ తరబడి భర్తీ చేయడం లేదు. దీంతో చదువుకొని ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తున్న నిరుద్యోగుల సంఖ్య ఏటా పెరుగుతూ వస్తుంది. ఇంట్లో తల్లిదండ్రులకు భారమై కుటుంబ పోషణ జరిగే అవకాశాలు లేక పలువురు నిరుద్యోగులు తీవ్ర మానసిక వ్యధను అనుభవిస్తున్నారు. ఉన్నత చదువులు చదివి కూలినాలి పనులు చేయలేక నిరుద్యోగులుగానే మిగిలి పోతున్నారు.

పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఎక్కువగా హైదరాబాద్‌లో ఉన్న కారణంగా ఏటా ఇక్కడికి 10.6 శాతం మంది ప్రజలు వలస వస్తున్నారు. ఇతర ప్రాంతాలలో ఇటువంటి వలసలు ఒక శాతం లోపే. ఇక్కడికి వలస వచ్చినవారిలో 15.9 శాతం మంది ఉద్యోగాల



అన్వేషణకోసం, 57.4 శాతం మంది ఉపాధి వ్యాపారాల నిమిత్తం, 24.1 శాతం మంది విద్యాభ్యాసం కోసం వచ్చేవారే.

ఉద్యోగాల భర్తీ కేవలం నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమనే కారణంతో చూడరాదు. వారి శక్తియుక్తుల్ని రాష్ట్ర అభివృద్ధికి వినియోగిస్తామనే కోణంలోనే చూడాలి. అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలు ప్రతిభావంతుల్ని ఆహ్వానించి, వారికి మంచి ఉద్యోగాలు ఇచ్చి, వారి శక్తి సామర్థ్యాలను తమ దేశ అభివృద్ధికి వినియోగించుకొంటున్నాయి. మన దేశంలో కూడా మల్టీనేషనల్ కంపెనీలు, బడా కార్పోరేట్ సంస్థ ప్రతినిధులు ఏరి కోరి హెచ్చు జీతాలు ఇచ్చి తమ సంస్థల అభివృద్ధికి వినియోగించు కుంటున్నారు.

రెవెన్యూ శాఖలో అన్ని కేటగిరిలో కలిపి 18 వేలకుపైగా పోస్టులు భర్తీకాకుండా ఖాళీగా ఉన్నాయి. హోమ్ శాఖలో, కానిస్టేబుల్లు, జైలు వార్డెన్లు, ఫైర్‌మెన్ ఉద్యోగాలు మొత్తం 35వేలు. సబ్ ఇన్స్‌పెక్టర్లు, 3 వేలు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అందువల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్న ఇబ్బంది అందరికి తెలిసిందే. ట్రాన్స్‌కో, జెన్‌కోలో ఇతర డిస్కమ్‌లలో 35 వేల ఖాళీలు ఏళ్ళ తరబడి భర్తీ చేయకుండా ఉన్నాయి. ప్రస్తుతం ఒక్కొక్క అసిస్టెంట్ ఇంజనీర్ రెండు సబ్ స్టేషన్స్ చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇంజనీర్లు, హెల్పర్లు, లైన్‌మెన్‌లు, లేక విద్యుత్ శాఖ వెలవెలబోతుంది. ఇటీవల విద్యుత్ శాఖలో 13వేల ఖాళీలున్నట్లు ప్రకటించింది. పాఠశాల విద్యలోనే 35 వేల ఉద్యోగాలతో పాటు 8 వేల బోధనేతర సిబ్బంది పోస్టులున్నా భర్తీ చేయలేదు. ఏయిడెడ్ పాఠశాలలో బోధన, బోధనేతర పోస్టులు 5 వేలకు పైగా ఉన్నాయి. జిల్లా పరిషత్ పంచాయితీ రాజ్ సంస్థల్లో అన్ని కేటగిరీలు కలిపి 14వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మున్సిపాలటీ, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో 13వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేయాలి. ప్రభుత్వ కాలేజీల్లో, జూనియర్ లెక్చరర్లు 8వేలు, డిగ్రీ లెక్చరర్లు 2వేలు, బోధనేతర సిబ్బంది 4 వేలకు పైగా భర్తీ కాకుండా ఉన్నాయి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయల్లో 1000పైగా ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 2000 బోధనేతర సిబ్బంది పోస్టులు ఏళ్ళ తరబడి భర్తీ కాకుండా ఉన్నాయి. ఏయిడెడ్ కాలేజీల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులు 2 వేలకు పైగా ఖాళీగా ఉన్నాయి. 10జిల్లా గ్రంథాలయాల సంస్థల్లో 300 పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సాంకేతిక, ఉపాధి, కార్మిక శాఖలలో 3600 ఉద్యోగాలు భర్తీ చేయవలసి ఉంది.

సాంఘిక, గిరిజన, బి.సి. సంక్షేమ శాఖలు, వికలాంగుల సంక్షేమ శాఖల్లో వార్డెన్లు, కుక్‌లు, ఇతర ఉద్యోగాలు కలిపి 8400 పైగా ఉన్నాయి. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 3200 పోస్టులు భర్తీ కావాలి. నీటి పారుదల శాఖలో 6400 పోస్టులు, వైద్య ఆరోగ్య శాఖలో మొత్తం 16 వేల పోస్టులు భర్తీ కావాలి. ఎక్సైజ్ శాఖలో 15వేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాణిజ్య శాఖలో 4200 పోస్టులు, సహకార–ఆప్కో తదితర అనుబంధ సంస్థల్లో 5300, పశుసంవర్ధక శాఖలో 2200, స్త్రీ శిశు సంక్షేమ శాఖలో 6800, వ్యవసాయ శాఖలో 4200, రోడ్లు భవనాల శాఖలో 3200, సెక్రెటేరేట్‌లో వివిధ డైరెక్టర్ కార్యాలయాల్లో 4000, ఆర్టీసీలో 3200, దేవాదాయ ధర్మాదాయ శాఖలో 13500, పోస్టులు భర్తీ చేయవలసి ఉంది.

**ఉమ్మడి రాష్ట్రంలో 2006 నుంచి 2012 వరకు పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు**

| సంవత్సరం | ఉద్యోగుల సంఖ్య |
|---|---|
| 2006 | 33121 |
| 2007 | 29863 |
| 2008 | 36990 |
| 2009 | 32682 |
| 2010 | 39810 |
| 2011 | 37158 |
| 2012 | 40854 |
| 2013 | 41771 |

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ యువత అనేక రకాలుగా ఆంధ్ర పాలకులు, అధికారుల చేతుల్లో మోసపోయారు. అనేక ఉద్యోగాలు శక్తి సామర్థ్యాలు నైపుణ్యత ఉన్నా సాధించలేకపోయారు. సొంత రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర పాలకుల ఎలక్షన్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా హామీలు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఎన్నో సంవత్సరాలుగా అనేక శాఖల్లో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులతో పాటు ఇంకా కొత్త పోస్టులకు శ్రీకారం చుట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. పోస్టుల ఎంపికలో ఎంతో పారదర్శకత, నిబద్ధత అవసరం. దానికి అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని నిరుద్యోగులు కళ్ళల్లో వెలుగు నింపాలి.

ప్రపంచబ్యాంకు షరతులకు తలొగ్గిన గత ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించలేదు. పోరాటం ద్వారా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం తప్పనిసరి ప్రపంచబ్యాంకు విధానాలను అమలు చేయకూడదు. అప్పుడే పోరాడిన ప్రజాభిప్రాయాన్ని గౌరవించిన పాలకులు అవుతారు. లేదంటే ప్రజలు ఒత్తిడితోనైనా తమ ఆకాంక్షలు నెరవేర్చుకుంటారు.

❖

# ఉద్యోగుల స్థానికతను ఎలా నిర్ధారించాలి?

ఎ. జయరాముడు
ప్రభుత్వ ఉపకార్యదర్శి(రిటైర్డ్)

*2014 జూన్ 2న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు చట్టబద్ధంగా ఏర్పడినాయి. రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల పంపకాన్ని ఆల్ ఇండియా సర్వీస్ అధికారులు(బ్యూరోక్రాట్స్) జఠిలం చేశారు. పంపకం సమస్యను పరిష్కరించటానికి కమలనాథన్ కమిటీని నియమించారు. ఇంతవరకు మార్గదర్శకాలు కూడా వెలువడలేదు. తాత్కాలిక పంకం జరిగింది కాని ఇరు ప్రాంతాల ఉద్యోగుల నుంచి ఫిర్యాదుల వెల్లువ ఎక్కువైంది. విషయ పరిజ్ఞానం, కామన్‌సెన్స్ లోపించడం వల్ల గోటితో పోయేదానికి గొడ్డలి కావల్సి వచ్చినంత పని చేశారు. తెలంగాణ, సీమాంధ్ర ఉద్యోగుల మధ్య అనవసరంగా చిచ్చుపెట్టారు. ఉద్యోగుల స్థానికతను నిర్ధారించడంలో బ్యూరోక్రాట్స్ ఘోరంగా విఫలం చెందారు. ఆప్షన్లు తీసుకోవటం రాజ్యాంగ విరుద్ధమని ఈ రచయిత "రాజ్యాంగ బద్ధత లేని విభజన బిల్లు" అనే వ్యాసములో(సూర్య - 1/1/2014) ముందే చెప్పాడు. తరువాత పాలకులు, బ్యూరోక్రాట్స్ కళ్లు తెరిచారు.*

భారత రాజ్యాంగ చట్టములోని అధికరణ-12 ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దేశంలోని చట్టసభలు, స్థానిక సంస్థలు, కేంద్ర, రాష్ట్రాలకు చెందిన సంస్థలు, కేంద్ర ప్రభుత్వ నియంత్రణ వ్యవస్థలు, ఇతర అథారిటీలన్నీ(చట్టబద్ధ వ్యవస్థలన్నీ) 'స్టేట్' నిర్వచనం కిందకు వస్తాయి. స్టేట్ అంటే రాజ్యం అని అర్థమున్నప్పటికీ, ఇక్కడ స్టేట్ అంటే ప్రభుత్వం. ప్రజాహిత కార్యకలాపాలను చేపట్టి ఖజానా నుంచి వ్యయం చేసే సంస్థలన్నింటినీ(ఇనిస్టిట్యూషన్స్) కూడా ప్రభుత్వాలుగానే పరిగణించాలి. ఉద్యోగుల నియామకాలకు సంబంధించినంత వరకు ప్రభుత్వమంటే ఒక 'యజమాని' అని అర్థం చేసుకోవాలి. ఒకానొక ప్రభుత్వ పరిధిలో నివసిస్తున్న పౌరులు(విద్యార్థులు) మాత్రమే అక్కడి ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేయడానికి ఎంపిక చేయబడతారు. రాజ్యాంగ చట్టంలోని అధికరణ-16 ప్రకారం, మతము, కులము, తెగ, జన్మస్థలం, నివాసం, లింగ భేదం తదితర విషయాలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలకు పౌరులందరికి సమాన అవకాశాలు కల్పించాలి. అంటే ఏ రాష్ట్ర పరిధిలో నివసిస్తున్న పౌరులకు ఆ రాష్ట్ర పరిధిలోనే లభించే ఉద్యోగాల నియామకాలలో ఎలాంటి వివక్ష చూపకుండా అక్కడి పౌరులకు మాత్రమే సమాన అవకాశాలు కల్పించాలి. మరొక విధంగా చెప్పాలంటే, ఒక రాష్ట్రంలోని పౌరులు ఇతర రాష్ట్రాలలోని ఉద్యోగాలకు అర్హులు కారు, హక్కులేదు. అయితే కేంద్ర ప్రభుత్వం, దాని సంస్థల్లో లభించే ఉద్యోగాలకు దేశవ్యాప్తంగా అర్హత కల్గిన పౌరులు దరఖాస్తు చేసుకోవచ్చును, నియమింపబడవచ్చును. ఎందుకంటే దాని పరిధి దేశవ్యాప్తం.

అలాగే అధికరణ-16లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో రిజర్వేషన్లు కల్పించబడ్డవి. అంటే వారికి రిజర్వు చేయబడిన పోస్టులలో ఇతరులను నియమించరాదు. అయితే ఎస్సీ, ఎస్టీ, బిసీలకు చెందిన అభ్యర్థులు విద్య, ఉద్యోగ విషయాలలో మొత్తం అన్ని సీట్లకు, అన్ని పోస్టులకు(ఓపెన్ క్యాటగిరీలు) అర్హులు. అదే అధికరణలో ఎస్సీ, ఎస్టీలకు 'ప్రమోషన్ల' విషయంలో కూడా రిజర్వేషన్లు కల్పించబడినాయని గ్రహించాలి. అందువల్ల తెలంగాణ ప్రభుత్వం(ఎంప్లాయర్) పరిధిలోకి వచ్చే ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం(ఎంప్లాయర్) పరిధిలోకి వచ్చే ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారుగా పరిగణింపబడతారు.

అయితే ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల పంకాల విషయంలో ఉద్యోగుల స్థానికతను రాజ్యాంగ బద్ధంగా ఎలా నిర్ధారించాలి? రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల పంపకం అన్ని రాష్ట్రస్థాయి కార్యాలయాలు, ప్రత్యేక కార్యాలయాలు, ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లు, భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, ప్రభుత్వ జోనల్, జిల్లా కార్యాలయాలు, తదితర సంస్థల్లో అటెండర్ పోస్టులు మొదలుకొని న్యాయశాఖ కార్యదర్శుల వరకు జరగాల్సి ఉంది. సమైక్య రాష్ట్రంలో జోనల్ పద్ధతి అమలులో ఉన్నది. అందులో ఉద్యోగ నియామకాలలో 1975 నుంచి స్థానికులు, స్థానికేతరుల మధ్య నిష్పత్తి కూడా అమలులో ఉన్నది కాబట్టి ఆ పోస్టులను కూడా పరిగణనలోకి తీసుకొని రెండు రాష్ట్రాలకు ఉద్యోగులను పంకం చేయాలి. కనుక ఉద్యోగుల విభజనలో(పంపకంలో) వాళ్ల సర్వీస్ రిజిష్టర్లు(సర్వీస్ బుక్కులు) కీలకం కానున్నాయి. ప్రతి సర్వీస్ బుక్కులో ఉద్యోగి పుట్టిన తేదీ, పాఠశాల చదువు ఆధారంగా జన్మస్థలం, మతము, కులము, విద్యార్హతలు, నియమింపబడిన ఉద్యోగం పేరు(పోస్టు పేరు) తండ్రి పేరు, ప్రారంభ జీతం, ఉద్యోగి ఐదువేళ్ల ముద్రలతో సహా అన్ని వివరాలు పొందుపరిచి ఉంటాయి. ఉండాలి కూడా. తాత్కాలిక ఉద్యోగికి కూడా పై వివరాలతో సర్వీస్ బుక్కు ఉండాలి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ప్రతి ఉద్యోగి ఒక స్వంత సర్వీస్ బుక్కును

కూడా(ఎంట్రీస్ వేయించుకోవడానికి) కలిగి ఉండాలి. అందువల్ల ఉద్యోగి స్థానికతను నిర్ణయించడానికి ఆ ఉద్యోగి జన్మస్థలం, హైస్కూల్ విద్యను(ఒకటి నుంచి 10వ తరగతి వరకు) చదివిన 'ఊరును' పరిగణనలోకి తీసుకొని నిర్ధారించాలి.

సమైక్య రాష్ట్రంలో అమలులో ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగుల స్థానికతను నిర్ణయించడం చెల్లదు. ఎందుకంటే అవి ఇప్పుడు ఉద్యోగుల విభజన విషయంలో రాజ్యాంగ విరుద్ధమవుతాయి. రాష్ట్రస్థాయి పోస్టులన్నింటికి నిష్పత్తి లేదు కాబట్టి ఉద్యోగుల విభజన ఒకటవ తరగతి నుంచి వరుసగా 10వ తరగతి వరకు చదివిన ఊరు/పట్టణం/ జిల్లా ప్రాతిపదికన జరగాలి. నిష్పత్తి ప్రకారం రాష్ట్రస్థాయి, జోనల్ స్థాయి, మల్టీ జోనల్ స్థాయిల్లో నియమింపబడిన స్థానికేతరులు, అలాగే అన్ని స్థాయిల్లో(జిల్లా స్థాయిల్లో కూడా) నియమింపబడిన రెండవ స్థాయి గెజిటెడ్, ఆపై స్థాయి అధికారులందరిని రెండు రాష్ట్రాల మధ్య స్థానికత ఆధారంగానే విభజించాలి. ధృవపత్రాలు చెల్లవుగాక చెల్లవు. కేవలం సర్వీస్ బుక్కులు మాత్రమే చెల్లుతాయి. అన్ని క్యాటగిరీలలోని "ఖాళీ పోస్టులకు" స్థానికత గుర్తింపు ఉండదు. కనుక అలాంటి పోస్టులన్నింటినీ కేవలం జనాభా నిష్పత్తిలో కేటాయించాలి. రెండు రాష్ట్రాలు ఖాళీ పోస్టులను భర్తీ చేసుకుంటే చేసుకుంటాయి. లేకుంటే లేదు. కాని భర్తీ చేసుకోవాలి.

కొంతమంది ఉద్యోగుల సర్వీస్ బుక్కులు లభ్యం కావడం లేదని, కనుక వాటి బదులుగా నకిలీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించారని పరస్పరం ఉద్యోగ సంఘాలు ఆరోపణలు చేసుకున్నాయి. సర్వీస్ బుక్కులు లేవంటే, అవి అవినీతి మంటల్లో కాలిపోయి ఉంటాయి. లేక అవినీతి చెదలు వాటిని తినేసి ఉంటాయి. అసలు సర్వీస్ బుక్కులను పై అధికారులు తనిఖీలు చేయడం లేదు.(ఈ రచయిత చేసేవాడు) సర్వీస్ బుక్కులలోని పుట్టిన తేదీలను, రిజర్వ్డ్ కులాల పేర్లను తారుమారు చేయడం, ఉద్యోగులు డ్యూటీల్లో చేరిన వెంటనే కాకుండా తరువాత ఎప్పుడో వాటిని తమ ఇష్టం వచ్చినప్పుడు లంచాలు తీసుకొని ఎంట్రీలను నమోదు చేయడం కూడా కద్దు. తాత్కాలిక ఉద్యోగులకు కూడా సర్వీస్ బుక్కులు ఓపన్ చేసి తీరాలి. అందువల్ల సర్వీస్ బుక్కులు లేవంటే గోల్‌మాల్ జరిగినట్లే లెక్క. అందుకు బాధ్యులైన వాళ్లందరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. శాశ్వత ప్రాతిపదికన మంజూరు అయిన పోస్టుల సంఖ్య(అన్ని క్యాటగిరీలలో) (సాంక్షన్ క్యాడర్–స్ట్రెంత్) కంటే వాస్తవంగా పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య ఎల్లప్పుడూ ఎక్కువగానే ఉంటున్నది. ఎందుకంటే ఏండ్లు గడిచినా తాత్కాలిక పోస్టులను పర్మనెంట్ పోస్టులుగా (శాశ్వత పోస్టులుగా) చేసే అలవాటు దోపిడీ పాలకులకు, బ్యూరోక్రాట్స్‌కు లేనేలేదు. గత 20 సంవత్సరాల నుంచి ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడం లేదు. ఈ ఖాళీల సంఖ్యను జనాభా ప్రాతిపదికన పంపకం చేస్తే, ఏర్పడిన రెండు రాష్ట్రాలు ఆ పోస్టులను భర్తీ చేసుకుంటాయి. ప్రస్తుతం ఖాళీలు సుమారు నాలుగు లక్షల వరకు ఉంటాయని అంచనా. పనిలో పనిగా ప్రతిశాఖ, ప్రతి ఆఫీస్‌లలో చాలా పోస్టులను రద్దుచేశారు. ప్రపంచ బ్యాంక్ ఆదేశాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర నూతన ఆర్థిక పారిశ్రామిక విధానలను 1991 జూలై 24 నుంచి అమలు పరచే క్రమంలో ఈ రద్దు కార్యక్రమాన్ని చేపట్టాయని గుర్తుంచుకోవాలి. సంక్షేమ పథకాలకు, ఇతర పనులకు ప్రభుత్వాలకు రుణాలు ఇవ్వడానికి ఆ బ్యాంక్ విధించిన షరతులలో ఉద్యోగుల సంఖ్యను కూడా తగ్గించాలనే షరతు ఒకటి సుమా!

కేంద్ర, రాష్ట్రాలు గత 22 సంవత్సరాల నుంచి ఉద్యోగులను కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల ద్వారా(ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా) నియమించుకుంటున్నాయి. వారిని ఎప్పుడూ తీసివేయాలనుకుంటే అప్పుడు తీసివేయవచ్చును.(హైర్ అండ్ ఫైర్ పాలసీ) వాస్తవం చెప్పాలంటే వారిని అద్దెకు తీసుకున్నట్లుగా అర్థం చేసుకోవాలి? వారికి గంపగుత్తగా నిర్ణీత మొత్తాలలో జీతాలు ఇస్తున్నారు. అంతేగాక, వీరిని పరిపాలనలో నియమించుకోవటంలో రిజర్వేషన్ పద్ధతిని పాటించడం లేదు. అందువల్ల ఎస్సీ, ఎస్టీ, బీసి విద్యార్థులకు దోపిడీ పాలకులు తీరని అన్యాయం, మోసం చేస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, మేధావులనే వారు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా (సర్వీస్‌లను క్రమబద్ధీకరించి) పరిగణించాలని ఆందోళన చేయటం సిగ్గుచేటు. అటువంటి నియామకాలను రద్దుచేసి, ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా(పబ్లిక్‌సర్వీస్ కమిషన్లు, ఎంప్లాయ్‌మెంట్ ఎక్సేంజ్‌ల ద్వారా) ఉద్యోగులను నియమించాలని ఒత్తిడి చేయాల్సింది పోయి, ధర్నా క్యాంపుల వద్ద వారికి వత్తాసు పలకడం తెలివి తక్కువ తనం. కేవలం పేరు కోసం వాళ్లు ఈ చౌకబారు పనిచేస్తున్నారు. మేధావులలోనే వారు విషయాలను తెలుసుకొని ప్రవర్తించాలి. కనుక కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల ద్వారా రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిల కార్యాలయాలలో, ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న అలాంటి ఉద్యోగులందరిని తక్షణం తొలగించి, ఆ పోస్టులను ఖాళీలుగా పరిగణించి రెండు రాష్ట్రాలకు కేటాయించాలి. రాజ్యాంగ బద్ధంగా ప్రమాణ స్వీకారం చేసి అధికారాన్ని చేపట్టిన పాలకులు రాజ్యాంగాన్ని ఉల్లంఘించరాదు! రెండు రాష్ట్రాలు రిజర్వేషన్ రోస్టర్‌ను అమలుపరుస్తూ రెగ్యులర్‌గా సర్వీస్ కమిషన్ ద్వారా పోస్టులను భర్తీచేయాలి. ఉద్యోగుల సంఖ్యనే గణనీయంగా పడిపోయి ఉన్న తరుణంలో తగినంత సిబ్బంది లేకుండా పాలకులు ఎలా పరిపాలన చేస్తారు?

అందువల్ల ఉద్యోగుల సర్వీస్ బుక్కులలో పొందుపరచిన స్థానికత ఆధారంగానే ఉద్యోగుల పంపకం జరగాలి. ఒకవేళ సర్వీస్ బుక్కులు దొరకకపోతే "నియామక పత్రాలను" తనిఖీ చేసి ఉద్యోగులందరిని శాశ్వత ప్రాతిపదికన ఒక నెల లోపల పంపకం చేయాలి. ❖

**మైపతి అరుణ్‌కుమార్**

# తెలంగాణ పునర్నిర్మాణం - ఆదివాసులు

*ఆంధ్ర వలసవిధానం తెలంగాణ ఉద్యోగాలను, భూములను దోచుకుంది. ఆత్మగౌరవాన్ని కించపరిచిందనే ఒకే ఒక నినాదంతో కవులు, కళాకారులు, కర్షకులు, రచయితలు, రాజకీయ పార్టీలు, ఉద్యోగులు, విద్యార్థులు నేడు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారు. కాని ఇదే తెలంగాణలో భాగమైన ఉన్న ఆదివాసి ప్రాంతాల భవితవ్యం, మనుగడ ఏమిటనే ప్రశ్నలు కొంత సూక్ష్మ స్థాయిలో ఆలోచించే వారిని గందరగోళంలోకి నెట్టి వేస్తున్నాయి. తెలంగాణ సమాజంలోని మేధావి వర్గం ఆదివాసీల వైపు నిలువకపోతే ఆదివాసీల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అభివృద్ధి, విధ్వంసం అనేవి కలిసి ఉంటాయి. విధ్వంసకర అభివృద్ధిలో ఎక్కడైనా సమిధలయ్యేది ఆదివాసీలే. ఎక్కడ కొత్తగ రాష్ట్రాలు ఏర్పడినా ఆయా రాష్ట్రాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే సహజ వనరులు, జలవనరులు, ఖనిజ నిక్షేపాలు అవసరం. తెలంగాణ అభివృద్ధికి కావాల్సిన అధికశాతం సంపద ఆదివాసి ప్రాంతంలో వుంది. తెలంగాణ అభివృద్ధి నమూనాలో ఆదివాసీ ప్రాంతాలపై ఏ విధంగా ఏమిటి ఉంటున్నదనేది కూడా ఆలోచించాల్సి ఉంది. కనీసం వలస పాలన నుంచి విముక్తి పొందిన వలస పురుటి నొప్పులు భరించి బాధలు తెలిసిన తెలంగాణ రాష్ట్రం అయినా పునర్నిర్మాణంలో ఆదివాసి ప్రాంతాల స్వయం పరిపాలన డిమాండ్ న్యాయమైందా? కాదా? అనే ప్రశ్నను చారిత్రక కోణంలో చూసేవారికి ఇది కచ్చితంగా అవసరమనేది గుర్తిస్తారు.*

సముద్ర గర్భంలో దీవుల ఆచూకీ ఒకప్పుడు భారత్-ఆస్ట్రేలియాల మధ్య అనుసంధానం అనే పేరుతో హిందూ మహాసముద్రంలో మునిగిపోయిన రెండు దీవులను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఒకప్పుడు ఈ దీవులు భారత్-ఆస్ట్రేలియాల మధ్య అనుసంధానంలో భాగంగా ఉండేవని తేల్చారు. ఆస్ట్రేలియాలోని టాస్మానియా ప్రాంతం పరిమాణంలో ఉండే ఈ రెండు దీవులు గోండ్వాణ మహా ఖండంలో భాగంగా ఉండేవని సిడ్నీ విశ్వవిద్యాలయం మాక్వరివర్శిటి టాస్మానియా వర్సిటీలకు చెందిన శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. సముద్ర ఉపరితలాన్ని పటచిత్రం చేస్తున్నప్పుడు ఆస్ట్రేలియా పశ్చిమ ప్రాంతంలో ఈ రెండు దీవులను గుర్తించారు. ఈ దీవులు ప్రస్తుతం ఒకటిన్నర లోతులో(1.5) ఉన్నాయని ఈ పరిశోధనా గణాంకాలతో భారత్-ఆస్ట్రేలియా, అంటార్కిటికాలు గోండ్వాణ నుంచి విడిబడ్డాయనే విషయంలో ఈ అధ్యయనంలో మన అవగాహన




పూర్తిగా మారే అవకాశం ఉందని సిడ్నీ విశ్వవిద్యాలయ భూగర్భ శాస్త్రవేత్త డా॥జయనేవిటాకర్ పేర్కొన్నారు. సాధారణంగా తవ్వకాలలో సముద్రంలో బాస్టాల్ తరహా గ్రానైట్ ఇసుకరాయి తదితర రాళ్లు, శిల చల రహితంగా దొరికాయని పరిశోధకులు డా॥స్టీవంత్ వివరంగా పేర్కొన్నారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత వాటి వయసు తదితర అంశాలు విశ్లేషించే వీలుందన్నారు. 13 కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై సంభవించిన క్రెటరియరీ కాలంలో భారత్ ఆస్ట్రేలియాకు దూరంగా జరిగిన సమయంలో సూక్ష్మ ఖండాలుగా పిలుస్తున్న ఈ దీవులు ఏర్పడ్డాయి. ఆ తర్వాత అవి రెండు తరాలకు వేల కిలోమీటర్ల దూరంలో ఒంటరిగా ఉండిపోయాయి. సముద్రమార్గానికి పైకి ఉన్నా ఆ తర్వాత అవి క్రమంగా మునిగిపోయినవని వివరించారు. దీనిని బట్టి గోండ్వాణ భూభాగం ఆదివాసి సమూహాల చరిత్ర అతి ప్రాచీనమైనదని స్పష్టం అవుతున్నది.

భారతావనిలో అత్యంత పురాతన భూమిగా గోండ్వాణ భూమిని చరిత్రకారులు వర్ణించడం జరిగింది. మధ్య భారత దేశంలో సాత్పురా పర్వతశ్రేణిలో నర్మదా, గోదావరి, పెన్నా నదుల మధ్య ఇటు దక్షిణ భారతదేశం వరకు గోండ్వాణ భూమి విదేశీయుల రాక వలన తన ఉనికిని, పేరును కూడా కోల్పోయింది. ఎందరో చరిత్రకారులను ఆదిమ గిరిజనులు, సంస్కృతి సాంప్రదాయాలను వారి రచనలలో నిక్షిప్తపరిచి ఉంచినారు. మానవులు ప్రాకృతిక వ్యవస్థలో ఉన్నప్పుడు నియమ నిబంధనలను ఆచార వ్యవహారాలను మానవ సమాజానికి నేర్పిన గోండి సంస్కృతిలో కొన్ని వేల సంవత్సరాల నాటి సంప్రదాయాలు సంస్కృతి నిక్షిప్తమై ఉన్నది. వారి పౌరాణిక గాథలలో

ఎన్నో విషయాలు మనకు అవగాహన కాగలవు. ఈ గోండి సమాజమునకు చెందిన ఆదిమ జాతి ప్రజలు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతంల కోయతూర్(బురుదు) కోయ్‌గల్(బతుగా) కోర్‌గా(పారా–పారాల్) కోయరవాతి గ్రోండ్ –లోవార్ కోతద్వాత్ కొయ్యాల్, కోలామ్ ప్రధాన్ మొదలైనవి అంధ్ర, కర్ణాటకలలో కోయ, గోండు ప్రధాన్, కోలాం తోటి నాయకపోడు, కొండరెడ్డి, కొండదొర, బగతు సవర కొత్వాల్, కోలియా, కోయమాలి, కోర్‌వాల్, కోరనా, కోలహా మొదలగునవి బీహార్ ఒరిస్సాలో కోండి, కొముండ్వాల్, ఖెరియా, కోర్రా, కొక్యా, కొలతాల్, కోటియా, కోల్, భీల్, సంతాల్, ముండా మొదలైనవి. ఈ జాతులలో 'సగా'ఘట్టాల విభజన పురాతనమైనది.

భారతదేశంలో ఆర్యుల ఆగమనం కాక పూర్వం సింధూ నాగరికతలో మహోన్నతమైన సంస్కృతి భాసిల్లుతుండేది. సుందరమైన సంస్కృతి పవనాలు నవనవలాడుతుండెను. అలాంటి సమయంలో ఆర్యులు తమ సంస్కృతి బీజాలు మన భూమిపై నాటడం మొదలుపెట్టారు. భారతదేశ చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేస్తే మన దేశాన్ని బ్రిటీషు, ఫ్రెంచి, డచ్చి, మొఘలులు, ఖిల్జీలు, మంగోలియన్‌లు, ఆర్యజాతులు వలస వచ్చినట్లు చారిత్రక ఆధారాలు కలవారు రాకముందు భారతావనిలో భాసిల్లిన సింధు సంస్కృతి లాంటి ఉన్నతమైన సంస్కృతి జన్మదాతలు. ఎవరు ఆది. ఎవరి ద్వారా ఉత్పన్న మైనది? అనే సహజ అనుమానం రాక మానదు. సింధు సంస్కృతి మూలపురుషులు, ఆదివాసులేనని చరిత్రకారుల అభిప్రాయము వెంకటేశ్ ఆత్రం, చంద్రాపూర్ మరాఠి గోండి సంస్కృతిలోని సందర్భం ప్రకారం సింధు సంస్కృతి పితామహులు గోండు ధర్మప్రజలు, గోండు సమాజంలో రెండు వంశముల వారు ఉండిరి. వారు నాగవంశము, రావణ వంశము, కొయతూర్ రావణ వంశమునకు చెందినవారు. ప్రధాన్ నాగవంశమునకు చెందినవారు. భారతదేశంలో మొట్టమొదటగా నాగవంశీయుల సంస్కృతి ఉండెను. తరువాత రావణ వంశీయుల సంస్కృతి ఉదయించినది. రావణ వంశము, నాగవంశము ఒకే మాదిరిగా ఉండి సింధు సంస్కృతిని కాపాడినవారు. వాస్తవముగా గోండులు, సింధు సంస్కృతికి చెందినవారు. రుగ్వేదములో కుయా రాష్ట్రం బదులు కుయత్ రాష్ట్ర ప్రస్తావన కలదు. కుయత్ రాష్ట్రం అనగా కొయతూర్ వారి గోండ్వానా రాష్ట్రం కుయ్యా రాష్ట్రంలో ఈ దేశంలో గోండుల సామ్రాజ్యాలు ఉండెను. ఎస్.ఆర్.గాడ్గిల్ అభిప్రాయంలో గోండ్వానా పేర్లు గల రాజ్యాలు ఇతిహాస కాలములో ఎంతో పేరు ప్రఖ్యాతులు గించినవి వారి భాష గోండి దర్మము గోండి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు జీవన సాకారముగా ఉండెను. తదుపరి భారతదేశంలో అనేక మార్పులు బ్రిటీష్‌వారి రాకతో ఆదివాసీల అస్తిత్వ ఉద్యమాలను జల్, జంగల్, జమీన్ స్వయంప్రతిపత్తి ఆత్మగౌరవం కోసం(బ్రిటీష్ నైజాంకు వ్యతిరేకంగా చూడవచ్చు.దానితో ప్రధానంగా(1260–1300) వరంగల్ జిల్లాలోని మేడారం కేంద్రంగా శ్రీ సమ్మక్క–సారలమ్మ పోరాటం 1778 చనార్ కొండలలో పహాడియా తిరుగుబాటు 1803 రంప పితూరి పోరాటం 1834–46 కాలంలో ఆసిఫాబాద్ కేంద్రంగా రాంజీ గోండ్ తిరుగుబాటు 1855లో సంతాల్ తిరుగుబాటు 1857 పశ్చిమ గోదావరి జిల్లా కారుకొండ సుబ్బారెడ్డి పోరాటం 1910లో భూంకాల్ తిరుగుబాటు 1922–24 గంటం దొర అల్లూరిల మన్యం తిరుగుబాటు 1928–40 జల్ జంగల్, జమీన్ కోసం జోడేఘాట్ కేంద్రంగా కొమురం భీం పోరాటం లాంటివి చారిత్రక కాలం నాటివి. దానిలో భాగంగానే భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం ఆదివాసీలు, ప్రత్యేక భారతం కావాలని నివేదించారు. భారతదేశానికి బ్రిటీష్ పాలన నుండి విముక్తి అనంతరం ఆదివాసీలు, ప్రత్యేక భారతం కావాలని నివేదించారు. భారతదేశానికి బ్రిటీష్ పాలన నుంచి విముక్తి అనంతరం ఆదివాసీల గురించి జరిగిన చర్చ విధానంలో దేశ విభజన సందర్భంగా చీలిపోయిన అఖండ భారతంలో ఆదివాసీలు తమకో ప్రపంచం కావాలని కోరుకున్నారు. దీనిలో భాగంగానే 1947 నవంబర్ 9న చోటా నాగపూర్ ఆదివాసీ తెగలకు భారత ప్రభుత్వానికి మధ్య చర్చలు విఫలమయ్యాయి. అప్పటికి హైదరాబాద్, జమ్మూ కాశ్మీర్ ఉద్రిక్తతలతో సతమతమవుతున్న భారత సైన్యానికి ఆదివాసీల సమస్య కొత్త తలనొప్పిగా పరిణమించింది. కానీ సర్దార్ పటేల్ మాత్రం నిబ్బరంగా వ్యవహరించారు. ఇదే సమయంలో గిరిజనులపై యుద్ధం ప్రకటిస్తామా? అన్న ప్రశ్నకు పటేల్ సమాధానంగా మనం గిరిజనులతో యుద్ధం చేయం. వారు 1857 ముందు నుంచి ఎన్నో సంవత్సరాలుగా స్వాతంత్ర్యం కోసం పోరాడు తున్నారు. వారు అసలైన జాతీయ వాదులు అని పేర్కొన్నారు గిరిజనులు. జాతీయ రాజ్యం లేకుండా జాతిని కోరుకుంటు న్నారన్నది పటేల్ ఉద్దేశ్యం. వారు గాంధీజీని జాతిపితగా ప్రేమిస్తారు. ఆరాధిస్తారు. కాని వారికి జాతీయ రాజ్యం నచ్చదు. చీలికల్లో మొదటగా భారతీయ రాజ్య నిర్మాణంలో ముస్లీం లీగ్ పాలుపంచుకోకపోవడం ఒకటైతే రెండో చీలికగా గిరిజనులు. స్వయం పట్టుదల గిరిజనుల మొండితనం నెహ్రూ పటేల్ ఆజాద్‌లను ఆశ్చర్యపరిచింది. గిరిజనులు స్వయం ప్రతిపత్తి గల జాతుల భూమి పుత్రులమనే కాదు బ్రిటీష్ వారిలాగే పరాయివారైన భారతీయులు కూడా తమ భూభాగం నుంచి వెళ్లిపోవాలని గిరిజనులు కోరుకున్నారు. ఇటువంటి సందర్భంలో గిరిజనులు చేసిన వ్యాఖ్యలు బయటి ప్రపంచానికి వ్యతిరేకంగా ఉన్నా నెహ్రూ పటేల్‌లకు మాత్రం ఈ విషయంలో స్పష్టమైన అవగాహన ఉంది. గిరిజనులు, రజాకార్లు కాదు వారి సంస్కృతి భిన్నమైనది. వారు కోరుకునేది వేరే, వారి ప్రపంచం వారి వాదనలు అర్థం చేసుకోవటానికి భిన్న దృక్పథం కావాలి. కనుక గిరిజనులతో మలిదశ చర్చలు, అవసరమని భావించారు. ఒకపక్క చర్చలకు ప్రయత్నాలు జరుగుతుండగానే మరోవైపు కొన్ని చోట్ల హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. డీనోటిఫై ట్రైబ్స్‌ను బహిరంగంగా, కొట్టిచంపారు. ఇద్దరు చిన్నపిల్లలను చంపారు. అయినప్పటికి గిరిజన నాయకులు

సహనం కోల్పోలేదు. నెహ్రూ జైపాల్‌సింగ్‌లు, రాజుదయాల్ ముండ రాసెలోహరీలతో పాటు ఐదుగురు, గిరిజన నాయకుల్ని ఢిల్లీ పిలిపించారు. రెండవసారి చర్చ ఢిల్లీలోని నెహ్రూ నివాసమైన తీన్‌మూర్తి భవన్‌లో జరిగింది. అందులో నెహ్రూ అబ్దుల్ కలామ్ ఆజాద్ కాక సాహెబ్ కలెల్కర్ పటేల్‌లు పాల్గొన్నారు. సుదీర్ఘంగా ఇరువర్గాల మధ్య జరిగిన చర్చ అనంతరం నెహ్రూ మరో ఏర్పాటు వాదం సాధ్యం కాదని దేశవిభజన వేర్పాటుకాదు, మీది మాత్రమే వేర్పాటు అని అన్నారు. దీనితో అందరు ఏకీభవించారు. దానిలో భాగంగానే ఆదివాసీలకు ప్రత్యేక భారతం ఇవ్వకుండా ప్రత్యామ్నాయంగా పాలించు కోవటానికి రాజ్యాంగంలో 5, 6 షెడ్యూల్స్‌ను కల్పించారు. ఈ షెడ్యూల్‌ల ప్రకారం ఆదివాసి ప్రాంతాలు స్వయం పరిపాలన అధికారం కల్పించాలి. కాని అది నేటికి ఏ రాష్ట్రంలోను జరగలేదు. అదికాక 1956 భాష ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు జరిగే క్రమంలో కూడా ఆదివాసీ ప్రాంతాలకు అన్యాయమే జరిగింది. ఒకే భాష ప్రాతిపదికన రాష్ట్రం ఏర్పాటు చేయాలన్నప్పుడు గోండ్వాణ ప్రాంతం భూభాగానికి భాష, సంస్కృతి, సంప్రదాయాలు, ఉమ్మడి సాంప్రదాయక జీవన వ్యవస్థకలిగి ఉంది. కాని ప్రత్యేక గోండ్వాణ రాష్ట్రం ఏర్పాటు చేయలేదు. దాంతో గోండ్వాణ ప్రాంతం ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లకు ముక్కలు చేసి పంచబడి తెలుగు రాష్ట్రంలో తెలుగు రాక హిందీ రాష్ట్రంలో హిందీ రాక ఆదివాసీల మాతృభాషకు విలువలు లేక దుర్భర జీవనాన్ని గడుపుతున్నారు ఆదివాసీలు. 57 ఏళ్ల ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆదివాసీల స్వయం పరిపాలన అంశం అమలుకు నోచుకోలేదు. కనీసం ఆదివాసీలకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని వలస పాలన విముక్తి పొందిన తెలంగాణ రాష్ట్రం పునర్నిర్మాణంలో ఏం చేస్తుందనేది మన ముందున్న అంశం. తెలంగాణ ప్రాంతంలో 17,370 చదరపు కిలోమీటర్ల షెడ్యూలు ఏరియా ప్రాంతాలు ఖమ్మం, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్ నగర్‌లలో కోయ, గోండి, నాయకపోడు, పర్ధాన్, లీటె, కోలాం, చిందు, అండీ, చెంచు లాంటి తెగలను ప్రధానంగా, తెలంగాణలో చూడవచ్చు. ఇక్కడ ప్రధానంగా చర్చించవలసిన విషయమేమిటంటే ఆంధ్రప్రదేశ్ '5'వ షెడ్యూల్ ప్రకారం 31,334 చ.కిలోమీటర్ల షెడ్యూల్స్ ఏరియా ప్రాంతంలో 5,948 షెడ్యూల్ గ్రామాలను రాష్ట్రపతి గెజిట్‌లో పేర్కొనబడి ఉంది. ఇందులో ఆంధ్ర ప్రాంతంలో 4444 అధికంగా ఉండగా తెలంగాణలో కేవలం 1504 మాత్రమే వున్నవి. రాష్ట్రాల విభజన క్రమంలో ఆంధ్ర ప్రాంతానికి ఎక్కువ షెడ్యూల్డ్ గ్రామాలు పోగా కేవలం తెలంగాణలో 1504 షెడ్యూల్డ్ గ్రామాలు, తొమ్మిదిన్నర లక్షల ఆదివాసి జనాభా మాత్రమే మిగిలింది. ప్రస్తుతమున్న ఓటు బ్యాంక్ రాజకీయాల పరిస్థితులలో ఇంత తక్కువ జనాభాతో తెలంగాణలో ఎలా మనుగడను సాగిస్తామనేది మొదటిది అయితే రెండవది భద్రాచలం సమస్య.



భద్రాచలం ముమ్మాటికీ ఆంధ్రదే అనేది ఆంధ్ర వారి బలమైన వాదన. దీని వెనుక ఉన్న కుట్రను గమనిస్తే భవిష్యత్ పోలవరం నిర్మాణంలో ఒడిస్సా, ఛత్తీస్‌ఘడ్ లాగ భద్రాచలం తెలంగాణలో ఉండే కొరివిలా తయారవుతుందని ఆంధ్రవారు భావిస్తుంటే భద్రాచలం ఎక్కడ ఉంటే మాకేంటి కాని తెలంగాణ రాష్ట్రం వచ్చినదని తెలంగాణ సమాజం భావిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఏకంగా పోలవరం ప్రాజెక్టును ఆంధ్ర ప్రాంత పెట్టుబడిదారి వర్గాన్ని మెప్పించటం కోసం ఆదివాసీలను బలిపశువులను చేస్తూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక ఎక్కడ తెలంగాణ ప్రభుత్వం పోలవరానికి అడ్డంకిగా మారుతుందోనని ఏకంగా తెలంగాణ బిల్లులోనే పోలవరానికి తెలంగాణ ఒప్పుకున్నట్టు ఒక క్లాజు చేర్చిన తెలంగాణ రాజకీయ పార్టీలు, సమాజం నోరుమెదపక పోవటం వెనుక ఆంతర్యమేమిటి?

ఇక్కడ కలతచెందే విషయం ఏంటంటే తెలంగాణ రాష్ట్రం ప్రకటించి పోలవరానికి జాతీయ హోదా ఇస్తే తెలంగాణ సమాజం సంబరాలు చేసుకుందే తప్ప జాతీయ హోదాను వ్యతిరేకించలేదు. టిఆర్ఎస్ లాంటి పార్టీలు పోలవరానికి మాకు సంబంధమే లేదని పత్రికా ముఖంగా ప్రకటించింది. ఇటీవల రాజకీయ ఫోకస్ కోసం ఒకరోజు

బంద్ పాటించింది. టిజెఎసి ప్రజా సంఘాలు మాత్రమే ఇప్పటికిప్పుడు కొంత వ్యతిరేకిస్తున్నవి. వాస్తవంగా పోలవరంతో 9 మండలాలు తెలంగాణవి మునుగుతున్నవి. ఈ నిర్లక్ష్యానికి కారణం ఏమిటి? ఒక బలమైన పోలవరం వ్యతిరేక ఉద్యమ నిర్మాణం ఎందుకు జరగలేదు. అంటే ఆదివాసీలు మునిగితే ఏంటి? ఉంటే ఏంటి? అని అర్థం? ఇటువంటి విధానాలు ఇప్పుడే ప్రస్ఫుటమవు తున్నప్పుడు భవిష్యత్ పరిస్థితి ఏమిటి? అనేది ఆదివాసులు ప్రశ్నిస్తున్నారు. గత కాంగ్రెస్ ఆర్డినెన్స్‌ను తయారేచేస్తే ప్రస్తుత బిజెపి ప్రభుత్వం దానిని ఏ మాత్రం రాజ్యాంగ పరిశీలన చేయకుండా అధికారం వచ్చిన 3 రోజుల్లోనే రాష్ట్రపతి ద్వారా ఆర్డినెన్స్‌పై దగ్గరుండి సంతకం చేయించింది. ఇదంతా ఒక భాగమైతే రిజర్వేషన్ విధానంలో ఆదివాసిలు వలస లంబాడీలతో ఎంత దూరం ప్రయాణం చేయగలరనే భయం మరొకటి.

1960 లో బిసి(ఎ)లుగా 1773 జీవో ప్రకారం రిజర్వేషన్‌లు అనుభవించిన లంబాడాలు 1976లో ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం డీనోటిఫై ట్రైబ్‌గా(డిఎన్‌టి) మైదాన ప్రాంతాలలో కలపటం జరిగింది. అప్పటికి కనీస అక్షర జ్ఞానం లేని ఆదివాసి సమాజం ప్రశ్నించే పరిస్థితులలో లేదు. 1976లో ఎస్టీలలో కలిసినప్పుడు వీరి జనాభా 1.32.000లు, కాని ప్రస్తుతం మహారాష్ట్ర (బిసి) రాజస్థాన్(ఓసి) చత్తీస్‌ఘడ్(ఎస్సి)లుగా చలామణి అయ్యే లంబాడాలు ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీలమని తెలువగానే లక్షలాదిగా వలసలు వచ్చి నేడు తెలంగాణ ప్రాంతంలోని 41 లక్షలుగా ఉన్నారు. నాలుగున్నర లక్షల ఆదిమ తెగలు సామాజిక స్పృహ కల్గిన 41 లక్షలు జనాభా గల లంబాడాలతో ఎన్ని సంవత్సరాలు రిజర్వేషన్‌లలో ప్రయాణం చేయగలరు అనేది అందరు గమనించాల్సిన విషయం. 610 జీవో ముల్కీ నిబంధనల ప్రకారం తెలంగాణ ప్రాంతంలో తెలంగాణ వారే ఉద్యోగాలు చేయాలి. కాని ఆంధ్ర వలసలొచ్చి మొత్తం దోచుకున్నారని ఈ వలసలను వ్యతిరేకిస్తూ ఉద్యమం ఊపందుకుంది. హర్షించే విషయం న్యాయబద్ధమైన అంశమే కాని ఇదే తెలంగాణ భూభాగంలోకి ఈ నిబంధనలకు విరుద్ధంగా వలస లంబాడాలు జీవో నెం.3కి విరుద్ధంగా స్వీపర్ స్థాయి నుంచి ఐఎఎస్ స్థాయి వరకు ఆదివాసీలవి సుమారు 2 లక్షల ఉద్యోగాలు దోచుకున్నారు. భూములను దోచుకున్నారు. రాజకీయంగా కూడా తెలంగాణలో రెండు ఎంపి స్థానాలు ఎస్టీలకు కేటాయిస్తే రెండు లంబాడీలే లూటీ చేసారు. ప్రస్తుతం బక్రోలు లంబడ ఒక్కటే గోండీగా ఉంది. స్వరాష్ట్రంలోనే ప్రాంతీయ వలసలను వ్యతిరేకించిన తెలంగాణ సమాజం పక్క రాష్ట్రాల నుంచి వచ్చే ఆదివాసీల రిజర్వేషన్‌లను ఇదే తెలంగాణ ప్రాంతంలో దోచుకుంటుంటే ఎందుకు నోరు మెదపటం లేదు? అంటే తెలంగాణకు ఒక న్యాయం ఆదివాసీలకో న్యాయమా? 610 జీవో ముల్కి నిబంధనలు ఆంధ్ర ప్రాంతానికి వర్తిస్తాయి. కాని పొరుగు రాష్ట్ర లంబాడాలకు వర్తించవా? ఈ వలసలపై తెలంగాణ సమాజం మౌనం ఎందుకు వహిస్తోంది? అంటే భవిష్యత్ తెలంగాణలో కూడా ఓట్ బ్యాంక్ అధికంగా కల్గిన లంబాడాల వైపే రాజకీయ పార్టీలు, ప్రాతినిధ్యం వహించి అతితక్కువ జనాభా కల్గిన ఆదివాసీలని అణచివేయరని గ్యారంటీ ఏమిటి? ఆ లక్షణాలు తెలంగాణ రాకముందే కనపడుతున్నవి? తెలంగాణ ఏర్పడితే గిరిజనులకు 12% రిజర్వేషన్ అంటున్నారు. ఈ రిజర్వేషన్‌లు లబ్ధిపొందేదెవరు?

ఎక్కడైనా దేశాలు విడిపోయినా రాష్ట్రాలు విడిపోయినా, జిల్లాలు విడిపోయినా నష్టపోయేది ఆదివాసీలనేది స్పష్టం. నేడు ఆదివాసీల భయం ఏమిటంటే తెలంగాణ రాజకీయ పార్టీలు తెలంగాణ అభివృద్ధికి కావల్సిన సంపద ఎనలేనంత వుందని అంటున్నారు. కానీ ఇదే తెలంగాణ అభివృద్ధికి కావాల్సిన సహజవనరులు జలవనరులు ఆదివాసీ ప్రాంతంలో అధికశాతం ఉన్నది. బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కు అని విశాఖ స్టీల్స్‌కు కేటాయించినప్పుడు అనేక ఉద్యమాలు నడిచాయి. కాని బయ్యారం ఉక్కు '5'వ షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న ఆదివాసీల హక్కు. కాని ఆదివాసీల హక్కులుగా దీనిని పరిగణించలేదు. అంటే తెలంగాణ ప్రభుత్వం కూడా బయ్యారం ఉక్కు తీసి ఆదివాసీలను నిర్వాసితులను చెయ్యదని గ్యారంటి లేదు.

వరంగల్ జిల్లాలో దేవాదుల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న మెదక్, నిజామాబాద్‌లకు నీరందించింది కానీ తలాపున ఉన్న గంగారం, కన్నాయిగూడేనికి కాని చుట్టుపక్కల ఆదివాసి గూడాలకు చుక్కనీరు లేదు. ఇదీ సరిపోదన్నట్లు దేవాదులకు నీరందటం లేదని తెలంగాణ రాజకీయ పార్టీలు ఇదే గోదావరి నదిపై 30 కిలోమీటర్ల దిగువన కంతనపల్లి ప్రాజెక్ట్ కట్టి తెలంగాణను సస్యశ్యామలం చేయాలని పోరాటం చేయటంతో ప్రభుత్వం '27' జీవోను విడుదల చేసి ఏకంగా ప్రాజెక్ట్ పనులే మొదలుపెట్టింది. ఇక్కడ ప్రస్తావించాల్సిన విషయం ఏంటంటే కంతనపల్లి ప్రాజెక్ట్ కడితే 30 కి.మీటర్ల దూరంలో దేవాదుల దగ్గర 99 అడుగుల నీటిమట్టం గోదావరిపై ఉండాలి. ఈ నాటిమట్టం నిల్వ ప్రకారం అనేక ఆదివాసి గూడాలు ముంపునకు గురవుతాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే పోలవరం కంటే పెద్ద ప్రాజెక్టు కంతనపల్లి ఎందుకంటే పోలవరం ఎత్తు 70 మీటర్లు అయితే కంతనపల్లి ఎత్తు 198 మీటర్లు. కాని నీటికి కనీస విలువలు లేకుండ ముంపు సర్వే ప్రకటించలేదు. ఎన్ని గూడాలు ముంపునకు గురవుతాయో తెలువదు. అయినప్పటికి ఇవేమి పట్టించు కోకుండా తెలంగాణ రాజకీయ పార్టీలు ఆదివాసీలను ముంచే ప్రయాణం చేస్తున్నాయి. కరీంనగర్ ఆదివాసీలయితే దయనీయమైన బతుకులను వెళ్లదీస్తున్నారు. రాజ్యాంగంలో షెడ్యూల్డ్ ప్రాంతాలను గుర్తించే క్రమంలో అక్కడున్న రాజకీయ స్వార్థ ప్రయోజనం కోసం ఒక ప్రజాప్రతినిధి ఆదివాసీలను మొత్తం ఎస్సీలుగా చూపించటంతో గోదావరి పరివాహక ప్రాంతంలోని నాయకుడు, కోయ సమాజం, మహదేవ్‌పూర్, మంథని, మహాముత్తారం, కాటారంలలో గోండ్ సమాజం, ధర్మపురి, జగిత్యాలలో షెడ్యూల్డ్ హక్కులు లేక 2 లక్షల జనాభా దుర్భర జీవనాన్ని

గడుపుతున్నవి. ఇచ్చంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంలో ఈ గూడాలకు ముంపు సమస్య తప్పలేదు. ఆదిలాబాద్ జిల్లాలో గోండు గూడాలను ముంచి కొమరంభీం ప్రాజెక్టు కట్టినా గోండులకు నీరందని పరిస్థితిని మనం చూడవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కొత్తగూడెం వరకు 10 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాం అని తెరాస ప్రకటించింది. ఇప్పుడేమో లక్ష మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామంటుంది. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కొత్తగూడెం వరకు ఉన్న ప్రాంతం మొత్తం గోదావరి పరివాహక ప్రాంతం. ఈ గోదావరి పరివాహక ప్రాంతంలో నివశించేది మొత్తం ఆదివాసి తెగలు. ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి చేయటానికి రెండు మార్గాలున్నవి. 1. గోదావరి నదిపై జల విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, 2. ఇదే గోదావరి పరివాహక ప్రాంతంలో 700 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో భూమిలో నిక్షిప్తమై ఉన్న 7.501 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను ఓపెన్ కాస్టుల ద్వారా అయినా ఉత్పత్తి చేయాలి. ఈ రెండు విధానాలలో ఏ విధానాన్ని అవలంభించినా ఆదివాసీలు విధ్వంసానికి గురికావడం సహజం. దీనిని బట్టి కూడా భవిష్యత్ తెలంగాణలో ఆదివాసీలకు రక్షణ కరువే అనేది స్పష్టమవుతుంది. విచిత్రకరమైన విషయమేమిటంటే జియలాజికల్ సేర్వే ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం ప్రాంతాలలో ఉన్న బొగ్గు నిక్షేపాలన్నీ గోదావరి పరీవాహక ప్రాంత ఆదివాసీల గూడాల కిందే 90% నిక్షిప్తమై ఉన్నవి. రేపటి తెలంగాణలో ఓపెన్‌కాస్ట్‌ల ద్వారా వీటిని తవ్వితే ఆదివాసీల భవితవ్యం ఏమిటి అనేది అర్థం కాని పరిస్థితి.

ఇదంతా ఒక భాగమైతే గిరిజనేతరుల వలసలు, హెడ్యూల్డ్ ఏరియాలో అధికమవటంతో ఆదివాసీలు మైనార్టీలుగా మారిన పరిస్థితులు నెలకొనివున్నాయి. ఆదివాసీలకు ఆయువు పట్టయిన ఐటిడిఎ కేంద్రాలు ఆదిలాబాద్(ఉట్నూర్), వరంగల్(ఏటూర్ నాగారం), ఖమ్మం(భద్రాచలం), మహబూబ్‌నగర్(శ్రీశైలం)ల్లోనే 80% గిరిజనేతరుల వలసలు నిండి ఉంటే 20% ఆదివాసీలు మైనార్టిగా ఉన్నారు. ఈ వలసల పరంపర ఆదివాసీల సారవంతమైన భూములను ఆక్రమించుకొని సొంత భూమిలో ఆదివాసీలు కూలీలుగా మారిన పరిస్థితులు చూడవచ్చు. ఐటిడిఎ కేంద్రాలలో ఈ పరిస్థితి ఇలా వుందండి. ఇంకా మిగతా ప్రాంతాల వలసలను అవగతం చేసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితులలో గిరిజనేతరులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగి మాకు సైతం షెడ్యూల్డ్ ఏరియాలో హక్కులు కావాలని సంఘాలు పెట్టి ఉద్యమిస్తున్నారు. షెడ్యూల్డ్ ఏరియా రద్దు కోసం ఢిల్లీ పెద్దలను కలిసే పనిలో పడ్డారు. గోదావరి పరివాహక ప్రాంతం కూనవరం, వేలేరుపాడు, చింతూరు దగ్గర మొదలైన ఆంధ్ర పెత్తందారి వలసలు వయా భద్రాచలం మణుగూరు, రాజుపేట, మంగపేట మీదుగా గోవిందరావుపేటను తాకుతూ మహదేవ్‌పూర్, మంథనిని కలుపుకొని లక్షట్టిపేట వరకు చేరి ఆదివాసీల సారవంతమైన భూములు లక్షలాది ఎకరాలు ఆక్రమించుకొని తమ సొంత భూములలోనే తమను కూలీలుగా మార్చినవి. తెలంగాణ పునర్నిర్మాణంలో ఆంధ్ర పెత్తందారీ వర్గం చేతిలో ఉన్న చట్టపరమైన షెడ్యూల్డ్ ఏరియా భూములు ఆదివాసీలకు దక్కాలి. పాల్వంచ కెటిపిఎస్, భద్రాచలం బిడిఎల్ మణుగూరు, భారజాల కర్మాగారం కమలాపూర్ ఎపి రిమెన్స్ దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీలు, ఎజెన్సీలు నెలకొల్పి ఆదివాసీల బతుకుల్లో విషం నింపారు. ఈ ఫ్యాక్టరీల నుంచి కాలుష్యం వలన అంతుపట్టని రోగాలతో ఆదివాసీలు మృత్యువాత పడుతున్నారు. దీని నుంచి వ్యర్థం గోదావరి నదిలో కలిసి ఆ నీరు తాగిన జీవజాలం, జంతుజాలం, పశువులు చని పోతున్నాయి. ఇందులో 5వ షెడ్యూల్డ్ పేర 1 ప్రకారం స్థానిక ఆదివాసీలు చెందాలి. కాని ఇందులో కనీసం స్వీపర్ ఉద్యోగాలు కూడా ఆదివాసులకు దక్కలేదు. ఇందులో మొత్తం ఆంధ్రప్రాంత ఉద్యోగస్తులే అధికంగా ఉన్నారు. వీరి స్థానచలనం జరిగితే ఇందులో నిలపబడేది ఆదివాసులు, తెలంగాణ గిరిజనేతరులు అనేది స్పష్టత లేదు.

సంస్కృతి సంప్రదాయాల విషయానికొస్తే ఆదివాసి సంస్కృతి విధ్వంసానికి గురవుతుందని చెప్పవచ్చు. ఇక్కడ సూక్ష్మస్థాయిలో పరిశీలన చేసినపుడు అనేక విషయాలు బయటపడతాయి. ఆదివాసి సంస్కృతిలేని నైతిక విలువలు స్పష్టం అవుతాయి. నేడు బయట సమాజంలో దారుణమైన నేరాలు, మహిళలపై అత్యాచారాలు, యాసిడ్‌దాడులు, కన్నకూతురుపైనే అత్యాచారాలు ఆపై హత్యలు. స్వార్థపూరిత జీవనం చూస్తారు. ఇవే నేరాలను ఆదివాసి ప్రాంతాల్లో తిరిగిచూస్తే దండకారణ్యం కావచ్చు, అబుజ్‌మాడ్ ప్రాంతం కావచ్చు, నియాగిరి కావచ్చు, కాందమహల్ కావచ్చు. తెలంగాణలేని ఏటూర్ నాగారం, భద్రాచలం, ఉట్నూరు కావచ్చు. వాటిని మనం చూడవచ్చు. ఎందుకంటే ఆదివాసి సంస్కృతివలె వారి పూర్వీకులు ఒక నైతిక విలువల జీవనాన్ని చిత్రీకరించారు. భూమిపండుగ చేస్తారు. అందరూ కలిసి భూమిని మొక్కి దున్నటం ప్రారంభిస్తారు. విత్తనం వేసే ముందు విత్తుపండుగ. పంట పొట్టకొచ్చాక పొట్ట పండుగ. పంట చేతికొచ్చాక కోతల పండగ(పెద్దల పండుగ)ను చేసుకొంటారు. పెద్దల పండుగ అయిన తర్వాతనే అందరూ కూడా కాయగూరలు తినడం ప్రారంభిస్తారు. దీనిలో ఉమ్మడి భావం చూడవచ్చు. అంతేకాకుండా ప్రకృతిని పూజించటం, రక్షించటం చూడవచ్చు. పెద్దల పండుగ మనకు మనం నాటిన విత్తు పరిపుష్టిగా మనకు అందటం ద్వారా అప్పుడు మనం వాటిని తింటే మనం కూడా పరిపుష్టిగా వుంటాం. పెళ్లి విధానంలో కూడా 5 రోజులు ఉంటుంది. అందులో రకరకాల ఇంటిపేర్ల వారు పేరంటాళ్లుగా పెద్దలుగా తమ సాంస్కృతిక పాత్ర ఆనందంగా పోషించి పెళ్లిచేస్తారు. చివరకు చావులో కూడా చనిపోయిన వ్యక్తిని దానం చేసేముందు పాడెను ఒక ఇంటి పేరు వారు పట్టటానికి వీలులేదు. నాలుగు రకాల ఇంటిపేర్ల వారు పాడెను మోయాలి. చావులో కూడా ఉమ్మడి చావును గమనించవచ్చు. చావులో, బతుకులో ఆనందంలో దుఃఖంలో ఎక్కడ చూసినా మనమంతా ఒక్కటే అనేభావన

సాంస్కృతిక భాగమైవున్నప్పుడు స్వార్థపర జీవనం లేనప్పుడు నేరం చేయాలనే ఆలోచనకు స్థానం లేదనే చెప్పాలి. ఒక కోయ యువతిపై కోయ యువకుడు గోండు యువతిపై గోండు యువకుడు అత్యాచారం చేయలేదు. ఇదిగాక ఆదివాసీలలో ప్రతి ఇంటి పేరు వారికి అడవిలో ఒక చెట్టు, జంతువు దేవతలుగా ఉంటాయి. అంటే ప్రకృతిని పూజించటంలో జీవవైవిధ్య పరిరక్షణను చూడవచ్చు. కాని ఆంధ్ర ప్రభుత్వం దానిని 57 సంవత్సరాలుగా విధ్వంసానికి గురిచేసింది. ఆదివాసి ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికన క్రైస్తవీకరణ హైందవీకరణ జరిగిపోయింది. దీనంతటికి ఆదివాసీల పేదరికం ప్రధాన కారణం అయింది. రెండవది ఆదివాసి ప్రాంతాలలో అభివృద్ధి కోసం పనిచేసే అధికారులు ఏదో ఒక మతానికి అనుబంధమై ఉండటం, గిరిజనేతరుల వలసలు ప్రధాన కారణాలయితే పాఠ్యాంశాలలో సైతం దసర, క్రిస్‌మస్, దీపావళి, సంక్రాంతిల గురించి ఉండటం వలన ఆదివాసి విద్యార్థులకు పాఠశాల విద్య నుంచి తమ పండుగలు, దేవుళ్లను మర్చిపోయి పరాయి సంస్కృతికి నెట్టబడుతున్నారు.

ఆదివాసీల చారిత్రక పోరాటాలకైతే చరిత్రలో చోటులేదు. 1260-1300 సంవత్సరం వరకు కాకతీయుల వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సమ్మక్క సారలమ్మలకు ఈ సమాజం ఇచ్చిన విలువలేమిటి? 1974లో ఏర్పాటైన యూనివర్సిటికి సమ్మక్క తల్లిపై యుద్ధం చేసిన పగిడిద్దరాజు జంపన్న, నాగులమ్మ, గోవిందరాజు, సారక్కలను చంపి సమ్మక్క రక్తాన్ని కళ్లజూసిన చరిత్ర హీనుడిగా చూసిన కాకతీయ రాజుల పేరు కాకతీయ యూనివర్సిటి అని పెట్టింది. కాని, శ్రీ సమ్మక్క సారలమ్మల యూనివర్సిటి అని పెట్టలేదు. సామ్రాజ్యవాదానికి కొమ్ముకాసి ఆదివాసీల జీవితాలతో చలగాటమాడి 6 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన రాజశేఖరరెడ్డి పేరు అనవసరంగా కడప జిల్లా పేరు పెట్టింది కాని 700 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగి కోటొక్క భక్తుల మన్ననలు అందుకున్న సమ్మక్క సారలమ్మల పేరును మండల స్థాయికి పరిమితం చేసింది. స్వయం పరిపాలన 700 సంవత్సరాలుగా కోయలకు రావటం లేదని సమ్మక్క సారలమ్మల ఆత్మ ఘోషల సాక్షిగా గద్దెలపై నేడు కోయల స్వయం ప్రతిపత్తి జిల్లా పునర్నిర్మాణం జరగాలి.

మొదట స్వతంత్ర్య పోరాటంగా చెప్పుకునే 1857కు ముందు ఆసిఫాబాద్ కేంద్రంగా గోండుల రాజు అయిన రాంజీగోండి నిజాం బ్రిటీష్ వలస పాలనను వ్యతిరేకిస్తూ తిరుగుబాటు చేయటం జరిగింది. ఈ పోరాటంలో నిర్మల్‌లోని ఊడల మర్రికి రాంజీ గోండుతో సహా 1000 మంది గోండులను ఉరితీస్తే అది వెయ్యి ఊడల మర్రిగా గోండుల ఆర్తనాదాలను 1990 వరకు ప్రకృతి పరంగా వినిపించింది. కాని ఈ చారిత్రక పోరాటం చరిత్రలో లిఖించబడలేదు. ఈ పోరాట చైతన్యం మళ్లీ ఏ పోరాటానికి దారితీస్తుందోనని దొంగచాటున ఈ చెట్టును కాల్చేసింది సమాజం. ఈ అమరుల సాక్షిగా ఆదివాసి ప్రాంతాల పునర్నిర్మాణం జరగాల్సి వుంది. 'జల్, జంగల్, జమీన్'పై సర్వహక్కులు మావే గోండ్ రాజ్యస్థాపనే మా ధ్యేయం అని రగల్ జెండాను ఎగరవేసి నేటి ప్రజా ఉద్యమాలకు ఊపిరైన జోడెన్‌ఘాట్ లొద్దులలో అసువులు బాసిన కొమురం భీం సాక్షిగా స్వయం ప్రతిపత్తి గల గోండుల జిల్లాల పునర్నిర్మాణం జరగాలి. కొమురం భీం ఆశయ సాధన అయిన ఆదివాసి స్వయం పరిపాలన నినాదంతో పునర్నిర్మాణం జరగాలి. ఇంద్రవెల్లిలో 400 మంది అమరత్వం సాక్షిగా అడవిపై గోండులకు హక్కులు దక్కాలి.

పరాయి పాలనను వ్యతిరేకించి గర్జించి చరిత్ర తొక్కిపెట్టిన సోయంగంగులు ఆనవాళ్లు చరిత్ర రూపంలో రావాలి. స్వయం ప్రతిపత్తికై గర్జించిన సోయం గంగులు ఆశయ స్వయం ప్రతిపత్తిగల గుత్తికోయల జిల్లాగా పునర్నిర్మాణం జరగాలి.

భారత రాజ్యం'5'వ షెడ్యూల్డ్ 244(1) అధికరణ ఆదివాసి ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి అధికారం కల్పించాలని సూచిస్తుంది. 1996 పంచాయితీరాజ్ షెడ్యూల్డ్ ప్రాంతాల 'విస్తరణ చట్టం' ఈ పార్లమెంట్ నియమించిన దిలీప్‌సింగ్ భూరియ కమిటీ నివేదించిన విధంగా '6'వ షెడ్యూల్డ్ నమూనాను అనుసరించి 5వ షెడ్యూల్డ్ ప్రాంతాలను కూడా అటానమస్ డిస్ట్రిక్ కౌన్సిల్స్‌గా ఏర్పాటు చేయాలని 4(డి) క్లాజుల సూచించింది. కాని నేటికి ఏ పాలకులు దానిని అమలు చేయలేదు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా, రాజ్యాంగ బద్ధమైన ఆదివాసీల జిల్లాలు ఏర్పాటు చేయవలసి ఉంది. ఆదిలాబాద్(ఉట్నూర్)ను ఇంద్రవెల్లి పేరును అమరుల సాక్షిగా జిల్లాగా, ఆసిఫాబాద్‌ను కొమురంభీం జిల్లాగా స్వయం ప్రతిపత్తిగల గొండు జిల్లాలుగా, కరీంనగర్(మహదేవ్‌పూర్) ప్రాంతాన్ని కోయల జిల్లాగా, వరంగల్(ఏటూర్ నాగారం) కోయ ప్రాంతాన్ని శ్రీ సమ్మక్క సారలమ్మల జిల్లాగా, ఖమ్మం(భద్రాచలం) ప్రాంతాన్ని శబరి జిల్లాగా, ఇల్లందు ప్రాంతాన్ని సోయం గంగులు జిల్లాగా ఏర్పాటు చేయాలి. ఈ స్వయం ప్రతిపత్తిగల జిల్లాలలో ఆదివాసి మాతృభాషలోనే పరిపాలన విద్యాబోధన జరగాలి. ప్రత్యేక గిరిజన యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలి. 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలుచేయాలి. ఆదివాసిలకు లంబాడాలకు మధ్య రిజర్వేషన్ విధానంలో వచ్చే సమస్యను పరిష్కరించటం కోసం లంబాడిలతో సంబంధం లేకుంటే రిజర్వేషన్ విధానం తీసుకువచ్చి లంబాడీలు ఆదివాసి భూభాగానికి రాకుండ వారికంటూ అధిక జనాభా కల్గిన లంబాడా ప్రాంతాలను ప్రత్యేక భూభాగంగా గుర్తించాలి. భారత రాజ్యాంగం 5వ షెడ్యూల్డ్ మూడవ భాగం(సి) క్లాజు ప్రకారం నాన్‌షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాలుగా గుర్తించాలి. అంతిమంగా తెలంగాణలో ఆదివాసి ప్రాంతాన్నంతటిని కలిపి స్వయం ప్రతిపత్తి మండలిగా ఏర్పాటు చేయాలి. లేదంటే వలస పాలన నుంచి విముక్తి చెందిన తెలంగాణకు అర్థం అనేది ఉండదు. ❖

# తెలంగాణలో దళిత్ ఎజెండా

**మల్లేపల్లి లక్ష్మయ్య**
సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ అధ్యక్షులు

***తెలంగాణాలో ఉన్న లక్షలాది మంది దళితుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా, కుల అణచివేత, అంటరానితనానికి వ్యతిరేకంగా కుల నిర్మూలన ధ్యేయంతో కార్యక్రమం ఉండాలి. దళితుల ఆర్థికాభివృద్ధికి శాశ్వతమైన వనరులను కల్పించడంతో పాటు రాజకీయ అధికారంలో నిజమైన భాగస్వామ్యాన్ని అందించడం, సామాజిక సమానత్వం కలను నిజం చేయాలి. గౌతమబుద్ధుడు మొదలు డా॥బి.ఆర్.అంబేద్కర్ వరకు సాగించిన కృషి, సాధించిన విజయాల స్ఫూర్తితో ముందుకు వెళుతున్న దళితుల విముక్తి ప్రయాణంలో తెలంగాణ ప్రభుత్వం, సమాజం ఒక చారిత్రాత్మకమైన పాత్రను నిర్వహించాలి. ఈ లక్ష్య సాధనకోసం వినూత్న, విభిన్న కార్యక్రమరూపకల్పనతోపాటు సమర్థవంతంగా అమలు జరగడానికి తగిన యంత్రాంగాన్ని రూపకల్పన చేయాలి.***

దళితులంటేనే పేదరికానికి, సామాజిక అణచివేతకు మారుపేరు. నిత్యం పనికొరకు దేవులాట, ఎందుకూ పనికిరాని చారెడు భూమి, ఉన్న ఊళ్ళో ఏ పనీ దొరకక బతుకుదెరువుకు బతకపోవుడు, లక్ష్మణరేఖ దాటలేని సీతమాదిరిగా పదోతరగతి దాటలేని యువతీ, యువకులు. అధికారులు, ప్రభుత్వాలు తొంగిచూడని ఊరంచు గుడిసెలు, సామాజిక జీవితం నుండి వెలివేత– ఇదీ ఈనాటి దళితుల జీవన చిత్రపటం. గోటిచుట్టుపై రోకటిపోటు పడినట్టు తెలంగాణ వెనుకబాటు తనం దళితులపట్ల మరింత శాపంగా పరిణమించింది. నీళ్ళులేక ఎండిన పల్లెల్లో ఎదుగూబొదుగూలేని జీవితాలతో అల్లాడి పోతున్నారు. ఒకవైపు ఆకలి, మరోవైపు కుల అణచివేత దళితులను వెంటాడుతూనే ఉన్నాయి.

అయినప్పటికి సమాజ పురోగతికి చెమటను, రక్తాన్ని ధారపోసిన, కీలకమైన మలుపుల్లో ప్రాణాలకు లెక్కచేయకుండా ముందుకు సాగుతూ,



బతుకు గ్యారంటీలేని పరిస్థితుల్లో వందలాది ఏళ్ళుగా దళితులు జీవన్మరణ పోరాటం సాగిస్తున్నారు. సమాజాభివృద్ధిలో దళితులు వేసిన అంగలు లేకుంటే ఈనాటి తళుకు, బెళుకులు లేవు. వ్యవసాయాన్ని ముందుకు దూకించిన చెరువుల నిర్మాణంలో, నిర్వహణలో దళితులు అగ్రగాములు. అన్ని కులాల వృత్తులకు, ఊరు మనుగడకు పునాదిగా ఉన్న తోలు వస్తువుల ఉత్పత్తి దళితుల సొంతం. మురికిలో మురికిగా మారి శుచిని, శుభ్రతను అందించింది దళితులు. ఆదిలో మానసిక వైద్యులుగా, ఆయుర్వేద వైద్యులుగా సేవలందించింది దళితులు. అన్నింటిని మించి పారిశ్రామిక రంగానికి మూలస్తంభాలైన రైల్వేలు, గనుల నిర్మాణంలో, ఉత్పత్తిలో దళితులు లేకుంటే పరిస్థితిని ఊహించలేం. ప్రారంభంలో దళితేతరులంతా ఈ రంగాలపట్ల విముఖత చూపించారు. ఎందుకంటే, ప్రారంభంలో గనులు, రైల్వేల్లో పనులు ప్రాణాంతకంగా ఉండేవి. క్రమంగా రక్షణ వసతులు ఏర్పాటయిన తర్వాత అందరూ అటువైపుగా మళ్ళారు.

ఇన్ని రకాల నైపుణ్యాలను, నేర్పును, ఓర్పును, ధైర్యాన్ని కలిగిన దళితులకు ఈ సమాజం అందించింది వెలివేత. ఈ వెలివేత బహుముఖంగా సాగింది. విద్య, భూమి, వనరులు, పాలన అన్నింటిలో ఆమడదూరంలో ఉంచారు. దానికి అనుగుణంగానే అంటరానితనం దళితులను క్రూర అణచివేతకు గురిచేసింది. తల ఎత్తితే రక్తాలు పారించింది.

అయితే డా॥ బి.ఆర్. అంబేద్కర్ సాగించిన పోరాటం, కృషి మాత్రమే దళితులకు నిర్దిష్టమైన ప్రయోజనాలను అందించింది. ముఖ్యంగా మూడు విషయాల్లో ఆయన చట్టబద్ధంచేసిన రక్షణలు లేనట్లయితే, దళితులు ఈ స్థితికి చేరుకునే అవకాశమే లేదు. అవే

1. విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు
2. చట్టసభల్లో ప్రాతినిధ్యం
3. అత్యాచారాలు, అంటరానితనం నిర్మూలనకు రక్షణ చట్టాలు.

కాలక్రమంలో ప్రభుత్వాల చిత్తశుద్ధిలోపించడం వలన ఆశించిన స్థాయిలో రాజ్యాంగ రక్షణలు అమలు జరగకపోవడం వలన దళితుల అభివృద్ధిగురించి యాభై సంవత్సరాలు దాటిన తరువాతకూడా స్వతంత్ర భారతదేశంలో మళ్ళీమళ్ళీ చర్చించుకోవాల్సి రావడం విచారకరం.

నూటికి పదిహేడు శాతం మంది దళితులు పట్టణాలలో నగరాలలో జీవిస్తున్నారు. వీళ్ళు అత్యంత దయనీయమైన జీవితాలను గడుపుతున్నారు. కాలుచాపుకోవడానికి కూడా సౌకర్యంగాలేని ఇళ్ళలో

కుటుంబం మొత్తం వెళ్ళదీయాల్సి వస్తోంది. ఇంటి సమస్య పట్టణాలలో దళితులకు ఒక ప్రధాన శాపంగా ఉంది. చదువుకున్న వాళ్ళ సంఖ్య ఎక్కువే అయిన ప్పటికీ మెట్రిక్, ఇంటర్‌లే వాళ్ళకు హద్దులు అవుతున్నాయి. దానితో మరింతగా పేదరికంలోకి వెళ్ళాల్సి వస్తోంది. పల్లెల్లోలాగ కాకుండా పట్టణాల్లో దళిత మహిళలు కొద్దిమంది ఇళ్ళల్లో పనులకు(డొమెస్టిక్ వర్కర్స్) వెళ్తుంటారు.

కానీ, వీళ్ళసంఖ్య చాలా తక్కువ. ఎక్కువ మంది ఎటువంటి పనులు లేకుండా ఇళ్ళల్లోనే ఉంటున్నారు. దీనితో ఇళ్ళు గడవడానికి ఒక మగవాడు గడించే సంపాదన చాలడంలేదు. వీళ్ళలో ఎక్కువమంది దుకాణాలలో ఉద్యోగులుగా, ఆటోడ్రైవర్లుగా, ఎలక్ట్రీషియన్లుగా, ప్రింటింగ్ ప్రెస్ కార్మికులుగా జీవితాలను వెళ్ళదీస్తున్నారు. చౌకధరలతో సరుకులు కొనుక్కోవాలనుకొనేవారికి రేషన్‌కార్డు ఒక పెద్ద సమస్య. చదువు లేకపోవడం, నివాసముండడానికి నీడలేని అభద్రతా జీవితాన్నీ వీళ్ళు గడుపుతున్నారు. దేదీప్యమాన వెలుగుతో క్లీన్‌సిటీ-గ్రీన్‌సిటీగా అవార్డులను, రివార్డులను అందుకుంటున్న హైదరాబాద్ నగరంలో మలమూత్రాలను విసర్జించడానికి కూడా సౌకర్యంలేని మురికివాడల్లో లక్షలాది దళితులు నివాసం ఉంటున్నారు.

ఇటువంటి పరిస్థితులు ఎదుర్కొంటున్న దళితుల పురోగతికి ప్రభుత్వాలు మాత్రమే చిత్తశుద్ధితో కృషిచేయాలి. దానికి ప్రధాన ఆసరా ఇటీవల చట్ట రూపం దాల్చిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్. దీనితో పాటు ఇతర అన్ని రంగాల్లో ప్రభుత్వం ఒక సమగ్రదృక్పథంతో కార్యక్రమాల, పథకాల రూపకల్పన జరపాలి. అందులో కొన్నింటిని ఇక్కడ పొందుపరుస్తున్నాం.

1. ప్రతి దళిత కుటుంబానికి సామాజిక, ఆర్థిక అభివృద్ధికోసం 3 ఎకరాల సాగుకు యోగ్యమైన భూ వసతిని కల్పించాలి. మిగులు భూముల, ప్రభుత్వ రెవెన్యూ భూములు, దేవాలయ భూములను నిర్దిష్ట కాలపరిమితిలో పంపిణీ చేయాలి. అవసరమైతే సాగు భూమి కొనుగోలుచేసి, ఆ కుటంబంలోని దళిత మహిళ పేరుమీద ఒకే కమతంగా పట్టా ఇవ్వాలి.
2. తెలంగాణ ప్రత్యేక సమస్యల దృష్ట్యా ప్రతి కుటుంబానికి భూమి పంచడంతో పాటు వాటికి కావలసిన వసతులు- అంటే నీరు, కరెంటు, విత్తనాలు, పెట్టుబడి ముదలగు వసతులు ప్రభుత్వమే కల్పించటం. వీటికి ప్రత్యేక సంస్థలు అనగా దళితులకు ప్రత్యేక వ్యవసాయానికి కావలసిన పెట్టుబడులు, విత్తనాలు ముదలగునవి సరఫరా చేయటం. ఈ సొసైటీలో ఆయా ప్రాంతానికి చెందిన దళితులను సభ్యులుగా నియమించటం. పండిన పంటలను ఈ సంస్థలు ప్రభుత్వ ధరలకు వారివద్దనుంచి తప్పనిసరిగా కొనుగోలు చేయటం. పంటల బీమా పథకాన్ని ఖచ్చితంగా వర్తింపచేయాలి.
3. తెలంగాణలో ఉన్న దళితులు 80 శాతం వ్యవసాయ కూలీలు, వారి జీవన విధానానికి తగిన వేతనాన్ని పొందే హక్కు, పని భద్రత, మెరుగైన పనిపరిస్థితులు, సంక్షేమ పథకాలు ముదలైన అంశాలను కల్పించే చట్టం చేయాలి.
4. ప్రతి గ్రామంలో ఉన్న సామాజిక వనరుల్లో అంటే చెరువులు, వాగులు, మట్టి, చెట్లు, నీరు, సాగునీరు, మంచినీరు వాటిలో ఆ గ్రామానికి చెందిన దళితులకు తప్పనిసరిగా సభ్యత్వం, వారికి వనరులపైన హక్కు కల్పించటం. ఇందుకు తగిన చట్టాలు తీసుకురావాలి.
5. వివిధ విధానాల ద్వారా దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములు అన్యాక్రాంతమైనందున తిరిగి దళితులకు ఇచ్చే విధంగా చట్టాన్ని తీసుకురావాలి.

1. దళితులందరికి తప్పనిసరి ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను కల్పించడంలో భాగంగా ప్రతి మండలంలో రెసిడెన్షియల్ స్కూళ్ళను ప్రారంభించి, దళిత బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యను అందించి, విద్యాబోధన ఇంగ్లీషులోనే జరపాలి.
2. దళిత విదార్థినీ, విద్యార్థులకు చదువుకొనే ఆర్థిక స్థోమతలు లేనందున తప్పనిసరి ఉచిత విద్యను పాఠశాల స్థాయి నుంచి యూనివర్శిటి వరకు కల్పించాలి.
3. అన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో రాజ్యాంగం ప్రకారం దళితులకు రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించేలా చూడటం. ఉన్నత ప్రమాణాలు కలిగిన-బిజినెస్ స్కూల్, ఐఐటి, ఐఐఐటి సంస్థల్లో తప్పనిసరిగా రిజర్వేషన్లు పాటించేలా చర్యలు తీసుకోవాలి.
4. ఉన్నత విద్యాసంస్థలలో చదువుకునే దళిత విద్యార్థులు ప్రైవేటు/ ప్రభుత్వ సంస్థల్లో ఫీజులతో పాటుగా మెస్ చార్జీలు, ఇతర ఫీజులు అన్ని ప్రభుత్వమే భరించాలి.
5. విదేశీ యూనివర్శిటీలలో అడ్మిషన్లకోసం జరిగే ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఇవ్వడంతోపాటు, విదేశాల్లో చదువుకోసం వెళ్ళే విద్యార్థులకు అన్నిరకాల సహాయాలను బేషరతుగా అందించాలి.

1. ప్రస్తుతం దేశంలో ప్రపంచంలో వస్తున్న మార్పుల కనుగుణంగా ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు జరగడానికి కావలసిన చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టేటట్టు చర్యలు తీసుకోవాలి.
2. అంబేద్కర్ ఆశించిన విధంగా రాజ్యాంగంలో పొందుపరిచిన దళిత ఆర్థిక, సామాజికాభివృద్ధి జరిగేలా అన్ని రంగాల్లో రిజర్వేషన్స్ తప్పనిసరిగా అమలుచేయాలి.

3. ప్రస్తుతం అమలులో వున్న రిజర్వేషన్ విధానంలోని లోపాలను సవరిస్తూ, అధికారులను జవాబుదారిగా చేయడానికి పారదర్శకత ధ్యేయంగా సమగ్ర రిజర్వేషన్ చట్టాన్ని రూపొందించటం, ఈ చట్టాన్ని రాజ్యాంగంలోని షెడ్యూల్-9లో చేర్చడం ద్వారా వివాదాలకు తావులేకుండా చూడాలి.

4. అనారోగ్యం, ప్రమాదాలవలన తలెత్తే ఆర్థిక భారంతో కానీ, మరే ఇతర అత్యవసర ఖర్చులవలన కానీ దళితుల జీవితాలు తిరిగి అధోగతి పాలుకాకుండా ఉండడానికి సామాజిక భద్రతకోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలి, బీమా సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం ఒక నిధిని ఏర్పాటు చేయాలి.

5. వృత్తివిద్య పట్టభద్రులకు ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చి 50 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలి.

1. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అత్యాచారాలను నిరోధిచండానికి క్యాబినెట్ హోదా కలిగిన ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయుట, అంటరానితనం వ్యతిరేక దళాలను ఏర్పాటు చేసేవిధంగా చట్టాలు చేయాలి.

2. అత్యాచార కేసులను పరిశోధించడానికి, విచారించి తగు రిపోర్టులను ఇవ్వడానికి నిబద్ధత కలిగిన అధికారులను నియమించాలి.

3. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం సక్రమంగా అమలుజరగడానికి అమలు-పర్యవేక్షణకోసం ఉన్నత స్థాయి కమిటీని నియమించాలి.

4. జోగిని, సఫాయి, మ్యాన్‌వల్ స్కావెంజింగ్ లాంటి అంటరానితనం రూపాలను తక్షణమే నిర్మూలించడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలి.

1. దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రతి దళిత కుటుంబానికి సమగ్రమైన ఆరోగ్య జీవిత బీమా పథకాన్ని వర్తింపచేస్తూ దీని ప్రీమియం కొరకు ప్రభుత్వమే 'కార్పస్ ఫండ్'ను ఏర్పాటు చేయాలి.

2. అందరికీ పరిశుభ్రతగల మరుగుదొడ్లను నిర్మాణంచేసి వాటిని ఉపయోగించే విధానంలో ప్రత్యేకమైనటువంటి శిక్షణ, అవగాహన కల్పించాలి.

1. నగరాలు, పట్టణాల్లోని ప్రభుత్వ స్థలాల్లో దళితులకు కనీస వసతులతోకూడిన అపార్ట్‌మెంట్లు నిర్మించాలి.

2. నిరుద్యోగ యువతీ యువకులకు వారి అర్హత, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి.

3. ప్రభుత్వ ఉద్యోగాలురాని యువతీ, యువకులకు ప్రభుత్వమే వారి సంసిద్ధతను బట్టి టెక్నికల్ విషయాలలో శిక్షణ ఇప్పించాలి.

4. సొంతంగా వ్యాపారాలు, పరిశ్రమలు స్థాపించాలనుకొనే యువకులకు బ్యాంకులచేత రుణాలు, శిక్షణను ఇప్పించి అవసరమైన షాపింగ్ కాంప్లెక్స్, మౌలిక సదుపాయాలు కల్పించాలి.

5. నగరాలు/పట్టణాలలోని ప్రతి దళిత వాడలో ఇంగ్లీష్ మీడియంలో రెసిడెన్షియల్ స్కూల్స్ స్థాపించాలలి.

1. విధాన నిర్ణయాలు తీసుకొనే అన్ని కమిటీలలో స్త్రీలకు సమాన భాగస్వామ్యం కల్పించాలి.

2. వారి వారి అర్హతలను, అభిరుచులను బట్టి స్వయం పోషకంగా ఉండే ఉపాధి అవకాశాలు కల్పించాలి.

3. దళిత మహిళల అభివృద్ధికోసం డ్వాక్రా కార్యక్రమాలలో భాగంగా ప్రత్యేక పథకాలతో కార్యక్రమాలు చేపట్టటం, బ్యాంకుల నుంచి రుణాలను అందేటట్లు చర్యలు తీసుకొని, అవసరమైతే ప్రభుత్వమే ఒక నిధిని ఏర్పాటు చేసి ఆర్థిక సహాయం, రుణాలు మంజూరు చేయించాలి.

6. దళిత బాలికల చదువు విషయంలో ప్రభుత్వం మరింత ప్రత్యేక శ్రద్ధను కనబర్చటం, పిల్లల చదువులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ప్రత్యేకంగా గుర్తించి, తగు విధంగా ప్రోత్సాహకాలు కల్పించాలి.

1. ప్రభుత్వంలోని అన్ని విభాగాలలో కొనుగోలుచేసే వస్తువులను 40 శాతానికి పైగా దళిత వ్యాపారులనుంచి కొనుగోలు చేయాలి.

2. ప్రభుత్వంలోని విభాగాలు ఇస్తున్న డీలర్‌షిప్‌లలో కాంట్రాక్ట్ పనులలో 25 శాతం అవకాశాలను దళితులకు కల్పించాలి.

3. ఏజన్సీ దళితుల సమగ్రాభివృద్ధికి ఇంటిగ్రేటెడ్ దళిత్ డెవలప్‌మెంట్ ఏజన్సీ (ఐ.డి.డి.ఎ) ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

4. దళితులు నడుపుతున్న సంస్థలకు, పరిశ్రమలకు ఆర్థిక సహాయాన్ని అందించి వాటి ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

5. ఎస్ఎస్‌సి నుంచి డిగ్రీ మధ్యలో చదువులు ఆపివేస్తున్న దళిత యువతీ యువకులకు ఉపాధి గ్యారంటీగా ఉండే ట్రైనింగ్ కోర్సులలో శిక్షణ ఇప్పించటం, అప్పటికీ వారిలో ఉన్న నైపుణ్యాలను (స్కిల్స్) మరింత పెంచుకొనే విధంగా సాహాయ పడాలి.

6. వ్యాపార కేంద్రాలలో మడిగెలు (షాపింగ్ కాంప్లెక్స్) నిర్మించి నిరుద్యోగ యువతీ యువకులకు ఇవ్వాలి. ❖

ఆచార్య తోట జ్యోతిరాణి
కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్

# జెండర్ సమానత దిశగా నవ తెలంగాణ గమనం - ఒక అవగాహన

***తమ బతుకులు బాగు చేసుకోవాలన్న తపనతో, ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకోవాలన్న ఆరాటంతో ప్రత్యేక తెలంగాణ కోసం తెలంగాణ ప్రజలు, అందులో భాగంగా చురుకైన భాగస్వామ్యంతో మహిళలు, సాగించిన పోరాటాల, త్యాగాల, ఉద్యమాల ఫలితమే భౌగోళిక తెలంగాణ. నవ తెలంగాణ నిర్మాణానికిది ప్రారంభం మాత్రమే. ఉన్నతమైన మానవ సంబంధాలు, ప్రజాస్వామిక స్త్రీ-పురుష సంబంధాలు ఏర్పడతాయనే దిశగా ఒక తెలంగాణ గమనం ఉండాలన్నది తెలంగాణ ప్రజల ఆకాంక్ష. హక్కులు, సమానత్వం ప్రాతిపదికగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక నిర్మాణాలను రూపొందించుకోవటమే అంతిమ లక్ష్యం.***

ఏ సమాజంలోనైనా అస్తిత్వంలో ఉన్న సామాజికార్థిక రాజకీయ నిర్మాణాలు పురుషుల జీవన స్థితిగతులను నిర్ధారిస్తాయి. కాగా వీటికి అదనంగా ఉనికిలోఉన్న పితృస్వామిక నిర్మాణాలు తోడై స్త్రీల జీవితాలను నిర్ణయిస్తాయి. నిర్ధేశిస్తాయి, శాసిస్తాయి. తెలంగాణ ఇందుకు మినహాయింపు కాదు.

జెండర్ సమానత, మహిళా సాధికారతలను సాధించడం ద్వారానే ప్రపంచ సమాజ నిర్మాణాలను మానవీయం చేసుకోవటం సాధ్యమవతుందని ఐక్య రాజ్యసమితి కచ్చితమైన అభిప్రాయం. మానవాభివృద్ధి లక్ష్యంనుండి జెండర్ సమానతను విడదీసి చూడలేమంటుంది ఐక్యరాజ్యసమితి. ఇది తెలంగాణకూ వర్తిస్తుంది.

సమ్మిళిత, ప్రజాస్వామిక, హింసారహిత, సుస్థిరమైన అభివృద్ధిని సాధించటానికి జెండర్ సమానత తప్పనిసరి షరతు అన్న అవగాహనతోనే 2008-11కు సంబంధించిన "జెండర్ సమానతా వ్యూహాన్ని" యుఎన్‌డిపి రూపొందించింది. జెండర్ వివక్షను నిర్మూలించి జెండర్ సమానతను సాధించటమే అభివృద్ధి లక్ష్యమని, అంతేకాకుండా అతి ప్రాథమిక మానవహక్కు అని ప్రకటించింది.

దోపిడీ, పీడన, ఆధిపత్యం, పెత్తనం లేని ఉన్నత విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించుకునే దిశగా గమనమే జెండర్ సమానత అని నిర్వచించి, ఈ లక్ష్యసాధనకు ప్రధాన స్రవంతి అంశాలలో మహిళల భాగస్వాములను(జెండర్ మెయిన్‌స్ట్రీమింగ్) చేయాలని, అందువల్ల అంతర్జాతీయంగా ఆమోదించబడిన హక్కులు మహిళలకు అందుబాటులోకి వస్తాయని, తద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని గమ్యం చేరటానికి ఇది ప్రధాన సాధనమని ఐక్యరాజ్యసమితి గుర్తించింది. అందువల్ల ఆ దిశగా వ్యూహరచనకు, కార్యక్రమాల రూపకల్పన అమలుకు ప్రపంచ దేశాల ప్రభుత్వాలకు మార్గదర్శకాలను రూపొందించింది. ఈ విధంగా హక్కులు, సమానత్వం ప్రాతిపదికగా ప్రపంచాన్ని మానవీయం చేసుకోవాలన్న లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి ప్రపంచ సదస్సులను నిర్వహిస్తున్నది. లక్ష్య ప్రకటనలను చేస్తున్నది. కాగా మరొకవైపు ఆధిపత్య దేశాల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ప్రపంచబ్యాంకు, దాని నియంత్రణలో వర్ధమాన దేశాలు అందులో భాగంగా భారతదేశం ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, సరళీకరణలను బలోపేతం చేయటానికి అనుకూలమైన విధానాలను రూపొంది స్తున్నది. అమలు చేస్తున్నది. ఫలితంగా వనరులు, సంపద, ఆదాయాల మీద కార్పొరేటు శక్తులు ఆధిపత్యం రోజురోజుకూ బలపడుతున్నది. మెజారిటీ ప్రజలు అభివృద్ధి క్రమం నుంచి బయటకు నెట్టివేయబడు తున్నారు. బతుకు భారంగా, మనుగడే ప్రశ్నార్థకంగా జీవిస్తున్నాయి. ఈ పరిస్థితులలో



మహిళల బతుకులు మరింత సంక్లిష్టమైనాయి. పితృస్వామ్య సమాజాలలో అసమానతలను తీవ్రతరం చేసే అన్ని అంశాల ప్రతికూల ప్రభావం సాపేక్షికంగా మహిళల మీదనే అధికంగా ఉంటుందన్నది నిర్వివాదాంశం. ఏ సంక్లిష్ట పరిస్థితి ఏర్పడినా దాని దుష్ఫలితాలకు స్త్రీలే బలవుతారు. రోజురోజుకూ బలంగా విస్తరిస్తున్న ప్రపంచీకరణ ప్రభావం వల్ల ప్రజాస్వామిక సూత్రాలు, భావజాలం మరింత బలపడ్డాయి. అందువల్ల పేద మహిళల బతుకులు దుర్భరమైనాయని వివిధ అధ్యయనాలు వెల్లడిచేశాయి. ఇక వెనకబడిన తెలంగాణలో గ్రామీణ పేద మహిళల స్థానం సమాజ నిర్మాణాల అట్టడుగుననే అన్నది స్పష్టం. ఇటువంటి అంతర్జాతీయ, జాతీయ నేపథ్యంలో తెలంగాణ స్త్రీలు ఆత్మగౌరవంతో హుందాగా బతకాలంటే నవ తెలంగాణ నిర్మాణం ఏ పునాదుల మీద ఉండాలి అన్నది ప్రశ్న. జెండర్ సమానత, మహిళా సాధికారత దిశగా తెలంగాణ మహిళ అడుగులు వేయాలంటే ఇటువంటి అనుకూల పరిస్థితుల సృజన అవసరమనేది సీరియస్‌గా చర్చించవలసిన అంశం.

భారతదేశంలో స్త్రీ సమస్యలన్నీ తెలంగాణ స్త్రీ సమస్యలే. పైగా గత ఆరు దశాబ్దాలుగా పూర్వాంధ్రప్రదేశ్‌లో కొనసాగిన పాలనా వివక్ష, అది సృష్టించిన వెనుకబాటుతనం, దాని వల్ల ఏర్పడిన దుష్ఫలితాల ప్రభావం తెలంగాణ స్త్రీకి అదనపు సమస్య. తెలంగాణ ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటం వల్ల పాలనా వివక్ష అంతమైంది. కాని అన్నిరకాల అసమానతలను, అందులో భాగంగా జెండర్ అసమానతను తీవ్రతరం చేస్తున్న పెట్టుబడి దారి అభివృద్ధి క్రమం, దీని వికృత రూపాన్ని బలోపేతం చేస్తున్న ప్రపంచీకరణ ప్రభావాల మాటేమిటి? వీటి నుంచి తెలంగాణను ఏ విధంగా విముక్తం చేయాలన్నది మౌలిక సమస్య.

అయితే మన టెక్నాలజీని అభివృద్ధి చేసుకోవటానికి మన వనరులు బయటకు తరలిపోకుండా కాపాడుకొని మన ప్రజలకు కావలసిన వస్తువులను ఉత్పత్తి చేయటానికి, ఉపాధిని కల్పించటానికి, పేదరికాన్ని నిర్మూలించటానికి, మొత్తంలో ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగు వేయటానికి అవసరమైన 'ప్రత్యేక తెలంగాణ'ను సాధించుకున్నాం " '' అని అంటాడు ప్రపంచ ప్రఖ్యాత రాజకీయార్థికవేత్త సమీరే అమీన్ అంటే ఒక భౌగోళిక తెలంగాణా, ప్రజాస్వామిక తెలంగాణగా పరివర్తన చెందాలన్నమాట.

తెలంగాణ వ్యవసాయం సంక్షోభంలో ఉన్నది. పాలనా వివక్ష వల్ల తెలంగాణ కోల్పోయిన నీటిని మళ్లించటం, తెలంగాణకు ప్రాణాధికమైన అన్ని చెరువులు, కుంటలు కనుమరుగవుతూంటే పట్టించుకోకపోవటం, ఉధృత ప్రవాహంతో తెలంగాణకు నీళ్లిచ్చే ఇచ్చంపల్లి ప్రాజెక్టుల వంటి వాటిని పక్కకు పెట్టటం, పర్యావరణ సమస్య వల్ల భూగర్భ జలాలు అంతరించడం, ఒకవైపు కరెంటు సమస్య, మరొకవైపు వర్షంమీదనే ఆధారపడే పరిస్థితి ఏర్పడటం, అనావృష్టి, అకాల వర్షాలు, పంట చేతికి వచ్చే గ్యారంటీ లేదు. గిట్టుబాటు ధర వచ్చే పరిస్థితి లేదు, అప్పుల పాలైన రైతు ఆత్మహత్య చేసుకొంటే ఆ కుటుంబ భారం స్త్రీ మీదనే కదా! బ్రతుకుభారం కుటుంబంలోని పురుషులు, పొట్టకూటి కోసం పట్టణాలకు వలసపోయినప్పుడు, ఊర్లో స్త్రీలు, పిల్లలను, కూలిపనివాళ్లను పట్టుకొని, పనులు దొరకక ఒకవైపు, వేతన వివక్ష మరొకవైపు అరకొర సంపాదనలో ఇంటిల్లిపాదికి ఆహార భద్రతను సమకూర్చటానికి



నిరంతర పోరాటమే అవుతుంది. స్త్రీల బతుకు-ఆర్థిక సంస్కరణల పేరిట ప్రజా సంక్షేమవ్యవస్థల నుంచి ప్రభుత్వం నిష్క్రమించడం స్త్రీ భారాన్ని మరింత పెంచింది. ఇక కుటుంబమంతా వలసపోయినప్పుడు, కొత్త ప్రదేశంలో ఉండటానికి వసతి లేక, మంచి చెడులు మాట్లాడుకునే ఇరుగు పొరుగు కరువై, భద్రత లేని పరిస్థితులలో నిరంతరం స్త్రీ భయంతో బతుకవలసిందే.

ఇంటి భారానికి తోడు ఇల్లు గడపటానికి అసంఘటిత రంగంలో పనిచేయడం స్త్రీకి తప్పనిసరి. పని ఎక్కువ, సంపాదన తక్కువ ఉండే రంగం ఇది. మెజారిటీ స్త్రీలు ఈ పనులలోనే ప్రవేశిస్తారు. యుఎన్‌డిపి అధ్యయనం ప్రకారమే ఇంటిపనిలో భాగంగా పొయ్యిలోకి కట్టెలు, తాగటానికి నీళ్లు తెచ్చుకోవటానికి స్త్రీలు రోజుకు 4-5 గంటలు అదనంగా శ్రమించవలసి వస్తుంది. పేదరిక సమస్యకుతోడు విశ్రాంతి లేకుండా నిరంతరం పనిలో స్త్రీ జీవితమే జఠిలం అయినపుడు ఇక జెండర్ సమానత ప్రస్తావనే ఉండదు కదా! పేదరిక విషవలయంలో చిక్కుకొని, నిరంతరం జీవన్మరణ సమస్యగా బతుకుతున్న ఈ మహిళ, అభివృద్ధికి, సాధికారతకు ఎంతో దూరంలో ఉన్నది? చిల్లర వ్యాపార రంగంలోకి ఒకవైపు స్వదేశీ కార్పొరేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తూ, మరొకవైపు విదేశీ పెట్టుబడులను ఆహ్వానించే చట్టాలను రూపొందిస్తుంటే, చిల్లర వ్యాపారమే చేసుకొని బతుకుతున్న మెజారిటీ మహిళల బతుకుదెరువు ఏమవుతుంది? మెజారిటీ మహిళలకు బతుకు లేకుండా చేయడమేనా? సమ్మిళిత వృద్ధి అంతే? మహిళా సాధికారతను సాధించడం ఇదేనా? ఇటువంటి ప్రజావ్యతిరేక, మహిళా వ్యతిరేక విధానాలను తెలంగాణ ప్రభుత్వం రూపుమాపాలి. అంతేకాకుండా ప్రభుత్వరంగాన్ని విస్తరించటం ద్వారా మహిళలకు మెరుగైన , భద్రతతో కూడిన ఉపాధిని కల్పించాలి. అయితే ఈ సంపాదన మీద మహిళకు హక్కు ఏ మేరకు ఉంటుందన్నది మరొక అంశం.

మహిళా సాధికారతకు పేదరిక నిర్మూలన ప్రాథమిక షరతు. పేదరిక నిర్మూలన అంటే ప్రభుత్వం రకరకాల రూపాలలో సహాయం అందించే పథకాలు కావు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా అభివృద్ధి నమూనను రూపొందించబడాలి. అభివృద్ధి క్రమంలో మహిళలను భాగస్వాములను చేయాలి. స్వంత సంపాదనతో ఆత్మగౌరవంతో బతికే పరిస్థితుల కల్పన జరగాలి.

లాభం లక్ష్యంగా పనిచేసే ప్రైవేటీకరణ, జెండర్ అసమానతలను తీవ్రతరం చేస్తుంది. అస్తిత్వంలో ఉన్న పితృస్వామిక నిర్మాణాలను బలోపేతం చేస్తుంది. మానవాభి వృద్ధిలో అతి కీలకమైన విద్య అంశాన్ని పరిశీలించి నట్లయితే తెలంగాణ మహిళ, విద్యలో సాపేక్షికంగా వెనుకబడి ఉన్నది. ఇక విద్యారంగంలో ప్రైవేటీకరణ వల్ల స్త్రీకి విద్య అందుబాటులోకి రానిదైంది. ప్రభత్వరంగంలోనే విద్య వుండాలని, అప్పుడే అది ప్రజలందరికీ, ప్రధానంగా మహిళలకు అందుబాటులోకి వస్తుందంటాడు అమర్త్యసేన్. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం పేరిట, కార్పొరేటు విద్యా సంస్థలలో ప్రవేశించిన పేద విద్యార్థులకు, ఆడపిల్లలకు ప్రభుత్వం ఫీజులను రీఎంబర్స్ చేయటం కాదు ఉచిత విద్య అంటే, దీని వల్ల కార్పొరేటు విద్యా సంస్థలను సామాజిక బాధ్యత నుంచి తప్పించి ఆర్థిక భారాన్ని ప్రభుత్వం భరించటమే అవుతుంది. ఉనికిలో ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థలను పటిష్టం చేయాలి. కొత్త విద్యాసంస్థలను నెలకొల్పాలి. విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు విద్యాసంస్థలను జాతీయం చేయాలి. అప్పుడు దానంతటదే ప్రజలకు ఉచిత విద్య లభిస్తుంది. సంపూర్ణ మహిళా అక్షరాస్యతను సాధించవచ్చు. ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ఇక ఆరోగ్య రంగానికొస్తే ఇది ప్రభుత్వరంగంలో వున్నప్పుడే, గ్లోబలైజేషన్‌కు మానవ ముఖం ఏర్పడుతుందంటాడు అమర్త్యసేన్, జాన్ డ్రెజేలు. కాని మన దేశంలో ప్రైవేటీకరణ ముందుగా ప్రవేశించింది విద్యా, వైద్య రంగాలలోనే. గుత్త పెట్టుబడిదారీ విధానం బలోపేతమైన కొద్దీ బహుళజాతి సంస్థల అభివృద్ధి, విస్తరణ తీవ్రతరమైంది. వైద్య రంగానికి సంబంధించిన అన్ని అంశాలలో బహుళజాతి సంస్థలు విస్తరించాయి. వీటి ఒత్తిడి వల్ల ప్రపంచ ఆరోగ్య రంగం మీద ప్రపంచబ్యాంకు ఆధిపత్యం స్థిరపడింది. లాభం కోసం వైద్యం రూపొందింది. దీనికి అనుగుణంగా భారతదేశ జాతీయ ఆరోగ్య విధానాలు రూపొందించబడ్డాయి. ప్రజారోగ్య వ్యవస్థ విధ్వంసం చేయబడింది. సామాన్య ప్రజలకు వైద్యం అందుబాటులో లేనిదయింది. పితృస్వామిక సమాజాలలో 'అందరికీ వైద్యం' అన్నప్పుడే మహిళలకు వైద్యం అందదు. స్త్రీలను పునరుత్పత్తి విధానాలకు మాత్రమే పరిమితం చేసి చూసే భావజాలం బలంగా ఉన్న మన సమాజంలో తెలంగాణలో స్త్రీ ఒక మనిషిగా ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు పరిగణనలోకి వస్తాయా? తెలంగాణలో ప్రసవ మరణాల రేటు అధికంగానే ఉన్నది. ఐదు సంవత్సరాల లోపల ఆడపిల్లల మరణాల రేటు అధికంగానే ఉన్నది. గర్భస్థ శిశువు ఆడపిల్ల అని తెలియగానే విచ్ఛిన్నం చేసే ప్రక్రియ తీవ్రతరం కావటం వల్ల తెలంగాణలో స్త్రీ-పురుష నిష్పత్తిలో స్త్రీలు చాలా తక్కువగానే ఉన్నారు. 0-6 సంవత్సరాల వయస్సులో ఆడపిల్లల సంఖ్య మరీ తక్కువగా ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఈ ధోరణి ప్రారంభమైంది అధిక కులాలలో, సంపన్న వర్గాలలో, విద్యావంతులలో, పట్టణవాసుల్లో, అది క్రమంగా కింది కులాలకు, అట్టడుగు వర్గాలకు, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. ఇందుకు మూలాలు పితృస్వామిక నిర్మాణాలు సమాజంలో ఉండగా సమస్యను తలకిందులుగా చూసి, చేసి కిందికులాల వాళ్లు గ్రామీణ పేదలు, చదువులేని వాళ్లు ఈ సమస్యకు కారణమని చెబుతూ బంగారుతల్లి వంటి పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టడం హాస్యాస్పదం. సమస్యకు అసలు మూలాల్లోకి వెళ్లకపోవటం సీరియస్ విషాదం. ఇక బాల్యవివాహాలు, జోగిని, బసివిని సమస్య, మంత్రాలు చేస్తున్నారనే నెపంతో స్త్రీలను కొట్టిచంపడం తెలంగాణలో కొనసాగుతూనే ఉన్నాయి.

వివాహేతర సంబంధం విషయంలో కూడా స్త్రీనే బాధ్యురాలిగా చేసి, టివి ఛానల్స్ కెమెరాల సాక్షిగా వేములవాడ ప్రాంతంలో ఒక స్త్రీని క్రూరంగా కొట్టి చంపిన విషాదం మనకు తెలుసు. ఎక్స్క్లూజివ్ ఓన్లీ అని వేసుకొని గర్వపడుతూ పోతేలో ముందుండాలన్న దుర్మార్గపు దృష్టికి 'సంఘటన' జరగకుండా ఆపాలన్న కనీస మానవ ధర్మం గుర్తొస్తుందా?

ఆడపిల్లకు తన కంటూ ఒక అభిప్రాయం ఇష్టాయిష్టాలు ఉండటానికి వీలులేదు. ఒక బొమ్మలా బతకాలని శాసిస్తున్న పరిస్థితులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఆడపిల్ల ప్రేమించి పెళ్లిచేసుకుంటే ఆ అమ్మాయి తల్లిదండ్రులే తమ పరువు పోయిందని తమ బిడ్డనే చంపుకొనే పరువు హత్యలు తెలంగాణలో జరుగుతూనే ఉన్నాయి. ప్రేమించనంటే యాసిడ్ దాడులు, ప్రేమిస్తే మోసం చేయటం, బయటకువెళ్తే వేధింపులు, అత్యాచారాలకు అంతేలేదు. స్త్రీకి ఎంత సంక్లిష్టమైన స్థితి? ఇక వరకట్న సమస్య ఉండనే ఉన్నది. దీనికితోడు సంపన్న వర్గాల ఆడంబర వివాహాల తంతు టివి ఛానల్స్‌లో నిరంతరం ప్రసారమవుతుండటం వల్ల వివాహం అంటే ఇట్లనే ఉండాలనుకోవడం, నిరాడంబరతను అపహాస్యం చేసుకుంటూ, ఆడంబరాలకు పోయి సాధారణ కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి.

వాణిజ్యవిలువలు రోజురోజుకూ బలపడటం వల్ల తెలంగాణలో కూడా 'ఆడపిల్ల అందం' విషయంలో తప్పుడు భావనలు బాగా బలపడ్డాయి. వ్యక్తిత్వం, మంచితనం, మానవీయత భావనలు పూర్తిగా విస్మరించబడ్డాయి. "రంగు తెల్లగా ఉండటం, ఆకృతి సన్నగా ఉండటమే" అందానికి కొలమానమైంది. ఈ కొలమానంలో ఇమడటానికి ఆడపిల్లల వెంపర్లాట. అందువల్లనే చిన్న చిన్న పట్టణాలలో కూడా బ్యూటీ పార్లర్లు విస్తరిస్తున్నాయి. కార్పొరేట్ కాస్మోటిక్ ఉత్పత్తులు పెద్దఎత్తున అమ్ముడవుతున్నాయి. 'ఆత్మవిశ్వాసమే అందం' అన్న భావన పూర్తిగా నిర్మూలించబడింది. నల్లగా ఉన్నా, లావుగా ఉన్న ఆడపిల్ల తనను తానే ఛీత్కరించుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. భాష, యాసను అవమానిస్తే తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవ పోరాటమే చేశారు కదా! మరి పుట్టుకలో వచ్చిన శారీరక రంగు, ఆకృతిల కారణంగా ఆడపిల్ల అవమానించబడుతుంటే, దీనికి వ్యతిరేకంగా సీరియస్‌గా ఉద్యమించాల్సిందే. సమాజం చైతన్య వంతమై ఈ ఊబినుంచి ఆడపిల్లను బయటకు తీసుకొనిరావాలి.

తెలంగాణలో మారుమూల ప్రాంతం నుంచి పట్టణాల వరకు కూడా ఆడపిల్లలను రకరకాలుగా మోసం చేసి, బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి బ్లూఫిల్మ్ విషవలయంలో బంధిస్తున్నారు. వ్యభిచారం తప్ప మరొక బతుకుదెరువు లేని హీనస్థితికి ఈ మహిళలు నెట్టివేయబడుతున్నారు.

ఇక రోజు రోజుకూ ఆడపిల్లల మీద పెరుగుతున్న అత్యాచారాల గురించి చర్చిస్తే ఒకవైపు ఆడపిల్లను విలాసవస్తువుగా స్థిరపరిచే వాణిజ్యవిలువలు, మరొకవైపు అశ్లీలతతో నిండిపోయిన వెబ్‌సైట్లు, సినిమాలు, ప్రోగ్రాములు సెల్‌ఫోన్‌లో నిరంతరం అందుబాటులోకి వచ్చిన ఇంటర్‌నెట్ మొదలైనవన్నీ పురుషుని బలహీనతను రెచ్చగొడుతున్నాయి. వాణిజ్య విలువలకు మానవ సంబంధాలు గురించి పట్టదు కదా! ఫలితంగా ఆడపిల్లల మీద దాడులు రోజురోజుకూ పెరుగు తున్నాయి. మహిళా సాధికారత, మహిళా అభివృద్ధి కూడా అటుంచి ఆడపిల్లను రక్షించుకోవటమెట్లా అన్నది ప్రధాన సమస్యయింది. దీనికితోడు 'అగ్నికి ఆజ్యం పోసినట్ల'యి తాగుబోతులను చేసి ప్రభుత్వ ఖజానాను నింపుకునే లక్ష్యంగా రూపొందించి, అమలవుతున్న మద్యం విధానం వల్ల అత్యాచారాలు మరింత పెరుగుతున్నాయి. ఈ అంశాలను సంబోధించకుండా 'కఠినతర శిక్ష'ను పరిష్కార మార్గంగా గుర్తిస్తుంది ప్రభుత్వం. ఈ చట్టాలతో నేరాలు ఆగలేదు సరికదా అవినీతిమయ పాలకవ్యవస్థలో నేరస్థుడు పట్టుబడతాడా? పట్టుబడ్డా శిక్షించబడతాడా? నేరస్థుడు బలవంతుడైతే శిక్షించే ప్రశ్నే లేదు కదా! పైగా బాధితురాలినే బాధ్యురాలిగా చేసే పాలకవర్గాలు, ప్రభుత్వ యంత్రాంగం కనిపిస్తుంది. పెప్పర్ స్ప్రే, కరాటేలను పరిష్కార మార్గాలుగా ప్రచారం చేయటం మరొక అంశం. "వ్యవస్థీకృత సమస్యకు వైయక్తిక పరిష్కార మార్గాలా" ఈ పరిస్థితులు నవ తెలంగాణలో కొనసాగకూడదు.

ఇక పోలవరం ప్రాజెక్టు వల్ల విస్తాపనకు గురయ్యే ఆదివాసీ కుటుంబాలెన్నో? బజారున పడ్డ ఆ కుటుంబాలకు చెందిన ఆదివాసీ స్త్రీల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుంది? క్లినికల్ ట్రబుల్స్‌కి ప్రయోగశాలగా మారి కుటుంబానికి సంపాదననిచ్చే వస్తువైంది ఆదివాసీ మహిళ. భర్త వ్యసనాల అవసరాల కోసం, ఆదివాసీ మహిళ గర్భసంచి ఒక వాణిజ్య సరుకైంది. మొత్తంగా ఆడపిల్లే ఒక వ్యాపార సరుకుగా మారుతున్నది.

ఇట్లా తెలంగాణా మహిళ జీవితం సంక్లిష్టమైంది. బతుకు నిరంతరం జీవన్మరణ సమస్యే. అయితే ఈ పరిస్థితికి మూలాలు పితృస్వామిక నిర్మాణాలలో ఉన్నాయి. వాటిని బలోపేతం చేస్తున్న సాంఘికార్థిక నిర్మాణాలలో ఉన్నాయి. ఈ నిర్మాణాలను సమానత్వ పునాదిగా నిర్మించుకోగల్గితేనే స్త్రీ మీద అమలవుతున్న పితృస్వామిక పీడన అంతరిస్తుంది.

ఈ నిర్మాణాలన్నింటిని మానవీయం చేసుకునే అభివృద్ధి నమూనాలోనే నవ తెలంగాణ రూపుదిద్దుకోవాలి. అప్పుడే జెండర్ సమానత దిశగా తెలంగాణ గమనం ఉంటుంది. అయితే ఇది దానంతటదే, సులభంగా సాధ్యం కాదు. చైతన్యవంతమైన ప్రగతిశీల ప్రజాస్వామిక వాదులు సంఘటితమై ఉద్యమించడమే నవ తెలంగాణను సాధించటానికి మార్గం. తెలంగాణ గమనాన్ని జెండర్ సమానతా దిశగా నిర్దేశించటంలో తెలంగాణ మహిళ కీలకపాత్ర పోషించాలని నా ఆకాంక్ష. ఈ దిశగా ఆరాట పోరాటాలే మానవీయ తెలంగాణను ఆవిష్కరిస్తాయి. ❖

# తెలంగాణ రాష్ట్రంలో ముస్లిం ప్రజల ఆశలు - ఆకాంక్షలు

లతీఫ్ మహ్మద్‌ఖాన్
సివిల్ లిబర్టీస్ మానిటరింగ్ కమిటి

*మొత్తం మీద తెలంగాణ ప్రజలు ఆతృతగా ఎదురుచూసిన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. గతంలో ఉన్న హైద్రాబాద్ రాష్ట్రాన్ని రెండుగా విడగొట్టి కొత్తగా ఏర్పర్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భావనను అది ఏర్పడిన తొలిరోజునుండి ఇప్పటిదాకా ముస్లింలు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. అన్ని ప్రభుత్వ రంగాలనుండి ముస్లింలను తొలగించటం ద్వారా వాళ్ల అస్తిత్వాన్ని, సంస్కృతిని నిర్మూలించడానికి కుట్ర జరుగుతుందని ముస్లింలు బలంగా అనుకుంటున్నారు. దురదృష్టవశాత్తు భారతప్రభుత్వం హిందూ కాంగ్రెస్ నాయకులతోపాటు, ఆంధ్ర పాలకులతో చేసుకున్న ఒప్పందాల వల్ల ముస్లింలు పెద్ద ఎత్తున నష్టపోయారు. వాళ్ల భూములు, ఉద్యోగాలు, అస్తిత్వం, సంస్కృతి, భాష తదితర సమస్త జీవనరంగాల్లోని వాళ్ల ఉనికిని అంతటిని ఒక్క కలం పోటుతో వారు కోల్పోయారు. కాని తెలంగాణలోని హిందువులు, ఆంధ్ర పాలకులకు కేవలం వాళ్లు, తమ మతం వాళ్లన్న మైండ్‌సెట్‌తో మద్దతు పలికారు. వాళ్లు సాధారణ తెలంగాణ ప్రజల గురించి ఆలోచించలేదు. ఏమైనా ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలే బాధితులు. కనుక ముస్లింలంతా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తలెత్తినప్పుడల్లా ఎవరైతే తమ భాషా సంస్కృతులను ద్వేషించారో అటువంటి ఆంధ్రా పాలకుల పీడన నుండి స్వేచ్ఛ దొరుకుతుందనే ఆశతో ఉద్యమానికి సదా మద్దతు పలుకుతూ వచ్చారు.*

1969లో ఎప్పుడైతే తెలంగాణ ఉద్యమం మొదలైందో అప్పటి ఉద్యమానికి చార్మినార్ కేంద్రమనే విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి. నినాదాలు, పాటలు ఉర్దూ భాషలోనే ఉండేవి. పోలీసు ఫైరింగులలో తెలంగాణ లోని ముస్లింలు, హిందువులు ప్రాణాలు త్యజించారన్నదీ తెలిసిందే. వాస్తవానికి తెలంగాణ కోసం మొట్టమొదటి ప్రాణత్యాగం చేసింది కూడా ముస్లిమే నన్నది మరచిపోరాదు. ఆంధ్రా పాలకవర్గం తెలంగాణలోని రెడ్డి వెలమలను లొంగదీసుకొని తెలంగాణ ఉద్యమాన్ని కుట్రలతో, కుతంత్రాలతో అణచివేశారు. ముస్లింలను అన్ని రంగాలు, క్షేత్రాలనుండి పక్కకు నెట్టడానికి, వాళ్లు తమ శక్తియుక్తులను ప్రయోగించి పూర్తిస్థాయిలో ప్రయత్నించారు. పాలకవర్గం కేవలం తమ ప్రయోజనాల గురించి మాత్రమే ఆలోచించినప్పుడు ఆంధ్రాపాలక వర్గాలు దానిని ఉపయోగించుకొని తమ ఎత్తుగడలను అమలుపర్చుకోవడంలో సఫలీకృతులయ్యారు. దీనిని సాకుగా తీసుకొనే రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ముస్లింలు తెలంగాణను కోరుకోవడం లేదని, అందువల్ల వాళ్లు తెలంగాణకు అనుకూలంగా లేరనే దుష్ప్రచారానికి పాల్పడే సాహసానికి ఆయన మలిదశ తెలంగాణ ఉద్యమ కాలంలో పాల్పడ్డారు. ఈ దుష్ప్రచారం వల్ల హిందువుల, ముస్లింల నడుమ దూరం, శతృత్వం పెరిగింది. ఇది తెలంగాణకు, తెలంగాణ ప్రజలకు వ్యతిరేకంగా జరిపిన పెద్ద కుట్ర.

తెలంగాణ ముస్లిం వేదిక తన పనిని మొదలు పెట్టినప్పుడు అది మరోసారి తెలంగాణ ఉద్యమాన్ని చార్మినార్ చుట్టుప్రక్కల పునరావృతం చేసింది. ముందే చెప్పినట్లు సమైక్య రాష్ట్రంలో ముస్లింలు ప్రధాన పీడితులు. అడుగడుగున వాళ్లు వివక్షకు గురయ్యారు. వాళ్లు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా బలహీనపడ్డారు. ముస్లింల హక్కులు కాలరాయబడ్డాయి. వరుసదాడులవల్ల ముస్లిం ఆర్థిక పరిస్థితులు దిగజారిపోయినవి. ముస్లింల నైతికతను దెబ్బతీయడానికి అన్నిరకాల కుయుక్తులకు పాల్పడ్డారు. వాళ్లపై ఐ.ఎస్.ఐ. ఏజెంట్లుగా, ఉగ్రవాదులుగా ముద్రవేసారు. వాళ్లలో భయాన్ని, భీతావహస్థితిని కలగచేశారు. తద్వారా వాళ్లు తమ హక్కుల కోసం మాట్లాడలేని, డిమాండ్ చేయలేని స్థితిని కల్పించారు. 1956 కు ముందు హైద్రాబాద్ రాష్ట్రంగా ఉన్న కాలములో ముస్లింలు విద్య, ఉపాధి,వ్యాపార రంగాల్లో ముందుండేవారు. కాని ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక వాళ్లు అన్ని రంగాల్లో వెనుకపడ్డారు.

ఇన్ని రకాల వివక్షలవల్ల ముస్లింలు ఏమనుకుంటున్నారంటే వాళ్ల జీవితాల్లో మార్పు జరగాలంటే వాళ్లకు సమాన ఉపాధి, విద్యావకాశాలతోపాటు రాజకీయాల్లో కూడా తగినంత భాగస్వామ్యం లభించాలని. కనుక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనైనా వాళ్ల కొన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వాళ్లు అనుకుంటున్నారు.

హైద్రాబాద్ రాష్ట్రములోని కొంత భాగాన్ని ఆంధ్రలో వీలినం చేశాక, దాని ప్రభావం ముస్లింలపై ప్రత్యేకంగా, ముస్లిం మహిళలపై తీవ్రంగా పడింది. అప్పటిదాకా అధికార భాషగా ఉన్న ఉర్దూను తొలగించారు. ఆంధ్రుల తెలుగును తప్పనిసరి చేసి దాన్ని అధికార భాషగా చేయడం వల్ల ముస్లింలు తమ ఉద్యోగాలు కోల్పోయారు. అందువల్లనే ఉద్యోగావకాశాలు తగ్గిపోయాయి. నిరుద్యోగిత పెరిగింది. దాని ప్రభావం నేరుగా ముస్లిం మహిళలపై పడింది. పేదరికంవల్ల

ఈ రోజు ముస్లిం మహిళలు ఇండ్లలోంచి బయటికి రావాల్సి వచ్చి ప్రతి రోడ్డు కూడలి వద్ద ప్రతి మస్జిద్ వద్ద బిచ్చమెత్తుకుంటు కనబడటాన్ని చూడొచ్చు. ఆత్మహత్యల రేటు పెరిగింది. ముస్లిం ఆడపిల్లల పెళ్ళిళ్లు సమస్యగా మారాయి. వరకట్న చావులు పెరిగినవి. చట్టవ్యతిరేక ఆర్థిక సంస్థలు, వడ్డీ వ్యాపారుల బెడద పెరిగింది. ఉపాధి లేమి అనే దుస్థితి వల్ల ముస్లింలు తమ ఆడపిల్లలను ఏదో కొద్దిపాటి మొత్తాలకు అరబ్ షేక్‌లకు పెండ్లి పేరిట అమ్ముకునే బలీయమైన పరిస్థితులు నెలకొన్నాయి. హైదరాబాద్ పాతబస్తీలో పరిస్థితి దుర్భరంగా ఉంది. మైనారిటి కార్పోరేషన్ గాని, జాతీయ బ్యాంకులుగాని ఈ పేద ప్రజలకు రుణాలు పొందే అవకాశాన్ని కల్పించకపోవడం వల్ల పరిస్థితి దారుణంగా ఉంది. కొంతకాలం క్రితం కొంతమంది చట్టవిరుద్ధ ఆర్థిక సంస్థలకు చెందిన వ్యక్తులు చార్మినార్ కట్టడం మీది నుండి ఒక ఆడపిల్లను పడదోసి చంపివేసిన సంఘటన పాతబస్తీలో ముస్లిం మహిళల స్థితికి అద్దం పడుతుంది.

కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలోనైనా తమ పరిస్థితి మెరుగు పడుతుందని ముస్లిం మహిళలు గొప్పగా ఆశిస్తున్నారు. వాళ్ల హోదా, గౌరవం సంరక్షించబడ్తుందని, పేదరికం నిర్మూలించబడ్తుందని, చట్టవిరుద్ధ రుణసంస్థల వలన ఏ ముస్లిం స్త్రీ కూడా బలవంతంగా ఆత్మహత్యకు పాల్పడే దుస్థితి రాకూడదని, ఆడపిల్లలను అరబ్ షేక్‌లకు కొద్ది మొత్తాలకే ఒప్పుకొని పెండ్లి పేరిట అమ్ముకునే దుస్థితి ఉండరాదని వాళ్లు ఎంతగానో అభిలషిస్తున్నారు.

ముస్లిం యువత రోజురోజుకు దిగజారుతున్నది. మొదట్లో వాళ్లను రౌడీషీటర్లుగా ముద్ర వేసి తదనంతరం ఛాందస వాదులుగా చిత్రీకరిస్తున్నారు. ప్రస్తుతం వాళ్లను ఉగ్రవాదులుగా ముద్రవేయడం వల్ల, వాళ్ల జీవితాలు దు:ఖకరంగా మారిపోయాయి. ఏదైనా అవాంఛిత సంఘటన దేశంలో ఎక్కడ జరిగినా హైద్రాబాద్ ముస్లిం యువకులకు మూడినట్లే. ఈ యువతను క్షణాల్లో ప్రాథమిక లక్ష్యం చేసుకొని పోలీసు వ్యవస్థ, మీడియా ముస్లిం యువకులను టెర్రరిస్టులుగా ప్రకటిస్తాయి. వాళ్ళను చట్టవిరుద్ధంగా బంధించి, హింసించి తప్పుడు కేసులు బనాయిస్తారు. ఇప్పటిదాకా సేకరించిన సమాచారం మేరకు ఇలా హింసించి వేధించే పోలీసు అధికారులందరు రాయలసీమ, కోస్తాంధ్రకు చెందినవారే. పోలీసు వ్యవస్థ, మీడియా ముస్లిం యువతను టెర్రరిస్టులుగా చిత్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నది. కాని ముస్లింలు టెర్రరిజం బాధితులని విశ్వశిస్తున్నాం. అంతేకాదు వాళ్లు రాజ్యంచేత పోలీసులచేత, మీడియాచేత, హిందూత్వ శక్తులచేత దాడులకు గురవుతున్నారు. ముస్లింలు మూడు రకాల భయోత్పానికి లక్ష్యంగా ఉన్నారు. అవి 1) బాంబు పేలుళ్ల భయోత్పాతానికి, 2) పోలీసు భయోత్పాతానికి, 3) మూక భయోత్పాతానికి వాళ్లు లక్ష్యంగా ఉన్నారు.

ముస్లింలు, కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రంలో వివక్ష ఆగిపోవాలని, అన్ని రంగాల్లో వాళ్లకు ఉద్యోగ కల్పన జరగాలని, మరీ ముఖ్యంగా వాళ్లను ఐ.ఎస్.ఐ. ఏజెంట్లుగా, ఉగ్రవాదులుగా ముద్ర వేయటం ఆగిపోవాలని కోరుకుంటున్నారు. వాళ్ల జీవించే హక్కు, వాళ్లు మనిషి హోదాలో బ్రతికే హక్కు పునరుద్ధరించాలని, వాళ్ల జీవితాలతో ఆడుకునే పోలీసు అధికారులు శిక్షింపబడాలని వాళ్లు కోరుకుంటున్నారు. రిజర్వేషన్ల వల్ల ఉన్నత విద్యావకాశాలు మెరుగు పడుతాయని, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఆశ పడుతున్నారు. ముస్లిం యువతను పీడిస్తున్న అతి పెద్ద సమస్య నిరుద్యోగం. అది తగ్గిపోయి ప్రభుత్వ రంగంలో ఉద్యోగా వకాశాలు లభిస్తాయని ఆశిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో మార్పు జరిగి పోలీసుల వ్యవహార శైలిలో నిజాయితీ పెరిగి తద్వారా వారి జీవితాల్లో జీవన స్వేచ్ఛ పరిరక్షించబడ్తుందని కూడా వారు ఆశిస్తున్నారు.

ముస్లిం సగటు మనిషి పేదల్లో కెల్లా పేదవాడు. లేదా ఎంతో కొంతమంది మాత్రమే మధ్యతరగతికి చెందినవారు. సమైక్య రాష్ట్రంలో వాళ్లు సర్వస్వం కోల్పోయారు. ఒకప్పుడు ఈ సగటు మనిషి ఎంతో కొంత భూమికి యజమాని. వాళ్లు వ్యవసాయంతో మనుగడ సాగించే రైతుగా ఉండేవారు. అట్లాంటి వాళ్లు 1948, 1956 సంవత్సరాలకు బాధితులు. వాళ్లిప్పుడు భూమిలో కనీస వాటా కోరుతున్నారు. మళ్లీ వాళ్లు వ్యవసాయాన్ని వృత్తిగా చేసుకొని జీవించాలని కోరుకుంటున్నారు. వాళ్ల గొప్ప సంస్కృతి, వైభవోపేత వారసత్వాన్ని తమ స్మృతి పథంలోకి తెచ్చు కుంటున్నారు. వాళ్ళ సంస్కృతి పునరుద్ధరింపబడాలని, వాళ్ల వారసత్వం పరిరక్షించబడాలని వాళ్లు ఆశిస్తున్నారు. వాళ్ల ప్రథమ ప్రాధాన్యం, వాళ్లు ప్రధానంగా చింతిస్తున్నది ఉర్దూ గురించే. ఉర్దూ వాళ్ల ప్రాణం. వాళ్ల గుర్తింపు. ఆంధ్రా పాలకులు పద్ధతి ప్రకారంగా దాన్ని నిర్మూలించారు. తెలంగాణ రాష్ట్రంలో వాళ్ల భాష మరోసారి అధికారభాషగా పునరుద్ధరించబడాలని వాళ్లు ఆశిస్తున్నారు. ఒక్కసారి ఉర్దూ అధికార భాషగా నిజంగానే ఆచరణలో పునరుద్ధరింపబడితే ముస్లింల జీవితాల్లో వాళ్ల నైతిక ధృతి దానంతటదే ఉన్నతీకరింపబడ్తుంది. అంతేకాక అది వాళ్ల జీవితంలోని అన్ని జీవన సందర్భాల్లో నూతన అవకాశాలకు ద్వారాలు తెరుస్తుంది.

సగటు ముస్లిం ఏమనుకుంటున్నాడంటే, వాళ్ల సమస్యలను పట్టించుకొని, వినే నాథుడే లేడని, చట్టసభల్లో వాళ్ల ప్రాతినిధ్యం తగినంతగా లేకపోవడం వల్ల వాళ్ల గొంతు విప్పించే అవకాశమే లేదని. అందువల్ల వాళ్లు చట్టసభల్లో తగినంత ప్రాతినిధ్యాన్ని కోరుకుంటున్నారు. విధానాల రూపకల్పనలో అధికారాన్నీ, భాగస్వామ్యాన్నీ కోరుకుంటున్నారు. ఆంధ్రా పాలక వర్గాల చేత దురాక్రమణకు గురైన వక్ఫ్ భూములన్నింటిని వెనక్కు తీసుకొని ముస్లింల అభివృద్ధి కేంద్రంగా ఉపయోగించాలి. మైనార్టీ ఆర్థిక సంస్థ, వక్ఫ్ బోర్డును, ఉర్దూ అకాడెమి తదితర ముస్లిం మైనార్టీలకు సంబంధించిన ప్రభుత్వం రూపొందించిన సంస్థల యందలి దక్షత గల పరిపాలనాధిపతులను నియమించాలని ఈ శాఖలన్ని వివక్షకు, నిర్లక్ష్యానికి గురికాకూడదని, ముస్లింలు కోరుకుంటున్నారు. మైనార్టీల

హక్కులను పరిరక్షించడానికి రూపొందించిన మైనార్టీ కమీషన్ అందుకు తగినవిధంగా పనిచేయాలని వాళ్లు కోరుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మత రాజకీయాలు అంతం కావాలని సాధారణ వ్యక్తులు బలంగా కోరుకుంటున్నారు. వాళ్లకి నూతనంగా రూపొందించిన తెలంగాణా ప్రభుత్వం మీద గొప్ప ఆశలున్నాయి.

ముస్లిం సమాజంలోని బుద్ధిజీవులు, గొప్ప ప్రజాస్వామిక వాదులు ఎందరో విశ్వవిద్యాలయ స్థాయిలో పనిచేస్తున్నప్పటికి, వాళ్లు రాజ్య నిర్బంధం, విశ్వవిద్యాలయ శాఖాధిపతుల వివక్షకు భయపడి బైటికి రావడం లేదు. వాళ్లు తెలంగాణ ఏర్పడ్డాక ఆంధ్రా అధికారులు, శాఖాధిపతుల బెడదనుండి విముక్తి చెందుతామని అనుకుంటున్నారు. ఎందుకంటే వాళ్లకు ఆంధ్ర అధికారులతో దుర్భర అనుభవాలున్నాయి. వాళ్లు ప్రజలకోసం మాట్లాడినప్పుడల్లా వాళ్లను ఛాందసవాదులుగా ముద్రవేసి వేధించారు. తెలంగాణ ప్రభుత్వంలో ఆంధ్రా అధికారుల ఒత్తిడి తగ్గి, వాళ్ల ఇచ్ఛతో వాళ్లు, స్వేచ్ఛగా పనిచేయగలరని వాళ్లు ఆశిస్తున్నారు. అంతేగాక వాళ్లు వాళ్ళ పని స్థలంలో, సహోద్యోగుల నడుమ తగుగుర్తింపు పొందుతామని ఆశిస్తున్నారు. ఈ ప్రజల ప్రజాస్వామిక హక్కులు, అణచివేయబడుతున్నాయని అనుకుంటున్నారు. దశాబ్దాలుగా హైద్రాబాద్ 144 సెక్షన్ క్రింద మగ్గుతున్నది. హైద్రాబాద్ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛ లేదు. ప్రజల ప్రాథమిక హక్కు అయిన భావప్రకటన స్వేచ్ఛ వాళ్లకు దక్కాలని వాళ్లు చాలా ఆశిస్తున్నారు. నిరసనను, అసమ్మతిని ప్రదర్శించే హక్కు పునరుద్దరించబడాలని, 144 వ సెక్షన్ తదితర ఆటంకాలు లేకుండా తమ భావోద్వేగాలను ప్రకటించుకునే అవకాశాలు ఉండాలని, లేకుంటే అవి హింసాత్మక రూపంలో పెల్లు బుకుతాయని వాళ్లు అనుకుంటున్నారు. ఇటువంటి ఒక ప్రజాస్వామిక వాతావరణం కోసం నిజమైన ప్రజాస్వామిక స్ఫూర్తి అవసరమని, తెలంగాణ ప్రభుత్వం అటువంటి ప్రజల ప్రజాస్వామిక హక్కులను గౌరవించాలని వాళ్లు అనుకుంటున్నారు. ఎందుకంటే తెలంగాణా ఏర్పడిందే ప్రజాఉద్యమం వల్ల కాబట్టి తెలంగాణ లౌకికంగానూ, ప్రజాస్వామికంగానూ ఉంటుందని నమ్ముతున్నాం. రాజకీయాధికారం కోసం ఆంధ్ర పాలకుల వల్ల విస్తరించిన ద్వేషభావాన్ని ముస్లింల మీద దాడికి అవకాశం కోసం ఎదురుచూస్తున్న హిందూత్వ శక్తులను నియంత్రించడం ద్వారా నిర్మూలించాలని కోరుకుంటున్నాం. అట్లాగే మతతత్వ, ప్రజావ్యతిరేక ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. అధికారులను ఇక్కన్నుంచి తరలించి, తెలంగాణ ప్రభుత్వం లౌకిక తరహాలో పనిచేయాలని కూడా కోరుకుంటున్నాం. ముస్లిం సమాజంలోని పెద్దలు విచారణకు రాకుండా సంవత్సరాల తరబడి జైళ్ళలో మగ్గుతున్న వందలాది ముస్లిం యువత గురించి విపరీతంగా చింతిస్తున్నారు. ఈ ప్రభుత్వం వీళ్లకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాం. అట్లాగే తప్పుడు కేసులను ఉపసంహరించాలని, వాళ్లను జైళ్లలోంచి విడుదల చేసి వాళ్లకు తగిన పునరావాసాన్ని కల్పించాలని కోరుతున్నాం. హిందూత్వ మైండ్‌సెట్ ఉన్న పోలీసు ఉన్నతాధికారుల ఒత్తిళ్లకు తలొగ్గి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అబ్దుల్ ఖదీర్‌ను 23 సం॥లుగా జైల్లలో ఉంచారు. ఇతని జీవితం గురించి ముస్లిం సమాజం విపరీతంగా చింతిస్తున్నది. ఇతన్ని కనీసం ఈ ప్రభుత్వమైనా తక్షణ చర్యలు చేపట్టి విడుదల చేయాలని కోరుతున్నారు. పోలీసు హింస ఉండకూడదని, హైద్రాబాద్ చుట్టుప్రక్కల గల పోలీసు హింసా కేంద్రాల నిర్వహణ, గండిపేటలోని గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో అక్రమ నిర్బంధం, ఎన్‌కౌంటర్ చావుల వంటివి అన్ని వర్గాల ప్రజలకు లేకుండా పోవాలని కోరుకుంటున్నాం. తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ ప్రజల ఉద్యమాన్ని, వాళ్ల పౌర,ప్రజాస్వామిక, మానవ హక్కుల్ని గౌరవిస్తుందని వాళ్లు ఆశిస్తున్నారు.

ఇవన్నీ ప్రజల ఆశలు. ప్రత్యేకంగా ముస్లిం ప్రజా సమూహాల ఆశలు. తెలంగాణ ప్రభుత్వానికి ఇది లిట్మస్ పరీక్ష వంటిది. తెలంగాణ ప్రభుత్వం మీద ఈ వాగ్దానాలన్ని నెరవేర్చే గొప్ప బాధ్యత ఉంది. తెలంగాణ ప్రభుత్వములోకి వస్తున్న వాళ్లంతా ప్రజల పోరాటాల వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుంచుకోవాలి. ఆ వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమైతే తెలంగాణ ఏర్పాటు లక్ష్యం దెబ్బతింటుంది. ఆంధ్రా పాలకుల మాదిరిగానే తెలంగాణ ప్రభుత్వం కూడా ముస్లింలను ఓటుబ్యాంకుగా భావించి వారికి చట్టసభల్లో ఈ ఎన్నికల్లో మాదిరిగానే ప్రాతినిధ్యం కల్పించకపోతే, వాళ్లను కేవలం మచ్చుతునకలుగా చూపించడానికి మాత్రమే వాడుకుంటే, వాళ్లందరు రాజకీయ వ్యవస్థ మీద, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మీద మొత్తంగానే విశ్వాసాన్ని కోల్పోతారు. తెలంగాణ కోసం ఉద్యమించిన, ప్రాణాలు కోల్పోయిన, ఆత్మబలిదానానికి పాల్పడిన వాళ్లంతా కేవలం ముస్లింలు మాత్రమే కాదు. వాళ్లు కూడా విశ్వాసాన్ని కోల్పోయే అవకాశం ఉంది. అంతమాత్రమే కాదు ఒక సంక్షోభం ఏర్పడి, తిరుగుబాటు సంభవించి పోరాటంలో పాల్గొన్న అదే ప్రజలు పెద్ద ప్రజా ఉద్యమాలను నిర్మించి రాజకీయ నాయకులను విసిరికొడతారు. తెలంగాణ ఉద్యమం ప్రజా ఉద్యమం. అది ఇంకా ఆచరణాత్మకంగా ఉండి ప్రజలు 'వేచిచూద్దాం తరహా ధోరణిలో ఉండి ఇక ఏమాత్రం వాళ్లకు అన్యాయం జరిగినా లేక వాళ్లు పోరాడినట్టి తెలంగాణ ఇది కాదని తేలినా వాళ్లు తిరిగి ఉద్యమించగలరు.' ఒక ఉర్దూ విప్లవ కవి ఫైజ్ అహ్మద్ చెప్పినట్లు,

**"ఈ మచ్చ వెనక దాగిన వెలుగు**
**ఈ నిశీధి కాటువేసిన ప్రభాతం**
**దేనికోసమైతే ఎదురుచూశామో**
**అది ఇది కాదు!"** అని ప్రజలు భావించినట్లైతే ఆంధ్రా పాలకుల మాదిరిగానే ఈ పాలకులు కూడా తన విధానాలను కొనసాగిస్తే వారితో ఢీ అనడానికి ప్రజలు ఎల్లప్పుడు సిద్ధంగానే ఉంటారు. వాళ్లకు తగిన గుణపాఠం చెప్తారు.

**అనువాదం: బాసిత్ (విరసం)** ❖

ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ
ఉస్మానియా యూనివర్సిటీ

# తెలంగాణ చరిత్ర - సంస్కృతి పునర్నిర్మాణం

*నవతెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంలో ప్రాంతీయ చైతన్యం, చరిత్ర, సంస్కృతి, ఉనికి, ఆత్మగౌరవాలు కేంద్ర బిందువులుగా పునర్నిర్మాణం జరగాలనే బలమైన ప్రయత్నం జరుగుతుంది. ఇందులో భాగంగానే ప్రత్యేక తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పునరుజ్జీవనాలకు సంబంధించిన అనేక అంశాల్ని పున:పరిశీలించాలి, తిరిగి రాయాల్సిన అవసరముంది. ఎందుకంటే తెలంగాణ చరిత్రకారులకు గనివంటిది. దానికి గర్వించదగ్గ విశిష్ట చరిత్ర ఉన్నప్పటికీ కారణాంతరాలవల్ల అది బుడ్డి దీపాల వెలుగులో మసకబారి, చీకటిలోకి నెట్టబడింది. సమైక్య రాష్ట్రంలో తెలుగువారి చరిత్ర పేరున సీమాంధ్ర ప్రాంతాలకు పెద్దపీటవేయబడి, తెలంగాణ చరిత్ర నిరాదరణకు, వివక్షకు గురైంది. అంతేకాకుండ ఆంధ్రప్రదేశ్ చరిత్ర రచనలో తెలంగాణేతర చరిత్రకారులు, రచయితలు, పరిశోధకులు ఆధిపత్యంలో వుండటంవల్ల ఈ ప్రాంత చరిత్ర సహజంగానే విస్మరించబడి వెనక్కి నెట్టబడింది. పరబ్రహ్మ శాస్త్రీ, కృష్ణశాస్త్రీ, రాధాకృష్ణ శర్మలాటి ఆంధ్ర ప్రాంత చరిత్రకారుల్ని మినహాయిస్తే, మిగతావారెవ్వరు తెలంగాణ చరిత్రను వెలుగులోకి తెచ్చిన దాఖలాలులేవు. అయితే కొంత వరకు గుడ్డిలో మెల్లలాగ సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర సంపుటాల్లో తెలంగాణ చరిత్ర, సంస్కృతుల ప్రస్తావన ఉన్నప్పటికీ అది అసమగ్రంగానే విశ్లేషించబడింది. వాస్తవానికి మొదటి తరం తెలంగాణ మేధావులైన కొమర్రాజు లక్ష్మణ రావు, మాడపాటి హనుమంతరావు, శేషాంద్రి రమణ కవులు, గడియారం రామకృష్ణ శర్మ, ఆదిరాజు వీరభద్రరావు, సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, యాజ్దాని, షేర్వానిలాంటి వారు విశేషకృషి చేసి తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణానికి అవసరమైన చారిత్రక ఆధారాలను, శాసనాలను గ్రంథాలను రచించారు. ఆ తర్వాత బి.ఎన్.శాస్త్రీ, డాక్టర్.దామెర రాజారెడ్డి, ఠాకూర్‌రాజీ రాంసింగ్‌లు ప్రాచీన తెలంగాణ చరిత్ర, సంస్కృతిపై మౌలిక పరిశోధనలు చేసి, మరుగునపడిన అనేక అంశాల్ని వెలికితీశారు. వారి పరిశోధనా ఫలితాల్ని చరిత్ర పాఠ్యాంశాలుగా పొందుపరచాలి.*

ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో కొనసాగుతున్న రాజకీయ, సామాజిక, అస్తిత్వ ఉద్యమాలు లేవనెత్తిన అనేక అంశాల్ని శాస్త్రీయంగా, హేతుబద్ధంగా బేరీజువేసి నవ తెలంగాణ నిర్మాణానికి ఉపయోగపడే చారిత్రక, సాంస్కృతి అంశాల్ని విశ్లేషించాల్సిన అవసరముంది. అదే విధంగా ఇంతవరకు ఆంధ్రదేశ రచనల్లో తెలంగాణ చరిత్రకు తగినంత ప్రాముఖ్యత ఇవ్వనిలోటును పూడ్చడానికి కృషి చేయాలి. తెలంగాణ సమస్య సమకాలీన రాజకీయాల్లో ప్రధానాంశం కావడంవల్ల ప్రాంతీయ అస్తిత్వం, గుర్తింపు చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ క్రమంలోనే దక్కన్ / తెలంగాణ చరిత్ర సంస్కృతులను విశ్లేషణాత్మకంగా పరిశోధించి తెలంగాణ ప్రత్యేకతను వివరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే వట్టికోట ఆళ్వారుస్వామి సంకలనం తెలంగాణ ఆవిష్కరించబడింది. ప్రస్తుతం తెలంగాణ పునర్నిర్మాణంలో, అస్తిత్వ ఉద్యమాల వికాసంలో ప్రధానంగా చర్చించబడుతున్న అంశం తెలంగాణ ప్రాంతీయ వ్యక్తిత్వం. దక్కన్ పీఠభూమిలో తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక చారిత్రక, భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ స్థితిగతులున్నాయి. తెలంగాణ ప్రధానంగా ఆదివాసీలు, సంచార జాతులు, దళితులు, బహుజనులు, పశుపోషణ, వ్యవసాయం ప్రధాన వృత్తులుగా స్థిరనివాసులైన కాపులకు నిలయం. తెలంగాణ సామాజిక చిత్రపటంలో గిరిజనులు, దళితులు, ముస్లింలు, ముత్రాసి, మున్నూరు కాపు, యాదవ, గౌడ, చేతివృత్తుల కుల సమూహాలు ప్రముఖ స్థానాన్ని కల్గివున్నాయి. కఠినమైన భౌగోళిక పరిస్థితుల్ని తమకు అనుకూలంగా మల్చుకుంటూ, ప్రతికూల వాతావరణాన్ని ఎదురుకొని బావులు, కుంటలు, చెర్వుల ఆధారంగా సేద్యం చేయడం తెలంగాణ ఆధిపత్య వ్యవస్థ ప్రత్యేక లక్షణం. అనాదిగా తెలంగాణలో ఇసుక, రాళ్లతో కూడిన ఎర్రటినేలలు, నల్లరేగళ్ళలో పండేతిండి ధాన్యాలు, పప్పు దినుసులు, ఆకుకూరలు, పండ్లు తదితర పంటలు ఇక్కడి ప్రజల అవసరాల్ని తీరుస్తున్నాయి. ప్రజల అవసరాలల్నింటిని తీర్చడానికి సరిపడిన వనరులు, పాడిపంటలు సమృద్ధిగా కల్గిన ఈ ప్రాంతం జనసామాన్యానికి నిరాడంబరమైన సామాజిక జీవన ప్రమాణాల్ని అందించింది.

సామూహిక ప్రయోజనాలు, మానవవిలువల పరిరక్షణ, సహజజీవన శైలి పటిష్టతకు జరిగిన సుదీర్ఘ పోరాటాలకు నిలువెత్తు సాక్ష్యం తెలంగాణం. అన్యాయాలకు, అణచివేతకు వ్యతిరేకంగా ధిక్కార స్వరాన్ని వినిపించి, నిరంతరం పోరాడే లక్షణం ఈ ప్రాంత

విశిష్ట అస్తిత్వం. ఇది ముఖ్యంగా నిమ్న కులాల, జాతుల సామూహిక సంస్కృతి, ప్రతిఘటనా చైతన్యానికి ప్రతిరూపంగా చెప్పవచ్చును. మధ్య యుగాల్లో నిరంకుశ రాచరిక వ్యవస్థను ధిక్కరించిన సమ్మక్క, సారక్కలు, సర్వాయి పాపన్న, ఆధునిక యుగంలో రాంజీ గోండ్, కొమురం భీం, బందగి, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మల పోరాట వారసత్వాలు తెలంగాణ ప్రజాజీవనంలో ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి. అదే విధంగా దక్షిణ భారతదేశంలో మరే ఇతర ప్రాంతాలలో లేని విధంగా తెలగాణ సంస్కృతిలో ఇస్లాం, సూఫీయిజం అంతర్భాగాలైనాయి. అందువల్లనే ఇక్కడి ప్రజల జీవన విధానం, భాషా, ఆచార వ్యవహారాల్లో ఇస్లాం మత ప్రభావంగా, ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. చారిత్రకంగా కుతుబ్‌షాహిల కాలం నుండి ఆసఫ్‌జాహిల వరకు మిశ్రమ సంస్కృతి, వివిధ మతాల మధ్య సామరస్యం, సహజీవనం ఈ ప్రాంత ప్రత్యేక లక్షణం. దాదాపు 5 దశాబ్దాల సుదీర్ఘ ముస్లిం పాలనలో దక్కన్ తెలంగాణ ప్రాంతంలో మత వైషమ్యాలు, మత ఘర్షణలు లేని పౌర, రాజకీయ సమాజం కొనసాగడంలో మిశ్రమ సంస్కృతి పాత్ర కీలకమైనదని చెప్పవచ్చును. అదే సంస్కృతి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో కూడా కొనసాగింది.

చరిత్ర అధ్యయనం, పరిశోధన ఒక నిరంతర గతిశీలమైన ప్రవాహం. చరిత్ర రచనలో పున:పరిశీలనలు, పునర్వ్యాచనాలు, సమీక్షలు, వ్యాఖ్యానాలు నిరంతరంగా సాగే ఒక ప్రక్రియ. ప్రముఖ చరిత్రకారుడు ఇ.హెచ్. కార్ అన్నట్లు "కొత్త లక్ష్యాలు రూపొందినప్పుడల్లా గతకాలపు సంఘటనల ప్రాముఖ్యం, గతానికి చరిత్రకారులు వ్యాఖ్యానాలు మారుతూ ఉంటాయి". ఈ సూత్రీకరణ ప్రస్తుత రాజకీయ, అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణానికి వర్తిస్తుంది. అంతేకాకుండా తెలంగాణ చరిత్ర, సంస్కృతి పునర్నిర్మాణం వల్ల దశాబ్దాలుగా అవమానాలకు, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి, పురోగతి సాధిస్తారని నా నమ్మకం. అందుకుగాను ఇంత వరకు అసమగ్రంగా ఉన్న తెలంగాణ రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, మత చరిత్రకు నిర్దిష్ట రూపకల్పన చేయాల్సిన అవసరముంది. చరిత్ర పూర్వకాలం నుండి ఆధునిక యుగం వరకు తెలంగాణ ప్రాంతీయ సంస్కృతి, నాగరికత విశిష్టలక్షణాల్ని, ప్రాముఖ్యతను సోదహరణంగా విశదీకరించాలి. గత రెండు దశాబ్దాల కాలంలో తెలంగాణ చరిత్ర పరిశోధనలో అనేక నూతన అంశాలు వెలుగులోనికి వచ్చాయి. ఉదహరణకు కరీంనగర్ జిల్లాలో చేపట్టిన పురాతత్వ తవ్వకాల్లో బయల్పడిన అవశేషాల ఆధారంగా శాతవాహనుల మొదటి రాజధాని కోటి లింగాల అనే విషయం రూఢీ అయ్యింది. అంతవరకు ఆంధ్ర చరిత్రకారులు శాతవాహనుల రాజధాని కృష్ణా, గుంటూరు జిల్లాలో ఉన్నదని పేర్కొన్నారు. అదే విధంగా ఆంధ్ర చరిత్రకారుల విశ్లేషణకు భిన్నంగా వి.యన్.శాస్త్రీ ప్రాచీనాంధ్ర చరిత్రలో తెలంగాణ ప్రాముఖ్యతను వివరించాడు. విష్ణు కుండినుల చరిత్రను పునర్నిర్మించడంతో ఆయన చేసిన పరిశోధనలు ఎంతో విలువైనవి.

మధ్య యుగాల్లో సీమాంధ్ర ప్రాంతం కంటే తెలంగాణాలో మిశ్రమ సంస్కృతి విస్తృత స్థాయిలో వ్యాపించిందనే చారిత్రక వాస్తవాన్ని పరిశోధకులు వివరించారు. తెలంగాణలో బోనాలు, బతుకమ్మ, పీర్లపండగలు, ఉర్సులు, దర్గా ఉత్సవాలు ఈ ప్రాంత ప్రత్యేక వ్యక్తిత్వాన్ని, అస్తిత్వాన్ని, విశిష్టతను తెలియజేస్తున్నాయి. ఆధునిక యుగంలో తెలంగాణ రాజకీయ, ఆర్థిక, సామాజిక నిర్మాణంలో మెజారిటీ దళిత, బహుజన వర్గాల పాత్రను నూతన దృక్పధంతో పరిశోధిండం జరుగుతుంది. ఇంతవరకు ఏ ఆంధ్రప్రాంత చరిత్రకారుడు రచించిన విధంగా తెలంగాణ రాష్ట్రంలోని అట్టడుగు వర్గాల చరిత్రపై సమగ్ర విశ్లేషణ, నిరంకుశ నిజాంను కూల్చి, భస్వామ్య దొరలను దించి ప్రజలు నిర్మంచిన ఆధునిక తెలంగాణ స్వరూప, స్వభావాల్ని విశ్లేషించడం జరుగుతుంది. జగిత్యాల జైత్ర యాత్ర నుండి మిలియన్ మార్చ్ వరకు అశేష తెలంగాణ ప్రజానీకం నూతన తెలంగాణకు నాంది పలికిన తీరు భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన ఆవశ్యకతవుంది.

తెలుగునేల చరిత్ర రచనలో గతంలో నిరాదరణకు, వివక్షతకు, వక్రీకరణలకు లోనైన తెలంగాణ చరిత్ర, సంస్కృతి, అస్తిత్వ, ఆత్మగౌరవ పోరాటాలు మొదలైన అంశాల్ని ఆధ్యయనం చేసి వాస్తవిక దృష్టితో విశ్లేషించి తిరగరాయాల్సిన అవసరముంది. ఇంతవరకు మరుగున పడిన అంశాల్ని వెలికి తీసి సమగ్ర భౌగోళిక, రాజకీయ, సామాజిక చరిత్ర రచన తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణ ఎజెండాలో ప్రధానాంశం. శాతవాహనుల కాలంనుండి ఆసఫ్‌జాహిల వరకు దాదాపు వేయి ఏండ్లకుపైగా తెలంగాణేతర రాజ వంశాలు ఈ ప్రాంతాన్ని పరిపాలించి నిర్దిష్టమైన రాజకీయ, పాలనా, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, మత వ్యవస్థను నిర్మించడం జరిగింది. అందువల్లనే తెలంగాణ భావన, అస్థిత్వాలకు చారిత్రకు పునాదులున్నాయి. అది కేవలం సెంటిమెంట్ మాత్రమే కాదనే విషయాల్ని చారిత్రక ఆధారాలతో విశ్లేషించడం తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణంలో కీలక అంశం. అదే విధంగా సీమాంధ్ర ప్రాంతం కంటే తెలంగాణ బహుళ, సహజీవన, మిశ్రమ సంస్కృతి వెలిసిల్లిన క్రమం, తీరుతెన్నుల్ని చారిత్రకంగా విశ్లేషించాలి. తద్వారా నవ తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రజల మధ్య ఐక్యత, భిన్న మతాల, భాషా సమూహాల మధ్య సఖ్యత, సహజీవనం పెంపొందించి భవిష్యత్ బంగారు తెలంగాణ సాధనను సుగమం చేయవచ్చును.


❖

# తెలంగాణ సాహిత్యకారుల ముందు ఇవాళ్టి కర్తవ్యాలు

ఎన్. వేణుగోపాల్

*తెలంగాణ సమాజం అరవై సంవత్సరాలుగా కంటున్న కల ఫలించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. ఈ తరుణంలో పునర్నిర్మాణమవుతున్న తెలంగాణలో బుద్ధిజీవుల, కవుల, రచయితల, కళాకారుల కర్తవ్యాలేమిటనే ప్రశ్న కీలకమైనది. ఆరు దశాబ్దాలుగా, లేదా గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ బుద్ధిజీవులు నిర్వహిస్తున్న పాత్రకూ, వర్తమానంలోనూ భవిష్యత్తులోనూ నిర్వహించవలసిన పాత్రకూ కచ్చితంగా తేడాలుంటాయి. గతంలో తెలంగాణ కవులూ రచయితలూ కళాకారులూ తెలంగాణకు జరిగిన అన్యాయాలను ఎత్తి చూపడానికీ, వలస పాలకులను, పాలనా విధానాలను విమర్శించడానికీ శక్తివంచన లేకుండా అపారమైన కృషి చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష బలంగా స్థిరపడడానికి ప్రధానమైన దోహదం సాహిత్య,కళా, సాంస్కృతిక రంగాల నుంచే అందింది. ఒక రకంగా ఇప్పటివరకూ తెలంగాణ సాహిత్యకారుల కర్తవ్యాలలో జీవన చిత్రణ, ఆవేదన, ఫిర్యాదు, విమర్శ, విశ్లేషణ వంటి అంశాలే ప్రధానంగా ఉంటూ వచ్చాయి. కాని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వీటిలో ఫిర్యాదు, వివరణ, విశ్లేషణ వంటి వాటికి చారిత్రక ప్రాధాన్యతే ఉంటుంది గాని సమకాలీన ప్రాధాన్యత, ప్రాసంగికత తగ్గిపోతాయి. కొంతవరకు జీవన చిత్రణకు, ఆవేదనకు అవకాశం ఉంటుంది గాని వాటి నేపథ్యం కూడ భిన్నంగా ఉంటుంది. మారిన వాతావరణంలో సాహిత్య, కళా, సాంస్కృతిక రంగాల మీద బాధ్యతలు కూడ మారిపోతాయి. తెలంగాణ సాహిత్యకారుల కర్తవ్యాలు మారిపోతాయి. ఆ కొత్త కర్తవ్యాలలో కొన్నిటిని ప్రస్తావించడమే ఈ వ్యాస లక్ష్యం. ఆ కొత్త కర్తవ్యాలలో ముఖ్యమైనవి పునరన్వేషణ, పునరావిష్కరణ, పునర్వ్యాఖ్యానం, పునర్లేఖనం, స్థిరీకరణ, ఆదానప్రదానాలు, విస్తరణ.*

ప్రధాన స్రవంతి తెలుగు సాహిత్య చరిత్ర గత ఆరు దశాబ్దాలలో తెలంగాణ సాహిత్య సంప్రదాయాల గురించీ, సాహిత్య కారుల గురించీ, సాహిత్యం గురించీ సాధారణంగా విస్మరణను, చిన్నచూపును, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చింది. తెలంగాణ సాహిత్యానికీ, సాహిత్య



చరిత్రకూ, సాహిత్యకారులకూ దక్కవలసిన న్యాయమైన స్థానం దక్కలేదు. తెలంగాణ సాహిత్య వారసత్వం గురించి వివాదాలు, తెలంగాణ లోని ప్రముఖ కవులకూ, రచయితలకూ కూడ ప్రధాన స్రవంతిలో స్థానం దక్కకపోవడం, ఎక్కడైనా స్థానం ఇవ్వక తప్పనిచోట వ్యతిరేకత, విమర్శ, చిన్నచూపు, పాదసూచికలకు, అనుబంధాలకు పరిమితం చేయడం వంటి ఎన్నో అనర్థాలు జరిగిపోయాయి. తెలంగాణలో జరిగిన తెలుగు సాహిత్యాభివృద్ధి మీద ఎటువంటి పరిశోధనలు జరగలేదు. తెలంగాణ స్వాభిమాన ఉద్యమంలో భాగంగా తెలంగాణ సాహిత్యకారులు ఈ విషయాలను ఎన్నోసార్లు వెలుగులోకి తెచ్చారు.

ఇవాళ తెలంగాణ ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలుగు భాషా సాహిత్యాలు వెలువడే రెండు ప్రాంతాలు ఉంటాయి. ప్రామాణిక, ప్రధాన స్రవంతి తెలుగు సాహిత్య సంప్రదాయం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతంలో యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుంది గాని తెలంగాణలో పాత గాయాలను మాన్పుకోవడం, పాత విస్మరణలను తొలగించుకోవడం, కొత్త అన్వేషణలకు పూనుకోవడం తప్పనిసరిగా జరగవలసి ఉంటుంది. మారిన పరిస్థితులలో తెలంగాణ సాహిత్యం గురించి కోస్తాంధ్ర–రాయలసీమ పాలకవర్గ దృక్పథం నుంచి కాక తెలంగాణ దృక్పథం నుంచి అన్వేషణ, ప్రకటన, ప్రదర్శన అవసరాలు పెరుగుతాయి. అందుకు తగిన వేదికలు, వాతావరణం




కూడ ప్రభుత్వపరంగా రూపొందవచ్చు. అయితే అందుకు సంబంధించిన అవసరమైన, మౌలికమైన కృషి అట్టడుగు నుంచి సాగకుండా కేవలం వాతావరణంతో, వేదికలతో ప్రయోజనం లేదు. ఆ మౌలికమైన కృషి చేయవలసింది తెలంగాణ సాహిత్యకారులు మాత్రమే. ఆ కృషి చేసే క్రమంలో ప్రభుత్వ సంస్థల, వేదికల సహాయం తీసుకోవచ్చు, ఆ సహాయం లేకుండానూ పనిచేయవచ్చు. ముఖ్యమైనది అటువంటి కృషి సాగడం. తెలంగాణ లోని పది జిల్లాల లోనూ సాహిత్యకారులు, పరిశోధకులు తమ తమ స్థానిక ప్రాంతాలను తమ కార్యక్షేత్రాలుగా ఎంచుకుని అక్కడ గత రెండు మూడు శతాబ్దాలలో జరిగిన సాహిత్య, సాంస్కృతిక కృషి ఏమిటో, ఏయే సాహిత్యకారులు, ఏయే ప్రక్రియలలో, ఏయే రచనలు చేశారో తవ్వి తీయవలసి ఉంటుంది. గ్రంథాలయాలు, స్థానిక పత్రికలు, ప్రచురిత గ్రంథాలు, అముద్రిత గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, జనం నాలుకల మీద నిలిచి ఉన్న మౌఖిక సాహిత్య రూపాలు వంటి అన్ని ఆధారాలనూ ఉపయోగించుకుని ఒకరకమైన తవ్వకపు పని సాగించవలసి ఉంటుంది. తెలంగాణ సాహిత్యం అనే ఒక కొత్త అంశాన్ని అన్వేషించడమే తమ కర్తవ్యం అని తెలంగాణ పరిశోధకులు, సాహిత్యకారులు తెలుసుకోవాలి. ఒక స్వల్ప భాగం మాత్రమే తెలిసిన, విశాల భాగం ఇంకా బయటపడవలసి ఉన్న ఒక మహా సాహిత్య సంప్రదాయాన్ని వెలికితీసే, వెతికితీసే పని తాము నిర్వహించవలసి ఉందని తెలంగాణ సాహిత్యకారులు గుర్తించాలి.

తెలంగాణ సాహిత్య పునరన్వేషణకు కొనసాగింపుగానూ, అనుబంధంగానూ సాగవలసిన కృషి అలా అన్వేషించిన సాహిత్య సంప్రదాయాన్ని ఆవిష్కరించడం. లేదా ఇప్పటికి అరకొరగా గుర్తింపు పొందిన సాహిత్యాన్ని పూర్తిగా ఆవిష్కరించడం. ఇది రెండు స్థాయిల పని. ఇంతవరకూ గుర్తింపు పొందని, ఇప్పుడు అన్వేషణలో బయటపడే తెలంగాణ సాహిత్యాన్ని ఆవిష్కరించడం ఒక స్థాయి. ఇంతకుముందరి తెలుగు సాహిత్యంలో ఎంతో కొంత ప్రస్తావన దొరికిన తెలంగాణ సాహిత్యాన్ని ప్రస్తుతం సమగ్ర దృష్టితో, తెలంగాణ దృక్పథంతో ఆవిష్కరించడం రెండో స్థాయి. తెలంగాణ సాహిత్య సంప్రదాయాన్ని పూర్తిగా తొక్కిపట్టడానికి వీలులేని చోట్ల గతంలో కోస్తాంధ్ర, రాయలసీమ సాహిత్య సంప్రదాయం దాన్ని గుర్తిస్తూనే, ప్రస్తావిస్తూనే సముచితమైన స్థానం ఇవ్వలేదు, వక్రీకరించి గుర్తించింది. తాను రచించినది శ్రీమద్భాగవత పురాణంబు అని బమ్మెర పోతన స్వయంగా ఆశ్వాసాంత గద్యలలో రాసుకొని ఉండగా, ప్రధాన స్రవంతి తెలుగు సాహిత్య సంప్రదాయం దాన్ని శ్రీ మదాంధ్ర మహాభాగవతము అని లేని నిఆంధ్రు శబ్దాన్ని కలిపి ప్రచారం చేసింది. ఆ ఒక్క మాట వల్ల అదనంగా ఒనగూడేదీ, కోల్పోయేదీ ఏమీ లేదు గాని, ఒక పీడిత జాతి సాహిత్య సంస్కృతుల సమాచారంలో కూడ ఆధిపత్య జాతి ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందో అది ఒక ఉదాహరణ. ఇవాళ అటువంటి వక్రీకరణలను, నిర్లక్ష్యాలను సవరించవలసి ఉంది. అలాగే, తెలంగాణలో తెలుగు కవులు లేరనే అపోహను సవరించడానికి సురవరం ప్రతాపరెడ్డి – గోలకొండ కవుల సంచిక వెలువరించిన సంగతి సుప్రసిద్ధమే. అటువంటి సవరణలు ప్రస్తుతం ఎన్నో జరపవలసి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెలువరించిన పాఠ్యపుస్తకాలలో గాని, స్వతంత్రంగా వెలువడిన తెలుగు సాహిత్య సంపుటాలలో గాని తెలంగాణ సాహిత్యానికి, సాహిత్యకారులకు స్థానం దక్కలేదని ఇంతకాలమూ మనం చేస్తూ వచ్చిన విమర్శను ఇప్పుడు పునర్నిర్మాణం ద్వారా పరిపుష్టం చేయవలసి ఉంది. తెలంగాణ సాహిత్య స్థానాన్ని ఆవిష్కరించడానికి, పునరావిష్కరించడానికి తెలంగాణ సాహిత్యకారులు ప్రయత్నించవలసి ఉంది.

తెలంగాణ సాహిత్యాన్ని అన్వేషించడం, ఆవిష్కరించడంతో పాటుగా అసలు మొత్తంగానే తెలుగు సాహిత్యాన్ని తెలంగాణ దృక్పథం నుంచి పునర్వ్యాఖ్యానించవలసి ఉంది, తెలుగు సాహిత్య చరిత్ర అనేదాన్ని పునర్లిఖించవలసి ఉంది. ప్రాచీన తెలుగు సాహిత్యం గురించి గాని, ఆధునిక తెలుగు సాహిత్యం గురించి గాని తెలంగాణ దృక్పథం నుంచి సాగిన వ్యాఖ్యానాలు, చరిత్ర రచనలు చాల తక్కువ. తెలంగాణ ప్రత్యేక



రాష్ట్ర ఉద్యమ క్రమంలో తెలంగాణ సాహిత్యం గురించీ, మొత్తంగా తెలుగు సాహిత్య చరిత్ర మీద తెలంగాణ దృక్పథం గురించీ కొన్ని రచనలు వెలువడ్డాయి గాని వెయ్యి సంవత్సరాల లిఖిత సాహిత్య చరిత్ర గురించీ, మరింత దీర్ఘకాలికమైన మౌఖిక సాహిత్య చరిత్ర గురించీ తెలంగాణ దృక్పథం నుంచి పునర్వ్యాఖ్యానించ వలసింది ఎంతో ఉంది. తెలంగాణ సాహిత్య చరిత్రను, తెలంగాణ దృక్పథం నుంచి తెలుగు సాహిత్య చరిత్రను పునర్లిఖించవలసి ఉంది. ఇవి ఎంత బృహత్తరమైన పనులంటే ఏ ఒక్క వ్యక్తీ, చివరికి కొద్దిమంది నిపుణుల బృందం కూడ సమగ్రంగా చేయగలిగినవి కావు. విస్తృతమైన నిధులతో, సకల సాధన సంపత్తితో, ప్రణాళికాబద్ధమైన శ్రమ విభజనతో వందలాది మంది నిపుణులు చేపట్టవలసిన పని ఇది. తెలంగాణ సమాజం మొత్తంగా పూనుకుని, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో, తెలంగాణ సాహిత్యకారులందరూ తమ వంతు కృషి చేసినా కొన్ని సంవత్సరాల పాటు సాగే బృహత్ కర్తవ్యం ఇది. ఈ ప్రణాళికలో భాగంగానే తెలంగాణ దృక్పథం నుంచి తెలంగాణ నుడికారానికి సంపూర్ణమైన స్థానం ఇచ్చే తెలుగు నిఘంటువును రూపొందించవలసి ఉంటుంది. గత రెండువందల సంవత్సరాలలో వెలువడిన ఏ తెలుగు నిఘంటువులోనూ సుసంపన్నమైన తెలంగాణ నుడికారానికి చోటు దొరకనే లేదు. దాన్ని సవరించడానికి ఒకటి రెండు వ్యక్తిగత ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి సరిపోవు. అటువంటి సమగ్ర నిఘంటు నిర్మాణం ఇప్పుడు తెలంగాణ పునర్నిర్మాణంలో అవిభాజ్యమైన భాగంగా గుర్తించి తెలంగాణ సాహిత్యకారులందరూ దానికోసం పూనుకోవలసి ఉంది.



ఇప్పటివరకూ ప్రస్తావించిన పనులు ఏదో ప్రయోగాత్మక స్థాయిలో, తాత్కాలిక చర్యలుగా చేయడం మాత్రమే కాదు, మొత్తంగా తెలుగు సాహిత్య సంప్రదాయంలో తెలంగాణ సాహిత్య సంప్రదాయాన్ని స్థిరీకరించే దీర్ఘకాలిక, ప్రణాళికాబద్ధ కృషి కూడ సాగించవలసి ఉంది. తెలంగాణ సాహిత్యం, తెలంగాణ సాహిత్య చరిత్ర, తెలంగాణ సాహిత్య సంప్రదాయం ఒక స్థిరరూపం ధరించడానికి జరగవలసిన ప్రయత్నమిది. ఇందుకు విరివిగా తెలంగాణ సాహిత్య గ్రంథాల ప్రచురణ జరగాలి. ఆ గ్రంథాలకు, తెలంగాణ సాహిత్య సంప్రదాయానికి విస్తృత ప్రచారం జరగాలి. తెలంగాణ సాహిత్యాన్ని అన్ని స్థాయిలలోను పాఠ్యపుస్తకాలలో చేర్చడం జరగాలి. తెలంగాణ సాహిత్య సంప్రదాయాన్ని బలోపేతం చేయడానికి స్థిరమైన, దీర్ఘకాలికమైన ప్రణాళికలను అమలుచేసే వ్యవస్థలను సృష్టించడం జరగాలి. ఇవి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సహాయంతో, నిధులతో, భారీ కార్యక్రమాలతో జరగవలసిన పనులు. కాని ఆ దిశగా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలను ప్రేరేపించే పని తప్పనిసరిగా తెలంగాణ సాహిత్యకారులే చేయవలసి ఉంటుంది.

తెలంగాణ సాహిత్యాన్ని అన్వేషించడం, ఆవిష్కరించడం, పునర్వ్యాఖ్యానించడం, పునర్లిఖించడం, స్థిరీకరించడంతోనే తెలంగాణ సాహిత్యకారుల కర్తవ్యాలు సమగ్రం కావు, తెలంగాణ సాహిత్య సంప్రదాయాన్ని ఇతర ప్రాంతాల వారికి పరిచయం చేయడానికి ఇతర భాషలలోకి అనువదించడం, ఇతర భాషా సాహిత్యాలను తెలంగాణకు పరిచయం చేయడం వంటి ఆదానప్రదాన కృషి, తెలంగాణ సాహిత్య సంప్రదాయాన్ని కొత్త ప్రక్రియలకు, ప్రయోగాలకు విస్తరించే కృషి కూడ చేయవలసి ఉంది. ఏ భాషా సాహిత్యమైనా ఆదానప్రదానాల ద్వారానే విస్తరణను సాధిస్తుంది. తెలంగాణ సాహిత్యం ఇంతకాలమూ తన సమాజంతో తాను మాట్లాడవలసిన గురుతరమైన బాధ్యతను నిర్వర్తిస్తూ, తనలో తానుగా ఉండిపోయింది. ఇప్పుడిక తన సాహిత్య సంప్రదాయాన్ని ఇతర భాషాసాహిత్యాలకు పరిచయం చేసే బాధ్యతను కూడ తలకెత్తుకోవాలి. తెలంగాణ జనజీవన దృశ్యాన్ని పర భాషా పాఠకులకు కూడ చూపాలి. అలాగే, ఇతర భాషలలోని ప్రజాసాహిత్యాన్ని తెలంగాణ పాఠకులకు పరిచయం చేసి, తెలంగాణ సమాజపు దిగంతాలను విస్తరించే పనికి కూడ పూనుకోవాలి.

గత రెండు దశాబ్దాల తెలంగాణ ప్రజా ఉద్యమంలో అద్భుతమైన, అసాధారణమైన పాత్ర పోషించిన తెలంగాణ సాహిత్యకారులకు ఈ కొత్త బాధ్యతలు నిర్వహించగలిగిన శక్తి సామర్థ్యాలు తప్పనిసరిగా ఉన్నాయి. తెలంగాణ సాహిత్యకారులు ఈ కృషి సాగించడానికి నిత్య చలనశీలమైన, నిరంతర పోరాట సంప్రదాయం ఉన్న తెలంగాణ సమాజం తప్పనిసరిగా సహకరిస్తుంది, వెంట నడుస్తుంది, నాయకత్వం వహిస్తుంది. ❖

# సమగ్ర సాహిత్య చరిత్ర నిర్మాణ సమయం

ఆచార్య ఎస్వీ రామారావు
ఉస్మానియా విశ్వవిద్యాలయం
పూర్వ శాఖ అధ్యక్షులు, ఆర్ట్స్ డీన్

***నేను ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఎం.ఏ. విద్యార్థిగా ఉన్న రోజుల్లో (1962-64) సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ఖండవల్లి లక్ష్మీరంజనం-బాలేందుశేఖరం సోదరుల ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి పాఠ్య గ్రంథాలుగా ఉండేవి. వాటి ఆధారంగా తొలి తెలుగు ప్రభువులైన శాతవాహనులు గుంటూరు జిల్లా అమరావతి రాజధానిగా పరిపాలన చేశారని మాత్రమే మాకు తెలుసు. కాని 1979-84 మధ్య పురావస్తు శాఖవారు కరీంనగర్ జిల్లాలో జరిపిన తవ్వకాల వల్ల నూత్న అంశాలు వెలుగులోకి వచ్చి పై చరిత్ర అంతా తారుమారైంది. మౌర్య సామ్రాజ్య పతనాన్ని అనుసరించి క్రీ.పూ.3వ శతాబ్దం నుంచి ఆంధ్ర గోబదులు, శాతవాహనులు కరీంనగర్ జిల్లా కోటి లింగాలను, తర్వాత మహారాష్ట్ర సరిహద్దులలోని ప్రతిష్ఠానపురం(పైఠన్)ను రాజధానులుగా చేసుకొని తెలుగు దేశాన్ని పాలించారన్న సత్యం బయటపడింది. అంతేకాదు-నన్నయకు వేయి సంవత్సరాలకు ముందే తెలంగాణ ప్రాంతంలో ప్రాకృత, సంస్కృత, కన్నడ, తెలుగు భాషా కవులు సంపన్నమైన సారస్వతాన్ని సృజించారన్న అపూర్వాంశం అవగతమైంది.***

అప్పటి నుంచి ఎందరో పరిశోధకులు మన సాహిత్య చరిత్ర పునర్నిర్మాణానికి పాటుపడుతున్నారు. జితేంద్రబాబు, సంగనభట్ల నరసయ్య, మలయశ్రీ, సుంకిరెడ్డి నారాయణరెడ్డి ప్రభృతులు ప్రాచీన యుగానికి చెందిన పరిశోధనా రచనలు వెలువరించగా సంగిశెట్టి, ఎస్.జగన్‌రెడ్డి, కందుకూరి రమేష్‌బాబు మొదలైన వారు ఆధునిక యుగానికి సంబంధించిన చరిత్రను వెలికి తెస్తున్నారు. అయితే ప్రాంతీయ అస్తిత్వ పోరాట ఉద్యమ ఫలితంగా, జిజ్ఞాసువులైన పరిశోధకుల కృషివల్ల రోజురోజుకూ కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. వీటన్నింటినీ సమీకరించుకొని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అవతరణ సందర్భంగా ప్రామాణికమైన సమగ్ర సాహిత్య చరిత్రను రూపొందించు కోవలసిన అవసరం ఎంతయినా ఉంది.

సాహిత్య చరిత్ర పునర్నిర్మాణంలో పూర్వ చారిత్రక గ్రంథాలు కొంతవరకు మాత్రమే ఉపకరిస్తున్నాయి. కాకతీయ సామ్రాజ్యం అస్తమించిన రెండు వందల సంవత్సరాల తర్వాత విరచితమైన ప్రతాప చరిత్ర(ఏకామ్రనాథుడు), సిద్దేశ్వర చరిత్రం(కాసెసర్వప్ప) మున్నగు చరిత్రల్లోని సాక్ష్యాలు ప్రామాణికమైనవి కావు. ఆధునిక కాలంలో వెలువడిన గోలకొండ కవుల సంచిక, జిల్లా విజ్ఞాన సర్వస్వాలలోని సమాచారాన్ని కూడా నేడు లభ్యమైన సాక్ష్యాలతో సవరించుకోవలసి ఉంటుంది. శతాబ్దాల కాలక్రమాన్ని అనుసరించి జిల్లాలు, తాలూకాల వారీగా సాహిత్య చరిత్ర నిర్మాణం జరిగినప్పుడే ప్రాచీన, ఆధునిక యుగకవుల కాలం-రచనల గురించి స్పష్టత ఏర్పడుతుంది.

ఈ మార్గంలో నా వంతుగా కొంత ప్రయత్నం చేయ గలిగాను, పాలమూరు సాహితీ వైభవం(2010), పాలమూరు ఆధునిక యుగకవుల చరిత్ర(2012), తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం(2013) గ్రంథాలు అందుకు ఉదాహరణలు. మొదటి గ్రంథంలో 19వ శతాబ్దం వరకూ జిల్లాలో వర్ధిల్లిన కవుల చరిత్రలను, రెండవ గ్రంథంలో ఆధునిక యుగంలో కీర్తిశేషులైన సాహితీ మూర్తుల చరిత్రలను పరిచయం చేయటం జరిగింది. ప్రస్తుతం గత శతాబ్ది సమకాలీన కవుల గురించి మూసీ పత్రికలో(ధారావాహికగా) ప్రచురిస్తున్నాను. ప్రాచీన కవులు-ఆధునిక యుగకవులు-సమకాలీన కవులు అని మూడు విధాలుగా వింగడించటం వల్ల సాహిత్య చరిత్రకు స్పష్టత-సమగ్రత చేకూరుతాయని నా అభిప్రాయం.

మన ప్రాంత సాహిత్య చరిత్రను అటుంచి మొత్తం తెలుగు సాహిత్య చరిత్రలో పెక్కు తప్పుల తడకలు గోచరిస్తాయి. ఇంకా అష్టదిగ్గజ కవుల్లో తెనాలి రామకృష్ణుడు, పింగళి సూరన, భట్టుమూర్తిలను చేర్చి భువన విజయాలు జరుపుకొంటున్నాం. ఈనాటికీ బమ్మెర పోతనను కడప జిల్లా ఒంటిమిట్టకు చెందినవాడని దుష్ప్రచారం చేస్తూ ఆ జిల్లా చరిత్రలు, సంచికలు వెలువడుతున్నాయి. ఈ దురభిప్రాయాలను పరిహరిస్తూ సాహిత్య విద్యార్థులకు వాస్తవమైన చారిత్రక అవగాహన కలిగించాలన్న ఉద్దేశంతో 'తెలుగు సాహిత్య చరిత్ర'(1912)ను కూడా ప్రచురించాను. అందులో కూడా శతాబ్దాల క్రమంలో మొదటిసారిగా కోస్తాంధ్ర, తెలంగాణ, తంజావూరు, మధుర, మైసూరు మున్నగు ప్రాంతాల విభాగంతో కవుల చరిత్రను వివరించటం జరిగింది.

వివిధ పరిశోధకుల రచనల ఆధారాలతో 'తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం' రూపొందినా కొన్ని అపూర్వమైన నూత్న అంశాలను అందులో స్పష్టంగా నేను ప్రతిపాదించటం జరిగింది. మన సాహిత్య చరిత్ర పునర్నిర్మాణంలో ఆ అంశాలను ముఖ్యంగా దృష్టిలో పెట్టుకోవాలని వాటిని ఇక్కడ పేర్కొంటున్నాను.

1. నన్నయకు ముందు క్రీ.శ.10వ శతాబ్దం వరకు తెలంగాణలో తప్ప కోస్తాంధ్రలో కానీ, రాయలసీమలో కానీ గ్రంథ రచన జరిగినట్లు, కవులు ఉన్నట్లు ఏ విధమైన ఆధారాలూ లేవు.
2. క్రీ.శ.ఒకటవ శతాబ్దం నుంచే తెలంగాణలో ప్రాకృత, సంస్కృత, కన్నడ, తెలుగు భాషా కవులు నెలకొని కావ్యరచన చేసినట్లు ప్రత్యక్ష సాక్ష్యాలు ఉన్నాయి.
3. నన్నయకు ముందే తత్సమ పూరితమైన కావ్యశైలి, సాహిత్య భాష ముందుగా తెలంగాణలో రూపుదిద్దుకున్నాయి. పంపభారతం, కుర్క్యాల బొమ్మల గుట్ట కంద పద్య శాసనం, కొరవి గద్య శాసనంలోని వచనశైలి, గూడూరు(జనగామ తాలూకా) విరియాల మల్లభూపతి వృత్త పద్య శాసనం మున్నగు వాటిలోని సమకాలీన భాషాశైలి నన్నయకు మార్గదర్శకమైంది.
4. వేములవాడ(కరీంనగర్ జిల్లా) ప్రాంతీయుడైన మల్లియరేచన 'కవిజనాశ్రయం'(10వ శ.) తొలి తెలుగు కావ్యం.
5. 11వ శతాబ్దం తర్వాత కూడా తొలి వీరశైవకావ్యం, తొలి ద్విపద కావ్యం, తొలి చారిత్రక కావ్యం, తొలి శతకం, తొలి రగడలు, తొలి ఉదాహరణం, తొలి ద్విపద-పద్య రామాయణాలు, తొలి వచన సంకీర్తనలు, తొలి మార్గపురాణం, తొలి పద్య సంకలనం, తొలి తెలుగు భాగవతం, ప్రప్రథమ కల్పిత కావ్యాలు, తొలి అచ్చ తెలుగు కావ్యం, తొలి యక్షగానాలు, తొలి వచన గ్రంథం మొదలైన ప్రక్రియలన్నీ తెలంగాణం నుంచే వెలువడ్డాయి.
6. ఉర్దూ, పర్షియన్ అధికార భాషగా ఉన్న గోలకొండ సుల్తానులు, నిజాం రాజుల కాలంలో కూడా వివిధ సంస్థానాల ఆశ్రయంలో సమృద్ధమైన సాహిత్య సృష్టి జరిగింది.

పై వినూత్న విషయాలను రెండు ప్రాంతాల సాహితీపరులు జీర్ణించుకోవటానికి కొంతకాలం పడుతుంది. ఈలోగా తెలంగాణాలోని అన్ని ప్రాంతాలలో, అన్ని కాలాలలో వర్ధిల్లిన అపారమైన సాహిత్య సంపదను ఒక కేంద్ర స్థానంలో భద్రపరుచు కోవటం మన తక్షణ కర్తవ్యం. పటిష్ఠమైన సాహితీ సంస్థలు-అకాడమీల ఏర్పాటు ద్వారానే అది సులభసాధ్యమవుతుంది. సమగ్రమైన ప్రాచీనఆధునిక వాఙ్మయసూచికలు రూపొందినపుడే తెలంగాణ సాహిత్య చరిత్ర పునర్నిర్మాణం సఫలమవుతుంది.

కెజి నుంచి పిజి స్థాయి వరకు పాఠ్యగ్రంథాల్లో తెలంగాణ చరిత్రకు సంబంధించిన అంశాలకు ప్రాముఖ్యం కల్పించటం వల్ల యువతరానికి అసలైన విజ్ఞానం అందుతుంది. దురదృష్టవశాత్తూ ఇంతవరకూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రులు, విద్యామంత్రుల్లో చిత్తశుద్ధి కొరవడటం వల్ల విద్యారంగంలో మాతృభాషలకు గౌరవప్రదమైన స్థానం లభించలేదు. ఇప్పుడు ఏర్పాటైన ఏర్పాటైన తెలంగాణ ప్రభుత్వం పాఠశాల స్థాయిలో మాతృభాషలు (తెలుగు, ఉర్దూ, కన్నడం మొదలైనవి) బోధనా భాషలుగా అమలు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలి. ఎవరి మాతృభాషలో వారు చదువుకోవటానికి వీలైన వసతులు కల్పించినపుడు ఏ కోర్టులూ, రాజ్యాంగాలూ అడ్డురావు. తెలుగు మన రాష్ట్ర అధికార భాష అయినప్పటికీ-ఇతర భాషీయులు ఐచ్ఛికంగా తమ మాతృభాషలను అధ్యయనం చేయాలనుకొంటే అందుకు అనువైన వసతులు కల్పించటం ప్రభుత్వం కనీస బాధ్యత-విజ్ఞత కూడా. మాతృభాషా తృణీకారం మాతృదేవీ తిరస్కారం వంటిది. భాషాభివృద్ధి సాహిత్య రంగ ప్రగతికే కాక దేశాభివృద్ధికీ దోహదం చేస్తుందన్నది పరమ సత్యం. ❖

ఇపుడున్న తెలుగు అకాడమి కేవలం పుస్తక ముద్రణ, వాటి అమ్మకాలకే (మరీ ముఖ్యంగా ఇంటర్‌మీడియట్ పుస్తకాలు) పరిమితమైంది. నాకు తెలిసి ఈ ఇరవై ఏళ్లలో పరిశోధనాత్మక కృషి చేసినట్లులేదు. సామాజిక, ప్రకృతి శాస్త్రాలలో, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో కొత్త కోణాలను ఆవిష్కరించి సమాజానికి అందించిన దాఖలాలు లేవు. ఇంత మేరకే అయితే తెలుగు అకాడమి అవసరం తెలంగాణ సాహిత్యానికి ఉండకపోవచ్చు.

ఇక గతంలో ఉండి కనుమరుగైన సాహిత్య అకాడమీలు ప్రాచీన సాహిత్యాన్ని వ్యాఖ్యానాలతో వర్తమాన సమాజానికి అందించినప్పటికీ, అవి కేవలం కొందరికి పునరావాసం కల్పించేవిగానే మిగిలిపోయాయి. అధికారస్థానంలో ఉండిన పెద్దల అనుంగులకు సన్మానాలు చేయటానికి, వారి గ్రంథాలకు ప్రాసంగిత ఉన్నా లేకున్నా ప్రచురించటానికి సాహిత్య అకాడమీలు ఉపయోగపడ్డాయి. తెలంగాణలో కూడా ఇదే పని చేయటానికైతే సాహిత్య అకాడమీలు అవసరం లేదు.

నిజంగా తెలంగాణ సాహిత్యాన్ని పునర్నిర్మించి ప్రజాసాహిత్యంగా మలచాలనే చిత్తశుద్ధి పాలకులకు ఉంటే సాహిత్యానికి ఎంతోసేవ చేసిన ఓరియంటల్ కళాశాలలను పునరుద్ధరించి కొత్త కరిక్యులం రూపొందించి బోధించాలి. అకాడమీల చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకొని విశ్వవిద్యాలయాల స్థాయిలో తెలుగు శాఖలకు ఆర్థిక పరిపుష్టి కల్పించి పరిశోధనలకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. ప్రజా అనుకూల మేధావులతో, పరిశోధకులతో కూడిన స్వతంత్ర పరిశోధన సంస్థలను నెలకొల్పి తెలంగాణ నేలలో గత ఎనభై సంవత్సరాలుగా పరిఢవిల్లిన ప్రజాసాహిత్యాన్ని తవ్వితీసే బాధ్యతను అప్పగించాలి. తెలంగాణలో వికసించిన ప్రాచీన సాహిత్యాన్ని వర్తమాన సమాజ అవసరాలకు అనుగుణంగా అన్వయించాలి. తప్పనిసరి మౌఖిక సాహిత్య సంప్రదాయాన్ని కాపాడటం కోసం ఒక విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలి.

**డా॥సి.కాశీం**

*(ప్రజాశక్తి సౌజన్యంతో)*

**డా.జె.చెన్నయ్య**
అసిస్టెంట్ ప్రొఫెసర్
తెలుగు విశ్వవిద్యాలయం


# తెలంగాణ నిర్మాణంలో సాంస్కృతిక విధానం

***దశాబ్దాల తెలంగాణ రాష్ట్ర స్వప్నం నెరవేరింది. నవ తెలంగాణ పునర్నిర్మాణం గురించి ఇప్పుడు అంతటా చర్చ జరుగుతున్నది. ఈ చర్చ ఒక రంగానికి పరిమితం కాలేదు. అన్ని రంగాల్లోనూ జరుగుతున్నది. జరగడం అనివార్యం కూడా. భాష, సంస్కృతి, సాహిత్యం విషయంలో అన్నిటికంటే చాలా ముఖ్యం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు ఇలాగే ఆలోచించి ఉంటాం. బ్రిటీషు వారు వదిలివెళుతున్న సందర్భంలో స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నప్పుడు కలిగిన ఆనందం అదే సమయంలో మన భవిష్యత్‌ను, మన అనంతర తరాల భవిష్యత్తును గురించి ఆలోచించి వుంటాం. ధ్వంసమైన మన అస్తిత్వాన్ని పునరుద్ధరించుకొనే ఆలోచనలు చేసి వుంటాం. ఇప్పుడు కూడా అదే రీతిలో ఆలోచించాలి. తెలంగాణ ఉద్యమంలో గణనీయమైన పాత్ర నిర్వహించిన సాంస్కృతి కోద్యమం కొత్త రాష్ట్రంలో కొత్త దారిలో సగర్వంగా సాగించే సంకల్పాన్ని దృఢపరచుకుంటున్నది.***

తెలంగాణలో కవులెక్కడున్నారని ఆనాడు వేసిన ప్రశ్నకు సురవరం ప్రతాపరెడ్డి ధీటుగా సమాధానం చెప్పిన సంగతి చరిత్రలో సుస్థిరంగా వుంది. మొదలు గోలకొండ పత్రికలో ప్రచురించి ఆ తర్వాత గోలకొండ కవుల సంచికలో తెలంగాణ కవులను గురించి అందించారు. నిన్న మొన్నటి వరకు ఆ ప్రశ్న ఆంధ్రావాళ్ల అంతరంగిక సమావేశాల్లో అమలైంది. ఎంతో మంది భాషా సాహిత్య రంగాల్లో అగ్రస్థానంలో నిలబడిన వారున్నా ఆ వాస్తవాన్ని అంగీకరించేందుకు చాలామంది సిద్ధంగా లేరు. కాని అంగీకరించకపోయినంత మాత్రాన వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు.

నిన్న మొన్నటి వరకు తెలంగాణ పరోక్షంగా సాంస్కృతిక అణచివేతకు గురైంది. రచనల్ని, రచనా శక్తిని మార్కెటింగ్ చేసుకొనే ట్రిక్కులు తెలియనివారు సహజంగానే అవి బాగా తెలిసిన వారికంటే తక్కువగానే కనిపిస్తారు. ఆ కసి తెలంగాణ ఉద్యమంలో బాగా కనిపించింది. తెలంగాణ రచయితల వేదిక, ధూంధాం ఊరూరా తిరిగి సభలు పెట్టి కవులను, రచయితలను ఒక తాటి మీదకు తెచ్చి రాష్ట్ర సాధన ఉద్యమంలో సాహిత్య, సాంస్కృతిక చైతన్య ప్రదర్శనా పథంలో నడిపించాయి. మన భాష గురించి, మన సాహిత్యాన్ని గురించి ఎలుగెత్తి చాటేలా చేశాయి.

ఊరూరా వాడవాడలా రచయితలు భాషలో, భావంలో తెలంగాణ సోయిని ప్రదర్శించారు. రచనల సంఖ్య పెరిగింది. రచనల్లో తెలంగాణ సాధన కాంక్ష ప్రస్ఫుటమైంది. వందలాదిగా కొత్త గాయనీ గాయకులు ఆవిర్భవించి తమ పాటతో ఉద్యమ తీవ్రతకు ఊపిరులూదారు.



ఇప్పుడు వీరంతా తమ భాగస్వామ్యం కోసం తపిస్తారు. దేశం బ్రిటీషు వారి నుంచి స్వాతంత్ర్యం పొందినప్పుడు సాంస్కృతికంగా శూన్యం ఏమైనా ఉన్నదేమోగాని స్వేచ్ఛాగీతిని పాడుకొంటున్న తెలంగాణ జాతిలోనే అటువంటి సాంస్కృతిక శూన్యం లేదు. పైగా నిన్నటిదాకా ఉద్యమ పథంలో కలాలను, గళాలను ఎక్కుపెట్టిన అనుభవంతో ఊపుమీద ఉన్నారు. కాబట్టి ప్రభుత్వం తెలంగాణ సాంస్కృతిక సైన్యపు ఉరవడిని నిలబెట్ట డానికి ప్రణాళికను రూపొందించి గమనాన్ని నిర్దేశించాలి.

పదిమందిలో ఇప్పటివరకు మన గొంతు విప్పడానికి, మన కళారూప ప్రదర్శన చేయడానికి చూపిన బెరుకును పోగొట్టాలి.

ముందు మన పిల్లలు చదువుతున్న పాఠాలను సమీక్షించాలి. ఆ పాఠాల్లో ఎవరూ కనిపించడం లేదని ఇన్నాళ్లు ఆవేదన చెందామో ఆ పెద్దల రచనల్ని ముందుకు తేవాలి. నిర్ణేతలం ఇప్పుడు మనమే. కాబట్టి తెలంగాణ పద్య, వచన కవులను, వారి రచనలను అధ్యయనం చేసేందుకు వీలుగా అధ్యయ నాంశాలను నిర్ణయించాలి. మన పండుగల గురించి వాటి విశిష్టత గురించి పుస్తకాలు ప్రకటించాలి. ఇక్కడి నుంచి వెలువడే పత్రికలు, ప్రసార మాధ్యమాలు ఇప్పటివరకూ అజ్ఞాతంలో వుండిపోయిన అంశాలను వెలుగులోకి తేవాలి. పాఠ్యపుస్తకాల్లో, సృజనాత్మక రచనల్లో తెలంగాణ పలుకుబడులను ఎక్కువగా ప్రయోగించాలి. ఇప్పటి వరకు ప్రయాణిస్తూ వచ్చిన తెలుగులోని తెలంగాణ తెలుగుదనమెంతో మనకు తెలుసు. కనుక ఇప్పటి నుంచి మనదైన భాషా ప్రయోగరీతికి పట్టంగట్టాలి. ప్రామాణిక తెలుగు అని మనం వ్యవహరిస్తూ వచ్చిన కృష్ణా, గుంటూరు జిల్లాల భాషలో తెలంగాణ తెలుగెంత అని ప్రశ్నించాం. ఇప్పుడు ఆ ప్రశ్నకు మనమే సమాధానం చెప్పవలసిన బాధ్యత ఏర్పడింది. తెలంగాణ మాండలికంపై అధ్యయనం జరిగి లెక్కకు మిక్కిలిగా వున్న అచ్చ తెలుగు పదాలను పట్టుకొచ్చి మనదైన వ్యావహారిక భాషను రూపొందించుకోగలిగితే ఇప్పటివరకూ కొనసాగుతున్న సాంస్కృతాధిపత్యం కూడా పోతుంది. ఆంధ్రుల భాషా బానిసత్వం, సంస్కృత భాషా బానిసత్వం రెంటినీ ఏకకాలంలో ఛేదించుకొని నిలవగలం. ఇప్పటికిప్పుడు అందరూ రాసే ఒక తెలుగు వాక్యం రాసి దాని చివరన వుండే క్రియారూపాన్ని (తెలంగాణ పదాన్ని) అతికిస్తే తెలంగాణ భాష కాదు. నిసర్గ సుందరమైన తెలంగాణ తెలుగు వాక్య నిర్మాణ మార్గాన్ని కనుగొనాలి. తెలంగాణ తెలుగు భాషా సంస్కారాన్ని, తెలంగాణ తెలుగు భాషా విధానాన్ని రూపొందించు కోవాలి. దీనికి మన భాషావేత్తలు, నిఘంటు నిర్మాణంలో కృషి చేసినవారు తోడ్పడుతారు. తెలుగు విశ్వవిద్యాలయం కొంత కాలం కిందట ఈ ఉద్యమానికి ముడిసరుకుగా ఉపయోగపడే సంపదను సేకరించింది. వరంగల్ పీఠంలో జరిగిన జానపద విజ్ఞాన పరిశోధన, మైసూర్ సి.ఐ.ఐ.ఎల్ సహాయంతో చేసిన మాండలిక పద సేకరణ చాలా ఉపయుక్తంగా ఉంటుంది. పత్రికలు తెలంగాణ భాషా విధానాన్ని రూపొందించడంలో, ప్రాచుర్యం కల్పించడంలో, ప్రామాణీకరించడంలో ఎంతగానో ఉపయోగ పడతాయి. నమస్తే తెలంగాణ వంటివి ఇప్పటికే ఆ పనిని ప్రశంసనీయంగా చేస్తున్నాయి.

తెలుగు విశ్వవిద్యాలయం విభజన జరగాలి. తెలంగాణ తెలుగు విశ్వవిద్యాలయాన్ని తెలంగాణ సాంస్కృతిక విధాన రూపకల్పనా వేదికగా మలచుకోవాలి. ఆత్మవిశ్వాసం నింపడం మన చేతిలోని పని. ఆ వేదికను తెలంగాణ ప్రభుత్వం తనదిగా స్వీకరించాలి. ప్రభుత్వ ఆలనా పాలనా ఉన్నప్పుడే ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చే బాధ్యతను ఆ కోరిక చేపడుతుంది.

తెలంగాణ వ్యాప్తంగా కళాకారుల వివరాల సేకరణ కోసం సర్వే జరగాలి. జ్ఞాతంగా, అజ్ఞాతంగా వున్న వివిధ జానపద కళారూపాలకు చెందిన సంప్రదాయ (వంశానుగతంగా ఈ కళను ప్రదర్శిస్తున్నారు) కళపై అనురక్తితో అభ్యసించి ప్రదర్శనలిస్తూ మంచి కళాకారులుగా పేరుపొందిన వారి పూర్తి వివరాలను సేకరించాలి. వివిధ జానపద కళారూపాల పాఠాలను సేకరించాలి. ఈ కళారూపాలన్నీ నోటి మీద(కంఠాపాఠంగా) వున్నవే. వాఙ్మయాన్నంతటినీ రాత రూపంలోకి తెచ్చి దానిపై పరిశోధన చేయాల్సిన అవసరం ఉంది. వాటిల్లోని భాషా, సాహిత్య, సాంస్కృతిక విశేషాలను వెలికితీస్తే, గొప్ప సంపద మన చేతికి అందుతుంది. కళాకారులందరికీ నెలకు కనీసం 2000 రూపాయల భృతి కల్పించాలి. సాధారణ ప్రజలకు పింఛన్లు పంపిణీచేస్తూ వారి నుంచి ఓట్లు దండుకుంటూ వచ్చిన ఇతర రాజకీయ పార్టీలు కళాకారులను విస్మరించాయనే చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తూ వచ్చిన వృద్ధ కళాకారుల సంఖ్య చాలా తక్కువ. వారికి అందజేస్తూ వచ్చిన నెలసరి భృతి కూడా 500 రూపాయలే. అది కూడా నెలనెలా అందేది కాదు.

తెలంగాణ జానపద కళారూపాలు, నాటకాలను ప్రదర్శించేందుకు రాష్ట్ర రాజధానిలో రవీంద్ర భారతికి దీటుగా కళామందిరాలను నెలకొల్పాలి. అన్ని జిల్లా కేంద్రాల్లో ఇతర పట్టణాల్లో కూడా కళా ప్రదర్శనలకు థియేటర్లు నిర్మించాలి. తగిన వసతులను సమకూర్చాలి.

విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్ర రాజధానికి హైదరాబాద్ నగరాన్ని సందర్శించేందుకు వచ్చే పర్యాటకుల కోసం తెలంగాణ కళా, సంస్కృతులకు ప్రాతినిధ్యం వహించే కళా రూపాలను ఎన్నుకొని ప్రతిరోజు ప్రదర్శన ఏర్పాటు చేయాలి. పర్యాటకులు పర్యాటక శాఖవారి బస్సుల్లో నగరంలోని పర్యాటక స్థలాలను రోజంతా వీక్షించిన తర్వాత ఆ సందర్శన ముగిసే దశలో అంటే సాయంత్రం ఒక గంటసేపు తెలంగాణ ప్రత్యేకతను చాటే కళాకదంబాన్ని వీక్షించే ఏర్పాటుచేస్తే మన విలక్షణ సంస్కృతి ఇతర ప్రాంతాలకు తెలుస్తుంది.

పుస్తకాలు ముద్రించుకునే రచయితలకు, పరిశోధకులకు ఆర్థిక సహాయం అందించాలి. తెలంగాణ పల్లెల్లో కవి రచయితలకు కొదవలేదు కాని వారికి ఆర్థిక స్థోమత లేదు. కాబట్టి అది తప్పనిసరి.

ప్రతి ఏటా తెలంగాణ రాష్ట్రావతరణ వారోత్సవం రాష్ట్ర రాజధానిలోనూ, అన్ని, జిల్లా, మండల స్థాయిల్లోనూ వైభవంగా జరగాలి. దానికి ఒక నిర్దిష్టమైన విధానాన్ని నిర్దేశించాలి. తెలంగాణ కవులు, రచయితలు, పరిశోధకులు, జానపద కళాకారులు ప్రత్యేకించి

తెలంగాణ గాయనీ గాయకులకు సత్కారాలు, నగదు పురస్కారాలు అందించాలి.

తెలంగాణ జాతర్లకు, బతుకమ్మ, బోనాలు, పీర్ల పండుగ వంటి ప్రత్యేకమైన పండుగలకు ప్రసిద్ధి. ఇలాంటి ఉత్సవాలకు అధికారిక హోదా(స్టేట్ ఫెస్టివల్) కల్పించాలి. ఏడుపాయల (మెదక్), కొమిరెల్లి(వరంగల్) లింగముంతాల(నల్గొండ), నాగోబా(ఆదిలాబాద్), గంగాపురం, కురుమూర్తి, మన్నెంకొండ, కందూరు(పాలమూరు) వంటి జాతర్లు ప్రత్యేకమైనవి. సమ్మక్క సారలమ్మ జాతర ఏటా జరపాలి.

తెలంగాణకు చారిత్రకంగా ఎన్నో ప్రత్యేకతలున్నాయి. క్రీస్తు పూర్వం నుంచి నేటి వరకు ఎన్నో రాజవంశాల పాలన కాలంలో ఎన్నో ఘటనలు చిరస్మరణీయమైనవి జరిగాయి. అలాంటి విశేషాలకు సంబంధించి స్థానిక చరిత్రలు రావాలి. బి.ఎన్.శాస్త్రిగారు చేసిన కృషి మరింత ముందుకు పోవాలంటే ఆ స్థానిక చరిత్రల నుంచి సాధికారికమైన ఎంతో సంపదను నిగ్గుదేల్చి తెలంగాణ వైభవాన్ని చాటి చెప్పే సమగ్ర చరిత్ర, సంస్కృతి, నిర్మాణం జరుగుతుంది. ఇందులో ఇప్పటివరకూ మనం చదువుతున్న సమగ్రాంధ్ర సాహిత్యంలో స్థానం లభించని ఎంతో సాహిత్య సంపద కూడా మనకు లభ్యమవుతుంది.

ఇప్పటివరకు తెలుగు భాషా సంస్కృతులకు సంబంధించి వివిధ రకాలైన కార్యక్రమాలు, పథకాలు చేపట్టే సంస్థలు ఒకటి సాంస్కృతిక శాఖ, రెండవది చలనచిత్ర, టివి అభివృద్ధి సంస్థ, తెలుగు అకాడమి, సాంస్కృతిక మండలి, తెలుగు విశ్వవిద్యాలయం. విభజన తర్వాత కూడా ఇవన్నీ ఉంటాయి. వీటికి తోడు అకాడమీలు కూడా వస్తాయి. తెలంగాణ ప్రభుత్వం చేయవలసిందేమిటంటే ఇంతకు ముందు ఒకేరకమైన కార్యక్రమాలను వివిధ సంస్థలు చేస్తుండేవి. అలా జరగకుండా అంశాలను విభజించాలి. ఒకరు చేసేది మరొకరు చేయకుండా ఉండాలి. దానితో పాటుగా లోగడ ఉమ్మడి అంశాల అభివృద్ధికి చేపట్టిన కారక్రమాల్లో చాలా మార్పులు చేయాలి. ముఖ్యంగా తెలంగాణ భాషా సాహిత్య సాంస్కృతిక పరిరక్షణ పరివ్యాప్తి, పరిశోధన, కళాకారులకు అవకాశాలు, కళా సాహిత్య రంగాల్లోని వారికి గౌరవాలు ప్రధాన లక్ష్యంగా ఉంటాయి.

కొత్తరాష్ట్రం ఏర్పడుతున్న తరుణంలో ఇంకా ప్రధానమైన ఆలోచనను దృష్టిలో ఉంచుకోవాలి. ఇప్పటివరకు తెలుగు మాట్లాడే వారందరికీ ఉమ్మడి లక్ష్యం, సంస్థలు ఉన్నాయి. ఇప్పుడు తెలంగాణ దాకా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడుతుంది కాబట్టి తెలంగాణ సాహిత్య సంస్కృతుల అభివృద్ధికే పూర్తి ప్రాధాన్యం. అయితే మన సాహిత్య కళా సంస్కృతుల వైలక్షణ్యం గురించి ఏకకాలంలో ఇతర తెలుగు ప్రాంతాలకు, ఇతర భాషా రాష్ట్రాలకు తెలియజేసేందుకు పరస్పర వినిమయ కార్యక్రమాలు(కల్చరల్ ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్స్) జరగాల్సిన అవసరం ఉంటుంది. ఈ రకమైన కార్యక్రమాల ద్వారా తెలంగాణ అనే కొత్త రాష్ట్రం ఒకటి ఏర్పడిందని ఇప్పటివరకూ ఆంధ్రప్రదేశ్ అనే ఒకానొక ఉమ్మడి రాష్ట్రంలో అది భాగంగా ఉన్న దానికి అనేకరకాలైన ప్రత్యేకతలున్నాయని ప్రపంచానికి చెప్పవలసి ఉంది. సాహిత్యానువాదం, చరిత్ర, సంస్కృతి, కళలపై తెలుగులో ఇతర భాషల్లోనూ లఘు గ్రంథాలు, పరిశోధన గ్రంథాలు సమాచార పరమైన సమగ్ర అవసరం.

తెలంగాణలో నిజాము ఏలుబడిలో తెలుగు భాషా సంస్కృతులపై తీరని అణచివేత అమలయ్యింది. తీవ్ర నిర్బంధం రాజ్యమేలిన కాలంలోనూ ఇక్కడి తెలుగు దీపాన్ని ఆరిపోకుండా కాపాడుతూ వచ్చిన పెద్దలెందరో వున్నారు. వారు వెలిగించిన సంస్థలు శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, ఆంధ్ర సారస్వత పరిషత్తు వంటివి ఎన్నో వున్నాయి. ఆ చరిత్రతో సంబంధం లేకపోయినా, ఆంధ్ర పాలకుల నాయకత్వంలోని ప్రభుత్వం నుంచి ఏ సహాయమూ లభించకపోయినా భాషా సంస్కృతుల వికాసానికై కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలు వున్నాయి. ఇలాంటి సంస్థలు వార్షిక గ్రాంట్లు అందించి కార్యకలాపాలు విస్తరించేందుకు దోహదం చెయ్యాలి.

తెలంగాణలో తెలుగు భాష నిజాము పుణ్యమా అని చాలా నిరాదరణకు గురైంది. తెలుగు మాట్లాడితే అవమానాలే ఎదురయ్యాయి. ఆ విధంగా వందల సంవత్సరాలు గొంతులు కట్టివేయబడిన తెలుగు కోకిలలు ఇప్పుడిప్పుడే విచ్చుకొని పాడుతున్నాయి. భాషాపరంగా వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి తెలుగు చదివిన వారికి ప్రోత్సాహం పెంచాలి. విశారద, ప్రీడిగ్రీ, స్పెషల్ తెలుగు, ఎంఎ సాహిత్యం వంటి కోర్సుల్లో పట్టభద్రులైన వారికి ఉద్యోగావకాశాలలో ప్రాధాన్యమివ్వాలి. ఆ రకమైన కోర్సులు నడుపుతున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, ఖండవల్లి లక్ష్మీరంజనం ప్రాచ్యకళాశాల వంటి సంస్థలను ఆదుకోవాలి. ఖాళీలను భర్తీచెయ్యాలి.

తెలంగాణ చారిత్రకంగా, సాంస్కృతికంగా ఎంత సుసంపన్న మైనదో నిరూపితసత్యం. అయితే తెలంగాణ వాళ్లు వలస పాలకుల సాంస్కృతిక అణచివేతతో ఆత్మవిశ్వాస రాహిత్యంలో, అస్తిత్వ సంక్షోభంలో ఉంటారు. అది ఇకపై ఉండదు. రాజకీయంగానే కాదు సాంస్కృతికంగా కూడా స్వతంత్రులమైనాం. కావల్సిందల్లా తెలంగాణ ప్రభుత్వంలో భాషా, సంస్కృతి, సాహిత్యం, కళలు ఒకానొక ప్రాధాన్యాంశం కావాలి. రాజకీయ పోరాటానికి తోడు సాంస్కృతిక ఉద్యమం చేయిచేయిగా సాగింది కాబట్టి ప్రభుత్వం మన భాష కోసం, మన సంస్కృతి కోసం నిలబడాలి. ప్రభుత్వ వైఖరి ప్రజల్లో కూడా పునరుజ్జీవనాకాంక్షను అంకురింపచేస్తుంది. ❖

# తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం కొన్ని ఆలోచనలు

డా॥ సి.కాశీం

*అరవై ఏళ్ల తెలంగాణ ప్రజల పోరాటం, త్యాగం ఫలించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ప్రత్యేక రాష్ట్రమనే చిన్న కోరిక నెరవేరడానికి ఎంతగా పెనుగులాడవల్సి వచ్చిందో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేపథ్యంలో చూసాం. మార్క్సిస్టు పరిభాషలో చెప్పవల్సి వస్తే ఒక బూర్జువా డిమాండ్‌ను నెరవేర్చుకోవడానికి ఇంతటి త్యాగం అవసరమైంది. బహుశ తెలంగాణ ప్రాంతంలో బలమైన బూర్జువా వర్గం లేకపోవటం కూడా ఒక కారణం అయ్యిండొచ్చు. మొన్న టివి9 తెలంగాణ శాసనసభ్యులను అవమానిస్తూ కార్యక్రమాన్ని ప్రసారం చేసేవరకు అన్ని సందర్భాలలో బూర్జువా వర్గం లేని లోటు కన్పిస్తుంది. చరిత్రలో ఎప్పుడైనా బూర్జువా, భూస్వామ్య వర్గం తన వ్యాపార ప్రయోజనాల కోసం చరిత్ర, సంస్కృతి, సాహిత్యం మొదలైన ఉపరితల అంశాలను తమకు అనుకూలంగా రూపొందించుకుంటారు. తెలంగాణ విషయంలో కోస్తా బూర్జువా, భూస్వామ్యవర్గం అణచివేత, అవమానించే, చిన్న చూపు చూసే దృక్పథాన్నే అవలంబించింది. ప్రత్యేకంగా బ్రిటీష్ పాలనలో ఉండటం వలన అందివచ్చిన అన్ని అవకాశాలను ఉపయోగించుకొని కోస్తా ప్రాంతం నుంచి ఎలైట్ సెక్షన్ ఎదిగింది. కృష్ణా, గోదావరి నదుల నీళ్ల పారకం వలన వ్యవసాయ రంగంలో ముందెన్నడులేనంత ఉత్పత్తిని ఆ ప్రాంతం సాధించింది. సహజంగానే ఉత్పత్తి శక్తులలో వచ్చిన మార్పు సమాజాన్ని ముందుకు తోస్తుంది. అట్లా కోస్తా నుంచి ఎదిగిన బూర్జువావర్గం మద్రాస్‌కు వెళ్లి పెట్టుబడులు పెట్టింది. అక్కడి సినిమారంగంలో పెట్టుబడులు పెట్టింది. తమిళ బూర్జువా-ఆంధ్ర బూర్జువా వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడి బలమైన తమిళ బూర్జువాజీ విజయం సాధించింది. అపుడు ఆంధ్ర బూర్జువా వర్గానికి పెట్టుబడి పెట్టడానికి అనువైన తెలంగాణ ప్రాంతం అవసరం వచ్చింది.*

అప్పటికే నాలుగు వందల సంవత్సరాలుగా నిజాం పాలనలో ఉన్న తెలంగాణ ఫక్తు భూస్వామ్య సమాజాలలో ఉంది. చరిత్ర, సంస్కృతి, సాహిత్యం మొదలైన ఉపరితల అంశాలన్నిటిని ఇక్కడ భూస్వామ్య వర్గమే ప్రభావితం చేస్తుండింది. ఆధునిక భావజాల ప్రభావం కూడా చాలా తక్కువగా ఉండేది. కేవలం 4శాతం అక్షరాస్యత. వెట్టిచాకిరి లాంటి బానిస సమాజపు ఆనవాళ్లు ఇక్కడి ప్రజలు చవిచూసారు. పోరాడిన చరిత్ర తెలంగాణ సమాజానికి వందల ఏళ్లుగా ఉంది. నైజాం దుర్మార్గ పాలనను తుదముట్టించడానికి రైతాంగం సాయుధంగా కదిలింది. పోరాడి సాధించుకున్న విజయాల సందర్భంలో కోస్తా భూస్వామ్య-బూర్జువా వర్గం తెలంగాణలోకి ప్రవేశించింది. నైజాం పట్ల ఉండే తీవ్ర వ్యతిరేకత కూడా తెలంగాణ ప్రజలలో 'విశాలాంధ్ర' అనే భావనను పురికొల్పింది. ఈ భావన వెనుక ఉండే కోస్తా దోపిడి వర్గాల కుట్రలను తెలంగాణ సమాజం కొంతమేరకైనా అర్థం చేసుకొని, న్యాయమైన తన నిరసనను వ్యక్తం చేసింది. కాని అది అరణ్యరోధనగా మిగిలింది.

ఇట్ల అన్ని హంగులున్న కోస్తా భూస్వామ్య-బూర్జువా వర్గం తెలంగాణ ప్రాంతాన్ని చాలా సులభంగానే వశం చేసుకున్నది. తెలంగాణను వలసగా మార్చుకున్న తర్వాత ఇక్కడి వనరులను దోపిడి చేయడానికి కావల్సిన ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వాతావరణాన్ని తయారుచేసుకున్నారు. కోస్తాంధ్ర ప్రాంతంలో బ్రిటీష్ కంపెనీ పాలకులు అవలంభించిన అభివృద్ధి నమూనాను ఇక్కడ అమలు చేసారు. తెలంగాణ రైతులకు భూమిని సాగుచేసే పద్ధతులు తెలియవనే న్యూనత భావం కలిగించారు. వ్యాపార పంటల సాగును ఇక్కడి రైతులకు అలవాటు చేసారు. నీళ్ల వెంట చేపల్లా ఎదురెక్కివచ్చి తెలంగాణలో కొత్తగా వచ్చిన నాగార్జున సాగర్, శ్రీరాంసాగర్, జూరాల, ఆర్‌డిఎస్ కాలువల కింద తెలంగాణ భూములను చౌకధరలకు కొని వరి పంటను సాగుచేసారు. ఆర్థిక రంగంలో తమ ప్రయోజనాలు నెరవేర్చుకోవటానికి రాజకీయాధికారం కూడా తమ చేతుల్లోనే ఉంచుకున్నారు. మరీ ముఖ్యంగా ఎనభయో దశకంలో కోస్తా నుంచి ఎదిగివచ్చిన కమ్మ కుల పెట్టుబడిదారి వర్గానికి రాజకీయాధికారం అవసరమొచ్చి తెలుగుదేశం పార్టీ పుట్టింది. ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను విజయవంతంగా నెరవేర్చుకోవడానికి తెలంగాణ ప్రజలను మానసికంగా కోస్తా పాలకులకు అనువుగా మార్చడానికి సినిమా బలమైన సాధనంగా పనిచేసింది. ఇక్కడి ప్రజలకు చరిత్ర లేదని, సాహిత్యం లేదని, భాష తెలియదని, సంస్కృతి లేదని అవహేళన చేసారు. అవమానించారు. కోస్తా సినిమా చెప్పిందే భాషగా, అక్కడి రచయితలు రాసిందే సామాజిక చరిత్రగా, సాహిత్య చరిత్రగా చలామణి అయింది. వెయ్యేళ్ల తెలుగు సాహిత్య చరిత్రలో తెలంగాణకు చోటు దక్కలేదు. "భాష విషయంలో స్వల్పమైన అ ప్రామాణికతల కారణంగా భక్తి మార్గానికి సంబంధించిన పాల్కుర్కి సోమన, పోతనలనే పండిత మార్గం హృదయ పూర్వకంగా కలుపుకోలేదు. ఈ కవులందరూ రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలకు చెందిన కవులై ఉండటం గమనార్హం"(కె.కె.రంగనాథా చార్యులు-తెలుగు సాహిత్యం చారిత్రక భూమిక.పుట.27)

ఈ పూర్వ నేపథ్యంలో తెలంగాణ సాహిత్యానికి జరిగిన అన్యాయాన్ని అర్థం చేసుకుంటూనే ఇపుడు కొత్త సాహిత్య చరిత్ర నిర్మాణానికి తెలంగాణ బుద్ధిజీవులు పూనుకోవాలి. అయితే ఉపరితల అంశమైన సాహిత్య చరిత్రను నిర్మించాలంటే పునాది అంశాలను

తప్పనిసరి పట్టించుకోవాలి. సాహిత్యం, పునాది అంశాలతో సంబంధం లేకుండా విడిగా ఉండదు. వాటి ప్రభావానికి గురవుతూ మారుతూ ఉంటుంది. సాహిత్యాన్ని అధ్యయనం చేసేటప్పుడు చారిత్రక దృష్టి తప్పనిసరి ఉండాలి. భారతీయ భాషా సాహిత్యాలు మధ్యయుగాలలో వికసించాయి. పైగా అవన్నీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడే రూపొందాయి. “సాహిత్యం సామాజిక చైతన్యరూపం కాబట్టి ఈ సాహిత్యాన్ని పరిశీలించేటప్పుడు ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల మార్పు దృష్టితోనే పరిశీలించాలి. సామాజిక అస్తిత్వంతో అన్వయించ కుండా సాహిత్యాన్ని పరిశీలించకూడదనే (సాహిత్యంలో సమాజ చలనపు ప్రతిఫలనం-పుట.3) వరవరరావు మాటలు తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణానికి పునాదిగా పనిచేస్తాయి. సాహిత్యాన్ని కేవలం సాహిత్య సూత్రాల మీద వివరించడం అనే పద్ధతి పరిశోధనలలో ఉన్నప్పటికి, అదంతా శాస్త్రీయమైన మెథడాలజీగా నిరూపణ కాలేదు. గతితార్కిక సూత్రాల ఆధారంగానే సాహిత్య మార్పును-నిర్మాణాన్ని పరిశీలించాలనే దృక్పథానికే పరిశోధనలో విలువ ఎక్కువగా ఉంది.

తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం సమగ్రంగా జరగాలంటే ముందు ఇక్కడి భౌగోళిక, ఆర్థిక, రాజకీయ చరిత్ర నిర్మాణం జరగాలి. డా॥రాజారెడ్డి పరిశోధన బయటపడేవరకు శాతవాహనుల పరిపాలన తెలంగాణలో జరిగిందని, కోటి లింగాల(కరీంనగర్) రాజధానిగా ఉండేదని లోకానికి తెలియదు. ఇన్నాళ్లు శాతవాహనులు లేదా తెలుగుభాష అనేసరికి ధాన్య కటకం లేదా అమరావతి స్థూపం దగ్గరి ‘నాగాబు’ శబ్దం చుట్టే తెలుగు సాహిత్య చరిత్ర తిరిగింది. ఇపుడు తెలుగు లిపి బ్రహ్మిలిపి నుంచి ఏర్పడిందని, తొలినాళ్ల బ్రహ్మిలిపి కోటి లింగాలలో లభించిన నాణాలపై ఉందని రాజారెడ్డి ఆధారాలతో సహా నిరూపించాడు. కోటి లింగాల చరిత్ర ముంగిట్లోకి రావటం వలన తెలుగు భాషా సాహిత్యాలకు నూతన అధ్యాయం ఆరంభమైందని తెలంగాణ నేల మీద నిలబడి నిరూపించాలి. కనుక ఆర్థిక, రాజకీయ చరిత్ర కోణం నుంచి, నిర్మాణం నుంచి ప్రయాణం మొదలుపెడితే తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం సులభమవుతుంది.

ఇవ్వాల్టికి డజన్‌కు పైగా తెలుగు సాహిత్య చరిత్ర పుస్తకాలు వచ్చాయి. వీటిని రాసినవాళ్లలో ఏ ఒక్కరు కూడా తెలంగాణ వారు కాదనేది గమనించదగిన విషయం. పైగా వాటి పేర్లన్నీ (ఎక్కువగా) ఎప్పుడో ఐతేరియ బ్రాహ్మణంలో ఉన్న ‘ఆంధ్ర’ శబ్దంతో మొదలవుతున్నాయి కానీ తెలుగు శబ్దంతో రాయలేదు. ఆంధ్రకవుల చరిత్ర(కందుకూరి) సమగ్రాంధ్ర సాహిత్యం(ఆరుద్ర) ఆంధ్ర వాఙ్మయ చరిత్ర(దివాకర్ల వేంకటవధాని) మచ్చుకు కొన్ని ఉదాహరణలు. వీళ్లకెవరికి సాహిత్య చరిత్ర రాసేటప్పుడు తెలంగాణ ప్రాంతానికొక చరిత్ర, సాహిత్యం ఉందనే సోయి లేదు. (ఆరుద్రకు కొంత మినహాయింపు) ఉండి కూడా విస్మరించారు. లేదా తప్పులను రికార్డు చేసారు. ఆంధ్ర, రాయలసీమలలో ఉన్న వాళ్లే గొప్పకవులని, వాళ్ల చరిత్రనే సాహిత్య చరిత్రగా తెలంగాణ వాళ్ల చేత చదివించారు. ఇక్కడి సమాజం తమకంటూ ఒక సాహిత్య సంపద ఉందనే విషయాన్నే మర్చిపోయేటట్లు చేయటంలో అక్కడి పరిశోధకులు విజయం సాధించారు. కనుకనే ఆదికవి నన్నయ తెలంగాణ తలమీద పీఠం వేసుకొని కూర్చున్నాడు. తెలంగాణలో వికసించిన దేశీ సాహిత్య రచనను మింగేసే మార్గ రచనను ముందుకు తీసుకొచ్చాడు. అమాంతంగా తెలంగాణ పొరల్లో నుంచి వచ్చిన మౌఖిక, లిఖిత సాహిత్యాన్ని మింగేసాడు. నన్నయ పీఠాన్ని కదిలించకుండా తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం సులభంగా జరగదు.

తెలంగాణలో విస్తృత సాహిత్య పరిశోధన జరగాలి. కోస్తా, రాయలసీమ ప్రాంతాలలో ఆంగ్ల పరిశోధకుల ఆసక్తితో పరిశోధనలు జరిగినట్లు, తెలంగాణలో ఆ అవకాశం లేకుండా పోయింది. కాలిన్ మెకంజీ, కావలి బొర్రయ్య లాంటి ఒకరిద్దరు మినహాయిస్తే ఆంగ్ల పరిశోధకులెవ్వరు తెలంగాణ గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆంధ్ర ప్రాంతంలో ఉండిన పరిశోధకులకు కూడా తెలంగాణ ప్రాంతం-చరిత్ర-సాహిత్యంపై ఉపేక్షా దృష్టి ఉందని శేషాద్రి రమణకవుల లాంటి వారి అభిప్రాయాలను చూస్తే అర్థమవుతుంది. నిజానికి వీరు 1927 నాటికే ‘నిజాము రాష్ట్రాంధ్ర కవులు’ అనే వ్యాసంలో 114 మంది తెలంగాణ కవుల పట్టికను ఇచ్చారు. కాని తర్వాత జరిగిన సాహిత్య చరిత్ర నిర్మాణంలో ఏ రచయిత/పరిశోధకుడు ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. పైగా తెలంగాణ ప్రాంతంలో కవులు లేరని, సాహిత్యమే లేదనే అహంభావ అభిప్రాయాలను వెలిబుచ్చారు. 1934లో ముడుంబై వేంకటరాఘవాచార్యులు గోలకొండ పత్రికలో నిజాం రాష్ట్రంలో ఆంధ్రకవులు పూజ్యము అంటూ ఒక వ్యాసం రాసారు. ఈ అహంకారానికి సమాధానంగా సురవరం ప్రతాపరెడ్డి 354 మంది ఆధునిక కవుల వివరాలను, 183 మంది ప్రాచీన కవుల వివరాలను పేర్కొంటూ గోలకొండ కవుల సంచికను ప్రచురించారు.

తెలుగు సాహిత్యంలో మొదటిసారి సంస్కృత అనువాదాల జోలికి వెళ్లకుండా మార్గ పద్ధతికి భిన్నంగా దేశీయ పద్ధతిలో స్వతంత్ర రచన చేసినవాడు పాల్కుర్కి సోమనాథుడే. ఇతడు తెలంగాణ ప్రాంతానికి చెందినవాడు(వరంగల్-పాలకుర్తి). భాషలో-ఛందస్సులో- వస్తువులో కొత్తదనాన్ని చూపించాడు. బసవ పురాణం లాంటి శివభక్తుల జీవితాలను ప్రపంచానికి తెలియపర్చాడు. ద్విపద ఛందస్సులో రాసి పద్యపదాలు ప్రజల నాలుకల మీద ఆడేటట్లు చేసాడు. కాని సంస్కృత భారతాన్ని అనువాదం చేసిన నన్నయకు ఇచ్చిన ప్రాధాన్యతను పాల్కుర్కికి ఇవ్వకపోవటంలోనే కోస్తా, రాయలసీమ పరిశోధకుల వివక్ష వైఖరి బయటపడుతుంది. ఇప్పటికి లభ్యం కాని ఎర్రన రామాయణానికి సాహిత్య చరిత్రలో ఇచ్చిన ప్రాధాన్యత తెలంగాణ నేల మీదినుంచి (మార్గ పద్ధతిలో) వచ్చిన భాస్కర రామాయణానికి ఇవ్వలేదు. ఈ భాస్కర రామాయణాన్ని రాసిన నలుగురు కవుల్లో మొదటివాడు హుళక్కి భాస్కరుడు. ఇతడు కాకతీయ రాజుల ఆస్థానంలోని వాడు. రంగనాథ రామాయణం రాసిన గోన బుద్ధారెడ్డి తెలంగాణ ప్రాంతానికి చెందినవాడనే విషయం వేరే చెప్పనక్కర్లేదు. సాహిత్య చరిత్రలో ప్రతీ కవి పుట్టుక, ఆశ్రయించిన రాజు, వారి వివరాల గురించి వందలాది పుటలు రాసారు(వాళ్లు ఆంధ్ర, రాయలసీమ వారైతే) కాని తెలంగాణకు చెందిన పైన పేర్కొన్న కవుల గురించిన ప్రస్థావన ఉన్నప్పటికి వారు ఏ ప్రాంతం వారనే విషయాలను ఏ సాహిత్యచరిత్రలో పేర్కొనలేదు. తెలుగు సాహిత్యానికి మౌఖిక వాసన చూపించిన పద్య రూప ప్రక్రియ యక్షగానం. దీనికి

జీవం పోసిన కందుకూరి రుద్రకవి తెలంగాణవాడే.

తెలుగు నేలలో అతిపెద్ద మొదటి రాజ్యం కాకతీయులదే. సుస్థిరమైన పాలన సుదీర్ఘకాలం ఉన్న రాజులు కాకతీయులు. ఆ తర్వాతనే విజయనగర సామ్రాజ్యం ప్రారంభమైంది. నిజానికి విజయనగర రాజ్యాన్ని కాకతీయుల దగ్గర సైనికాధికారులుగా ఉన్న హరిహర బుక్కరాయలనే సోదరులే విజయనగర సామ్రాజ్యాన్ని నిర్మించారని డా॥సుంకిరెడ్డి నారాయణరెడ్డి తన 'ముంగిలి'లో పేర్కొన్నాడు. విషాద మేమిటంటే కాకతీయ రాజ్యంలో ఉన్న విద్యానాథుడు రాసిన 'ప్రతాపరుద్రీయం' అనే అలంకార శాస్త్రాన్ని అనుసరించి రామరాజ భూషణుడు(అష్ట దిగ్గజాలలో ఒకడు!?) రాసిన కావ్యాలంకార సంగ్రహానికి కోస్తా, రాయలసీమ పరిశోధకులు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పాఠ్యాంశంగా రూపొందించారు. కాని ప్రతాపరుద్రీయానికి ప్రాధాన్యత లేకుండా చేసారు. తెలంగాణ ప్రాంతంలో నుంచి వచ్చిన అలంకార శాస్త్రానికి జరిగిన అన్యాయాన్ని తప్పక సవరించాలి.

ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు పెట్టుబడిదారి బ్రిటీష్ పాలనలో ఉంటే, తెలంగాణ ఫ్యూడల్ నిజాం పాలనలో ఉంది. అక్కడ ఆంగ్ల అనువాద రచనల పట్ల మొగ్గుచూపే కాలానికి కొద్దిముందే తెలంగాణ ప్రాంతంలో మరి ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ఆస్థాన సాహిత్యం ప్రభలంగా వచ్చింది. జటప్రోలు సంస్థానం పాలకుడైన మాధవరాయలు 'చంద్రికా పరిణయం' అనే ప్రబంధాన్ని రాసాడు. గద్వాల సంస్థానంలో పెద సోమయాజి 'ముకుంద విలాసం' రాసాడు. ఈ రచనలు సాహిత్య చరిత్రలలో కనిపించినా వివరాలు దొరకకుండా చేసారు. కాని విజయనగర రాజ్యం నుంచి వచ్చిన కొన్ని ప్రబంధ సాహిత్యానికి మాత్రం లేని గొప్పదనాన్ని కల్పించారు.

ఇక ఆధునిక కాలంలో సంస్కరణ, జాతీయోద్యమ, భావ కవిత్వానికి ఇచ్చిన ప్రాధాన్యతను తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సాహిత్యానికి ఇవ్వలేదు. కనీసం చరిత్రలో భాగం కానివ్వలేదు. చిలకమర్తి అల్లిన 'భరత ఖండంబు' పద్యానికి ఎంతో ప్రాచుర్యాన్ని కల్పించారు. గరిమెల్ల 'మాకొద్దీ తెల్లదొరతనం' పాటకు గొప్ప గౌరవం ఇచ్చారు. అట్లే సుద్దాల హన్మంతు రాసిన 'పల్లెటూరి పిల్లగాడా', బండి యాదగిరి రాసిన 'బండెనక బండికట్టి' పాటలు కోట్లాదిమంది ప్రజల నాలుకల మీద ఉన్నా పాఠ్య పుస్తకాలలోకి రాలేదు. రైతాంగ పోరాటంలో భాగంగా వచ్చిన మా భూమి నాటకం, ప్రజల మనిషి నవలకు లేని ప్రాధాన్యతను వరవిక్రయం, కన్యాశుల్కం, మాలపల్లి రచనలకు కల్పించారు(గురజాడకు క్షమాపణలతో) చాలా జాగ్రత్తగా ఈ పొరపాట్లను సవరించుకోకపోతే తెలంగాణ సాహిత్యానికి నష్టం జరుగుతుంది. 70వ దశకంలో వచ్చిన విప్లవకర సాహిత్యానికి నాయకత్వం శ్రీశ్రీ, కొకు, కెవిఆర్ వహించారు. వరవరరావు, చెరబండరాజు, గద్దర్, అల్లం రాజయ్య ప్రత్యామ్నాయ భాషను, నుడికారాన్ని, నిర్మాణాన్ని విప్లవ సాహిత్యానికి అందించారు. కనుక ఆంధ్ర, రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చిన విప్లవ సాహిత్యానికి, తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన విప్లవ సాహిత్యానికి రూపంలో, శిల్పంలో చాలా తేడాలు ఉన్నాయి. ఈ తేడాలను జాగ్రత్తగా పరిశీలించి రూపొందించుకోవాలి.

కారంచేడు, చుండూరులు తెలంగాణలో లేవు. కనుక ఒక రకంగా కోస్తా నుంచి వచ్చిన పద్ధతిలోనే దళిత కవిత్వం తెలంగాణలో వచ్చే అవకాశం లేదు. జాషువా కొనసాగింపు అక్కడి దళిత కవిత్వంలో ఉంటే సుద్దాల, బండి యాదగిరి వారసత్వం ఇక్కడి దళిత కవితంలో ఉంటుంది. 'నన్ను ఎవ్వరెలా పిలిస్తే నాకేంటి నేనొక నక్సలైట్‌ను అయినప్పుడు' అనే శైలి తెలంగాణలో ఉంటుంది. దళిత కవిత్వానికి నాయకత్వం వహించినవారు కూడా అందరూ ఆంధ్ర కవులే. వస్తువులోనే తెలంగాణ దళిత కవిత్వంలో కొట్టొచ్చినట్లు కన్పించే తేడా ఉంటుంది. శిల్పం-రూపమైతే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ స్పష్టత ఏర్పర్చుకోవడానికి ఇదే సమయం.

80వ దశకంలో వచ్చిన స్త్రీవాద సాహిత్యం ఒక రకంగా తెలంగాణకు సంబంధం లేదనటం బాగుంటుందేమో. 70వ దశకంలోనే 'సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మ కన్నీటిని కత్తుల్లా మార్చి కొమరెల్లి కొండలో కొలిమి రాజేయ్యాలని' పిలుపునిచ్చిన గద్దర్, నిండు అమవాస్యనాడు పుట్టిన ఆడపిల్లను సమ్మక్క-సారక్కను చేస్తానన్నాడు. ఇక్కడ స్పష్టమైన స్త్రీ విముక్తికి తెలంగాణలో రైతాంగ సాయుధ పోరాటమే దారి చూపించింది. ఇక్కడ చలంలు లేరు. గిరీశంలు అంతకంటే లేరు. స్త్రీవాద సాహిత్యం వచ్చింది కోస్తా నుంచే. నాయకత్వం వహించింది కూడా కోస్తా వాళ్లే. ఈ విశ్లేషణ దృష్టితో స్త్రీ సమస్యను చిత్రించిన తెలంగాణ సాహిత్యాన్ని రూపొందించు కోవల్సి ఉంది.

తెలుగు సాహిత్యాన్ని కొత్త చూపుతో అధ్యయనం-పరిశోధన చేస్తూ అసలైన తెలంగాణ సాహిత్య చరిత్రను రూపొందించుకోవాలి. దీనికి మొదట తెలంగాణ పాలకులు పూనుకోవాలి. అరవై ఏళ్లుగా నిరాదరణకు గురైన భాషా-సాహిత్యాలకు పునర్వైభవం కల్పించాలంటే విస్తృత పరిశోధన జరగాలి. వాటికి తగిన నిధులు ఉండాలి. ఈ పనిని వ్యక్తిగత స్థాయిలో చేయటం సాధ్యం కాదు. విశ్వవిద్యాలయాల స్థాయిలో, నిబద్ధత కలిగిన పరిశోధక సంస్థలు చేయదగినవి. తెలంగాణలో వేల సంవత్సరాలుగా మౌఖిక సాహిత్య వారసత్వం సమాంతరంగా కొనసాగుతుంది. దీని కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయాలను నెలకొల్పి నిక్షిప్తం చేయాలి. పాల్కుర్కి, పోతన లాంటి ప్రాచీన మధురకవుల రచనలపై సరైన పద్ధతిలో పరిశోధన జరిగి ఈ సమాజానికి ఫలితాలు అందాలి. అంతిమంగా తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం జరగాలి. దీనికొక ప్రజాదృక్పథం ఉండాలి.


1. తెలుగు సాహిత్యం చారిత్రక భూమిక : 1990 - కె.కె. రంగనాథాచార్యులు
2. సాహిత్యంలో సమాజ చలనం ప్రతిఫలనం: 2013 - వరవరరావు
3. ముంగిలి:2009 - డా॥ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి
4. తెలంగాణ సాహిత్యం - జీవిత చిత్రణం: 2007 - (సం) డా॥ తూర్పు మల్లారెడ్డి
5. తెలంగాణలో తెలుగుసాహిత్య వికాసం: 2013 - (సం) డా॥ జె. చెన్నయ్య
6. జంబి (సాహిత్య పత్రిక) : 2014


❖

# తెలంగాణ రాష్ట్రంలో
# సినీ పరిశ్రమ ఎలా వికసించాలి!?

డా॥పగడాల నాగేందర్
నిజాం కళాశాలలో తెలుగు అధ్యాపకుడు

*20, 21వ శతాబ్దాలలో సినిమా ప్రపంచవ్యాప్తంగా అన్నివర్గాల ప్రజల్ని బలంగా ప్రభావితం చేస్తున్నది. బ్రిటీష్ వారి పరిపాలన కారణంగా "ఆధునికత" భారతదేశం నలు మూలలా వ్యాపించింది. రైలుమార్గాలు, రోడ్లు, రవాణా సౌకర్యాలు, టెలిఫోన్, తపాలా కార్యాలయాలు, గ్రామ్‌ఫోన్ రికార్డ్, రేడియో మొదలైన వాటితో పాటు సినిమా భారతీయ సమాజాన్ని ఆధునికత వైపు నడిపించింది. మూకీ, టాకీ సినిమాలు భారతదేశ వెండితెరను గుభాళింపజేశాయి. క్రమంగా బ్రిటీష్ పాలనలో ఉన్న ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తమిళ సినీ పరిశ్రమతో పాటు, తెలుగు సినీపరిశ్రమ అభివృది చెందింది. నిజాంరాజు పాలనలో ఉన్న తెలంగాణ ప్రాంతం సినిమా పరిశ్రమతో పాటు, ఆధునికతను స్వీకరించడంలోనూ చాలా వెనుకబడే వుంది, దీనికి రాజకీయ, ఆర్థిక, సామాజిక కారణాలు ఎన్నో ఉన్నాయి. తాత్వికంగా ఆలోచిస్తే తెలంగాణ ప్రాంతానిది చాలా భిన్నమైన సంస్కృతి. పాశ్చాత్య సంస్కృతి ప్రభావానికి గురికాకుండా కొన్ని వందల సంవత్సరాలు తెలంగాణ ప్రాంతం వేరుచేయబడి, ఒక రకమైన ఒంటరితనాన్ని అనుభవించింది, ముస్లింల పాలనలో భిన్నమైన సాంస్కృతికాభివృద్ధి తెలంగాణ నేలలో జరిగిందనేది ఒక నిర్వివాదాంశం. ఈ సాంస్కృతి కాభివృద్ధి సినిమాకు, సినిమారంగానికి వ్యతిరేకమైనది. "ఎందుకు వ్యతిరేకమో?" చెప్పడానికి చాలా కారాణాలున్నాయి. ఇవి మరో సందర్భంలో చర్చించదగ్గ కారణాలు, కనుక ఆ సందర్భంలో ఈ విషయాలపై చర్చిస్తాను.*

బ్రిటీష్ ఆంధ్ర ప్రాంతం నుంచి మద్రాసు మహానగరానికి వలసబోయిన ఆంధ్ర ప్రాంతంవారు అన్ని రంగాలతో పాటు సినిమా రంగంలోనూ అడుగు పెట్టారు. ముఖ్యంగా వ్యాపారస్తులు సినీ రంగంలో కాలూని పెట్టుబడులు పెట్టారు. క్రమంగా ఆంధ్ర ప్రాంత పెట్టుబడిదారుల చేతుల్లోకి సినిమా వెళ్ళిపోయింది.

జాతీయోద్యమ కాలంలో-స్వాతంత్రోద్యమ ప్రభావంతో తెలుగులో కొన్ని మంచి సినిమాలే నిర్మించబడ్డాయి. రైతుబిడ్డ, మాలపిల్ల, వందేమాతరం లాంటి సినిమాలు తెలుగువారి ప్రతిష్ఠను నిలబెట్టాయి. ఈ సమయంలో కూడా సినీ పరిశ్రమలో ఆంధ్ర ప్రాంతంవారి సాంస్కృతికాధిపత్యమే కొనసాగుతోంది. నిర్మాతలు, దర్శకులు, సినీపాటలు, స్క్రిప్ట్ రచయితలు, హీరోలు, హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు, కామెడీ యాక్టర్స్ అందరూ ఆంధ్ర ప్రాంతంవారే. ఒక్క మాటలో చెప్పాలంటే లైట్‌బాయ్ నుంచి ప్రొడ్యూసర్‌దాక అంతా ఆంధ్రప్రాంతం వారే. తెలంగాణ ప్రాంతం నుండి కాంతారావు, ప్రభాకర్‌రెడ్డిలు తప్ప హీరోలుగా ఎదిగిన వారు అసలు లేరనే చెప్పాలి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడేదాకా ఇదే పరిస్థితి కొనసాగింది. నైజాం ఏరియా మొదటి నుంచి ఆంధ్రసినిమాలకు కాసుల వర్షం కురిపించే ప్రాంతంగానే మిగిలిపోయింది. నవంబర్1, 1956లో తెలంగాణ ప్రాంతంను కలుపుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. ఆంధ్రవాళ్ళు నిర్మించే చెత్త సినిమాల ధాటికి తెలంగాణ ప్రాంతం తన సంస్కృతినే కోల్పోయింది. తెలంగాణ కళారూపాలకు చాలా ముప్పు ఏర్పడింది. పొంచి ఉన్న ఈ ప్రమాదాన్ని తెలంగాణ సమాజం పసిగట్టలేకపోయింది. ఇది ఒక చారిత్రక విషాదం.

తొలినాళ్ళ సినిమారంగంలో అభ్యుదయభావాలు గల దర్శకులు, రచయితలు, నిర్మాతలు, సినీగేయ రచయితలు బాగా రాణించారు. ఏదో ఒక రంగంలో వారు ప్రతిభావంతులు కూడా. సీనియర్ సముద్రాల, వేదాంతం రాఘవయ్య, గూడవల్లి రామ బ్రహ్మం, త్రిపురనేని గోపిచంద్, శ్రీశ్రీ, చెలం, ఆరుద్ర, తాపీ ధర్మారావు లాంటి రచయితలు సినీరంగంలో బాగా రాణించారు. తెలంగాణ ప్రాంతం నుంచి దాశరథి, సి.నారాయణరెడ్డి లాంటి రచయితలు రాణించారు. అయినా తెలుగు సినిమా పరిశ్రమ నానాటికి దిగజారుతూ వచ్చింది.

ఉమ్మడి మద్రాసురాష్ట్రం నుండి విడిపోయాక తెలుగు సినిమా పరిశ్రమ క్రమంగా హైదరాబాద్ రాజధానిలో విస్తరించింది. ఆంధ్ర పెట్టుబడిదారులు, బడా వ్యాపారస్థులు, స్టూడియోలు నిర్మించి, ల్యాబ్‌లు నిర్మించి క్రమంగా తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌లో వేళ్లూనేలా చేసారు. అందుకోసం ఆయా కాలంలో ఉన్న, ఆయా ప్రభుత్వాల నుండి పెద్ద ఎత్తున సబ్సిడీలు పొందారు. చాలా తక్కువ ధరలకే భూములను కొనుగోలు చేసారు. తమ వ్యాపారాభివృద్ధికి తెలంగాణ ప్రాంత ప్రజల్ని, పాలకులను అమాయకుల్ని చేసి అందినకాడికి దోచుకున్నారు. సిని పరిశ్రమ ద్వారా ఆంధ్ర పెట్టుబడిదారులు పెద్దఎత్తున

లాభాలు గడించారు. తెలంగాణ ప్రాంతంవారిని సినిపరిశ్రమలో బానిసలుగా మార్చారు. ఈ దురన్యాయాన్ని, శ్రమ, మేధోదోపిడిని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సందర్భంగానైనా పెద్దఎత్తున ఎదుర్కోవాలి.

21వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా నిర్మితమవుతున్న సినిమాలను చూసినప్పుడు, భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో, ఇతర భాషలలో నిర్మితమవుతున్న సినిమాలను చూసినప్పుడు, 99శాతం నాసిరకం గల సినిమాలు తెలుగు రాష్ట్రంలో నిర్మితమవుతున్నాయి. సినిమా ఎప్పుడైనా జీవన వాస్తవికతను ప్రతిబింబించేలా చూపించాలి. సామాజిక ప్రయోజనాల్ని ఆశించి, సినిమాలు నిర్మించాలి.

సినిమాను సీరియస్‌గా అధ్యయనం చేసిన ప్రపంచ దర్శకులు అద్భుతమైన సినిమాలు తీసారు. అకిరో కురసోవా, ఇంగ్‌మన్ బర్గ్‌మన్, ఇమ్‌క్యాన్ టేక్, స్పీల్‌బర్గ్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత దర్శకులు అద్భుతమైన సినిమాలు తీసారు. భారతదేశపు జీవన సంస్కృతిని, వాస్తవికతను అత్యద్భుతంగా తమ సినిమాల్లో చూపించిన ఇండియన్ డైరెక్టర్స్ ఎందరో ఉన్నారు. సత్యజిత్‌రే, రిత్విక్‌ఘటక్, ఆదూరి గోపాల కృష్ణన్, అరవిందన్, శ్యాంబెనగల్, గిరీశ్ కాసరవెల్లి, బాలచందర్, భారతీరాజు, బాలుమహేంద్ర లాంటి దర్శకులు ఇండియన్ సినిమాను ప్రపంచ స్థాయిలో ఉన్నతంగా నిలబెట్టారు. ఆయా రాష్ట్రాలలో ప్రాంతీయ సినిమా అద్భుతంగా రాణించింది ప్రజలు ఆదరించారు.

గిరీశ్ కాసరవెల్లి ఓ కేరళ రచయిత రాసిన నవల ఆధారంగా నిర్మించిన "నాయినెరుళ్ళ" సినిమా అద్భుతంగా కేరళ సంస్కృతిని, కళలను ప్రతిబింబించింది.

ఒక ఊరు, ఒక కులం, కుల సంప్రదాయాలు ఊరు కట్టుబాట్లు నేపథ్యంగా తమిళంలో "పరుత్తివీరన్" అనే ఓ ప్రేమ కథతో సినిమా వచ్చింది. ఇందులో "ముత్తులిగి" పాత్రకు హీరోయిన్ ప్రియమణికి జాతీయ అవార్డ్ వచ్చింది. మలయాళం సినిమా చూసినప్పుడు అది మలయాళపు సంస్కృతిని నింపుకొని మలయాళీ వాసనేస్తుంది. తమిళ సినిమా కూడా దాదాపుగా తమిళ వాసనేస్తుంది. తెలుగు సినిమా చూసినప్పుడు అది జీవిత వాస్తవికతకు విరుద్ధంగా హాలివుడ్ వాసనేస్తుంది.

హాలివుడ్ కల్చర్‌లో విహరిస్తున్న తెలుగు సినిమాను నేలకు లాగి, తెలంగాణ రాష్ట్రం కొత్త సినిమాకు పాదులు వేయాలి.

తెలుగు సినిమాను హేతువాద దృక్పథంతో, అభ్యుదయ భావాలతో నిర్మించిన ఘనత తెలంగాణ ప్రాంతానికే దక్కుతుంది. బి.నరసింగరావు నిర్మించిన 'మాభూమి' సినిమా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని చిత్రించింది. ఈ సినిమాకు డైరెక్టర్ గౌతమ్ ఘోష్. బి.నరసింగ్‌రావు నిర్మించి, దర్శకత్వం వహించిన ఆర్ట్ సినిమాలు"రంగులకల, దాసి, మట్టి మనుషులు" లాంటివి తెలుగు సినిమా గౌరవాన్ని ప్రపంచ స్థాయిలో నిలబెట్టాయి. కాని ఆంధ్ర సినీ పరిశ్రమ 75 ఏండ్ల తెలుగు సినిమా రజతోత్సవ వేడుకల్లో ఆయనకు కనీసం సన్మానం చేయలేదు. సిని పరిశ్రమలో వివక్ష దారుణంగా నెలకొని ఉంది. తెలంగాణ రాష్ట్రం ఈ వివక్షను గుర్తించి తెలంగాణ నిర్మాతలు, దర్శకులు, టెక్నీషియన్స్ దోపిడికి గురికాకుండా ఆత్మగౌరవంతో బతికే పనులు చెయొచ్చు.

1. తెలంగాణ నిర్మాతలు ఆర్థికంగా ఎదిగే పరిస్థితిని కల్పించాలి.
2. ఆంధ్ర సినీ పరిశ్రమ నుంచి తెలంగాణ సినీ పరిశ్రమను వేరుచేసి, ప్రత్యేకంగా ఎదిగేలా సబ్సిడీలు యివ్వాలి.
3. సినీ పరిశ్రమపై ఆంధ్ర పెట్టుబడిదారుల గుత్తాధిపత్యాన్ని ప్రశ్నించి అది లేకుండా చేయాలి.



4. వారసులతో సినిమాలు నిర్మించి, ప్రజల నెత్తిన రుద్దే దుష్ట సంస్కృతికి చరమగీతం పాడాలి.
5. తెలంగాణ ప్రాంత దర్శకుల సృజనాత్మకతను, వాస్తవికతను గుర్తించి ప్రోత్సహించాలి.
6. తెలంగాణ ప్రాంత సినిమా రచయితలకు, కవులకు సరైన గౌరవం కల్పించడమే గాక, రాసిన వారి పేరు వెండితెర మీద ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలి.
7. మేధో దోపిడిని, శ్రమ దోపిడిని పూర్తిగా అరికట్టాలి.
8. థియేటర్స్ కొద్దిమంది బడాబాబుల చేతుల్లో ఉండడాన్ని నియంత్రించి, ప్రభుత్వమే వాటిని తమ చేతుల్లోకి తీసుకోవాలి.
9. చిన్న సినిమాలకు వినోదపు పన్ను మినహాయించి, సబ్సిడీలిచ్చి, చిన్న సినిమాలు బతికేలా చేయాలి.
10. కొత్త తెలంగాణ రాష్ట్రంలో సినీపరిశ్రమ తెలంగాణ ప్రాంతపు సృజనాత్మక సినీ దర్శకుల, నిర్మాతల చేతుల్లో ఉండేలా అనేక చర్యలు తీసుకోవాలి.

అప్పుడు తప్ప తెలుగు సినీ పరిశ్రమకు పట్టిన ఈ చీడ వదలదు. ఎన్నో సృజనాత్మక కథలతో, వాస్తవిక జీవన సంఘటనలతో సినిమాలు నిర్మించే పరిస్థితులు కల్పించాలి.

ఇంగ్లీషులో వచ్చిన గాంధి సినిమాను కూడా బ్రిటీష్ వారే అద్భుతంగా తీసారు. భారతీయులు గాంధి సినిమాను నిర్మించలేక పోయారు. అటెన్‌బరో దర్శకత్వ ప్రతిభ, గాంధీగా నటించిన బెన్‌కింగ్ స్లే అద్భుత నటన, ఇండియన్ సినిమాను షాక్‌కు గురిచేసాయి. తెలుగులో ఇలా నిర్మించడం ఏనాటికి సాధ్యం?

దక్షిణాఫ్రికాను బ్రిటీష్‌వారు పరిపాలిస్తున్నప్పుడు, తమ వ్యాపార సౌలభ్యం కోసం దక్షిణాఫ్రికాలోని దట్టమైన అడవుల గుండా రైల్వేలైన్‌లు వేసారు. అందుకు శ్రామికులుగా దక్షిణాఫ్రికా నీగ్రోలను, ఇండియన్స్‌ను వాడుకున్నారు. ఇంజనీర్స్, ఆఫీసర్స్ మాత్రం బ్రిటీష్‌వారు. దక్షిణాఫ్రికా దట్టమైన అడవుల్లో ఉండే సింహాలు, రైల్వేలైనులో పనిచేస్తున్న శ్రామికులను, బ్రిటీష్ వారిని గాయపరిచి, చంపి తీసుకెళ్తుంటాయి. ఈ సింహాల బెడదకు ఏమాత్రం బెదరకుండా బ్రిటీష్ ప్రభుత్వం, సింహాల వేటకు ప్రత్యేక వేటగాళ్ళను నియమించి, రైల్వేలైను పనిని కొన సాగిస్తుంది. ఈ చారిత్రక సత్యాలను అత్యద్భుతంగా ఆవిష్కరిస్తూ, ఈ కథాంశంలో ఇంగ్లీషులో 'ఘోస్ట్ అండ్ ద డార్క్‌నెస్" అనే సినిమా వచ్చింది. ఇందులో మైకెల్ డగ్లస్ వేటగాడుగా, బ్రాడ్‌పిట్ ఇంజనీర్‌గా అద్భుతంగా నటించారు. సినిమా చూస్తున్నంతసేపు-దక్షిణాఫ్రికా అడవుల్లోని సింహాల స్వైర విహారాన్ని సహజంగా ఫీలవుతాం. అది చాలా సహజంగా వుంది. హీరో మైకెల్ డగ్లస్ సినిమా మధ్యలోనే సింహాల బారినపడి చనిపోవడాన్ని చాలా సహజంగా చిత్రీకరించారు. ఇలాంటి సినిమాలను ఇండియన్ వెండి తెరపై, తెలుగు సినీ వెండితెరపై ఇంత సహజంగా చూడగలమా?

ఇదే సినిమాను చిరంజీవి హీరోగా మృగరాజు పేరుతో తెలుగులో తీస్తే, ఏ మాత్రం సహజంగా లేక అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఇండియా అడవుల్లో పులులు చాలా పెద్ద సంతతిగా జీవిస్తాయి గాని, సింహాలు జీవిస్తాయా? సింహాల బెడద ఇండియాలో బ్రిటీష్‌వారు ఎదుర్కొన్నారా? కనీస అవగాహన లేకుండా బలుపు, అహంకారంతో ఆంధ్రావాళ్లు నిర్మించే ఈ చెత్త సినిమాలు జనాదరణ ఎలా పొందుతాయి?

నా అవగాహన మేరకు సినిమాను సీరియస్‌గా అధ్యయనం చేయని దర్శకులు, నిర్మాతలు, రచయితలు, టెక్నీషియన్స్ కారణంగా 'తెలుగు సినిమా' బాగా దిగజారింది. కొత్త రాష్ట్రంలో సినీ పరిశ్రమ ఈ చీడను వదిలించుకొని కొత్తగా వికసించాలి. అభివృద్ధి చెందాలి.

**"నూరుపూలు వికసించాలి**
**వేయి ఆలోచనలు సంఘర్షించాలి"**
**ఏదైనా జీవితపు లోలోతుల్లోంచి రావాలి**
**అగ్ని జల్లినా, అమృతం కురిసినా-**

అందం, అనందం దాని పరమావధి కావాలి. ఆరోజు కోసం తెలంగాణ సినీ పరిశ్రమవైపు, ప్రభుత్వం వైపు మనం ఆశగా ఎదురు చూడాలి.

రేఖామాత్రంగానైనా-తెలుగు సినీ పరిశ్రమ ఎలా దిగజారిందో, ఎలా మూససినిమాల ధోరణిలో కూరుకు పోయిందో ఈ వ్యాసంలో రాయడానికి ప్రయత్నించాను. ఈ ఊబిలోంచి సినీ పరిశ్రమ బయట పడాల్సి వుంది.

మరో సందర్భంలో సినీ రంగంపై నా వివిధ అభి ప్రాయాలను పాఠకులతో పంచుకుంటాను. సృజనాత్మక సినిమాను కొత్త తెలంగాణ రాష్ట్రం బతికించుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ❖



నలమాస కృష్ణ
ప్రధాన కార్యదర్శి,
తెలంగాణ ప్రజాఫ్రంట్

# విలువల పునాదిగా భవిష్యత్ ఉద్యమ నిర్మాణం

*గతాన్ని సమీక్షించుకోకుండా చరిత్ర నుండి భవిష్యత్‌కు అవసరమైన పాఠాలు నేర్చుకోకుండా ఏ ఉద్యమం లక్ష్యాన్ని చేరుకోలేదు. తెలంగాణ ఉద్యమం గురించి మనం చాలా గొప్పగా చెప్పుకుంటున్నాము. నిజానికి గొప్పగా చెప్పుకోవాల్సి నంతటి విషయాలు, ఘట్టాలు ఎన్నో ఉన్నాయి. అయితే ఆ ధోరణి వాస్తవ స్థితికి మించిపోయి రష్యా, చైనా విప్లవాలకన్నా కూడా ఇది గొప్పదనే స్థితికి చేరుకుంది. పోలిక అవసరమే కానీ పోటీ పెట్టి ప్రపంచ ఉద్యమాల్లో ఇది చాలా గొప్పదనే ధోరణి, అవగాహన క్రమంగా ఉద్యమాలను నాశనం వైపు తీసుకెళ్తాయి. ఉద్యమాలను శత్రువు నాశనం చేయడానికి భౌతిక పునాది అక్కడే తయారౌతుంది. మన గొప్పతనం తప్ప చెడు ధోరణులు, తప్పుడు అవగాహనను సరిదిద్దుకునే విమర్శనాత్మక దృక్పథం కొరవడితే రానురానూ విమర్శనాత్మకంగా విషయాలను చూడడం, నిర్మాణాత్మక సూచనలు చేయడం నేరంగానో, అనవసరంగానో భావించబడుతుంది.*

ఈ స్థితిని తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో స్పష్టంగా చూసాము. 'మనం చాలా గొప్ప పోరాటం చేస్తున్నాము' 'తెలంగాణ వారంతా ఒక్కటే' 'తెలంగాణలో కులం, మతం, లింగం, ప్రాంతం ప్రక్కనపెట్టి ఒక్కటిగా పోరాడాలి' 'మన తెలంగాణ నాయకత్వాన్ని మనం విమర్శిస్తే ఆంధ్రోనికి లోకువైతాము' ఈ ఆలోచనా ధోరణులు ఉద్యమంలోని తప్పుడు ధోరణులను, తిరోగమన ఆలోచనలను విమర్శకు గురి కాకుండా అడ్డుకున్నాయి. తెలంగాణ ప్రాంత దోపిడీ వర్గానికి ఈ అవగాహన అత్యంత ఆవశ్యకమైనదిగా ఏర్పడింది. అందుకే ఈ భావనను బాగా పెంచి పోషించారు.

తెలంగాణ రాష్ట్రం ఎందుకోసం? ఎవరికోసం? ఉద్యమంలో ఉన్న దోపిడీ పాలక వర్గాలు ఉద్యమాన్ని ఎంతవరకూ నడిపించగలరనే ప్రశ్నలను, ఆలోచనలను బలంగా తలెత్తకుండా తెలంగాణ రాష్ట్ర సమితి మేధో అనుచరగణం కొంత విజయ వంతంగా పనిచేయగలిగింది. ఈ పని తెలంగాణ ఉద్యమానికి చాలా మేలు చేసిందని భావించే భావ దారిద్ర్యం ముందుచూపు లేకుండా (విజన్) చేసింది.

విజన్ లేని నాయకత్వంలో నడిచే ఉద్యమం సహజంగానే విజన్ లేకుండానే నడుస్తుంది. ఐతే బూర్జువా వర్గాలకు విజన్ లేదా? అనే ప్రశ్న రావచ్చు. వారికి చాలా స్పష్టమైన విజన్ ఉంది. కేవలం ఆంధ్రా ఆధిపత్య, దోపిడీ శక్తుల స్థానాన్ని తామెలా ఆక్రమించుకోగలం, అందుకు ఈ ఉద్యమం ఎలా ఉపయోగ పడగలదనేది వారి విజన్.

ఇలా ఉద్యమం ముసుగేసుకున్న దోపిడీ శక్తులు వారి దోపిడీ వర్గ స్వరూపాన్ని దాచి వారికి అనుగుణమైన, వారి అవసరాలు తీరే పద్ధతుల్లో నాయకత్వ నిర్మాణాలు చేశాయి. వివిధ జాక్‌ల నాయకులను (విద్యార్థి, రాజకీయ, ఉద్యోగ జాక్‌లు...) మొదలైన వాటినన్నింటినీ టిఆర్ఎస్ అనుబంధంగా మార్చుకుంది. కేవలం రాజకీయంగా ఉండే సంబంధం కాకుండా టిఆర్ఎస్ సిద్ధాంత భావజాలానికి వాటిని లోనుచేసింది. ప్రయత్న పూర్వకంగా ఉద్యమ విలువలను దిగజార్చింది. సమష్టి స్థానంలోకి వ్యక్తులను తీసుకొచ్చింది. ప్రజల పాత్రను గుర్తించ నిరాకరించింది. తెలంగాణ సంస్కృతి పేరుతో సామ్రాజ్యవాద బ్రాహ్మణ, భూస్వామ్య సంస్కృతిని చొప్పించింది.

ఎటువంటి ప్రజా పోరాటంలో లేనివారూ అకస్మాత్తుగా తిరుగులేని ప్రజా నాయకులుగా గుర్తించబడ్డారు. మీడియా, పత్రికలు వాటికి అవసరమైన తీరులో న్యూస్ ప్రమోట్ చేసుకోవాల్సిన పరిస్థితుల్లో ఒక లుంపెన్ సెక్షన్ కూడా తెలంగాణ నాయకత్వంగా గుర్తింపు పొందింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో సుదీర్ఘ కాలంగా నిబద్ధతతో ప్రజల పక్షాన పోరాడుతున్న శక్తులను దోపిడీ వర్గాలు అన్ని రంగాల్లో అడ్డుకో చూశాయి. వారి పాత్రను నిరాకరించడం, పరిమితులకు గురిచేయడం చేశాయి. విప్లవకారులుగా, ప్రగతిశీలురుగా గుర్తింపు ఉన్న వారికి, కాస్త నిర్మాణ బలం ఉన్నవారికి సైతం దోపిడీ వర్గ విశాల వేదికల చట్రంలో భాగం అయినారు. వీరు 'తెలంగాణ కోసమే, లేదా తెలంగాణ పునర్నిర్మాణం కోసమే' మేం వారితో కలుస్తున్నాం అని చెప్పుకుంటూ కాలం వెళ్ళదీస్తున్నారు. పోరాటంలో పోరాటం గురించి చెప్పుకుంటూ దిగజారుడు పనులు, ఉద్యమ కార్యక్రమాలకు ముందస్తుగా పోలీసులతో ఒప్పందాలు చేసుకోవడం, పోరాటంలో పాల్గొన్నవారిని గాలికొదిలి మధ్యలో నాయకత్వం చేతులెత్తేయడం ఇలా ఎన్నో ధోరణులను తెలంగాణ ఉద్యమం చూసింది.

తెలంగాణ ఉద్యమంలోని వివిధ కోణాలను లోతుగా ఇక్కడ విశ్లేషించలేము. కానీ ఈనాడు తెలంగాణ పునర్నిర్మాణం గురించి చర్చ జరుగుతున్న సందర్భంలో ఉద్యమంలో ముందుకు వచ్చిన ఒకానొక చెడు ధోరణి అయిన నాయకత్వ 'విలువల పతనం'పై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. తెలంగాణ జాక్‌లతో, సంఘాలతో, సాంస్కృతిక ఉద్యమంతో ఎదిగివచ్చిన నాయకత్వాన్ని దిగజార్చడానికి కావాల్సిన పరిస్థితిని దోపిడీ వర్గాలు తయారు చేశాయి. ఇలా దిగజారిపోయిన శ్రేణి ప్రజలకు ఇప్పుడు

కావాల్సిన నాయకత్వాన్ని అందించలేదనేది స్పష్టం. అయితే సమస్య ఏమిటంటే ఇలా దిగజారిపోయిన శ్రేణి నెలకొల్పిన అభివృద్ధి నిరోధక విలువలపైన పోరాటం సాగించాల్సిన అవసరం ఏర్పడింది. వాస్తవంగా ఇది పోరాటంలో ఒక దశ దాటిన తరువాత సమీక్షించుకుని చేయాల్సిన పోరాటం కాదు. ఏ దిగజారుడు, దళారీ ప్రజా వ్యతిరేక పనైనా చేసుకోవాలంటే జై తెలంగాణ అనకుండా సాధ్యం కాదనే తిరోగమన విలువల సంహారాన్ని నెలకొల్పిన ఉద్యమం ఇప్పుడు మరో దశలోకి ప్రవేశించింది. కనుక సమీక్ష, పాఠాలు అవసరం.

సమాజంలో నెలకొని ఉన్న వివిధ రకాల దోపిడీ, అణచివేత, పీడన, అవినీతి, వ్యక్తిగత విలువలు మొదలైన ఇతర సామాజిక అభివృద్ధికి ఆటంకంగా ఉన్న విషయాలను రూపుమాపే క్రమంగా అనివార్యంగా కొన్ని విలువలను ప్రాతిపదికగా చేసుకొంటే తప్ప సమాజం ముందుకు సాగదు. అలా ప్రాతిపదిక చేసుకున్న విలువలు స్థల, కాలాల్లో మార్పులుండడం సహజం. కానీ ప్రతీ ఉద్యమం తప్పనిసరిగా కొన్ని సార్వత్రిక విలువలను నెలకొల్పుతుంది. ఆ విలువల వెలుగులో ఉద్యమం ముందుకు సాగుతుంది. వ్యక్తులస్వార్థం, నైతిక పతనం, సామాజిక అభివృద్ధికి/ఉద్యమనిర్మాణానికి, పోరాటానికి ఆటంకం అనుకుంటే గతంలో ఆ వ్యక్తిని ఎంతటి చరిత్ర ఉన్నా అనివార్యంగా ఆ నాయకుని స్థితి ఉద్యమానికి గుదిబండగా తయారుకాక తప్పదు. వ్యక్తుల యిష్టాయిష్టాలతో సంబంధం లేకుండా విలువలు కోల్పోయిన వ్యక్తులను వదిలించుకోక తప్పదు.

రాజకీయ పార్టీలు సంస్కృతి, విలువలను విమర్శించే క్రమంలో ప్రత్యామ్నాయ ఉద్యమంలో తెలంగాణ నాయకత్వం ప్రజలపై ఎటువంటి విలువల ద్వారా ప్రభావితం చేసిందో గమనిస్తున్నాం. నాలుగు కోట్లమంది ప్రజలను విముక్తి చేస్తామని గంభీర ఉపన్యాసాలు ఇచ్చే నాయకులు రాజకీయ నాయకులకు సాష్టాంగ నమస్కారం చేయడం, లాఠీలు, తుటాలకైనా ఎదురు నిలబడుతామని చెప్పేవారు పోలీసులతో రాజీపడడం, పెద్ద పెద్ద బొట్లు పెట్టుకుని బ్రాహ్మణ సంస్కృతిని నేరుస్తూ నవాబులను పొగడడం ఇలా ఎన్నో రకాలైన తిరోగమన విలువలకు నైతిక ఆధికృతను తెలంగాణ ఉద్యమం కల్పించింది. పోరాడే గుణంతోపాటు అనేక విషయాలు ఉద్యమం నేర్పింది. అయినంత మాత్రానే చేరుకోవాల్సిన లక్ష్యానికి గుదిబండగా ఉన్న తిరోగమన విలువలు పాలక వర్గ విలువలపై విమర్శ పెట్టకపోతే అవి సుస్థిరం అవుతాయి.

రాజకీయ, సామాజిక, సాంస్కృతిక , నైతిక విలువల సంహారాన్ని విలువలు అని మనం సంభోదిస్తున్నాం. తెలంగాణ ఉద్యమంలో విలువలను విడివిడిగా చూడడం అనే ఒక తప్పుడు ధోరణి తలెత్తింది. సరిగ్గా ఈ ధోరణి కొన్ని నిర్ణీత చట్రాల్లో నెలకొల్పబడ్డ విలువల సూత్రీకరణకు పూర్తి వ్యతిరేకంగా వచ్చింది. విశాలమైన ఉద్యమంలో అనేక రకాల మనుషులు, శక్తులు ఉంటాయి. కనుక అందరినీ కలుపుకుని పోవడానికి కావాల్సిన సాధారణ విషయాల పునాదిగానే వేదికలు రూపొందుతాయి. ఆ వేదికల ద్వారా సమాజానికి ఒక పరిధిలో కొంత చైతన్యాన్ని ఇవ్వగలుగుతుంది. అది కార్యచరణ క్రమంలో కొన్ని కనీస విలువలు కూడా ముందుకు తెస్తుంది. ఆ కనీస విలువల సంస్కృతి కూడా నెలకొల్పకుండా పాలకవర్గ సంస్కృతి, ఆధిపత్యం నిలబెట్టుకుంటె విశాల వేదికకు అర్థమేముంటుంది?

విద్యార్థి నాయకులలో కొందరు అవినీతిపరులు తయారైనారు. పదవుల కోసం తాము తిట్టి తూర్పారపట్టిన అగ్రకుల పార్టీ, అధినాయకులకు సిగ్గు లేకుండా సాష్టాంగ నమస్కారం చేశారు. రాజకీయ జాక్‌లో తిరిగి కాంగ్రెస్, తెలుగుదేశం, టిఆర్ఎస్ పార్టీలలో చేరి పదవులు పొందినవారు, భంగపడ్డవారు ఎవరైనా కావచ్చు. తెలంగాణ ఉద్యమానికి మేము నాయకులమని ముందుకొచ్చిన వారు తమ కార్యాచరణ ద్వారా తమ ప్రయాణం ద్వారా ఇవ్వదలచుకున్న సంకేతం అది వ్యక్తీకరించే విలువలు ఏమిటి? ఈ విలువల రాహిత్యాన్ని పెంచడం ద్వారా తెలంగాణ ప్రాంతీయ ఆధిపత్య శక్తులు చాకచక్యంగా ఎంతో కష్టమైన తమ పనిని సులభతరం చేసుకోగలిగాయి. ఉదాహరణకు అవినీతిని, వ్యక్తి పూజనే తీసుకోండి. లంచగొండితనం, వ్యక్తి కేంద్రంగా సంస్థల నిర్వహణ దోపిడీ వర్గ పార్టీల్లోని కొన్ని ప్రధానమైనవి. వివిధ జాక్‌లలో, సంఘాల్లో, లేదా ప్రఖ్యాతిగాంచిన ఉస్మానియా యూనివర్సిటీ జాక్‌లలో నాయకులు స్థూలంగా చెప్పాలంటె ఉద్యమాల పేరుతో చందాలు, దందాలు చేసుకుంటున్నారనే పేరు వచ్చింది. (ఇది పూర్తిగా కొట్టివేయదగ్గ ఆరోపణ కాదు). కొంతమంది ఉద్యమం పేరుతో బ్రతకాలనుకున్న పరాన్న భుక్కులు మనమెందుకు సంపాదించుకోగూడదని ఆలోచించారు.

అవినీతి అలవాటు పడ్డ ఈ సెక్షన్ మొత్తం సంపాదన ఎంత? తెలంగాణ పేరుతో పెద్ద పెద్ద అవినీతి తిమింగలాలు, రామోజీ లాంటి వారితో ఒప్పందాలు చేసుకున్న ఆ ద్రోహపూరిత అవినీతి ముందు ఈ చోటా నాయకుల అవినీతి, చందాల దందా బహుశా ఒక్క శాతం కూడా కాకపోవచ్చు. కానీ దోపిడీ వర్గం సహజ లక్షణమైన అవినీతి అనే దిగజారుడు విలువను సార్వత్రికం చేసే క్రమంలో 'అందరూ అవినీతిపరులే' ఉద్యమానికి డబ్బు అవసరం లేదా? వాళ్ళు సంపాదించు కుంటున్నారు కదా! మేం సంపాదిస్తే తప్పేంటి' అనే తిరోగమన విలువను అభివృద్ధి చేశారు. ఈ విలువ సహజంగానే జగన్‌మోహన్ రెడ్డి బయ్యారం గనుల అవినీతిని గానీ, కెసిఆర్, లక్ష్మీరాజంల పోలవరం డీల్‌ను గానీ, కరీంనగర్ గుట్టల అవినీతిని గానీ దేన్నీ ప్రశ్నించనివ్వదు.

'సిద్ధాంత, రాద్ధాంతాల్లేని తెలంగాణ కావాలి. ఆర్ఎస్ఎస్ నుండి ఆర్ఎస్‌యుల వరకూ అందరూ ఒక్కటై పోరాడాలి' అనేది జయశంకర్ తెలంగాణ సాధన కోసం విశాల వేదిక ఏర్పాటు కోసం చేసిన సూత్రీకరణ. దీని ఉద్దేశం న్యాయమైంది. దానికి స్థల, కాల పరిస్థితులుంటాయి. ఒకే వేదికలో కలిసి పనిచేస్తున్న క్రమంలో పరస్పరం విమర్శించుకోవడం, విభేదించుకోవడం సరైనది కాదనే అభిప్రాయం రాజకీయ విలువగా ముందుకు వచ్చింది. తద్భిన్నంగా అన్వయిస్తే ఫలితాలు నష్టం కలిగిస్తాయి. అంటే దోపిడీ వర్గాలకు చక్కగా ఉపయోగపడగలవన్నమాట. పాలకవర్గాలు, ఆధిపత్య శక్తులు తమ ప్రత్యక్ష-పరోక్ష భాగస్వామ్యంతోటి వివిధ రూపాలలో ఏర్పాటుచేసే

ఐక్య సంఘటనల ద్వారా నెలకొల్పే రాజకీయ విలువలు తిరిగి వారికే ఉపయోగపడగలవు. ఆధిపత్య శక్తులు తమ దీర్ఘకాలిక ప్రయోజనంరీత్యా తటస్థంగా వ్యవహరించినట్లు, ప్రజాపక్షం వహించి మాట్లాడుతున్నట్లు కనిపిస్తున్న తీరును చూసి అనేక మధ్య తరగతి సెక్షన్‌లు పాలకవర్గం వైపు ఆకర్షితులు కావటం కూడా తెలంగాణ ఉద్యమంలో స్పష్టంగా కనిపిస్తుంది. దోపిడీ శక్తులు ప్రతిష్ఠించిన విశాల ఐక్య సంఘటన (జాక్) అనే నిర్మాణం ద్వారా ఏర్పరచిన రాజకీయ విలువ తమను నియంత్రిస్తుందని, తమ కార్యక్రమాలకు ఆటంకం అవుతుందని తమ భావజాలాలను పరాయీకరణకు గురి చేస్తుందని గుర్తించలేనంతగా పాలకవర్గ దోపిడీ భావజాలం జాక్‌లపై, భాగస్వామ్య పక్షాలపై ముఖ్యంగా వాటి నాయకత్వాలపై ప్రభావితం చేయడం స్పష్టంగా గమనించవచ్చు. దోపిడీ వర్గం అది సృష్టించిన రాజకీయ విలువ తనకనుగుణంగా ఏవిధంగా మలచుకోగలదో, సమర్థించుకోగలదో ఇటీవల తెలంగాణ ఉద్యమ చరిత్రలో గమనించవచ్చు.

తెలంగాణ కోసం ఎవరినైనా కలువచ్చనే సూత్రీకరణ 2009లో టిఆర్ఎస్ టిడిపి పొత్తుకు దారితీసింది. నిజామాబాద్ ఉప ఎన్నికల్లో ముస్లిం సంస్థలు బిజెపి అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణకు మద్దతుగా ప్రచారానికి వెళ్ళడానికి దారితీసింది. తెలంగాణను కాంగ్రెస్ ఇవ్వకుంటే బిజెపిని బలపర్చాలనే దాకా వెళ్ళింది. దీనిని నాలుగు కోట్లమంది ప్రజలకు పైకి కనిపించే ప్రయోజనం కోసమని నమ్ముదాము. మరి పాలమూర్ ఉప ఎన్నికల్లో ఇబ్రహీం గెలుపుకు అదే ప్రాతిపదిక కారణం ఎందుకు కాలేదు? 'జై గణేషా జై తెలంగాణ' అని 2010లో గణేష్ ఉత్సవాల సందర్భాన్ని ఉద్యమంగా మలచాలని రాజకీయ జాక్‌లోని అగ్రవర్గాలకు బుద్ధి పుట్టింది. అయినా ఎంపిజె లాంటి ముస్లిం సంస్థలు రాజకీయ జాక్‌లో ఉన్నాయి. మరి చార్మినార్ పక్కన భాగ్యలక్ష్మీ దేవాలయం సృష్టించబడి, విస్తరించబడి వివాదాస్పదమైన సందర్భంలో జాక్‌లోని భాగస్వామ్య పక్షం అయిన భారతీయ జనతా పార్టీని మిగతా పక్షాలుగానీ, పార్టీలుగానీ ఎందుకు ప్రశ్నించ సాధ్యం కాలేదు? అవకాశవాద కలయికలు, పదవులకోసం ఏర్పడ్డ వేదికలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఏర్పడ్డ జాక్‌లు ఏవైనా వాటి పునాది అనేది ఆధిపత్య స్వభావాన్ని కలిగి ఉంది, అసమానతను ప్రోత్సహించేదిగా ఉంది. సాధారణంగా విడి విడిగా ప్రజా సంఘాలుగా, పౌర సంఘాలుగా ఆయా సందర్భాలలో వేదికలుగా ఏర్పడి నిర్దిష్ట సమస్యల పరిష్కారం కోసం చేసే ప్రజాస్వామిక పోరాటాలకు గ్రాండ్ అలయెన్స్‌లు అడ్డుకట్ట వేశాయి. ఆ వేదికల ద్వారా తమ ఆధిక్యతను కాపాడుకున్నాయి. దోపిడీ, వర్గ రాజకీయాలను సుస్థిరం చేసుకో జూస్తున్న పాలకవర్గాల నూతన రూపాలను, వాటి సారాన్ని పసిగట్టలేకపోయిన వారు అదేదో గొప్ప చారిత్రాత్మక ప్రయోగం అయినట్లు ఒక నూతన విలువను సృష్టించిన వేదికగా కొందరు మేధావులు కీర్తిస్తున్నారు. ఇది సరైనది కాదు.

దోపిడీ వర్గాల కుళ్ళును, కుటిల నీతి, బ్రాహ్మణీయ భావజాలాన్ని, అవినీతిని కడిగివేయకుండా మనమందరం తెలంగాణ ఉద్యమంలో ఉన్నాము. ఒకే వేదిక ద్వారా పని చేస్తున్నాం. విమర్శించుకోగూడదు. బలహీన పడుతాం, విడిపోతే దెబ్బతింటాం....ఇలాంటి తాత్విక భోధనల మూలంగా ఎటువంటి విలువలు ప్రతిష్ఠించబడ్డాయో చూసినాము.

కొండా సురేఖ, బాజిరెడ్డి గోవర్ధన్ లాంటి నాయకులు సైతం ఇప్పుడు తెలంగాణ పోరాట యోధులుగా చిత్రీకరించబడ్డారు. దీనికి కారణం దిగజారిన రాజకీయ విలువలని టిఆర్ఎస్ గురించి చెప్పడం కంటే విమర్శనాత్మకంగా లేని కుహనా తెలంగాణవాదుల ధోరణి అంటే సరిగ్గా ఉంటుంది. విచిత్రంగా 2014 అసెంబ్లీ ఫలితాల తర్వాత కెసిఆర్ ఎత్తుగడల్లో భాగంగానే కొండా సురేఖ చేరికను అర్థం చేసుకోవాలని మాట్లాడుతున్న వారూ ఉన్నారు. ఇంద్రారెడ్డి, దేవేందర్‌గౌడ్ లాంటివారు తెలంగాణ ఉద్యమాన్ని ఉపయోగించు కోవాలని చూస్తే తెలంగాణసమాజం వారిని అనుమానించింది. ప్రతిఘటించింది. కెసిఆర్ రూపంలో భిన్నంగా కనిపించాడు. కానీ ఇంత ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ధైర్యంగా తీసుకోగలిగే నైతిక ధైర్యం టిఆర్ఎస్‌కు ఎక్కడి నుండి వచ్చింది? బిజెపి పాలమూర్‌లో ఓటు వేయని వారు పాకిస్తాన్ వైపు ఉన్నట్లేనని రెచ్చగొట్టడానికి నైతిక స్థైర్యం ఇచ్చిందెవరు?

ఎటువంటి సిద్ధాంత భూమిక లేకుండా పోరాటం చేద్దామని ఆహ్వానించడం అవసరాన్ని బట్టి వేదికలేర్పాటు చేయడం దోపిడీవర్గ సిద్ధాంతంలో ఒక భాగం అని ఆలోచించలేనంతగా కూరుకుపోవడం పాలకవర్గాలకు చక్కని అవకాశం. ప్రజలకు నష్టం.

విలువలు ప్రబోధించేవారంతా వాటిని పాటించకపోవచ్చు. లేదా కొన్ని పాటిస్తూ ఉండవచ్చు. కానీ ఆ విలువలు ఆదర్శం కావు అనేది గుర్తించాలి. మానవ సమాజం ముందున్న లక్ష్యాలు. విలువల అవసరం విలువలు పతనం అయిన తర్వాత గుర్తించడం ఒక నష్టం, పతనం అయిన తర్వాత కూడా గుర్తించకపోతే సమాజాన్ని తిరోగమనం వైపు నడిపిస్తుంది. నాయకత్వ విలువలను ఉద్యమ కార్యాచరణ నుండి విడదీసి చూడాలనుకోవటం సరైనది కాదు. ఇన్ని రూపాల్లో దిగజారిపోయిన విలువలను డబ్బుతో ఉద్యమాలను నిర్మించొచ్చు అనే ధోరణులను తెలంగాణ ఉద్యమం అధిగమించాలి.

తెలంగాణ ఉద్యమం ద్వారా మనం నేర్చుకోవాల్సిన విషయాల్లో విలువల గురించి చెప్పుకోవాలంటే చెప్పుకోగలిగే కొన్ని విషయాలు మాత్రమే ఇక్కడ చర్చించ సాధ్యమవుతుంది. మరో కోణంలో ఉద్యమం నెలకొల్పిన పాజిటివ్ విలువలు, ప్రజల ఆకాంక్షలను, హక్కులను సాధించుకోవాలంటే విశాలమైన ఆలోచనలకు ప్రతి కార్యకర్త పదునుపెట్టాలి. తెలంగాణ ప్రజలకిచ్చిన పోరాడే చైతన్యాన్ని నాయకత్వం అందుకోవాలి. ప్రజలకు సేవ చేయాలనే నిబద్ధత ఎంతటి బలహీనతనైనా అధిగమింపజేయగలదు. ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమంలో భాగం చేయగలదు. ఆ దిశలో ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో విస్తృత ప్రజా బాహుళ్యానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శక్తులు, వ్యక్తులు అందరూ సమష్టిగా కృషి చేయాలని ఆశిద్దాం. ❖


# తెలంగాణ ప్రభుత్వం హక్కుల పరిరక్షణకు హామీపడాలి

ప్రొ॥ గడ్డం లక్ష్మణ్
(ప్రొఫెసర్
ఉస్మానియా యూనివర్సిటి)

*చరిత్ర విచిత్ర మలుపులు తిరుగుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రంలో చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం ఏర్పడ్డాయి. మోడీ మత విద్వేష రాజకీయ పునాదుల మీద నిర్మించబడిన మతోన్మాద శక్తులకు ఒకవైపు, ప్రజలను, దేశాన్ని నిలువు దోపిడిచేసి కోట్లకు పడగలెత్తిన పెట్టుబడిదారి వర్గానికి మరో వైపు ప్రతినిధి. మతంలో పొంచివున్న దానవత్వాన్ని, పెట్టుబడి రాజ్యహింసా స్వభావాన్ని కలబోసుకొని వస్తున్న మోడిని ఎదుర్కోవడానికి దేశ ప్రజలపై మరింత భారంపడింది.*

నక్సలైట్ల ఎజెండాయే నా ఎజెండా అని చెప్పుకొని అధికారంలోకి వస్తున్న కెసిఆర్ ఆ ఎజెండా నుండి వైదొలగి ఎంత విరుద్ధంగా అడుగులు కదుపుతున్నాడో ఎండగట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై మరింత పెరిగింది.

దేశంలో, రాష్ట్రంలో ఈ పరిణామం ఒక గంభీరమైన వాతావరణంలో ఏర్పడుతోంది. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు 60 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం చేసి అజేయులయ్యారు. నూతన ఆకాంక్షల సాధన కోసం, ప్రజాస్వామిక విలువల కోసం, దోపిడి, పీడన, అణచివేత, వివక్ష, నిర్బంధం, హింస, విద్వేషం లేని స్వేచ్ఛాయుత రాజకీయ వాతావరణంలో జీవించాలని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఈ జీవనయాన పరివర్తన కోసం ఎంతో మంది విద్యార్థి యువత ప్రాణత్యాగాలు చేసింది. 1969 తెలంగాణ ఉద్యమంలో 369 మంది విద్యార్థులు జలగం వెంగళరావు ప్రభుత్వ తూటాలకు నేలకొరిగారు. మలిదశ ఉద్యమంలో దాదాపు మరో 1500 మందిని పొట్టనపెట్టుకుంది రాజ్యం. మరెన్నో రూపాల్లో రాజ్యహింసకు బలైన తెలంగాణ జనం గాయాలు ఇంకా మానలేదు. తెలంగాణ పోరాటంలో పాల్గొన్న విద్యార్థి యువతపై వందలాది కేసులు నమోదు అయివున్నాయి. ఒకవైపు విద్యాసంవత్సరం కోల్పోయి, విద్యనభ్యసించే అవకాశానికి దూరమై కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. నూతన ప్రభుత్వం విద్యార్థులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేసి ఉద్యమకారులుగా గుర్తించాలి. తెలంగాణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను తగువిధంగా ఆదుకోవాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ కోసం పోరాడిన యువకులపై లాఠీలతో విచక్షణారహితంగా చితకబాదిన పోలీసులపైన రబ్బరు బుల్లెట్లు, బాష్పవాయువు గోళాలు ప్రయోగించిన బలగాలపైన కఠినచర్యలు తీసుకుంటే కేసుల ఎత్తివేతకు పూర్తి అర్థం ఉంటుంది. ఉస్మానియా యూనివర్సిటీలో కరెంటు తీసివేసి, మెస్సులు బంద్ పెట్టి మహిళా విద్యార్థులపై అమానుషంగా, దురుసుగా ప్రవర్తించిన పోలీసు ఆఫీసరు వివెస్ఆర్ ఆంజనేయులుపై కఠినచర్యలు తీసుకుంటే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని అతిగా ప్రవర్తించే పోలీసులకు నూతన రాష్ట్రంలో హెచ్చరికగా వుంటుంది. నూతన తెలంగాణ ప్రభుత్వం పోలీసులను అదుపు చేయగల్గడమనే పెద్ద సవాలు చట్టబద్ధ పాలనకు ప్రతీక. చంద్రశేఖర్‌రావు శాంతి భద్రతల నియంత్రణ బాధ్యతలను హోంమినిస్టరు నుంచి లాక్కొనకుండా వుండగల్గితే పోలీసులపై ఆధార పడకుండా పరిపాలన కొనసాగిస్తున్నా డనడానికి కొలమానం అవుతుంది.



స్వతంత్ర భారతావని అవతరించినపుడు 16 రాష్ట్రాలతో ఏర్పడిన దేశం కాలక్రమంలో మరో 12 రాష్ట్రాలు కూడా ఏర్పాటయ్యాయి. ఏ సందర్భంలో కూడా తెలంగాణలో జరిగినంతటి ప్రాణనష్టం హింస చోటు చేసుకోలేదు. మరోవైపు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో


దోపిడి, పీడనలేని కార్మిక, కర్షక రాజ్యం కోసం శ్రీకాకుళ ప్రభావంతో తెలంగాణ సాయుధ పోరాటంలో ఎన్నో ప్రాణత్యాగాలు ఎన్నో నిర్బంధాలు, హింసను ఎదుర్కొని గాయపడి వుంది తెలంగాణ. రేపటి తెలంగాణలో ఈ హింస, నిర్బంధం, అణచివేత, అత్యాచారాలు, హత్యలు లేని స్వేచ్ఛాయుత ప్రజాస్వామిక వాతావరణం నెలకొనాలని యావత్ తెలంగాణ ఆకాంక్షిస్తున్నది. మనిషిని మనిషిగా గౌరవించే, ఆత్మగౌరవం పరిఢవిల్లే సామాజిక తెలంగాణ నవనిర్మాణం కోసం ఎదురు చూస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినంత సులువుగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడలేదు. తెలంగాణ రాష్ట్ర అవతరణ గొప్ప పోరాట నేపథ్యం, ప్రాణత్యాగాల నేపథ్యంలో అవతరించనున్నది. ఇప్పటికే ఈ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయాలు బలంగా వేళ్లూనుకున్నాయి. చైతన్యవంతులైన ప్రజలున్నారు. అయితే గత చరిత్రలో పాలకవర్గ పార్టీలు ప్రజా రాజకీయ చైతన్యాన్ని ఎన్నడూ సహించిన దాఖలాలు లేవు. పైగా చైతన్యవంతమైన ప్రత్యామ్నాయ రాజకీయ ఆకాంక్షను, నిర్మాణాన్ని ప్రమాదంగా భావించి అణచివేయజూసినవి. అవసరమైతే ఈ నేపథ్యాన్ని ఒక్కొక్క సందర్భంలో తమ రాజకీయ ప్రయోజనం కోసం ఉపయోగించుకున్నవి. నూతన తెలంగాణలో ప్రజలు ఇలాంటి మోసపూరిత రాజకీయ ప్రయోగాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి.

1983లో ఎన్టీరామారావు అధికారంలోకి రావడానికి 'నక్సలైట్లే దేశభక్తుల'న్నాడు. తీరా అధికారం చేజిక్కించుకున్నాక 'గ్రేహౌండ్స్' అనే వేటకుక్కల జాతి పేరుతో ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేసి నక్సలైటు రాజకీయాలను అణచి వేయజూసాడు. కుట్రలు, కుతంత్రాలు చేసి, మామనే వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు రాజ్యాంగేతర శక్తులను బ్లాక్‌టైగర్స్, గ్రీన్‌టైగర్స్, కోబ్రాల పేరుతో ఏర్పాటుచేసి ఎంతోమంది ప్రజాసంఘాల నాయకులను హతమార్చాడు. మొత్తం ప్రజా ఉద్యమాలను రక్తపుటేరుల్లో ముంచి పెనుసవాలుగా మిగిలాడు. మళ్లీ ఇపుడు నూతన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యాడు. హింసాత్మక ముఖ్యమంత్రి నిజస్వరూపం ఎలా వుండబోతుందోనని సీమాంధ్ర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేలాది మంది రాజకీయ కార్యకర్తలను ఎన్‌కౌంటర్ పేరుతో చంపేసాడు. ఏ యిజం పనికిరాదు టూరిజం తప్ప అన్నాడు. కంప్యూటర్ల యుగంలో సామాజిక శాస్త్రాల అధ్యయనం పనికిరాదన్నాడు. వ్యవసాయం దండుగ అన్నాడు. అంధులు, అంగన్‌వాడి టీచర్ల ఆందోళనలను గుర్రాలతో తొక్కించాడు. నేను ముఖ్యమంత్రిని కాను సి.ఇ.వో.(ముఖ్య కార్యనిర్వాహణాధికారి) నన్నాడు. దృక్పథం మార్చుకోవడానికి ప్రజలిచ్చిన పదేళ్లలో ప్రజాస్వామిక దృక్పథం ఏర్పడిందా అని సీమాంధ్ర ప్రజలు అడుగుతున్నారు.

పాలకులు ప్రజాస్వామ్య లక్షణాలు సంతరించుకుంటే, చట్టబద్ధ పాలన కొనసాగిస్తే పౌర, ప్రజాస్వామిక హక్కులు పరిరక్షించబడతాయి. రాష్ట్రంలో మావోయిస్టు పార్టీతో చర్చలు జరుపుతానని మావోయిస్టులను తమ కార్యాలయానికి పిలిపించి పార్టీ నిర్మాణ మూలాలు తెలుసుకొని కోవర్టు ఆపరేషన్ల ద్వారా పార్టీని మట్టుబెట్టాలని చూశాడు మరో ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి. ముఖ్యమంత్రులందరు ప్రజలను మోసం చేసినవారే. కనుకనే ప్రజల చేతుల్లో మారుతూ వుంటారు.

రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ రాజకీయాలను నిషేధిస్తూనే వచ్చాయి. అప్పటి పీపుల్స్‌వార్ పార్టీని జనార్దన్‌రెడ్డి ప్రభుత్వంతో మొదలుపెట్టి నేటి మావోయిస్టు పార్టీ వరకు నిషేధించాయి. విప్లవ విద్యార్థి సంఘాలను, యువజన, కార్మిక, రైతాంగ, మహిళా సంఘాలను నిషేధించారు. గతంలో విరసంను ఇప్పుడు విప్లవ ప్రజాస్వామిక ఫ్రంట్(ఆర్‌డిఎఫ్) అనే ప్రజాసంఘాన్ని కూడా మన రాష్ట్రంలో నిషేధించారు. ఏ రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చినా ఈ నిషేధాల పరంపర కొనసాగుతూనే వుంది. 1989లో హైదరాబాద్‌ను కర్ఫ్యూ కోరల్లో బంధించినా ఏ ప్రభుత్వం ఇప్పటివరకూ దానికి స్వేచ్ఛను ప్రసాదించలేదు. ఈ నిర్బంధాలు, నిషేధాలు, హింసలు, అక్రమ అరెస్టులు, మిస్సింగులు, బాంబుల మోతలు, తుపాకుల గర్జనలు లేని శాంతియుత వాతావరణం నెలకొనాలని నూతన తెలంగాణ ఆకాంక్షిస్తున్నది.



మావోయిస్టు పార్టీని సామాజికార్థిక అంశంగానే పరిగణి స్తామన్న ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మధ్య భారత కొండల్లో దాగిన నిక్షేపాలను వెలికితీసి అమ్ముకోవడానికి బహుళజాతి సంస్థల అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాక "మావోయిస్టు పార్టీ భారత అంతర్గత భద్రతకు పెనుముప్పు" అని ప్రకటించాడు. ఈ అవకాశవాద భావజాలం పాలసీ విధానమై రాజకీయ స్వేచ్ఛను బలిగొంటున్నది. జీవించే హక్కును హరించి వేస్తుంది. మావోయిస్టు పార్టీతో

కేంద్రస్థాయిలో చర్చలు జరుపుతామని మావోయిస్టు పార్టీ నేత ఆజాద్‌ను పిలిపించిన చిదంబరం మోసపూరితంగా హత్య చేసి ఎన్‌కౌంటర్ అని ప్రకటించాడు. ఆయనతో పాటు జర్నలిస్టు హేమచంద్రను కూడా కాల్చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి పాలకులతో విసిగిపోయిన ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలను ఆశ్రయిస్తున్నారు.

ఇలాంటి నేపథ్యంలో పురుడు పోసుకుంటున్న తెలంగాణపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజల ఆకాంక్షలు నెరవేరి గౌరవ ప్రదమైన జీవితానికి నూతన ప్రభుత్వాలు పాటుపడ్తాయా అని మేధావులను కలవరపెడ్తున్న ప్రశ్నలు. తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం జరిగి రాజ్యాధికారంలో సరైన ప్రాతినిధ్యం వుండాలి. వర్షాధారంపై ఆధారపడి ఎదురుచూసే తెలంగాణ రైతాంగానికి సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి పొలాలను సస్యశ్యామలం చేసి ఆర్థిక ప్రగతికి దోహదం చేయాలి. ఆత్మహత్యలు లేని తెలంగాణ కావాలని రైతులు కోరుకుంటున్నారు. నెర్రెలు బారిన భూములను మళ్లీ తెలంగాణలో చూస్తే తెలంగాణ సాకారానికి అర్థం లేదంటున్నారు. వ్యవసాయం విఫలమై పంటలు పండక నెత్తిన తట్ట బెట్టుకొని కానరాని రాజ్యాలకు వలసలు పోయే పరిస్థితి పునరావృతం కాకూడదని కోరుకుంటున్నారు.

గడిచిన తెలంగాణలో దళితులు అంటరానితనం వివక్షకు, దాడులకు, సామూహిక హత్యాకాండకు బలౌతున్నారు. ఆదివాసులు అడవి నుంచి తరిమివేయబడుతున్నారు. ఎదురుతిరిగితే చంపేయబడుతున్నారు. కారంచేడు నుంచి లక్షింపేట దాకా జరిగిన మారణకాండల కాష్టం శాశ్వతంగా ఆరిపోవాలని కోరుకుంటున్నారు. దళితుల పరిరక్షణా చట్టాలను అమలుపరిచి విధించే శిక్షలు నూతన ప్రభుత్వం చిత్తశుద్ధికి కొలమానం. దేశంలో మహిళలందరూ పురుషాధిక్యతకు బలౌతున్నవారే. అత్యాచారాలు, అవమానాలు జరగని క్షణాలు లేవు. కేవలం అభయ, నిర్భయ చట్టాలు చేసి చేతులు దులుపుకోకుండా చిత్తశుద్ధితో మహిళా రక్షణకు నడుంకట్టాలి.

తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు చంద్రశేఖరరావు నూతన తెలంగాణ రాష్ట్రానికి దళిత ముఖ్యమంత్రిని చేస్తానన్న వాగ్దానం ఎన్టీరామారావు మాటల్లాగ గాలిలో కల్సిపోయినవి. ఇపుడు తనే ముఖ్యమంత్రి అయ్యాడు. ఆ రాజ్యాధికార స్వప్నాన్ని ఆశించిన దళితులు భంగపడ్డారు. ఈ మాట మొదటి నీటి బుడగ అయ్యింది. కాంట్రాక్టు లేబర్ అనే పదం లేకుండ అందరిని పర్మినెంటు చేస్తామన్నాడు. చిరుద్యోగులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో పౌర, ప్రజాస్వామిక హక్కులకు నేను గ్యారంటీ పడ్తానన్నాడు. పౌరహక్కుల సంఘంలో పనిచేస్తానన్నాడు. కాని గతంలో కేవలం పౌరహక్కులడిగి నందుకు గోపిరాజన్నను, జాపాలక్ష్మారెడ్డిని, డాక్టర్ రామనాథంను, నర్రా ప్రభాకర్‌రెడ్డిని, పురుషోత్తంను, ఆజంఅలీలను చంపింది కిరాతక ప్రభుత్వాలేనని గుర్తుందా? కనీసం హత్యలు చేసిన వాళ్లను ఇప్పటికైనా నూతన ప్రభుత్వం గుర్తించి చట్టపరంగా శిక్షిస్తానని మాటివ్వగలదా. ఇక నుంచైనా రాజ్యాంగేతర శక్తులను కూడగట్టనని, రాజ్యాంగేతర హత్యలు జరగవని నూతన ప్రభుత్వం హామీఇవ్వాలి. తెలంగాణలో ఎంతో మంది ప్రజాసంఘాల నాయకులు హత్యకు గురయ్యారు. డాక్టర్ ఆమెద నారాయణ, కనకాచారి, బెల్లిలలిత, మన్నెం ప్రసాదు, నల్లా వసంతు, ఐలన్నలను హత్యచేసింది రాజ్యం. గంటి ప్రసాదంను తుపాకులతో కాల్చి, కత్తులతో నరికి చంపారు. ప్రజాగాయకుడు గద్దర్‌పై కాల్పులు జరిపారు. వేలాది మంది విప్లవ రాజకీయ పార్టీల కార్యకర్తలను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపింది రాజ్యం. ఇది భారత రాజ్యాంగం ఆర్టికల్ 21లో హామీ ఇచ్చిన జీవించే హక్కుకు విరుద్ధం. రేపటి ప్రభుత్వం ఈ విషయంలో కచ్చితంగా రాజ్యాంగ బద్ధంగా నడుచుకుంటామని నమ్మకం కలిగించాలి. దాని కంటే ముందు ఈ హత్యలకు బాధ్యులైన వారిని పట్టుకొని న్యాయస్థానం ముందు నిలబెట్టాలి.

నూతన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మావోయిస్టు పార్టీపైన, ప్రజాసంఘాలపైన, విప్లవ ప్రజాస్వామిక ఫ్రంట్ పైన విధించిన నిషేధాన్ని తొలగిస్తూ ఉద్దేశించిన ఫైలుపై తొలి సంతకం చేస్తే అది రాజ్యాంగ స్ఫూర్తికి, చట్టబద్ధ పాలనకు గీటురాయి అవుతుంది. అప్పుడు మాత్రమే తెలంగాణ ప్రజలకు ఈ రాష్ట్రంలో బూటకపు ఎన్‌కౌంటర్లుండవని, శవాలను పోరాడి సాధించుకోవాల్సిన ఆగత్యం ఏర్పడదని, మిస్సింగులుండవని నమ్మకం కల్గుతుంది. ఆర్టికల్ 19 ప్రకారం అందరికి వాక్ సభాస్వాతంత్ర్యాలున్నాయని, అభిప్రాయాలు ప్రకటించే స్వేచ్ఛ ఉందని, స్వతంత్ర రాజకీయ విశ్వాసాలు కలిగి వుండే హక్కు ఉందని గుర్తించి గౌరవించాలి.

(అయితే ఉద్యమకారులు నేరాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోవాలని ఎవరూ కోరుకోరు. చట్టం ప్రకారం అరికట్టే చర్యలు తీసుకోవాలి.) ఉద్యమకారులు హింసామార్గాన్ని ఎంచుకున్నంత మాత్రాన మొత్తం ఉద్యమాన్ని నేరంగా పరిగణించవద్దు. ఎన్ని వేల మందిని చంపినా ఎక్కడా ఉద్యమాన్ని పూర్తిగా అణచివేసిన దాఖలాలు లేవు. అందుకు కారణమైన భౌతిక పరిస్థితులను పరిష్కరించాలి. దారిద్ర్యాన్ని, ఆకలి చావులు లేకుండా చూడాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి. ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని విధానాన్ని రద్దుచేయాలి. అందరికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఆకాశాన్నంటుతున్న ధరలు తగ్గించాలి. మైనార్టీ వర్గాల రక్షణకు కట్టుబడి ఉండాలి.

ఫ్లోరైడ్ లేని, యురేనియం తవ్వకం లేని నల్గొండను, వలసలు, కరువుల్లేని పాలమూరును, కవ్వాల టైగర్ ప్రాజెక్టు, హైడల్ ప్రాజెక్టు లేని ఆదిలాబాదును, పోలవరం ప్రాజెక్టు లేని ఖమ్మంను, ఓపెన్‌కాస్ట్ బొగ్గు విధానం, గుట్టల తరలింపు లేని కరీంనగర్‌ను, బీడి కార్మికుల శ్రమదోపిడి లేని నిజామాబాదును, రసాయన పరిశ్రమలతో కాలుష్యం కాని రంగారెడ్డి, మెదక్, హైదరాబాదు కావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారు. ఆంక్షలు లేని తెలంగాణ కాంక్షిస్తున్నారు.

ప్రజల ఆకాంక్షలు పట్టని ప్రభుత్వాలు మట్టికరిచాయని పాలకులు గుర్తుంచుకోవాలి. ❖

# తెలంగాణలో ఆరోగ్యం - ప్రాథమిక హక్కుగా ఉండాలి

డా॥ రామకృష్ణ
ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు

*'ఆరోగ్యం' అంటే కేవలం వ్యాధులు, అవిటితనం లేకపోవడం కాదు. అది సంపూర్ణమైన భౌతిక, మానసిక, సాంఘిక ప్రశాంతత అని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం. సంపూర్ణ ఆరోగ్యం ప్రపంచ ప్రజల ప్రాథమిక హక్కు కాబట్టి **"2000** సంవత్సరం అందరికీ ఆరోగ్యం" సాధించాలని **1978**లో ఆల్మాఆటిలో ప్రపంచ దేశాలన్నీ కల్సి ఒక డిక్లరేషన్ చేశాయి. ఈ తీర్మానంపై మన భారతదేశం కూడా సంతకం చేసింది. ఇప్పుడు **2014** పేద ప్రజలందరికీ ఆరోగ్యం అందని ద్రాక్షగానే ఉన్న సమయంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. రాష్ట్ర ఏర్పాటుతో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఒకపార్టీ, కేంద్రంలో సుస్థిర ప్రభుత్వంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని మరొకపార్టీ, మా కుటుంబం అధికారంలోకి వస్తేనే దేశం బాగుపడుతుందని ఇంకో పార్టీ ఎన్నికల్లో ప్రచారాలు చేసుకొని కొన్ని గెలిచి, కొన్ని ఓడిపోయాయి. ఇక వార్తా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, కుహనా మేధావులు ఏ పార్టీకి ఎంత మెజారిటీ వస్తుంది, ఏ నాయకుని ప్రభావం ఎంత అని మసాలా సినిమా లాగా ఊదరగొడుతూ ప్రచారం చేసాయి. ఎవ్వరూ కూడా ప్రజల ఆరోగ్యంపై తమ తమ మ్యానిఫెస్టోలో గాని, ప్రచారంలో గాని ప్రముఖంగా పేర్కొనలేదు. వార్తా పత్రికలు, మీడియాకైతే ఆ స్పృహ అసలు లేదు. తెలంగాణ రాష్ట్ర సాధనతో ప్రజలందరికీ ఆరోగ్యం ఎలా సాధ్యమో అధికార శ్రేణులు వివరంగా చెప్పలేదు. చెప్పడానికి అవగాహన ఉంటేగా, ఉన్నా ధనిక వర్గాల్లో ఉన్న ఆరోగ్యాన్ని పేద ప్రజలకు ఎలా అందిస్తారు?*

ఉమ్మడి రాష్ట్రంలోకి రాకముందు(1956కు ముందు) హైదరాబాద్ ప్రజారోగ్య వ్యవస్థ బాగా పనిచేస్తుండేది అని చెప్పడానికి చాలా ఆనవాళ్లు ఉన్నవి. వాటిలో కొన్ని మలేరియా పరాన్నజీవిని దోమ పేగులో కనుగొన్నది సికింద్రాబాద్‌లో, ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా అనస్థీషియా (మత్తుమందు) ఇచ్చే విధానాన్ని కనుగొన్నది ఉస్మానియా హాస్పిటల్లో. ఇలా ప్రతి వ్యాధికి ఒక జనరల్ హాస్పిటల్(ముక్కు, చెవి, గొంతు, కన్ను. జ్వరం, మానసిక వ్యాధులు, ఛాతీ, టిబి., మలేరియా) ఇవన్నీ ధనికులకు, పేదలకు సమానంగా ఉండేవి. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడ్డాక వరంగల్ మెడికల్ కాలేజీ, మొన్న ఆదిలాబాద్‌లో నిన్న నిజామాబాద్‌లో మెడికల్ కాలేజీలు వచ్చాయి.



ఇంతకు మించి ప్రభుత్వ ఆధ్వర్యంలో పెద్దగా మార్పులేదు. కాని 1980వ దశకంలో అనూహ్యంగా హైదరాబాద్‌లో కార్పొరేట్ వ్యవస్థ వేళ్లూనుకుంది. 1990వ దశకంలో ప్రపంచబ్యాంకు ప్రోద్బలంతో ప్రభుత్వ ఆరోగ్య సంస్థలన్నీ ప్రైవేట్‌పరం కావడానికి పునాదులు ఏర్పడ్డవి. 2010 సంవత్సరం తర్వాత ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ నిధులతో ఆరోగ్య వ్యవస్థను శాసించడం మొదలుపెట్టాయి. ఆ విషపుత్రికలే ఆరోగ్యశ్రీ, 108, 104, ఆరోగ్య భద్రత, రీఎంబర్స్‌మెంట్ తదితర సంస్థలు. మరి వీటన్నింటిని ప్రక్షాళన చేయకుండా, ప్రపంచబ్యాంకును కాదని వచ్చే ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా ఆరోగ్యాన్ని అందించ గలుగుతుందో ఏర్పడబోయే ప్రభుత్వాలు వివరించాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతం ఆదివాసీ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలలోని పేదలు అంటువ్యాధులు, ఆహారలేమితో వచ్చే వ్యాధులు, టిబి, మలేరియా, మాతా శిశు మరణాలతో సతమతం అవుతున్నారు. కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ, నీడ లేక జనం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. కార్మికుల వేతనాలు పెరగడం లేదు. ఆహార లభ్యత లేదు. బడ్జెట్‌లో ఆరోగ్యానికి ఒక్క శాతం కంటే తక్కువ కేటాయిస్తున్నారు(ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం కనీసం 50% కేటాయించాలి.) ప్రతి 1000 మందికి ఒక పడక అందుబాటులో ఉండాలి కానీ 10 వేల మందికి ఒక పడక అందుబాటులో ఉంది. తాగునీరు, పారిశుద్యం, పౌష్టికాహారానికి కేవలం 3 శాతం నిధులు కేటాయిస్తున్నారు. (బోర్ కమిటి ప్రకారం 15% కేటాయించాలి.)



ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత ఆరోగ్య కేంద్రాల్లో సమతుల్యత లోపించింది(అంటే పిహెచ్‌సి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి ఆసుపత్రులు) వైద్య విద్యలో కేవలం 95% నిధులు మెడికల్ కళాశాలలకు కేటాయించి పారా మెడికల్ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ రకంగా మానవ అభివృద్ధి సూచికలో మనం 10వ స్థానానికంటే కింద ఉన్నాం.

ఇలాంటి తరుణంలో తెలంగాణలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సంస్కరణలు చేపట్టాలి. ప్రపంచ బ్యాంకు అశాస్త్రీయ ప్రతిపాదనలను పక్కకు పెట్టాలి. ప్రైవేటు ఆరోగ్య వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. ఇది ప్రభుత్వంతోనే సాధ్యం. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి. ఆరోగ్యశ్రీ, 108, 104, ఆరోగ్య భద్రత, రీ ఎంబర్స్‌మెంట్, సిజిహెచ్ఎస్ లాంటి స్కీములను ఎత్తివేయాలి. గవర్నర్, మంత్రుల నుంచి సాధారణ పౌరుని వరకు ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం పొందే విధంగా చర్యలు తీసుకోవాలి. మందులు ప్రభుత్వమే తయారుచేసి అందరికి ఉచితంగా ఇవ్వాలి. ప్రైవేటు మెడికల్ కళాశాలను నిషేధించి వాటిని స్వాధీన పరుచుకొని ప్రభుత్వమే వాటి నిర్వహణ చేయాలి. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల, ఒక డెంటల్ కళాశాల, పది పారామెడికల్ కళాశాలలు ప్రభుత్వమే ఏర్పరచాలి. ఆదివాసీ, గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేక ఆరోగ్య ప్రణాళిక ఏర్పరచాలి. అందరికీ తాగునీరు, పారిశుద్యం, పౌష్టికాహారం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. అప్పుడే అందరికి ఆరోగ్యం సాధ్యమవుతుంది. ప్రస్తుత చట్టసభల్లో అపోలో యజమాని, మల్లారెడ్డి మెడికల్ కళాశాల యజమాని, తెలంగాణ రాష్ట్రంలో 75% ఆరోగ్య సంస్థలు ప్రైవేటు రంగంలో ఉన్న పరిస్థితుల్లో అందరికి ఆరోగ్యం సాధ్యమేనా! ప్రజా పోరాటాలు ప్రజల ప్రభుత్వం ఉంటే తప్పకుండా సాధ్యమవు తుంది. లేకపోతే మరొక్క పోరాటానికి సిద్ధంగా ఉండాల్సిందే. ❖



# గొర్లు

గీతాంజలి

*నేను పోనంటే పోను. ఇక్కడ్నే ఉంటా నీతోని లేబర్ పనికస్త కానీ చచ్చినా అడవికి పోను. నా కాల్లు ఎట్ల కొచ్చగైనయి చూడు. అడవిల గుట్టలెక్కి నా కాళ్లు ఎట్ల పుండు పుండైనయో చూడు... కాల్లు ముంగట్కి చాప్త రాము చెప్తున్నడు.*

పద్మ కొడుకు తల్లెల ఇంకింత బువ్వేసి, "ముందుగాల తిను కొడుకా. అటెన్క సోంచాయిద్దాం తియ్యి" అంది.

నులక మంచం మీద పండుకున్న ఎంకటయ్య "గింత జిద్దు చేస్తున్నవేందిర. రూపాయలు అప్పుచేసిన ఇంకా మిత్తే కడతాన్న రెండేండ్లు మాట్లాడుకున్నది పురాగ చెయ్యక వస్తివంటే ఆసామి దశరథ్ ఊకుంటడా చెప్పు? రేపే ఆయన తానకు పోవల్ల. పోవల్సింది లేకపోతే సీదా మంగపేటకు పోవల్ల" అన్నడు కోపంతోని

"నాతోని కాదు నాయన, నేను పోను" అంటూ రాము బువ్వ తల్లెను పక్కకు నూకి పైకి లేసి గుడ్సె బయటకు పోయిండు. గుడ్సె పక్కపొంటి బండల మీద ఉన్న కుండల్లకెల్లి నీళ్లు తీసుకొని చెయ్యి కడుక్కున్నడు. అక్కడ్నే పక్క గుడ్సె ముంగట బీడీ తాగుతున్న శీను దగ్గర్కి పోయి కూసుండు.

"బువ్వ తిన్నవా లేదా ఏంది లొల్లి" అడిగిండు శీను.

"ఏంలే శీనూ. నాయిన మళ్లీ నన్ను గొర్లు మేప అడవికి పొమ్మంటాండు. నాతోని కాదని చెప్తున్న" రాము బీడీ అంటించుకుంటు చెప్పిండు.

"పా అసుంట సిటీల తిరిగొద్దాం" అని రాముని తీస్కుని అక్కడికెల్లి బయటపడ్డాడు శీను.

ఎంకటయ్యకు బువ్వ తినబుద్ధికాలే. పద్మ తినమని ఒర్లుతున్న ఇనకుంట గుడ్సె అవతలకచ్చి 'ఓ రంగయ్య పోదాం పా' అనుకుంట రంగయ్యను తీస్కుని కల్లుదుక్నం దారి పట్టిండు.

* * *

గుడిసె ముంగట అంత లొల్లి లొల్లిగుంది. గచ్చిబౌలిల టాటా బిల్డింగు పక్కన ఒక వెయ్యి గజాల జాగాల పాలమూరు లేబరు అడ్డా ఉంది. ఒక ముప్పై కుటుంబాలు పాలమూరుకెల్లి హైద్రాబాదు వలస వచ్చి ఇక్కడ ఉంటున్రు. మేస్త్రీ వాళ్లందర్ని గుంపుగ తీస్కచ్చి ఇక్కడ పెట్టిండు. మాదాపూర్ హైటెక్ సిటీల బిల్డింగులు కట్టే పనికి మట్టిపనికి తీస్కపోతడు.

గుడిసె బయట నులక మంచంపైన పన్నడు వెంకటయ్య. నిద్రస్తలేదు. దిమాక్ అంత పిసపిసగున్నది. గీ పిలగాడేంది గిట్ల కిరికిరి చేస్తున్నాడు? రేపు గా ఆసామి దశరథ్‌కు ఏం చెప్పాలి? నిన్ననే ఫోన్ చేసిండు. నీ కొడుకు నా గొర్లకు ఒదిలిపెట్టి ఏడికో దెంకపోయిండు. నా గొర్లు, పైసలు పోయినయంటే, మీ అయ్యా కొడుకులను వదల' అన్నడు. ఇంతట్ల రాము తన దగ్గర్ని రానే వచ్చే. వెంటనే దశరథ్‌కు ఫోన్ చేసి "ఒక్క దినం ఆగు వాణ్ణి తీస్కస్త" అని చెప్పిండు. వాడిపుడు మళ్లీ తన భూమి మీద పిశాచమోలె పడ్డదు. తన మూడెకురాల భూమి కబ్జా చెయ్యనీకి తయ్యారుగున్నడు. తను చేసిన అప్పు ఛుక్త చెయ్యకపోతె ఇంకొక్క యాడాది రాము గొర్లు మేపబోతే అప్పు తీర్తది. తన భూమి తనకు దక్కుతది. ఎట్ల బుదరకిచ్చుడు వాణ్ణి? పోనంటె పోనని జిద్దు చేస్తాండు. సయినె... గొర్లు మేపుడంటే మాటలు కాదు మల్ల. పిలగాడు సానా కష్టపడుతున్నడు ఎంకటయ్యకు దుఃఖమచ్చింది. తను పదిహేనేండ్ల సంది పాలమూరు ఒదిలిపెట్టి దేశాలు పట్టి, బుక్కెడు బువ్వ కోసానికి తన చెలక దక్కించుకోటానికి ఎంత కష్టపడ్డడో యాదికొస్తున్నది. చచ్చిపోయిన అమ్మ, బాపు, మూడెకరాల భూమి, తన పాలమూరు యాదికొస్తున్నయ్. తల్లి యాది తీరు కమ్ముకున్న కన్న ఊరు పాలమూరు దుఃఖమై ఊరుతున్నది ఎంకటయ్య కండ్లపొంటి.

తను ఐద్రాబాదు వచ్చి నాలుగేండ్లు ఐతున్నది. అంతకు ముంగట తను బాంబేల ఉన్నడు. బాంబేల పెద్ద పెద్ద అంతరాలు కట్టే పని చేసేది. బాంబే యాదికచ్చి ఎంకటయ్య ఎన్నుల భయం జరజరపాకింది.

పాలమూరుకెల్లి బాంబెకు బయలెల్లిన దినం ఇంకా యాదికున్నది. నాయన చావే తనను బాంబే దిక్కు తరిమింది. మూడెకురాల నల్లరేగడి భూమిల నాయన జొన్న ఇత్నాలు ఏసిండు. వర్షాధారం పంట. నిత్యం వానల కోసం ఎదురుచూసుడు. తమ ఊరికి జూరాల చానా దగ్గర కానీ నీల్లు లెవ్వు తమకు. ఆ యాడాది వర్షం పంటకు సరిపడ పడలేదు. వచ్చే కరెంటు, పోయె కరెంటు నాయన అప్పుచేసి బోరు వేసిండు. అది పాడయ్యింది. రిపేరు చేపిచ్చుడు, మళ్లీ పాడవుడు. పంట వెయ్యనీకి ఆసామి తాన అప్పు చేసిండు. నాయన సానా దిగుపెట్టుకుండు. చేసిన అప్పు ఛుక్త చెయ్యకపోతే తన భూమి కబ్జ చేస్తనన్నడు ఆసామి. సర్కారు రైతులకు కరెంటు కోత... ఆల్ల పానాల మీనకు వచ్చిపడ్డది. నాయన బుగులు చూసి ఊర్లె సాలాయన నాయనకు ఐడియ ఇచ్చిండు. రాతిరిపూట కరెంటు దొంగతనం చెయ్యమన్నడు. నాయన దిమాక్‌ల మంచిగ ఎక్కికూసుండి సాలాయన చెప్పింది. ఏం చేస్తడు? అమ్మ ఒద్దన్న గని ఇనలె. ఒగ రాత్రి చెలకకు

పొయ్యి కర్రని కరెంటు తీగల మీన కేసిండో లేదో షాకు కొట్టిందైతే అదే మల్ల లేవలేదు. సచ్చేపోయిండు.

నాయన సచ్చిపోయిండు. నాయన వేసిన పంచా ఎండిపొయ్యింది. తాము కుమ్మరోల్లమే గని, నాయన గొర్లు పెంచకపోయేది. ఎవసాయమే చేసేది. పేరుకి పదిగొర్లుండేవి ఇంట్ల.

అప్పిచ్చిన ఆసామి వెంట బడ్డడు భూమి రాసిమ్మంటడు. లేదా పైసలియ్యమంటడు.

రూపాయలు య్యాడికెల్లి తేవాల? నాయన చావుకంటే చేసిన అప్పే భయపెట్టింది. అమ్మ ఎంత బత్మిలాడినగని అప్పిచ్చిన ఆసామి ఇనకచ్చిండు అప్పటికే ఊల్లె మస్తుమంది దేశం పోతున్రు బతుకుదెరువుకు. దినాం ఊల్లెకి మనుషుల్ని తోల్కపోనీకి టిప్పర్లొచ్చెట్వి. దేశం పోయేందుకు తయారైన వాళ్లు గొర్రెలెక్క అన్ల ఎక్కెటోల్లు. అయినోల్లు అమ్మనాయినలు, పెండ్లం పిల్లలు బొల్లుబొల్లుమని ఏడుస్త సాగనంపేది. దేశం ఎల్లిపోయేటోల్లు గుడక కండ్లు తుడుసుకునేది. అందరు గుంపు మేస్త్రికాడ అడ్వాన్సులు తీస్కుని ఆయెనతోన పోయేటోల్లె.

ఆసామి ఆ దినం మల్ల లొల్లి పెట్టిండు. అమ్మను బూతులు మాట్లాడిండు. తను తెగబడి ఆసామి మీదకు కొట్టనీకి పోయిండు. అమ్మ గుంజుకొచ్చింది. తనకపుడు ఇరవై సంవత్సరాలుంటై. ఎవసాయం, గొర్లు మేపుడు గీ రెండు పన్లే వస్తయ్ తనకు. చదువుకోలేదు. ఏం చేసుడో సుమర్ఖుకాలె. ఉన్న నాలుగు గొర్లు అమ్మంగ వచ్చిన పైసలు నాయన కర్మకాండకే అయిపోయినయి. చేతుల పైసలేదు. భూమి వదలద్దు. భూమి కాపాడుకోవాలె. నాయన అందుకే గద కష్టపడ్డది. ఇంటి ముంగట గచ్చు మీద పండి ఏం చెయ్యల్నని సోంచాయిస్త ఉండిపొయ్యిండు.

తెల్లగ తెల్లారింది. అమ్మలేసి కశువూడుస్తున్నది. అయినా లెవ్వబుద్దికాలె. అమ్మ ముంగిట్ల నీళ్లు సల్లి, ముగ్గేస్తున్నది. కోళ్లు బొక బొక లాడ్తున్నయ్ అసుంట ఇసుంట తిరుగుకుంట.

"ఎంకా లెవ్వురా కొడకా పొద్దుపొడ్సింది లెవ్వురా" అన్నది అమ్మ. ఇంగ లేసిండు. పండ్లు తోమి... అమ్మ ఇప్పుడేవస్తనే అని ఒర్లి ఊర్లె ఉన్న మేస్త్రి రత్తయ్య తానకు పొయ్యిండు. తను గూడంగ దేశం వస్తనన్నడు. "ఈ వారం ఇంకో ఇరవై మందిని బొంబై తీసుకుతుపోతున్నాను. అప్పుడు నువ్వు కూడా వద్దువు" అన్నాడు మేస్త్రి. ఇంటికచ్చిండు ఎంకటయ్య. దిమాక్‌ల బరువు కొంచెం తగ్గిందన్పించింది. సేటు ఇరవై వెయిల రూపాయలు అడ్వాన్సు ఇస్తనన్నడు. పదినెలలు పనిచెయ్యాల్నంట. పదిహేను వేలు ఆసామికిస్తే తమ భూమి తమకుంటది. మిగత పదివెయిలు మళ్లంగియ్యచ్చు.

అమ్మ జొన్న రొట్టెల తల్లె తెచ్చి ఎంకటయ్య ముంగట పెట్టి 'తిను ఎంకా ఏడికి పోయినవు పొద్దుపొద్దుగాల' అన్నది.

మేస్త్రి తానకు పోయిన సంగతి చెప్పంగనే అమ్మ ఏడ్వబట్టింది. "ఒద్దుకొడుక. దేశం పట్టిపోకుర పోయినేడాది దేశం పోయిన బాలరాజు పీనుగై వచ్చిండు అని పెండ్లం, పిల్లలు అనాథలైన్రు. సిటీల ఇండ్లల్ల పనిమనుషులైన్రు...గా యాదగిరి ఐదేండ్ల కింద దేశం పోయిండూతే లాపతా అయ్యిండు ఆడు పనికి పోయిన దేశంల తీస, ఊల్లెకి గుడక రాలేదురా ఒద్దుర కొడుక. భూమి పోతే పాయె... నువ్వు నేను ఏమన్న చేస్తుని ఒక్కతానుండి బత్కుదాం తియ్యి... ఒద్దు నా మాటిను" అమ్మ ఏడుస్తూ బత్మిలాడుతున్నది. మూడెకురాల భూమి అంటే ఒట్టి మాట కాదు. అది ఒట్టి భూమి కాదు. నాయన రక్తం, చెమట, పానం ఉన్నయ్ అన్ల. నాయన ఊపిరి ఆ మట్టి మీన్నే పోయింది. నాయన భూమిని దక్కించుకోవాల్ల. ఆ భూమిల పంటలు పండించాల్ల. అమ్మ కండ్ల పొంటి ఎలుగు చూడాల్ల. అమ్మ ఒద్దుఒద్దని చెప్పి చెప్పి, ఏడ్సి ఏడ్సి ఊకుంది.

మేస్త్రి ఇచ్చిన ఇరవై వెయిలల్ల పదిహేను వెయిలు ఆసామికిచ్చిండు. మూడు వెయిలు అమ్మకిచ్చిండు. రెండు వెయిలు తనతోనె ఉంచుకుండు. ఆ ఊళ్లె తమకు బందుగులు లేరు. దూరంగున్న బందుగులకు చెప్పబుద్దికాలె. తడి కళ్లతోని పక్కింట్లుండె రంగమ్మకు అమ్మను అప్పచెప్పి మేస్త్రి ఫోను నంబరు అమ్మకిచ్చి, అమ్మ ఏడ్పులు వినుకుంట మనసుల ఏడుస్త దేశం పోయె టిప్పరెక్కిండు.

బొంబేల మేస్త్రి ముందు లేబర్ అడ్డకు తోల్కపోయిండు. అక్కడ వర్సగ గుడ్సెలున్నయ్. "ఈరోజు తినేసి రెస్టు తీస్కోండి. రేపట్నించి పనిలోకి వెళ్లాలి. పొద్దున్నే వస్తాను" అని చెప్పి మేస్త్రి వెళ్లిపోయిండు.

అంతకు ముంగట్నెల్లి అక్కడ పనిచేస్తున్న లేబరోల్లను చూస్తే భయమన్పించింది. అందరూ పాలమూరోల్లే ఉన్నారాడ. భూములుండి, పంటలు పండక కొందరు భూముల్లేక, ఊర్లె కూలి దొర్కక కొందరు, ఎవసాయం బందయ్‌నంక తమ దంద నడ్వక కుమ్మకోల్లు, కుర్మోల్లు చెప్పులుకుట్టే మాదిగోల్లు గిట్లా శానామంది దేశం వచ్చిన్రు. అందరు ఊర్లె అప్పులు చేసినోల్లే. అప్పులు ఛుక్త చేసుకోనీకి దేశం వచ్చినోల్లె. ఒక్కల్ల మొకంల ఆరోగ్గెం లేదు. అందరు బలహీనంగున్నరు. కొందరైతే పీనుగులెక్క ఉన్నరు. కొందరాడోల్లైతే గర్భాలతోని ఉన్నారు. పాలు తాగె పసిబిడ్డలతోని ఐదారేల్లకెల్లి పదిహేనేండ్ల పిల్లలు, ముసలోల్లు గూడావున్నరు. "ఎందుకొచ్చినవు? ఈడ ఏం మంచిగుందని ఛాకిరీ చెయ్యలేక సావల్ల" అన్నోలున్నరు. 'పనెట్లుంటది' అనడిగితే 'చూస్తవుగ తెల్లారినంక' అన్కుంట ఎకసెక్కా లాడినోల్లున్నరు.

ఎంకటయ్య బుగులు బుగులుగ గుడిసెల పన్నడు గని నిద్రస్తలేదు. తైదల పిండితోని జవ, చింతపండు పులుసు వంట మేస్త్రమ్మ ఇస్తే తినలేక తిన్నడు. అట్లనే మెల్లగ కన్నంటుకున్నది.

* * *

లెవ్వుండ్రి, లెవ్వుండ్రి అన్న అర్పులకు మెల్కచ్చింది ఎంకటయ్యకు. రాత్రి తనతోని ముచ్చట పెట్టిన నర్సయ్య "ఇగో గీ చా డికాషను తాగు ముంగట" అన్నడు నల్లగి నీల్లున్న కోపు తన ముంగట పెడ్త.

గిది పాలు పొయ్యని చాయ్. మనమే చేస్కోవల్ల. ఆల్లు చెయ్యరు చాపత్తి, చక్కెర ఇస్తరంతే అన్నడు నగుత. లేసి పండ్లు తోముకుని ఇట్ల కూసున్నడో లేదో మేస్త్రి వచ్చిండు. కొత్తగ వచ్చిన లేబరు గుంపుని వర్సగ నిలబెట్టి, పేర్లు రాస్కుని, వాళ్లు ఏ సైటుకు పోవాల్నో చెప్పి బయల్దేరదీసిండు. ఒక పెద్ద అంత్రం పక్కన ఖాళీ జాగాల పునాదులు వేసున్నాయ్. అక్కడ పనిచెయ్యాల. ఈ రోజు 8 గంటలకు వచ్చారు. కాని రేపట్నించి తెల్లవారి ఆరు గంటలకు ఇక్కడుండాలి. రేపట్నించి మిమ్మల్ని తీసుకరావడానికి ఎవరూ రారు. మీరే రావాలి. లేటుగా వస్తే బువ్వ కట్" అన్నాడు మేస్త్రి బెదిరిస్తున్నట్లు చేతులూపుత. ఇంక పనే పని. పుర్సత్ లేకుండ ఒకల్లతో ఒకల్లు మాట్లాడద్దు. ఒకటికి, రెంటికీ మేస్త్రి నడిగిపోవాల. పోయి జల్ది రావాల్ల. కొంచెం ఆలీశమైన పోయిన చోటుకు కఱ్ఱ చప్పుడు చేస్త వచ్చేస్తడు, ఆడోల్లైతే అట్ల వస్తడని భయం భయంగ ఒకల్ల నొకల్లు కాపు కాస్కుంట చేర్తరు. ఎంతసేపే లంజల్లారా. ఏం చేస్తున్నారే. ఇంత సేపు అంటడు బాడ్కవు మేస్త్రి.

తొమ్మిది గంటలకు కొంచెం నూకలబువ్వ సింతపండు పులుసు పెడ్తరు. పగటికి రెండు గంటలకు మల్ల గదే పెడ్తరు. రాత్రి ఏడెన్మిది దంక పని చేస్తనే ఉండల్ల. కాల్నొచ్చిన, చెయ్యినొచ్చిన కూచోనియ్యడు. ఆడోల్లనైతే పాలుతాగే బుడ్డ పోరలు ఏడుస్తున్నగని కనికరించడు "బాంచెన్ కాల్మొక్త మేస్త్రి బుడ్డ పోరి సచ్చిపోతది" అంటా బిడ్డ ఏడ్పుకి ఎదలల్ల పాలు పొంగి, రవిక మీద కెల్లి కార్తాంటే కన్నీల్లతోని గోలారితే అప్పుడు గని కనికరం ఉండది గా మేస్త్రికి. ఆలశ్యమైతే బిడ్డ పాల్తాగుతుంగానే రమ్మని కఱ్ఱ భూమి కెయ్యి కొడతా అరుస్తడు.

పనిచేసే కాడ దెబ్బలు తగలని తరస్ లేదు. పని చేస్తనే ఉండాల. మంచిప్పియ్యి మేస్త్రి మస్తు నొస్తాంది అంటే అప్పుడు తీస్కపోయి ఆ కర్సుగూడ జీతంల కోస్కుంటడు. పొద్దెక్కినంక ఆరుగంటలు కాంగనే పనిచేపిచ్చుకోవాలి గని మేస్త్రి ఎన్మిది దంక వదలడు. గుడిసెల కాడికి పోయేటాలకు తొమ్మిదైతది. అప్పుడు అన్నం గింత కూర పెడ్తారు. గిదేం తిండి పప్పు కూరలు ఇయ్యర అంటే ఆల్లంత బొల్లున నగివ్వు నర్సయ్య, లింగయ్య "మేస్త్రీ మస్తే అడిగినం గని గీతిండి మారది" అన్నరు. పదిహేను రోజులకోసారి శెలవు. ఆ ఇనం మాత్రం పప్పుచారు, మాంసం కూర పెడ్తరు. అంతే ఇంకో పదిహేను దినాలు ఆ బువ్వకోసానికై ఎదురుచూసుడు. కొత్తగొచ్చిన పడుచుపిల్ల వాంతులు చేస్కున్నది తైదల పిండి జావ, చింతపులుసు తినలేక. ఒక్కోసారి మేస్త్రి కల్లు తాగేది. తాగనోల్లకు కొన్ని పైసలిచ్చేది. ఆ పైసలతోని ఆడోల్లు టవునుకెల్లి ఉప్పు, కారం, ఉల్లిపాయలు, బియ్యం, బొట్టుబిల్లలు తెచ్చుకునేది. ఏమైన గని కనికరం లేని పనిగంటలు. పన్నెండు గంటల పని అలుపు సొలుపు లేకుంట బుడ్డపోరలు అమ్మనాయనలు పనిచేస్తాంటే అక్కడ మట్టిల, బురదల సిమెంటుల ఆగమానం తిరిగేది. తానం, పానం లేకుంట పెయ్యి మీద గజ్జి రోగాలతోని తిరిగేది ఆ బుడ్డపోరలు. జరమచ్చి చాతగాని జంగయ్య గుడిసె మీదకు వచ్చి ముడ్సుకుపన్న జంగయ్యను కఱ్ఱతోని కొట్టుకుంట పనికాడికి గుంజుకుపోయ్యిండు గా బాడ్కావు మేస్త్రి. అన్నిగంటలు పనిచెయ్య చాతగాక శీను పారిపోతే వాల్ల నాయన పెంటయ్యను చావగొట్టిండు. మేస్త్రి పెంటయ్యతోని డబుల్ పని చేపిస్తున్నడు. పని చాతగాక పెంటయ్య రాత్రి పూట గుడ్సె ముంగట అందర్కి సెప్పుకుంట బొలబొల ఏడుస్తాండు.

ఎంకటయ్య బేచేనైపోయిండు పని చెయ్యలేక పోతాండు. కట్టెల మెట్ల మీద సిమెంటు తోని పైకి కిందకి ఎక్కుడు దిగుడు చాతనైతలేదు. గని తప్పది. తీస్కున్న అడ్మాన్సు కర్సైపొయ్యింది. ఊల్లె ఆసామికింకో పదివెయిల బాకీ ఉన్నది. రోజులు గడుస్తాన్నై. అమ్మ ఖబర్ లేదు. ఒక్కత్తి ఎట్లున్నదో ఊల్ల ఎవరలకు ఫోను లేదు. ఆసామి తాన ఉంది గని అమ్మను పిలుస్తడో లేదో? పని... పని ఒక్కటే పని. నర్సయ్య తాగి ఒర్లుతాండు. నర్సయ్యకు పెండ్లాం, పిల్లలు లేరు. ముసలి అమ్మనాయనలున్నరు. నర్సయ్య భార్య పురుడు పోస్కుంట చనిపొయ్యింది. కడ్పుల బిడ్డతోని ఊర్ల డాక్టరు లేక, సర్కారు దావఖాన ఎప్పుడూ బందె. కాన్పుల డాక్టరమ్మ నెలకోసారి వచ్చి దస్తఖత్ చేసి పోతది. ఆమెకు సిటీల పెద్ద దావఖాన ఉన్నది స్వంతంది. సిటీ తీస్కపోయేటోల్లకల్ల నర్సయ్య భార్య దార్లనే సచ్చిపొయ్యింది. అప్పట్నెల్లి లగ్గం చేస్కోలె మల్ల. ఐదేండ్లు అయ్యింది గిట్లయ్యి. ఊల్లె అమ్మ నాయినలను ఇడ్సిపెట్టి తన రెండెకురాల భూమి దక్కించుకోనికి బొండే వచ్చిండు నర్సయ్య. పాలమూరుల కేశంపేట మండలం కాకునూరు నర్సయ్యది. నర్సయ్య పానం గూడ మంచిగుండదు. ఎప్పుడు సూడు నీర్సంగుంటండు. జరమస్తా పోతా వుంటది. గిదేద ఎయిడ్సని, జల్ది సచ్చిపోయె, రోగమచ్చిందంట నర్సయ్యకు. గుడ్సెలకు దూరంగున్న ఊల్లె ఆడోల్ల తానకు పొయ్యి రోగం తెచ్చుకుండంట నర్సయ్య. తను సచ్చిపోతే ఊల్లె అమ్మనాయనలనెవరు చూస్తరనుకుంట చానా బాదపడ్తుంటడు నర్సయ్య. సర్కారు దవాఖానలకెల్లి తెచ్చుకున్న మందులు తింటడు.

* * *

పదినెలల పని పూర్తికాక ముందె మల్ల అదే పని అక్కడ్నే బొంబైల చేయనీకి దబ్బెవలకు కావాలె అని అడిగిండు ఒకనాడు మేస్త్రి. చానమంది తీస్కున్నరు ఊరికెల్లి ఏం చేస్తం? ఊల్లె బువ్వ దొరకది ఇక్కడ నూకలన్న తింటాన్నం. ఇంగొక యాడాది చేస్కుని పోతమంటే అయిపాయె అప్పుతీర్తది ఊర్లె అనుకుంట. అప్పుతీరినంక మీకు ఊర్లె పని దొర్కుతదారా. అప్పు తీరినంక గూడ ఇట్లనే దేశం పోవుడు ఉంటది బిడ్డా. ఇది ఎంతకి తెగనియవ్వారం. పెళ్లుమని నగిండు పెంటయ్య. ఎంకటయ్య గూడ బాగా సోంచాయించిండు. ఊల్లె ఆసామికె ఇంకో పదివెయిలు అప్పు ఇయ్యాల. మిత్తి కడతాండు. అక్కడ ఉండాల్నని లేదు. అమ్మ యాదికస్తున్నది. ఒక్కసారి చూడాలన్పిస్తున్నది.

తొమ్మిదో నెల ఇంగో పది నెలల కాంట్రాక్టు పనికి ఎంకటయ్య చేతిల ఇరవై వెయిలు పెట్టిండు మేస్త్రి. పైసలు తీస్కోనైతే తీస్కుండు గని. అక్కడ అస్సలుండబుద్ది అయితలేదు. పాలమూరు పోయి అమ్మను చూసొస్త అని అడిగిన గని మేస్త్రి ఒప్పకోలె. ఎందుకో అమ్మనాయినలు కలల పడ్డరు. ఊరికిరా కొడుకా అని పిలుస్తాన్నరు. మేస్త్రి నడిగిపోవాల్ల ఎట్లైన మళ్లింకోపారి అడిగిండు "కుదరదు పో పోయి పనిచేస్కో అంత దూరం ఎవరు పంపిస్తారు" అన్నాడు మేస్త్రి. ఎంకటయ్య మనసు మనసుల లేకుంటయ్యింది. అమ్మ గురించే మనాది పడ్తున్నడు. ఆ దినం బువ్వ తినలె. ఆలోశెనలల్ల మునిగిపోత మూడో అంతరం కెల్లి దబ్బున్న కాలు జారిపడ్డడు. కింద ఇసుక మీద మోకాల్ల మింద పడ్డడ బత్కి పొయ్యిండు గని చెంప పగిలినట్లయ్యింది. కాలి వేల్లు చితికిపొయ్యి రక్తం కారినయ్. "కళ్ల కనపట్టం లేదారా" అని తిట్టుకుంట మందులిప్పించిండు మేస్త్రి. రెండు రోజులు పన్నాడు గని మూడో దినం మేస్త్రి దిగబడి పనిలకు దిగమన్నడు. "చేతనైత లేదు మేస్త్రి నడుము లిరిగినట్లయినయ్. ఇంగో రెండు దినాలైనంక పన్ల దిగుత. అంటే ఇనలె. "బాడ్కావ్ పని దొంగై పోయావురా నువ్వు" అనుకుంట కట్టెతోని ఒకటే కొట్టిండు. "రేపట్నల్ల వస్తడు మేస్త్రి గంతగనం కొట్టకు" అని జంగయ్య ఇడ్పించిండు. ఇగ అప్పుడచ్చింది ఎంకటయ్యకు ఆగనంత దుఃఖం. తను పుట్టినసంది ఇప్పటిదంక ఎవలు తన పెయ్యి మీద చెయ్యి ఎయ్యలె. చదువుకోలె బడిల పంతులు కొట్టలె. సోపతి గాల్లతోని దెబ్బలు పడలె. అమ్మ నాయన ఎన్నడు కొట్టలె. ఇగో గా దినం గింత పెరిగిన గింత పెరిగిన తనను గీ మేస్త్రి కొట్టిండు. కుక్కని కొట్టినట్లె కొట్టిండు. కాల్లతోని తన్నిండు చీ... తన బతుకెంత గబ్బైంది అన్కుంట ఎంకటయ్య శానాసేపు ఏడ్సిండు. ఇక్కడింక ఒక్క క్షణం ఉండద్దనుకుండు. అందరు పన్నంక నొప్పుల కోరుస్తనే పరిగెత్తి పరిగెత్తి అడుక్కుంట ఐద్రాబాదు బస్సెక్కిండు.

* * *

పాలమూర్ల బస్సు దిగిండు ఎంకటయ్య. అక్కడికెల్లి తన ఊరు ఉందెకోడు పయానమైండు. ఊర్లె కాలుమోపినంక మనసు నిమ్మలమైంది. ఊర్లె ఎక్కడగూడ ఇంత పచ్చదనం లేదు. అంత ఎండుకపోయింది. సగం ఊరుతాలాలె ఉన్నయ్ ఇండ్లకు. దేశం పోయిన మనుషుల ఇండ్లు అవి. ఎంకటయ్య కుర్మోల్ల వాడకట్టుకు రాంగనే ముంగిలి ఊడుస్తాన్న రంగమ్మ చీపిరికట్ట భూమి మీద పడేసి "ఓ.. వచ్చినవా కొడుకా అనుకుంట పెద్దగ ఏడ్వబట్టింది. తను ఎంకటయ్య దిక్కు ఉర్కుత వచ్చి, వచ్చినవా ఎంకా... అని ఇన్ని దినాలు రాలె. మీ అమ్మ పొయ్యింది అన్కుంట. ఆస్మాన్ దిక్కు చూపించింది అమ్మెటు పొయ్యింది తన ఇల్లు బీగం వేసి ఉంది. ఎంకటయ్యకు సమజు కాలె. ఇంతట్ల వాడకట్టు జనమంత పోగైరి. అందరు కండ్లుతుడ్సుకుంటురు. "ఏమైంది అవ్వ. మా అమ్మెటు పోయింది? వెంకటయ్య రంగమ్మకు గావరతోని అడిగిండు. "ఎటు పోతదిర కొడ్క, పాము కర్సిందిర ఎంకటయ్య మీ అమ్మకు.. తెల్లారినంక గూడంగ ఇంటి బయటకు రాకపోతే లోపట్కి పోయి చూసినర.. నోట్లె నురగలతోని పడి ఉందిర.. పాము ఇంట్లనే గా బస్తాల ఎనికనే దొర్కింది రా ఎంకటా" ఏడుస్తనే చెప్తాంది రంగమ్మ.

ఎంకటయ్య దబ్బున భూమి మింద కూలవడి పొయ్యిండు. "నాకెవలు ఎందుకు చెప్పలేదె అమ్మపోతె" అని అడుగుత నెత్తి మీన సేతులు వేస్కొని దబ్బ దబ్బ కొట్టుకుంట ఏడుస్తున్నడు ఎంకటయ్య.

"మస్తీ కోషిష్ చేసినం కొడక. ఒక దినమంత నీ కోసం పీనిగెను ఉంచినంర. వాసనచ్చింది. నువ్విచ్చిన మేస్త్రి నంబరు పదిసార్లయిన గని కల్వలేదు. కొడ్క ఏం చేద్దామని సోంచాయించి, వాసన ఎక్కువైతే ఇగ మన పక్కూర్ల మీ చిన్నమ్మకు చెప్తె మీ వాల్లు వచ్చి కర్మకాండ చేసిన్రురా... రంగమ్మ చెప్తనే ఉంది.

"ఒద్దురా ఎంకా... ఇద్దరం ఒక్క దగ్గర్నే ఉండి పనిచేస్కొని ఒత్కుదంరా. దేశం పోకురా" అమ్మ ఇంకా అన్నట్లే ఉంది.

ఎంకటయ్య దుఃఖంతోని తాయిమాయి అయ్యిండు. బాధతోని లుంగ చుట్టుకపోత ఎక్కెక్కి ఏడ్సిండు. భూమి నాయనను బలితీస్కుంది. ఇల్లు అమ్మను చంపింది. ఈ ఊల్లె తనెందుకింక? ఇంట్లకు పోబుద్ధి కాలె. ఇల్లా ఇది? పెద్ద పాముల పుట్ట తీరుంది. పాడుబడ్డ ఇల్లు జొన్న బస్తాల కింద, నడుమన ఇంటి మూలల రంధ్రాలల్ల, ఇంటి చూర్లల్ల ఎన్ని పాములు చూడలేదు నాయన, తను? మంచి ఇల్లు గిట్ల పాములు రాని ఇల్లు కట్టుకోవాల్నని నాయన ఎంతగనం కలగన్నడని? ఎలుకలు–కప్పలు–పాములు దూరె పాడుబడ్డ ఇండ్లు తమవి. బాగు చేస్కుందామంటే పైసలేడివి? బువ్వకే గతిలేదు. అమ్మేనా, ఊర్లె గరీబోల్ల ఇండ్లల్ల పొలంకాడ ఎంతమంది పాముకాట్లకు చచ్చిపోయిన్రు?

రంగమ్మె రాత్రి ఎంకటయ్యకు ధైర్నం చెప్పింది. అన్నం పెట్టింది. ఎంకటయ్య చేతిల వాళ్లమ్మ వెండి గొల్సులు పెట్టి మీ అమ్మవిరా అని ఏడ్సింది. అమ్మను ముట్టుకున్నట్లే అన్పించింది. అవ్వీట్ని పట్టుకుంటె మల్ల దుఃఖమచ్చింది. అమ్మను సూడాల అని ఉర్కులాడ్త వస్తే అమ్మ సచ్చిపాయె. ఏం చేసుడు? ఎట్ల బత్కుడు? అమ్మ లేకుంట ఎంకటయ్యకు తన బత్కుల చీకటి కమ్మినట్లు అయ్యింది. ఎక్కడసూదు అమ్మనే కన్పిస్తున్నది. ఒక వారం దినాలు చచ్చిన పీనుగాలె ఇంటి ముంగట పడి చేరిండు. ఊర్లె తెల్సినోల్లంత వచ్చి పలకరించిపోతున్రు. ధైర్యం చెప్తాన్నారు. తమ ఇంటికి నాలుగిళ్ల అవతలున్న యాదయ్య మొత్తం కుటుంబంతోని దేశం పోయిండంట. ఆల్ల ముసలి అమ్మ నాయనలున్నారు ఇంట్ల. రంగమ్మ పెద్ద కొడుకు గూడంగ దేశం పోయిండంట.

ఎంత బత్మిలాడింది అమ్మ దేశం పోవద్దని? తను దేశం పోకపోతే అమ్మ బతికెడిదా? తనుంటె పాము రాకపోయేదా? ఏమో ఇల్లు బాగు చేపిచ్చేటోడేమో? నాయన చానా సార్లన్నదు. ఇల్లు కట్టకపోయినా సరే గీ ఇంటికే మరమ్మత్తు చేస్కుని ఎలుకలు వాటిని తిననీకి పాములు రాకుంట చేస్కోవాలరా అని ఏమో? తనుంటే పాములు రాకుంట చూస్కునేటోడేమో?

ఊర్లె ఉండుడా? దేశం పోవుడా? ఎటూ తెలవకుండైంది ఎంకటయ్యకు. ఊర్లె మూడెకురాలు పండిద్దమంటే నీళ్లు లేవు. కరెంటూ ఉండది. మేపనీకి గొర్లు లేవు. చేతిల ఉన్న పైసలు ఆసామి చేతిల పెట్టి మల్ల దేశం పోవుడే. కని బొంబై మాత్రం పోడు. అక్కడికెల్లి మల్ల ఎంకటయ్య గుంపు మేస్త్రితోని గుజరాత్ దేశంలోని అహమదాబాదు బయల్దేరిండు. మేస్త్రి ఇచ్చిన డబ్బు బ్యాంకుల వేస్కుండు. అహ్మదాబాద్‌లో తొమ్మిది నెలలు బిల్డింగ్ పని. మట్టిపని చేసిండు. కొన్ని దినాలు పోదేసాద్ పని (బీడీలు కట్టేపని) చేసిండు. మల్ల పదినెలలు కాంట్రాక్టు పని చేస్కుంట అక్కడ్నే ఉంట. అక్కడ్నే పద్మను లగ్గం చేస్కుండు. పద్మ పాలమూరులోని నారాయణపేట మండలం కొల్లంపల్లి కెల్లి వచ్చిన మణెమ్మ-బాలయ్యల బిడ్డ. కుటుంబమంత వలస వచ్చిండు. వాండ్లే అడిగిన్రు. పద్మను లగ్గం చేస్కొమ్మని. పద్మ అన్ని రకాలుగా మంచిగన్పించింది. తనకు ఒక తోడు కావాలన్పించింది. చేస్కున్నాడు. అక్కడ్నే ఒక గుడిల మేస్త్రి లగ్గం చేపిచ్చిండు. అక్కడ్నే రాము పుట్టిండు పెరిగిండు. పదిహేను ఏండ్లు అహ్మదాబాదుల ఉన్నంక ఇంక ఎంకటయ్యకు ఇంటి మీ గాలి మల్లింది. మల్ల ఊరి యాది అమ్మ యాది సతాయించింది.

పద్మను కొడుకు రాముని తీస్కుని పాలమూరు ప్రయాణమైండు. సంపాయించిన దబ్బుతోని ముంగట తన ఇల్లు బాగు చేపించుకుండు. తాగే నీళ్లు లేకపోతే వాడకట్టంత ఇంటికి పదమూడొందలు వేస్కుని బోరేపిచ్చుకున్నరు.

అటెన్క వానా కాలమచ్చింది. ఆశపడ్డదు. చెలకల జొన్నలేసిండు. మొలకలైతే మంచిగొచ్చినై. ఎంకటయ్యకి ఆశ పెర్గింది. కానీ వానలే పడలె. బోరు పనిచెయ్యలె. పంట ఎండినట్లైంది. కుర్మోల్ల ఆసామి దశరథ్‌తో అప్పుచేసి బోరేపిచ్చిండు. వచ్చె కరెంటు, పోయె కంటుతోని బోరు పాడయ్యింది. పంట ఎండింది. మల్ల అప్పు నెత్తిన పడ్డది. ఊల్లె పని లేదు. ప్రొక్లెయినర్లతోని పనులు చేపిస్తున్నరు. ఎండిన చేన్ల కూలబడి గుండె పగిలేల ఏడ్సిండు. వానస్తె ఎంత ఏపుగ పెరిగేద్ది జొన్న చేను? పోనీ ఏ జూరాల రిసర్వాయర్ అయిన అయితే చెరువులు, కుంటలు నిండుకునేయి. పంటలు పండెయ్యి. సర్కారుకగ్గితగల ఎవడూ ఏమీ చెయ్యడు. తెలంగాణస్తే నీల్లు వస్తయి అంటాన్రు. గీ తెలంగాన ఎప్పుడస్తది? జల్దస్తే బాగుండు. అప్పుడు, ఇప్పుడన్న ఆంధ్రోల్ల సర్కారు తెలంగాణనీళ్లు ఆంధ్రకు తీస్కపోవడమే ఉంది గాపి తెలంగాణోల్లకు ఇచ్చుడే లేదు. తెలంగాణ సర్కారొస్తే మంచిగ నీల్లస్తయ్ అంటరు. తెలంగానంతా పెద్ద ఉద్యమమే నడుస్తాంది. దినాం ఏదో ఒక జులూస్ తిస్తాన్రు. టీవీలల్ల గూడంగ గదే చూపిస్తున్నరు. మొత్తంగా పోయిన గీ జూరాల లిఫ్టు వైపునైన వేస్తే మస్తు నీళ్లు వస్తయ్ తనకు. మొన్న ఎవరో సార్లస్తే ఊల్లె శానామంది గిదే చెప్పిండు. డాము వస్తే ఊళ్లె పంటలు పండి జనం ఊల్లేనే ఉంటరు. దేశాలు పట్టిపోరు. గని గద్దెనెక్కినంక ఆంధ్రోడైన, తెలంగానోడైన ఒక్కటే. అప్పుడెవలనడగాల?

మెల్ల మెల్లగా ఊర్ల పని దొర్కవచ్చింది. పెండ్లం పిల్లలు పస్తుంటున్నరు. ఒకపూట బువ్వ. ఇంగోపూట అంబలి అయితున్నది. రెండేండ్లు గట్లనే గడ్సిపోయినయి. నీళ్లు-కరెంటు ఇయ్యని సర్కారు అంబలి బిచ్చం పోస్తుంటే జనం గంజులు తల్లెలు పట్కొని ఉర్కుతాన్రు కుక్కపిల్లల తీరు. తన భార్య గూడ ఎన్నిసార్లు అంబలి తెచుకోలె ఊరంతా బిచ్చపోల్ల తీరు అయ్యిన్రు ఊరు ఊరంతా. గీ తలరాతంత ఎవరు రాసిరు? భూమి ఉన్నా, తలాపున కృష్ణమ్మ ఉన్న నీల్లెందుకు రావు తమకు? ఎవల తాన దీనికి సమాధానం ఉంది?

రెండు మూడు ఊర్లు దాటి అడవిల, మిరపతోటలల్ల, బుడ్ల పనికి పోవురు. చానాకష్టం మీ ఆ పని దొరికెడ్డి. దొరికిన్నాడే బువ్వ. లేకపోతే పస్తే. అడవిల కట్టెలు గొట్టి అమ్ముదమంటే పులుల పాముల బయ్యం. గిట్లనే ఊర్లె మూడేండ్లు గడ్సినయ్. రాముకు పదిహేను ఏండ్లు పడ్డయ్. చదువ్వలేదు. తన తీరే పనికోసం ఊరి మీద పడి తిరుగుతున్నడు. మద్దె మద్దెల తెలంగాణ సంఘమోల్లు మీటింగులకు పోవుడు షురుచేసిండు. ఎంకటయ్య తెలంగాణ ఎందుక్కావాల్నో చెప్తున్నరు వాళ్లు. మధ్యల కెసిఆర్ నిరాహార దీక్ష చేసిండు. తెలంగాణ ఇచ్చినట్లే ఇచ్చి మల్ల ఎన్కకు తీస్కున్నరు. తెలంగాన వచ్చిందని అందరెంతో సంబురపడ్డరు. తెలంగానస్తే నీల్లస్తయ్. భూములున్నోల్లు ఎవసాయం చేస్కోవచ్చు. భూమి లేనోడికి భూమస్తది. భూమున్నోడి చెల్కల కూలీ దొర్కుతది గిట్ల దేశం కాని దేశం పోరు కదా. పోయినేడాది అప్పు చేసి పత్తి పంటేసి, ఎండిపోతే బోజన్న చెల్కలకే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేస్కుండు. గట్ల కాదు కద. తెలంగాన రావల్ల జరూర్ రావల్ల తమకి వీల్ల చేసినాడే తెలంగాన రాజ్యమేలాలి. ఎంకటయ్య ఆలోశెనల తెలంగాన తిర్గుతున్నది.

రాను రాను పని దొర్కక మా కష్టమైతున్నది. ఎంకటయ్య నెత్తి మీద సేతులేస్కుని కూసుండు. ఏం చెయ్యాల? మల్ల గుజరాత పోదామా? అని ఆలోశనల పడ్డడు. ఇంతర కుర్మాల్ల ఆసామి దశరత్ కాన్నించి రమ్మని ఖబర్ వచ్చింది. ఎండల కాలం ఊల్లె ఎక్కడ గూడ పచ్చని గ్రాసం లేదు. పశురాలు గూడంగ ఆకలికి ఏడుస్తాన్నయ్.

తన 300 గొర్లు మేపనీకి రాముని దేశం పంపనన్న పంపు లేకపోతే నీ భూమైన రాసియ్యి అని కూసుండు ఆసామి దశరథ్. కొడుకుని గొర్లు మేపనీకె దేశం పంపుడు తప్ప ఇంకో తివ్వదొర్కలే

ఎంకటయ్యకు. చేసిన యాభై వెయిల అప్పు ఎట్ల ఛుక్త చేసుదు? రెండేళ్లు గొర్లను మేపితే అప్పు ఛుక్త చేస్తడంట.

రాము నేను పోనంటే పోను నాయినా అని శానా జిద్దు చేసిండు గని ఎంకటయ్య తను అప్పు గురించి చెప్పి కడ్పునిండ బువ్వ దొర్కుతదిరా కొడకా. నీకు రోజూ బువ్వ తినచ్చు అని బుదరకిచ్చిండు. మన భూమి మనకు దక్కాల్నంటే నువ్వు గొర్లను మేప దేశం పోవాల్ల. లేకపోతే గోతికాడి నక్కతీరు అప్పిచ్చిన ఆసామి కాసుకుని కూకున్నదు. నువ్వు నీ పిల్లగాండ్లు ఇప్పుడు కాపోయిన ముంగట మంచిగుండాల్నంటే నువ్వు పోవాలరా తప్పది.. ఎంకటయ్య మాటలకు రాము చప్పుడు చేయలేదు.

ఆ దినం రాము గొర్లు మేపేతందుకు దేశం బయలెల్లిండు. రాముతో పాటు నీనా నాయక్ యాదయ్య. దేవన్న-రమేషు, సవరన్న, లక్ష్మణ్, ఊషన్న, దౌలన్న, మలతయ్య, చీసన్న, కర్నెన్న, జంగయ్య, సాయన్నలు అంతా కల్సి వెయ్యి గొర్రెలతోని దేశం బయలుదేరిన్రు. ఆ యాడాది కోసానకు ఆసామిచ్చిన రెండు జతల చెప్పులు, రెండు లుంగీలు, అంగీలు, స్నానంకు  నల్ల సబ్బు, బియ్యం, కారం, ఉప్పు, నూనె అన్నీ మూటలు కట్కొని కర్రకు కట్కొని గొర్ల కాపరులు బయలెల్లిన్రు. అన్ల ముగ్గురు గొర్రెల ఆసాములున్నరు. లక్ష్మణ్, యాదయ్య, రమేష్‌లు గొర్రెల ఆసాములు. మిగతా అందరు ఆల్ల పాలేర్లు. రాము గొర్లె ఆసామి సూత్రం రాలేదు. ఆయనకు ఊర్లె ఎవసాయం మద్దె మద్లె వచ్చిపోతడు.

'సమ్మక్క సారలక్క అడవిల మేపాల్నంట' పద్మ రాముని పట్కొని ఒకటే ఏడుపు షురూ చేసింది. "సోపతి గాల్లతోని ఉండు. అడవిల శానా దూరం పోకు తోడేల్లు, పులులు పాములుంటయ్. ఇంటాన్నవా ఏలదా" అనుకుంట ఏడుస్తనే మాట్లాడ్త ఉంది పద్మ. ఎంకటయ్య గూడంగ కల్ల నీళ్లు తుడ్సుకుండు. గొర్ల కాపర్లు ప్రయాణమైనరు. రాము గూడంగ ఆ గొర్రెల మందల ఒక గొర్రె తీరె అన్పించింది ఎంకటయ్యకు.

* * *

ఎంకటయ్య-పద్మక్కకు కొడుకు గొర్రె కాపరిగ దేశం పోయినంక ఊల్లె ఏ పని చేసి బత్కాల్నో సమాజ్ కాలేదు. ఊరంత పిసోడి తీరే తిరిగిండు. ఎడారిల నీళ్ల కోసం దేవులాడుతున్నట్లే అన్పించింది ఎంకటయ్య.  గట్లనే ఆరునెలలు గడ్సిపోయినయి. ఎటుబోవాల్నో అయోమయంగుంది. ఇంతట్ల ఊల్లెకు కుమార్ మేస్త్రి వచ్చిండని తెల్సింది. ఎంకటయ్య పొయ్యి కల్సిండు. హైద్రాబాదుకి లేబర్ కావాల్నంట. లెంకకు యాభై వేల రూపాయలు మాట్లాడుకున్రు. అడ్వాన్సు ఇరవై వెయిలు తీస్కుండు. అగో గట్లచ్చి పడ్డడు గీ గచ్చిబౌలి లేబరు అడ్డాకు. ఇక్కడందరు పాలమూరు లేబరే ఉన్రు. ముప్పై కుటుంబాలున్నయ్. ఒక్కోలదీ ఒక్కో కథ ఉంది. ఏదో రాము అక్కడ గొర్లు మేపేతందుకు పోతే తను పద్మ ఇక్కడ లేబరు పని చేసి అప్పులు ఛుక్త చేసేతందుకు డబ్బులు జమ చేద్దామనుకున్నారు. ఈ లోపల రాము పారిపోయి వచ్చిండు. వానికి చాతకాక వచ్చిండంట. గొర్లు మేపీ మేపీ గొర్ల తీరు కల్లు కొచ్చిపోతాయని భయమైందంట అక్కడ శానామంది గొర్లు మేపే పిలగాండ్లకు గట్లనే అయిందట. రేపు వానికి సమఝాయించాల్ల వారానికోపారి ఫోన్ చేసి నాయన నేను వచ్చేస్త చాతనైతలేదనేటోడు. తను సమఝాయించేటోడు ఇంకెంత కొడుకా ఒక యాడాది అయితే అయిపోతది అనుకుంట బుదరకిచ్చేటోడు. ఈ పారి చెప్పాపెట్టకుంట పశురాలను అక్కడ వాళ్ల సోపతిగాల్లకు వదిలిపెట్టి పారొచ్చిండు. ఆసామి దశరథ్ గొర్రెలు భద్రంగా లేకపోతే ఇంకిత అప్పు చేరుస్తడు. మధ్య పారిపోయివస్తే మిత్తి కట్టిమ్మంటడు. ఎట్లైన తను రామును సమఝాయించాల. ముందైతే మంచి డాక్టరు తానకు కొంటబొయ్యి వాని కాండ్ల పుండ్లు చూపియ్యాల అనుకుండు ఎంకటయ్య.

* * *

నాయన, అమ్మలతోని దేశం పోయినప్పుడు లేబరు పని మట్టి, సిమెంటు, ఇటుక తట్టలు ఎత్తుడే చేసిండు గని గిట్ల గొర్లు మేసిపోతె.

కిలోమీటర్ల కొద్ది గొర్లను మేపుకుంట పోవాల్ల. ఎక్కడ గ్రాసం, నీళ్లు ఉంటే ఆడ గంటకొద్దీ ఆగాల. ఒక్కోపారి రెండ్రోజుల దంక ఆడనే ఉండుడె. చెట్ల కింద ప్లాస్టిక్ కవర్లు, చద్దర్లు వేస్కుని ఉండాల. అక్కడ్నే వంట చేసుకొనుడు లేకపోతే ఊల్లోకెల్ల అడుక్కుని తెచ్చుకొనుడు. అడుక్కుంటుంటే నాయన సెప్పేది యాదికచ్చేది. కడుపునిండ బువ్వ దొర్కుతదన్నడు గొర్లు మేపితే. గిదేనా నాయనా అడుక్కుతినే బత్కు అని అడగాల్నని అనిపించేది. దయగల తల్లులు బువ్వేస్తరు. అందరు వెయ్యరు. ఎల్లగొడ్తరు. కిలోమీటర్ల కొద్దీ నడక... నడక... గొర్లు ఏ దిక్కు తీస్కపోతే ఆ దిక్కు నడక. కాల్లునొచ్చి దుఃఖం వచ్చేది. నడవలేక కూలబడితే ఆసామి గద్దరించి మందిచ్చేటోడు. ఎంత నడిచిండు? గా తొవ్వ యాదికచ్చింది పాలమూరు జడ్చర్ల, బిజినేపల్లి, సూర్యాపేట, నల్గొండ, ఆలియా, మిర్యాలగూడ, కోదాడ, ఖమ్మం, వైరా, కొత్తగూడెం, భద్రాచలం, ములుగు, మంగపేట, ఏటూరు నాగారం గివ్వన్నీ దాటినంక సమ్మక్క-సారలమ్మ అడవిల గుట్టల మీన నడక యాదికచ్చింది.

మొత్తం ఒక పన్నెండు మంది పాలేర్లు గొర్లను మేపుత పోవుడు. ఆ నడక ఆగది. ఆగినా మల్ల సాగుతనే ఉంటది గొర్లు తోల్కపోతనే ఉంటయ్ ముందుకు. ఆసామీ కూసోనివ్వడు. నిద్రపోనియ్యడు. గద్దరిస్తనే ఉంటడు. పాలేర్లు ఏమన్న అట్లిట్ల అయిన్రా? కర్రతోని కొట్టుడే. ఒకసారి పదమూడేండ్లుటయ్, లంబడోల్ల పోరడ్ నీనా నాయక్... వాని గుంపుల కెల్లి గొర్రెపిల్ల తప్పిపోయింది. ఆసామి ఆడనే ఉండు. వెతకంగ వెతకంగ అడవిలో ఒక గుంటల పడిపొయ్యి లెవ్వలేక ఏడుస్తాంది. ఎట్లనో గట్ల దాన్ని అందరు కల్సి బయటకు తీసిన్రు. ఇంక వాన్ని కొట్టిండు సూడూ వాని ఆసామి రమేషు రక్తాలు కారేదంక కొట్టిండు. రాత్రి నానా నాయక్ 'నేను మా

ఊరుపోత గొర్లుమేప మా అయ్యావా తానకుపోత" అని ఒకటే ఏడ్సిండు వాని దుఃఖం ఊర్ల ఉన్న య్యాడికి ఇనపడాలన్నంత లాజిగ(పెద్దగ) ఏడ్సిండు. బువ్వ గూడంగ తినలె. తెల్లారి చూసేటాల్లకల్ల నీనా నాయక్ కనపడలె అడవిల సానా ఎతికిన్రు దొర్కలె. ఆసామి గావర పడ్డడు. ఇంక పక్కన ఉన్న ఏర్లె ఎతకపోయిన్రు. తను, ఆసామి ఊర్లె ఒక ఓటేలు ముంగట అడుక్కుంటుండు నీనా నాయక్. వానితోని ఇంగో ముసలామె గూడంగ అడుక్కుంటాంది. ఆసామిని చూసి ఆ ముసలామె ఎనక పొంటి నక్కిండు. ఎంత రమ్మన్న రానంటడు. తన ఊరికి తోల్తేనే వస్తనంటడు. గా ముసలామె పక్కనే కూసుంటడు. 'ఎందుకు ఆసామీ గంతగనం కొట్టినవు బుడ్డ పోరన్ని నీతాన ఎందుకుండాల సెప్పు... గట్ల రక్తం కారేటట్లు కొట్టినవు. మనిషివి కావా ఏంది మల్ల?' ముసలామె ఆసామిని గద్దించింది. అక్కడ్నే కూలబడ్డడు ఆసామి.

"ఏందమ్మ అడుక్కుంటాన్నవు. ఎవరు నువ్వు య్యా ఊరు నీది?" అనడిగిండు. ఆమెను చూస్తే తన నాయనమ్మ యాదికచ్చింది. 'మాది గీ జడ్చర్లకాడ ఊరు. పోలేపల్లి కొడుకా నా పేరు అంజమ్మ. ఐదేండ్ల కింద మా భూమిని సర్కారు గుంజుకుంది కొడుకా. మా భూమి మందుల కంపెనీకి ఇచ్చింది. భూమి మీద బెంగతోని నా పెన్మిటి చెల్కలనే గుండెపోటొచ్చి చచ్చిపోయిండు. బత్కుదెరువుకు నా కొడ్కు కోడలు దేశం పోయిన్రు. నన్ను తోల్కపోలె. యాడాదికొకపారి వస్తరు. మల్ల యాడాది పనికి దేశం పోతనే ఉంటరు. ఆల్లిచ్చే పైసలు నాకు సరిపోవు. ముసల్దాన్ని నాకు కూలీ దొర్కది అందుకే పగలంత గిక్కడ హోటల్ల ముంగట అడుక్కుట కొడకా... సత్తువుంటే ఆల్లు సెప్పిన పని గూడంగ చేస్త. చానాసార్లు సంఘపోల్లతోని నా భూమి కోసానకు పోరాటం చేసిన. పోలీసోల్లతోని కొట్టించిన్రు గా కంపెనోల్లు... అంజమ్మ చెప్తాపోతాంది. ఇంతల ఆసామి లేచి గా ఓటల్ల గిన్ని చాక్లెట్లు కొని నీనా నాయక్కి ఇచ్చిండు. "రేపే మీ నాయన తానకు పంపుత రారా, ఇక్కడుంటె దారి తప్పుతవు' అని బతిమిలాడిండు. "పోరా కొడుక కొంచమైతే నేనెల్లిపోత. ఎవలన్న ఎత్కపోతరు నిన్ను మీ ఆసామితోని ఎల్లిపో" అన్నది. నీనా నాయక్ తప్పదన్నట్లు లేసి రాము చెప్పి పట్టుకుండు.

అక్కడ్నించి ముందుకే మల్లగొర్లతోని, గొర్ల తీరంగ, దేవన్న కాల్లనొప్పులు తెలవద్దని పాటందుకుంటడు. పిల్లంగ్రోవి ఊదుతడు. వానికి మస్తు పాటలు వచ్చు పొద్దు పొద్దు గొర్లతోని పరిగెడతడు. ఆవల్ల గుంపులకెల్లి పక్కకెల్లకుండ ఊర్లె ఉన్న తన ఆసామి లక్ష్మన్‌కు, రాముకన్ని పన్లు నేర్పియ్యమన్నడు. లక్ష్మన్ ఆసామికి రెండొందల గొర్లున్నయ్. తన మీద పెత్తనం చేస్తడు. 'ఇంగ నువ్వు నా చేతికింద సెయ్యాలోయ్' అన్కుంట అన్ని పనులు చేయించుకుంటాడు. దేవన్నకు, తనకు దశరత్ ఆసామి. దేవన్నకు అన్ని పనులు వచ్చు. తను దేవన్నతోనే ఉండల్ల. దేవన్న నాయన పత్తి పంటల నుక్సాన్ వచ్చి ఉరిబోస్కుని సచ్చిపోయిండు. దేవన్న పది పాసయ్యిండు. ఒక అక్క ఉంది. దేవన్న అమ్మ, అక్కలిద్దరు ఎండల కాలంల బీడీలు చుడ్తరు. ఊల్లె ఏ పని దొర్కితే ఆ పనికి పోతరు. లేన్నాడు ఇంట్లనే ఉంటరు. దేవన్న అక్క లగ్గం చేసేతందుకు దేవన్న చదువు ఆపి ఆరేండ్ల సంది ఇట్ల గొర్లు మేపనీకి దేశం తోల్తాంది వాళ్ల అమ్మ. చేసిన అప్పు ఛుక్త చేయలేదు. వాల్ల బూమి కబ్జా చేసిండు ఆసామి. కాలేజీకి పోతనే అమ్మ అని ఏడ్సిన కొడుకుని అక్క లగ్గం సెయ్యిర అని అడవికి తోలింది దేవన్న తల్లి. ఇప్పుడు దేవన్న ఇరవై ఏండ్ల షోర పోరడైండు. గొర్లు మేపటంలో మస్తు అనుభవం సంపాచ్చిండు. తన బాధ మనవనీకి దేవన్న పిల్లంగ్రోవి ఊదుతడు.

పాలమూరుకెల్లి ఏటూరు నాగారం అడవి చేరేటందుకు మూడు నెలలపైన పట్టింది. మద్దె మద్దెల ఎన్నెన్ని కథలైనయ్? తల్సుకుంటే దుఃఖమస్తది. నీనా నాయక్ తీరు తనకు గూడంగ అమ్మ నాయనల తానకు పారిపోవాల్నని మస్తు అన్పిస్తుండే. దేవన్నతోని చెప్పేది మన మనసుల ముచ్చట. "ఆసామి నరికేస్తడురో... గీ అడవిల నీ పతా గూడ తెల్వది. ఒద్దు' అనేటోడు. దేవన్న తనకు గురువోలె ఉండేటోడు. గొర్ల పెంపకంల తనకు పెద్ద సార్ తీరయ్యిండు. ఒక దినం గర్బంతో ఉన్న గొర్రె ఈననీకి నొప్పులు పడ్తాంటే ఆసామి గొర్రె తలను రాముతోని తీపియ్యమన్నడు. తనకు శానా భయమయ్యింది. దేవన్న దగ్గరుండి తల బయటకు తీపిచ్చిండు. చిన్న గొర్రె పిల్ల పుట్టింది. తర్వాత మాయలాగి గొర్రె నోట్లె పెట్టిండు దేవన్న. తనకు ఓకరాతచ్చింది. ఎందుకట్ల చేస్తున్నవంటే లేకుంటే అది తన బిడ్డను గుర్తుపట్టి పాలియ్యది. దూరం జర్గుతది అన్నడు. అన్నట్లే తల్లి గొర్రె లేసి పిల్లగొర్రెను నాకుడు షురు చేసింది. ఇంక రోజూ ఈనిన తల్లి గొర్రెలతాన, గర్భిణి గొర్రెల్ని కలిపెటోడు అట్ల చేస్తే అవి జల్ది కంటయంట. గొర్రె కూనలను తల్లి గొర్రె చన్నుల దగ్గర్కి పెట్టి మూడు పూటల పాలు కుడిపించెటోడు. తల్లి గొర్రెల్ని మేతకు కొంటవాటికే గొర్రె కూనలకు వాటితో పాటు కొంచెం దూరం పాలకోసానకు తింపెటోడు. గర్భిణి గొర్రెలకు మంచి గడ్డి, ఆకులు ఎక్కువ తిన్పించెటోడు బలంగుండాల్నని. గొర్రెలకు కడుపుల నట్టలు, పురుగులు సచ్చేటందుకు మందు తిన్పించెటోడు. ఒక్కోసారి మొగగొర్రెల బుడ్డలు వాసి పొయ్యేవి. ఆ వాపు తగ్గనీకి ఇనుప సువ్వ కాల్చి తోకల మీద, తల మీద వాత పెట్టేటోడు. ఒక్కోసారి గొర్రెలకు పుండ్లయ్యేటివి. డాంబరు గోలీలు చూర చూర చేసి ఆ పుండ్లల్ల నింపెటోడు. వీటి కాల్లకు పురుగులు అయినయ్ చూడు అన్కుంట కాండ్ల మీద ఉన్న పుండ్లకెల్లి బయటకు వచ్చే పురుగులను తీసి అన్ల డాంబరు నింపెటోడు. పెద్ద డాక్టరు తీరు కన్పిస్తుండె దేవన్న తనకు

గొర్లు ఆయాసపడ్త, ఊపిరాడనట్లు చేస్తే తల నేలకై చేసే గొర్లను చూపుత "ఆటికి దమ్ము రోగం వచ్చిందిరా రాము నీల్లె ఈనికి మందు అన్కుంట. వాటికి మస్తు దూపైతాంది చూడు" అనుకుంట

అప్పీట్ని నీల్లకాడికి తోల్కపోయి ఛాతీ మీద నీల్లు చల్లుత చేత్తోని గుద్దేటోడు. అవి దేవన్నకి ఇనకుండ గుంజుకుంటోంటే దీనమ్మ-దొమ్మరోగం వచ్చిన గొర్రెలు మాట ఇనయ్‌రా అనేటోడు. ఆసాముల దగ్గర గొర్ల మందులు-సూదులు అన్ని ఉండేట్వి. దొమ్మరొగం ఇక తగ్గదని తెల్సినంక దాన్ని చంపి అందరు మాంసం కూరొండుకుని తినేటోల్లు.

ఒక జాగ-ఇల్లు అని ఉండెడ్డి కాదు తమ గొర్ల కాపర్లకు. ఎండా, వాన అన్నీ తమ మీదనే. ఊర్లు, అడవులూ దాటంగ దాటంగ ఒక్కోసారి వానపడేది. గొర్లతో చెట్ల కిందికి చేరేది. చద్దరు-కంబళ్లు-ప్లాస్టిక్ కవర్లు కప్పుకున్నా తడ్సిపోయేది. చీకటి పడ్డంక కూడ వాన ఆగకుంటే వరిపొలాల గట్లెంబడి అట్లే ఒక పక్కలకు ఒరిగి పండేది. పండెతందుకు జాగ దొరక్కపోతే, చెట్టు నీడ దొరికినంక, నిలబడే కర్ర కొనచేతబట్టి, దాన్ని చెంపకు ఆన్చి నిద్రపోయేది పాలేర్లంత. నిలబడి నిద్రపోయే పాలేర్లను, దేవన్నను చూస్తే తనకు తాజూచయ్యేది.

కంటి నిండ నిద్ర ఉండేడ్డి కాదు. జాము కొట్టాలె. ఒక పాలేరు రెండు గంటలు నిద్రపోతే, ఇంకొక పాలేరు గొర్లు మేపాలె. రెండు గంటలకొక జాము గొర్ల ఆసాములు మాత్రం నిద్రపోయేది. గొర్లకు పాలర్లు సరిగ మేపుతున్నరా లేదా అని ఆసాములు కాపలా కాసేది. ఆసాములు పాలేర్లను బూతులు తిట్టేది. నీనా నాయకే కాదు పదిమంది పాలేర్లు చానా కష్టాలకోర్చుకుంట గొర్లు కాసేది. ఊల్లె ఉన్న అమ్మ నాయనలను యాద్ చేసుకుంట రాత్రి పూట కుల్లి కుల్లి ఏడ్చేది. పెద్ద పాలేర్లు అల్లను ఊకోమని బుదరకిచ్చేది.

గొర్ల ఆసాములు ఊల్లెకెల్లి అడవిల కొచ్చి పాలేర్లను కలిసేది. అప్పుడు పెరిగిన గొర్ల ఉన్ని తీసి రెడీగ పెట్టాల. వానాకాలం అయిపోతదనంగ, ఎండలకాలం ఇగ వస్తదనంగ గొర్లకు ఉన్ని తియ్యాల ఒక గొర్రె యాడాదికి మూడొందల కెల్లి ఆరొందల గ్రాముల ఉన్నిస్తది. ఆ ఉన్నిని హర్యానా, పానీపట్‌ల కెల్లి వచ్చిన ఉన్ని కొనేటోల్లకు ఆసాములు అమ్ముకునేది. కత్తిపట్టి ఉన్ని తీసుడు కూడా దేవన్న నేర్పిండు. గొర్లు ఎసొంటి ఆకులు, గడ్డి తింటవో, తినవో చెప్పేటోడు. వాన పడితే తడ్సిన గడ్డిని గొర్లు తినవు. చెట్ల ఆకుల్ని తింటయ్. అప్పుడు ఆసాములు గొర్లను ఎనకకు మర్లిమ్మంటరు. ఆటిని మల్ల ఎనకకు మర్లించుకుంట పొడిగడ్డి ఉన్న తానకు తేవాల. గివన్నీ దేవన్ననే చెప్పేది. రాత్రి ఎటంటే అటు అడవులల్ల పండుడు. ఏ పాము కరుస్తదో, ఏ తోడేలొస్తదో తెల్వది. పోయిన నెల దేవన్న మీదకు వచ్చిన తోడేలు యాదికస్తే ఒనుకొస్తది. గుండెలు దడదడమంటయ్. చెట్టుకింద కాపుకాస్తున్న దేవన్న మీదకు ఎట్లచ్చిందో ఒక తోడేలు మీద బడ్డది. పెద్దగ అర్సుకుంట కర్రతోని, రాల్లతోని కొట్టుకుంట దాన్ని తర్మిండు. అది మీద మీదకు ఒచ్చింది. గొర్లను పట్టాలని చూస్తున్నది. మాటిమాటికి మంద మీదకు పోవాలని చూస్తంది. కర్రతోని కొట్టేతందుకు వస్తున్న దేవన్న మీద నోరు తెర్సి కోర పండ్లన్ని ఏస్కుని పడేతందుకు చూస్తది. ఎట్నో ఒక తీరు కర్రతోని రాళ్లతోని దాన్ని మంద మీనకు రాకుంట చూస్తాండు. మనిషి మొత్తం చెమటతోని నీరు నీరైండు. ఇంతట్ల ఒక ఆసామి నిప్పు కెలిగించిండు. ఈ లోపట అది చిన్న గొర్రె పిల్లను పండ్లతోని కర్సి పట్టి అడవిలకు ఉర్కింది. దాని ఎనక దేవన్న తను ఉర్కిన్రు. అది ఎనకకు చూస్కుంట నా పని నేను జేస్తాన్న. నీ పని నువ్వు చేస్కో అన్నట్లుంది దాని కండ్లల్ల కత. ఊర్కుంట ఉర్కుంట జంగల్ల మాయమైంది. ఎనకెనకకు చూస్తున్న తోడేలు కళ్లల ఎంత వెలుగు? దేవన్న ఒనికిపోయిండు. ఇప్పుడు ఆసామి ఏమంటడో అని 'సంపుతడురా ఏం చేద్దాం' అంట అక్కడ్నే కూలబడ్డడు. దేవన్న మొఖఃల ఆ చీకటి రాత్రి నల్లటి భయం నిండింది. దేవన్న కళ్ళు భయంతోని వెర్రిగ చూస్తాన్నయ్. తను, దేవన్న ఆయాసపడ్త చెట్ల కింద కూలవడ్డరు. తోడేలు చేసిన దానికంటే ఆసామిని తల్సుకుని ఒనుకుతుండు దేవన్న ఏమైతే అదవుతది పోదాం పా అన్నడు తను. గని దేవన్న గట్లనే కూలబడ్డడు. పెయ్యంత సెమటతోని తడ్సి ముద్దయ్యింది. చేతులు సల్లంగయినయి. మోకాల్ల మీన తల పెట్కోని ఒక్కసారి ఏడ్పు షురుచేసిండు. దుఃఖఃతోని ఆయన చేతి దండాలు కిందికి మీదకు కదుల్తున్నయ్. తనెంత బుదరకిచ్చిన ఆ దుఃఖం ఆగలె. ఆ చీకటి రాత్రి జంగల్ల- పాముల-తోడేల్ల- పులుల భయం లేకుండ కూసుని ఏడుస్తాన్న దేవన్న దుఃఖాన్ని ఆ క్రూర జంతువులు అర్థం చేస్కున్నయోమో మల్ల ఆ దిక్కు రాలే. చెట్టు మీద పాము ఒకసారి తల అవతలకు పెట్టి ఏందో అర్థమైనట్లే మల్ల లోపల్కి ముడ్సుకున్నది. తను ఏమనక కూసున్నడు. దేవన్న దుఃఖం తన దుఃఖం ఒకటే.. తనకు గూడ గుండెలు బిగపట్టినయ్ దుఃఖంతోని. దేవన్న ఏడ్సి ఏడ్సి అల్సిపొయ్యిండు. మెల్లంగ కళ్లు తుడ్సుకుండు. రాము దిక్కు చూస్తా.... 'నాయన ఉరివోస్కోక పోతే మంచిగుండేది రా' అన్నడు ఆ గొంతు వింటే భయమేసింది. ఇద్దరు ఆ చీకట్ల అడవిల కెల్లి గొర్ల మంద ఉన్న కాడకి నడ్సిన్రు. కాల్ల కింద ఎండుటాకులు చేస్తాన్న సప్పుడు అవి చెట్టు కెల్లి రాలినందుకు ఏడుస్తున్నట్లె ఉంది. తమ ఇద్దరి గుండెల్ల అణిగిన దుఃఖాన్ని ఆ ఎండుటాకులు శబ్ధం చేస్తూ జంగల్‌కి చెప్తున్నట్లె అన్పించింది.

గొర్రె కోసం తోడేలెట్ల మంద ముందు తిర్గిందో, గట్లనే దేవన్న ఆసామి దేవన్న కోసం పిచ్చి కోపంతోని తిర్గుతాడు మంద ముంగట. దేవన్న రాంగనే తోడేలు తీరే ఆయన మీద పడ్డడు. కర్రతోని పిచ్చెక్కినట్లే ఎక్కడ బడితే అక్కడ కొట్టిండు. భూమి మీదకు నూకి కాళ్లతోని కడ్పుల గుద్దిండు. దేవన్న కేకలకు గొర్రెలు-గావరపడి అటు ఇటు అరుస్త కదిలినయ్ పాలేర్లు తీరు తల్లడిల్లిన్రు. కొద్దిమంది ఆసాములు అరె రమేషు ఆపింక చస్తడు వాడు అని ఇడిపించిన్రు. తోడేలు నోట్లెబడి సచ్చిన గొర్రెతీరే దేవన్న నేల మీద పడిపోయి దుఃఖఃతోని

ముద్సుకుపోయిండు. సచ్చిన గొర్రె ఖరీదుని దేవన్న అప్పుల జమ చేసిండు ఆసామి. అర్థగంటైనంక దేవన్న మెల్లంగ లేసిండు. అంత బాధల గూడంగ దేవన్న తన పిల్లనగ్రోవిని మరవలే. ఏడుస్తనే ఊదుకుంట చేరిండు. అక్కడున్న పాలేర్ల కండ్లల్ల తడ్సినయ్. ఇంతేనా? ఎప్పుడన్న ఆసాములు లేనప్పుడు ఊర్ల గింత బువ్వకోసానికో, తొక్కు కోసానికో పోతే ఆసాములు తిరిగొచ్చినంక ఎందుకు ఊర్లెకు పోయిరని కర్రతోని బగ్గ కొట్టేది. అడవిల కెల్లి ఊర్లకు పోతే పాలేర్లు తెల్వి మీరతరని బాగా కొడ్తే భయపడ్తరని అట్ల చేసేది. నాయనకేం దెల్సు ఈ సంగతులు? రాము నిట్టూర్చిండు.

మందలకు మందలు గొర్రెలెటు తీస్కపోతయో తెల్వది. ఊర్లు, అడవులు దాటుకుంట పోవల్ల. పోత పోతాంటె దారి పొంటి ఊళ్లు- ఇండ్లు మనుషులు కన్పిస్తే అమ్మనాయనల యాది మనాదిపెడ్తది. మనసంత పొక్కి పొక్కిలి అయితది.

ఒండుకున్న బువ్వ ఎల్లిపాయ కారం తొక్కు నూరుకొని సిక్కెంల పెట్టుకుని ఇగ గొర్లెంబడి సావల్ల. ఎండల కాలమైతే తెల్లారి ఆరు గంటలకే గొర్లను జంగల్‌కు మ్యాతకు తోల్కపోవాల. పగటికి పన్నెండు గంటలకు ఎండెక్కంగనే గొర్లను నీడకు పెట్టాల. మల్ల పొద్దెక్కంగనే నాలుగ్గంటలకెల్లి ఏడు దంక మేపాలి. ఒకలు గొర్లను మేపుతాంటే సిక్కం దాపు ఒకలు తినాల. ఒక సిక్కంల ముగ్గురు పాలేర్లు తినేటోల్లు.

గొర్లు తోలంగ, తోలంగ సడక్‌ల మీ తెలంగాన జులూస్‌లు కన్పడెటివి. టెంట్లు వేసి మీటింగులు పెట్టెటోల్లు. ఆ మీటింగుల కాడ ఆగనిచ్చేటోల్లు కారు ఆసాములు. నడ్సురి. నడ్సురి అన్కుంట గొర్రెల్ని తోలినట్లె తోలెటోల్లు. ఎప్పుడన్న పాట-మాట వింటమన్న జర్ర పదినిమిషాలు ఆగుదాం అని బత్మిలాడితే ఆగనిచ్చేటోల్లు. గా మీటింగులల్ల సార్లు తెలంగాన గురించి చెప్పేది. మన నీల్లు, భూమి, నౌఖరీలు ఆంధ్రోల్లకు పోతాన్నయ్. మన తెలంగాన మంది బిక్కార్లైతున్రు. దేశాలు వలసలు పోతున్రు. మన భూమి, నీఉల్ల కోసం మనం పోరాటం చెయ్యాలె అని అర్సుకుంట ఆవేశంతోని మాట్లాడేటోల్లు. కాయితాలు పంచెటోల్లు. దేవన్నతోని అన్లేముందో చదివి వినిపించుకునేది. అంత తెలంగానల ఏమైతున్నదో తెలంగాన కోసం ఏం చెయ్యాల్నో ఉండేది ఆ కాయితాలల్ల. వాల్లల కొంత మంది కాల్లకు గజ్జెలు కట్టి తెలంగాన కోసం పాటలు పాడేది. దేవన్నైతే పూనకం వచ్చినట్లే గెంతేది. ఆల్లతోని జై తెలంగాన అని ఒర్లేది. ఆసామి నడ్సురి. నడ్సురి అని గద్దరించుకుంట తమను గొర్ల మందల కలిపేది.

ఒకసారి తెలంగానోల్లు సడక్ మీదనే పొయ్యిలు పెట్టి వంటలు చేసిన్రు. సడక్‌లన్నీ పొయ్యిల్లు తీరే అయిపోయినయ్. సడక్ మీదనే వంట. సడక్ మీదనే తినుడు. ఆ దినం తెలంగాణోల్ల పున్నమాని పాలేర్లందరు కడుపు నిండ సన్నబియ్యం అన్నం, కందిచేల్లపప్పు, ఆలుగడ్డ వంకాయ కూర తిన్నరు. దినాం ఎల్లిపాయ కారం తొక్కు, టమాట కూరలతోని బువ్వ సయించకచ్చింది వాళ్లకు. ఎప్పుడన్న ఆసాములు కోడి, మ్యాక మాంసం కూర వండుతరు. వాళ్లంత తిన్నంక మిగిలింది పాలేర్లకిస్తరు ఆ దినం పండగే ఆల్లకు.

పోల పండగ రోజు గూడంగ పాలేర్లకు కడ్పు నిండ బువ్వ పెడ్తరు ఆసాములు పాలేర్లకు. శ్రావనమాసంల ఆసాములందరు పోల పండుగ చేస్తరు. గొర్రె పాలు పితికి పెరుగు చేసి పోలేరమ్మకు నైవేద్యం పెడ్తరు. అటెన్క ఆ పెరుగుని చల్ల చేస్తరు. ఆ చల్లను గొర్ల మీద చల్లుతరు. అట్ల చేస్తే అవి మంచిగ ఆరోగ్గెంగ ఉంటయంట.

* * *

పాలేర్లంత రాత్రిళ్లు కూసుని, జాము కాస్తా అల్ల బత్కులిట్లెందుకున్నయ్ అని తీరు తీర్లు ముచ్చట్లు పెట్టుకునేటోల్లు. ఆ తెలంగాన సార్లు చెప్పినట్లె మన నీల్లు మనకు లెవ్వురా అవి ఆంధ్రోల్లకు పోతున్నయ్. అందుకే మన భూములు ఎండిపోయి పంటలు పండక ఇగో మనమిట్ల దేశాలు పడ్తున్నం అంటడు దేవన్న. ఆ నీల్లు మన ఊర్లెకు తెచ్చుడెట్ల? తన ఊల్లె మూడెకరాల భూమి పడావుగ ఉన్న మలతయ్య ఆశగ అడుగుతాండు. అగో పోరాటం చెయ్య మంటున్రు కద అంటడు దేవన్న తన చేతిల ఉన్న తెలంగాన కాయితాలను సూపుత. అదెట్లనో మరి ఎవలకు తెలవకచ్చింది. గొర్లతోనె నడక, బువ్వ, నిద్ర, ఆలోశెన. రెండు నెలలైనంక గొర్లు ఖమ్మం, భద్రాచలం అడవుల్ల తేలినయ్. అడవిల నాలుగు దిక్కుల ఛీలిన్రు కాపర్లు గొర్లతోని. నడంగ నడంగ అడవిలోపల గూడాలున్నయ్. అన్ల అడవి మనుషుల తీర్లున్నరు. వాండ్ల ఒంటి మీన బట్టగూడంగ మంచిగ లేదు. ఆల్ల గుడిసెలు కొన్ని కాలిపోయి ఉన్నయ్. పోలీసోల్లు ఫారెస్టోల్లు కాల్సిన్రంట వాళ్లను ఎల్లగొట్టనీకి. ఆల్లంత ఛత్తీస్‌ఘడ్ అడవిలకెల్లి పారొచ్చిన్రంట. ఆల్ల భూమి, ఇల్లు అన్ని అడవిలనే ఉన్నవంటె అక్కడ జుడుమోల్లు కత్తులు పట్కొనివచ్చి శానామందిని సంపిన్రంట. వాళ్ల ఆడోల్లను చెరిచిన్రంట. గర్భిణితోనున్న ఆడోల్ల పొట్టల్ని చీల్చి పిండాలను బయటేశిన్రంట. పసిపిల్లల్ని గూడంగ చంపిన్రంట. ఆల్ల ధాన్యం, డబ్బులు, కోల్లు, మ్యాకలు దోసుకున్నంక ఆల్ల ఇల్లు కాలబెట్టిన్రంట. వీళ్లు పానాలు దక్కించుకోని ఈ అడవిల కచ్చి పడ్డరంట. ఈడ గూడంగ భద్రాచలం పోలీసోల్లు, ఫారెస్టోల్లు బత్కనిస్తలేరంట. వీలెక్కడుంటే అక్కడకొచ్చి వీళ్ల గుడ్సెలు కూల్సి, కాల్చేస్తున్రంట. ఆల్లను తరిమి తరిమి గొడ్తరంట. అన్ల పాపం ఒకామె గర్భంతోని ఉంది. ఆమె పెన్మిటిని ఛత్తీస్‌ఘడ్ అడవిల ముక్కలు ముక్కలుగ నర్కిన్రంట. ఆమె ఏడుస్తు చెప్పింది. తను హాలత్ గూడంగ గిట్లనే ఉంది సడ్‌ల పొంటి, అడవుల పొంటి అన్పించింది రాముకి. తమనిట్ల అడుల పొంటి తర్మిందెవలు? గొర్రెలా? మనుషులా? సమఝుకాలె. భద్రాచలంల ఉన్నప్పుడు రాముకి ఒళ్లు

పగల జరమస్తే దేవన్న తోడు తీస్కుని ఆసామి రాముని భద్రాచలం టవున్లకు వచ్చిండు. అక్కడంత జనం ఆంధ్ర యాసల మాట్లాడ్తున్నరు. రాముకు మస్తు లూజాబ్ అయ్యింది. అక్కడ సానామంది తూర్పు గోదారి జిల్లావోల్లంట ఇగ ఈ ఆంధ్రోల్లు తొందర్లనే భద్రాచలం గుడంగ తమదే అంటరు. చూడర రాము అంటాడు దేవన్న.

అక్కడ పెద్ద జులూస్ నడుస్తాంది. పోలవరం కట్టద్దని, అడవిల ఉండే మందిని కాపాడాల్నని బట్ట మీద రాస్కొని ఒర్లుత సడక్ మీన నడుస్తాన్రు. అన్ల అడవి మనుషులతో పాటు పట్నం సార్లు గూడంగున్నరు. రాము, దేవన్న నోర్లు తీర్సుకొని నిల్సుని చూస్తచేరిన్రు. దేవన్న అల్లిచ్చిన కాగితం జేముల పెట్టిండు.

ఇగ అక్కడికెల్లి చెల్వాయి, తాడ్వాయి ఊల్లు దాటుకుంట ఏటూరు నాగారం ఆడవులకొచ్చేప్పటికి మూడు నెలలు పట్టింది. అక్కడికెల్లి సమ్మక్క సారలక్క అడవిల చిలకల గుట్ట తాన గొర్లకు మ్యాతకు తోల్కపోవుడు. గుట్టలెక్కంగ, దిగంగ రాళ్లు, రప్పలతోని ఆ అడివిల కొచ్చ కొచ్చ ముళ్లతోని కాళ్లకు రక్తం కారి కాళ్లు పుండ్లు పుండ్లయ్యేట్వి. ఆసామి ఏవో మలాములిచ్చేటోడు. అయిన తగ్గక పోయేది. కాల్లు కింద పెట్టాల్నంటే నొప్పికి దుఃఖమచ్చేది. ఇంగ ఆ నొప్పితోనే కిలోమీటర్ల కొద్ది నడవాల. గొర్ల ఎనుక... ఎనుక రాముకు దినం గడువుడు కష్టమైతున్నది.

గొర్ల మందను తోల్కుంట, తోల్కుంట మంగపేట ఊరికొచ్చిన్రు. అక్కడ నీనా నాయక్ మేనమామ కన్పించిండు. మామను పట్కొని నీనా నాయక్ బొల్లుమని ఏడ్సిండు. నీనా నాయక్ కాండ్లన్ని పుండు పుండైఐనే. గవ్విట్ని సూపుత మామ నన్ను తోల్కపో యాడి(అమ్మ)ని సూడాల్నని ఉంది అని ఆయనను పట్కొని ఎక్కెక్కి ఏడ్సిండు.

అంతే అదే రాత్రి నీనా నాయక్ గాయబ్ అయ్యిండు. మ్యానమామ ఇంటికి పారిపోయిండు. అదృష్టవంతుడన్పించింది రాముకు. తన కోసం ఎవలన్న అట్లొస్తే ఎంత మంచిగుండు? నాయమన్నడు ఇక్కడ్నే ఉండమంటడు. తనకు గొర్లతోని కాదు మనుషులతోని ఉండాల్నని ఉంది. ఎవరు తన కోసం రాకపోతే ఏంది? తానే ఎల్లిపోతే అయిపాయె.

ఊషన్ని ఆ దినం శానా ఖుషీగుండు. ఆయెనకు 15 దినాల శెలవు దొర్కింది. లగ్గమైన మనిషి కద. లగ్గమైన వాల్లకు పదిహేనే దినాలు శెలవిస్తరు. ఆల్లు ఊరికి పొయ్యి పెండ్లం పిల్లలతోని గడ్పి వస్తారు. లగ్గం కాని పాలేర్లకు ఆర్నెల్లకోపారి వారం రోజులకు శెలవులకు పంపుతారు. గని మల్లీ రారని ఆసాములే పోయి "రాజాల్లాగున్నరు మీ కొడ్కులు. వాల్లకేం తక్వ అయ్యిందని" బుదరకిచ్చి మల్ల అడవికి తెచ్చుకుంటరు.

ఒక చిన్న పాలేరు జంగయ్య తన కాల్లు చూస్కుంట ఏడ్పు షురు చేసిండు. "నా కాల్లు కొచ్చపోతున్నయ్. నాకు తెల్సు గొర్ల కాపర్ల కాల్లు గొర్లతోని నడంగ, నడంగ గిట్లనే కొచ్చపోతయంట. చూడు రాము నేను గొర్రె తీరు నడుస్త లేను చూడు. జంగయ్య లేచి నడ్చి చూపిస్తున్నడు" అవురా జంగా అవు నువ్వు గొర్రె తీరే నడుస్తాన్నవురా దౌలన్న పాలేరు నగిండు. ఊకోరా దౌలన్న వాడసలె భయపడ్తాండు. అరె జంగా నీ కాల్లకేం కాలేరా. కొచ్చెపోతే తిన్నగనే నడుస్తాన్నవు. నీ కాల్లు మంచిగనే ఉన్నయ్ ఏడ్వకు. అనుకుంట రాము జంగయ్యను బుదరకిచ్చిండు. గని అప్పటికెల్లి తనకు గూడంగ బుగులు షురువైంది. తన కాల్లు గూడంగ కొచ్చపోతయ్యేమో ఎట్లా అని ఒకటే ఫికరు పట్టింది. దానికితోడు అరి పాదాలు పుండ్లయినయి తగ్గినట్లే తగ్గి మల్ల పుండ్లు తయ్యారు పురాగ తగ్గుతలేవు. మంచి డాక్టరుకి చూపిస్తలేడు ఆసామి. మలాములే ఇప్పిస్తడు. సరిగ నడుస్తలేదు. కుంటుత ఎగురుత నడుస్తాండు. గిదేనా కొచ్చెపోవుడంటే... ఏమో భయమైతాంది. మీదకెల్లి గన్ని గొర్లకు చాకిరీ చెయ్యస్తలేదు. దేవన్న తీరు తనకు గంత గనం ఓపిక లేదు. చాతనైత లేదు. చలికాలం అడవిల చలికి చర్మం పగిలి రక్తం కారతాంది. దినాం అనుకునుడే ఈ దినం ఎల్లిపోవల్ల అని అమ్మని, నాయనని చూడాల్నని ఉంది. రోజులు, నెలలు గడుస్తాన్నయ.క అడవిల పగలు. రాత్రి గొర్రెలతోని నడుస్తాండు. మగ్లూరు గుట్టలు, చిలకల గుట్ట ఎక్కుడు దిగుడు నరకం గున్నది.

అమ్మ సమ్మక్క, సారలమ్మ తల్లి నన్ను మా ఊరి దారి బట్టియ్యి ఈడికెల్లి.. రాము చేయెత్తి ఆ చీకట్ల ఆస్మాన్ దిక్కు చేతులు చాపుత దండంపెడ్తా మొక్కుతుండు. రాము కండ్లకెల్లి ధారగా కన్నీళ్లు కారినయ్. ఆలోశనల కెల్లి బయటపడ్డడు రాము. బస్సు ఏటూరు నాగారం దిక్కు పరిగెడ్తున్నది. ఐద్రాబాద్ దాటి సానాసేపైంది.

నాయన డాక్టరు తానకు తీస్కపోయి మంచి మందులిప్పించిండు. ఫోన్ల తన ఆసామి దస్తగిరి బెదిరించుకుంట మాట్లాడిండు. "ముసలోన్వి శోరోన్వి గట్ల పారొస్తవి ఊకోను బిడ్డ నా మందల గొర్రె ఒక్కటి పోయినా నీ అప్పు ఎక్కువైతది. నీ భూమి తీస్కుంట చప్పుడు చెయ్యక మంగపేట పోతవా లేదా" అని

ఐద్రాబాదుకెల్లి మంగపేట వచ్చి మల్ల గొర్ల మందల కల్సిండన్న మాటే గని మనసు మనసుల లేదు రాముకి. రాము ఐద్రాబాదు పారిపోయినంక దేవన్నను ఆసామి మస్తు కొట్టిండంట. చుట్టూ ఉన్న అడవిలకు మేతకు తోల్కబోవుడు ఏటూరు నాగారంల సానామంది ఆంధ్రోళ్ల కన్పడతాన్రు. అడవిలకెల్లి వస్తుంటే పోతుంటే ఆల్లే కన్పతాన్రు. దేవన్న, రాముతోని మాట్లాడుడు బందు చేసిండు. తను పారిపోదామనుకున్న రాత్రి దేవన్నకు చెపితే ఏమనలే. కొద్దిసేపు తన కండ్ల దిక్కే చూసిండు పోతవా... పో అన్నాడు. తిరిగొచ్చిన తనను ఎందుకొచ్చినవ్ అన్నట్లు చూసి కోపంగ మొకం తిప్పుకుండు. ఆ రాత్రి దేవన్న ఫ్లిలంగ్రోవి ఊదుతుంటే అది పాట తీరు లేదు. ఆయన గుండెలోని దుఃఖం ఆయన ఊపిరికెల్లి బయటకొస్తున్నట్లుంది.

చుట్టూ చీకటి... బువ్వ తిన్నంక జాములెక్క కాపలా కాస్తున్నరు. దేవన్న జాము కాస్తున్నాడు. సన్నంగ, మెల్లంగ పిల్లనగ్రోవి ఊదుతాండు. దేవన్నతోని ఇంకొంత మంది పాలేర్లు గూడ కాపలా కాస్తున్నరు. ఆసాములు ఇంకొంత మంది పాలేర్లు నిద్రపోతున్నరు. రాముది నిద్ర వంతు గని నిద్రస్త లేదు. కొన్ని గొర్లు మత్తుగ నిద్రపోతున్నయ్. కొన్ని నిద్రరాక సకిలిస్తాన్నయ్. రాము తన చుట్టూ ఉన్న గొర్లను చూస్తాండు. అన్ల కొన్ని గొర్రెలు తనకు సూటిగా చూస్తున్నట్లు, కొన్ని తనను చూసి నగుతున్నట్లు అన్పిస్తున్నయ్. ఈ గొర్లెను ఒదిలి పారిపోతే మల్ల తను తానకు రప్పించుకున్నయ్ గద? ఇవి గొర్లా లేకపోతే గొర్ల రూపంల ఉన్న మాయ, మంత్రం చేసే సాములోల్లా నిద్రపోని గర్భిణీ గొర్రె ఒకటి తన వంక వింతగా చూస్తున్నదన్పిస్తున్నది. దాని కళ్లు ఎంత మెరుస్తున్నయ్. రాము గుండె ఝల్లుమన్నది. ఎందుకో భయమన్పించింది. అదేమన్న చెప్తున్నదా తనకు? సకిలిస్తాన్న గొర్లు ఏమంటున్నాయ్ తనతోని? ఇవెటు తీస్కపోతున్నయ్ తనను? రాముకి మనసుల వింతగ అన్పిస్తున్నది. గాలి చల్లగ అమ్మ మాట తీరు తగులుతున్నది. దేవన్న పిల్లనగ్రోవి సన్నగ విన్పిస్తున్నది ఈ గొర్లు. వీటికి ఉన్న ఊర్లె గ్రాసం ఉంటే గిట్ల అడవులు ఊర్ల పొంటి సడక్‌ల మీద ఇంతింత దూరాలు ఎండకి, వానకి బాదపడ్త నడిశేన? పశురాలకు గ్రాసం గుడక దొరకని కరువేంది ఊర్ల? తనతోని, తన ఊరికెల్లి వలసొచ్చిన ఈ గొర్లు తనతోని నడుస్త తనని నడిపిస్త తనసుంటి మనుషుల కథన్ని, ఎటో మోస్తున్నట్లె, కలవరంతోని, మనాదితోని కదులుతున్నట్లే అన్పిస్తున్నది. రాము మనసు భారమైంది. దూరాన దేవన్న పిల్లంగ్రోవి సన్నగా విన్పిస్తున్నది. దేవన్న ఏమన్న చెప్తున్నద? ఈ గొర్రెలు అడవిలో కన్పించే తోడేల్లు–పాములు, పులులు మనుషులు తనకేమైనా చెప్తున్నాయా? నిద్రరాక రాము లేశి కూసున్నడు. తన దిక్కె చూస్తా చేరిన గర్భిణి గొర్రె బీకరంగా అర్శింది రాము ఉలిక్కిపడ్డాడు. ఉరుక్కుంట దాని దగ్గర్కి పోయిండు అప్పట్కె నేల మీద దాని రెండు కాల్ల మద్దెనించి గొర్రె కూన దబ్బుమని పడ్డది. మాయతీసి తల్లి గొర్రె నోట్ల పెట్టిండు రాము. అది గొర్రె కూనను నాకి నాకి పెట్టింది. దాన్ని చేత్లకు తీస్కున్న రాము తన ఆసామి గొర్రెల మూడొందల ఇరవైకి చేరినయ్ అని లెక్కేసుకున్నాడు. అవి మెల్లంగా మూడొందల నలభైకి పెర్గినయి.

ఆ రోజు రాము గొర్రెల మందలకెల్లి పదిగొర్రెలు ఎటుపోయినయో పోయినయ్. ఆసామి కుక్కోలె ఒర్లుతుండు. పది గొర్లంటే ఆయనకు పిశలేసినట్లే అయ్యింది. నదురా బాడ్కవ్. వెల్కి పట్కరా ఫో పిస కోపంతోని ఊగిపోత అర్సిండు. రాము గుండెల రాయి బడ్డట్లే అయ్యింది. పది గొర్లంటే మాటలా? ఒక్క గొర్రె పోయినా మూడు నెలలు అప్పు రాస్తడు. పది గొర్రెలంటే ఎన్ని వెయిలు అప్పురాస్తడో? తను ఇక్కడ్కి అప్పు తీర్చనీకా? నాయనకు తెలిస్తే... ఎట్ల? ఎటు పోయినయ్ ఈ గొర్రెలు? ఈ పారి ఏ తొవ్వ చూపిస్తయ్ ఇవి తనకు?

రాముతోని దేవన్న గూడంగ బయలుదేరిండు. పగటికి పొద్దెకేదంక వెతుకుతూనే ఉండు రాము. గుండెల్ల కెల్లి భయం పొంగుతాంది రాముకి. ఆసామి తనను సంపుతడ? ఇక్కడికెల్లి ఎటన్న ఎల్లపోతే? నాయన తనకు ఊహు నాయన మల్ల తనని ఇటే తోల్తడు. ఎంత దేవులాడ్తున్న గొర్లు దొర్కుత లేవు. ఎండకి తీరనంత దప్పయితాంది. గని నీళ్లు లెవ్వు. గొర్లు కన్పడ్తలెవ్వు. దేవన్న ఇంగో దిక్కు పోయిండు. రాము అడవిల తిరిగి తిరిగి పరేశాన్ అయితుండు గొర్లు కనపడక ఆ మండే ఎండల రాము కుప్పకూలిండు... దుఃఖం తన్నుకొచ్చింది. ఆసామి తోడేలు తీర మీద పడ్తె ఎట్ల? ఆవులెక్కువైతే ఎట్ల? రాము భూమి కేసి చేతులు తప్ప తప్ప కొడ్త ఏడుస్తున్నడు. రెండైంది. గొర్లులేవు. రాముకి దప్పెక్కువైంది. భయం ఇంకింతెక్కువైంది. ఇంకా లోపట్కి అడవిల కెల్తే ఏ తోడేలో తనను తిని పారేస్తది. రాముల ఒక్కసారి తెగింపచ్చినట్లైంది. ధూత్, తెరికీ ఏమన్నగానీ బయటపడ్డం. ఆసామి చంపితే చంపనీ ఏమన్న చెయ్యనీ... చస్తే గీ బానిస బత్కు తప్పుతది. అన్కుంట అడవి బయట బాట దారి పట్టిండు. ఆకలీ–దూప కమ్ముకున్నయ్. కండ్లు తిరుగుతున్నయ్. నిలువెల్ల మనిషి చమటతోని తడ్సిపోయిండు. అడవిలకెల్లి మెల్లంగ నడుస్త రాము సడక్ మీదకొచ్చిండు. సడక్ అంతా లొల్లి లొల్లి ఉంది. తెలంగాణ పార్టీ వాల్లు మల్ల మీటింగు పెట్టినట్లుంది. సడక్ మీదంతా వాల్లె. సడక్ బంద్‌ల ఊర్ల అందరూ రావాల్నని మైకుల ఒర్లుతాన్రు. రాము మెల్లగ సడక్ దిక్కు నడుస్తాండు. ఇంతట్ల దేవన్న కల్సిండు. దొర్కినయా గొర్లు అంటే దొర్కలేదు అనుకున్నరిద్దరూ. సడక్ అంతా తెలంగాణోల్లే బైఠాయించిండ్రు. ఒగాయన మైకుల మాట్లాడుతుండు. ఆల్ల దగ్గర్కిపోయిన రాము తాజూచైండు. ఆనందం, దుఃఖంతోని తాలుమాయి అయ్యిండు. దేవన్నను రారమ్మని పల్సిండు గొర్లని సూడ. తమ గొర్రెలు కూడ తెలంగానోల్లతోని సడక్ మీన బైఠాయించినయ్. ఆరాంగ కూసున్నయ్. ఆల్లు తప్పట్లు కొడతాంటె గొర్లు కూడా సకిలిస్తాన్నయ్.

"తెలంగాణ రాష్ట్రంలోనే మన నీల్లు మనకస్తయ్. మన భూములు, మన నౌకర్లు మనకస్తయ్" మైకు పట్టుకున్న సారు ఆవేశంతోని మాట్లాడుతాండు.

రాముకు దూప ఎక్కువైంది. అక్కడ ఒక నీల్ల బాటిల్ కనపడ్డది. ఉర్కుత పోయి నీల్లు గుట గుట లాడిండు. కడుపు సల్లంగైంది. రాము తన సేతిలో కర్ర పడేసిండు. అప్పట్కే దేవన్న ఆ గుంపుల కూసుండు తన పిల్లనగ్రోవి గట్టిగ పట్కొని. రాము గూడ గొర్లతోన సడక్ మీన కూసుండు. ఒక గొర్రె మెడ తిప్పి రాముని చూసింది. రాము గుండె ఝల్లుమన్నది. ఒక రాత్రి నిద్ర రాని తనని వింతగ చూసిన గొర్రె కదూ ఇది. దాని కళ్లు అంతే మెరుస్తున్నాయ్. ఆ గొర్రె మల్ల గా తల తిప్పేస్కుంది. మిగతా గొర్రెలు రాముని చూసి గుర్తుపట్టి సకిలించినయ్.

❖